ఎమ్బీయస్ – గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

2016 Q3 జులై – సెప్టెంబరు ఆర్టికల్స్
(పిడిఎఫ్ రూపంలో)
విషయసూచిక

గురి చూసినది ఒకరికి – తగిలినది మరొకరికి
గోరింగ్‌కే శతగోపం
మరో ప్రాంతీయ పార్టీ
మొక్కలూ – గ్రహాలూ
గుళ్లూ – రోడ్లూ
ఓర్లాండో ఘటనలో ఐసిస్ పాత్ర
ఓటు కన్నా కలం పోటు గొప్ప...
అల్లూరి సీతారామరాజు నవల – సినిమా
పట్టిసీమ జలాలు పుష్కరాలను ముంచుతాయా?
ఆర్ట్ ఆఫ్ లిటిగేషన్
హైకోర్టు ఉద్యోగాలు – ప్రాధాన్యతల్లో తేడా
బ్రిటన్‌కు కొత్త ప్రధాని
ఇ'రాణీ'కి క్యాంపస్ దేవిడీమన్నా
స్వాతి హత్య కేసులో లాయరు వింత వాదన
షీలా దీక్షిత్ బ్రాహ్మణ్యం
సిద్దూ ఆప్ తరఫు ముఖ్యమంత్రి అభ్యర్థా?
ట్రంప్ కార్డా? డంప్ కార్డా?
ట్రంప్‌కు ఎందుకింత పాప్యులారిటీ?
మాయమైన కేరళ ముస్లిముల గమ్యం..?
టర్కీ ః తిరుగుబాటుతో లాభపడ్డ పాలకుడు
అరుణాచల్ః జిలానీలు ఎటైనా దూకగలరు
పురాణగాథః ఏకలవ్యుడు ఏ కులం?
హిల్లరీ పరువు తీసినది రష్యానా?
రెండు కళ్ల కడగండ్లు
ఖఖ1: మంత్రిగా మొదటి రోజు
ఖఖ2: పాలనలో పారదర్శకత
ఖఖ3: దేశాధిపతి పర్యటన
ఖఖ4: ఎకానమీ డ్రైవ్
గిరిజన బాలికల తరలింపు
అస్మదీయుడా? తస్మదీయుడా?
కాలిఖో పుల్ ఆత్మహత్య
ఇరోమ్ షర్మిల భవిష్యత్తు
గుజరాత్ కొత్త ముఖ్యమంత్రి
యెమెన్‌పై సౌదీ దాడికి అమెరికా మద్దతు
బ్రెగ్జిట్‌పై తగ్గిన బ్రిటన్ ఉత్సాహం

రియో – బానిస వ్యాపారానికి కూడలి
చైనా వివాహవేదికలు
హమ్మయ్య, కృష్ణాష్టమికి ఏం చేయలేదు
నేపాలి ప్రధాని మార్పులో భారత్ హస్తం?
రిలయన్స్ జియో దాడితో మొబైల్ దిగ్గజాల విలవిల
ఆర్థిక సంస్కరణలు సౌదీని గట్టెక్కిస్తాయా?
హిల్లరీ తప్పిదాలు
రాజులతో నెయ్యము
ఐసిస్‌ను తరిమిన లిబియా
థాయ్‌లాండ్ ఆర్మీ నీడలో రాజ్యాంగ సంస్కరణలు
చైనా టూరిస్టులు ఉత్తర కొరియాకు ఎందుకెళతారు?
దహనాలకు మొగ్గుతున్న అమెరికన్లు
భర్త వాచాలత్వం – భార్యకు లాభం
ట్రంప్ యిక్కట్లు
మదర్ థెరిసా
గాయని ముబారక్ బేగమ్
అక్రమ వలస కార్మికులను ఉపయోగించుకున్న ట్రంప్
గుజరాతీ సైనికులు
ఉజ్బెకిస్తాన్ నియంత కరిమోవ్ మృతి
పవన్ చేస్తున్నదేమిటి?
ప్రత్యేక హోదా అవసరమా?
పాక్‌లో భారత్ వలసదారుల పార్టీ
స్నోడెన్‌కు ఆశ్రయం యిచ్చిన సామాన్యులు
బాబాయ్–అబ్బాయ్.. ఆపై అమర్
చండశాసనుడు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు
స్విస్ ఛాలెంజ్
ఆరెస్సెస్–బిజెపి పేగుబంధం
అప్పుడెక్కడున్నారు మీ ఫ్రెంచ్‌వారు?
టంప్ దృష్టిలో చారిటీ
జపాన్ ప్రధాని యుద్ధోన్మాదం–చక్రవర్తి శాంతిమంత్రం
అమెరికా కాలేజీల సంక్షోభం
తగిన సాధనసంపత్తి
అబద్ధపు తీగతో నిజాల డొంక కదిల్చిన ఉండవల్లి
విదర్భకు వచ్చేసరికి...
సిద్దూ ఆశలు
వెల్స్ ఫార్గో – బ్యాంకులకు ఓ పాఠం

2016 జులై 01, 02 ఎమ్బీయస్ : గురి చూసినది ఒకరికి – తగిలినది మరొకరికి

అదేమిటో కొందరి అక్రమ వ్యాపారాలు త్వరగా వెలుగులోకి వస్తాయి. మరి కొందరివి ఎప్పుడో గాని బయటపడవు. అదంతా ఆ వ్యాపారవేత్త స్వభావంపై ఆధారపడి వుంటుందనుకోవాలి. ''తాగింది కుసింత, ఊసింది ఊరంత'' అనే టైపు వాళ్లు అందరి దృష్టినీ ఆకర్షిస్తారు. సంజయ్ భండారీ వంటి నిండుకుండలు తొణకరు, బెణకరు. అందుకే ఎన్నో ఏళ్లగా డిఫెన్సు సామగ్రి వ్యాపారం

చేస్తున్నా, ఫైవ్‌స్టార్ లైఫ్ గడుపుతున్నా, ఎందరో విఐపిలతో భుజాలు రాసుకుని తిరుగుతున్నా మీడియా పట్టించుకోలేదు. పట్టించుకోకుండా వుండడానికి అతనేమైనా మంత్రం వేశాడేమో తెలియదు. ఇప్పుడైనా రాబర్ట్ వాద్రాతో లింకు కారణంగా యింత ఫోకస్ పడింది కానీ లేకపోతే గుట్టుచప్పుడు కాకుండా నడిచిపోయేదే. వాద్రాపై వల వేస్తే యీ చేప పడింది అనుకోవడానికి లేదు. ఎందుకంటే 2014లో బిజెపి అధికారంలోకి రాగానే వాద్రా సన్నిహితులెవరాని ఇంటెలిజెన్సు బ్యూరోను ఆరా తీయమంది. ఒక రహస్య రిపోర్టులో వాళ్లు అతని సన్నిహితుల్లో ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ ఒకడని చెప్పారు. అయితే లింకేమీ దొరకలేదు. భండారీని గట్టిగా తోమాలన్నా యిబ్బందే, ఎందుకంటే అతను బిజెపి జాతీయ కార్యదర్శికి మిత్రుడని, మరొక సీనియర్ బిజెపి నాయకుడి కొడుక్కి స్నేహితుడని రాశారు. దాంతో బిజెపి వారు కాస్త తగ్గారు.

ఇప్పుడీ సంగతి బయటకు రావడం తమాషాగా జరిగింది. తమకు కన్నెఱ్ఱగా మారిన ఆప్‌కు గత అసెంబ్లీ ఎన్నికలలో ధనసహాయం ఎక్కణ్నుంచి వచ్చిందో చూసి, దాన్ని కట్టడి చేయాలని బిజెపి నాయకత్వం కేంద్రశాఖలన్నిటినీ హెచ్చరించింది. హవాలా ఆపరేటర్లు ఆప్‌కు విరాళాలిస్తున్నారని వారికి సమాచారం వచ్చింది. దాంతో ఇన్‌కమ్‌టాక్స్ శాఖ ద్వారా యీ ఏడాది మొదట్లో హవాలా ఆపరేటర్లపై దాడి చేయించారు. దీపక్ అగర్వాల్ అనే ఓ ఆపరేటరు ఖాతాలో ఓ ఢిల్లీ కంపెనీ తరఫున రూ.100 కోట్ల పైబడి వ్యవహారం నడిపినట్లు బోగసు బిల్లులు కనబడ్డాయి. ఆ కంపెనీ సంజయ్ భండారీదని తేలింది. ఇక అక్కణ్నుంచి అతని విషయాలన్నీ తవ్వి తీశారు. 20 (35 అని కొందరంటున్నారు) షెల్ కంపెనీల ద్వారా అతను చేసిన ట్రాన్సాక్షన్లన్నీ అనుమానస్పదంగా అనిపించాయి. అతని ఫోన్ ట్యాప్ చేశారు. అతనికి అన్ని పార్టీల నాయకులతో, సీనియర్ జర్నలిస్టులతో, డిఫెన్సు శాఖలోని అధికారులతో సన్నిహిత సంబంధాలున్నాయని తేలింది. తక్కినవారి మాట ఎలా వున్నా వాద్రా కూడా ఎక్కడో అక్కడ దొరక్కపోతాడా అనుకుని ఐటీ వారు అతనిపై దాడి చేయడానికి నిశ్చయించుకున్నారు. ఈ విషయం భండారీకి ఉప్పందింది. ఏప్రిల్ 26న అతని డిఫెన్సు కాలనీలోని ఆఫీసులపై, గ్రేటర్ కైలాశ్‌లోని యిళ్లపై దాడి జరిగిన సమయానికి తన కంప్యూటరును శుభ్రంగా తుడిచి పెట్టేశాడు. సాఫ్ట్‌వేర్ వ్యాపారం కూడా చేసే అతనికి టెక్నికల్‌గా చాలా తెలివి వుంది. వాట్స్‌అప్ ఎన్‌క్రిప్షన్ కోడ్ కూడా బ్రేక్ చేయగల సాఫ్ట్‌వేర్ తయారుచేయించాడు. ఇన్‌కమ్‌టాక్స్ వాళ్ల చేతికి తన క్లయింట్ల పేర్లు చిక్కకుండా సిమ్ కార్డును క్రష్ చేసేశాడు.

దాడి సందర్భంగా అధికారులకు కళ్లు చెదిరేటన్ని ఆస్తులు, వ్యవహారాలు బయటపడ్డాయి. అతని దగ్గర దొరికిన దస్తావేజుల పరిశీలనలో తేలినవి – అతనికి హైలెవెల్లో వున్న విఐపిల సన్నిహిత సంబంధాలున్నాయి, డిఫెన్సు మినిస్ట్రీలో వుండవలసిన రహస్య (క్లాసిఫైడ్) డాక్యుమెంట్లు – పాతా, కొత్తా – అతని యింట్లో వున్నాయి. అతనికి లండన్‌లో బోర్డన్ స్ట్రీట్‌లో 2013లో రూ. 10 కోట్లకు కొన్న ఫ్లాట్, దుబాయిలోని జుమేరాలో 2010 రూ. 5 కోట్లకు కొన్న మరొక ఫ్లాట్ వున్నాయి. పనామాలో వున్న కంపెనీల్లో వాటాలున్నాయి. అతని యింటికి రాని పెద్ద లీడరు లేదు. వారిలో ఆడ్వాణీ, రాబర్ట్ వాద్రాతో సహా అనేకమంది వున్నారు. షీలా దీక్షిత్‌తో వారానికి రెండు సార్లు మాట్లాడేవాడు. అతని సన్నిహితుల్లో సీనియర్ బిజెపి నాయకుడు జాతీయ కార్యదర్శి సిద్ధార్థ నాథ్ సింగ్ వున్నాడు. ఏడాదిలో 164 కాల్స్ చేశాడు. 'కేవలం పరిచయమే తప్ప, వ్యాపారబంధం ఏదీ లేదు' అంటాడు సిద్ధార్థ. అశోక గజపతిరాజు సెక్రటరీ అప్పారావుతో కూడా 355 కాల్స్ చేశాడు. అనేకమంది మంత్రుల సెక్రటరీలతో, బ్యూరాక్రాట్స్‌తో సంజయ్ రెగ్యులర్‌గా టచ్‌లోనే వున్నాడు. డిఆర్‌డిఓ నుంచి రిటైరైన డా. పికె వాసుదేవ సేవలు సంజయ్ వుపయోగించు కుంటున్నాడని హోం శాఖ అంటోంది. ''హిందూస్తాన్ టైమ్స్''లో సీనియర్ ఎడిటరైన శిశిర్ గుప్తాకు 478 కాల్స్ చేసినట్లు తెలుస్తోంది. బ్రిగేడియర్ సతీష్ కుక్రేజాతో కూడా తరచుగా మాట్లాడుతూంటాడని కాల్ రికార్డు చెప్తోంది. మీడియా వాళ్లు వేసిన ప్రశ్నలకు వాళ్లెవరూ సమాధానాలివ్వలేదు. దాడి తర్వాత అతను వెంటనే మోదీకి అత్యంత సన్నిహితులైన యిద్దరి ద్వారా మోదీకి కబురంపాడట – 'మీ రాజకీయ శత్రువుల గురించి విలువైన సమాచారాన్ని అందిస్తాను, దానికి బదులుగా నన్ను కేసుల్లోంచి తప్పించి, ఇమ్యూనిటీ కల్పించాలి.' అని. దానికి మోదీ స్పందించలేదు. అది తెలిసి భండారీకి సన్నిహితులైన కాబినెట్ మంత్రుల దగ్గర్నుంచి ఉన్నత పదవుల్లో వున్నవారందరూ మొఖం చాటేశారు.

అరవింద్ కోసం గేలం వేస్తే దానిలో భండారీ పడ్డాడు. భండారీ నోట్లో వాద్రా దొరికాడు. అదెలా జరిగిందంటే, భండారీ తన మెయిల్ బాక్స్ అంతా తుడిచేసినా, అతను తన మెయిల్సన్నిటినీ తన సెక్రటరీకి కాపీ పెట్టిన విషయాన్ని ఐటీవారు గమనించి సెక్రటరీ కంప్యూటరు స్వాధీనపరచుకుని, చెక్ చేస్తే ఈ-మెయిల్స్ బయటపడ్డాయి. సెంట్రల్ లండన్‌లో ఉన్న ఒక ఫ్లాట్ గురించి అతనికి, రాబర్ట్ వాద్రా సెక్రటరీకి మధ్య నడిచిన ఈ-మెయిల్స్ విషయం బయటకు రాగానే మీడియా దృష్టి దానిపై పడింది. రాజకీయంగా అది పెద్ద అంశం అయిపోయింది. తక్కిన విషయాలపై జరగవలసినంత చర్చ జరగటం లేదు. లండన్ ఆఫీసుల్లో వున్న రికార్డుల ప్రకారం ఆ ఫ్లాట్ (ఫ్లాట్ నెం.12, బ్రయాన్‌స్టన్ స్క్వేర్, లండన్) 2005 నుంచి ఒక బ్రిటిషు జంట పేరు మీద వుంది. వాళ్లు వాద్రా బినామీలా కాదా అన్నది తెలియదు. బినామీలన్న అనుమానం ఎందుకు వస్తోందంటే, లండన్‌లో వున్న సంజయ్ సహాయకుడు సుమిత్ ఛద్దా ఆ యింటి మరమ్మత్తులకైన ఖర్చు గురించి వాద్రా సెక్రటరీకి మెయిల్స్ రాశాడు. వాద్రా ఒక ఈమెయిల్ ఆ సంగతి చూస్తానని జవాబిచ్చాడు. ఆ యింటి సొంతదారులెవరని ఇన్‌కమ్‌టాక్స్ వాళ్లు భండారీని అడిగితే 'దస్తావేజులు చూస్తే తప్ప చెప్పలేను' అన్నాడు. రాబర్ట్ వాద్రా తెలుసా అంటే తెలుసు అన్నాడు. వాద్రా లాయర్లు తమ క్లయింటుకు 12వ నెంబరు ఫ్లాట్‌ను ప్రత్యక్షంగాకాని, పరోక్షంగా కాని కొనలేదని జవాబిచ్చారు. అదే బిల్డింగులో వున్న ఒక ఫ్లాట్ (12 వ నెంబరు అవునో కాదో

తెలియదు)ను షార్జాలో 2010లో నెలకొల్పిన మేఫెయిర్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనే కంపెనీ రూ. 19 కోట్లకు కొందని ఎన్‌ఫోర్స్‌మెంటు డైరక్టరేట్ కనుగొంది.

సంజయ్ భండారీ యీ స్థాయిలో వ్యాపారం చేయడానికి, ఢిల్లీలో యింత పలుకుబడి సాధించడానికి కారణం అతని తండ్రి రాజేంద్ర కుమార్ భండారీ పేరు మోసిన హోమియోపతి వైద్యుడు కావడం, ఢిల్లీలోని ప్రముఖులలో చాలామంది – రాజకీయ నాయకులతో సహా – ఆయన క్లయింట్లు కావడం. వాళ్లు హోమియో క్లినిక్కులు, హోమియో స్టోర్స్ చాలానే వున్నాయి. ఢిల్లీలో మోడర్న్ స్కూలులో చదివిన సంజయ్ కు స్కూల్లోనే ఉన్నత కుటుంబాల పిల్లలతో స్నేహం ఏర్పడింది. పెద్దయ్యాక తండ్రి వ్యాపారమే చూసుకునేవాడు. తండ్రి పేరు చెప్పే అందరితో పరిచయాలు పెంచుకున్నాడు. ఆయిల్, నేచురల్ గ్యాస్‌కు డిమాండ్ వుండే రోజుల్లో 2002–07 మధ్య ఆ వ్యాపారం చేసి డబ్బు గడించాడు. 2006లో యుపిఏ హయాంలో కేంద్ర ప్రభుత్వం ఒక రూలు పెట్టింది. దాని ప్రకారం రూ. 300 కోట్లు, ఆ పై బడి డిఫెన్సు కాంట్రాక్టు తెచ్చుకున్న విదేశీ కంపెనీ కాంట్రాక్టులో 30% డబ్బును ఇండియాలో పెట్టుబడిగా పెట్టి, దాని ద్వారా అమ్మిన వస్తువుల తాలూకు స్పేర్ పార్టులు, లేదా రిపేరు సర్వీసులు అందించాలి. ఈ రూలు వచ్చాక 2008లో భండారీ ఆఫ్‌సెట్ ఇండియా సొల్యూషన్స్ ప్రై.లి. అనే పేర డిఫెన్సు కాంట్రాక్టుల ఆఫ్‌సెట్ కంపెనీ పెట్టాడు. డిఫెన్సు కాలనీలో అతని పొరుగున వున్న ఒక రియల్ ఎస్టేటు వ్యాపారస్తుడు అతన్ని పెద్దవాళ్ల సర్కిల్‌కు పరిచయం చేశాడు. భండారీ స్నేహితుల్లో బిమల్ సరీన్ అనే అతను యిప్పటికే ఆ వ్యాపారంలో వున్నాడు. అతని సహాయంతో డిఫెన్సు కాంట్రాక్టుల వ్యాపారంలో దిగాడు. 2010 జనవరిలో ప్రగతి మైదాన్‌లో జరిగిన డిఫెన్సు ఎక్స్‌పోలో ఓ స్టాల్ తీసుకున్నాడు కానీ ఎవరి దృష్టినీ ఆకర్షించలేదు.

అయినా అతను నిరుత్సాహ పడలేదు. డిఫెన్సు శాఖలో స్నేహితులను సంపాదించుకుని, ఎవరో పెద్ద చేపను (ఎవరో యింకా తెలియలేదు) పట్టుకుని తన పనులు సాధించుకున్నాడు. అందుకే ఇతను చిన్న స్థాయి వాడే అయినా 2012లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు 75 పిలాటస్ బేసిక్ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను 4 వేల కోట్లకు అమ్మిన స్విజర్లండ్ కంపెనీ పిలాటస్ కంపెనీ యితని సేవలను వుపయోగించుకుంది. 2010లో స్విస్ బ్యాంకు ద్వారా 25 లక్షల స్విస్ ఫ్రాంకులొకసారి, 75 లక్షల స్విస్ ఫ్రాంకు లొకసారి కంపెనీ నుంచి ఓఐయస్ ఎడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కంపెనీ ఖాతాకు వచ్చాయి. అది సంజయ్‌కు సంబంధించినదే. లక్ష రూ.ల పెయిడ్‌అప్ కాపిటల్‌తో ఢిల్లీ డిఫెన్సు కాలనీ అడ్రసుతో పెట్టారు. ఓఖ్లాలోని తమ స్థలంలో రాడార్స్, ఏరియల్ వెహికల్స్ తయారు చేసే ఫ్యాక్టరీ పెడతామని రిజిస్ట్రార్ అఫ్ కంపెనీకి చెప్పారు. కానీ ఓఖ్లా అడ్రసు బోగస్! డిఫెన్సు, ఏరోస్పేస్ కొనుగోళ్లలో యిలాటి ఆఫ్‌సెట్ చెల్లింపులు సహజంగా అవుతూ వుంటాయి. తమకు బేరం కుదిర్చిపెట్టినందుకు ఆ విదేశీ ఉత్పత్తిదారులు యీ ఏజంట్లకు కమిషన్ చెల్లిస్తూంటారు. బేరం కుదరడానికి యీ కంపెనీ వాళ్లు డిఫెన్సు, విమానయాన శాఖల్లోని మంత్రులు, అధికారులకు ముడుపులు చెల్లించినట్లుగా రుజువైతే అది నేరమౌతుంది. అశోకగజపతి రాజు విమానయాన శాఖా మంత్రి కాబట్టే ఆయన సెక్రటరీతో సంజయ్‌కు అన్ని ముచ్చట్లు!

రాబర్ట్ వాద్రాకు లండన్‌లో బినామీ ఆస్తి వుందా లేదా అన్న విషయం మీదే గురి పెట్టడం వలన ఎన్నో సంగతులు మరుగున పడతాయి. అన్నిటికన్న ముఖ్యమైన విషయం డిఫెన్సు శాఖలో సంజయ్ భండారీకి వున్న పలుకుబడి. 2012 నాటి డిఫెన్సు ఎక్స్‌పోలో అతని స్టాల్ అందర్నీ ఆకర్షించింది. అతను వాద్రాకు సన్నిహితుడన్న విషయం అప్పుడే బయటకు వచ్చింది. డిఫెన్సు కాంట్రాక్టుల విషయంలో అతను అక్రమ మార్గాలు అవలంబించాడని ఆరోపణలున్నాయి. తను ప్రాతినిధ్యం వహిస్తున్న కంపెనీతో పోటీ పడే యితర కంపెనీల గురించి డిఫెన్సు శాఖ ద్వారా సమాచారం సేకరించడం, వారిపై నిరాధారమైన ఆరోపణలు చేసి తప్పించడం వంటివి చేశాడట. నఫే సింగ్ అనే అతను యిచ్చిన ఫిర్యాదు ప్రకారం – 126 ఫైటర్ ప్లేన్‌లు కొనుగోలుకు సంబంధించిన ఫైలు ఆఫీసులోంచి మిస్సయిపోయింది. తర్వాత ఎక్కడో రోడ్డు మీద దొరికింది. దానికి కారకుడు భండారీయే అని అతని ఆరోపణ. ఎఫ్–16, ఎఫ్–18 సప్లయి చేయడానికి పోటీపడిన అమెరికన్ కంపెనీలకు కేంద్ర హోం శాఖ ఫైళ్ల ఫోటో కాపీలు అంద చేసినది కూడా భండారీయేట. పిలాటస్‌కు, భండారీని పరిచయం చేసి, అతనికి డిఫెన్సు శాఖ తలుపులు బార్లా తీసిపెట్టిన దెవరో తేలాలి. అది రాబర్ట్ వాద్రాయే అనే రుజువు దొరికితే బినామీ ఆస్తుల గొడవ దాని ముందు పాలిపోతుంది. భండారీ పలుకుబడి యుపిఏ హయాం తర్వాత అంతరించిందా, ఎన్‌డిఏ హయాంలో కూడా కొనసాగుతోందా, కొనసాగుతూంటే దానికి కారకులెవరు అనేది కూడా విచారణలో బయటకు రావాలి. మీడియా యీ విషయంలో చురుగ్గా వ్యవహరించి వ్యవహారాలు ఒక కొలిక్కి వచ్చేట్లు చేస్తేనే బాగుంటుంది. "హిందూస్తాన్ టైమ్స్" ఒక్కటే యీ వ్యవహారంలో చాలా విషయాలు బయట పెట్టింది. తక్కినవారు తగినంత శ్రద్ధ చూపటం లేదని తోస్తోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

ఎమ్బీయస్ క్రైమ్ రచన 21
జులై 3,4

ఎమ్బీయస్ : గోరింగ్‌కే శతగోపం

రెండవ ప్రపంచయుద్ధం ముగిసింది. మిత్రదేశాల సైన్యాలు జర్మనీని చుట్టుముట్టి, ప్రముఖుల యిళ్లు గాలించసాగాయి. హెర్‌మన్ గోరింగ్ అనే హిట్లర్ అనుయాయి అరుదైన వస్తువుల, పెయింటింగ్స్ దాచిన భూగృహాన్ని అమెరికాకు చెందిన సెవెన్త్ ఆర్మీ

కనుగొంది. దానిలో వున్న కళాఖండాలను యుఎస్ ఆర్మీ ఫైన్ ఆర్ట్స్ డివిజన్‌కు తరలించి, వాటి విలువను అంచనా వేయమన్నారు. యూరోప్‌లోని పలు గ్యాలరీల నుంచి గోరింగ్ నయానా, భయానా సేకరించిన 1200 పెయింటింగ్స్ అసలువా, నకిలీవా తేల్చి వాటి విలువ కట్టే పని ఆ డివిజన్ చేపట్టింది.

ఇంత కళాసంపదను పోగు చేసిన గోరింగ్ తక్కువ్వాడు కాదు. మొదటి ప్రపంచయుద్ధంలో పనిచేసి, నాజీ పార్టీ ఏర్పడినపుడు దానిలో చేరి ఉన్నత స్థానాలకు ఎగబాకాడు. 1933లో హిట్లర్ పదవి చేపట్టడానికి సహకరించి అతని తర్వాత ద్వితీయస్థానం యితనిదే అనే స్థాయికి చేరాడు. నాజీ సిద్ధాంతాలను ఎదిరించేవారిని ఏరిపారేయడానికి గెస్టపో అనే గూఢచారి సంస్థను నెలకొల్పి దాని సారథ్యాన్ని హెన్రిచ్ హిమ్లర్ అనే మరో హిట్లర్ అనుయాయికి అప్పగించాడు. 1935లో జర్మన్ ఎయిర్‌ఫోర్స్‌కి కమాండర్ యిన్ చీఫ్ అయ్యాడు. రెండవ ప్రపంచ యుద్ధం (1939–45) నడుస్తూండగా 1941లో హిట్లర్ అతన్ని తన వారసుడిగా, సెకండ్ యిన్ కమాండ్‌గా ప్రకటించాడు. అయితే 1943 ప్రారంభంలో మిత్రదళాలు (ఎలైడ్ ఆర్మీ) జర్మన్ నగరాలపై దాడి చేసినప్పుడు గోరింగ్ సేన వారిని తరిమికొట్టలేకపోయింది. అంతేకాదు, రష్యాలో యిరుక్కుపోయిన జర్మనీ సైన్యానికి జర్మన్ ఎయిర్‌ఫోర్సు తిండిపదార్థాలు అందించలేకపోయింది. దాంతో హిట్లర్ అతన్ని చులకన చేయసాగాడు. అది గ్రహించిన గోరింగ్ రాజకీయాల నుంచి, మిలటరీ ఆపరేషన్ల నుంచి తప్పుకుంటూ ఆస్తులు పెంచుకోవడంపై, కళాఖండాలు సేకరించడంపై దృష్టి పెట్టాడు. ఈ సేకరణలో కూడా తప్పుడు మార్గాలు తొక్కాడు. యూదుఖైదీలను గ్యాస్ ఛాంబర్లకు పంపేముందు వాళ్ల యిళ్లల్లో వున్న చిత్రపటాలు తను లాక్కునేవాడు. కొన్ని ఆర్టు డీలర్ల ద్వారా కొన్నాడు. ఆ విధంగా అమూల్యమైన సంపద అతని వద్ద పోగుపడింది.

జర్మనీ ఓడిపోతున్నట్లు ముందుగా గ్రహించి వుంటే, అవన్నీ పట్టుకుని ఏ విదేశాలకో పారిపోయే వాడేమో కానీ చరమకాలంలో అతనో పొరపాటు చేశాడు. 1945 ఏప్రిల్ 22న హిట్లర్ ఆత్మహత్య చేసుకోబోతున్నాడన్న పుకారు పుట్టినపుడు యితను తొందరపడి హిట్లర్‌కు ఒక టెలిగ్రాం పంపాడు – 'మీరు అలా చేసుకునే మాటయితే జర్మన్ రాజ్యాన్ని నా చేతుల్లోకి తీసుకునేందుకు అనుమతించండి' అని. హిట్లర్‌కు ఒళ్లు మండిపోయింది. ఆత్మహత్య ఆలోచన వాయిదా వేసుకుని గోరింగ్‌ను అన్ని పదవుల్లోంచి పీకేసి, పార్టీలోంచి బహిష్కరించి, అరెస్టు చేయించాడు. అందువలన అతను మిత్రదళాలకు చిక్కి, న్యూరెంబర్గ్ వద్ద యుద్ధనేరాలకై విచారణ ఎదుర్కోవలసి వచ్చింది. అక్కడ ఉరిశిక్ష వేశారు కానీ యీ లోపున అతనే సైనైడ్ మింగి ఆత్మహత్య చేసుకున్నాడు.

విచారణ మొదలుపెట్టడానికి ముందే అమెరికన్లు అతని కళాసంపదను చేజిక్కించుకుని ఒక్కో చిత్రాన్ని పరీక్షించసాగారు. గోరింగు వద్ద వున్న మాస్టర్‌పీసులలో "క్రైస్ట్ అండ్ ద అడల్టరెస్" అనే చిత్రం వుంది. దాన్ని 17 వ శతాబ్దికి చెందిన డచ్ ఆర్టిస్టు జాన్ వెర్మీర్ వేశాడు. అమెరికన్ డివిజన్‌లో వున్న డచ్ ఎక్స్‌పర్ట్ ఒకతను ఇంత అపురూపమైన పటం యితనికి ఎలా వచ్చిందాని పరిశోధన చేశాడు. అది గోరింగ్ యూదుల నుంచి దొంగిలించినది కాదు. వాల్తర్ హాఫర్ అని గోరింగ్‌కు పెయింటింగ్స్ సేకరణలో సహకరించిన ఏజంటుకు హాలండ్‌లోని ఆమ్‌స్టర్‌డామ్‌లో వుండే ఒకతను 1943లో 6 లక్షల డాలర్లు (అప్పటి విలువ, చాలా చాలా ఎక్కువ)కు అమ్మినట్టు తెలిసింది. అది వినగానే యీ డచ్ ఎక్స్‌పర్ట్‌కు ఒళ్లు మండిపోయింది – మహానుభావుడు, జాతిరత్నం అనదగిన వెర్మీర్ వేసిన పెయింటింగును ఒక డచ్ వాడు డబ్బుకోసం ఒక నాజీ ధూర్తుడికి అమ్ముతాడా? అని. వాడెవడో వెతికి పట్టుకుందాం అని పెయింటింగు పట్టుకుని హాలండుకి వెళ్లాడు. అమ్మినవాడు పారిపోయాడు కానీ అతను ఏ ఆర్ట్ డీలరు దగ్గర్నుంచి దాన్ని సంపాదించాడో వాడు దొరికాడు. వాణ్ణడిగితే రెయిన్‌స్ట్రా అనే కమీషన్ ఏజంటు పేరు చెప్పాడు. రెయిన్‌స్ట్రాను దొరకబుచ్చుకుంటే అతను ఆమ్‌స్టర్‌డామ్‌లో వున్న ప్రసిద్ధ చిత్రకారుడు హాన్స్ వాన్ మీగెరెన్ తనకు అమ్మేడని చెప్పాడు.

మీగెరెన్ పేరు దేశమంతా తెలుసు. స్వయంగా ఆర్టిస్టు. ప్రఖ్యాతుల చిత్రాలు కొని అమ్ముతూ వుంటాడు కూడా. ఈ వ్యాపారంలో డబ్బు బాగా గడించాడు. ఆమ్‌స్టర్‌డామ్‌లో అనేక యిళ్లున్నాయి, రెండు నైట్‌క్లబ్బు లున్నాయి. అతను అమ్మినవాటిలో వెర్మీర్ చిత్రాలు ఆరున్నాయి. హేగ్, రాటర్‌డామ్, ఆమ్‌స్టర్‌డామ్‌లలోని ఆర్ట్ కలక్టర్లకు, మ్యూజియములకు ఐదు అమ్మగా, ఆరోది చేతులు మారి గోరింగ్ చేతికి చేరింది. ఈ చిత్రాలను నీకెక్కడివి అని అడిగాడు. "ఇటలీలో కొన్నా" అన్నాడు మీగెరెన్. డచ్ ఎక్స్‌పర్ట్ వెళ్లి హాలండ్ పోలీసులకు చెప్పాడు – 'వీడు చూడండి, ఇటాలియన్ ఫాసిస్టుల దగ్గర కొని జర్మన్ నాజీలకు అమ్ముతున్నాడు. అదీ మరోటీమరోటీ కాదు, ఏకంగా వెర్మీర్ బొమ్మలు! శత్రువులతో చేతులు కలపడం కంటె దేశద్రోహం వుందా?' అని. వాళ్లు అగ్గిబుగ్గి అయ్యారు. తీసుకొచ్చి జైల్లో పడేశారు. సంగతి తెలిసి ప్రజలంతా ఉద్రేకపడ్డారు – 'వెర్మీర్ బొమ్మలను మన దేశానికి ద్రోహం చేసిన నాజీలకు అమ్మడం కంటె అత్యాచారం వుంటుందా, మా బాగా అయింది. ఉరేసేయండి' అనసాగారు.

జాన్ వెర్మీర్ (1632–75) డచ్ పెయింటరు. హాలండు మధ్యతరగతి యింటి వాతావరణమే నేపథ్యంగా అద్భుతమైన చిత్రాలు గీశాడు. బతికుండగా అతనికి రావలసినంత పేరు రాకపోవడంతో అతను ఎన్ని పెయింటింగులు వేశాడో యితమిత్థంగా చెప్పడం కష్టం. కొంతమంది 66 అంటారు, 34 వాటిపై ఏకాభిప్రాయం వున్నా, తక్కిన 32 అతనివా కాదా అనే సందేహం తొలగిపోలేదు. అతను పోయిన తర్వాతే ఖ్యాతి దక్కింది. అతని పెయింటింగ్స్‌లో కలర్ స్కీము, వెలుగునీడలు, పెయింటు వుపయోగించే తీరు – యివన్నీ వినుతి కెక్కాయి. 19 వ శతాబ్దం వచ్చేసరికి అతన్ని హాలండ్ స్వర్ణయుగానికి ప్రతీకగా, జాతిచిహ్నంగా పరిగణించారు. అతని పెయింటింగ్స్‌ను జాతి సంపదగా భావించి, గౌరవించారు. అతని పెయింటింగు నకలునో, ఫోటోనో యింట్లో తగిలించుకోవడం డచ్ ప్రజలకు ఆనవాయితీ అయింది. ఎంత పూరిల్లయినా సరే అతని పెయింటింగ్ లేకుండా వుండేది కాదు. అలాటి వెర్మీర్ చిత్రాన్ని

తామందరూ అసహ్యించుకునే నాజీలకు అమ్మిన మీగెరెన్‌పై ప్రజలకు పీకలదాకా కోపం రావడంలో ఆశ్చర్యం ఏముంది? పోలీసులు మీగెరెన్‌ను జైల్లో పడేసి చితకబాదారు. "నేనేం తప్పు చేయలేదు" అనే మాట తప్ప వేరే మాట అతని నోట్లోంచి రావటం లేదు. సొంత జాతికి యింత ద్రోహం చేసి తప్పులేదంటావా అనే కోపంతో పోలీసులు మరీ బాదారు. మీగెరెన్‌కు ఏం చేయాలో పాలుపోలేదు. ఆలోచనలో పడ్డాడు.

మీగెరెన్ గ్రామర్ స్కూల్లో చదివే రోజుల్లోనే డ్రాయింగు నేర్చుకున్నాడు. 1920ల నాటికి కాస్త పేరు సంపాదించుకున్నాడు. 1930లు వచ్చేసరికి వాళ్ల దేశానికి పర్యాటకులుగా వచ్చిన బ్రిటిషు, అమెరికన్ ధనికుల బొమ్మలు పెయింటు చేసి బాగా సంపాదించసాగాడు. ఆస్తులు కూడబెట్టాడు. తన పాప్యులారిటీ విస్తరించి క్లయింట్లు పెరగడానికై తరచుగా తన బొమ్మలతో ఆర్ట్ ఎగ్జిబిషన్లు పెట్టేవాడు. హాలండులోని ఆర్ట్ క్రిటిక్స్ ఒక పెద్ద ముఠాగా వుండేవారు ఆ రోజుల్లో. ఇతని సక్సెస్ చూసి వాళ్లు కుళుక్కున్నారు. వారిలో కొందరు అతని వద్దకు వచ్చి తమకు డబ్బిస్తే ఎగ్జిబిషన్ గురించి బాగా రాస్తామని, లేకపోతే తిట్టిపోస్తామని బెదిరించేవారు. ఇతను యివ్వను పొమ్మని చెప్పాడు. అంతేకాదు బహిరంగంగా తనను విమర్శించేవారిని వెటకరించేవాడు. మీకు బొమ్మలను అంచనా వేసే శక్తి లేదని, ఏ బొమ్మ ఎవరిదో నుక్కునే సామర్థ్యం లేదని వెక్కిరించేవాడు.

ఆర్ట్ ప్రపంచంలో అతి పెద్ద బెడద డూప్లికేట్లు. ప్రఖ్యాతి చెందిన చిత్రకారుల పెయింటింగులను అనుకరించి పెయింటు చేయగల సమర్థులు కొందరుంటారు. అదే ఒరిజినల్ అని చెప్పి అమ్మేస్తూ వుంటారు. మరి కొంతమంది ఆ ఆర్టిస్టు శైలి సొంతం చేసుకుని, అదే తీరులో యింకో బొమ్మ గీసేసి, 'ఇప్పటిదాకా వెలుగులోకి రాని.. ఫలానావారి పెయింటింగ్' అని చెప్పి మార్కెట్లో పెట్టేస్తారు. వీటిని వేలాల ద్వారా కళ్లు తిరిగే ధరలకు విక్రయించే వ్యాపారులు ఏది అసలు, ఏది నకలు అని కనిపెట్టడానికి విమర్శకులను, నిపుణులను పిలుస్తారు. ఆర్ట్ డిటెక్టివ్‌లను పెడతారు. వారు బొమ్మల మీద ఎక్స్‌రే కిరణాలు.ఇన్‌ఫ్రా రెడ్ కిరణాలు ప్రసరింపచేస్తారు, ఆల్కహాలు పూస్తారు, హైపోడెర్మిక్ సూదులు గుచ్చి పెయింటులోని రసాయనాలు నిర్ధారిస్తారు, క్వార్ట్జ్ ల్యాంపులు వుపయోగించి పెయింటు పొరలు తొలిచి చూస్తారు. ఈ పరీక్షల ద్వారా ఆ పెయింటు కొత్తదా, పాతదా తేలుస్తారు. దానితో బాటు ఆ చిత్రకారుడు యిలాటి రంగు వాడడు, ఆనాటి కాలంలో యిలాటి బట్టలు ధరించేవారు కారు – వంటి పరిశీలనలు చేసి, నిగ్గు తేలుస్తారు. అలా చేసినా ఎన్నో మోసాలు జరుగుతూంటాయంటాడు ఒక ఆర్ట్ డిటెక్టివ్. 'రెంబ్రాంట్ పేరు మీదే చలామణీ అయ్యే పెయింటింగులలో పదో శాతం మాత్రమే అతను నిజంగా వేసినవి. వాన్ డైక్ గీసినవి 70 వుంటాయి. కానీ రెండు వేల పెయింటింగులపై అతని పేరు కనబడుతోంది. కొరోట్ 2500 పెయింటింగులు వేస్తే కేవలం అమెరికాలోనే అతని పేర 7800 కనబడుతున్నాయి!" అంటాడతను.

ఆర్టిస్టుల కంటె తమకే ఎక్కువ తెలుసని అనుకుంటున్న విమర్శకులకు తలాతోకా ఏమీ తెలియదని సోదాహరణంగా నిరూపించి వాళ్ల భరతం పట్టాలని మీగెరెన్ 1936లో ఒక పథకం రచించాడు. ఓల్డ్ మాస్టర్స్ పెయింటింగు కాపీ కొట్టి మార్కెట్లోకి వదిలి, అది ఒరిజినల్ అని విమర్శకులు సర్టిఫై చేశాక, 'వెర్రిపీనుగుల్లారా, అది డూప్లికేట్‌రా, మీ తెలివి యిలా తెల్లారింది. తగుదునమ్మా అని నా బొమ్మలను విమర్శించడమొకటి' అందామనుకున్నాడు. ఓల్డ్ మాస్టర్లలో ఎవర్ని కాపీ కొడదామా అని దీర్ఘంగా ఆలోచించి వెర్మీర్‌ను ఎంచుకున్నాడు. ఎందుకంటే అతని జీవితం ఓ మిస్టరీ, అతని ఎన్ని బొమ్మలు వేశాడో కచ్చితంగా ఎవరికీ తెలియదు. అయితే మోసం చేయడం కూడా అంత సులభం కాదు. పైన చెప్పిన పరీక్షలన్నీ తట్టుకోవాలి. 300 ఏళ్ల క్రితం నాటి పెయింటింగని నిరూపించగలగాలి.

వెర్మీర్ కాలం నాటి పురాతన గ్రంథాలు తిరగేసి అతను పసుపు పిగ్మెంటుకై గమ్ రెజిన్ వాడేవాడనీ, నీలం రంగుకై రాళ్ల పొడిని వాడేవాడనీ, తెల్ల సీసపం బదులు తెల్ల తుత్తునాగం (జింక్) వాడేవాడనీ మీగెరెన్ కనిపెట్టాడు. ఆధునికులు లిన్‌సీడ్ ఆయిల్ వాడుతూండగా, వెర్మీర్ వేరే నూనె వాడేవాడని కూడా ఆ పాతపుస్తకంలో దొరికింది. వెర్మీర్ పెయింటింగ్స్‌ను దగ్గర పెట్టుకుని, ఆ శైలిని, కలర్ స్కీమును అనుకరిస్తూ ఏసుక్రీస్తు తన శిష్యులతో కలిసి రొట్టె తింటున్న థీమ్‌పై ఏడు నెలల పాటు అతి రహస్యంగా, భార్యకు కూడా చెప్పకుండా, శ్రమించి పూర్తి చేశాడు. పాత పెయింటింగులో పెయింటు ఎలా చీలుతుందో అలాటి చీలికలు వచ్చేట్లా చేయడానికి కాన్వాస్‌ను ఒక్కో చోట సాగదీసి, మరో చోట కిచెన్ స్టవ్ మీద వేడి చేసి అది కూడా సాధించాడు. వెర్మీర్ తన జీవితకాలంలో ఇటాలియన్ ఆర్ట్ స్టూడెంట్లతో కలిసి పనిచేశాడని తెలిసి ప్రతీతి వుంది. వారితో కలిసి వెర్మీర్ ఇటలీ వెళ్లాడని, అక్కడ వుండగానే యీ పెయింటింగు పూర్తి చేసి అక్కడే అమ్మివేశాడని, ఆ సంగతి స్నేహితుల ద్వారా విని తను ఇటలీ వెళ్లి కొన్నాననీ కథ అల్లాడు. వెర్మీర్ బతికుండగా పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు కాబట్టి, ఏ ఏడాది అతను ఎక్కడున్నాడో ఎవరూ రికార్డు చేయలేదు. ఇటలీ వెళ్లాడంటే కాబోలు అనుకున్నారు.

ఈ కథను, పెయింటింగును చంకన పెట్టుకుని మీగెరెన్ ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఆర్ట్ ఎక్స్‌పర్ట్ అయిన డాఎఎ అబ్రహాం బ్రెడియస్ వద్దకు వెళ్లి దీన్ని చూపించాడు. ఆయనకు అప్పటికే 80 ఏళ్లు. ఈ వయసులో తనకు, తన అభిప్రాయానికి గౌరవం యిచ్చి ఎవరో వచ్చినందుకు ఆయన మురిసి ముక్కలై 'ఇది వెర్మీర్‌దే' అని రాతపూర్వకంగా సర్టిఫికెట్టు యిచ్చేశాడు. అది పట్టుకుని 1937 ఆగస్టులో రాటర్‌డామ్‌లోని బాయ్‌మన్స్ మ్యూజియానికి అమ్మచూపాడు. వాళ్లు నానా రకాల పరీక్షలకు గురి చేసి, 2 లక్షల డాలర్లు యిచ్చి దాన్ని కొన్నారు. ఏడాది పోయిన తర్వాత రాణిగారి పట్టాభిషేక రజతోత్సవోత్సవ సందర్భంగా 450 మాస్టర్‌పీస్‌ల మధ్య దీన్ని పెట్టి ప్రదర్శించారు. హేగ్, లండన్, పారిస్‌ల నుంచి విమర్శకులు, నిపుణులు దీన్ని చూడడానికి విరగబడ్డారు. ఒక్కరూ యిది నకిలీదని కనిపెట్టలేదు. వెర్మీర్ వేసిన చిత్రాల్లో కల్లా బెస్ట్ యిదే అని తీర్మానించారు. ఇదంతా చూసి మీగెరెన్ పడిపడి నవ్వుకున్నాడు.

విమర్శకులు గాడిదలని నిరూపించానని చంకలు గుద్దుకున్నాడు. అంతటితో ఆగలేదు.

చో రామస్వామి రాసిన "మహమ్మద్ బీన్ తుగ్లక్" నాటకం (తమిళంలో, తెలుగులో సినిమాగా కూడా వచ్చింది) దేశభక్తులిద్దరు యీ ప్రజాస్వామ్యం ఎంత బూటకంగా వుందో నిరూపించడానికి ఒక నాటకమాడతారు. తుగ్లక్, అతని అనుచరుడు తవ్వకాల్లో దొరికినట్లు సృష్టిస్తారు. తుగ్లక్ సజీవంగా తిరిగి వచ్చాడనగానే అందరూ అతన్ని ఆహ్వానిస్తారు. రాజకీయపు టెత్తులతో అతను దేశప్రధాని కూడా అయిపోతాడు. ఇలా ఏడాది పాటు నాటకమాడాక, గడువు పూర్తి కాగానే మారువేషం విప్పేసి, తామెవరో జనాలకు చెప్పి, ప్రజల కళ్లు తెరిపించాలని ఒరిజినల్ ప్లాను. అయితే రాజకీయక్రీడకు, పదవీభోగానికి అలవాటు పడిన తుగ్లక్ పాత్రధారి తన గుట్టు బయటపెట్టడానికి నిరాకరిస్తాడు. నీ సంగతి చెప్పేస్తా అని బెదిరించిన సహచరుడికి మతి చలించిందని ప్రచారం చేసి ప్రజల చేత రాళ్లేసి కొట్టించి చంపిస్తాడు. అలాగే విమర్శకులను ఆటపట్టించడానికి ఆట మొదలుపెట్టిన మీగెరెన్ తన దొంగ పెయింటింగుకి యింత ఖ్యాతి రావడంతో అసలు లక్ష్యం మరిచాడు. అది నకిలీదని చెప్పకుండా, యింకా అటువంటివి యింకో ఐదు వేస్తూ పోయి, 1943 వరకు బోల్డంత డబ్బు (30 లక్షల డాలర్లు) సంపాదించాడు. మొనగాళ్లమని మీసాలు తిప్పే విమర్శకుడొక్కడూ కనిపెట్టలేదు. సాగినంతకాలం బాగానే సాగింది కానీ అతని కర్మ కాలి, ఓ పెయింటింగు గోరింగు దగ్గరకు చేరడంతో తీగ లాగారు, డొంక కదిలింది. ఇప్పుడు జైల్లో పడ్డాడు. ఈ విషయమంతా చెపితే మోసం చేశావని మరో కేసు అవుతుంది. ఎలా?

మూడు వారాల పాటు జైల్లో కుళ్లబొడవడంతో మీగెరెన్ సహనం కోల్పోయాడు – "వెర్రివెధవల్లారా, నేను మన దేశసంపదను అమ్మలేదర్రా. ఓ ఫోర్జరీ అమ్మేనంతే.." అని కక్కాడు. అందరూ తెల్లబోయారు. మేం నమ్మం అన్నారు. అప్పుడతను జరిగినదంతా విపులంగా చెప్పాడు. ఎవరికీ నమ్మబుద్ధి కాలేదు. దేశవిదేశాలలోని ఆర్ట్ క్రిటిక్స్, సైంటిస్టులను, మ్యూజియం అధికారులను అడిగితే అబద్ధాలు చెప్తున్నాడన్నారు. అతనిది నిజమని ఒప్పుకుంటే తామంతా గాడిదలైనట్లే మరి! వాళ్ల ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయి. అందుచేత అందరూ కలిసికట్టుగా ఒక్క మాటపై నిలబడి అవి ఒరిజినల్సే, వీడి మాటలే ఫేక్ అనసాగారు. ఈ వివాదం పెరిగి పెద్దదైంది. హాలండులోనే కాదు, లండన్‌లో, రోమ్‌లో, పారిస్‌లో, న్యూయార్కులో ఎక్కడ చూసినా యిదే చర్చ. ఇంతమంది మాట నమ్మాలా? మోసం చేశాను మహాప్రభో అంటూన్న మీగెరెన్ మాట నమ్మాలా?

చివరకు ఓ పోలీసు అధికారికి ఓ ఐడియా వచ్చింది – ఇక్కడే జైల్లోనే అతనడిగిన సామగ్రి అంతా యిచ్చి, మన ఎదురుగానే మరో వెర్మీర్ ఫోర్జరీ బొమ్మ వేయమంటే సరికదా! అని. "నిజానికి అది చాలా కష్టం. నేను గతంలో వేసినవి ఒక్కణ్నీ కూర్చుని స్వేచ్ఛగా వేసినవి. ఇంతమంది చుట్టూ మూగి, సరిగ్గా వేయకపోతే శత్రువులతో చేతులు కలిపిన దేశద్రోహి ముద్ర పడుతుందనే టెన్షన్‌లో పెట్టి బొమ్మ వేయమనడం అన్యాయం. పైగా నేను అడిగినవన్నీ వాళ్లు తెచ్చి యివ్వలేదు." అని వాపోయాడతను. కానీ గత్యంతరం లేని పరిస్థితుల్లో ఒప్పుకున్నాడు. జైల్లోనే ఓ పెద్ద స్టూడియో ఏర్పాటు చేసి కాన్వాస్, ఆయిల్సు సమకూర్చి వేయమన్నారు. కొన్ని నెలల శ్రమతో అతను చిత్రం పూర్తి చేశాడు. పోలీసు వారు దాన్ని స్వాధీనపరుచుకుని అతను గతంలో మొదటి బొమ్మ అమ్మిన మ్యూజియంలోనే ప్రదర్శనకు పెట్టి జాతీయ, అంతర్జాతీయ నిపుణులను పిలిచి పరీక్షించమన్నారు. వాళ్లు దీనితో బాటు పాతవాటిని కూడా పరిశోధించి, శల్యపరీక్షలకు గురి చేసి అవి ఫోర్జరీలే అని తేల్చారు. అది విని మీగెరెన్ నవ్వాడు – "దానికి యింత టైము పట్టిందా మీకు? నేను వేసిన పెయింటింగులలో రెండింటిలో క్రీస్తు కూర్చున్న కుర్చీలు చూడండి. మా స్టూడియోలో నేను వాడే కుర్చీలే, పాతకాలం నాటివి కావు. పైగా వెర్మీర్ బొమ్మల్లో క్రీస్తు చేతులు చూడండి, నేను వేసినవాటిలోవి చూడండి, తేడా కనబడుతుంది. నా చేతినే మోడలుగా పెట్టుకుని నేను గీశాను." అన్నాడు.

విమర్శకులకు ఏమీ తెలియదని నిర్ద్వంద్వంగా రుజువు చేశాడు కానీ చేసినది మోసం కాబట్టి అతనికి శిక్ష వేశారు. అతని ఆరోగ్యం బాగా లేదు కాబట్టి కేవలం ఒక ఏడాది జైలు శిక్ష పడింది. నాజీలతో చేతులు కలిపిన ద్రోహిగా అతన్ని అసహ్యించుకున్న ప్రజలు విచారణలో గోరింగుకే శతగోపం పెట్టిన గండరగండడని తెలియగానే ఆనందంతో పొంగిపోయి, అతనిపై ప్రశంసలు కురిపించారు. ఓ మాదిరిగా చెప్పాలంటే అతను హీరో అయిపోయాడు. అయినా విచారణ కలిగించిన ఒత్తిడి వలన, కారాగారవాసం వలన మీగెరెన్ నలిగిపోయాడు. 1947 డిసెంబరులో తన 58 వ యేట మరణించాడు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 6 **ఎమ్బీయస్ : మరో ప్రాంతీయ పార్టీ**

జూన్ 21న ఛత్తీస్‌గఢ్‌లో 16వ ప్రాంతీయపార్టీ ఛత్తీస్‌గఢ్ జనతా కాంగ్రెస్ పేర వెలసింది. పెట్టింది వేరెవరో కాదు, కాంగ్రెసు ముఖ్యమంత్రిగా పనిచేసి, ఆ రాష్ట్రంలో కాంగ్రెసు అనగానే తట్టే మొదటి వ్యక్తి ఐన అజిత్ జోగి. కాంగ్రెసేతర, బిజెపియేతర పార్టీ పెట్టడానికి కాంగ్రెసులోంచి బయటకు వచ్చానని చెప్పాడు. ప్రస్తుతం రాష్ట్రపాలనంతా ఢిల్లీ నుంచి సాగుతోందని, తను కేవలం స్థానికుల కోసమే ప్రాంతీయ పార్టీ పెడుతున్నాననీ చెప్పాడు. అతని భార్య రేణు జోగి మాత్రం కాంగ్రెసులోనే వుండిపోయింది. కొడుకు అమిత్‌ని కాంగ్రెసు జనవరిలోనే బయటకు పంపేసింది. అజిత్‌ను కూడా పంపేయాలని రాష్ట్ర కాంగ్రెసు తీర్మానం చేసింది కానీ హై కమాండే తాత్సారం చేసింది. 2014లో అంతాగఢ్ ఉపయెన్నిక సమయంలో బిజెపి అభ్యర్థికి నెగ్గేందుకు వీలుగా అజిత్ తన

అనుచరుడైన కాంగ్రెసు అభ్యర్థి మంటూరామ్ పవార్‌ను విరమింపచేశాడు. ఈ సందర్భంగా అజిత్ జోగి, కొడుకు అమిత్ జోగి, బిజెపి ముఖ్యమంత్రి రమణ్ సింగ్ అల్లుడు పునీత్ గుప్తాల మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణలు బయటకు వచ్చేశాయి. ఎన్నికలో బిజెపి అభ్యర్థి గెలిచాడు. విత్‌డ్రా అయిన పవార్ బిజెపిలో మారిపోయాడు. తండ్రీకొడుకులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని రుజువు కావడంతో అమిత్‌ను పార్టీ ఆరేళ్లపాటు బహిష్కరించింది. దాన్ని ఎత్తివేయించడానికి యిక అప్పణ్నుంచి అజిత్ జోగి ఢిల్లీ ప్రదక్షిణాలు చేశాడు. కానీ రాహుల్ గాంధీ దర్శనం దయచేయించలేదు. 'కాంగ్రెసు హై కమాండ్, ముఖ్యంగా రాహుల్, రాష్ట్రనాయకుల సమస్యలను పట్టించుకోవడం లేదనడానికి నిదర్శనం అరుణాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ కాంగ్రెసు నాయకులే ఉదాహరణలు. నన్నూ అలాగే నిర్లక్ష్యం చేశారు. వారి ముందు ఏం చెప్పుకున్నా బధిరశంఖారావమే' అని చెప్పుకుంటూ అజిత్ బయటకు వచ్చేశాడు.

అజిత్ జోగి ఇంజనీరింగు చదివి, 1968లో ఐపియస్‌కు, 1971లో ఐయేయస్‌కు సెలక్టయ్యాడు. మధ్యప్రదేశ్‌లో చాలా జిల్లాల్లో కలక్టరుగా పనిచేశాడు. ఆ సమయంలోనే కాంగ్రెసు నాయకుడు అర్జున్ సింగ్‌కు ఆత్మీయుడయ్యాడు. అజిత్ కన్వర్టడ్ క్రిస్టియన్ కుటుంబానికి చెందినవాడు. తల్లి సత్నామీ, తండ్రి ఎస్టీ. ఛత్తీస్‌గఢ్‌లో వున్న 12.8% ఎస్సీ కులాలలో సత్నామీలదే మెజారిటీ. ఎస్‌టిలు 30.6%, మైనారిటీలు 3% వున్నారు. వీళ్లందరికీ యితను ఆమోదయోగ్యుడవుతాడని కాంగ్రెసు వారు అంచనా వేసి అతన్ని 1986లో తమ పార్టీలో చేర్చుకుని రాజ్యసభకు పంపారు. అతను కాంగ్రెసు జనరల్ సెక్రటరీగా, అధికార ప్రతినిధిగా కూడా పనిచేశాడు. 2000 నవంబరులో ఛత్తీస్‌గఢ్ ఏర్పడినపుడు అతను ముఖ్యమంత్రి అయ్యాడు. ముఖ్యమంత్రిగా అతను నియంతలా వ్యవహరించాడని, పార్టీలో ఎవరినీ లెక్కపెట్టలేదనీ అందుకే 2003లో కాంగ్రెసు అధికారం పోగొట్టుకుని యిప్పటిదాకా మళ్లీ గెలవలేకపోతోందని అంటారు. ఛత్తీస్‌గఢ్‌లో పార్టీల మధ్య వ్యత్యాసం చాలా తక్కువగా వుంటుంది. 2013 అసెంబ్లీ ఎన్నికలలో బిజెపికి 41% ఓట్లు వస్తే కాంగ్రెసుకు 40% వచ్చాయి. సీట్ల విషయానికి వస్తే బిజెపికి 49 రాగా, కాంగ్రెసుకు 39 వచ్చాయి. మొత్తం 90 సీట్లు. "జోగి కారణంగానే అగ్రవర్ణాలు మా పార్టీకి దూరమై బిజెపికి వేశారు. అందుకే ఓడిపోయాం. ట్రైబల్స్ కూడా దూరమయ్యారు. బస్తరు, సుర్గుజా ప్రాంతాలలో అనేక గిరిజన నియోజకవర్గాలు ఓడిపోయాం. ఇప్పుడు అజిత్ వదిలాడు కాబట్టి, వాళ్లు మళ్లీ మా చెంతకు రావచ్చు" అంటున్నాడు ఒక కాంగ్రెసు నాయకుడు. రాష్ట్రంలో బ్రాహ్మణులు 4%, రాజపుత్రులు 3% వున్నారు. బిసిలు 46.6% వున్నారు.

2018 ఎన్నికలలో బిజెపికి మేలు చేయడానికే అజిత్ కాంగ్రెసు ఓట్లు చీల్చుదామని చూస్తున్నాడు అని కాంగ్రెసు నాయకుల ఆరోపణ. కాంగ్రెసు నుంచి విడిపోయి సొంతంగా పార్టీ పెట్టి అర్జున్ సింగ్ వంటి వాడే విఫలమయ్యాడు. ఇతనెంత అంటున్నారు. 2003లో విసి శుక్లా కాంగ్రెసులోంచి వెళ్లిపోయి ఎన్‌సిపి పెట్టాడు. సొంతంగా 1 సీటు మాత్రమే గెలిచినా 7% ఓట్లు చీల్చి కాంగ్రెసు అవకాశాలు దెబ్బ తీసి బిజెపి అధికారంలోకి వచ్చేందుకు దోహదపడ్డాడు. ఇప్పుడు అజిత్ కూడా అదే పని చేయవచ్చని కొందరి అంచనా. ఎస్సీల పార్టీగా పేరు పడిన బియస్‌పి కూడా ఛత్తీస్‌గఢ్‌లో అజిత్ బలాన్ని దెబ్బ తీయలేకపోయింది. నెగ్గే పార్టీకి, ఓడే పార్టీకి మధ్య తేడా 1% మాత్రమే అయినపుడు, వచ్చే ఎన్నికలలో యితను 5-6% ఓట్లు చీల్చినా ఫలితాలు తారుమారవుతాయి. నెగ్గినవాళు యితని మద్దతుకై అర్రులు చాచవచ్చు. ఇలాటి పరిస్థితుల్లోనే ఝార్‌ఖండ్‌లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన మధు కోడా 2006లో ముఖ్యమంత్రి కాగలిగాడు. తను బిజెపికి 'బి' టీముగా లేనని చూపుకోవడానికి కాబోలు అజిత్ తన పార్టీ ఆవిష్కరణను ముఖ్యమంత్రి నియోజకవర్గంలో నిర్వహించాడు. అజిత్ వెళ్లిపోయినా కాంగ్రెసు చెక్కు చెదరదని చూపించడానికి అదే రోజున కాంగ్రెసు అజిత్ నియోజకవర్గంలో పెద్ద ర్యాలీ నిర్వహించింది. ప్రస్తుతం అజిత్‌తో ముగ్గురు ఎమ్మెల్యేలున్నారంతే!

కొసమెరుపు ఏమిటంటే - క్రైస్తవుడైన అజిత్ పార్టీ ప్రారంభిస్తూ ఆవిర్భావ ముహూర్తాన్ని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బ్రాహ్మణుడి చేత పెట్టించానని ప్రకటించడం! **- - ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 6 **ఎమ్బీయస్ : మొక్కలూ - గ్రహాలూ**

తెలంగాణ ప్రభుత్వం హరితహారం స్కీము పెట్టి మొక్కలు పెంచమంటోంది. కొన్ని దశాబ్దాలుగా ప్రతీ ప్రభుత్వమూ యిలాటి ప్రచారం చేస్తూండడం చూస్తూనే వున్నాం. ముఖ్యమంత్రి మొక్కనాటుతున్న ఫోటోలతో హోర్డింగులు వెలుస్తాయి, ప్రతీ జిల్లాలో పార్టీ కార్యకర్తలు సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడతారు. మీడియా కవరేజి వస్తుంది. రంగురంగుల ప్రకటనలు తయారుచేసే యాడ్ కంపెనీలు బాగుపడుతున్నాయి, పేపర్లకు, టీవీలకు ప్రభుత్వ ప్రకటనల ద్వారా ఆదాయం పెరుగుతోంది, గతంతో పోలిస్తే హోర్డింగులు మరిన్ని లేస్తాయి కానీ చెట్లు మాత్రం ఛస్తాయి. ఏదో ఒక పేరు చెప్పి కొట్టేస్తూనే వుంటారు. పర్యావరణం గురించి నిజంగా అంత స్పృహ వుంటే గత మన నగరాల్లో పాతికేళ్ల కంటె భూతాపం ఎందుకు పెరిగింది? చెట్లకు కూడా సెన్సస్ తీసి చూస్తే తెలుస్తుంది - ఎన్ని తగ్గాయో! ఈ కార్యక్రమంలో ఎంత చిత్తశుద్ధి వుందో యివాళ్టి ప్రచారంలో తెలియదు, రెండేళ్లు పోయాక కొత్తగా ఎన్ని మొక్కలు వచ్చాయి, పాతవాటిని ఎన్నిటిని కూల్చేశారు అనేది లెక్క వేస్తే తెలుస్తుంది. ప్రస్తుత కార్యక్రమాన్ని చేపట్టిన కెసియార్ వెరైటీ లేకుండా ఏదీ చేయరు కాబట్టి యీ కార్యక్రమానికి, గ్రహాలకు ముడి వేశారు.

ప్రతి పౌరుడు తన నక్షత్రం లేదా రాశి ఏదో తెలుసుకుని, దానికి అనువైన మొక్కలు డిపార్టుమెంటు నుంచి తీసుకుని పెంచాలిట. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నక్షత్రాల ప్రకారం, రాశుల ప్రకారం మొక్కల జాబితా విడుదల చేశారు. తెరాస నాయకులు బహిరంగంగా ప్రచారం చేస్తున్నారు, టీవీల్లో చెప్పిస్తున్నారు. 'ఇదెక్కడి చోద్యం? ఈ స్కీము వలన ముస్లిములు, క్రైస్తవులు, నాస్తికులు, హేతువాదులు, నక్షత్రాలు తెలియనివారు వీళ్లందరికీ మినహాయింపు యిచ్చినట్లా? వారేమీ మొక్కలు పెంచనక్కరలేదా?' అని టీవీ చర్చల్లో నిలదీసినపుడు తెరాస నాయకులు 'నయానో, భయాన్నో జనాల చేత మొక్కలు పెంచేందుకు కెసియార్ కృషి చేస్తున్నారు, మెచ్చుకోండి' అని దబాయిస్తున్నారు. మామూలుగా చెప్తే వినరు కాబట్టి భక్తికి, అదృష్టం కలిసి రావడానికి ముడిపెడితే జనాలు వింటారనే భావంతో యిలా చెప్పి వుంటారని వాదన వినిపిస్తున్నారు. పర్యావరణానికి మంచిది, సంఘానికి మంచిది అంటే ఎవరూ పట్టించుకోరు కానీ దేవుడి పేరు చెప్తే భక్తితోనో, ఆశతోనో ఆ పని చేస్తారనే మాట వాస్తవమే. ఈ విషయాన్ని గుర్తించిన ఎన్టీయార్ తను ముఖ్యమంత్రిగా వుండగా ఒక మంచి సూచన చేశారు – తిరుపతిలో మొక్కలు విశేషంగా పెంచి, దైవదర్శనానికి వచ్చిన ప్రతివారికి ప్రసాదంతో బాటు, మొక్క కూడా చేతిలో పెడితే వాళ్లు యింటికి తీసుకుని వచ్చి దాన్ని నాటి, శ్రద్ధగా పెంచుతారని! ఇది ఏ మేరకు అమలైందో తెలియదు కానీ, తిరుపతి దేవుడు యిచ్చిన మొక్క అనగానే ఎవరూ పారేయరు. తెచ్చిన మూడువారాల తర్వాత ముక్కవాసన వేస్తున్న తిరుపతి లడ్డూని చేతిలో పెట్టినా కళ్ల కద్దుకుని తినేస్తాం తప్ప, వద్దనం. అలాగే మొక్కను కూడా ఎలాగోలా వాడిపోకుండా తంటాలు పడతార. కెసియార్ అలాటి ఆలోచన చేసి యాదగిరి, వేములవాడల భద్రాచలం, ఓరుగల్లు గుళ్ల ద్వారా, అలాగే మసీదుల ద్వారా, చర్చిల ద్వారా పంపిణీ ఏర్పాటు చేసి వుంటే ఏ చిక్కూ లేకపోయేది, లక్ష్యం నెరవేరేది. ఇప్పుడు నక్షత్రాలకు ముడిపెట్టడంతోనే చుక్కెదురవుతోంది.

ఎవరి నక్షత్రం ప్రకారం మొక్క నాటాలి అనేది ప్రధాన ప్రశ్న. ఇంటి యజమానిదా? తక్కినవారు ఏమై పోయినా ఫర్వాలేదా? అసలు యజమాని ఎవరనేది కూడా యీ రోజుల్లో ప్రశ్నార్థకమై పోయింది. ఒకప్పుడైతే మొగుడే యజమాని అనేవారు. ఇప్పుడు కొన్నిళ్లల్లో భార్యాభర్తలు సమానంగా సంపాదిస్తున్నారు. కొన్నిళ్లల్లో భార్యకు ఎక్కువ జీతం వస్తోంది, కొన్నిళ్లల్లో భార్యకు ఆస్తులు ఎక్కువ వుంటున్నాయి, కొన్ని సందర్భాల్లో పుట్టింటి కానుకగానో, స్వార్జితంగానో, యిన్‌కమ్ టాక్సు కారణాల చేతనో, యిల్లు భార్య పేరు మీద వుంటోంది. ఆస్తిపాస్తుల మాట ఎలా వున్నా, ప్రభుత్వసాయం కూడా యీ రోజుల్లో భార్య పేర యిస్తున్నారు. మొగుడి పేర యిస్తే తాగి తందనాలాడవచ్చునే జంకుతో, గ్యాసు, రేషనే కాదు, చౌక యిళ్లు కూడా భార్యల పేరే యిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎవరి పేరుకు నప్పే మొక్క నాటాలన్నది వివాదానికి దారి తీస్తుంది. భర్త తల్లి అనారోగ్యంతో వుందనుకోండి. 'ఆవిడ ఆరోగ్యం మెరుగుపడడం తక్షణ లక్ష్యం కాబట్టి ఆవిడ నక్షత్రానికి సరిపడే మొక్క తెస్తా' అని భర్త అంటే 'ఆవిడకేనా, నాకూ బాగా లేదు, ఆవిడ మూలుగుతూంటుంది, నేను మూలగకుండా పళ్ల బిగువున సహిస్తున్నాను' అని భార్య పోట్లాట వేసుకోవచ్చు. గవర్నమెంటు ఒక్క మొక్కే ఉచితంగా యిస్తుంది మరి అంటే 'దానికేముంది, తక్కినవి డబ్బు పెట్టి కొందాం' అనవచ్చు. ఎందుకొచ్చిన గొడవ కుటుంబంలో ఎంతమంది వుంటే అన్ని నక్షత్రాల మొక్కలూ కొనేయవచ్చు అనవచ్చు కొందరు. మొక్కలు కొనగానే సరి పోదు, నీళ్లు పోయాలి, ఎరువులు చల్లాలి. మనుషులు తాగడానికే నీళ్లు దొరక్క అల్లాడుతూంటే మొక్కలకు కూడా కావాలంటే ప్రభుత్వం సప్లయి చేస్తుందా? ఊళ్లల్లో, యిండిపెండెంటు యిళ్లల్లో అయితే సాగుతుందేమో కానీ, నగరాల్లో, ఎపార్ట్‌మెంటు కాంప్లెక్సులలో యిది సాగే పనేనా? కాంప్లెక్సులో వాహనాల కోసం కట్టిన చోట షాపులు, షట్టర్లు, వాచ్‌మన్ యిళ్లు కట్టేస్తున్నారు. ప్లానులో బాల్కనీలు చూపించి, కట్టేటప్పుడు బెడ్‌రూమ్‌ని పొడిగించడమో, బాత్‌రూములు కట్టడమో చేస్తున్నారు. కిచెన్ గార్డన్ అన్నది స్లోగన్‌గానే మిగిలింది తప్ప అమలు చేసేవాళ్లు కనబడటం లేదు. ఇలాటి పరిస్థితుల్లో యింటికి నాలుగైదు మొక్కలు పెంచడం సాధ్యమయ్యే పనా?

నాలుగైదే అనడం సరికాదేమో, ఎందుకంటే ప్రభుత్వవారి జాబితా చూడండి. అశ్విని నక్షత్రం వారు ముష్టి చెట్టు పెంచాలిట, భరణివారు ఉసిరి, కృత్తిక వాళ్లు మేడి లేదా అత్తి. అశ్విని, భరణి, కృత్తికలో నాల్గో వంతు మేషరాశిలోకి వస్తాయి. మేషరాశి వాళు పెంచాల్సిన చెట్టు ఎర్రచందనం (అది అటవీ శాఖ తప్ప మనం పెంచవచ్చా!?) అని యిచ్చారు మరి. అశ్విని నక్షత్రం ప్రకారం ముష్టి పెంచాలా? రాశి ప్రకారం ఎర్రచందనం పెంచాలా? క్లారిటీ లేదు. ఎవరైనా తెరాస నాయకుణ్ని అడిగితే రెండూ పెంచు తమ్మీ అనవచ్చు. ఇలా ఒక్కోళ్లకు రెండేసి మొక్కలు చొప్పున కుటుంబానికి ఓ పది లెక్కకు వస్తాయి. ఇన్ని పెంచాలి పాపం. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు, నకిలీ పురుగుమందులు.. అంటూ రైతులు వాపోతూ వుంటారు చూడండి, మనకు అవేమీ బుర్ర కెక్కవు, యిప్పుడు అనుభవంలోకి వస్తాయి. మొక్కలమ్మేవాళ్లు తక్కిన మొక్కలను సాధారణ రేట్లకు అమ్మినా ఈ జాబితాలో కనపడేవాటికి రేట్లు పెంచేయవచ్చు. వాహనాల నెంబర్ల విషయంలో చూడండి, అంకెలు కూడితే 9 వచ్చేవి, ఆరోహణాక్రమంలో వున్నవి అంటే వాటికి డిపార్టుమెంటే హెచ్చు రేట్లకు అమ్ముతుంది. అంకెల విషయంలో అయితే మనకు తెలిసిపోతుంది, కానీ మొక్కల విషయంలో ఏ మొక్క ఎలా వుంటుందో మనలో చాలామందికి తెలియవు. మామూలు మొక్కలు, చెట్లు అయితే ఫర్వాలేదు కానీ వీళ్లిచ్చిన జాబితాలోని పేర్లలో మొక్కల్లో చాలా భాగం పరిచితమైనవి కావు. ఎప్పుడూ కొనే ఆకుకూరల విషయంలోనే ఒక్కోప్పుడు గందరగోళ పడుతూ వుంటాం. ఇదేమిటయ్యా తోటకూర యిలా వుంది అంటే 'నాటు తోటకూర సార్' అంటాడు. ఇలా హెచ్చు రేటు తీసుకున్నా, ఒక దాని పేరు చెప్పి మరొకటి అమ్మేసినా మనకే తంటా. ఇల్లు పక్కా వాస్తు ప్రకారం కట్టించాం అని సంబరపడుతూండగానే యింటికి ఎవరో వాస్తు పండితుడు వచ్చి, 'ఎవడో కానీ మిమ్మల్ని మిస్‌గైడ్ చేశాడు, ఆ మూల మెట్లు రాకూడదు, పడగొట్టించండి' అని బెదరకొడతాడు.

అలాగ యిప్పుడు వృక్షజ్యోతిష్కులు పుట్టుకుని వచ్చి 'అయ్యో యిది పులివెలగ మొక్క అని చెప్పి వాడు మీకు అంటకట్టేశాడు. ఇది పులివెలగ కాదండి, పిల్లివెలగ, అందుకే మీరనుకుంటున్నదేదీ జరగటం లేదు' అని అడలగొట్టగలరు.

ఇప్పటికే సంఖ్యాశాస్త్రం వుంది, నామశాస్త్రం వుంది, రాళ్ల శాస్త్రం వుంది. కార్లు అమ్మించేస్తున్నారు, పేర్ల స్పెల్లింగులు మార్పించేస్తున్నారు, వేళ్లకు రాళ్ల వుంగరాలు తొడిగిస్తున్నారు. ఇప్పుడు మొక్కలు కూడా వచ్చి లిస్టులో చేరాయి. ప్రభుత్వం రాశులు, నక్షత్రాల వరకు వచ్చింది. హరితజ్యోతిష్కులు వాటిని చరణాల వరకు చీల్చి మనల్ని వాళ్ల పాదాల మీద పడేయించుకుంటారు. ఒక్కో నక్షత్రానికి నాలుగేసి చరణాలు. ఆ విధంగా 108 వెరైటీ మొక్కలను మీకు అమ్మచూపవచ్చు. నక్షత్రం తెలియక అల్లాడేవారిని ఆటాడించవచ్చు. మీ అసలు నక్షత్రమేదో తెలుసుకోవడానికి అంజనం వేయాలనవచ్చు. ధనత్రయోదశి పేరు చెప్పి బంగారు షాపుల వాళ్లు విజృంభిస్తున్నట్లే, వేప, మద్ది ఆకులతో తయారుచేస్తున్నామంటూ అమ్ముకుంటున్న టూత్‌పేస్టుల వాళ్లు కొత్త ఎత్తులు ఎత్తవచ్చు. పెర్‌ఫ్యూమ్స్‌ను ఆడా, మగా అని చీల్చినట్లు, పళ్లు తోముకునేవాళ్లను కూడా రాశుల వారీగా విభజించవచ్చు. రాబోయే ఓ ఏడ్ – ఓ కుర్రాడు ఓ పేస్టుతో ఎంత తోమినా పళ్లు మెరవటం లేదు. ఏ షారూఖ్ ఖానో వచ్చి 'హేయ్, కన్యారాశి వాళ్లు తోముకునే పేస్టుతో తోమితే నీ పళ్లేమి మెరుస్తాయి బ్రో' అంటూ దాన్ని లాక్కుని అవతలికి విసిరేసి 'నువ్వు వృషభానివి. 'ఎడాకులపాయ' (అదేమిటో, ఎలా వుంటుందో నన్ను అడగవద్దు ప్లీజ్) చెట్టు ఆకులతో చేసిన ఫలానా టూత్‌పేస్టునే వాడు' అని యింకో పేస్టు ట్యూబ్ చేతిలో పెడతాడు. 'ఎద్దులాటి మొగాళ్లకోసం ఎడాకుల పాయ పేస్ట్' అనే కాప్షన్ వెనక్కాల నుంచి ఎవరో అరుస్తారు.

మన బాగోగులకు, మొక్కలకు లింకు పెట్టడం మొదలెడితే ఎక్కడ ఆగుతుందో తెలియదు. ఇంటావిడ మేనమామ వచ్చి 'మీ ఆయన వాళ్లమ్మ బాగు కోసం ఫలానా మొక్క పాతించాడు కదా, కానీ నీ నక్షత్ర ప్రకారం అది నీకు పడదు. నీకు నిద్ర పట్టకపోవడానికి కారణం అదే' అని చెప్పి వెళితే ఆ మొక్క పీకేదాకా ఆవిడ నిద్ర పోదు. ఒకవేళ అత్తాకోడళ్లు సఖ్యంగా వుండి ఆ యిల్లు శాంతినివాసంలా వెలిగిపోతుంటే, పక్కింటివాడికి కడుపుమంట కలగవచ్చు. ఓ రాయేసి ఒనిడా టీవీని పగలకొట్టినట్లు, 'వీళ్ల సౌభాగ్యానికి ఇదిగో యీ జిట్రేగి మొక్కే కారణం, దీని పనిపట్టాలి' అంటూ ఓరాత్రి వేళ గోడదూకి మొక్క పీకేయవచ్చు, లేదా పురుగులు పట్టించేయవచ్చు. ఇలాటివి జరిగితే మాత్రం వేసే మొక్కల కంటె పీకే మొక్కలు ఎక్కువై పోతాయి. వాస్తు భయాలు పెరిగాక కట్టేవి తక్కువ, కూల్చేవి ఎక్కువ అని అందరం గమనిస్తున్నాం కాబట్టి దీన్ని వేళాకోళంగా కొట్టి పారేయలేం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 8 **ఎమ్బీయస్ : గుళ్లూ – రోడ్లూ**

కృష్ణాపుష్కరాల సందర్భంగా విజయవాడలో రోడ్ల విస్తరణ చేపట్టారు. 'గాదెలో ధాన్యం గాదెలోనే వుండాలి, పిల్లల కడుపులు నిండాలి అంటే కుదురుతుందా? రోడ్ల మీద గుళ్లు అలాగే వుండాలి, అంతర్జాతీయ స్థాయి నగరం వెలవాలి అంటే పొసుగుతుందా? ఆమ్లెట్టు కావాలంటే గుడ్డు పగలాల్సిందే! పెద్ద రోడ్డు కావాలంటే గుడి లేచిపోవాల్సిందే' అంటూ చిన్నా, పెద్దా నలభై గుళ్లు కూల్చేశారు. గుడిసెల జోలికి వెళ్లడమంటే భయం కానీ గుడి తీయడం ఎంతసేపు! ఇంటికన్నా గుడి పదిలం అనే సామెతను తిరగరాయాలి. ఈ రోజుల్లో గుళ్లు పదిలం కాదు. అందునా బాబుగారి రాజ్యంలో! ఎందుకంటే ఈ మధ్యే ఆయన అన్నారు – పాపులు తమ పాపాలు కడిగేసుకుందామని గుళ్లకు వెళతారని! వాళ్లకా ఛాన్సు లేకుండా చేస్తున్నారన్నమాట. పాపాలు కడుక్కునే అవకాశం లేకుండా చేస్తే పాపాలే చేయరని, ఆ విధంగా సమాజం పరిశుభ్రంగా వుంటుందని ఆయన ఐడియా కాబోలు. అయితే రాష్ట్రంలో చాలా రద్దీ వున్న పెద్దపెద్ద గుళ్ల దగ్గర మొదలు పెట్టవచ్చు కదా, యీ వూళ్లోనే ఎందుకు మొదలెట్టారన్న అనుమానం రావచ్చు. దానికీ ఓ లాజిక్ వుంది. కితం ఏడాది గోదావరి పుష్కరస్నానం చేస్తే పాపాలు పోతాయని రెండు రాష్ట్రాలూ ప్రచారం చేశాయి. ఈ సారి కృష్ణాపుష్కర స్నానం గురించి కూడా మళ్లీ అదే ప్రచారం చేస్తారు. విజయవాడలో స్నానం చేశాక యిక గుడితో అవసరం ఏముందని అనుకుని వుండవచ్చు.

చంద్రబాబు స్థానంలో మరో సూర్యబాబు వచ్చినా, పాపప్రక్షాళనపై వారికి ఎలాటి అభిప్రాయమున్నా, రహదారుల్లో ప్రార్థనాస్థలాలు తొలగించవలసినదే. ఎందుకంటే గుడి ఉన్నంత మేర మాత్రమే రోడ్డు స్థలం పోతుందనుకోకూడదు. గుడి వెలవగానే ముందు కొబ్బరికాయల కొట్టు, పూలకొట్టు వెలుస్తాయి. అమ్మవారి గుడి అయితే కుంకం, పసుపు, జాకెట్టు గుడ్డల షాపూ వెలుస్తుంది. చెప్పులు దాచేవాడు చెక్కపెట్టెతో సహా అవతరిస్తాడు. సైకిళ్లు, స్కూటర్ల పార్కింగు ప్రారంభమవుతుంది. భక్తులే కాదు, ఆ రోడ్డు మీద పనివున్నవాళు కూడా తమ వాహనాలను అక్కడే అక్రమంగా పార్క్ చేస్తారు – గుడి పేరు చెపితే ఏ పోలీసూ రాడని ధైర్యం. రాష్ట్రంలో పురాతన దేవాలయాలు ఎన్నో నిర్వహణ లేకుండా శిథిలమవుతూ వుంటాయి. వాటిని పట్టించుకోరు కానీ, యిలా రోడ్డు మీద గుళ్లను డెవలప్ చేయడానికి ఎందరో ఉరకలు వేసుకుంటూ ముందుకు వస్తారు. గుడికి ప్రాకారం ఏర్పడుతుంది, రోడ్డు ఎలాగూ ప్రభుత్వస్థలమే కాబట్టి ఎంత కబ్జా చేసినా అడిగేవాళ్లు లేరు. ఎవరైనా అధికారి వచ్చి అడిగితే, 'రోడ్ల మీద అక్రమంగా వెలసిన మసీదులను, దర్గాలను తొలగించి ఆనక మమ్మల్ని అడగండి' అంటారు, మసీదులు, దర్గాల జోలికి వెళితే వాళ్లు 'గుళ్లు తీసేసి అప్పుడు రండి' అంటారు. ఏ దర్గాకు, ఏ గుడికి ఏ నాయకుడు భక్తుడిగా వున్నాడో తెలియక పోలీసులు వూరుకుంటారు. ఏదైనా కాలనీ ప్లాను చేసినప్పుడు కొంత మేర పార్కు వుండి తీరాలని నగరాభివృద్ధి శాఖ పట్టుబడుతుంది. కాలనీ వెలసిన ఏడాది తర్వాత ఆ పార్కును

ఖాళీగా వుంచరు. అక్కడో గుడి కట్టేస్తారు. పర్యావరణమా గాడిదగుడ్డా అంటారు. గుడంటూ పెట్టాక ఉత్సవాలకేం లోటు? ఏదో ఒకటి చేస్తూ శబ్దకాలుష్యం పెంచుతారు. నేను రాస్తున్నది ఏ ప్రార్థనాస్థలానికైనా వర్తిస్తుంది. విజయవాడలో అయితే కొన్ని కొండలనే క్రైస్తవులు ఆక్రమించారు. అక్రమంగానో, సక్రమంగానో నాకు తెలియదు.

గుళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా ధర్నాలు, బంద్‌లు చేస్తున్నవారెవరి దగ్గర యీ సమస్యకు పరిష్కారం లేదు. 'రోడ్డు విస్తరణ అంటూ అటూ, యిటూ రోడ్డు పెంచి, మధ్యలో కరంటు స్తంభాలను అలాగే వదిలేశారు, వాటిని తీయలేదు కానీ గుడిని తీసేశారేం?' అని అడుగుతున్నారు కొందరు. అదే తమాషా, నాకు సరిగ్గా తెలియదు కానీ కొందరు నాయకుల యిళ్లకు ప్రమాదం లేకుండా విస్తరణ చేపట్టి వుంటారు. సరే, ఆ విద్యుత్‌స్తంభాలను కూడా మార్చేసి, నాయకుల యిళ్లను కూడా పడగొట్టేశారనుకోండి. రోడ్డు మధ్య వున్న గుళ్లను ఏం చేయాలో మీరు చెప్పగలరా? 'అభివృద్ధికి సహకరిస్తాం, ఆయన అఖిలపక్ష సమావేశం ఏర్పరచి మా అందరి సలహాలు కోరితే యిస్తాం' అంటున్నారు.

ఇదో బడాయి! బాబు ఛస్తే అఖిలపక్షసమావేశం ఏర్పరచరని తెలిసి యిలాటి డిమాండు చేస్తారు. బాబు దృష్టిలో ఆయనొక్కరే అభివృద్ధి కాముకుడు, దీర్ఘదర్శి, ద్రష్ట, స్రష్ట, మరోటీ, యింకోటీ. 'ఇన్ని క్వాలిటీస్ పెట్టుకుని పోయిపోయి యింకోడి సలహా అడగడమేమిటి నా బొంద' అనుకుంటారాయన. అవతలివాళ్లని సలహాలు చెప్పనివ్వకుండా నోరు కుట్టేస్తేనే సవాలక్ష చెప్పారు – రాజధాని అక్కడ వద్దన్నారు, పచ్చని పొలాలు లాక్కోద్దన్నారు, సింగపూరెందుకు, జపానెందుకు, దుబాయి బుర్జ్ కట్టిన భారతీయ కంపెనీలు మన దగ్గరే వుండగా అన్నారు, స్థలం మనం యిచ్చి సింగపూరు వాళ్లకు మేజర్ వాటా ఏమిటన్నారు, స్విస్ ఛాలెంజ్ వద్దన్నారు, ఒప్పందాలు బయటపెట్టమన్నారు, అన్నీ అమరావతిలోనే కుక్కడం దేనికి, రాష్ట్రమంతా పంచమన్నారు, అప్పుచేసి పప్పుకూడెందుకు అన్నారు, పూజలమీద పూజలెందుకన్నారు, పాతవాటికే ప్రారంభోత్సవాలెందున్నారు... ఇవన్నీ ప్రత్యక్షంగా వినడానికా అఖిలపక్షం పెట్టడం? బాబు యింకోళ్లను సంప్రదించరుగాక సంప్రదించరు. అసలు ఎసెంబ్లీలోనే ప్రతిక్షకులను, ప్రతిపక్షులను చూడడం యిష్టం లేక గింజలు చల్లి తమవైపు లాక్కుని వస్తున్నారు. అలాటిది ప్రత్యేకంగా పిలిచి పీట వెయ్యడమా? నెవర్!

ఇప్పుడు గుళ్ల గురించి రగడ చెలరేగగానే ఓ కమిటీ వేసేశారు. దానిలో వున్నదెవరు? తన కాబినెట్‌లో మంత్రులే, జీహుజూర్ అనేవాళ్లే. కమిటీలో ఓ మంత్రిగారు మేం కూల్చేస్తేం ఏం? బాబుగారు యింతకంటె డబుల్ సైజులో మళ్లీ కడతారంటున్నారు. కట్టేదానికి కూల్చడం దేనికి? అయ్యవారేం చేస్తున్నారంటే చేసిన తప్పులు దిద్దుకుంటున్నారన్నాట్ట! వాస్తు దోషాల పేర చెప్పి కూల్చడం–కట్టడం, కట్టడం–కూల్చడం ఎక్కువై పోయింది. దానికి గుళ్లు కూడా తోడవుతాయా? నిజానికి యీ రోడ్డు మీది గుళ్లకు పరిష్కారం ఏమిటంటే ఒక ఏరియాలోని గుళ్లన్నీ సశాస్త్రీయంగా తొలగించి, వాటన్నిటిని కలిపి ఆ ఏరియాలోని ఓ ప్రభుత్వస్థలంలో ఒకే కాంప్లెక్సులో స్థాపించడం! 'గుళ్లు చోటు మారేయి తప్ప, తొలగించలేదు, అదే ఏరియాలోనే వుంటాయి కాబట్టి వాటికున్న క్షేత్రమహిమ ఎక్కడికీ పోదు' అని జనాల్ని వూరడించవచ్చు. రోడ్లూ విశాలమవుతాయి. కొత్తగా రోడ్డు మీద ఏ ప్రార్థనాలయం రానీయకూడదు. విగ్రహం కదిలిస్తే అరిష్టం అని ఎవరైనా వాదిస్తే, యాదగిరి నరసింహుడి కంటె పవర్‌ఫుల్లా అని అడగాలి. గుడి విస్తరణ పేరుతో మూల విరాట్టునే పక్కకు తరలించారు. ప్రతీదానికీ ప్రాయశ్చిత్త కర్మలుంటాయి. అయినా రోడ్డు మీద గుళ్లకు ధ్వజస్తంభం వుండదు, నిర్మాణాలు ఆగమశాస్త్రానుసారం వుండవు. కట్టే కాంప్లెక్సులో యిలాటివన్నీ పెట్టి దేవుళ్లకు మహిమ పెంచుతున్నాం అని నచ్చచెప్పవచ్చు. ఇప్పుడు ఆంధ్రప్రభుత్వం నుండి యిలాటి సబబైన సూచన వచ్చినా అవతలివాళ్లు వూరుకుంటారన్న నమ్మకం లేదు. 'ఆ ముక్క లెక్కెట్టుకోడానికి ముందు చెప్పాల' అన్నట్టు, గుడి కూల్చడానికి ముందు కన్సల్ట్ చేయాల్సింది అంటూ పట్టుబడతారు. ఇప్పుడు రంగంలోకి పీఠాధిపతులూ దిగారు.

ఆరెస్సెస్ నేపథ్యంతో వచ్చిన బిజెపి వాళ్లది అసలైన సంకటం. మరొకళ్లయితే హిందూమతాన్ని చులకనగా చూస్తున్నారని ఏకి పారేయవచ్చు. ఇప్పుడు ప్రభుత్వంలో పాలు పంచుకుంటూ యిలాటి చర్యలను సమర్థించుకోవడం మహా కష్టం. పుష్కరాలు రాబోతున్నాయి. జనాల్లో భక్తి పరవళ్లు తొక్కబోతోంది. ఇటువంటి చార్జ్‌డ్ ఎట్మాస్‌ఫియర్‌లో యింత దూకుడుగా, దురుసుగా ఎందుకు ప్రవర్తించాలో టిడిపి వారే చెప్పగలగాలి. గుజరాత్‌లో మోదీ 80 గుళ్లు తీసేయలేదా? అని వాదిస్తున్నారు. కరక్టు. ప్రతిఘటన లేకుండా మోదీ ఎంత చాకచక్యంగా తీయించేశాడో అది నేర్చుకోండి. ప్రతీదీ వివాదం చేసుకోవడం దేనికి? ఆంధ్ర ప్రభుత్వం ప్రస్తుతం ఎదుర్కొంటున్న యిబ్బంది – విశ్వాసరాహిత్యం (ట్రస్టు డెఫిషియన్సీ)! ప్రభుత్వం చెప్పేదానికి, చేసేదానికి పొంతన వుండటం లేదు. కేంద్రం నుంచి నిధులు రావటం లేదు కానీ లేకపోతేనా అని చెప్పుకుంటున్నారు. చూడబోతే వెనకబడిన జిల్లాలకై యిచ్చిన నిధులను దారి మళ్లించారని నీతి ఆయోగ్ కుండ బద్దలు కొట్టింది. జాతికి అంకితాలు, పునరంకితాలు, పునఃపునరంకితాలు అయిపోతున్న పట్టిసీమకు అనుమతులు లేవు, పోలవరం ప్రాజెక్టు 2018లో పూర్తి కాదని చిన్నపిల్లవాడు కూడా చెప్పగలడు. రాజధానికి డిపిఆర్ కూడా సిద్ధం కాలేదు. ఇలాటి పరిస్థితుల్లో రాజధాని చుట్టుపట్ల నిర్మాణాలకు కాంట్రాక్టు లిచ్చేశాం, వచ్చేస్తున్నాయి అని అరిచేతిలో స్వర్గం చూపిస్తూంటే ఎలా నమ్మగలరు?

ప్రజలను విశ్వాసంలోకి తీసుకుంటే తప్ప ప్రభుత్వంతో కలిసిరారు, దూరం నుంచి తమాషా చూస్తూ వుండిపోతారు. ఇలాటి పరిస్థితుల్లో గుడి కూల్చివేతల్లాటివి చేపట్టి ప్రజలను మరింత దూరం చేసుకోవడం తెలివైన పని కాదు. గుడి కూల్చివేతల అంశం ప్రతిపక్షాలతో కాకపోయినా, హిందూ సంస్థలవారితోనైనా సంప్రదించి వుంటే యింత రగడ జరిగేది కాదు. చివరగా – యివాళ గుడి

అయింది, రేపు మరో హెరిటేజి భవనమౌతుంది. ఎప్పటికైనా శతాబ్దాల నాటి నగరాన్ని ఆధునీకరించడంలో యిలాటి అవకతవకలు, వివాదాలు, న్యాయపరమైన సమస్యలు తప్పవు. చిక్కులు లేకుండా అన్ని సదుపాయాలతో కొత్త నగరం కట్టాలంటే జనవాసాలు లేని చోటనే కట్టాలి. ఆ ముక్క బాబుగారికి అర్థం కాదు. అలా కడితే జనాలు రారనుకుంటారు. చండీగఢ్‌కి రాలేదా అంటే వినరు. ఆయన చూపులు, ఆలోచనలు విజయవాడ పరిధిని దాటి వెళ్లనంతకాలం యీ తరహా గొడవలు మరిన్ని రావడంలో ఆశ్చర్యం లేదు.

– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)

జులై 10 **ఎమ్బీయస్ : ఓర్లాండో ఘటనలో ఐసిస్ పాత్ర**

అమెరికాలోని ఫ్లారిడా రాష్ట్రంలో వున్న ఓర్లాండో నగరంలో 2016 జూన్ 12 న "పల్స్" అనే గే నైట్ క్లబ్‌లో వరుస కాల్పులతో 49 మంది ప్రాణం తీసి, యింకా అనేకమందిని గాయపరచి, చివరకు పోలీసుల చేతిలో హతమైన 29 ఏళ్ల ఒమర్ మతీన్ 911కు ఫోన్ చేసి తన ఘనకార్యం చెప్పి పోలీసులతో తను ఐసిస్ కార్యకర్తనని చెప్పుకోవడం విదితమే. ఈ సందర్భంలో ఐసిస్ యీ ఘోరకార్యాన్ని ఎలా నిర్వహించింది అనేది ఆసక్తిదాయకంగా మారింది. ఐసిస్ ఒమర్‌ను తన వద్దకు పిలిపించి శిక్షణ శిబిరాలలో సిద్ధాంతాలు నూరిపోసి ఫలానా విధంగా దాడి చేయి అని నేర్పిందా? మారణాయుధాలలో తర్ఫీదు యిచ్చిందా? అతనికి మారణాయుధాలు సరఫరా చేసిందా? లేదు! అమెరికా పౌరులనే, అమెరికా సమాజంలోని పరిస్థితినే మారణాయుధాలుగా మార్చి తన లక్ష్యం సాధిస్తోంది. "టైమ్" పత్రిక వ్యాఖ్యానించినట్లు సెప్టెంబరు 11 ఘటనలో ఉగ్రవాదులు అమెరికన్ విమానాలనే తమ బాంబులుగా మార్చారు. ఇరాక్‌లో అమెరికన్ నాయకుల అహంభావాన్ని స్థానికుల తిరుగుబాటుగా మార్చారు. ఇప్పుడు ఓర్లాండో విషయంలో తీవ్రస్వభావం కల ఒక అమెరికన్ పౌరుణ్నే తమ ఆయుధంగా మలుచుకున్నారు. ఆ తీవ్రస్వభావి యింతటి ఘాతుకాన్ని నిర్వహించేందుకు తగిన భూమికను అమెరికన్ సమాజం సమకూర్చింది.

ఒమర్ తండ్రి మీర్ సెద్దిక్ మాటీన్ ఆఫ్గనిస్తాన్‌లోని నుంచి వలస వచ్చి అమెరికాలో స్థిరపడ్డాడు. ఇన్సూరెన్సు వ్యాపారంలో బాగా గడించాడు. అతనొక వింత మనిషి. తనను తాను ఆఫ్గన్ పాలకుడిగా భావించుకుంటూ ఇంటర్నెట్‌లో ఒక టీవీ షో ద్వారా ఆఫ్గనిస్తాన్‌పై తన భావాలు వ్యాప్తి చేసుకుంటూ వుంటాడు. పష్తూన్ జాతీయవాదిగా కనబడతాడు. సోషల్ మీడియాలో ఆఫ్గన్లకు ఆదేశాలు యిస్తూ వుంటాడు, అవి పట్టించుకునేవారెవరూ లేకపోయినా! ఒకసారి తాలిబన్లకు అనుకూలంగా, మరోసారి ప్రతికూలంగా మాట్లాడుతూ వుంటాడు. అతనికి రాజకీయాలపై తప్ప మతంపై ఆసక్తి లేదు.

ఒమర్ న్యూయార్క్‌లో పుట్టి ఫ్లారిడాలో హైస్కూలు చదువు చదివాడు. కొంతకాలం విటమిన్ సప్లయి దుకాణంలో గుమాస్తాగా పనిచేశాడు. పోలీసు అవుదామనుకుని, ప్రిజన్ గార్డు అయ్యి, తర్వాత సెక్యూరిటీ ఆఫీసరయ్యాడు. ప్రపంచంలో కల్లా పెద్దదైనా బ్రిటిష్ డిటెక్టివ్ ఏజన్సీ జి4ఎస్, 2007లో అతనికి తమ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా వుద్యోగం యిచ్చినపుడు రెండు రౌండ్లలో అతని నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అతనిలో అనుమానించ దగినది ఏమీ లేదని భావించింది. ఎఫ్‌బిఐ అతన్ని విచారించిన తర్వాత కూడా ఉద్యోగం పీకేయలేదు. నిజానికి అతనిపై ఏ క్రిమినల్ రికార్డూ లేదు. ఒకే ఒక్కసారి ట్రాఫిక్ నిబంధనలు వుల్లంఘించి జరిమానా కట్టడం తప్ప, అతనికి వ్యతిరేకంగా ఏ సాక్ష్యమూ లేదు.

ఉజ్బెకిస్తాన్‌కు చెందిన సితోరా యూసుఫీ అనే న్యూజెర్సీ నివాసి అతనికి ఆన్‌లైన్‌లో పరిచయమైంది. 2009లో అతన్ని పెళ్లాడి ఫ్లారిడాకు వచ్చింది. పెళ్లయ్యాక తెలిసింది, అతనిది చాలా తీవ్రస్వభావమని, ద్వంద్వప్రవృత్తి అనీ. నాలుగు నెలలు కాపురం చేసేటప్పటికి భరించలేక, తల్లితండ్రులతో మొత్తుకుంది. వాళ్లు హుటాహుటిన వచ్చి ఆమెను తీసుకుని పోయారు. 2011లో వాళ్లు విడాకులు తీసుకున్నారు. నూర్ జహీ సల్మాన్ అనే ఆమెను పెళ్లాడాడు. వాళ్లకు మూడేళ్ల కొడుకు వున్నాడు. వాళ్లు విడిపోలేదు కానీ కలిసి ఒకే చోట వుండటం లేదు. ఈ మధ్యకాలంలో ఆమె శాన్ ఫ్రాన్సిస్కోలో వుంటోంది.

ఆవేశపరుడైన ఒమర్‌కు వాగుడు ఎక్కువ. తన సహోద్యోగుల దగ్గర నల్లవాళ్లను, యూదులను, స్వలింగసంపర్కులను, రాజకీయనాయకులను, అమెరికా సైన్యవిధానాన్ని తిడుతూ వుండేవాడు. బొంబాయి నటుల్లో కొందరు దావూద్ ఇబ్రహీం పేరు చెప్పిన నిర్మాతలను హడలగొట్టినట్లు, యితను 'నాకు అల్ కైదా, హెజ్‌బొల్లా వంటి తీవ్రవాద సంస్థలతో సంబంధబాంధవ్యాలున్నాయి, యీ సంగతి పోలీసు అధికారులకు చెప్పి మా యింటిపై దాడి చేయిస్తే నేను సూయిసైడ్ బాంబర్‌నై వాళ్లను చంపేస్తాను జాగ్రత్త,' అని తన కొలీగ్స్‌ను అడలగొడుతూండేవాడు. నిజానికి అల్ కైదా సున్నీ తీవ్రవాదుల సంస్థ, హెజ్‌బొల్లా షియా తీవ్రవాదుల సంస్థ! ఈ తేడాలేవీ వాళ్లకు తెలియవుగా, యితని వరస చూసి ఎఫ్‌బిఐకు ఫిర్యాదు చేశారు. వాళ్లు అతన్ని 2013లో పిలిచి నిలదీశారు. "అలా అన్నమాట వాస్తవమే, కానీ కోపంలో అన్నాను. నేను ముస్లిమునని వాళ్లు వివక్షత చూపుతూంటే వాళ్లను భయపెట్టడానికి అన్నానంతే" అని చెప్పుకున్నాడు. ఎందుకైనా మంచిదని అతనిపై నిఘా వుంచారు. పది నెలల తర్వాత ప్రమాదకరమైన వ్యక్తిగా తోచక నిఘా మానేసి, కేసు మూసేశారు.

అల్ కైదాతో సంబంధమున్న నుస్రా ఫ్రంట్ సిరియాలో పని చేస్తోంది. మోనెర్ అబూ సల్హా అనే పాలస్తీన్–అమెరికన్ యువకుడు సిరియాకు వెళ్లి 2014లో సూయిసైడ్ బాంబు దాడికి పాల్పడ్డాడు. అతని మూలాల గురించి, పరిచయాల గురించి ఎఫ్‌బిఐ

పరిశోధించసాగింది. అమెరికాలో అతను ఫోర్ట్ పియర్స్ మసీదులో ప్రార్థనలు చేసేవాడని తెలుసుకుని, అతనితో బాటు ఆ మసీదుకి వచ్చేవారెవరాని వెతికింది. అక్కడ మళ్లీ ఒమర్ తగిలాడు. గతంలో కూడా అనుమానించాం కదాని మళ్లీ అతన్ని పిలిచి, ప్రశ్నించారు. ఎంత పరిశోధించినా యిద్దరి మధ్య లింకేమీ దొరకలేదు. మళ్లీ కేసు మూసేశారు. అందుకే జి4ఎస్ అతన్ని ప్రమాదకరమైన వ్యక్తిగా భావించలేదు, ఉద్యోగంలో కొనసాగించింది.

మరి ఒమర్‌ను రాడికలైజ్ చేసినవాళ్లెవరు అంటే రాబర్ట్‌సన్ అనే గే–వ్యతిరేక ఇస్లామిస్ట్ కావచ్చు అంటున్నారు. పన్నులు ఎగ్గొట్టినందుకు, అక్రమాయుధాలు కలిగి వున్నందుకు అతను నాలుగేళ్లు జైలు శిక్ష అనుభవించి గత సంవత్సరమే విడుదల అయ్యాడు. జైల్లో వున్నంతకాలం అతని తోటి ఖైదీలను ఉగ్రవాదం వైపు మళ్లిస్తాడేమోనని అధికారులు జంకుతూనే వున్నారు. అతను బయటకు వచ్చి ఓర్లాండోలో ఆన్‌లైన్ ఇస్లామిక్ సెమినార్ నిర్వహిస్తుంటాడు. ఒమర్ దానిలో చేరాడట. ఇప్పుడు పోలీసులు రాబర్ట్‌సన్‌ను విచారిస్తున్నారు.

ఎల్‌జిబిటిక్యూ (లెస్బియన్స్, గేస్, బైసెక్సువల్స్, ట్రాన్స్‌జెండర్స్, క్వీర్స్) కమ్యూనిటీ యిటీవల కాలంలో పెళ్లి చేసుకునే హక్కుతో సహా చాలా హక్కులు సంపాదించుకున్నారు. అయినా అమెరికన్ సమాజం వారి పట్ల వివక్షత పాటిస్తూనే వుంది. కొందరు రైట్–వింగ్ రాజకీయనాయకులు, కొందరు క్రైస్తవ, ఇస్లామ్ మతవాదులు వారిని ఖండిస్తూనే వున్నారు. ఈక్వాలిటీ ఫ్లారిడా అనే గే హక్కుల సంఘం పదివేలమంది సభ్యులతో ఓర్లండోలో పెద్ద సభ నిర్వహిస్తే ఒక్క రిపబ్లికన్ కూడా హాజరు కాలేదు. కెవిన్ స్వాన్సన్ అనే పాస్టర్ "స్వలింగసంపర్కులకు మరణశిక్ష వేయాలని బైబిలు చెపుతోంది" అని ఓ సభలో బహిరంగంగా వ్యాఖ్యానించాడు. ఆ సభలో బాబీ జిందాల్ తో సహా ముగ్గురు రిపబ్లికన్ నాయకులున్నారు. వారిలో యిద్దరు గవర్నర్లు, ఒక సెనేటర్. అయినా వాళ్లెవరూ అతన్ని ఖండించలేదు. "రెలిజియస్ ఫ్రీడమ్" పేర రిపబ్లికన్ పార్టీ గే–వ్యతిరేక చట్టం చేయడానికి ప్రయత్నించింది. ట్రంప్ అనుయాయులు గేలను నానారకాలుగా దూషిస్తున్నారు, గే వివాహాలను ఆపడానికి ప్రయత్నిస్తున్నారు. ఫ్లారిడాలోని అతివాద చర్చిల బయట బోర్డులు వేళ్లాడుతున్నాయి – 'స్వలింగసంపర్కులు పశ్చాత్తాప పడాలి లేకపోతే వారికి నరకవాసమే' అని.

ఇప్పుడీ దాడి జరిగాక అయ్యోపాపం అని కొందరు అంటున్నా టెక్సాస్ లెఫ్టినెంట్ గవర్నరు ట్వీట్ పెట్టాడు – 'దేవుడి సృష్టిని వెక్కిరించలేరు. చేసిన కర్మానికి ఫలితం అనుభవించక తప్పదని గ్రహించండి' అని. రెండేళ్ల క్రితం పబ్లిక్ రెలిజియన్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన సర్వేలో అమెరికన్లలో అధిక సంఖ్యాకులు స్వలింగ సంపర్కం అనైతికమని అభిప్రాయం వెల్లడించారు. జాతిద్వేషంతో జరిగే నేరాలపై సదరన్ పావర్టీ లా సెంటర్ 2011లో అధ్యయనం చేసి 'నల్లవారి కంటె, యూదుల కంటె ఎల్‌జిబిటి మనుష్యులే యిలాటి నేరాలకు గురయ్యే అవకాశాలు రెట్టింపు వున్నాయి' అని తేల్చారు. ఇటువంటి ద్వేషపూరితమైన వాతావరణంలోనే ఒమర్ ఆలోచనలు రూపు దిద్దుకున్నాయి. కొన్ని వారాల క్రితం యిద్దరు మగవాళ్లు బహిరంగంగా ముద్దు పెట్టుకుంటున్న దృశ్యం చూసి అతను రగిలిపోయాడని అతని తండ్రి చెప్పాడు.

ఈ మందుగుండును రగిలించడానికి నిప్పురవ్వ కూడా అమెరికాలోనే సిద్ధంగా వుంది. అది ఆయుధాల సంస్కృతి. ఇలాటి ఘటనలు జరిగినప్పుడల్లా ఆయుధవిక్రయాన్ని నిలిపివేసే చట్టం చేయాలని కొన్ని డిమాండ్లు వస్తాయి. కానీ అమెరికన్ ఆయుధవ్యాపారులు తమ పలుకుబడితో, ఐశ్వర్యంతో అలాటి ప్రయత్నాలకు అడ్డుకుంటారు. నేషనల్ రైఫిల్స్ అసోసియేషన్ వారి సమావేశం మే 20 న జరిగింది. 80 వేల మంది సభ్యులు హాజరైన ఆ సభలో సంస్థ ప్రతినిధి ఒకడు ఒబామాను ఎల్‌జిబిటిలకు న్యాయం చేకూర్చడానికి ప్రయత్నిస్తున్నందుకు ఘాటుగా విమర్శించాడు. మరో వక్త యీ హెూమోలు అమెరికన్ సంస్కృతిని సర్వనాశనం చేశారని వాపోయాడు. అమెరికాను మళ్లీ ఉన్నతదేశంగా నిలబెట్టాలంటే యిలాటి చీడపురుగులు వుండకూడదని ధోరణిలోనే ఉపన్యాసాలు సాగాయి. 2016లో యిప్పటిదాకా తుపాకీ వాడిన 23 వేల సంఘటనలు జరిగాయి. వాటికి సంబంధించి 6 వేల మంది చనిపోయారు. ఒమర్ వాడిన ఎఆర్–15ను 2012లో శాండీ హుక్ స్కూలులో ఆడమ్ లాంజా వాడి 20 మంది చిన్న పిల్లలను చంపాడు, 2015లో శాన్ బెర్నార్డినోలో రీజనల్ సెనిటర్లో సయ్యద్ ఫరూక్, తఫ్షీన్ మాలిక్ అనే జంట వాడి 14 మందిని చంపారు. అప్పుడే దాన్ని నిషేధించాలని డిమాండు వచ్చినా ఏమీ జరగలేదు. నిజానికి అది యుద్ధభూమిలో వాడవలసిన ఆయుధం.

ఇలా హెూమోలపై ఏహ్యత, మారణాయుధాల లభ్యత ఒమర్‌కు అందివచ్చాయి. గేలు జూన్‌ను ప్రైడ్ మంత్‌గా పేర్కొంటారు. అందువలన అందరూ మాంచి సెలబ్రేషన్ మూడ్‌లో వున్నారు. "పల్స్" గేలలో చాలా పాప్యులర్ నైట్ క్లబ్బు. ఒమర్ చాలా సార్లు అక్కడకి వెళ్లి ఆనుపానులు క్షుణ్ణంగా పరిశీలించి, జూన్ 12 తెల్లవారు ఝామున 2 గంఎఎలకు ఎఆర్ 15 అనే ఎస్సాల్ట్ రైఫిల్, ఒక హేండ్‌గన్‌తో క్లబ్బులో ప్రవేశించాడు. వేడుకలు ముగిసే సమయంలో కాల్పులు మొదలుపెట్టి కొన్ని గంటల పాటు కాల్చాడు. తనే పోలీసులకు ఫోన్ చేసి తన గురించి, ఐసిస్ గురించి చెప్పాడు. నిజానికి ఒమర్ ఐసిస్ పేరు వాడుకున్నాడు కానీ అతను మతవాది కాదని తండ్రి చెప్పాడు. "కనీసం గడ్డం కూడా పెంచలేదు." అన్నాడతను. ఒమర్ మొదటి భార్య కూడా అతనికి ఇస్లాంపై ఇంట్రస్టు లేదని చెప్పింది. కానీ 2012లో ఒమర్ హజ్‌కి సౌదీ అరేబియా వెళ్లాడని ఓ వార్త వచ్చింది. ఒమర్ పోలీసులతో ఐసిస్ పేరుతో బాటు తను ఐఎస్ఐఎల్ నాయకుడు ఆబూ బకర్ అల్–బాగ్దాదీ శిష్యుణ్ణని చెప్పాడు. మోనెర్ అబూ సల్హా పేరు కూడా చెప్పాడు. వీళ్లతో యితనికి పరిచయాలున్నాయో లేదో కూడా తెలియదు. ఘనంగా వుంటుందని చెప్పివుండవచ్చు. హింసాప్రవృత్తి, గందరగోళం, అసహనం వున్న అమెరికన్ పౌరుణ్ని ఐసిస్ ఐదు పైసల ఖర్చు లేకుండా తన ప్రతినిధిగా మార్చివేయగలిగిందంటే దానికి కారణం అమెరికన్ సమాజంలో నెలకొన్ని పరిస్థితులు అని మనం అర్థం చేసుకోవాలి.

ఈ వాతావరణం మరింత చిక్కబడుతోందనడానికి నిదర్శనం – సంఘటన తర్వాత రిపబ్లికన్ల వ్యాఖ్యలు! ఐసిస్‌కి దీనిలో హస్తం వుందనడానికి ఒమర్ స్టేటుమెంటు తప్ప మరో సాక్ష్యం లేకపోయినా ట్రంప్ 'రాడికల్ ఇస్లామ్ వలన ప్రమాదాల గురించి నేనెప్పుడో చెప్పాను, విన్నారా, ఇప్పటికైనా ముస్లిములు మన దేశానికి వలస రావడాన్ని అరికట్టాలి' అని పిలుపు నిచ్చాడు. రాడికల్ ఇస్లామ్ అనే మాట తన ప్రసంగంలో వాడనందుకు ఒబామా రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేశాడు. అమెరికన్ ముస్లిములకు దీని గురించి ముందే సమాచారమున్నా, అధికారులకు చెప్పలేదంటూ వారిని తప్పుపట్టాడు. ఆ ఆరోపణకు ఆధారమేమిటో అతనికే తెలియాలి. కానీ ఓటర్లలో 40% మంది ట్రంప్ మాటల్ని నమ్మేట్టే వున్నారు. నిజానికి ముస్లిము వ్యతిరేక ప్రసంగాలే అతనికి ఆక్సిజన్‌గా పనిచేస్తున్నాయి. సెప్టెంబరు 11 దాడులు జరిగినప్పుడు న్యూజెర్సీలోని ముస్లిములు వేడుకలు జరుపుకున్నారని అతను ఆరోపించిన తర్వాత అతనికి రిపబ్లికన్ పార్టీ నామినేషన్ వచ్చింది. పారిస్ దాడులు, శాన్ బెర్నార్డినో దాడి జరిగాక అతనికి మద్దతు పెరిగింది. "నన్ను అధ్యక్షుడిగా గెలిపిస్తే అమెరికాకు, దాని స్నేహితులకు, యూరోప్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాల చరిత్ర వున్న దేశాల నుంచి వలసలను ఆపేస్తాను" అని చెప్పుకుంటున్నాడు.

ఐసిస్ కావచ్చు, మరో ఉగ్రవాద సంస్థ కావచ్చు వారి ఉపన్యాసాలతో, ప్రబోధాలతో స్థిరబుద్ధి కల మనుష్యులను మార్చలేరు కానీ సమాజంలో అందరికీ పరిణతి వుండదు. ఆవేశపరులుంటారు. సమాజంలో ఆర్థిక అసమానతలు, రకరకాల వివక్షతలు, జాతిపరమైన కల్లోలం వున్నపుడు చాలామంది సర్దుకుపోయినా, యీ ఆవేశపరులు సంయమనం కోల్పోయి ఐసిస్ వంటి సంస్థలకు ఆయుధాలుగా మారతారు. డాఎఎ జకీర్ నాయక్ విషయమే చూడండి. "నేను శాంతిని బోధిస్తున్నాను. చెడు చేసేవారిని టెర్రరైజ్ చేయమని ముస్లిము యువకులకు బోధించాను తప్ప టెర్రరిజం బోధించలేదు" అంటాడు. కానీ బంగ్లాదేశ్‌లో కొంతమందికి అది మరోలా వినబడింది. అక్కడి సామాజిక పరిస్థితులు దోహదపడ్డాయి. ఉగ్రవాద దాడులు జరిగాయి. ఎందరో మరణించారు. పాపుల పట్ల, దోషుల పట్ల దయ చూపమనీ, వారిని దగ్గరకు తీసుకుని సంస్కరించమనీ ప్రతి మతమూ చెప్తుంది. మరి యీ పెద్దమనిషి వారిని టెర్రరైజ్ చేయమనడం దేనికి? టెర్రర్ పదం వాడడం దేనికి? అతను చాలా తర్కబద్ధంగా చేసిన ఉపన్యాసాలు కూడా నేను విన్నాను. వాటి ద్వారా మనలను మెప్పించి, మధ్యలో యిలా టెర్రర్ వంటి పదాలు చొప్పిస్తే వాటి ప్రభావం ఎలా వుంటుందో బంగ్లాదేశ్ సంఘటన చెప్తోంది. ఇది జకీర్ నాయక్‌కే కాదు, హిందూత్వవాదం పేరుతో అసంబద్ధ ప్రలాపనలు చేస్తున్న సాధ్వీమణులకూ, సాధూమహరాజ్‌లకూ వర్తిస్తుంది. జనాల్లో నూటికి 99 మంది వాటిని పట్టించుకోరు కదాని వూరుకోవడం తప్పు. ఒమర్ వంటి ఒక్కడు తయారైతే చాలు, బీభత్సం సృష్టించడానికి. మన సమాజంలో కూడా ఏదో ఒక మతానికి చెందిన అలాటి వాళ్లు వుండే వుంటారు. అందువలన రెచ్చగొట్టే ప్రసంగాలు చేసేవారిపై కఠిన శిక్షలు వేయాలి. ఆ తర్వాత వారి ప్రసంగాల వేడికి భగ్గుమనని తీరులో సమాజాన్ని సంస్కరించాలి. అసమానతలు, వివక్షతలు తగ్గించి, ఒమర్‌లు తయారవకుండా జాగ్రత్తపడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 13 **ఎమ్బీయస్ : ఓటు కన్నా కలం పోటు గొప్ప...**

కత్తి కన్న కలం గొప్ప అని చిన్నప్పుడు చదువుకున్నాం. హరియాణా రాజ్యసభ ఎన్నికలో ఓటు కన్న కలం.. అట్టే మాట్లాడితే కలంలో సిరా శక్తివంతమైనది అని తేలింది. ఇంకా లోతు కెళితే సిరా రంగు ఫలితాలను తారుమారు చేసేసింది. అయితే ఆ రంగులను తారుమారు చేసినదెవరో తెలియటం లేదు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడానికి నాయకులు చేస్తున్న అనేక వింతలను చూస్తున్నాం. ఇప్పటిదాకా ఎవరూ తొక్కని కొత్త పుంతను హరియాణా అసెంబ్లీ చూపించింది.

హరియాణా అసెంబ్లీలో 90 సీట్లున్నాయి. బిజెపికి 47, లోకదళ్‌కు 20, కాంగ్రెసుకు 17 మంది ఎమ్మెల్యేలున్నారు. తక్కిన ఆరుగురు స్వతంత్రులు. రాజ్యసభ ఎంపీ కావాలంటే అభ్యర్థికి 30 ఓట్లు పడాలి. బిజెపి అధికారికంగా నిలబెట్టి గెలిపించుకున్న అభ్యర్థి బిరేంద్ర సింగ్‌కు 30 ఓట్లు పడ్డాయి. బిజెపి వద్ద అదనంగా 17 వున్నాయి. ఇంకో అభ్యర్థిని నిలబెడితే అవి చాలవు. అందుకని జీ మీడియా వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రను స్వతంత్రుడిగా నిలబెట్టి మద్దతు యిస్తానంది. సుభాష్ ఆరుగురు స్వతంత్రుల మద్దతు కూడా సంపాదించాడు. అలా అయినా 23తో ఆగిపోయింది. అవతల అతనికి ప్రత్యర్థిగా, మరో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడిన ఢిల్లీ లాయరు, మాజీ ఎంపీ అయిన ఆర్ కె ఆనంద్‌కు కాంగ్రెసు, లోకదళ్ మద్దతిస్తున్నాయి. అంటే 37 ఓట్లు అతని వద్ద వున్నాయన్నమాట. జూన్ 11 నాటి ఎన్నికలో ఆనంద్ గెలుపు తథ్యం అనుకుంటూ వుంటే ఘామంతర్ జరిగింది. కళ్లు తెరిచి చూస్తే సుభాష్‌కు 29 ఓట్లు పడి గెలిచాడు, ఆనంద్ కు 21 ఓట్లే వచ్చి ఓడాడు. 37 రావాల్సింది 21 మాత్రమే రావడమేమిటి? 14 ఓట్లు చెల్లవని రిటర్నింగ్ ఆఫీసరు నిర్ణయించాడు. అతన్ని అభ్యర్థిగా నిలబెట్టడం యిష్టం లేని కాంగ్రెసు మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హూడా తన ఓటు ఖాళీగా వుంచేశాడు. మరొకటి ఓటేసిన ఎమ్మెల్యే తన ఓటును మరో ఎమ్మేలేకు చూపించడం చేత తిరస్కరింపబడింది. అలా రెండు ఓట్లు తిరస్కరించగా మిగిలిన 12 ఓట్లు ఒకే ఒక్క సింపుల్ కారణం చేత తిరస్కరించబడ్డాయి. అదేమిటంటే ఓటుపై సంతకం చేసిన ఎమ్మెల్యేలు వయొలెట్ కలర్ యింకు పెన్నుతో బదులు రాయల్ బ్లూ కలరు యింకు పెన్నుతో సంతకాలు పెట్టారు. ఆ 12 చెల్లి వుంటే ఆనంద్‌కు సుభాష్ కంటె 4 ఓట్లు ఎక్కువ వచ్చి గెలిచేవాడు. ఎమ్మెల్యేలు వాళ్ల జేబుల్లో వేరే వేరే రంగుల పెన్నులు పెట్టుకుని

బూతులోకి వెళ్లి సంతకాలు పెట్టలేదు. అక్కడ టేబులు మీద వున్న పెన్నునే వాడారు. మరి ముందు వాళ్ల పెన్నులో వయొలెట్ రంగు వుండి, తర్వాతి వారి పెన్నుల్లో రాయల్ బ్లూ రంగు ఎలా దూరింది? పెన్నులో రంగు మారలేదు, పెన్నులే మారాయి. అలా మార్చినదెవరు?

ఇంకెవరు బిజెపి ఎమ్మెల్యే అసీమ్ గోయలే అంటాడు ఆనంద్. బిజెపి వాళ్లలో కొందరు ఓటేశాక అతను లోపలకి వెళ్లి ఓటేసేటప్పుడు బూతులో టేబులు మీదున్న వయొలెట్ కలరు సిరా వున్న పెన్నును జేబులో పెట్టేసుకుని, అక్కడ రాయల్ బ్లూ కలరు సిరా వున్న పెన్నును పెట్టాడు. అతని తర్వాత వెళ్లిన కాంగ్రెసు సభ్యులు 12 మంది ఆ పెన్నునే వాడారు. సిరా మారుతుందని ఎవరనుకుంటారు? బొత్తిగా ఎరుపు, ఆకుపచ్చ లాటివైతే తేడా కొట్టొచ్చినట్లు తెలుస్తుంది కానీ యీ రెండు రంగులకు తేడా తక్కువే కదా. వాళ్లు ఓటేశాక బిజెపికి, సుభాష్‌కు మద్దతిస్తున్న స్వతంత్ర ఎమ్మెల్యే జయ ప్రకాశ్ ఓటేయడానికి వెళ్లి వయొలెట్ పెన్ను అక్కడ పెట్టేసి రాయల్ బ్లూ పెన్ను జేబులో పెట్టుకుని తెచ్చేశాడు. అందుచేత తర్వాత వచ్చిన వాళ్లందరూ వయొలెట్ పెన్ననే వాడారు. 'కావాలంటే ఎన్నికల ప్రక్రియను రికార్డు చేసిన వీడియో చూడండి. తక్కిన ఎమ్మెల్యే లందరూ ఓటేయడానికి 4– 21 సెకండ్లు తీసుకుంటే అసీమ్ మాత్రం 49 సెకండ్లు తీసుకున్నాడు. అంతేకాదు, పెన్నులు మార్చిన అసీమ్, జయ ప్రకాశ్ యిద్దరూ పాంటు జేబుల్లోకి చేతులు పెట్టుకున్నారు చూడండి." అంటాడు ఆనంద్, ఆ వీడియోను మీడియాకు చూపిస్తూ. "మగవాళ్లు జేబుల్లోకి చేతులు పోనిచ్చి గోక్కోవడం వింతేమీ కాదు" అని కొట్టి పారేశాడు సుభాష్. ఓట్లు లెక్కించేటప్పుడు 'ఓటు మీద సరైన సిరాతో సంతకాలు పెట్టారో లేదో చూడండి' అంటూ అతను ఎన్నికల అధికారిని అడగడం వలన యిదంతా పథకం ప్రకారం సాగిందని అనుమానం కలుగుతోంది.

ఈ పథకంలో రిటర్నింగ్ ఆఫీసరుగా వ్యవహరించిన హరియాణా ఎన్నికల అధికారి రాజేందర్ నందలాల్‌కూడా భాగస్వామే అని మరో అనుమానం బలంగా వుంది. సుభాష్ తరఫున పనిచేసిన అతని లాయరు వికె మోహన్ నందలాల్‌తో ఎన్నికలకు ముందు తరచుగా మాట్లాడాడు. జూన్ 2 నుండి 10 లోగా మొత్తం 24 కాల్స్ చేశాడు. వాటిలో కొన్ని నందలాల్ యింటి దగ్గర వుండగా కూడా చేశాడు. ఆనంద్ కాల్ రికార్డు సంపాదించి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. నందలాల్, సుభాష్ ఆ రికార్డును కొట్టి పారేయలేకపోయారు. "ఎన్నికల ప్రక్రియపై వాళ్ల కేవో అనుమానాలుండి నాకు ఫోన్ చేశారు. వాటిని తీర్చడం నా ధర్మం." అంటాడు నందలాల్. 'తక్కిన అభ్యర్థులు ఆయనకు ఒక్కసారీ కాల్ చేయలేదు. మీరు మాత్రం ఏకంగా అన్నిసార్లు కాల్ చేసేటన్ని సందేహాలేమున్నాయి' అని మీడియా మోహన్‌ను అడిగితే అతను మీడియాతో మాట్లాడడానికి యిచ్చగించలేదు.

ఆనంద్‌కు టిక్కెట్టివ్వడం హూడాకు యిష్టం లేదు. అతను మొండికేస్తున్నాడు కాబట్టి కాంగ్రెసు అధిష్టానం ఆనంద్‌కు ఓటేయమని విప్ జారీ చేసింది. 'రాష్ట్రపతి ఎన్నికలో, రాజ్యసభ ఎన్నికలో అలా విప్ జారీ చేయకూడదు, చట్టవిరుద్ధం' అంటాడు సుభాష్. జూన్ నెలాఖరులో ఎన్నికల కమిషన్ సుభాష్‌ను పిలిచి విచారించింది. అతను "17 మంది కాంగ్రెసు ఎమ్మెల్యేలలో 15 మంది ఆనంద్‌కు ఓటేయడానికి యిష్టపడలేదు." అన్నాడు. వాళ్లు హూడా మనుష్యులు కావచ్చు. చట్టం ఎలా వున్నా అధిష్టానం మాట కాకుండా తన మాట చెల్లడానికి హూడా కూడా బిజెపితో, సుభాష్‌తో చేతులు కలిపి వుండవచ్చని ఒక అంచనా. ఏది ఏమైనా ఈ ఘటన తర్వాత కాంగ్రెసు మేల్కొంది. అధిష్టానంతో ప్రమేయం లేకుండా రాష్ట్ర యూనిట్లు తలెగరేస్తూండడం ఎట్టకేలకు గుర్తించి, 2015 ఆగస్టు తర్వాత యిన్నాళ్లకు ఓ సమావేశం ఏర్పాటు చేసి కోఆర్డినేషన్ కమిటీ ఏర్పరచింది. సుభాష్ ఎన్నికను ఎన్నికల కమిషన్ గుర్తిస్తుందో లేదో త్వరలోనే తెలిసిపోతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 14 – 16 ఎమ్బీయస్ : సినీమూలం – అల్లూరి సీతారామరాజు నవల – సినిమా

తెలుగునాట స్వాతంత్ర్యయోధుల్లో అల్లూరి సీతారామరాజుకి ఒక ప్రత్యేకస్థానం వుంది. మన్యప్రాంతపు ప్రజలు ఎలా దోపిడీకి గురవుతున్నారో గమనించి వారిని విప్లవమార్గం పట్టించి, ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని రెండేళ్లపాటు గడగడలాడించిన వీరుడాయన. అహింసామార్గాన స్వాతంత్ర్యానికై పోరాడిన వారెందరున్నా వారెవ్వరూ ప్రజాభిమానంలో సీతారామరాజుకు సాటి రారు. ఆయనమీద అనేక పుస్తకాలు, నాటకాలు, బుర్రకథలు వచ్చాయి. కానీ సినిమా తీయడం చాలా ఆలస్యమైంది. దానికి ఓ కారణం వుంది. సాధారణంగా విప్లవవీరులు అజ్ఞాతజీవితం గడుపుతారు. తమవాళ్లకు హాని కలగకుండా పుట్టుపూర్వోత్తరాలు దాస్తారు. శత్రువులలో అడలు పుట్టించేందుకు రకరకాల కట్టుకథలను ప్రచారంలో పెడతారు. 95 యేళ్ల క్రితం, మన్యప్రాంతంలో సమాచారసాధనాలు సరిగ్గా లేని రోజుల్లో పరిస్థితులు ఎలా వుండేవో వూహించండి. అందువలన అల్లూరి గురించి అనేక ఊహాపోహలు పుట్టుకుని వచ్చాయి. ఆయనకు అతీంద్రియ శక్తులున్నాయని, క్షణంలో పులిలా మారిపోగలడనీ.. యిలా.

వీటి ఆధారంగా సినిమా తీస్తే హాస్యాస్పదంగా వుంటుంది. ఐతిహ్యంలో వున్నది తీయకపోతే జనాలు ఆమోదించకపోవచ్చు. మామూలు కథలా తీస్తే డాక్యుమెంటరీలా తయారవుతుంది. కమ్మర్షియల్ ఎలిమెంట్స్ వుండకపోతే సినిమా విఫలం కావచ్చు. అల్లూరిపై పడాల రామారావుగారు రాసిన ఓ ప్రఖ్యాత నవల "ఆంధ్రశ్రీ" ఆధారంగా ఎన్‌టి రామారావుగారు సినిమా తీద్దామనుకుని ఈ తర్జనభర్జనలతోనే తాత్సారం చేశారు. కృష్ణగారు సాహసంగా ముందుకు వచ్చారు. మహారథిచే కథ రాయించి సినిమా తీశారు. సినిమా హిట్ అయింది కానీ సినిమాకోసం వాస్తవాలు తారుమారు మార్చేశారని చాలా విమర్శలు వచ్చాయి. వాస్తవాలతో వచ్చిన

ఒక పుస్తకాన్ని యీ సినిమాతో పోల్చి చూసి నిజానిజాలు తెలుసుకుందాం. పుస్తకం పేరు 'విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు' రచన డికె ప్రభాకర్.

సినిమాలో ఓపెనింగ్ షాట్‌లోనే అల్లూరి ఆధ్యాత్మిక చింతనను చూపించారు. నిజజీవితంలో కూడా ఆయన ఆయన యోగి అవుదామనుకున్నాడు. సన్యాసం తీసుకున్నాడుకూడా. వ్యాయామం, యోగాభ్యాసం చేసేవాడు. విప్లవవీరుడు అవుదామనుకోలేదు. చిన్నప్పుడే ఇంగ్లీషువారి చదువులు చదవను అంటూ చదువు మానేసినట్లు సినిమాలో చూపించారు కానీ నిజానికి అంత చిన్నవయసులో చదువు మానేయలేదు. వాళ్ల పినతండ్రి మేజిస్ట్రేట్. తన వద్ద పెట్టుకుని, తను బదిలీ అయినచోటకల్లా తిప్పుతూ చదివించాడు. అనేక వూళ్లలో యీయన చదువు సాగింది. చివరకు టెన్త్ క్లాస్ వద్ద చదువు ఆగింది. భరతమాత ఫోటో ముందు నిలబడి వందేమాతరం అంటూ నినదిస్తూ వుండగా అల్లూరి పెద్దవాడైనట్లు చూపించి సినిమాలో లాంగ్ జంప్ చేశారు. ఎక్కడా తారీకులు యివ్వలేదు. మనం చెప్పుకుందాం. అల్లూరి 1897లో జులై 4 పుట్టారు. ఒక చెల్లి, ఒక తమ్ముడు వున్నారు. తండ్రి రాజమండ్రిలో ఫోటోగ్రాఫర్. అల్లూరికి 11 యేళ్ల వయసు వుండగా ఆయన కలరా తగిలి పోయారు. కుటుంబం కష్టాల్లో పడింది. అల్లూరిలో వైరాగ్య చింతన పెరిగింది. స్కూల్లో చదివేరోజుల్లో కూడా ఒంటరిగా వుండేవాడు. తునిలో చదివేటప్పుడు అరణ్యాలలోకి వెళ్లి అక్కడే కూచునేవాడు. స్కూలుకి వచ్చేవాడు కాదు. తుని స్కూలు హెడ్‌మాస్టర్ ఓ సారి దండించాడు. దాంతో యీయనకు కోపం వచ్చి స్కూలు మానేసి, తపస్సు చేసుకోవడానికి వెళ్లిపోయాడు. స్కూలు మానేశాడు కానీ విద్యాభ్యాసం మానలేదు. వారాలు చేసుకుని సంస్కృతం నేర్చుకున్నాడు. మంత్రశాస్త్రం, జ్యోతిష్యం నేర్చుకున్నాడు.

సినిమాలో సీతారామరాజు ఒకసారి దేశయాత్ర చేసినట్టు చూపించారు. కానీ ఆయన రెండు, మూడుసార్లు చేశారు. 1916లో కాలినడకన కలకత్తా వెళ్లారు. సురేంద్రనాథ్ బెనర్జీ అతిథిగా వున్నారు. లక్నో కాంగ్రెస్ సభకు హాజరయ్యారు. హిమాలయాలు తిరిగారు. బ్రహ్మకపాలంలో సన్యాసదీక్ష స్వీకరించారు. చెల్లెలి పెళ్లికి కూడా రాలేదు. తిరిగి తిరిగి విశాఖపట్టణం జిల్లాలోని కృష్ణదేవుపేటలో ఆశ్రమం కట్టుకుని నివసించసాగారు. ఇది 1917 నవంబరులో! అప్పుడే ఆ జిల్లాలోని మన్యప్రాంత ప్రజల కష్టాలు అర్థం చేసుకున్నారు. మళ్లీ 1918లో దేశయాత్ర. 1919లో యింటి బాధ్యత చెల్లి భర్తకు వప్పగించి ప్రజాసేవకు వెళ్లిపోదామని అనుకున్నారు. ఇలా అప్పగించే ఘట్టం దగ్గరకు సినిమా లాంగ్ జంప్ చేసింది. ఆ తర్వాత ఏజన్సీ ప్రజల అవస్థలను సినిమాలో యథాతథంగా చూపించారు.

1920లో చింతపల్లి తాలూకాకు తాసిల్దారుగా వున్నవాడు బాస్టియన్ (త్యాగరాజు). క్రూరుడు. లంచగొండి. ప్రభుత్వం నర్సీపట్నం నుండి అతను వుండే గ్రామం లంబసింగి వరకు ఘాట్ రోడ్డు వేసేందుకు సొమ్ము మంజూరు చేసింది. ఆ కాంట్రాక్టులో వీలైనంత తినేద్దామని యితని తాపత్రయం. అతని వద్దనున్న ఓవర్సీరు సంతానం పిళ్లె (కెవి చలం) మరో దుర్మార్గుడు. ఆరణాల కూలీ యిస్తున్నామని లెక్కలు రాసి కూలీలకు ఆరుకానులు యిచ్చేవారు. రైతులమీద అన్యాయంగా కేసులు పెట్టేవాడు. అదే తాలూకాలో వున్న గంటం దొర – గుమ్మడి, అతని తమ్ముడు మల్లు దొర – ప్రభాకరరెడ్డిని అబద్ధపు సాక్ష్యాలు చెప్పమనేవాడు. వాళ్లు వినేవారు కారు. దాంతో గంటందొరను మునసబుగిరీనుండి తొలగించాడు బాస్టియన్.

కాంతారావు వేసిన పాత్ర పడాలు. సినిమాలో గుమ్మడి వద్ద భూములు లాక్కుని యితనికి యిచ్చినట్టు చూపించారు. నిజానికి అతను రోడ్డు కాంట్రాక్టు ఒప్పుకుని బాస్టియన్‌కు అడ్వాన్సు యిచ్చి మోసపోయాడు. అది తిరిగి యిమ్మనమని పేచీ పెట్టుకుని బాస్టియన్‌కు దూరమయ్యాడు, గంటం దొరకు దగ్గరయ్యాడు. ఈ దశలో అల్లూరి వచ్చి పడాలుకి, గంటం దొరకు యిద్దరికీ నచ్చచెప్పినట్టు చూపించారు. నిజానికి ఆయన వీటితో సరిపెట్టలేదు. బాస్టియన్ దురాగతాల గురించి ప్రభుత్వానికి పిటిషన్ పెట్టాడు. ప్రభుత్వం బాస్టియన్‌పై చర్య తీసుకొనకపోగా అల్లూరిపై సెక్యూరిటీ కేసు పెట్టింది. ఇవి సినిమాలో లేవు.

సినిమాలో యిక్కడ విజయనిర్మల వేసిన సీత పాత్ర గురించి ఎపిసోడ్ పెట్టారు. ఆయన సన్యాసి అనీ, ప్రేమజోలికి పోలేదని కొందరంటారు. కాదు, 16 వ యేట వేరే కులానికి చెందిన సీత అనే అమ్మాయిని ప్రేమించి భగ్నహృదయుడయ్యాడని అంటారు. సినిమాలో మాత్రం సీత కుటుంబం కూడా వారి వివాహానికి సమ్మతించిందని చూపించారు. అయితే అల్లూరి మాత్రం దేశమంతా పర్యటించి కార్తీక పౌర్ణమినాడు వస్తానని చెప్తాడు. ఆమె వేచిచూస్తుంది. చివరకు అనుకున్నరోజున వచ్చి దేశంకోసం నా జీవితాన్ని బలిపెడుతున్నాను కాబట్టి వివాహం కుదరదంటాడు.హతాశురాలైన విజయనిర్మల యింట్లో వాళ్లు కుదిర్చిన పెళ్లికి వొప్పుకుని, పెళ్లిపీటల మీదనే ప్రాణాలు విడుస్తుంది. ఆమె శవం దగ్గర కృష్ణ 'నువ్వు నా గుండెల్లో వుంటావు, ఇకపై నా పేరు సీతారామరాజు' అన్నట్టు చూపించారు.

అల్లూరి పూర్తిపేరు అల్లూరి శ్రీరామరాజు. 1922లో అంటే మరణించడానికి ఒక ఏడాది ముందు రాసిన ఆయన వుత్తరంలో సంతకం చేసినప్పుడు కూడా ఆయన శ్రీ అల్లూరి శ్రీరామరాజు అనే రాసుకున్నాడు కానీ వేరేలా రాసుకోలేదు. కానీ ప్రజలంతా తర్వాతి కాలంలో సీతారామరాజు అని వ్యవహరించినట్టుంది. శ్రీరామరాజు అనలేక సీతారామరాజు అన్నారేమో! దాంతో యిలాటి కథలు పుట్టుకుని వచ్చాయి. ఆయన అంతకుముందే చేసిన దేశపర్యాటన ఘట్టాలను కార్తీక పౌర్ణమి గడువులోపున చేసినట్టు మార్చారు. సినిమాలో దేశాటన సందర్భంగా ఆయన ఒక సర్దార్జీతో చర్చలు జరిపినట్లు చూపారు కానీ సర్దార్జీ పేరు చెప్పలేదు. ఆయన గదర్ పార్టీ వీరుడు పృథ్వీసింగ్ ఆజాద్. ఆయన్ని అల్లూరి 1916 లో కలిసారు. అదేవిధంగా సినిమాలో వైజాగ్ కాంగ్రెస్ సభలో అల్లూరి

వేదికమీదకు వెళ్లి గాంధీ విధానాలను వ్యతిరేకిస్తూ వుపన్యసించినట్టు చూపించారు. దానికి ఆధారాలు లేవు. విప్లవం ప్రారంభమయ్యాక 1923 ఏప్రియల్‌లో అన్నవరంలో ఆంధ్రపత్రిక విలేకరికి తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఇంటర్వ్యూ యిస్తూ గాంధీజీ సత్యాగ్రహ విధానాలపై తనకు నమ్మకం లేదని అల్లూరి ప్రకటించారు.

ఒక యోగిగా అడవిప్రాంతం ప్రజల్లో ఐక్యతకోసం ప్రయత్నించిన అల్లూరి ఆయుధాలతో అవతరించడం సినిమాలో డ్రమటిక్‌గా చూపించారు. లేబర్ ఎక్స్‌ప్లాయిటేషన్ అవుతూండగా హీరో ప్రత్యక్షమవుతాడు. వాస్తవానికి ఆయన గంటందొర చేత వైజాగ్ కలక్టర్‌కు పిటిషన్ పెట్టిస్తే కలక్టర్ బాస్టియన్‌ను పిలిచి మందలించాడు. అప్పుడు బాస్టియన్‌కు అల్లూరిపై కోపం వచ్చింది. పైగా అల్లూరి అడవిలో కట్టెలు కొట్టించి శాసనోల్లంఘన చేయించాడు. దాంతో బాస్టియన్ కసిపెట్టుకుని మన్యంలో అల్లూరి విప్లవం లేవనెత్తుతున్నాడని పై అధికారులకు రిపోర్టు రాసి పంపాడు. అప్పుడు అల్లూరిని అరెస్టు చేసి నర్సీపట్నంలో నిర్బంధవాసంలో వుంచారు. అప్పట్లో పోలవరం డిప్యూటీ కలక్టర్ ఫజులుల్లాఖాన్ అని అల్లూరి తండ్రి స్నేహితుడు వుండేవాడు. ఆయన యీయన్ని విడిపించి అడ్డతీగెల వద్ద 30 యెకరాల భూమి యిప్పించి తల్లితో సహా ప్రవాసంలో వుండమన్నాడు. పోలీసుల నిఘా మాత్రం వుండేది. అక్కడ వుంటూ అల్లూరి బాణవిద్య, కత్తిసాము నేర్చుకున్నారు. కొన్ని నెలలు యిలా గడిచాక తాను యోగిని కాబట్టి నేపాలు వెళ్లి తపస్సు చేసుకుంటానని అర్జీ పెట్టి 1922 జూన్‌లో విడుదలయ్యాడు. నేపాలు వెళ్లకుండా మళ్లీ మన్యానికి వచ్చి విప్లవం మొదలుపెట్టాడు. ఇవన్నీ సినిమాలో చూపలేదు.

సినిమాలో కృష్ణను చూసి అల్లూరి అంత పొడుగ్గా వుంటాడనుకోకూడదు. అసలు అల్లూరి ఎత్తు 5 అడుగుల 4 అంగుళాలు. విప్లవవీరుడిగా హీరో సినిమా మొత్తం రాముడి గెటప్‌లో తిరుగుతాడు కానీ నిజమైన అల్లూరి అలా తిరగలేదు. విప్లవకారుడెప్పుడూ ప్రత్యేక వేషధారణలో తిరగడు. ఆయన ఎవరూ గుర్తు పట్టకుండా, అతి సామాన్యంగా అక్కడి వాళ్లలో ఒకడిలా కనబడేవాడు. సైనికులు ఒకసారి ఆయన్ని కూలీ అనుకుని సామాన్లు కూడా మోయించారు. అల్లూరి ఏజన్సీ ప్రజల్లో తాగుడు మాన్పించాడు. కులాలమధ్య సఖ్యత సాధించాడు. అది బాస్టియన్‌కు రుచించలేదు. సినిమాలో త్యాగరాజు కులాల మధ్య పోట్లాట పెట్టించినట్లు చూపారు. శాసనోల్లంఘన ఘట్టాన్ని సినిమాలో యీ స్టేజిలో చూపించారు. దీని కారణంగా ఏజన్సీ కమీషనర్ హేపెల్ – పాత్రధారి పేకేటి – రామరాజును ఎరెస్టు చేసి తీసుకెళ్లడానికి ప్రయత్నించి భంగపడినట్టు కల్పించారు. అదే సందర్భంలో గెరిల్లా యుద్ధంలో అల్లూరి డెవలప్ చేసిన గూఢచారి వ్యవస్థ, సిగ్నలింగ్ వ్యవస్థ కూడా చూపించారు.

అగ్గిరాజును ఉరినుండి తప్పించడంతో విప్లవానికి నాంది పలికారని అన్నారు. నిజానికి అగ్గిరాజు విప్లవం మలిదశలో రామరాజు వద్దకు వచ్చాడు. సినిమాలో చూపిన ఉరి ఘట్టానికి చారిత్రక ఆధారాలు లేవు. అల్లూరికి మూలికావైద్యం తెలుసున్న సంగతిని కృష్ణ గుమ్మడి భుజంలోంచి గుండు తీసేయడం ద్వారా చూపించారు. ఆయన తుపాకీ పేల్చడంలో కూడా శిక్షణ పొందాడు. సైనికులను ఎదిరించాలంటే తుపాకులు కావాలి. దానికోసం పోలీసు స్టేషన్లపై పడి ఆయుధాలు దోచుకోవాలని తీర్మానించాడు. 1922 ఆగస్టు 22తో విప్లవం ప్రారంభమైందనవచ్చు. ఆనాడు చింతపల్లి పోలీసు స్టేషన్ దోచుకున్నారు. ఆయుధాలు తీసుకుపోతూ రికార్డులో రాసి సంతకం పెట్టాడు అల్లూరి. ప్రజల మీద పెట్టిన దొంగకేసుల కాగితాలు చింపేశాడు. మర్నాడే కృష్ణదేవు పేట పోలీసు స్టేషన్‌పై దాడి. ఆ మర్నాడే రాజవొమ్మంగి పోలీసు స్టేషన్‌పై దాడి. ఇవన్నీ సినిమాలో చూపిస్తూ రాజవొమ్మంగిలో యిన్‌స్పెక్టరుగా రాజబాబును పెట్టి హాస్యఘట్టం కల్పించారు. అక్కడ వీరయ్యదొర విడిపించబడ్డాడు. రామరాజు కంటె ముందే జరిగిన లాగరాయి పితూరీ అతను లేవనెత్తినదే.

దీని తర్వాత 11 రోజుల పాటు చిన్న చిన్న దాడులు జరిగాయి. ఈ దాడులతో అధికారుల బెంబేలెత్తిపోయారు. రిజర్వు పోలీసులను దింపారు. జిల్లా కలక్టర్ డ్రేకన్, జిల్లా సూపర్నెంట్ నర్సీపట్నం చేరుకుని ట్రెమన్ హెూర్ అనే అతన్ని రామరాజుతో ముఖాముఖీ తలపడమన్నారు. ఆ యుద్ధంలో విప్లవవీరులదే విజయం. మరో 14 రోజులకు టాల్బర్ట్ ను కూడా ఓడించారు. దాంతో జాన్ అనే సైన్యాధికారి రెండు గ్రామాల ప్రజలను హింసించి వూళ్లు తగలబెట్టాడు. ఇవి సినిమాలో చూపలేదు. ప్రభుత్వం అసిస్టెంటు సూపర్నెంట్స్‌గా కవర్డు, హైటర్ అనే యిద్దర్ని దింపడం (జగ్గారావు, ఆనందమోహన్) చూపించారు. వీళ్లు అక్రమాలు చేసినట్టు చూపించారు. సినిమాలో వాళ్లు చిన్నపిల్లాణ్ని చంపుతారు. వాళ్లను విప్లవవీరులు పట్టుకుని చంపేశారు. ఇది 1922 సెప్టెంబరు 24 న జరిగింది. బ్రిటిష్‌వాళ్లు వచ్చి శవాలు పట్టుకెళ్లారు. వాళ్ల వద్ద 500 రూ.ల సుంకం కట్టించుకున్నట్టు సినిమాలో కల్పించారు.

సినిమాలో యిక్కడ రూథర్‌ఫర్డ్ – జగ్గయ్య వేసిన పాత్ర – కలక్టరుగా వచ్చినట్టు చూపించారు. అతనికి అన్ని వ్యవహారాలపై అవగాహన వున్నట్టు, అల్లూరి రామరాజంటే గౌరవం కూడా వున్నట్టు, ముఖాముఖీ సమావేశాలలో అతన్ని మెచ్చుకున్నట్టు, అయినా ప్రభుత్వాధికారి కావడం చేత రామరాజును చంపించినట్టు సినిమాలో చూపించారు. కానీ వాస్తవం ఏమిటంటే రూథర్‌ఫర్డ్, రామరాజు ఎన్నడూ ఎదురుపడలేదు. అతను పలనాడు ప్రాంతానికి కలక్టర్‌గా వుండేవాడు. విప్లవం ఆఖరిదశలో – అంటే 1923 సంవత్సరాంతంలో – సినిమా ప్రకారమైతే ప్రభాకరరెడ్డి పట్టుబడిన తర్వాత – మన్యానికి వచ్చాడు. రామరాజు అనుచరగణం తగ్గిపోయాక, గ్రామాలను బూడిద చేసి, ప్రజలను భయభ్రాంతులను చేసి, కష్టాలపాలు చేసి వారికోసం రామరాజు తనంతట తానే లొంగిపోయేట్లా చేశాడు. సినిమాలో మాత్రం రూథర్‌ఫర్డ్ మన్యానికి ప్రత్యక్షంగా వచ్చి లంచగొండితనమే, వెట్టిచాకిరియే విప్లవానికి మూలకారణమని గ్రహించినట్టు చూపించారు. కమ్యూనికేషన్ వ్యవస్థ సరిగ్గా లేదు కాబట్టే ఓ స్టేషన్‌పై దాడి మరొకదానికి చేరడంలో ఆలస్యమవుతున్నట్టు గ్రహించి

టెలిఫోన్ తీగలు పెట్టించాడని చూపించారు. సంస్థానాధీశులనుండి సైనికులకు ఆహారపదార్థాలు తెప్పించాడని చూపించారు. నిజానికి ఇవన్నీ డ్రేకన్ కలక్టరుగా వుండగా జరిగినవి.

రామరాజు టెలిఫోన్ స్తంభాలను పీకించివేశాడు. ఆ సందర్భంలోనే సినిమాలో మల్లుదొర తాగుడు వ్యసనం వలన ఓ కోయవాడు పట్టుబడ్డట్టు, దానిపై అగ్గిరాజుకూ, అతనికీ కొట్లాట జరిగినట్లు చూపించారు. కోయదొర శవాన్ని వూరేగించడంతో ప్రజల్లో ధైర్యం సన్నగిల్లింది. వారిలో ధైర్యం తిరిగి రగిలించడానికి అల్లూరి 1922 అక్టోబరులో రెండు స్టేషన్‌లలో ముందుగా చెప్పి ఒకేసారి దాడి చేశాడు. రెండు చోట్లా రికార్డులలో అల్లూరి సంతకాలున్నాయి. దానితో ఆయనకు ఏకకాలంలో రెండు చోట్ల వుండగల అతీంద్రియశక్తులున్నాయన్న ప్రచారం జరిగింది. దాంతో ఆ ప్రాంతాల్లో అల్లూరి రామరాజు పేరు మారుమ్రోగింది. ఆ ఘట్టం తర్వాతనే తెలుగువీర లేవరా పాట పెట్టారు సినిమాలో. విప్లవసైన్యాలకు తొలి అపజయం 1922 డిసెంబరు 6 న సంభవించింది. 14 మంది విప్లవవీరులు మరణించారు. ప్రభుత్వం అల్లూరిని పట్టిచ్చినవారికి పదివేల రూఎఎలు బహుమానం ప్రకటించింది. విప్లవం చల్లారిందని అందరూ అనుకునే సమయంలో అల్లూరి హఠాత్తుగా 1923 ఏప్రిల్‌లో అన్నవరంలో ప్రత్యక్షమయ్యాడు. ప్రజలు ఘనసన్మానం చేశారు. ఈ ట్రిప్ తర్వాతనే అగ్గిరాజు అల్లూరి బృందంలో చేరాడు నిజానికి. అల్లూరి వచ్చి వెళ్లాక కలక్టర్ వచ్చి ఆ వూరిపై 4000 రూ.ల అదనపు పన్ను వేశాడు – ఆతిథ్యం యిచ్చినందుకు!

శంఖవరంలో వున్నాను రమ్మనమని అల్లూరి కలక్టర్‌కు కబురు పంపాడు. కలక్టర్ డ్రేగన్ భయపడి వెళ్లలేదు. ఇక్కడ సినిమాలో ఓ ఘట్టం కల్పించారు. డ్రేగన్‌కు బదులు రూథర్‌ఫర్డ్ (జగ్గయ్య) కలక్టరుగా వున్నట్లు, అల్లూరికి కబురు పెట్టి రప్పించి బ్రిటిషు పతాకానికి వందనం చేయమన్నట్లు చూపారు. కృష్ణ నిరాకరిస్తే చుట్టూ సైన్యం వున్నారు చూడు అని జగ్గయ్య అంటాడు, లుకప్ వన్స్ అని కృష్ణ అంటాడు, పైకి చూస్తే చెట్ల మీద విప్లవసైనికులు బాణాలు ఎక్కుపెట్టి రెడీగా వుంటారు. గత్యంతరం లేక జగ్గయ్య కృష్ణను వెళ్లిపోనిస్తాడు. అన్నవరం సత్కారం తర్వాత అల్లూరి 6 నెలల వరకు వేర్వేరు ప్రాంతాల్లో తిరుగుతూ వచ్చారు. సెప్టెంబరులో ఆయన ముఖ్య అనుచరుడు మల్లుదొర (ప్రభాకరరెడ్డి) పట్టుబడడం ఉద్యమానికి దెబ్బే. మల్లుదొరకున్న తాగుడు, వ్యభిచారం కారణంగా రామరాజు అతన్ని తన సైన్యంలోనుండి తప్పించాడు. అది తెలిసి సైనికులు అతన్ని ఉంపుడుగత్తె యింట్లో బంధించారు. బంధించాక సినిమాలో జగ్గయ్య అతన్ని కృష్ణ ఆచూకీ చెప్పమని నిర్బంధిస్తాడు. అయినా అతను నోరు విప్పడు. ఇతని గతి తర్వాత ఏమైందో సినిమాలో చూపించలేదు కానీ వాస్తవానికి యితన్ని వైజాగ్ జైల్లో వేశారు. ఉరిశిక్ష వేసి చివరకు యావజ్జీవ కారాగార శిక్షగా మార్చి ప్రవాసానికి తరలించారు. స్వాతంత్ర్యానంతరం విడుదల అయ్యాడు. చాలాకాలం బతికాడు.

వాస్తవానికి రూథర్‌ఫర్డ్ యీ సమయానికి కలక్టర్‌గా వచ్చాడు. మన్యప్రాంతాన్ని దిగ్బంధం చేయించాడు. ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. అల్లూరి లొంగిపోదామనుకున్నాడు కానీ అనుచరులు వద్దన్నారు. 1924 మేలో కొండపల్లిలో వుండగా సైనికులు దాడి చేశారు. అగ్గిరాజు (బాలయ్య) పోరాడి పోరాడి మందుగుండు అయిపోయాక సినిమాలో చూపినట్టే బావిలో దుమికాడు. సినిమాలో చూపలేదు కానీ నిజానికి ఆ బావిలోనే అతను ప్రాణాలతో పట్టుబడ్డాడు. అండమాను దీవులకు పంపబడ్డాడు.

జగ్గయ్య ప్రజలను టార్చర్ చేయమని అదేశాలిచ్చినట్లు సినిమాలో చూపిన ఘట్టానికి మూలం వుంది. రూథర్‌ఫర్డు కృష్ణదేవుపేటలో సభ పెట్టి గ్రామాధికారులందరినీ హెచ్చరించాడు – రామరాజుకి సహాయం చేస్తే వారిని శిక్షించడంతో బాటు గ్రామాలను నాశనం చేస్తానని! విప్లవం అణచడానికి ప్రభుత్వం చేపట్టిన దమనకాండ చూసి తల్లడిల్లి యిక విప్లవం కట్టిపెట్టే సమయం ఆసన్నమైందని అల్లూరి గుర్తించాడు. ఆయన లాజిక్‌ను సినిమాలో చక్కగా చూపించారు – హీరోకూ, తల్లికీ మధ్య జరిగిన సంభాషణ ద్వారా! తల్లి అతని శిబిరానికి వచ్చి ఉద్యమాన్ని సమర్థించినట్లు సినిమాలో చూపారు. వాస్తవానికి తల్లి విప్లవ సమయంలో వచ్చి అల్లూరిని కలిసిందనడానికి దాఖలాలు లేవు. ఆవిడ 1952 వరకు బతికారు. స్వాతంత్ర్యం రావడం చూశారు.

1924 మే 7 న అల్లూరి యేటి ఒడ్డున కూర్చుని ఒక కోయవాడి ద్వారా పోలీసులకు కబురంపాడు. వాళ్లు వచ్చి కొయ్యూరుకు తీసుకెళ్లారు. అక్కడ గుడాల్ వున్నాడు. గుడాల్‌కు, అల్లూరికి మధ్య వాగ్వివాదం జరిగింది. దాంతో గుడాల్‌కు కోపం వచ్చింది. గొలుసులతో చెట్టుకు కట్టించి రివాల్వర్‌తో కాల్చి శరీరాన్ని తూట్లు తూట్లుగా చేశాడు. చనిపోయే ముందు కూడా అల్లూరి బెదరలేదు. పై అధికారులకు తెలియబరచకుండా తనని చంపే అధికారం గుడాల్‌కు లేదని వాదించాడు. గుడాల్ తుపాకీగుళ్లకు 27 సంఎఎల వయస్సులో అల్లూరి నేలకొరిగాడు. మర్నాడు రూథర్‌ఫర్డ్, యితర అధికార్లు వచ్చారు. తమకు చెప్పకుండా యింత పనిచేసినందుకు రూథర్‌ఫర్డ్ గుడాల్‌ను తిట్టి, ఇలా చంపినట్టు బయటకు వస్తే బ్రిటిష్ సర్కారుకి అవమానమని, పారిపోతూ వుంటే కాల్చామని స్టేటుమెంటు యిప్పించాడు. సినిమాలో దీన్ని అత్యంత నాటకీయంగా చూపించారు. రూథర్‌ఫర్డ్, అల్లూరి ముఖాముఖీ తలపడినట్లు, బ్రిటిషు సామ్రాజ్యవాదాన్ని కలక్టరు వినిపిస్తే, స్వాతంత్రేచ్ఛను అల్లూరి వినిపించినట్లు చూపించారు. రూథర్‌ఫర్డ్ తన కిష్టం లేకపోయినా అల్లూరిని చంపమని గుడాల్‌కు ఆర్డరు యిచ్చి ఫర్‌గివ్‌మీ లార్డ్ అంటూ దేవుణ్ని వేడుకున్నట్టు, గుడాల్ నిర్దయగా ఒక్కో భాగాన్ని కాలుస్తూ వుంటే అల్లూరి వందేమాతరం అంటూ నేలకొరిగినట్లు చూపించారు.

రామరాజు పోయిన తర్వాత మరొక దాడిలో గంటందొర కూడా పోయాడు. ఆ విధంగా 1922 ఆగస్టులో ప్రారంభమైన మన్యం పితూరీ (దాన్ని విప్లవం లేదా తిరుగుబాటు అని బ్రిటిషువారు పేర్కొనలేదు. కేవలం పితూరీ అన్నారంతే, భారీ తారాగణంతో, సినిమా స్కోప్‌లో తీయడం చేత పెద్ద విప్లవం జరిగిందనే అభిప్రాయం మనకు కలుగుతుంది) రెండేళ్లలోనే ముగిసిపోయింది. ఇది రెండు

జిల్లాలలోని కొన్ని తాలూకాలకే పరిమితమైనా, అల్లూరి ముఖ్య అనుచరులు కేవలం 90 మందే అయినా, దీని ప్రభావం తెలుగు ప్రజలపై ప్రగాఢంగా పడింది. అల్లూరికి తన లక్ష్యం తెలుసు, పరిమితులు తెలుసు. జాతిని జాగృతం చేయడానికి, అడవిప్రాంతాల్లో దోపిడీని చాటి చెప్పడానికి ఆత్మత్యాగం చేసిన ఘనుడాయన. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 22 **ఎమ్బీయస్ ః పట్టిసీమ జలాలు పుష్కరాలను ముంచుతాయా?**

కృష్ణాపుష్కరాల గురించి ధర్మశాస్త్ర వివాదం ఒకటి తలెత్తింది. కృష్ణ ఆంధ్ర రాష్ట్రంలోకి ప్రవేశించి కొద్ది దూరం వెళ్లాక గోదావరి జలాలు కలుపుతున్నారు కాబట్టి, పుష్కర పవిత్రత దెబ్బతింటుందన్న అనుమానం ప్రకటించారు కొందరు పండితులు. కృష్ణలో గోదావరి జలాలు కలిసినంత మాత్రాన అది కృష్ణ కాకుండా పోతుందా, పుష్కరసమయంలో అవి పుష్కర జలాలు కాకుండా పోతాయా అని కొందరు కొట్టిపారేస్తున్నారు. యమునానది యమునోత్రిలో పుట్టి 1376 కి.మీ.లు పయనించి సముద్రం దాకా వెళ్లకుండా త్రివేణీ సంగమం దగ్గర గంగలో కలిసిపోతుంది. ఇక ఆ పైన దానికి అస్తిత్వం లేదు. మొత్తమంతా గంగ అయిపోతుంది. గంగ బెంగాల్‌లో బంగాళాఖాతంలో కలుస్తుంది. ప్రవహించినంత మేర యమున యమునే. ఇక్కడి పరిస్థితి అలాటిది కాదు, కృష్ణ ఉనికి వేరే, గోదావరి ఉనికి వేరే, అవి సముద్రంలో కలిసే చోట్లు వేర్వేరే. గోదావరి నీళ్లు కాలువల ద్వారా ప్రవహింపచేసి ఒక ప్రదేశంలో కృష్ణలో కలుపుతున్నారంతే. ఆ నీళ్లు వచ్చి కలవడం వలన కృష్ణ నీళ్లు పలుచనై పోయి, దాని పవిత్రత 'నీరు'కారుతుందా? అని ప్రశ్న.

ఇప్పటిదాకా యిలాటి ప్రశ్న ఎవరూ వేసి వుండరు. ఇప్పుడు పండితులు కూర్చుని తేల్చాలి. కాశీ వెళ్లినవాళ్లు గంగాజలం తెచ్చి గంగ చెంబుల్ని పంచుతూంటారు. వాటిని పూజామందిరాల్లో పెట్టుకుంటూంటారు. రాగి చెంబుల్లో గంగ నీరు పోసి సీల్ చేసి వుంటాయవి. పది కుటుంబాలకు యివ్వాలంటే పది చెంబులు తెస్తారు తప్ప ఒక్క చెంబు పట్టుకుని వచ్చి పది మినరల్ వాటర్ బాటిళ్లల్లో తలో చుక్క గంగనీళ్లు పోసి యివ్వరు. తక్కిన నీళ్లల్లో కలిస్తే గంగ ప్రభావం డైల్యూట్ అయిపోతుందనే ఫీలింగు కాబోలు. నిజంగా గంగ నీళ్లకు అంత శక్తి వుందా? ఉంటే గంగాపరీవాహక ప్రాంతంలో వున్నవాళ్లందరూ పవిత్రులవుతున్నారా? అనే ప్రశ్నలు వేయకూడదు. ఇవన్నీ నమ్మకాలంతే.

ప్రఖ్యాత హేతువాది అబ్రహాం టి. కోవూరు రాశారు – 1921 నుంచి 1924 వరకు ఆయనా, ఆయన తమ్ముడు కేరళలోని వాళ్ల స్వగ్రామం కురువిళ్లా నుంచి కలకత్తా వెళ్లి చదువుకునేవారట. అప్పట్లో కాశీ ఎంతో దూరంగా (1500 కి.మీ.లు) ఫీలయ్యేవారు కాబట్టి, చాలా తక్కువమంది వెళ్లేవారు కాబట్టి గంగాజలానికి (దాన్ని తీర్థమనే వ్యవహరించేవారు) బోల్డు గ్లామరు. సెలవులకు యింటికి వచ్చినపుడు పవిత్ర గంగాజలం తెచ్చిపెట్టిమని వాళ్ల వూళ్లో వాళ్లందరూ బతిమాలాడేవారట. గంగ అక్కడ ఎంత మురికిగా వుందో చూశాక, వీళ్లు తేబుద్ధి అయేది కాదు. వాళ్ల వూరికి వెళ్లాలంటే కొట్టార్కర రైల్వే స్టేషన్‌లో దిగి బస్సులో వెళ్లాలి. స్టేషన్ కుళాయి నీళ్లు రెండు సీసాల్లో పట్టి, బిరడా బిగించి వీళ్లు బస్టాండుకి వెళ్లేవారు. మా దగ్గర గంగాతీర్థం వుందనగానే జనం ఎంత కిక్కిరిసి వున్నా సరే, వీళ్లకు డ్రైవరు పక్కన సీటిచ్చి, వూళ్లో వీళ్ల యింటి దగ్గర దింపి 'మాకూ కాస్త తీర్థం యివ్వండి' అని డ్రైవరు, కండక్టరు అడిగేవారు. వీళ్లమ్మగారు ఆ నీటిని ఊళ్లో అందరికీ పంచేది. దాని వలన తమ రోగాలు తగ్గిపోయాయని, బతుకులు బాగుపడిపోయాయని, అదృష్టం కలిసి వచ్చిందని వచ్చి చెప్పేవారు. సెలవులపై పోయి మళ్లీ కాలేజీకి బయలుదేరినప్పుడు యీ సారి యింకో రెండు సీసాల్లో తెమ్మనమని ప్రాధేయపడేవారు. కోవూరూ, అతని తమ్ముడు నవ్వుకునేవారట – కొట్టార్కర రైల్వే స్టేషన్ నీళ్లకు అంత మహిమ వుందా అని! ఏది ఏమైనా యివన్నీ నమ్మకాలకు సంబంధించిన విషయం. అన్ని మతాలలోనూ యిలాటి విశ్వాసాలుంటాయి. పుష్కరసమయంలో నది పవిత్రతను సంతరించుకుంటుందని నమ్మకం. ఏ కారణం చేతనైనా అది తగ్గిపోతుందంటే ప్రజలు బెంగపడతారు.

ఇలాటి సందేహం వేరే ఏదైనా సందర్భం గురించో, ఏదైనా క్షేత్రం గురించో లేవనెత్తితే యింత చర్చ వుండదు. కానీ యిది పుష్కరాల గురించి అయి కూర్చుంది. పుష్కరాలంటే కేవలం నదీస్నానాలు కాదు. పెద్ద మెగా యీవెంటు. మార్కెటింగు ఫీటు. ఎంత ఎక్కువమంది వస్తే సర్కారుకి అంత ఘనత. అంతమంది వస్తున్నారు కాబట్టి అంతకు మించిన స్థాయిలో ఏర్పాట్లు వుండాలంటూ బోల్డంత ప్రజాధనం వ్యయం చేసి పనులు చేపట్టే అవకాశం. ఏ కారణం చేత అనుకున్నంతమంది జనం రాకపోతే అది తమకు నగుబాటుగా ప్రభుత్వం భావించే రోజులు వచ్చాయి. ఇప్పుడీ వివాదం వేరెవరైనా లేవనెత్తితే కేవలం శాస్త్రచర్చ అని సరిపెట్టుకునే వారేమో కానీ, తెలంగాణ పండితులు ప్రస్తావించడంతో వారి వెనుక తెరాస హస్తం వుందనే అనుమానాలు రాజుకున్నాయి. పుష్కరస్నానం గోదావరితో సంకరమైన కృష్ణలో చేస్తారా? స్వచ్ఛమైన కల్తీ లేని కృష్ణలో చేస్తారా? అనే స్లోగన్‌తో తెలంగాణ ప్రభుత్వం దూసుకుపోతే ఆంధ్ర ప్రభుత్వానికి మంట పుడుతుంది. అందువలన తెలంగాణ పండితుల వాదనను ఖండించే ప్రయత్నాలు మొదలయ్యాయి.

గోదావరి నీళ్లు కలిసినంత మాత్రాన కృష్ణ కృష్ణ కాకుండా పోతుందా? అని ప్రశ్నిస్తున్నారు. దానికి జవాబుగా తెలంగాణ పండితులు "మామూలప్పుడు ఏమో కానీ, గోదావరికి అంత్యపుష్కరాలు జరుగుతాయి. ఆ నీరు వచ్చి కృష్ణలో కలిస్తే పవిత్రత ప్రభావితమౌతుందని మా అనుమానం. పీఠాధిపతులెవరైనా తేల్చాలి." అని సందేహం వెలిబుచ్చారు. అంత్యపుష్కరాలంటే పుష్కరుడికి వీడ్కోలు సభ అన్నమాట. జులై 31 నుండి 12 రోజులు సాగుతాయి. అవి అవగానే కృష్ణా పుష్కరాలు ఆగస్టు 12 నుంచి

ప్రారంభమవుతాయి. అంటే పుష్కరుడికి స్వాగత సభ అన్నమాట. వీడ్కోలు సభ, స్వాగత సభ కలపకూడదన్నమాట. తేదీల ప్రకారమైతే కలవటం లేదు. కానీ ఆగస్టు 12న కృష్ణలో కలిసే గోదావరి జలాలు అంత్యపుష్కరకాలంలో పట్టిసీమ నుంచి బయలుదేరిన జలాలై వుంటాయి. అదీ దోషం అంటారు వీళ్లు. అవునో కాదో విజ్ఞులు చెప్పాలి. గంగా, యమునా పుష్కరాల విషయంలో యిలాటి పేచీ వస్తుందా అని చూశాను. రెండిటి మధ్య మూడేళ్ల తేడా వుంది. గోదావరి, కృష్ణల మధ్య ఏడాది మాత్రమే తేడా వుండడం వలన యీ పితలాటకం వచ్చింది. దీని గురించి ధర్మసింధు వంటి శాస్త్రగ్రంథాల్లో వుండి వుంటుందని నేననుకోను. అప్పట్లో నదీసంధానం లేదు కదా. ఇప్పుడు కొత్తగా పండితులందరూ కూర్చుని తేల్చాలి. 'ఏకం సత్, విప్రాః బహుధా వదన్తి' (ఉన్నదొకటే, మేధావులు రకరకాలుగా చెప్తారు) అనే సూక్తి యిటీవలి కాలంలో మరీ నిజమౌతోంది. ఉగాదికి ఒకటే పంచాంగం – కానీ టిడిపి ఆఫీసులో ఒకలా, తెరాస ఆఫీసులో మరోలా, కాంగ్రెసు ఆఫీసులో యింకోలా వినిపిస్తుంది. గతంలో రంజాన్ పండగ ఎప్పుడాన్న విషయం చివరి దాకా తేలేది కాదు. ఇప్పుడు హిందూ పండగలకు కూడా ఆ అవస్థ వచ్చింది. ఎవరైనా ఘనపాఠి, ఎవరైనా పీఠాధిపతి అభిప్రాయం వెలిబుస్తే వాళ్ల వూరేమిటి? వారి వెనుక ఏ నాయకుడున్నాడన్నది తేరిపార చూడాల్సి వస్తోంది.

ఎవరి వాదన కరక్టన్నది ఎప్పటికీ తేలదు. అయితే ప్రజల సెంటిమెంటు అనేది ఎటు మొగ్గుతుందో చూడాలి. కితం ఏడాది గోదావరి పుష్కరాల్లో అంతమంది ఎందుకు చనిపోయారు? అదే స్నానఘట్టంలో, అదే సమయంలో పుష్కరస్నానం చేస్తే మోక్షం లభిస్తుందని అందరూ నమ్మారు కాబట్టి. ప్రభుత్వం అలా ప్రచారం చేయడం వలననే ప్రజలు ఆ స్థాయిలో వచ్చారు. దుర్ఘటన జరిగాక నాలిక కరుచుకుని, ఎక్కడైనా చేయవచ్చు, ఎప్పుడైనా చేయవచ్చు అని సర్కారువారు ప్రచారం చేశారు. అయినా యితర తీర్థాలలో కంటె రాజమండ్రికే ఎక్కువమంది జనం వచ్చిపడ్డారు. ఇప్పుడు ఇబ్రహీం పట్నం దిగువన కృష్ణలో గోదావరి జలాలు వచ్చి కలిసిన చోటు నుంచి పవిత్రత చూపువాసి తక్కువేమో అనే అనుమానం తగిలినా జనాలు ఎగువ ప్రాంతాలకే ఎగబడతారు తప్ప దిగువవాటిపై శీతకన్ను వేస్తారు. స్నానఘట్టాలు కట్టించేటప్పుడు, రోడ్లు వేయించేటప్పుడు ప్రభుత్వం యీ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, తదనుగుణంగా కాంట్రాక్టులు సవరిస్తే సమంజసంగా ఉంటుంది కానీ యిప్పటికే కాంట్రాక్టులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అలా అనుకోరు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 24 **ఎమ్బీయస్ : ఆర్ట్ ఆఫ్ లిటిగేషన్**

"ఆర్ట్ ఆఫ్ లివింగ్" ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవిశంకర్ యీ ఏడాది మార్చిలో ఢిల్లీలోని యమునానదిలోని యిసుకమేటల్లో పెద్ద సాంస్కృతికి కార్యక్రమం నిర్వహించి పర్యావరణవేత్తల విమర్శలకు గురైన సంగతి అందరికీ తెలుసు. నదిలో ఏర్పడే యీ యిసుక మేటలు దిగువ ప్రాంతాల్లో వరదలను నిరోధిస్తాయి. పై నుంచి కొట్టుకుని వచ్చే యిసుకను ఆకర్షించి నిలుపుతాయి. నీటిని నిలువ చేసుకుని, నదీ తీరాల్లోని జనవాసాల్లోని భూగర్భజలాలను పెంచుతాయి. అందువలన వాటిపై ఎక్కువమంది ఒకేసారి గుమిగూడితే వాటి స్వభావం దెబ్బ తింటుంది. 35 లక్షల మంది వచ్చే యీ భారీ సమావేశం వలన యిసుకమేటలకు, పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని భావించిన నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్‌జిటి) ఆర్ట్ ఆఫ్ లివింగ్ (ఎఒఎల్) ఫౌండేషన్‌పై రూ.5 కోట్ల జరిమానా విధించింది. తమ వద్ద అంత డబ్బు లేదని నిర్వాహకులు విన్నవించుకోవడంతో రూ.25 లక్షలు కార్యక్రమానికి ముందు కట్టి, తక్కినది 3 వారాల్లో కట్టేందుకు గడువు యిచ్చింది. 25 లక్షలు కట్టి అనుమతి తెచ్చుకుని కార్యక్రమం కానిచ్చేశాక, ఎఒఎల్ బ్బెబ్బెబ్బే అంది. మేమేమీ భూమి, నీరు కలుషితం చేయలేదు కాబట్టి కట్టనక్కరలేదు అంటూ కోర్టు కెక్కింది.

తమిళనాడులో 1956లో పుట్టిన రవిశంకర్ బెంగుళూరు యూనివర్శిటీ ద్వారా బియస్సీ పాసయ్యారు. ఆ తర్వాత వివాదాస్పదుడైన మహర్షి మహేష్ యోగి వద్ద శిష్యుడిగా చేసి ఆయన టిఎమ్ (ట్రాన్సిడెంటల్ మెడిటేషన్) టీములో పనిచేశారు. 1981లో బెంగుళూరు ముఖ్యకేంద్రంగా ఎఒఎల్ ఫౌండేషన్ స్థాపించారు. ఇప్పుడది 156 దేశాలకు విస్తరించింది. రవిశంకర్ శ్వాసక్రియలో "సుదర్శన క్రియ" అనే విధానాన్ని 1982లో రూపొందించి 1983లో మొదటిసారి స్విజర్లండ్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోర్సు ప్రారంభించారు. తన పేరుకు ముందు శ్రీశ్రీ చేర్చుకున్న రవిశంకర్‌ను ఎన్‌డిఏ ప్రభుత్వం యీ ఏడాది "పద్మవిభూషణ్"తో సత్కరించింది. ప్రభుత్వం యిస్తున్న దన్నుతో గిన్నెస్ బుక్ రికార్డుల్లో ఎక్కడానికి ఢిల్లీలో వ(ర)ల్డ్ కల్చరల్ ఫెస్టివల్ పేర ఆయన ఢిల్లీలో మార్చి 11 నుంచి మూడు రోజుల పాటు 155 దేశాల నుంచి 35 లక్షల మంది పాల్గొనే మెగా యీవెంట్ తలపెట్టారు. 24 దేశాల నుంచి దాదాపు 36 వేల మంది కళాకారులు వచ్చి ఏడెకరాలలో కట్టిన 1200 అ.ల పొడుగు, 200 అ.ల వెడల్పు, 40 అ.ల ఎత్తు వున్న వేదికపై ప్రదర్శనలు నిర్వహిస్తారని ప్రకటించారు. ఇలాటి కార్యక్రమం ఎక్కడైనా జరుపుకోవచ్చు. కానీ యమునా నదీగర్భంలో ఎందుకు తలపెట్టారో ఎవరికీ అర్థం కాలేదు. ఇసుకమేట ప్రాంతం కాబట్టి అక్కడ శాశ్వత నిర్మాణాలు ఏవీ చేపట్టకూడదని రూలుంది. టైమ్స్ గ్రూపు వాళ్లు పదేళ్ల క్రితం టైమ్స్ గ్లోబల్ విలేజి అని కట్టి నెల్లాళ్లపాటు ఎగ్జిబిషన్ నిర్వహించింది. ప్రతీ ఏడాది అక్కడే చేద్దామని అనుకుంది కానీ ఢిల్లీ హైకోర్టు కలగచేసుకుని, దాన్ని కొట్టించేసింది. ఏటేటా చేయడానికి వీల్లేదంది.

పర్యావరణవేత్తలందరూ మొత్తుకుంటున్నా యీ కార్యక్రమానికి కేంద్రప్రభుత్వం, ఢిల్లీ రాష్ట్రప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించాయి. మోదీతో చిన్న విషయానికై కూడా తగవులాడే ఆప్ దీనిపై మాత్రం ఏకాభిప్రాయంతో వుండడానికి కారణం – కేజ్రీవాల్ కాబినెట్‌లో

టూరిజం మంత్రి కపిల్ మిశ్రా ఎఒఎల్ సభ్యుడు కావడమే! ఇలాటి ఉత్సవాల వలన రాష్ట్రంలో టూరిజం పెరుగుతుందని ఆయన ప్రకటించాడు. ఉత్సవస్థలం వద్ద పోలీసులనే కాదు, సైన్యాన్ని కూడా మోహరించారు. వీళ్ల దన్ను చూసుకునే నిర్వాహకులు చివరి నిమిషం దాకా ఫయర్, సెక్యూరిటీ క్లియరెన్సులకై దరఖాస్తు చేసుకోలేదు. కొన్ని గంటల్లో కార్యక్రమం ప్రారంభమవుతుందనగా వారు అప్లయి చేయడం, నిమిషాల్లో వీళ్లు జారీ చేయడం జరిగాయి. సభానిర్వహణ అనుమతికై డిసెంబరులో ఎఒఎల్ అప్లయి చేసినప్పుడు ఏదో చిన్న సాంస్కృతిక కార్యక్రమం అంది తప్ప యింతమంది వస్తారని చెప్పలేదు. ఎంతమంది వస్తారని వాళ్లూ అడగకుండా అనుమతి యిచ్చారు. తర్వాత భారీస్థాయిలో జరుగుతోందని తెలిసి యితరులు విమర్శలు చేస్తే జవాబిస్తూ ఎఒఎల్ "మేం డిసెంబరులో యీ స్థలాన్ని గుర్తించినప్పటికే అక్కడ 25 ఎకరాలలో భవననిర్మాణాల తాలూకు చెత్త పడేసి వుంది. మాకు అనుమతి రాగానే డిసెంబరు 22 నుంచి దాన్ని తీసివేయడం మొదలుపెట్టాం. మేం మా నిర్మాణాల్లో పర్యావరణానికి అనుకూలమైన మట్టి, చెక్క, గుడ్డ వంటివే వాడుతున్నాం. 650 బయో టాయిలెట్స్ కడుతున్నాం. ఉత్సవం తర్వాత అవి అక్కడే వుండిపోతాయి కాబట్టి నదీజలాలు కలుషితం కాకుండా వుంటాయి." అని వాదించింది.

అసలు యిక్కడ ఎందుకు పెట్టాలి అని అడిగితే నదులను రక్షించవలసిన ఆవశ్యకత చాటిచెప్పడానికి అని చెప్పుకుంది. యమునా నది 375 కి.మీ.లు ప్రయాణించి ఢిల్లీ చేరేసరికి దానిలో మరీ మాలిన్యాలుండవు. కానీ ఢిల్లీలో 22 కి.మీ.లు ప్రయాణించేసరికి పూర్తిగా కలుషితమై పోతుంది. యమునానదిలోని కాలుష్యంలో 80% ఢిల్లీలో పయనిస్తుండగానే జరుగుతుంది. మామూలుగా అయితే 100 మిలీ. ల నీటిలో కోలిఫార్మ్ 500కు మించి వుండకూడదు. యమునలో అది 50 వేలుంటుంది. ఎందుకంటే కోటి జనాభా వున్న ఢిల్లీలో తయారయ్యే మురుగు, చెత్త 19 డ్రెయిన్ల ద్వారా, 42 ఇండస్ట్రియల్ యూనిట్ల ద్వారా యమునలో చేరుతుంది. నదీక్షాళనకై 1993 నుంచి రూ.1500 కోట్లు ఖర్చుపెట్టారు. అది కూడా మురుగులోనే కలిసిపోయినట్లుంది. ఇప్పుడు ఉత్సవం జరిగి మూణ్నెళ్లయింది. యమునా నదీపరిరక్షణ గురించి ప్రజల్లో కానీ, ప్రభుత్వంలో కానీ ఏ మేరకు అవగాహన, స్పందన వచ్చిందో ఎఒఎల్ వారే చెప్పాలి.

సభానిర్వహణకు ఎన్‌జిటి అనుమతి నిరాకరిస్తూ వుంటే ఎలాగైనా యివ్వాలని ఎఒఎల్ ఒత్తిడి తెచ్చింది. ఐఐటీ ప్రొఫెసర్లతో, పర్యావరణవేత్తలతో కూడిన ఎన్‌జిటి లెక్కలు వేసి "మీరు పాడు చేసిన దానిని బాగు చేయడానికి హెక్టేరుకు రూ. 50 లక్షల ఖర్చవుతుంది. ఆ లెక్కన మీకు రూ.120 కోట్ల జరిమానా వేయాలి" అంది. "అబ్బే మేం వాడుకునేది 28 హెక్టేర్లే" అన్నారు రవిశంకర్. వేదికే 7 హెక్టేర్లున్నపుడు అది చూడడానికి వచ్చిన ప్రేక్షకులు ఎన్ని హెక్టేర్లలో కూర్చుని వుంటారు? మొత్తం 400 హెక్టేర్లు వాడారని ఒక అంచనా వుంది. అంటే 200 కోట్లు జరిమానా వేయాలన్నమాట. అయినా ఎన్‌జిటి దిగి వచ్చి "మీరన్న 28 హెక్టేర్లే అనుకున్నా మీరు రూ.14 కోట్లు కట్టాలి కదా" అంది. "ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసరు, జెఎన్‌యు ప్రొఫెసరుతో మీరు వేసిన ఎక్స్‌పర్ట్ కమిటీని రద్దు చేయండి, వాళ్ల లెక్కలు తప్పు. మేమేమీ తప్పు చేయలేదు. జరిమానా కట్టము. కావాలంటే పునర్నిర్మాణానికి సహకరిస్తాం." అని వాదించారు రవిశంకర్. చివరకు ఏ మొహమాటాలకు లొంగిందో కానీ ఎన్‌జిటి యీ లెక్కలన్నీ పక్కన పెట్టి 'రూ. 5 కోట్లు జరిమానా కట్టండి చాలు' అని ఎఒఎల్‌ను అడిగింది. "మాది విరాళాలపై నడిచే సంస్థ. అంత డబ్బు లేదు. తొలి విడతగా రూ.25 లక్షలు కడతాం." అంటే "సరే, అది కట్టి ఉత్సవం జరుపుకోండి. తక్కినది మూడు వారాల్లో కట్టండి." అంది ఎన్‌జిటి.

సాధారణంగా పర్యావరణ విషయాలపై ఆందోళన వ్యక్తం చేసే సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్వైర్‌మెంట్ కూడా యీ వివాదంపై నోరు మెదపలేదు. ఎవరైనా విమర్శించబోతే "భారత జాతి, సంస్కృతి, హిందూమతం గురించి ఏ కార్యక్రమం చేపట్టినా దాన్ని వ్యతిరేకించడం ఓ ఫ్యాషన్ అయిపోయింది" అంటూ వెంకయ్యనాయుడు విరుచుకుపడ్డారు. స్వేచ్ఛ అనే స్వచ్ఛంద సంస్థ ఇడి విమలేందు ఝా "ఉత్సవం అక్కడ జరపనివ్వరాదు అంటూ పిటిషన్ వేసినందుకు నాపై హిందూ వ్యతిరేకి అనే ముద్ర కొట్టి బిజెపి నాయకులు బెదిరింపు ఫోన్‌కాల్సు వచ్చాయి" అని చెప్పుకున్నాడు. ఏమైందో ఏమో కానీ ప్రారంభసభకు రావలసిన ప్రణబ్ ముఖర్జీ రాలేదు. విదేశాల నుంచి రావలసిన చాలామంది ప్రముఖులు కూడా రాలేదు. మోదీ మాత్రం హాజరయి అభినందించారు.

ఉత్సవం పూర్తయ్యాక ఎఒఎల్ మొండికేసింది. మేమేమీ తప్పు చేయలేదు. తక్కినది కట్టం అంటూ సుప్రీం కోర్టుకి వెళ్లింది. ఎఒఎల్ సంస్థ దగ్గర నిజంగా డబ్బు లేదా? డబ్బు లేకుండానే 156 దేశాలకు విస్తరించారా? వాళ్ల కోర్సులకు హాజరయ్యేవారి వద్ద ఫీజులు వసూలు బాగానే చేస్తారు. హెడ్‌క్వార్టర్సులో ఎప్పుడు చూసినా సుమారు వెయ్యిమంది ట్రైనింగ్ పొందుతూంటారు. శ్రీశ్రీ ఆయుర్వేద అనే వ్యాపారసంస్థను 2003 నుంచి నిర్వహిస్తున్నారు. 2017 నాటికి దేశవ్యాప్తంగా 2500 స్టోర్లు నెలకొల్పి, కన్స్యూమర్ గూడ్స్, వెల్‌నెస్ ప్రోడక్టుల మార్కెట్‌లోకి కూడా వెళదామని చూస్తున్నారు. వాళ్ల కంటె మూడేళ్ల తర్వాత మార్కెట్లోకి ప్రవేశించిన బాబా రామ్‌దేవ్ పతంజలి బ్రాండ్ రూ. 5000 కోట్ల టర్నోవరుకు చేరుకుంది. వాళ్లని చూసి వీళ్లకూ ఊపు వచ్చింది. ఈ మధ్యే "ఓజస్విత" అనే మాల్ట్ డ్రింక్ ఫుల్‌పేజీ యాడ్స్ యిచ్చారు. ఎఒఎల్ అమ్మే ఫుడ్ ప్రోడక్టులు సుమేరు ఆయుర్వేద అనే కంపెనీ తయారుచేస్తుంది. ఇది రవిశంకర్ మేనల్లుడు అరవింద్ వర్చస్వి నడుపుతారు. ఆయనదే సుమేరు హాలీడేస్ అని వుంది. ఎఒఎల్ హెడ్‌క్వార్టర్సులోనే దాని ఆఫీసు వుంది. కోర్సులకై వచ్చేవారికి వసతి, రానుపోను ప్రయాణాల ఏర్పాట్లు చూస్తుంది. ఎఒఎల్‌కు విదేశాల్లో వున్న 7 అనుబంధ సంస్థల ద్వారా 2007 నుంచి రూ. 300 కోట్లు విరాళం వచ్చిందని, రూ.200 కోట్ల స్థిరాస్తులు, రూ. 8 కోట్ల చరాస్తులు వున్నాయని ఒక పత్రిక రాసింది.

డబ్బు వున్నా లేకపోయినా మాట యిచ్చారు కాబట్టి జరిమానా కట్టాల్సింది కానీ ఎఒఎల్ లిటిగేషన్‌లోకి దిగింది. కావాలంటే రూ.4.75 కోట్లు డబ్బుగా కాకుండా బ్యాంకు గ్యారంటీగా యిస్తామని మెలిక పెట్టింది. గ్యారంటీ అనగానే షరతులుంటాయి. ట్రైబ్యునల్ దాన్ని తిరస్కరించింది. ఎఒఎల్ కోర్టుకి వెళ్లింది. కోర్టు ఎఒఎల్ వాదనను కొట్టివేయడంతో బాటు పస లేని పిటిషన్ వేసినందుకు రూ.5 వేలు జరిమానా వేసింది. గ్యారంటీలు కుదరవని, డబ్బు కట్టి తీరాలని ఖండితంగా చెప్పింది. ఉత్సవం జరిగిన స్థలాన్ని పరిశీలించి, అక్కడ ఎంత డామేజి జరిగిందో లెక్కలు కట్టి ట్రైబ్యునల్ ఎక్స్‌పర్ట్ కమిటీ జరిమానా పెంచితే అదీ కట్టాలని చెప్పింది. ఎఒఎల్ ఆ కమిటీ పక్షపాత బుద్ధితో వ్యవహరిస్తోందని ఆరోపించింది. చివరకు ఏమనుకుందో ఏమో కానీ రూ.4.75 కోట్లు కట్టింది. ఇది జరిమానా కాదు, నష్టపరిహారం అని నిర్వచనం యిచ్చింది. జీవించే కళ నేర్పుతాననే ఆర్ట్ ఆఫ్ లివింగ్ తన తర్వాతి కోర్సులో వాగ్దానభంగం చేసి, పేచీ పెట్టుకునే కళ కూడా నేర్పుతుందేమో తెలియదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 25, 26 వీక్లీకై **ఎమ్బీయస్ : హైకోర్టు ఉద్యోగాలు – ప్రాధాన్యతల్లో తేడా**

రాష్ట్రం విడగొట్టినపుడు ఫలానా తేదీలోగా హైకోర్టు విడిపోవాలి అని చట్టంలో రాయలేదు. హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా పదేళ్లు వుంటుంది అన్నారు. రేవంత్‌రెడ్డి పట్టుబడబట్టి బాబు ఆంధ్రకు తరలిపోవడానికి కంగారుపడ్డారు కానీ లేకపోతే పదేళ్లూ యిక్కడే కాలక్షేపం చేసేవారు – మేం ప్లాను చేస్తున్న అంతర్జాతీయ స్థాయి రాజధాని యింకా తయారు కాలేదు అంటూ. వెళ్లిపోవడం ఎలాగూ మొదలుపెట్టారు కాబట్టి, హైకోర్టు మాత్రం యిక్కడెందుకు, చీల్చేసి మీది మీరు పట్టుకుపోండి అని తెలంగాణ వారనసాగారు. తెరాస ప్రభుత్వం తలపెట్టిన అనేక తిక్కపనులకు హైకోర్టు అడ్డుపడింది. దాంతో తమ రాష్ట్రానికంటూ వేరే హైకోర్టు వచ్చి దాన్ని తనవాళ్లతో నింపేస్తే తప్ప తమ మాట చెల్లదని తెరాస ఫీలవసాగింది. నిజానికి యిలాటివన్నీ విభజన చట్టం తయారు కావడానికి ముందే తేల్చుకోవలసిన విషయాలు. ఉమ్మడి కుటుంబం విడిపోతున్నపుడు ముందుగా ఫలానాది నీకు, ఫలానాది నాకు అని మాట్లాడుకుని, రాజీపడి అప్పుడు పార్టిషన్ డీడ్ రాసుకుంటారు. విడాకులు తీసుకునేముందు భరణం ఎంత, పిల్లలెవరి దగ్గర వుండాలి వంటి విషయాలు తేల్చుకుని అప్పుడు విడాకుల పత్రం మీద సంతకాలు చేస్తారు. మరి దాదాపు 6 దశాబ్దాలు కలిసి వున్న ఆంధ్ర–తెలంగాణ కాపురం విడాకులు తీసుకునేముందు ఎన్ని విషయాలు తేల్చుకోవాలి, అవన్నీ తర్వాత చూసుకుంటాం అంటూ చట్టం తయారు చేసేశారు. వాటికి తెరాసతో సహా పార్టీలన్నీ ఆమోదముద్ర కొట్టేశాయి. చర్చలు మొదలుపెడితే విభజన ఆలస్యమౌతుందని గాభరా అప్పుడు. ఎలాగోలా రాష్ట్రం సాధించుకోవాలని ఆదుర్దా. అడావుడిగా పనులు చేసినప్పుడు అవకతవకలు వస్తాయి మరి. ప్రస్తుతం గొడవంతా వంద ఉద్యోగాల గురించి! అట్టే మాట్లాడితే వాళ్ల ప్రమోషన్ల గురించి! విభజన వలన ఎంతోమంది ఉద్యోగాలు, వ్యాపారాలు, ఆదాయాలు, జీవితాలు తలకిందులై పోయాయి. వాటిని పట్టించుకునేవాడు లేడు కానీ దీని గురించి మొత్తం న్యాయవ్యవస్థను స్తంభింపచేసి సుప్రీం కోర్టు ఆగ్రహానికి గురయ్యారు.

విభజన జరిగినా ఉమ్మడి కాపురం పదేళ్లపాటు సాగాలని చట్టంలో వుండగా యిప్పుడు తెరాస 'రాష్ట్రం విడిపోయాక కూడా యింకా మీ పెత్తనం ఏమిటి? ఉద్యమం జరిగినదే నీళ్లు, నిధులు, నియామకాలకు. ఒకప్పుడు గుంటూరులో హైకోర్టు బెంచి కావాలని నెలల తరబడి ఆందోళన చేశారు. ఇప్పుడు బెంచీ, కుర్చీ ఏం ఖర్మ, హైకోర్టే పట్టుకెళ్లి పెట్టుకోండి.' అని ఆందోళన చేయసాగింది. 'పాపం మీ కక్షిదారులు యింత దూరం రావడం ఎందుకు?' అని ఆంధ్రులపై జాలి పడడం కూడా మొదలుపెట్టారు. 'హైకోర్టు ఎక్కడ పెట్టాలో యింకా తేల్చుకోనే లేదు. మాకేం తొందర లేదు.' అనసాగారు చంద్రబాబు. 'అనేక ఉమ్మడి ఆస్తుల పంపిణీ జరగలేదు, నదీజలాల కేటాయింపు జరగలేదు. ఎన్నో అంశాలు పెండింగులో వున్నాయి. సామరస్య ధోరణి ఎక్కడా కనబడటం లేదు. చేస్తే అన్నీ ఒకేసారి కూర్చుని తేలుద్దాం. హైకోర్టు మా ప్రాధాన్య అంశం కాదు. ఎన్నో పోగొట్టుకున్నాం. ఇప్పుడు హైకోర్టు పట్టుకెళితే అర్జంటుగా ఒరిగేదేమీ లేదు.' అని బాబు హైకోర్టు వివాదాన్ని యితర సమస్యలతో కలిపి ముడివేశారు. అది తెరాసకు నచ్చటం లేదు. "కలియుగ మహాభారతం" సినిమాలో నూతన్ ప్రసాద్ తండ్రి పేరు చెప్పుకుని కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన అహంభావి యువకుడి పాత్ర వేశారు. ప్రచారానికి వెళ్లి ఓటేయమని అడిగితే ఓటరు "నాకు యిల్లు లేదండి" అంటాడు. ఇతనికి చిర్రెత్తుకొస్తుంది. "నీ యింటి గురించి ఎవడడిగాడ్రా? ఓటు గురించి నేను మాట్లాడుతూంటే నీ వెధవ యిల్లు గురించి మాట్లాడతావేమిటి? నీ సొద ఎవడికి కావాలి?" అని మండిపడతాడు. ఇప్పుడు తెరాస కూడా అదే ధోరణిలో "జలాల పంపిణీ, షెడ్యూలు 9,10 సంస్థల ఆస్తుల పంపిణీ అంటూ మాట్లాడతారేమిటి? వాటి గురించి మాకక్కరలేదు. మాక్కావలసింది, అర్జంటుగా హైకోర్టు చీల్చడం. అది మాక్కావాలి కాబట్టి మీరు వెంటనే దాని మీద పనిచేయాలి." అంటోంది. "మాకు యిక్కడ వుండడానికి యిల్లే లేదు, ఉద్యోగులు లేరు, వాళ్లకు క్వార్టర్సు లేవు, ఇటికా, యిసుకా దగ్గర్నుంచి అన్నీ వెతుక్కుంటున్నాం. కోర్టుకేం తొందర!" అంటుంది టిడిపి.

"ఓస్, దానికేముంది, ఇప్పుడు వున్న హైకోర్టులోనో, వేరే బిల్డింగులోనో హైదరాబాదులో ఆంధ్ర హైకోర్టు ఏర్పాటు చేసేస్తాం. మీరు వూ అంటే చాలు" అని గ్రాండ్ ఆఫర్ యిచ్చింది తెరాస, కేంద్రానికి కూడా చెప్పింది. 'హైదరాబాదులో వున్న ప్రతీ బిల్డింగూ, ప్రతీ ఆస్తీ మాదే. ఉమ్మడి గుమ్మడి జాన్తానై' అంటున్న తెరాస యీ విషయంలో మాత్రం ఔదార్యం కురిపించినా హైకోర్టు 'నో,

థ్యాంక్స్' అనేసింది 2015 మే 1 నాటి తన తీర్పులో. 'ఆంధ్ర హైకోర్టు ఏర్పాటులో తెలంగాణ ప్రభుత్వానికి ఏ పాత్రా లేదు, రాజ్యాంగం ప్రకారం ఏ రాష్ట్రపు హైకోర్టు ఆ రాష్ట్రంలోనే వుండాలి, హైదరాబాదు యుటీ అయి వుంటే వేరే విషయం, కానీ దాన్ని తెలంగాణకు యిచ్చేశారు కాబట్టి, ఆంధ్ర హైకోర్టు సొంత భవనంలో గాని, అద్దె భవనంలో గాని వుండడానికి వీల్లేదు. ఆంధ్ర హైకోర్టు వెలసేవరకు ప్రస్తుత హైకోర్టు ఉమ్మడిగానే వుంటుంది.' అని కుండ బద్దలు కొట్టి చెప్పేసింది. దాన్ని పునస్సమీక్షించమంటూ తెలంగాణ ప్రభుత్వం మళ్లీ కోర్టు తలుపు తట్టింది. జులై 21కు వాయిదా. న్యాయమార్గాల్లో వెళితే యిలాటి చిక్కులు వస్తున్నాయని యిక ఆందోళన మార్గం చేపట్టింది తెరాస. ఎక్కడా కనీవిని ఎరగనట్లుగా న్యాయాధిపతులు రోడ్డెక్కారు. న్యాయాధీశులు కార్మికుల్లా ప్రవర్తించడమేమిటని కోర్టు చికాకు పడింది. కఠినంగానే వ్యవహరించిందని చెప్పాలి. అసలింతకీ యీ నియామకాల గొడవేమిటి?

మొట్టమొదటగా చెప్పవలసినది – ఇదంతా ఒక వింత హైపోథిసిస్‌పై ఆధారపడి ఆలోచించడం వలన వస్తోంది. అదేమిటంటే పక్షపాతరహితంగా న్యాయం చెప్పవలసిన న్యాయమూర్తి అలా చెప్పడని, తను ఏ ప్రాంతానికి చెందినవాడైతే ఆ ప్రాంతానికి అనువుగా తీర్పు చెప్తాడని అనుకుంటున్నారు. అందుకే తెలంగాణ కేసులను తెలంగాణవారే నిర్ణయించాలని, తెలంగాణ కోర్టుల్లో ఆంధ్రులు వుండకూడదని అనడం. ఏ న్యాయమూర్తయినా తన ఎదుటకు వచ్చిన ఆధారాల బట్టి తీర్పు చెప్పగలడు కానీ తన యిష్టాయిష్టాల బట్టి, ప్రాంతీయాభిమానం బట్టి చెప్పలేడు కదా. కక్షిదారుల్లో ఒకరు ఆంధ్రకు, మరొకరు తెలంగాణకు చెందినవారైతే న్యాయం తెలంగాణవారి పక్షాన వున్నా, ఆంధ్ర జడ్జి ఆంధ్ర కక్షిదారుకి అనుకూలంగా తీర్పు చెప్తాడా? ఒకవేళ యిద్దరూ తెలంగాణావారే అయితే అప్పుడెవరి పక్షాన చెప్తాడు? ఇద్దరూ ఆంధ్రావాళ్లే అయితే అప్పుడు తన సొంత జిల్లావాడి పక్షాన చెప్తాడా? ఆంధ్రలో కాని, తెలంగాణలోకాని అందరూ ఒకేలా ఆలోచిస్తారా? తెరాస ప్రభుత్వ విధానాలను ఆమోదించని తెలంగాణ జడ్జి తీర్పు చెప్తే అప్పుడేమని అడుగుతారు? ముఖ్యమంత్రి కులస్తుడినో, ఆయన యింటి పక్కవాణ్నో ఆ స్థానంలో వేయమంటారా? జడ్జి మన వూరువాడో, మన కులస్తుడో అయితే మన తరఫున సాక్ష్యాలెలా వున్నా, మన లాయరు ఎలా వాదించినా గెలుపు మనదేనా? ఏమిటీ తర్కం? ఇలాటి వింత ఆలోచనాధోరణి చేతనే జడ్జి ప్రాంతం గురించి యింత రగడ సాగుతోంది. దేశంలోని న్యాయవ్యవస్థ మాత్రం యిలా ఆలోచించదు. అందుకే భారతదేశవాసి ఎవరైనా ఎక్కడైనా న్యాయాధికారి కావచ్చు. కోర్టువారు పెట్టే పరీక్ష పాసవ్వాలి. దిగువ కోర్టుల్లో అయితే ప్రాంతీయ భాష వచ్చి వుండాలి. అంతే!

ఇప్పుడున్న జడ్జిల్లో ఎవరు ఏ ప్రాంతం వాళ్లు అనే గణాంకాలను ఉద్యమకారులు ముందుకు తెచ్చారు. వాటిపై చర్చించడానికి ముందు రెండు విషయాలు గుర్తు పెట్టుకోవాలి. ఒకటి – యివి కోటాల్లో వచ్చిన ఉద్యోగాలు కావు. ప్రతిభతో పరీక్షలు రాసి తెచ్చుకున్న వుద్యోగాలు. రెండు – ఎవరు ఆంధ్ర, ఎవరు తెలంగాణ అనేది తేల్చడం సులభం కాదు. దానికి ఎవరికి తోచినట్లు వారు నిర్వచనాలు చెప్తున్నారు. గతంలో ఉద్యమకాలంలోనే హైకోర్టులో నియామకాల గురించి న్యాయవాదులు ఆందోళన చేసినప్పుడు 'గుంటూరు నుంచి హైకోర్టు తరలించినప్పుడు వచ్చిన ఆంధ్ర న్యాయవాదుల పిల్లలు యిక్కడే పెరిగి, పెద్దవారై, చదువుకుని, ప్రాక్టీసు చేస్తూ వుంటే వారు స్థానికులు కామని ఎలా అనగలం?' అని అడిగారు. దానికి గుత్తా సుఖేందర్ రెడ్డి వంటి సీనియరు నాయకులు 'ఆంధ్రోళ్ల పిల్లల్ని తెలంగాణవారని ఎలా అంటాం?' అని వాదించారు. అంటే ఎవరైనా తెలంగాణ అవునో కాదో తెలుసుకోవాలంటే తాత, ముత్తాల దాకా వెళ్లాలన్నమాట. (కార్పోరేషన్ ఎన్నికలు వస్తే మాత్రం తెలంగాణలో వుండేవారందరూ తెలంగాణ వారే అంటారు) ఈ పద్ధతికి చట్టబద్ధత లేదు. ఉద్యోగంలో చేరినప్పుడు రాసిన జన్మస్థలం పేరు బట్టి నేటివిటీ నిర్ధారించి జాబితా తయారు చేయడం కూడా కరక్టు కాదు. ఎందుకంటే పిల్లలు సాధారణంగా అమ్మమ్మగారింట్లో పుడతారు. ఉద్యోగరీత్యానో, మరో కారణం చేతనో అప్పటికి మాతామహుడు ఎక్కడ వుంటే అక్కడ పుడతారు. అదే సొంత వూరు అని ఎలా అనగలరు? ఎక్కడ పెరిగితే, ఎక్కడ ఎక్కువకాలం విద్యాభ్యాసం చేస్తే అదే నేటివ్ ప్లేస్‌గా పరిగణించమని చట్టాలు చెప్తున్నాయి. అవేమీ పట్టించుకోకుండా పోటీ పరీక్షలో తనకంటె ఎక్కువ మార్కులు తెచ్చుకున్న ప్రతివాడి మీద 'ఆంధ్రోడు' ముద్ర వేద్దామంటే కుదురుతుందా?

వాళ్ల లెక్క ప్రకారం హైదరాబాదు హైకోర్టులో 61 జడ్జి పోస్టులు శాంక్షనైతే 25 మంది మాత్రమే సిటింగ్ జడ్జిలున్నారు. వారిలో 18 మంది ఆంధ్రవారు, 3గ్గురు తెలంగాణ వారు, 4గురు తెలంగాణ వారు. హైకోర్టు జడ్జిల నియామకం మాత్రం మూడోవంతు మందిని పదేళ్ల అనుభవం వున్న జిల్లా జడ్జిల నుండి, తక్కిన రెండు వంతుల మందిని సీనియర్ న్యాయవాదుల నుంచి ఎంపిక చేస్తారు. జిల్లా జడ్జిలు 234 మంది కాగా, ఆంధ్రులు 140, తెలంగాణవారు 94, సీనియర్ సివిల్ జడ్జిలు 195 మంది కాగా, ఆంధ్రులు 117 మంది, తెలంగాణ వారు 78, జూనియర్ సివిల్ జడ్జిలు 533 మంది కాగా, ఆంధ్రులు 320, తెలంగాణవారు 213. వీరంతా పరీక్షలు పాసయి ఉద్యోగాలు తెచ్చుకున్నవారే. అనుభవం లేకపోయినా లా చదివి వుంటే జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకి అప్లయి చేయవచ్చు. జిల్లా జడ్జి కావాలంటే ఏడేళ్లు లాయరుగా అనుభవం వుండాలి. పరీక్షలు హైకోర్టే నిర్వహిస్తుంది. కేసులెన్నో పెండింగులో వున్నాయని కింది స్థాయి న్యాయమూర్తుల నియామకం చేపడదామని చూస్తే పోటీ పరీక్షలంటే భయమో ఏమో హైకోర్టు చీల్చేదాకా నియామకాలు జరగడానికి వీల్లేదని తెలంగాణ న్యాయోద్యోగులు ఆందోళన చేశారు. విభజన పైనుంచి జరగాలా, కింద నుంచి జరగాలా అన్నదానిపై కోర్టుకు, వీళ్లకు మధ్య భేదాభిప్రాయాలున్నాయి. వివాదం సుప్రీం కోర్టుదాకా వెళ్లింది. చివరకు సుప్రీంకోర్టు 2015 డిసెంబరు 10 నాటి ఆదేశాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన న్యాయాధికారులను ఆంధ్ర, తెలంగాణల మధ్య 60–40 నిష్పత్తిలో పంచమంది. ప్రభుత్వోద్యోగుల పంపిణీకై కమలనాథన్ కమిటీ వేయడం, అది వివాదాలతో కూరుకుపోవడం

చూశాం. హైకోర్టు మాత్రం పద్ధతి ప్రకారం చేద్దామని చూస్తోంది.

2016 జనవరి 12 న న్యాయాధికారులను యిరు రాష్ట్రాల మధ్య పంపిణీ చేసే ప్రక్రియ ప్రారంభించింది. తాము ఏ రాష్ట్రంలో పనిచేయాలనుకుంటున్నారో ఆప్షన్ యివ్వాలని సబార్డినేట్ జడ్జిలను అడిగింది. దీని తర్వాత ఫిబ్రవరి 26 న కోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఆప్షన్ యివ్వడానికి గైడ్‌లైన్స్ విడుదల చేశారు. సీనియారిటీ, నేటివిటీ గైడ్‌లైన్స్‌గా న్యాయాధికారులను విభజిస్తామని దానిలో చెప్పారు. తెలంగాణ జడ్జిల్లో 200 మంది కొందరు టిజెఎ (తెలంగాణ జడ్జ్‌స్ అసోసియేషన్)గా ఏర్పడి దీన్ని తప్పుపట్టారు. మే 3 న తుది జాబితా విడుదలైంది. ప్రమోషన్లను దృష్టిలో వుంచుకుని 'ఆంధ్ర' న్యాయమూర్తుల్లో చాలామంది తెలంగాణకు ఆప్షన్ యిచ్చారు. ఈ కేటాయింపులు ఎలా చేయాలన్నదానిపై సలహా సంఘం వేస్తే అది ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. అందువలన 25 జడ్జిలతో కూడిన హైకోర్టు ఫుల్ కోర్టు దీనిపై నిర్ణయం తీసుకుంది. జడ్జిల్లో ఆంధ్రులు ఎక్కువగా వున్నారు కాబట్టి యిలాటి కేటాయింపు జరిగిందంటూ దానికి నిరసనగా తెలంగాణా న్యాయవాదుల జాక్ జూన్ 13న చీఫ్ జస్టిస్ ఛాంబర్ ఎదుట ప్రదర్శనలు నిర్వహించారు. టిజెఎ చీఫ్ జస్టిస్‌కు సమర్పించిన పిటిషన్‌లో – 'తెలంగాణకు కేటాయించిన 95 జిల్లా జడ్జిలలో 46 మంది ఆంధ్ర నేటివ్స్. ఆంధ్రలో 140 పోస్టులుండగా 110 మంది మాత్రమే ఆంధ్రకు ఆప్షన్ యిచ్చారు. అక్కడ 30 ఖాళీలుంచారు. అక్కడ 30 ఖాళీలున్నపుడు యీ 46 మందిలో 30 మందిని అక్కడ నియమించకుండా తెలంగాణకు ఎందుకు కేటాయించారు? చిన్నా, పెద్దా కలిపి మొత్తం న్యాయాధికారుల వేకెన్సీలు ఆంధ్రలో 100 వున్నాయి. వాటిని అలాగే వుంచి 134 మంది ఆంధ్రులను తెలంగాణకు కేటాయించారు. వారినక్కడ వేసి వుంటే ఆ 100 పోస్టుల్లో తెలంగాణ వారికే అవకాశం వచ్చేది కదా.' అన్నారు. ఈ అంకెలపై హైకోర్టు కాని, యితరులు కానీ వ్యాఖ్యానాలు చేయలేదు. న్యాయవ్యవస్థ గురించి సాధారణంగా కోర్టులు గోప్యత పాటిస్తాయి. మీడియాతో కూడా ఎక్కువగా మాట్లాడరు. ఆంధ్రకు చెందిన మొత్తం జడ్జిల్లో 10% మంది మాత్రమే తెలంగాణకు ఆప్షన్ యిచ్చారని ఆంధ్ర వర్గాలు చెప్పాయని పేపర్లో వచ్చింది. ఈ అంకెలే కరక్టనుకున్నా ఆంధ్రలోని ఆ 100 పోస్టులు ఆంధ్రులకే రిజర్వ్ చేయలేదు కదా. దేశంలో ఎవరైనా – తెలంగాణ వారితో సహా – వాటికై పోటీ చేయవచ్చు. మా సొంత రాష్ట్రంలో కాకుండా పక్క రాష్ట్రానికి వెళ్లి ఎందుకు పనిచేయాలి? అంటే దానికి జవాబుగా మరి బొంబాయి, దుబాయి ఎందుకు వెళుతున్నారు? అని అడగాల్సి వస్తుంది. తెలంగాణ ఉద్యోగులు తెలంగాణలోనే పనిచేయాలనుకునే ధోరణి పెరుగుతోంది. బియస్ఎన్ఎల్‌ను రెండు సర్కిళ్లుగా విభజించినప్పుడు మమ్మల్ని ఆంధ్రలో వేయడానికి వీల్లేదు, అండమాన్‌లో నైనా పనిచేస్తాం కానీ, ఆంధ్రలో చేయం అని కొందరు ఉద్యోగులు హెచ్చరించారట. దేశంలో ఎక్కడైనా పనిచేస్తామని రాసి యిచ్చి ఉద్యోగంలో చేరే కేంద్రప్రభుత్వ ఉద్యోగులు అలా అంటే ఎలా కుదురుతుంది?

వివాదమంతా యీ వంద పోస్టుల గురించే అనుకోవాలి. 100 మంది న్యాయాధికారులు ఏ ప్రాంతానికి చెందినవారైతే ఏమవుతుందో సామాన్యుడికి అర్థం కాదు. టిజెఎ పిటిషన్ యిచ్చి వూరుకోలేదు. కొందరు జూన్ 26 న గవర్నరు వద్దకు మార్చి చేసుకుంటూ వెళ్లారు. కనీవినీ ఎరగని యీ సంఘటనపై హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మండిపడ్డారు. బహుశా సుప్రీం కోర్టు న్యాయమూర్తులను సంప్రదించే మర్నాడు అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఆ మర్నాడు మరో 9 మంది జడ్జిలను సస్పెండ్ చేశారు. న్యాయశాఖ ఉద్యోగుల వ్యవహారాల్లో కోర్టుదే అంతిమ అధికారం. ప్రభుత్వాలేమీ చేయలేవు. దాంతో టిజెఎ సభ్యులు సామూహిక సెలవులో వెళ్లారు. సస్పెన్షన్ ఎత్తివేస్తేనే ఆందోళన విరమిస్తామని కాస్త బెట్టు చేసి చివరకు చర్చల హామీ తీసుకుని విరమించారు. ఈ ఆందోళనల వెనక కెసియార్ వున్నారనేది బహిరంగ రహస్యం. అందుకే న్యాయవాదులు చంద్రబాబుకి హెచ్చరికలు చేసే ప్లకార్డులు పట్టుకున్నారు. విద్యుత్ సంస్థ ఉద్యోగుల త్రిశంకు వ్యవహారం కళ్లముందు కనబడుతోంది. ఎలాగోలా ఆంధ్రమూలాల వారిని తరిమివేసినా, యితర రాష్ట్రాల వారి వచ్చి పరీక్షలు పాసయితే వారినేం చేస్తారు? పైగా ఉద్యోగులకు ఆప్షన్లు యిచ్చే అవకాశం వుండకూడదనే వాదన కోర్టులో చెల్లదు. హైకోర్టు కేటాయింపులు చేసినపుడు న్యాయవిరుద్ధంగా చేసిందని అనుకోవడానికి లేదు. ఎందుకంటే పైన సుప్రీం కోర్టుకు వాళ్లు జవాబు చెప్పుకోవాలి. విభజనకు సంబంధించి మొత్తం అన్నిటితో కలిపి పరిష్కరించినప్పుడే హైకోర్టు విభజన గురించి మాట్లాడతానని బాబు గవర్నరుకు నిర్మొగమాటంగా చెప్పడంతో గవర్నరు కూడా ఏమీ చేయలేకపోయారు. ఈ విషయంలో కేంద్రం చొరవ తీసుకోవాలి అని రాసి ముగించవచ్చు. కానీ చొరవ తీసుకున్న సందర్భాల్లో కూడా యిరు రాష్ట్రాలు వాళ్ల మాట ఖాతరు చేయటం లేదని గుర్తించాలి. ఏదీ సరిగ్గా తేల్చుకోకుండా పెద్దమ్మ, చిన్నమ్మ చేతులు కలిపి, ప్రశ్నలడిగేవాళ్లని చావకొట్టి, చీకట్లో చీలిక చట్టం చేసిపారేస్తే దాని ఫలితాలు యిలాగే అఘోరిస్తాయి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 27 **ఎమ్బీయస్ : బ్రిటన్‌కు కొత్త ప్రధాని**

ఈ రోజు బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరన్ రాజీనామా చేశారు. ఆయన స్థానంలో ఎవరూ వూహించని రీతిలో ఆరేళ్లగా హోం మంత్రిగా పనిచేసిన థెరిసా మే గద్దె కెక్కుతున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో కాని, తర్వాత కానీ ప్రధాని అభ్యర్థిగా ఆమె పేరు ఎప్పుడూ వినబడలేదు. నిజానికి కామెరన్‌తో బాటు ఆమె 'రిమైన్' కాంపెయిన్‌లో వున్నారు. అలా అని తన అభిప్రాయాలను ఎలుగెత్తి చెప్పలేదు కూడా. ఈనాడు ప్రధాని అవుతూండగా ఆమె తన సొంత అభిప్రాయాన్ని పక్కన పెట్టేసింది. ''బ్రెగ్జిట్టంటే బ్రెగ్జిట్టే. ఇయులో దొడ్డిదారిన చేరడం వంటి పనులు జరగవు. రెండో రిఫరెండం కూడా జరగదు. ఈ ఏడాది చివరకు బయటకు వచ్చే

ఫార్మాలిటీస్ పూర్తవుతాయి." అని ప్రకటించింది. 'అంతకంటె ముందే పొండి అని బ్రస్సెల్స్ అంటోంది కానీ నేను పట్టించుకోను, మనం తేల్చుకోవలసిన విషయాలు చాలా వున్నాయి.' అందామె. లీవ్ లేదా రిమైన్ కాంపెయిన్‌లో కొందరు వలసవచ్చినవారికి హామీలు కురిపించారు – మేం మీ జోలికి రాము అంటూ. థెరిసా అలాటిది హామీ ఏమీ యివ్వలేదు. ఇయుతో బేరసారాలడడానికి అది ఒక అంశంగా వాడుకోవచ్చు. మూడు దశాబ్దాల క్రితం బ్రిటన్‌కు ప్రధానిగా పనిచేసి ఉక్కుమహిళగా పేరు తెచ్చుకున్న మార్గరెట్ థాచర్ తర్వాత మహిళా ప్రధాని థెరిసాయే!

పజాభిప్రాయ సేకరణ సమయంలో యూరోపియన్ యూనియన్‌తో కలిసి వుండాలని కామెరన్ ప్రచారం చేయగా, విడిపోవాల్సిందే అంటూ భారీ ఎత్తున ప్రచారం చేసిన బోరిస్ జాన్సనే ప్రధాని పదవికి పోటీ పడతాడని అందరూ అనుకున్నారు. లండన్ మేయరుగా అతను అందరికీ తెలిశాడు. అతనికి అండగా జస్టిస్ సెక్రటరీగా పనిచేసిన మైకేల్ గోఫ్ నిలబడ్డాడు. మైకేల్ కామెరన్‌కు స్నేహితుడే కానీ ఇయు అంటే అతనికి తగని మంట. దానికి కారణం కూడా చెప్పుకున్నాడు – "మా నాన్న స్కాట్లండ్‌లో చేపల వ్యాపారం చేసేవాడు. ఇయు దాన్ని మూయించేసింది. అప్పణ్నుంచే నాకు దానిపై కోపం." అని. అదేం లేదే అంటాడు వాళ్ల నాన్న. మైకేల్ ఆక్స్‌ఫర్డ్‌లో చదివే రోజుల్లో స్టూడెంటు యూనియన్‌కు ప్రెసిడెంటు అయ్యాడు. కన్సర్వేటివ్ పార్టీలో చేరదామని ప్రయత్నించాడు కానీ అతని తలిదండ్రులు లేబరు పార్టీ సమర్థకులు కావడం చేతనో ఏమో పార్టీ చేర్చుకోలేదు. తర్వాత చేరాడు కానీ వెనక వుండి మంత్రాంగం చేయగల మేధావిగానే గుర్తింపబడ్డాడు తప్ప క్షేత్రస్థాయి నాయకుడిగా పేరు రాలేదు. 2005లో పార్లమెంటుకి ఎన్నికయ్యాడు. కామెరన్ అతన్ని 2010లో విద్యామంత్రి చేశాడు. కానీ అతని పొదుపు చర్యలు ప్రజలను మండించాయి. నిరసన ప్రదర్శనలు జరిగాయి. దాంతో 2014లో అతన్ని కాబినెట్‌లోంచి తీసివేయవలసి వచ్చింది. మళ్లీ 2015లో ఎన్నికయ్యాక కామెరన్ అతన్ని జస్టిస్ సెక్రటరీగా చేశాడు. స్నేహం మాట ఎలా వున్నా కామెరన్‌తో విభేదించి, బ్రెగ్జిట్ తరఫున పెద్ద ప్రచారం నిర్వహించి బోరిస్ జాన్సన్‌ను ముందుకు తోశాడు.

జూన్ 23 నాటి రిఫరెండం ఫలితాలు వచ్చాక జరిగిన పరిణామాలు అందర్నీ దిమ్మెరపోయేట్లు చేశాయి. బోరిస్ జాన్సన్ తనను తాను ప్రధాని అభ్యర్థిగా చూపుకుంటూ హైరాన పడ్డాడు. అంతలో మైకేల్ అతనికి నమ్మకద్రోహం చేశాడు. '"స్పెక్టేటర్" అనే పత్రికలో వ్యాసం రాస్తూ 'యూరోప్‌నుండి విడిపోయి స్వతంత్రంగా నిలదొక్కుకునే ప్రక్రియను జాన్సన్ సమర్థవంతంగా నిర్వహించగలడని నాకు నమ్మకం చిక్కటం లేదు.' అని రాశాడు. దాంతో జాన్సన్ ఆశలు అడుగంటాయి. తనపై కక్ష సాధించడానికే కామెరన్ మైకేల్‌ను తననుంచి దూరం చేశాడని, మైకేల్ మద్దతు ఉపసంహరించిన యిలాటి పరిస్థితుల్లో పార్టీ మద్దతు సంపాదించడం కష్టమని భావించి జూన్ నెలాఖరులో పత్రికా సమావేశం ఏర్పరచి నేను విత్‌డ్రా అయిపోతున్నాను అని ప్రకటించేశాడు. వెంటనే మైకేల్ నేనే అభ్యర్థిగా నిలబడతాను అన్నాడు.

మైకేల్‌తో బాటు యిద్దరు మహిళా అభ్యర్థులు కూడా ముందుకు వచ్చారు. వారిలో ఒకరు ఆండ్రియా లీడ్సమ్. ఆమె బ్రెగ్జిట్ కోసం పోరాడిన కన్సర్వేటివ్ నాయకురాలు. ఆమెకు విశేషమైన పాలనానుభవం లేదు. ఎనర్జీ శాఖలో జూనియర్ మంత్రి. ఆమెకు బోరిస్ జాన్సన్ తన మద్దతు ప్రకటించాడు. మరొకామె థెరిసా మే. హోం శాఖ మంత్రిగా ఆమె పట్టుదల గల మహిళగా పేరు తెచ్చుకుంది. అతివాద ఇస్లామిక్ మతవాది ఆబు ఖటడాను జోర్డాన్ పంపించి వేశారనే పేరు వుంది. థెరిసాకు పిల్లల్లేరు. ఆండ్రియా మాట్లాడుతూ "థెరిసా కంటె నేనే ప్రధాని పదవికి అర్హురాలిని. ఎందుకంటే ఆమెకు పిల్లలు లేరు. మేనల్లుళ్లు, మేనకోడళ్లు వుండవచ్చు. కానీ నాకు పిల్లలున్నారు, మనుమలు కలుగుతారు. వారి భవిష్యత్తు కోసమైనా యీ దేశాన్ని బాగా పాలించాలని కోరుకుంటాను. థెరిసాకు అలాటి బాధ్యతలు లేవు." అంది. ఒక దశలో థెరిసా కంటె పార్టీ ఎంపీలలో ఎక్కువ పాప్యులారిటీ సంపాదించుకున్న ఆండ్రియా ఈ వ్యాఖ్యతో దుమారం లేపి తన అవకాశాలను పాడు చేసుకుంది. వివాదం చెలరేగడంతో ఆమె థెరిసాకు క్షమాపణ చెప్పింది. అయినా ఆమెపై సొంత పార్టీ ఎంపీలకు నమ్మకం పోయినట్టుంది. జులై మొదటివారంలో 329 మంది పార్టీ ఎంపీలతో కన్సర్వేటివ్ పార్టీ నాయత్వానికి ఎన్నిక జరిగినప్పుడు ఆమెకు 84 ఓట్లు వచ్చాయి. నమ్మకద్రోహిగా పేరుబడిన మైకేల్‌కు 46 రాగా థెరిసాకు 199 వచ్చాయి. దాంతో ఆమె పార్టీ పార్లమెంటరీ నాయకురాలిగా ప్రధాని పదవికి ఎంపికైంది. మళ్లీ పార్టీ కార్యకర్తలతో విస్తృతమైన ఎన్నిక జరపాలనుకున్నారు కానీ తక్కిన యిద్దరూ పోటీలోంచి తప్పుకున్నామని ప్రకటించారు.

థెరిసాది చాలా సాధారణ నేపథ్యం. ఆమె పూర్వీకులు పనిమనుషులుగా, బట్లర్లగా పనిచేశారు. తండ్రి చర్చిలో చిన్న మతాధికారి. సాధారణ స్కూళ్లలోనే చదివింది. ఆక్స్‌ఫర్డ్‌లో జాగ్రఫీ చదివింది. లండన్ శివార్లలో కౌన్సిలరుగా పనిచేసి, తర్వాత ఎంపీ అయింది. ఆమెవి తీవ్రమైన రైటిస్టు భావాలు. ఆమె ఎన్నికైందని వినగానే కన్సర్వేటివ్ పార్టీకి చెందిన మాజీ ఛాన్సెలర్ 'బ్లడీ డిఫికల్ట్ ఉమన్' అని వ్యాఖ్యానించినట్లు బయటకు వచ్చింది. అది విని ఆమె నొచ్చుకోలేదు. 'ఈ విషయాన్ని యూరోపియన్ యూనియన్ వారు కూడా త్వరలోనే తెలుసుకుంటారు' అని చెప్పుకుంది. బ్రిటన్‌కు వలస వచ్చినవారిని ఆమె వుండనిస్తుందన్న నమ్మకం లేదు. యూరోప్ నుంచి బ్రిటన్ తప్పుకునేటప్పుడు వాళ్లని యూరోప్ వెనక్కి తీసుకోవాలనే షరతు పెడుతుందనే అందరూ అనుకుంటున్నారు. బ్రెగ్జిట్ వలన రాబోయే చిక్కులేమిటో మరో వ్యాసంలో చర్చించుకోవచ్చు. వాటిని థెరిసా ఎలా ఎదుర్కోబోతోందో మాత్రం యిప్పుడప్పుడే తెలియదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

అధికారం చేపట్టి రెండేళ్లయిన తర్వాత మోదీ కాబినెట్ విస్తరణ చేపట్టారు, కొందరి శాఖలు మార్చారు. తక్కినవారి మాట ఎలా వున్నా స్మృతి ఇరానీ శాఖ మార్పు గురించే ఎక్కువ చర్చ జరిగింది. దానికి కారణం ఆమె హై ప్రొఫైల్, వర్క్ స్టయిల్. దానివలన అభిమానులూ ఏర్పడ్డారు, వ్యతిరేకులూ ఏర్పడ్డారు. 2014 ఎన్నికల ప్రచారంలో మోదీ ఆమెను తన చిట్టిచెల్లెలుగా సంభావించారు. నెగ్గాక కాబినెట్‌లోకి తీసుకున్నారు. మానవవనరుల శాఖ ఎంతో కీలకమైనది. గతంలో పివి, జోషీ, అర్జున్ సింగ్ వంటి అనుభవజ్ఞులు పాలించిన శాఖ. ఈమెకు ఏ అనుభవం లేకున్నా ఎకాయెకీ కాబినెట్ ర్యాంకు యిచ్చి ఆ శాఖ కట్టబెట్టారు. అనుభవజ్ఞురాలైన సుష్మా స్వరాజ్ కంటె స్మృతికే ఎక్కువ ఎక్స్‌పోజరు వచ్చింది. ఆమె మంచి వక్త. కష్టపడే స్వభావం కలది. ఏదైనా విషయాన్ని త్వరగా ఆకళింపు చేసుకోగలదు, అవతలివారితో వాదించగలదు. విదేశాల నుంచి స్కాలర్ల సేవలు దేశంలోని ఉన్నత విద్యాలయాల విద్యార్థులకు అందించడం, స్వచ్ఛ విద్యాలయ స్కీము కింద 4 లక్షల టాయిలెట్లను పాఠశాలల్లో కట్టించడం వంటి మంచి పనులు చేసింది. అయినా ఆమెను క్యాంపస్‌ల నుంచి దేవిడీమన్నా చేసి (దేవిడీ అంటే కోటగుమ్మం, మనా అనే హిందూస్తానీ పదానికి అర్థం నిషిద్ధం, తెలుగులోకి వచ్చేసరికి మన్నా అయింది, రాజుగారికి ఎవరి మీదనైనా కోపం వస్తే వారిపై రాజద్వారనిషేధం విధిస్తాడు. అదే దేవిడీమన్నా) ప్రాధాన్యత తక్కువ వున్న, యిప్పటిదాకా సహాయమంత్రి నిర్వహిస్తున్న జౌళి శాఖకు పంపారు. ఈవిడ ర్యాంకు తగ్గించలేదు, అంతవరకు ఆవిడ సంతోషించాలి. 'ఉత్తర ప్రదేశ్ ఎన్నికలలో ప్రియాంకా గాంధీకి దీటుగా ప్రచారం చేయడానికి సమయం కావాలి కాబట్టి, ఎచ్ఆర్‌డి వంటి హెవీ శాఖ నుంచి తప్పించారు తప్ప మరేమీ కాదు' అని ఆవిడ అభిమానులు అంటున్నారు. కాదు, హైదరాబాదు యూనివర్శిటీ, జెఎన్‌యు వ్యవహారాల్లో మరీ దూకుడుగా వెళ్లడం చేత ఎదురుదెబ్బ తగిలిందని కొందరు విశ్లేషిస్తున్నారు. వాటి మాట ఎలా వున్నా ఆవిడ వ్యవహారశైలి వలననే ఆమె దెబ్బ తింది అనేది మాత్రం కొట్టవచ్చినట్లు కనబడుతోంది.

ఆవిడ పెద్దగా చదువుకోలేదు. ఏ మేరకు చదువుకున్నది అనేది కోర్టు త్వరలోనే తేలుస్తుంది. ఆ తీర్పు వచ్చేపాటికి ఆమె విద్యామంత్రిగా వుంటే ఎబ్బెట్టుగా వుంటుందని, వేరే శాఖకు మార్చారని కూడా కొందరంటున్నారు. ఎకడమిక్ క్వాలిఫికేషన్ మాట ఎలా వున్నా ఆవిడ విద్య నేర్చింది, తెలివితేటలు గడించింది. అందుకే అనుకోని రీతిలో 38 సంఎఎల వయసులోనే పెద్ద పదవి చేతికి అంది వచ్చి విద్యాశాఖలో నెగ్గుకుని వచ్చింది. ఇవన్నీ ఆమె అహంకారాన్ని పెంచాయి. విద్య విలువ తెలియనట్లు విద్యాధికులతో కూడా చాలా దురుసుగా ప్రవర్తించి చెడ్డపేరు తెచ్చుకుంది. ఆమె అధికారంలోకి వస్తూనే ఢిల్లీ యూనివర్శిటీ విసి దినేశ్ సింగ్ చేత ఆయన ప్రవేశపెట్టిన నాలుగేళ్ల డిగ్రీ కోర్సును రద్దు చేయించింది. ఇదివరకు తాము సమర్థించిన ఈ కోర్సును యిప్పుడు వ్యతిరేకించేట్లా యుజిసిపై ఒత్తిడి తెచ్చింది. విశ్వభారతి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ (విసి) సుశాంత దత్తగుప్త, పుదుచ్చేరి యూనివర్శిటీ విసి చంద్రా కృష్ణమూర్తిలను పదవుల్లోంచి తొలగించింది. ఇలా యింతకు ముందు ఎప్పుడూ జరగలేదు. ఈవిడతో వేగలేక బొంబాయి ఐఐటీ చైర్మన్ అనిల్ కాకోడ్కర్, ఢిల్లీ ఐఐటి చైర్మన్ ఆర్‌కె షెవగాంకర్ రాజీనామా చేశారు. ఆమె శాఖలో పనిచేసే 6గురు సెక్రటరీలు, 10 ఎడిషనల్ సెక్రటరీలు, 12 మంది జాయింటు సెక్రటరీలు యీమెతో పనిచేయలేం బాబోయ్, వేరే శాఖకు వేసేయండి అని అర్జీలు పెట్టుకున్నారు. ఉత్తి పుణ్యానికి పేచీకి దిగే ఆమె స్వభావమే దానికి కారణం. "డియర్ స్మృతి ఇరానీజీ" అంటూ బిహార్ విద్యామంత్రి ఆమెకు ట్వీట్ చేస్తేనే ఏదో అసభ్యపదం వాడినంత యాగీ చేసింది.

తక్కినవారిని తృణీకరించినా హాని ఏమీ జరగకపోవడంతో ఆమె మోదీ మాట కూడా లక్ష్యపెట్టడం మానేసిందట. బాబా రామ్‌దేవ్ జాతీయ వేద విద్యామండలి నెలకొల్పుతానని ప్రతిపాదించాడు. ఆరెస్సెస్ కూడా దానికి ఆమోదం తెలిపింది. అయితే దాని నిర్వహణ ఎవరి చేతిలో పెట్టాలనేదానిపై భేదాభిప్రాయం వచ్చింది. వేదపండితులు ఆధ్వర్యంలో నడవాలని ఆరెస్సెస్ భావించగా, రామ్‌దేవ్ ఆధ్వర్యంలో వుండాలని మోదీ, షా అనుకున్నారు. ఆ విషయం తెలిసి కూడా స్మృతి రామ్‌దేవ్‌ను ఆమోదించక, దాన్ని పెండింగులోనే పెట్టింది. ఐఐఎమ్ మేనేజ్‌మెంట్, 2015 బిల్లు విషయంలో కూడా మోదీతో ఆమె ఏకీభవించలేదు. దేశంలో 20 ప్రతిష్ఠాత్మకమైన విద్యాలయాలు పెట్టాలని, సెంట్రల్ యూనివర్శిటీ లన్నిటిలో వైఫై సౌకర్యం కల్పించాలని మోదీ సంకల్పించినా యీమె యింకా అమలు చేయక విపరీతమైన జాప్యం చేసింది. ప్రధాని కార్యాలయంతో, యీమె శాఖకు నిరంతరం వివాదాలు కొనసాగుతున్నాయి. మోదీకి తనకు ఆత్మీయుడైన మాజీ కేబినెట్ సెక్రటరీ టిఆర్ఎస్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఒక కమిటీ వేసి జాతీయ విద్యావిధానం ఎలా వుండాలో రూపకల్పన చేయించాడు. వాళ్లు తయారుచేసిన డ్రాఫ్టు పాలసీ రిపోర్టును ఈమె పట్టించుకోలేదు. నివేదికను బహిరంగ పరచి, చర్చకు పెట్టండి అని అడిగడిగి వేసారిన సుబ్రహ్మణ్యం 'నేనే దీన్ని బయటపెడతా' అని బెదిరించే దాకా వెళ్లారు. అయినా యీమె చలించలేదు.

ఈమె స్థానంలో వచ్చిన ప్రకాశ్ జావడేకర్‌కు సహాయమంత్రి పోస్టు నుంచి కాబినెట్ ర్యాంకుకు ప్రమోషన్ వచ్చింది. మోదీకి ఆత్మీయుడైన అదానీకి ఆయన మేలు చేశాడన్న విషయం మనం గుర్తించాలి. ముంద్రా పోర్టు నిర్మాణసమయంలో పర్యావరణాన్ని ధ్వంసం చేసినందుకు గౌతమ్ అదానీ కంపెనీకి రూ.200 కోట్ల జరిమానా పడింది. దాన్ని యీయన మాఫీ చేశాడు. ప్రకాశ్ కూడా ఆరెస్సెస్ నేపథ్యం వున్న వ్యక్తే కాబట్టి స్మృతి ప్రారంభించిన విద్యారంగ కాషాయీకరణ కార్యక్రమం కొనసాగుతుందని అనుకోవచ్చు. అతనికి సహాయమంత్రిగా వేసిన రామ్‌శంకర్ కఠేరియా కూడా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్‌కు సన్నిహితుడు. మరో సహాయ

మంత్రి మహేంద్ర నాథ్ పాండే కూడా. 10 రాష్ట్రాల నుంచి కొత్తగా తీసుకున్న 19 మందిలో సగం మందికి ఆరెస్సెస్‌లో పనిచేసిన నేపథ్యం వుంది. మొత్తం 77 మంది మంత్రుల్లో 70 మంది బిజెపివారే. వారిలో చాలామంది ఆరెస్సెస్‌కు ఆత్మీయులే.

మంత్రివర్గ పునర్నిర్మాణంలో మోదీ ప్రతిభను, పనితీరును లెక్కలోకి తీసుకుని నిర్దాక్షిణ్యంగా, నిర్మొగమాటంగా వ్యవహరించారని మీడియాలో రాయించుకున్నా యుపిలో ఎన్నికలకు, కులసమీకరణలకు పెద్ద పీట వేశారని కనబడుతూనే వుంది. యుపి నుంచి యిప్పటికే 12 మంది మంత్రులుండగా మరో ముగ్గుర్ని చేర్చుకున్నారు. ఈ 15 మందిలో ఆరుగురు మంత్రుల నియోజకవర్గాలు 100 కి.మీ.ల పరిధిలోనే వున్నాయంటే ఆ ప్రాంతంపై బిజెపి ఎంత ఫోకస్ పెట్టిందో తెలుస్తోంది. 75 ఏళ్లు దాటినవారిని వుంచకూడదన్న అప్రకటిత నియమం వున్నా ఆ వయసు దాటిన కల్‌రాజ్ మిశ్రా అనే యుపి బ్రాహ్మణ నేతను తీసేయలేదు. ప్రస్తుత కాబినెట్‌లో యుపి నుంచి ఐదుగురు బ్రాహ్మణులు, ఐదుగురు ఒబిసిలు, యిద్దరు రాజపుత్‌లు, ఒక సిఖ్కు, ఒక జాట్, ఒక దళితుడు వున్నారు. అంటే బిజెపి దళిత ఓట్లపై పెద్దగా ఆశ పెట్టుకోకుండా అగ్రకులాలు, ఒబిసిలపై దృష్టి పెట్టిందని అనుకోవాలి. 75 దాటిన నజ్మా హెప్తుల్లాను విదేశీ పర్యటన నుంచి వెనక్కి వచ్చాక రాజీనామా యిప్పించారు. ఆమె స్థానంలో మరో ముస్లిం ఎంజె అక్బర్‌ను చేర్చుకున్నారు. పనితీరు సరిగ్గా లేని ఐదుగురు సహాయమంత్రులను తీసేశారు. వారం రోజులాగి, భారీ పరిశ్రమల శాఖలో సహాయమంత్రి జిఎం సిద్ధేశ్వర చేత రాజీనామా చేయించారు. అందరితో బాటు తీసేద్దామనుకుంటే అతను 'ఇవాళ నా పుట్టినరోజు, ఆ సందర్భంగా నా అభిమానులు నా నియోజకవర్గంలో పెద్ద సభ ఏర్పాటు చేశారు. దానికి తీమం (తీతా లాగ) వెళ్లడం బాగుండదు' అని చెప్పుకున్నాడు. ఆ ముచ్చట కానిచ్చాక, పార్టీ బాధ్యతలు చేపట్టి, ఎడ్యూరప్పకు సహాయంగా వుండడం కోసం అనే పేరు చెప్పి తీసేశారు.

కులం లెక్కలు ఎంత తీవ్రంగా వేశారో ఉదహరించే ఓ పుకారు ఢిల్లీలో షికారు చేస్తోంది. దళితుల్లో పలుకుబడి పెంచుకోవాలి కాబట్టి ఓట్లు ముఖ్యం కాబట్టి, ఇద్దరు ఎస్టీలకు, ఐదుగురు ఎస్సీలకు కొత్తగా కాబినెట్‌లో చోటిచ్చారు గుజరాత్‌లో పటేళ్లు ఆందోళన చేస్తున్నారు కాబట్టి ఒక పటేల్‌ను, కొత్త కూటమిలో ఆదివాసీలు కీలకం కాబట్టి ఒక ఆదివాసీని కాబినెట్‌లోకి తీసుకున్నట్లే, రాజస్థాన్ నుంచి జాట్లను సంతృప్తి పరచాలనుకుని పిపి చౌధురీ అనే సుప్రీం కోర్టు లాయరును ఎంపిక చేశారు. జాబితా బయటకు లీక్ కాగానే రాజస్థాన్ బిజెపి యూనిట్ వారు 'ఈ చౌధురీ యింటిపేరు బట్టి జాట్ అనుకున్నారేమో, కాదు, సీర్వీ అనే కులానికి చెందినవాడు' అని చెప్పారు. అయ్యయ్యో అనుకుని సిఆర్ చౌధురీ అనే జాట్ పేరు కూడా చేర్చారట. సామర్థ్యమే కొలబద్దయితే ఉ మాభారతి వంటి అనేకమందిని తీసివేయవలసి వచ్చేది. వివాదాలను లెక్కలోకి తీసుకుంటే సంజీవ్ బలియా, నిరంజన్ జ్యోతి వంటి వారినీ తీసేయవలసి వచ్చేది. వీరెవ్వరినీ ముట్టుకోలేదు కానీ జయంత్ సిన్హాను ఆర్థిక శాఖ నుంచి తప్పించివేశారు. జయంత్ వెంచర్ కాపిటలిస్టుగా వున్నాడు కాబట్టి పారిశ్రామికవేత్తలతో బాగా వ్యవహరించగలడంటూ ఆ శాఖలోకి తీసుకుని వచ్చారు కానీ యిటీవల అతని తండ్రి యశ్వంత్ సిన్హా ప్రభుత్వాన్ని విమర్శించిన కారణంగానే యీ మార్పు జరిగిందని అంటున్నారు. జయంత్ భార్య పునీతా కుమార్ పాతికేళ్ల అనుభవం వున్న ఇన్వెస్ట్‌మెంట్ కన్సల్టెంట్. ఆమెను ఇన్ఫోసిస్‌లో యిండిపెండెంట్ డైరక్టరుగా తీసుకోవడం వలన, జయంత్ ఆర్థికశాఖలో కొనసాగడం ఔచిత్యభంగం కలిగిస్తుందనే సాకు పైకి చెప్తున్నారు. కీలకమైన యీ మార్పు గురించి తనకేమీ చెప్పకపోవడంతో జయంత్‌కు కోపం వచ్చింది. చార్జి హేండోవర్ చేయడానికి గునిశాడు. అతని స్థానంలో సంతోష్ గంగ్వార్, అర్జున్ రామ్ మెహవాల్‌లను వేశారు కానీ దానికి ముందు మోదీ కాని, అమిత్ కానీ అరుణ్ జైట్లేని సంప్రదించారో లేదో తెలియదు. అరుణ్‌పై మోదీ, షాలకు కాస్త కినుక లేకపోలేదు. అరుణ్ జైట్లీ న్యాయశాఖా మంత్రి కాకపోయినా న్యాయశాఖలో నియామకాలన్నిటిలో తనకు కావలసిన వారినే వేసుకున్నాడని, ఆ శాఖ మంత్రిగా సదానంద గౌడ దాన్ని నిరోధించలేకపోయాడని, అందుకే అతన్ని తీసేశారని కూడా అంటున్నారు. కమ్యూనికేషన్స్ మంత్రిగా రవిశంకర్ ప్రసాద్ ఆ వ్యాపారంలోని ప్రముఖులతో మరీ భుజాలు రాసుకుని తిరుగుతున్నాడు కాబట్టి, అక్కణ్నుంచి తీసేసి న్యాయశాఖలో వేసి ఆ శాఖలో అరుణ్ ప్రాబల్యానికి అడ్డుకట్ట వేయమన్నారట.

కులాల లెక్కతో ప్రాముఖ్యంలోకి వచ్చిన మరో మంత్రి 36 ఏళ్ల అనుప్రియ సింగ్ పటేల్. ఉత్తరప్రదేశ్‌లోని కూర్మీ కులానికి చెందిన సోనేలాల్ పటేల్ బియస్పీ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకడు. తర్వాత విడిగా వచ్చి అప్నాదళ్ అనే పార్టీ స్థాపించాడు. ఆయన పెద్ద కూతురు అనుప్రియ. ఢిల్లీలో శ్రీరాం కాలేజీలో చదువుకుంది. సైకాలజీలో, బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ చేసింది. సోనేలాల్ 2009లో రోడ్డు ప్రమాదంలో చనిపోతే, భార్య కృష్ణా పటేల్ పార్టీ అధ్యక్షురాలైంది. అనుప్రియ జనరల్ సెక్రటరీ అయింది. 2012 ఎన్నికల్లో వారణాశి పార్లమెంటరీ నియోజకవర్గంలోకి వచ్చే రోహనియా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా నిలబడి గెలిచింది. ఆ కులస్తుల ప్రాబల్యం వారణాశి సమీప ప్రాంతాల్లో బాగా వుంది. 2014 పార్లమెంటు ఎన్నికలలో యుపిలో ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటిస్తూ వచ్చిన బిజెపి, వారణాశిలో మోదీ ఘనవిజయం సాధించాలంటే కూర్మీ ఓట్ల అవసరం బాగా వుందని గ్రహించి, ఒక్క ఎమ్మెల్యే మాత్రమే వున్న అప్నాదళ్‌తో పొత్తు పెట్టుకుని దానికి రెండు పార్లమెంటరీ సీట్లు కేటాయించింది. ఒక దానిలో హరిబన్స్ సింగ్, మరో దానిలో సోనేలాల్ కూతురు అనుప్రియ నిలబడి గెలిచారు. గెలిచిన ఏడాది తర్వాత కృష్ణా పటేల్ తన రెండో కూతురు పల్లవిని కూడా పార్టీలోకి తీసుకుని వచ్చి ఆమెకు ఉపాధ్యక్ష పదవిని కట్టబెట్టింది. అది అనుప్రియకు రుచించలేదు. తిరగబడింది. హర్‌బన్స్ మాత్రం కృష్ణా పటేల్ వెంటే నిలబడ్డాడు. కూతుర్ని ఆరేళ్లపాటు పార్టీలోంచి బహిష్కరించిన తల్లి ఆమెను కేంద్ర కాబినెట్‌లో తీసుకుంటే ఎన్‌డిఏలోంచి వైదొలగుతానని బిజెపినిబీ హెచ్చరించింది. అయినా అనుప్రియను మంత్రి చేసి తన మిత్రపక్షాన్ని రెండుగా చీల్చింది బిజెపి. రాబోయే యుపి ఎన్నికలలో కూర్మీ ఓట్లు తల్లి పక్షాన పడతాయో, కూతురి పక్షాన పడతాయో చూడాలి.

– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)

జులై 30 ఎమ్బీయస్ ః స్వాతి హత్య కేసులో లాయరు వింత వాదన

ఇన్ఫోసిస్ ఉద్యోగిని స్వాతి హత్యకేసులో హంతకుణ్ని విచారించడానికి మూడు రోజుల పోలీసు కస్టడీకి అప్పగిస్తూ చెన్నయ్ 14వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు నిన్ననే తీర్పు చెప్పింది. ఆ సందర్భంగా ముద్దాయి తరఫు లాయరు చిత్రమైన వాదన వినిపించారు. హత్య ఆవేశంలో జరిగివుంటే హంతకుడు పశ్చాత్తాపంలో లొంగిపోయి వుండాలి. అలాటిదేమీ లేకుండా పారిపోయాడు. పట్టుకుని పోలీసు కస్టడీకి తీసుకుని విచారణ చేద్దామంటే యీ లాయరు అభ్యంతరాలు తెలిపాడు. వాటి గురించి చర్చించేముందు హత్య జరిగిన తీరు, హంతకుడి ప్రవర్తన చర్చించడం అవసరం.

2016 ఏప్రిల్‌లో ఎన్నికల ప్రచారసభలో పాల్గొంటూ జయలలిత 'చెన్నయ్‌లో శాంతిభద్రతలు అద్భుతంగా కాపాడబడుతున్నాయి. ముఖ్యంగా ఆడవారికి భద్రత కల్పించే నగరమిది' అని ఉపన్యసించింది. అదే రోజున కరుణానిధి ఆమెను ఖండిస్తూ ''2011లో జయలలిత అధికారం చేపట్టిన దగ్గర్నుంచి 2015 చివరి వరకు 9948 హత్యలు, లక్ష దోపిడీలు, దొంగతనాలు జరిగాయి. అంటే రోజుకి 7 హత్యలు, 70 దొంగతనాలు అన్నమాట. గత మూడేళ్లలో మహిళల పట్ల 20 వేల నేరాలు జరిగాయి. వాటిల్లో 2335 సెక్స్ సంబంధిత నేరాలే. '' అని వెక్కిరించాడు. ఆ మాటలు నమ్మవద్దని జయలలిత ఓటర్లను కోరింది. వాళ్లు విన్నారు. ఆమె గెలిచి మే 23న మళ్లీ అధికారం చేపట్టింది. 40 రోజుల గడిచే లోపుగా అనేకమంది మహిళలు హత్యలకు గురయ్యారు. మే 8న రోహిణీ ప్రేమకుమారి అనే అంకాలజిస్టు చెన్నయి నగరమధ్యంలో వున్న ఎగ్మూరులో తన నివాసంలో హత్య చేయబడ్డారు. జూన్ 19 నుంచి 26 లోపున ఏడుగురు మహిళలు చంపబడ్డారు. ఆరుగురు చెన్నయ్‌లో, ఒకరు తిరునల్వేలి జిల్లాలో! తన ఫోటోను అశ్లీలంగా మార్ఫ్ చేసి ఫేస్‌బుక్‌లో పెట్టినందుకు బాధపడిన ఒక యువతి సేలంలో ఆత్మహత్య చేసుకుంది. జూన్ 24 న నగరమధ్యంలోనే వున్న నుంగంబాకం లోకల్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం పై ఉఎఎ 6.45కు రైలు కోసం వెయిట్ చేస్తున్న స్వాతి అనే 24 ఏళ్ల ఇన్ఫోసిస్ ఉద్యోగిని దారుణ హత్యతో నగరమే కాదు, రాష్ట్రమే ఉలిక్కిపడింది.

స్వాతి చిన్నప్పణ్నుంచి నుంగబాకంలోనే నివసిస్తోంది. అక్కడే గుడ్‌షెపర్డ్ స్కూల్లో చదివి తాంబరంలోని ధనలక్ష్మీ యింజనీరింగు కాలేజీలో కంప్యూటర్ సైన్సెస్‌లో చదువుకుంది. 2014 జులైలో ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం వచ్చింది. మైసూరులో ట్రైనింగు పూర్తి చేసుకున్నాక నుంగంబాకం నుంచి 45 కి.మీ.ల దూరంలో పరనూరులో వున్న మహీంద్రా వ(ర)ల్డ్ సిటీ క్యాంపస్‌లోని ఇన్ఫోసిస్ బ్రాంచ్‌లో రిపోర్టు చేసింది. రోజూ ఉదయం 6.45కు నుంగంబాకంలో లోకల్ ట్రైన్ పట్టుకుని ఆఫీసుకు వెళుతూంటుంది. ఆమె తండ్రి సంతాన గోపాలకృష్ణన్ రోజూ ఉదయం ఆమెను స్కూటర్ మీద 6.30 కల్లా దింపుతూంటాడు. హంతకుడు రామ్‌కుమార్ తిరునల్వేలి టౌనుకి 60 కిమీ.ల దూరంలో వున్న మీనాక్షిపురం వద్ద వున్న పన్‌పొళి గ్రామనివాసి. తండ్రి బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి. తల్లి గృహిణి. ఇద్దరు అక్కలున్నారు. తిరునల్వేలి జిల్లాలోని అలంకులంలో ఐన్‌స్టీన్ ఇంజనీరింగు కాలేజీలో బిఇ పూర్తి చేసి, ఉద్యోగం కోసం మూణ్నెల్ల క్రితం చెన్నయ్ వచ్చి సౌరాష్ట్ర నగర్ ఎయిత్ స్ట్రీట్‌లో స్వాతి యింటికి దగ్గర్లో వున్న లాడ్జిలో వున్నాడు. తన కంటె రెండేళ్లు పెద్దదైన స్వాతిని మే 11న చూశాక తనతో స్నేహం చేయమని, తనను ప్రేమించమని వేధించసాగాడు. కానీ ఆమె నిరాకరించింది. రోజూ ఆమె వెంటే నుంగంబాకం స్టేషన్‌లో రైలెక్కి ఆఫీసుకి వెళ్లి వస్తూండేవాడు. స్టేషన్‌లో బుక్‌స్టాల్‌ను వంతులవారీగా నడిపే దంపతులు యితన్ని గమనించారు. హత్య జరిగినపుడు బుక్‌స్టాల్‌లో భర్త వున్నాడు. పోలీసులు ఐడెంటిఫికేషన్ పెరేడ్‌కు పిలిచినపుడు అతను రామ్‌కుమార్‌ను గుర్తు పట్టాడు. స్వాతి రామ్‌కుమార్ గురించి తండ్రికి ఫిర్యాదు చేసి, తండ్రికి చూపించింది. అందువలన ఆయన కూడా పెరేడ్‌లో హంతకుణ్ని గుర్తుపట్టాడు.

జూన్ 24న స్వాతిని ఆమె తండ్రి ఎప్పటిలాగానే స్టేషన్ దగ్గర దింపాడు. ఆమె రెండో నెంబరు ప్లాట్‌ఫాంపై లోకల్ ట్రైన్ గురించి వెయిట్ చేస్తోంది. లేడీస్ కంపార్టుమెంటు ఆగే చోటికి ఎదురుగా ఓ బెంచి మీద ఎప్పటిలా కూర్చుంది. వెనక్కాల టెలిఫోన్ బూతు, పుస్తకాల షాపు, ఫలహారశాల, మరో స్టాలు వరసగా వున్నాయి. అక్కడ రామ్‌కుమార్ చురకత్తి లాటి ఆయుధంతో రెడీగా వున్నాడు. నెలన్నరగా తను ప్రేమిస్తున్నా స్పందించని స్వాతిపై అతను కుతకుతలాడిపోతున్నాడు. ఆమె వైపు కదిలాడు. వెనక్కాల అలికిడి విని స్వాతి తల తిప్పింది. హంతకుడు కత్తితో ఆమె కుడి దవడ మీద, మెడ మీద, తల మీద కొట్టాడు. ఆమె కింద పడిపోయింది. అతను వెంటనే కోడంబాకం వైపు పట్టాల మీదకు దుమికి, ఒక 50 మీటర్ల దూరం పట్టాల మీద పరిగెట్టి, చేతిలోని ఆయుధాన్ని సిగ్నల్ బాక్సుల వద్ద పడేసి, రైల్వే బోర్డరు రోడ్డు వైపున్న గోడ ఎక్కాడు. దాని అంచుపై గాజుముక్కలు పాతి వుండడంతో అవి అతనికి గుచ్చుకున్నాయి. రక్తం కారి గోడ మీద అంటింది. అతను గోడ దూకి పారిపోయాడు. అతను స్టేషన్‌పై యీ ఘోరక కృత్యం చేస్తూండగా పక్కనున్నవారు వారించలేదు, అడ్డుపడలేదు, అతని వెంట పరిగెట్టలేదు. ఆమె వద్దకు వచ్చి ఆమె పరిస్థితి ఎలా వుందో, బతికి వుందో, అప్పటికే చచ్చిపోయిందో చూడలేదు. పోలీసులకు కాని, ఆంబులెన్సుకి కాని ఫోన్ చేయలేదు. హత్య జరిగిన కొన్ని నిమిషాలకు రైలు రాగానే అక్కణ్నుంచి పారిపోతే మేలనుకుని, కంటికి ఎదురుగా కనబడిన కంపార్టుమెంటులోకి ఉరికారు. వాళ్ల తర్వాత స్టేషనుకు వచ్చినవారైనా స్వాతి రక్తం కారుతూ, బాధతో కొట్టుకుంటూ వుంటే ఎవరూ ఆమె దగ్గరకు రాలేదు. ఆ తర్వాత

చాలా రైళ్లు వచ్చాయి, వెళ్లాయి. ఆ స్టేషన్లో ఎక్కేవారు ఎక్కారు, దిగేవారు దిగారు. ఎవరూ ఆమెను పట్టించుకోలేదు. చివరకు ఎవరు ఫోన్ చేశారో ఏమో కానీ పోలీసులకు రెండు ఫోన్ కాల్స్ వెళ్లాయి. వాళ్లు 9 గంటల సమయంలో వచ్చారు. అప్పటికి ఆమె చనిపోయి వుంది. ఆమె శవం మీద గుడ్డ కప్పినవారు కూడా లేకపోయారు. పోలీసులే గుడ్డ కప్పి, ఆమె బ్యాగులోంచి ఐడెంటిటీ కార్డు తీసి చూసి, దాని ప్రకారం వాళ్ల యింటికి వెళ్లి తండ్రికి జరిగినది చెప్పారు.

ఈ వార్త బయటకు రాగానే సాటి ప్రయాణీకుల ప్రవర్తన పట్ల చెన్నయ్ వాసులతో సహా సభ్యసమాజం యావత్తు తలదించుకుంది. హంతకుడిపై ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. స్టేషన్లో సిసిటివి కెమెరా లెందుకు లేవని అందరూ అడగసాగారు. విచారణ బాధ్యత మీదంటే మీదని అని గవర్నమెంట్ రైల్వే పోలీసు (జిఆర్‌పి), చెన్నయ్ సిటీ పోలీసు వ్యవస్థ తగవు లాడుకుంటున్నారని విని మండిపడ్డారు. జూన్ 27 న మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌లోని యిద్దరు న్యాయమూర్తులు సుమోటోగా కేసు చేపట్టి పబ్లిక్ ప్రాసిక్యూటరును పిలిచి పోలీసుల తగవులాటలో నిజానిజాలు తేల్చమని అడిగారు. రెండు రోజుల్లోగా హంతకుణ్ని కనిపెట్టి తీరాలన్నారు. ఆ రోజు మధ్యాహ్నమే ప్రాసిక్యూటర్ 'రైల్వే పోలీసు, చెన్నయ్ సిటీ పోలీసుకు కేసు అప్పగించేసింది. నుంగంబాకం ఎసిపి దేవరాజ్ కేసు విచారిస్తున్నార'ని నివేదించారు. ఇక అక్కణ్నుంచి స్వాతి యిరుగుపొరుగు, సహోద్యోగులు, కుటుంబసభ్యులు అందర్నీ అడిగి సమాచారం సేకరించారు. హత్యకు ముందు, వెనక నుంగంబాకం, చూలైమేడు ప్రాంతాల్లోని ఫోన్‌కాల్స్ రికార్డులు తిరగేశారు. ఈ ప్రమాదాన్ని వూహించిన హంతకుడు స్వాతిని చంపిన తర్వాత ఆమె సెల్ తీసుకుని స్టేషన్‌కు దగ్గరలో వున్న చూలైమేడులో పారేశాడు. అంతేకాదు, హంతకుడి దగ్గర వున్న సిమ్ అతని పేర లేదు. ఇంజనీరింగు కాలేజీలో తన క్లాసుమేటు దగ్గర వున్నది తీసుకుని వాడుకుంటున్నాడు. ఆ సిమ్ క్లాసుమేటు తండ్రి పేర వుంది. ట్యూటికొరిన్‌లో ఓ అద్దె యింట్లో వుండగా ఆయన తన పేర తీసుకున్న సిమ్ అది.

ఇన్ని జాగ్రత్తలు పడినా కేసు యిక్కడదాకా వచ్చిందంటే దానికి కారణం సిసిటివి కెమెరాలకు చిక్కిన హంతకుని చిత్రాలు. అవి కూడా నుంగంబాకం రైల్వే స్టేషన్‌లో పెట్టినవి కావు. ఉదయం 6.45కు స్టేషన్‌లో చాలామంది జనమే వున్నారు. ఎవరూ హంతకుడికి అడ్డు వెళ్లలేదు సరికదా కనీసం అతని ఫోటో సెల్‌ఫోన్‌తో తీసి పోలీసులకు పంపలేదు. అతను రైలు పట్టాలు దాటి గోడ దూకి రోడ్డెక్కాక స్టేషన్ పక్కన వున్న సౌరాష్ట్ర నగర్‌లో సెవెన్త్ క్రాస్ స్ట్రీట్‌లో ఒక యింటికి ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాకు చిక్కాడు. హత్య జరగడానికి ముందు రైల్వే బోర్డరు రోడ్డు మీద ఒక ప్రయివేటు సంస్థ ఏర్పరచుకున్న కెమెరాకు చిక్కాడు. హత్య జరగడానికి ముందు అతను బ్యాక్‌పాక్‌తో వెళుతున్నట్లు కనబడ్డాడు. అది హంతకుడే కావాలని ఏమీ లేదు కదా! కానీ హత్య జరిగాక చిక్కిన ఫోటోలో గోడ దూకేటప్పుడు గాజుముక్కలు గుచ్చుకుని కారిన రక్తం కారిన చేతులను చూసుకుంటున్నాడు. దాంతో హంతకుడు ఫలానా అని తెలిసిపోయింది. ఇక అక్కణ్నుంచి అతని గురించి వేట ప్రారంభమైంది. వారం రోజుల తర్వాత దొరికాడు. ఆ కెమెరాలే వుండి వుండకపోతే ఎన్నాళ్లకు దొరికేవాడో తెలియదు. హత్య జరిగి హంతకుడికై వేట సాగుతున్నపుడు జస్టిస్ కృపాకరన్ మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు 15 ప్రశ్నలతో ఒక లేఖ రాశారు. వాటిలో బసు స్టాండ్లలో, రైల్వే స్టేషన్లలో, హాస్పటళ్లలో, షాపింగు మాల్స్‌లో, బీచ్ రోడ్లపై సిసిటివి కెమెరాలు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2013లో ఎపి పబ్లిక్ సేఫ్టీ (మెజర్స్) ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ చేసి ప్రయివేటు సంస్థలన్నీ వీధిని కూడా కవరు చేసేట్లా సిసిటివి కెమెరాలు పెట్టాలని చట్టం చేసింది. అలాటి చట్టం అన్ని రాష్ట్రాలూ చేయాలని కేంద్రం హోం శాఖ ఎందుకు ఆదేశించదు? అని అడిగారు.

పశ్చాత్తాపభారంతో పోలీసులకు సహకరించిన ఎందరో సాధారణ పౌరుల సహకారంతో జులై 1 కల్లా హంతకుడి ఆనుపానులు పోలీసులు కనిపెట్టగలిగారు. హత్య చేశాక, రామ్‌కుమార్ తన సొంతూరికి వెళ్లిపోయి యింట్లోనే దాగున్నాడు. సిసిటివిల ద్వారా బయటకు వచ్చిన తన ఫోటోను టీవీల్లో చూసి, అది తనే అని యిరుగుపొరుగు గుర్తు పడతారని భయపడి కాబోలు, యింట్లోంచి బయటకు రాలేదు. జులై 1 రాత్రి 11 గంటలకు అతని యింటిని పోలీసులు చుట్టుముట్టారు. తన దగ్గరకు రావద్దని, వస్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. అయినా పోలీసులు దగ్గరకు రావడంతో ఒక చాకుతో తన గొంతు కోసుకున్నాడు. అతన్ని వెంటనే తెన్‌కాశిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కణ్నుంచి తిరునల్వేలి లోని ప్రభుత్వ వైద్య కళాశాలకు తీసుకువచ్చారు. అతను గాయపడడంతో విచారణ చేయడం కష్టమైంది. జుడిషియల్ కస్టడీలో వుంచి, అరెస్టు చేసిన 12 రోజుల తర్వాత విచారణకై 5 రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించమని కోర్టును కోరారు. రామ్‌కుమార్ తరఫున వాదిస్తున్న లాయరు పి.రామరాజు ''పోలీసులే మా క్లయింటు మెడ కోశారనే అనుమానం వుంది మాకు. అతని చికిత్స పూర్తి కాకుండానే చెన్నయ్‌కు తెచ్చారు. అతను మాట్లాడే పరిస్థితిలో లేడు. అతనికి సరైన మెడికల్, సైకలాజికల్ చికిత్స చేయించందే విచారణ ప్రారంభించడం అన్యాయం. అతని ప్రాణం ప్రమాదంలో పడుతుంది. అందువలన జుడిషియల్ కస్టడీలోనే వుంచాలి' అని వాదించాడు. ఇరుపక్షాల వాదనలు విన్నాక జడ్జి మూడు రోజుల పోలీసు కస్టడీని అనుమతించారు. రామ్‌కుమార్ తన అడ్వకేట్‌ను పొద్దున్న, సాయంత్రం అరగంటసేపు కలవవచ్చని చెప్పారు. వైద్యచికిత్స కొనసాగించే బాధ్యత పోలీసులదే, శనివారం తిరిగి జుడిషియల్ కస్టడీకి అప్పగించాలి. అన్నారు. విచారణ మొత్తాన్ని వీడియో తీయిస్తామని పోలీసులు చెప్తున్నారు.

ఇంజనీరింగు పాసయిన రామ్‌కుమార్ ఆలోచనా ధోరణి, వ్యవహారం తలచుకుంటే విస్మయం, కంపరం కలుగుతాయి. స్వాతిని ప్రేమించే హక్కు తన కెంత వుందో, తన ప్రేమను నిరాకరించే హక్కు ఆమెకు వుందని అతను గుర్తించలేదు. ఆమె అతని కంటె రెండేళ్లు పెద్దది. ఇన్ఫోసిస్‌లో ఉద్యోగిని. ఇతను నిరుద్యోగి. ఆమెకు అపరిచితుడు. ఇద్దరిదీ ఒక వూరు కాదు, ఒక కాలేజీ కాదు, ఒక

ఆఫీసు కాదు. ఒక కాలనీలో వుంటున్నారంతే. ఇతనిలో ఆకర్షించే గుణం ఆమెకు కనబడకపోయి వుండవచ్చు. నెలల తరబడి వెంటపడితే ఆమె మనసు కరిగినా కరిగి వుండవచ్చు. కానీ యితనికి అంత ఓపిక లేదు. మే 11 న తొలిసారి చూశాడు. తను వలచగానే ఆమె వలలో పడనందుకు కోపం తెచ్చుకున్నాడు. చంపేయడానికి నిశ్చయించుకున్నాడు. జూన్ 24 కల్లా ఆ పని పూర్తి చేశాడు. ఏదైనా వాగ్వాదం జరిగి, ఆవేశంలో ఆమెను కొడితే చనిపోలేదు. కోల్డ్‌బ్లడెడ్‌గా, పథకం వేసి ఆమెను నరికి వేశాడు. దీనిలో పాపం స్వాతి తప్పేమిటి? తన యిష్టాయిష్టాలను ప్రకటించడమేనా? ఈ విద్యాధికుడు కూడా యిలా ప్రవర్తించడానికి మన సినిమాల్లో చిత్రీకరిస్తున్న హీరో పాత్రలు కూడా కొంత కారణమని ఒప్పుకోవాలి. కాలేజీలో అందరి ఎదుట ముద్దు పెట్టు అని జబర్దస్తీ చేయడం, అర్ధరాత్రి తాగి అలగా ఫ్రెండ్స్‌తో కలిసి యింటికి వచ్చి అల్లరి పెట్టడం, అడ్డుపడిన హీరోయిన్ తండ్రిని అవహేళన చేయడం – యివే కథానాయకుడి లక్షణాలుగా, అంతిమంగా కథానాయకి అతనంటే పడిచచ్చేందుకు కారణమైన గుణాలుగా చూపిస్తున్నారు. వీటి ప్రభావం ఎంతో కొంత మేరకు సమాజంపై వుంటుందని అనుకోవడానికి ఆస్కారం వుంది. మా "హాసం క్లబ్బు"లో ఓ సారి ఒక హాస్యకవి, ఒక మిమిక్రీ ఆర్టిస్టు కలిసి ఓ ప్రదర్శన యిచ్చారు. మగ కుక్క ఆడకుక్క వెంట ఎలా పడుతుందో గేయరూపంలో కవి చదువుతూండగా, మిమిక్రీ ఆర్టిస్టు శబ్దరూపంలో కుక్కను అనుకరించాడు. అందరూ పడిపడి నవ్వారు. చివరిలో ముక్తాయింపుగా – 'ఇలా మూడునాలుగు వీధుల దూరం వెంటపడినా ఆడకుక్క కరుణించకపోతే మగకుక్క తోక వేలాడేసుకుని వెనక్కి వచ్చేస్తుంది కానీ దాని మీద యాసిడ్ పోయదు!' అని కవి ముగించారు. ప్రేక్షకులందరూ స్టన్నయిపోయారు. మనుష్యులుగా పుట్టినందుకు సిగ్గుపడ్డారు.

– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)

జులై 34 **ఎమ్బీయస్ : షీలా దీక్షిత్ బ్రాహ్మణ్యం**

2017 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెసు తరఫు ముఖ్యమంత్రి అభ్యర్థిగా షీలా దీక్షిత్‌ను ఎంపిక చేశారు. ఎందుకు చేశారో ఎవరికీ అర్థం కావటం లేదు. ఆవిడ 78 ఏళ్ల వయోధికురాలు. ఢిల్లీలో రెండు దఫాలు ముఖ్యమంత్రిగా దక్షతతో పాలించినా మూడో దఫాలో కామన్‌వెల్త్ గేమ్స్ అవినీతి వంటి పెద్ద స్కాముల్లో యిరుక్కుంది. పరిపాలన కూడా కుంటుపడి, ఢిల్లీ ఎసెంబ్లీ ఎన్నికలలో వరుసగా రెండుసార్లు కాంగ్రెసు ఓడిపోయింది. పైగా ఆవిడకు ఎన్నికలలో దిగాలన్న కోరిక ఏ మాత్రం వ్యక్తం చేయలేదు. ఢిల్లీ వంటి అర్ధరాష్ట్రంలోనే దెబ్బ తిన్న వ్యక్తికి యుపి వంటి పెద్ద రాష్ట్రాన్ని పాలించమంటే పాలించగలదా? ఇవేమీ లెక్కలోకి తీసుకోలేదు. బ్రాహ్మణ ఓట్లపై కాంగ్రెసు కన్నేసింది కాబట్టి ఆవిడను నిల్చోబెట్టింది అని కొన్ని పత్రికలు రాస్తున్నాయి. షీలా బ్రాహ్మణి ఎలా అయిందో నాకు అర్థం కావటం లేదు. పుట్టుక చేత ఆవిడ పంజాబీ ఖత్రి (క్షత్రియ). బ్రాహ్మణుడైన ఉమాశంకర్ దీక్షిత్ కుమారుడు, ఐయేయస్ అధికారి వినోద్ దీక్షిత్‌ను పెళ్లాడింది కాబట్టి కపూర్ అనే యింటి పేరు మారి దీక్షిత్ వచ్చి చేరింది. అంతే!

హిందూ సమాజంలో పెళ్లి వలన కులం మారుతుందా? షీలా పిల్లలు సగం బ్రాహ్మణ–సగం క్షత్రియ అవుతారు. క్షేత్రాన్నో, బీజాన్నో లెక్కలోకి తీసుకుని తమను తాము బ్రాహ్మణగానో, క్షత్రియగానో చెప్పుకోవచ్చు. భర్త బ్రాహ్మణుడు, అల్లుడు ముస్లిం అయినంత మాత్రాన షీలా బ్రాహ్మణియో, ముస్లిమో అయిపోతుందా? ఇందిరా గాంధీ బ్రాహ్మణి. ఆమె భర్త పార్శీ. రాజీవ్ గాంధీ సగం బ్రాహ్మణుడు. కానీ ఆయన బీజాన్ని ప్రధానంగా లెక్కించి తను పార్శీ అని చెప్పుకున్నాడు. ఆయన కూతురు ప్రియాంకలో పావు బ్రాహ్మణత్వం వుంది. పావు పార్శీ, సగం క్రైస్తవం వుంది. ఆమెను ముఖ్యమంత్రి అభ్యర్థినిగా తీసుకుని వస్తారు అన్నపుడు కూడా బ్రాహ్మణ ఓటర్లను దృష్టిలో పెట్టుకుని.. అని మీడియా రాసింది. అది ఎలా పొసుగుతుందో నాకు అర్థం కాదు. బ్రాహ్మణులను ఆకట్టుకోవాలనే లెక్కతోనే బిజెపి వరుణ్ గాంధీని ముందుకు తెద్దామా అని చూస్తోంది.. అని కూడా మీడియా రాసింది. వరుణ్ గాంధీ తండ్రి సగం బ్రాహ్మణుడు, తల్లి సిఖ్ఖు. అందుచేత వరుణ్ కూడా పావు బ్రాహ్మణుడే. అతణ్ని బ్రాహ్మణ అభ్యర్థిగా ఎలా చూపిస్తారు? చూపిస్తే నమ్ముతారా?

ఎందుకీ కులాల గోల? అంటే కాంగ్రెసుకు సలహాదారుడిగా చేరిన ప్రశాంత్ కిశోర్ కూడికలు, తీసివేతలు వేసి చూసి కాంగ్రెసు పక్షాన బ్రాహ్మణ అభ్యర్థి వుండి తీరాలని చెప్పాడట. అలా ఎందుకంటే – తక్కిన పార్టీలన్నీ కూడా కులాలవారీ లెక్కలే వేస్తోంది కాబట్టి! బియస్పీ దళిత పార్టీ. బ్రాహ్మణులతో చేతులు కలిపినప్పుడు నెగ్గి అధికారంలోకి వచ్చింది. సమాజ్‌వాదీ పార్టీ బిసిల, ముఖ్యంగా యాదవుల పార్టీ. వీళ్లిద్దరూ ముస్లిములను దువ్వుదామని ప్రయత్నిస్తున్నారు కానీ వాళ్లు ఎటు మొగ్గు చూపుతారో ఎవరికీ తెలియటం లేదు. ముస్లిములను బుజ్జగించవలసిన అవసరం లేని పార్టీ బిజెపి. ఏదో రకంగా అన్ని కులాల హిందూ ఓట్లను సంఘటితం చేయగలిగితే తనకు ఎదురు వుండదని బిజెపి లెక్క. 2014 పార్లమెంటు ఎన్నికలలో బిజెపి ఘనవిజయం సాధించింది. ఇందిర హత్య తర్వాత 1984లో రాజీవ్ గాంధీ 85 పార్లమెంటు సీట్లలో 83 గెలిచాడు. ఆ తర్వాతి రికార్డు బిజెపిదే. 42% ఓట్లతో 80 సీట్లలో 71 గెలిచింది. అయితే అప్పుడు కులప్రస్తావన కంటె 'వికాస్' (అభివృద్ధి) అనే నినాదమే ఎక్కువగా వాడారు. మోదీ వస్తే దేశాభివృద్ధికి లోటు వుండదని ప్రజలను నమ్మకం కలిగించారు.

పదవీకాలంలో సగం పూర్తయ్యాక అభివృద్ధి నినాదంతో ఆకట్టుకోవాలని చూస్తే ఓట్లు రాలవని భయం పట్టుకుంది. ఎందుకంటే యుపిలో కరువు తాండవించి, పంటలు విఫలమయ్యాయి. మోదీ నడిపే కేంద్రప్రభుత్వం నుంచి తగినంత సాయం రాలేదు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

పెరగలేదు, వ్యవసాయరంగంలో ఉద్యోగాలు, పరిశ్రమలు పెరగలేదు. రెండేళ్లగా రైతుల జీవితాలలో వికాసం జరగలేదు. పైగా అప్పుడు మోదీ అభ్యర్థి, కాంగ్రెసు వ్యతిరేకత తారాస్థాయిలో వుంది. ఇప్పుడు పరిస్థితి సాధారణ స్థితికి వచ్చింది. ఏ రకమైన వేవ్ గోచరించటం లేదు. అందుచేత దశాబ్దాలుగా నమ్ముకున్న కులసమీకరణాలతోనే అందరూ ముందుకు సాగుతున్నారు. నిజానికి ఘనవిజయం సాధించిన తర్వాత బిజెపి యుపిలో తన పార్టీ వ్యవస్థను బలోపేతం చేసుకోలేదు. ఇతర రాష్ట్రాల ఎన్నికలలో బిజీగా వుండిపోయింది. హిందూమతానికి సంబంధించిన విషయాలలో కొందరు చురుగ్గా వుండి వివాదాలు కొని తెచ్చుకున్నారు తప్ప ప్రజాందోళనలు చేపట్టలేదు. ఇప్పుడు అమిత్ షా యుపిపై దృష్టి సారించడంతో యిక హడావుడి ప్రారంభమైంది.

ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవర్ని ప్రకటించడం అనే విషయంపై బిజెపి యింకా ఎటూ తేల్చుకోలేదు. ముందే ప్రకటించడం కొన్ని రాష్ట్రాలలో మేలు చేసింది, మరి కొన్నివాటిల్లో కీడు చేసింది. స్మృతి ఇరానీని ప్రకటిద్దామా అన్న ఆలోచన వచ్చి, ఢిల్లీలో కిరణ్ బేదీ వ్యవహారంలా తయారవుతుందేమోనని దడిశారట. వరుణ్ గాంధీని చేయమని మేనకా అడుగుతోందట కానీ అతనికి అతివాద హిందూ యిమేజి వుంది. మొహంపై చిరునవ్వు కనబడదు, జనంలోకి దూసుకుని వెళ్లే అలవాటు లేదు. కజిన్ రాహుల్ గాంధీ కంటె చాలా రెట్లు మెరుగే కానీ యుపిలాటి పెద్ద రాష్ట్రంలో నెగ్గుకు రాగలడన్న నమ్మకం చాలటం లేదు. 2002లో ముఖ్యమంత్రిగా దిగిపోయిన రాజనాథ్ సింగ్ కూడా బిజెపి ఆలోచనలో వున్నాడట. ఏది ఏమైనా 17% ఓట్లున్న అగ్రవర్ణాలను (బ్రాహ్మణ, రాజపుత్ర, వైశ్య) ఆకట్టుకునే ప్రయత్నంలోనే బిజెపి పడింది. వారిని పూర్తిగాను, బిసిలను కొంతవరకు తమ వద్దకు తెచ్చుకుంటే గెలుపు సులభం. ఎందుకంటే నాలుగు పార్టీలు ఓట్లను పంచుకోబోతున్నాయి. ఎవరూ వేరేవారితో పొత్తు పెట్టుకునేట్లు లేరు. మాయావతికి అవినీతి మచ్చ, ములాయంకు శాంతిభద్రతల మచ్చ, కాంగ్రెసుకు నాయకత్వ లేమి. 27 ఏళ్లగా గద్దెకు దూరంగా వుండి క్యాడర్ కూడా చెదిరిపోయింది.

అందువలన బిజెపికి మంచి అవకాశం వుంది. దాన్ని వినియోగించుకోవాలంటే సరైన పాళ్లు కుదరాలి. 1998 ఎన్నికలలో రామ మందిరం కడతామనే హామీతో 85లో 57 సీట్లు తెచ్చుకున్నాం కాబట్టి దాన్ని మళ్లీ లేవనెత్తాలని ఆరెస్సెస్ పట్టుబడుతున్నా బిజెపికి ధైర్యం చాలటం లేదు. దానికి బదులుగా ముస్లిం బూచిని చూపించి, అన్ని వర్ణాల హిందువులను కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. 2013 ముజఫూర్‌పూర్ అల్లర్లలో నిందితుడు, బిజెపి ఎంపీ అయిన హుకుమ్ సింగ్ యిటీవల శామిలీ జిల్లాలోని కైరానా నుంచి 346 మంది హిందువులు, ముస్లిము గూండాలు బెదిరించడంతో వూరు వదిలి పారిపోయారని, అఖిలేశ్ ప్రభుత్వం వారికి రక్షణ కల్పించలేకపోయిందని ఆరోపిస్తూ వారి పేర్లతో జాబితా విడుదల చేశాడు. ఆ జాబితాను క్షుణ్ణంగా పరిశీలిస్తే తేలిందేమిటంటే – వారిలో కొందరు చచ్చిపోయి చాలాకాలమైంది, కొందరు చదువు కోసమో, ఉద్యోగాల కోసమో వూరు వదిలి వెళ్లారు. అయినా జూన్ 13 నాటి ర్యాలీలో అమిత్ షా ఆ ఆరోపణను పునరుద్ఘాటించాడు. ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ యిలాటి ట్రిక్కులు పెరగవచ్చు. ప్రస్తుతానికి బిజెపి దళిత–కూర్మీ–బ్రాహ్మణ కూటమి ఏర్పరచడానికి చూస్తోందిట. మోదీని బిసిగా చూపించి, బిసిల మద్దతు సంపాదించవచ్చు.

గుజరాత్‌లో గోరక్షణ పేరుతో దళితులపై జరిగిన దాడి పార్లమెంటులో చర్చకు వచ్చిన రోజే, మాయావతి గురించి ఓ బిజెపి నాయకుడు అనుచిత వ్యాఖ్య చేయడంతో అతనిపై వెంటనే చర్య తీసుకుని, దళిత వ్యతిరేకతను తమ పార్టీ సహించదని బిజెపి చూపుకునే ప్రయత్నం చేసింది. ముస్లిములపై అనుచిత వ్యాఖ్యలు చేసినవారిని మాత్రం ఏ పదవుల్లోంచి తీసివేయలేదు. ఎందుకంటే యుపిలో గెలవాలంటే దళిత ఓట్లు ముఖ్యం. కాంగ్రెసుకు అన్ని కులాల నుంచి కొద్దికొద్ది ఓట్లు పడతాయి తప్ప ఏ కులమూ పూర్తిగా కాంగ్రెసుకు ఓటేయడం లేదు. ఈ పరిస్థితిని చక్కదిద్దమనే ప్రశాంత్ కిశోర్‌ను పిల్చుకుని వచ్చారు. అందర్నీ సంతృప్తి పరుస్తూనే ఏదో ఒక కులాన్ని గట్టిగా పట్టుకోవాలని అన్నాట్ట. మెజారిటీ బిసిలు ఎస్పీకు, మెజారిటీ దళితులు బియస్పీకు వేస్తారు కాబట్టి అగ్రవర్ణాల ఓట్ల కోసం బిజెపి, కాంగ్రెసు పోటీ పడాలి. వాటి మద్దతు వున్నంతకాలం కాంగ్రెసు గెలుస్తూ వచ్చింది. వాళ్లెప్పుడైతే బిజెపివైపు తిరిగిపోయారో అప్పణ్నుంచి కాంగ్రెసుకు పతనం ప్రారంభమైంది. ఇప్పుడు మళ్లీ వాళ్లను తిప్పుకోవాలంటే బ్రాహ్మణ అభ్యర్థి వుంటే బెటరని ప్రశాంత్ అన్నాడట.

ప్రియాంకా గాంధీని రాజకీయాల్లోకి ఫుల్ స్కేలులో తీసుకుని వచ్చి ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపుతారంటూ మీడియాలో వార్తలు వచ్చాయి. 2002లో అమేఠీ, రాయబరేలీ బెల్టులో వున్న 10 నియోజకవర్గాల్లో కాంగ్రెసుకు 3 వుండేవి. 2004లో ఆమె ప్రచారం చేసినప్పుడు రాహుల్, సోనియా యిద్దరూ నెగ్గారు. 2007 అసెంబ్లీ ఎన్నికలలో 10టిలో 7 నియోజకవర్గాల్లో కాంగ్రెసు గెలిచింది. 2012 వచ్చేసరికి ప్రియాంకా అంటే ఓటర్లకు మొహం మొత్తింది. ఎంతసేపూ తమ కుటుంబం ఎంత గొప్పదో చెప్పుకునేసరికి చాల్లే అని 10టిలో 2 గెలిపించి సరిపెట్టారు. 2014 వచ్చేసరికి యింకా దిగజారింది. రాహుల్ గాంధీ తన ప్రత్యర్థి స్మృతి ఇరానీ కంటె తొలిదశలో వెనకబడి, చివరకు చచ్చీచెడి గెలిచాడు. ఆమె ప్రచారానికి వస్తే జనాలు చూడడానికి వస్తున్నారు తప్ప వినడానికి రావడం లేదన్న సంగతి అర్థమై, సరైన ముఖ్యమంత్రి అభ్యర్థి కోసం వెతికారు. చివరకు షీలా దీక్షిత్‌ను ఒప్పించారు. ఇంటిపేరు బట్టి బ్రాహ్మణిగాను, పుట్టుకబట్టి క్షత్రియ గానూ చూపించి రెండు అగ్రవర్ణాలను ఆకర్షిస్తారేమో!

ఆమెతో బాటు కాంగ్రెసు రాష్ట్ర అధ్యక్షుడిగా సినిమా నటుడు రాజ్ బబ్బర్‌ను తీసుకుని వచ్చారు. అతను ఆగ్రాకు చెందిన వాడే అయినా ప్రస్తుతం ఉత్తరాఖండ్ నుంచి రాజ్యసభ ఎంపీగా వున్నాడు. పార్టీ వ్యవస్థతో పెద్దగా సంబంధం లేని అతన్ని ఎంపిక

చేయడానికి కారణం అందరికీ తెలిసున్న మొహం కావడం. రెండు బిసి వర్గానికి (కంసాలి కులానికి) చెందినవాడు కాబట్టి బిసిలను ఆకట్టుకోవడం. అతను తన రాజకీయజీవితాన్ని బిసి పార్టీ ఐన ఎస్పీతో ప్రారంభించాడు. 1999లో, 2004లో రెండు సార్లు ఎంపీగా గెలిచాడు. అమర్ సింగ్‌తో విభేదించి 2006లో బయటకు వచ్చేసి, రెండేళ్ల తర్వాత కాంగ్రెసులో చేరి, 2009లో ఫిరోజాబాద్ ఉపయెన్నికలో అఖిలేశ్ భార్య డింపుల్‌కు వ్యతిరేకంగా నిలబడ్డాడు. రాహుల్ వచ్చి ప్రచారం చేశాడు. బబ్బర్ 85 వేల మెజారిటీతో నెగ్గాడు. కానీ 2014లో ఘజియాబాద్ నుంచి పోటీ చేసి బిజెపి అభ్యర్థి వికె సింగ్ చేతిలో ఓడిపోయాడు. పార్టీలో అతను ఏ గ్రూపుకూ చెందడు. పార్టీ వర్కర్లతో కూడా సన్నిహితంగా మెలగడు. అతని పని వూరూరూ తిరిగి ప్రచారం చేయడమే. షీలా దీక్షిత్ కూడా తిరగాల్సి వుంటుంది. ఈ వయసులో ఎంతవరకు తిరగగలదో చూడాలి. ఢిల్లీ అయితే చిన్నది. నగరం కాబట్టి కొన్ని సౌకర్యాలుంటాయి. యుపి అయితే నగరాలు, పట్టణాలు అంతంత మాత్రం. ఇక గ్రామాలైతే చెప్పనక్కరలేదు. అమితాబ్ ఎన్నికలలో నిలబడినప్పుడు ప్రచారానికి పల్లెటూళ్లలో తిరిగి నానా అవస్థా పడ్డాడు. మళ్లీ ఎప్పుడూ లోకసభకు నిలబడలేదు. షీలా దీక్షిత్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపి కాంగ్రెసు ఏం బావుకుంటుందో ఫలితాలు వస్తే తప్ప చెప్పలేం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 36 **ఎమ్బీయస్ : సిద్దూ ఆప్ తరఫు ముఖ్యమంత్రి అభ్యర్థా?**

పంజాబ్ ఎన్నికలు కొన్ని నెలల్లో జరగబోతున్నాయనగా నవజ్యోత్ సిద్దూ బిజెపి నుంచి రాజీనామా చేశాడు. అతని భార్య కూడా. 2014 పార్లమెంటు ఎన్నికలలో అరుణ్ జైట్లీ కోసం పంజాబ్‌లోని తన నియోజకవర్గం వదులుకోవలసి వచ్చిన దగ్గర్నుంచి అతను కాస్త రుసరుసలాడుతున్నాడు. పార్టీ వారు రాజ్యసభ ఎంపీ పదవి యిచ్చి వూరుకోబెట్టారు. ఇప్పుడు దాన్ని కూడా వదులుకున్నాడు. రాజకీయాల్లోంచి తప్పుకుంటున్నానని ఏమీ అనలేదు. ఆప్‌లో చేరతాడనే పుకార్లు వస్తున్నాయి. ఇంకా ఏమీ స్పష్టం కాలేదు. పంజాబ్ రాజకీయాల్లో చాలాకాలంగా వున్న సిద్దూ ఆప్ వైపు మొగ్గు చూపాడంటే దాని అర్థం – అక్కడ ఆప్ హవా గట్టిగా వీస్తోందని అతని నమ్మకం అన్నమాట. సి–ఓటర్–హఫ్‌పోస్ట్ నిర్వహించిన సర్వే మొత్తం 117 సీట్లలో ఆప్‌కు 94–100 వస్తాయని చెప్పింది. దాన్ని ప్రముఖంగా హెూర్డర్లపై చూపుతూ ఆప్ ప్రచారం చేసుకుంటూ ప్రత్యర్థుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బ తీస్తోంది. ఎన్నికలు జరిగేలోగా పరిస్థితి ఎలా మారుతుందో చెప్పలేం. ఈ పరిస్థితుల్లో సిద్దూ ఆప్‌లోకి – ఒకవేళ వస్తూంటే – ఎందుకు వస్తూన్నట్లు?

పంజాబ్‌లోని అకాలీదళ్–బిజెపి సంయుక్త ప్రభుత్వం తొమ్మిదేళ్ల పైచిలుకుగా పంజాబ్‌ను ఏలుతోంది. మామూలుగానే అంతకాలం పాలిస్తే ప్రభుత్వ వ్యతిరేకత రావడం సహజం. పైగా యీ ప్రభుత్వపాలన అధ్వాన్నంగా వుంది. తెలంగాణ ఉద్యమం నడిచే రోజుల్లో చిన్న రాష్ట్రాలైతే పాలన బాగుంటుందని వాదించడానికి మాటిమాటికి పంజాబ్, హరియాణాలను ఉదాహరణలుగా చూపించేవారు – వాటికి వున్న ప్రకృతి వనరులు యిక్కడ లేవని గ్రహించకుండా. అక్కడ అన్నీ వున్నా పాలన బాగా లేకపోవడం చేతనే హరియాణాలో ప్రభుత్వం మారింది, యిప్పుడు పంజాబ్‌లో కూడా మారే అవకాశాలే ఎక్కువ కనబడుతున్నాయి. ఎందుకంటే అనేక రంగాల్లో ప్రభుత్వం విఫలమైంది. ప్రభుత్వ ఋణం 60 వేల కోట్లు దాటింది. పంటలు దెబ్బ తిని, అప్పులు పెరిగి ప్రతీనెలా 20 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. తాగుడుతో, మాదకద్రవ్యాల వాడకంతో యువత పూర్తిగా భ్రష్టు పట్టిపోయారు. నిరుద్యోగం వారిని కృంగదీస్తోంది. ఇవన్నీ చూసి మహిళా ఓటర్లు ప్రభుత్వం పేరు చెపితేనే మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్ కుటుంబసభ్యులు కాబినెట్‌నే కాదు, ఎస్‌జిపిసి (శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ)ని పూర్తిగా ఆక్రమించారు. కానీ అధికార పార్టీపై వున్న విముఖతను సొమ్ము చేసుకునే సామర్థ్యం కాంగ్రెసులో కనబడటం లేదు. దానికి నాయకుడిగా పాత మొహం అమరీందర్ సింగే కనబడుతున్నాడు. కాంగ్రెసు స్థానంలో ఆప్ ప్రతిపక్షంగా అవతరించి బిజెపి–అకాలీదళ్ కూటమిని ఓడించడానికి ప్రయత్నిస్తోంది. చాలాకాలంగా వాలంటీర్లను ఏర్పాటు చేసుకుని క్రమేపీ విస్తరిస్తోంది. కాంగ్రెసు, అకాలీదళ్‌లకు గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు బాగా వున్నారు. వ్యవసాయం దెబ్బ తినడంతో రైతులు అకాలీ దళ్‌పై కత్తి కట్టారు. అలా అని కాంగ్రెసు ఓటేయడానికీ వారు సిద్ధంగా లేరు. "ప్రస్తుతం వున్న ప్రభుత్వం, కాంగ్రెసు ప్రభుత్వం రెండో దొందుకు దొందే. ఆప్ సంగతి ఎలా వుంటుందో చూడాలి మరి." అంటున్నారు పంజాబ్ రైతులు. మార్కెట్లోకి కొత్త వస్తువు వస్తే దాన్ని వాడిచూడడంలో పంజాబీలు ప్రథములు. మోజు తగ్గితే, దాన్ని పక్కకు పడేయడంలో కూడా వాళ్లదే అగ్రస్థానం. 2014లో నలుగురు ఆప్ ఎంపీలను నెగ్గించి చూశారు. ఈ సారి అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఆప్‌కో ఛాన్సిచ్చి చూస్తారేమోననే భయం పాత పార్టీల కుంది.

ఢిల్లీకి పొరుగునే వున్న పంజాబ్‌పై ఢిల్లీలో ఆప్ పాలన ప్రభావం గతంలోనే పడింది. అందుకే అక్కడ 4గురు ఆప్ ఎంపీలు నెగ్గారు. అయితే వారిలో యిద్దరు పార్టీ వీడిపోయారు. ఈ 17 నెలల్లో ఆప్ పాలనపై ఇండియా టుడే సర్వే చేసి కొన్ని గణాంకాలు యిచ్చింది. వారి సర్వే ప్రకారం ఢిల్లీలో అవినీతి 51% తగ్గింది. 400 యూనిట్ల కంటె తక్కువ విద్యుత్ వాడేవారికి 50% సబ్సిడీ యివ్వడానికి ఆప్ రూ.1600 కోట్లు బజెట్‌లో ఎలాట్ చేసింది. అది ప్రజలకు నచ్చింది కానీ డిస్కమ్‌లతో పోట్లాట, విద్యుత్ కోతలు మాత్రం వారిని వేధిస్తున్నాయి. ప్రతి యింటికి నెలకు 20 వేల లీటర్ల నీళ్లు ఉచితంగా యిస్తున్నారు. అలా సబ్సిడీ యిచ్చినా ఢిల్లీ జల్ బోర్డుకు గత సంవత్సరం కంటె రూ.178 కోట్ల ఆదాయం వచ్చిందని ఆప్ ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలలను మెరుగు పరచడానికి ఆప్ తన బజెట్‌లో 23%, అంటే రూ.10,690 కోట్లు కేటాయించింది. సమ్మర్ క్యాంపులు పెట్టి ఆరో తరగతిలోకి చేరే కుర్రాళ్లకై

తర్ఫీదు యిస్తోంది. అన్ని రాష్ట్రాలలో ప్రాథమిక వైద్యకేంద్రాలను (పిఎచ్‌సి)లను బలహీనపరచి కార్పోరేట్ ఆసుపత్రులను ప్రోత్సహిస్తున్నారు. కానీ ఆప్ ఏడాది చివరి కల్లా 1000 మొహల్లా (కాలనీ) క్లినిక్కులు పెడతానంటోంది. ఇప్పటికే అద్దె యిళ్లల్లో 21 తెరిచారు. అవి ప్రజలను బాగా ఆకట్టుకుంటున్నాయి. ఏడాదిలో వెయ్యి తెరవడం మాత్రం సాధ్యపడదని అంచనా. రోడ్లను బాగు చేయడానికి, పబ్లిక్ ట్రాన్సుపోర్టు మెరుగు పరచడానికి రూ. 5 వేల కోట్లు కేటాయించారు కానీ ఆ పని సవ్యంగా సాగలేదు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడానికి సరి-బేసి పద్ధతి మొదటి దశ ప్రజాదరణ పొందింది. రెండో దశ అంత గొప్పగా విజయవంతం కాలేదు. పైగా చిత్రంగా కాలుష్యం 23% పెరిగింది. ఏది ఏమైనా ఏ రాష్ట్రప్రభుత్వం తలపెట్టని పథకం అమలుచేసి పర్యావరణం పట్ల ప్రజలకు అవగాహన పెరిగేట్లు చేసిన ఘనత ఆప్‌దే! ఇవన్నీ పంజాబ్ ప్రజలను ఆకర్షిస్తున్నాయి.

ఓటర్లలో 30% వున్న యువతను ఆకట్టుకోవడానికి ఆప్ చాలా ప్రయత్నాలే చేస్తోంది. అధికారానికి వచ్చిన ఒక నెలలో మాదకద్రవ్యాల సరఫరా ఆపించేస్తానంది. ఆర్నెలల్లో వాటికి అలవాటు పడినవారిని సంస్కరిస్తానంది. 25 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానంది. ఇవన్నీ చూడడానికి ముందే ఆప్‌లోంచి బయటకు వచ్చేసి స్వరాజ్ అభియాన్ పెట్టిన యోగేంద్ర యాదవ్ "ఏ రాజకీయ పార్టీల ధోరణిని నిరసిస్తూ ఆప్ ప్రభవించిందో, యిప్పుడు అవే పార్టీలకు నకలుగా మారింది." అన్నాడు. ఆప్‌లోంచి బయటకు వచ్చేసిన మేధావులు ఎందరు దుయ్యబట్టినా ఆప్‌కు పంజాబ్‌లో బలం పెరుగుతోంది. నిజానికి బిజెపి, ఆప్ రెండూ మధ్యతరగతివారికి, చదువుకున్నవారికి నచ్చే పార్టీలే. ఒకే ఓటు బ్యాంకు కోసం రెండూ పోటీ పడుతున్నాయి. అందుకే ఆప్ బిజెపిపై అస్త్రాలు ఎక్కుపెడుతోంది. ఆప్ ఎంపీ ఒకతను మాట్లాడుతూ "మోదీగారు మన మాట వినడు, ఆయన మాటే మనం వినాలంటాడు. అందుకే "మన్ కీ బాత్" పేర ఆయన వూహలేమిటో మనకు చెప్తాడు. అరవిందయితే మనం చెప్పేది వింటాడు. అందుకే ఆయన ప్రోగ్రాం పేరు "టాక్ టు ఎకె", లిజన్ టు ఎకె కాదు." అని చమత్కరించాడు. పంజాబ్ జనాభాలో 32% దళితులే. దోఆబా బెల్ట్‌లో వున్న నాలుగు జిల్లాలలో దళితులు అధిక సంఖ్యలో వున్నారు. వారు బియస్‌పిని ఆదరిస్తూ వచ్చారు. కానీ బియస్‌పి నుంచి వాళ్లు కాంగ్రెసుకు మారవచ్చని అంటున్నారు. దళితుల కోసం ప్రత్యేక కార్యక్రమం రూపొందిస్తే ఆప్‌కీ ఛాన్సుండవచ్చుట.

పంజాబ్‌లో ఆప్‌ను అడ్డుకునే ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారంటేనే ఆప్‌ను చూసి ప్రత్యర్థులు భయపడుతున్నారని అర్థమవుతోంది. ముస్లిములు అధిక సంఖ్యలో వున్న మాలేర్‌కోట్లా గ్రామంలో జూన్ 24న ఒక స్మశానం బయట చిరిగిపోయిన కురాన్ పేజీలు కనబడ్డాయి. వెంటనే అల్లర్లు జరిగాయి. గత ఏడాది నవంబరులో వేరే వూళ్లో భగవద్గీత నుంచి చింపిన పేజీలు కనబడ్డాయి. దానికి నెల క్రితం మరో వూళ్లో గురు గ్రంథసాహెబ్ పేజీలు కనబడ్డాయి. ప్రజాసమస్యల నుంచి దృష్టి మరల్చడానికి, కావాలని మతకల్లోలాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని కచ్చితంగా చెప్పవచ్చు. కురాన్ పేజీలు చింపించాడని ఆప్ ఢిల్లీ ఎమ్మెల్యే నరేశ్ యాదవ్ మీద కేసు పెట్టారు. నేనే చింపానంటూ ముందుకు వచ్చిన విజయ్‌కుమార్ గర్గ్ అనే కార్యకర్త యాదవ్ చెప్పడం బట్టే అలా చేశానని చెప్పి యాదవ్‌ను యిరికించాడు. దానికి వీడియో లేదా ఆడియో సాక్ష్యం యింకా ఏమీ దొరకలేదు. "జూన్ 26 న గర్గ్‌ను అరెస్టు చేయగానే అతను విశ్వ హిందూ పరిషత్ కార్యకర్త అన్నారు. అప్పణ్నుంచి జులై 1 వరకు అతను విశ్వహిందూ పరిషత్ కార్యకర్తే. జులై 2 న హఠాత్తుగా అతన్ని ఆప్ కార్యకర్త చేసేశారు." అని వెక్కిరించాడు అరవింద్. ఇవన్నీ అబద్ధపు ఆరోపణలని కొట్టేసినా, ఒక విషయంలో మాత్రం క్షమాపణ చెప్పుకున్నాడు. జులై 3 న ఆప్ తరఫున యువతకై తయారుచేసిన మ్యానిఫెస్టో విడుదల చేశారు. దాని ముఖచిత్రంపై స్వర్ణమందిరం బొమ్మ వేసి, ఓ పక్కన ఆప్ ఎన్నికల గుర్తయిన చీపురు బొమ్మ కూడా వేశారు. దాంతో శిఖ్కుల స్వర్ణమందిరానికి అవమానం జరిగిందని విమర్శలు వచ్చాయి. అరవింద్ 'తెలియక చేసిన తప్పుకు క్షమాపణ చెప్పుకుంటున్నా, ప్రాయశ్చిత్తంగా పంజాబ్ వచ్చి ఆ మందిరంలోని పాకశాలలో గిన్నెలు తోముతా' అన్నాడు. తోమాడు. ఇటువంటి సేవ ద్వారా పశ్చాత్తాపం వెల్లడించడం శిఖ్కు మతంలో పరిపాటే. ఆ తర్వాత మాలేర్‌కోట్లాకి వెళ్లి అక్కడ ముస్లిం మతస్తులతో కలిసి ఇఫ్తార్ విందు తిన్నాడు. ఢిల్లీలో పదవిని తన సహచరులకు వదిలి పంజాబ్‌లో ముఖ్యమంత్రి పదవి చేపట్టాలని అరవింద్ కోరిక అని కొందరు రాస్తున్నారు.

అరవింద్‌కు ఢిల్లీని ఏలాలనే కోరిక తగ్గడంలో ఆశ్చర్యం లేదు. మోదీ అతనిపై పగబట్టాడు. రకరకాలుగా దిగ్బంధం చేసి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. లెఫ్టినెంట్ గవర్నరు ద్వారా సతాయింపు కు తోడు మంత్రులపై, ఎమ్మెల్యేలపై చిన్నదో, చితకదో కేసు బనాయించడం, అవినీతిపై పోరాటమే తమ లక్ష్యం అని చెప్పుకునే ఆప్‌ని యిరకాటంలో పెట్టడానికి అరవింద్ ప్రిన్సిపల్ సెక్రటరీపై వున్న రూ. 50 కోట్ల అవినీతికి సంబంధించిన తొమ్మిదేళ్ల నాటి పాత కేసు తిరగతోడి అరవింద్ పంజాబ్ పర్యటనలో వుండగా అరెస్టు చేయించడం, ఢిల్లీ అసెంబ్లీ పాస్ చేసిన 14 బిల్లులను గంపగుత్తగా తిరస్కరించడం - యిలా ఎన్నో వున్నాయి. అరవింద్ కూడా తక్కువ తినలేదు. చెవిలో జోరీగలా తగులుకుని, మోదీని, బిజెపిని సందు దొరికినప్పుడల్లా ఘాటుగా విమర్శిస్తున్నాడు. బిజెపిని యిబ్బంది పెట్టే ఏ అవకాశాన్నీ - తనకు సంబంధం వున్నా లేకపోయినా - వదులుకోవటం లేదు. ఈ తగవుల వలన ఢిల్లీ ప్రజలకు అరవింద్ యిచ్చిన హామీలు పెద్దగా అమలు కావటం లేదు. ఐదేళ్ల తర్వాత ఢిల్లీ ప్రజలకు సమాధానం చెప్పుకోవడం అరవింద్‌కు కష్టమే. అరవింద్‌లో ఓ పేచీకోరు కనబడుతున్నాడే తప్ప పాలనాసమర్థుడు కనబడటం లేదు. తన సామర్థ్యాన్ని చూపుకోవడానికి అరవింద్‌కు ఏదైనా ఒక రాష్ట్రం కావాలి. అది పంజాబ్ ఎందుకు కాకూడదు అని అతను తలపోయడంలో ఆశ్చర్యం లేదు. అయితే అరవింద్ హరియాణాకు చెందినవాడు. అనేక సరిహద్దు తగాదాలు వుండడం చేత పంజాబీలు హరియాణా వారిని నమ్మరు. తను

హరియాణాకు మేలు చేస్తాడన్న అనుమానంతో పంజాబ్ ప్రజలు ఆప్‌ను ఆదరించకపోయే ప్రమాదం వుందని అరవింద్‌కు భయం వుంది. తను సిఎం అభ్యర్థిగా నిలబడితే లాభం లేదన్న మాట నిజమే కానీ పంజాబ్‌లో ఆప్ తరఫున పెద్ద లీడరు ఎవరూ లేరు. ఈ సమస్యను అధిగమించడానికే సిద్దూను ఆప్‌లోకి ఆహ్వానించి వుంటాడని అనుకోవడానికి ఆస్కారం వుంది. క్రికెటర్‌గా, టీవీ హోస్టుగా, చాలా సంవత్సరాలుగా ప్రజా నాయకుడిగా సిద్దూకి ఒక యిమేజి వుంది. పైగా అతను పంజాబీ సిఖ్కు. ఆప్ మద్దతు తోడవుతే అతను గట్టి పోటీ యివ్వగలడు. అందుకే బిజెపి యిచ్చిన ఎంపీ పదవి కూడా వదిలేసి రంగంలోకి దిగుతున్నాడు. ఈ ఊహ నిజమో కాదో కొద్ది వారాల్లోనే తేలిపోతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 37 **ఎమ్బీయస్ ః ట్రంప్ కార్డా? డంప్ కార్డా?**

క్లీవ్‌లాండ్‌లో సోమవారం ప్రారంభమై గురువారంతో ముగిసిన రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ తరఫు అభ్యర్థిగా రియల్ ఎస్టేటు వ్యాపారి, అత్యంత ధనికుడు ఐన డోనాల్డ్ ట్రంప్ పేరు అధికారికంగా ప్రకటించబడింది. ఇది తప్పదని చాలా రోజులుగా అందరూ అనుకుంటున్నా, అతని ఎన్నిక అంత సజావుగా ఏమీ జరగలేదు. సాధారణంగా రాజకీయనాయకులందరూ యించుమించు ఒకలాటి భావాలనే వ్యక్తం చేస్తారు. తమ పార్టీ విధానం మాట ఎలా వున్నా, అధికారంలోకి వస్తే ఎవరికి మేలు చేయబోతున్నా, ఎన్నికలకు ముందు మాత్రం అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యంగా వుండేట్లు లౌక్యంగా మాట్లాడతారు. సమాజంలో ఏ ఓటు బ్యాంకునూ దూరం చేసుకోరు. దీన్నే పొలిటికల్లీ కరక్ట్ మెథడ్ అంటారు. కానీ ట్రంప్ ఒక భిన్నమైన నాయకుడు. సాంప్రదాయ రాజకీయాల్లో నలిగినవాడు కాదు. అందువలన ఎలాటి శషభిషలూ లేకుండా కొన్ని దేశాల పట్ల, ఇస్లాం పట్ల, కొన్ని విధానాల పట్ల తన అసహనాన్ని వ్యక్తం చేస్తున్నాడు. అది సాధారణ తెల్లజాతి అమెరికన్‌ను మెప్పిస్తోంది. తమ మనసులోని మాట యీయన పైకి చెప్తున్నాడు అని అతన్ని ఆరాధిస్తున్నారు. తన వివాదాస్పద వ్యాఖ్యలతో ట్రంప్ తనకంటూ ఒక ప్రత్యేకమైన యిమేజిని సృష్టించుకున్నాడు. దాని వలన అతనికి కొన్ని వర్గాల్లో మంచి మద్దతు లభించినా, యితర వర్గాలన్నీ దూరమై పోతాయేమోనని రిపబ్లికన్ పార్టీ నాయకుల భయం. పదేళ్ల డెమోక్రాటిక్ పార్టీ పాలన తర్వాత యీసారి తమకు వస్తున్న అవకాశం ట్రంప్ అతివాద ధోరణి వలన చేజారుతుందేమోనని బెదురు.

నిజానికి ట్రంప్ వ్యక్తం చేస్తున్న భావాలు ఆ నాయకుల్లో చాలామంది గుసగుసలుగా చెప్పుకునేవే. కానీ పైకి అంటే కొంప మునగవచ్చు. ఈ భావాలను సమర్థించేవారి సంఖ్య ఎక్కువా, వ్యతిరేకించేవారి సంఖ్య ఎక్కువా అన్నది నవంబరులో జరగబోయే ఎన్నికలో తప్ప తెలియదు. ఇలాటి పరిస్థితిలో యింత ఘాటుగా మాట్లాడడం రిస్కే కదా. గతంలో అంటే 1964 అధ్యక్ష ఎన్నికలలో బారీ గోల్డ్‌వాటర్ అనే రిపబ్లికన్ అభ్యర్థి పౌరహక్కులకై పోరాడుతున్న ఆఫ్రో అమెరికన్లకు వ్యతిరేకంగా మాట్లాడాడు. అతను ఘోరంగా ఓడిపోవడమే కాక, అప్పణ్నుంచి ఆ వర్గం రిపబ్లికన్లకు ఓటేయడం మానేసింది. ఇప్పుడు ట్రంప్ కారణంగా కొన్ని జాతుల వారు దూరమై పోతే, వాళ్లను మళ్లీ తమవైపు తిప్పుకోవడం యిప్పట్లో సాధ్యం కాదు కాబట్టి ట్రంప్ ఎన్నికను ఆపుదామని రిపబ్లికన్ నాయకులు కొందరు గట్టిగా ప్రయత్నించారు కానీ సాధ్యపడలేదు.

రిపబ్లికన్ జాతీయ సమావేశంలో 50,000 మంది పాల్గొన్నారు. 1543 మంది డెలిగేట్లు ట్రంప్ పక్షాన నిలిచారు. వారిలో కొందరు ప్రసంగించడం, అధికసంఖ్యాకులు బలపరచడం, ట్రంప్ ఆమోదోపన్యాసం అన్నీ పూర్తయ్యాయి. రిపబ్లికన్ పార్టీలో ట్రంప్‌ను వ్యతిరేకించేవారిలో మాజీ అధ్యక్షుడు జార్జి బుష్, అతని సోదరుడు మాజీ గవర్నరు జెబ్ బుష్, కితం ఎన్నికలో ఒబామాతో పోటీ పడిన మిట్ రోమ్నీ, జాన్ మెక్‌కేన్ వున్నారు. వారు సమావేశానికి హాజరు కాలేదు. దాంతో ట్రంప్ భార్య, కొడుకు, కూతురు, స్నేహితులు వక్తలుగా ముందుకు వచ్చి అతన్ని ఆకాశానికి ఎత్తేశారు. అతని కొడుకు డోనాల్డ్ ట్రంప్ జూనియర్ తన తండ్రి ఎంత కష్టపడి పైకి వచ్చాడో చెప్పాడు. "తను బిల్డింగులు కట్టించినప్పుడు కార్మికులతో బాటు పక్కన నిలబడి కాంక్రీటు మిక్స్ కలిపాడు. వాళ్లతో మాటలు కలిపి, వారి సాధకబాధకాలు విన్నాడు. సామాన్యుడి ఆలోచనా ధోరణి హార్వార్డ్, వార్టన్ యూనివర్శిటీలో చదివిన మేధావుల కంటె ఆయనకే ఎక్కువగా తెలుసు." అన్నాడు. అతని చిన్న కూతురు టిఫనీ, పెద్ద కూతురు, వ్యాపారవేత్త అయిన ఇవాంకా యిద్దరూ తమ తండ్రి లాటి అనురాగమూర్తిని ఎవరూ లేరని, అతనికి కూతుళ్లగా పుట్టడం తమ అదృష్టమనీ చెప్పారు. అతని వైన్ తయారీ సంస్థలో మేనేజరుగా పనిచేసే కెర్రీ వూలార్డ్ "ట్రంప్ ఒక ద్రష్ట, ఒక స్వాప్నికుడు, ఎవరి కంట పడని సూక్ష్మాంశాలెన్నో గమనించగల ఘనుడు" అని శ్లాఘించాడు.

రెండో రోజు రిపబ్లికన్ పార్టీలో సీనియర్లు చాలామంది ట్రంప్‌ను కొద్దిగా మెచ్చుకుంటూ హిల్లరీ క్లింటన్‌ని తిట్టిపోశారు. 'ఆమెను ఎన్నుకుంటే ఒబామాను మూడోసారి ఎన్నుకున్నట్టే, ఇప్పటికే అమెరికాలో భద్రత కరువైంది, బయటి దేశాలలో మన పరువు పోయింది. అదే పద్ధతి కొనసాగుతుంది' అంటూ ప్రసంగించారు. వీరిలో కొందరు ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలపై తమ అభిప్రాయాలు వెలిబుచ్చకుండా హిల్లరీని విమర్శించడం ద్వారా అతనికి మద్దతు తెలిపారు. అంతకు ముందు రోజు ట్రంప్ భార్య మెలానియా యిచ్చిన ఉపన్యాసంలో గతంలో ఒబామా భార్య ప్రసంగంలోని కొన్ని వాక్యాలు రిపీటయ్యాయి. దాంతో కాపీ కొట్టిందని విమర్శలు వచ్చాయి. ఈ సమావేశంలో ఆ ఉపన్యాసం రాసిన అసిస్టెంటు మెరెడిత్ ముందుకు వచ్చి "ఆ పొరపాటు నాదే, మిషెల్లిపై అభిమానం

వలన ఆమె భావాలు నా వాక్యాల్లో చొరబడ్డాయి" అని చెప్పుకుంది. వీరందరితో బాటు లిబియాలో అమెరికా తరఫున పోరాడి ప్రాణాలు పోగొట్టుకున్న వారి బంధువులు, అమెరికాలో అక్రమంగా వలసవచ్చినవారి చేతిలో హతులైన వారి కుటుంబసభ్యులు కూడా మాట్లాడారు. డెమోక్రాటిక్ పార్టీ అవలంబించిన విదేశాంగ విధానం వలన అమెరికా ప్రతిష్ఠ మట్టిలో కలిసిందని, అమెరికన్లు లోకువై పోయారని, అందుకే తన నినాదం 'మేక్ అమెరికా గ్రేట్ ఎగేన్' అని ట్రంప్ వాదన. ఐసిస్ పుట్టి పెరగడానికి, ఈజిప్టులో, సిరియాలో, ఇరాక్‌లో అశాంతి నెలకొనడానికి, అమెరికా సైన్యం అక్కడకు వెళ్లి చావుదెబ్బలు తినడానికి ఒబామా పాలనలో విదేశాంగ వ్యవహారాలు చూసిన హిల్లరీ కూడా యీ వైఫల్యాలకు బాధ్యత వహించాలని, తన అభ్యర్థిత్వాన్ని ఆమోదిస్తూ యిచ్చిన ఉపన్యాసంలో ట్రంప్ చెప్పాడు. రేపు అమెరికా ఓటర్లకు కూడా యిదే చెప్పి హిల్లరీని ఓడిస్తానని అతని ధీమా. దానికి రిహార్సల్‌గానే విదేశీ యుద్ధాలలో మరణించిన అమెరికన్ సైనికుల కుటుంబాల చేత ఉపన్యాసాలు యిప్పిస్తున్నాడు.

సీనియర్ రిపబ్లికన్ నాయకులు గ్రహించిన సత్యం ఒకటుంది – బీదవాళ్లలో, తెల్లవాళ్లలో, కాలేజీ డిగ్రీ వరకు చదవనివారిలో, బ్లూ కాలర్ వర్కర్లలో, క్రైస్తవాన్ని శ్రద్ధగా అవలంబించేవారిలో ట్రంప్‌కు ఆకర్షణ వుంది. ఇది ఏ మేరకు పార్టీకి మేలు చేస్తుంది అన్న విషయమే తెలియటం లేదు. మిట్ రోమ్నీ 2012లో ఒబామాకు ప్రత్యర్థిగా రిపబ్లికన్ పార్టీ తరఫున నిలబడ్డాడు. రిపబ్లికన్ పార్టీ అబార్షన్లకు, మహిళల హక్కులకు, స్వలింగ సంపర్కులకు వ్యతిరేకమనే భావన వుంది. ఈ కారణం చేత ఆ ఎన్నికలో మహిళలు డెమోక్రాటిక్ పార్టీకి హెచ్చుగా ఓటేయడంతో రోమ్నీ ఓడిపోయాడు. ఇప్పుడు యివే విషయాలపై ట్రంప్ మరింత ఘాటుగా మాట్లాడి, పార్టీకి ఆడవాళ్లను మరింత దూరం చేస్తాడని రోమ్నీ అభ్యంతరం. నాలుగు నెలల క్రితం ట్రంప్ అభ్యర్థిత్వానికి వ్యతిరేకంగా మాట్లాడడానికి అతను యూటా యూనివర్శిటీలోని హింక్లీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్‌కి వెళ్లి ట్రంప్‌ను తీసిపారేస్తూ ప్రసంగించాడు. "అతనొక బోగస్, ఓ ఫ్రాడ్. ట్రంప్ యూనివర్శిటీలో పట్టాకు ఎంత విలువ వుందో అతని వాగ్దానాలకు కూడా అంతే విలువుంది. ఏవేవో కబుర్లు చెప్పి, మనకు టోపీ వేసి, అతను వైట్‌హౌస్‌కు చెక్కేస్తాడు. మనకు మిగిలేది టోపీ మాత్రమే" అని ఘాటుగా మాట్లాడాడు. టోపీ ప్రస్తావన ఎందుకంటే ట్రంప్ ఎన్నికల ర్యాలీలలో కార్యకర్తలందరూ విధిగా "మేక్ అమెరికా గ్రేట్ ఎగేన్" అని రాసి వున్న ఎఱ్ఱ టోపీలు ధరిస్తున్నారు. 700 మంది వున్న ఆ సభలో ముప్పాతిక శాతం మంది ఆ టోపీలే వేసుకుని కూర్చున్నారు. ఈ ఉపన్యాసం తర్వాత ట్రంప్ కెంటుకీ, లూసియానా రాష్ట్రాల ప్రైమరీల్లో నెగ్గాడు. దాన్ని బట్టే తెలుస్తుంది – రిపబ్లికన్ నాయకులు ప్రజల నాడిని పట్టుకోలేక పోయారని, ట్రంప్ పట్టుకున్నాడని! రోమ్నీ ఉపన్యాసం తర్వాత ట్రంప్ అతన్ని హేళన చేశాడు – "విఫలమైన యీ నాయకుడు పార్టీలో సాటి నాయకుణ్ని ఎలా దిగజారుస్తున్నాడో చూడండి." అని.

ట్రంప్‌ను తీవ్రంగా దూషించేవారిలో టెడ్ క్రూజ్ ఒకడు. అతను రిపబ్లికన్‌లలో అతివాద రైట్ వింగ్ (టీ పార్టీ సెక్షన్ అంటారు)కు చెందినవాడు. అతనికి మతఛాందసత్వం వుంది, ముస్లిములను దేశంలోకి రానీయకూడదని, ఇస్లామిక్ టెర్రరిజం వున్న ఇరాక్, సిరియాలపై బాంబుల వర్షం కురిపించి, వాటిని తుడిచిపెట్టేయాలని, మెక్సికన్లను రానీయకుండా గోడ కట్టాలని – వాదించడంలో ట్రంప్ కంటె నాలుగాకులు ఎక్కువ చదివాడు. 12 రాష్ట్రాలలో ప్రైమరీలలో నెగ్గాడు. తన భావజాలానికి చెందినవాడే కాబట్టి తొలిదశలో అంటే ఏడాది క్రితం అతను ట్రంప్‌తో సఖ్యంగా వుందామని చూశాడు. తక్కిన రిపబ్లికన్ అభ్యర్థులు ట్రంప్ పద్ధతులను నిరసిస్తున్నపుడు "అతను ధైర్యవంతుడు, ఉన్నదున్నట్టు చెప్తున్నాడు. ప్రస్తుత ప్రభుత్వాన్ని తూర్పారబడుతున్నాడు." అని మెచ్చుకున్నాడు. అలా అంటే అతను పోటీలోంచి తప్పుకుంటాడేమోనని ఆశపడ్డాడు. కానీ క్రమేణీ ట్రంప్ బలపడి తననే వెనక్కి నెట్టడంతో శత్రువుగా మారాడు. పార్టీ అతన్ని అభ్యర్థిగా నిలబెట్టడానికి వీల్లేదని పెద్ద ఉద్యమమే చేశాడు. ఇద్దరూ వ్యక్తిగతంగా కూడా తిట్టుకున్నారు. పార్టీలో అతనిపై విమర్శలు కురిసిన కొద్దీ, సీనియర్లు అడ్డుకున్నకొద్దీ కొద్దీ ట్రంప్ బలపడుతూ వచ్చాడు, పైకి ఎదుగుతూ వచ్చాడు. ఇది టెడ్‌ను మరింత మండించింది. క్లీవ్‌లాండ్ సమావేశంలో ట్రంప్‌ను పార్టీ అభ్యర్థిగా నామినేట్ చేసిన తర్వాత యిచ్చిన ఉపన్యాసంలో అతను ట్రంప్‌కు అభినందనలు తెలపడంతో సరిపెట్టి, అతని అభ్యర్థిత్వాన్ని ఆమోదించినట్లు ప్రకటించకుండా ఓటర్లను తమ మనస్సాక్షిగా అనుగుణంగా ఓటేయమని విజ్ఞప్తి చేశాడు. ఇది సభలో వున్నవారిని మండించింది. 'వి వాంట్ ట్రంప్', 'వి వాంట్ ట్రంప్' నినాదాలతో హోరెత్తించారు. ఇది భరించలేక టెడ్ వేదిక దిగి వెళ్లిపోతూ వుంటే, అతన్ని పిల్లికూతలతో వెక్కిరించారు. అదే సభలో వున్న అతని భార్య హైదీని కూడా హేళన చేయడం మొదలెట్టడంతో సెక్యూరిటీవారు వచ్చి ఆమెను బయటకు తీసుకెళ్లారు.

ఈ విధంగా ట్రంప్ అన్ని అవరోధాలను దాటుకుని, పార్టీలోని ప్రత్యర్థుల పీచమణచి, అధికారికంగా అభ్యర్థిగా ప్రకటించబడ్డాడు. దీనికి కారణం – అతనికి ప్రజాదరణ పెరిగిందని పార్టీ గుర్తించడం. ట్రంప్ వంటి వాచాలుడికి అమెరికన్ ప్రజలలో యింత ఆదరణ ఎలా పెరిగింది అనే విషయాన్ని యింకో వ్యాసంలో చర్చిద్దాం. ట్రంప్ అతివాద ధోరణి పార్టీకి మేలు చేస్తుందా, కీడు చేస్తుందా, అది పార్టీకి ట్రంప్ కార్డుగా మారుతుందా, లేక పార్టీని మరో నాలుగేళ్ల పాటు డంప్ చేస్తుందా అనేది నవంబరులోనే తెలుస్తుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 39 – 42 **ఎమ్బీయస్ : ట్రంప్‌కు ఎందుకింత పాప్యులారిటీ?**

భారతీయులను, ముఖ్యంగా తెలుగువారిని అడిగితే అమెరికా ఎన్నికల్లో ట్రంప్ నెగ్గకూడదనే అంటాడు. నెగ్గడనే ఆశిస్తారు. నెగ్గే

అవకాశాలు హిల్లరీకే ఎక్కువగా వున్నాయని మన మీడియా రాస్తే సంతోషంగా వింటారు, నమ్ముతారు. అనేక దేశాల్లో ఎన్నికలు జరుగుతూంటాయి. అవేమీ పట్టించుకోం. కానీ అమెరికాపై మనకు ప్రత్యేక ఆసక్తి. ఎందుకంటే తెలుగు రాష్ట్రాలలో అనేక ధనిక, మధ్యతరగతి కుటుంబాల నుంచి ఒకరో, యిద్దరో అమెరికాతో సంబంధాలు వున్నవారే. చదువుకో, ఉద్యోగానికో అమెరికా వెళ్లడమో, ఆన్‌సైట్ పనిపై వెళ్లడమో, యిక్కడే వుండి అమెరికన్ కంపెనీల్లో పని చేయడమో జరుగుతోంది. అక్కణ్నుంచి యిక్కడకు డబ్బు పంపితే యిక్కడ ఆస్తులు కొనడమూ జరుగుతోంది. మధ్యతరగతి ఎన్నారై (విదేశం అంటే బై డిఫాల్ట్ అమెరికానే అవుతోంది, దిగువ తరగతి ఎన్నారై అంటే గల్ఫ్ అవుతోంది)ల కోసం యిక్కడ రియల్ ఎస్టేటు వెంచర్స్ తయారవుతున్నాయి, వారి పిల్లల కోసం కాలేజీలు తయారవుతున్నాయి. వారి పెట్టుబడుల నాశించి టీవీ ఛానెల్స్ వెలుస్తున్నాయి. ఇక్కడ సమాజసేవా కార్యక్రమాలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు యింధనం, ధనం ఆమెరికా నుంచి వస్తోంది.

మనల్ని రానిచ్చే అభ్యర్థి నెగ్గాలి ః అమెరికా పరిస్థితి అటూయిటూ అయితే దాని ప్రభావం యిక్కడా తీవ్రంగానే వుంటుంది. అందువలన మనం బాగుండాలంటే అమెరికా బాగుండాలి అనుకునేవారే ఎక్కువ. అమెరికా బాగుంటే సరిపోదు, మనను అక్కడకి రానివ్వాలి, మన సేవలు వుపయోగించుకోవాలి, మనకు డబ్బులివ్వాలి కూడా. లేకపోతే వాళ్ల కెంత డబ్బున్నా మనకేం లాభం? అందుకని వీసా నిబంధనల గురించి పట్టుబట్టకుండా మనం ధారాళంగా వచ్చిపోయేందుకు వీలు కలిగించే అమెరికన్ ప్రభుత్వం మనకు కావాలి. అంతేకాదు, మనం అక్కడకు వెళ్లి రూల్సు అతిక్రమిస్తాం. దొంగ రెస్యూమేలు యిస్తాం, చదువుకోసమే వచ్చాను, ఉద్యోగాలు చేయనని రాసిచ్చి కూడా దొంగతనంగా ఉద్యోగాలు చేస్తాం. దాని వలన స్థానికులకు ఉద్యోగాలు రాకపోతే అది వాళ్ల కర్మ. అవి చూసీచూడనట్లు ఊరుకునే ప్రభుత్వం వుండాలి – ఇవీ మన కోరికలు. మనకు యిలాటి హామీలు యిచ్చే అధ్యక్ష అభ్యర్థి గెలవాలని మనం కోరుకుంటాం. డెమోక్రాటిక్ పార్టీ అయితే మన కనుగుణంగా వుంటుందని నమ్మకం కాబట్టి హిల్లరీ గెలవాలనుకుంటాం. ట్రంప్ ఒక జోకరుగా, ఒక విలన్‌గా, ఒక ఉన్మాదిగా తోస్తాడు. కానీ తాజాగా సిఎన్ఎన్ నిర్వహించిన సర్వేలో ట్రంప్‌కు 48% ఓట్లు రాగా హిల్లరీకి 45% మాత్రమే వచ్చాయి. ఎందుకు?

నిరుద్యోగం, తక్కువ జీతాలు ః సాధారణ అమెరికన్ల దృక్కోణం నుంచి ఆలోచిస్తే ట్రంప్ వాళ్లకు ఆత్మీయుడిగా అనిపిస్తాడు. ఎందుకంటే ఎన్నో ఏళ్లగా వాళ్లకు ఉద్యోగాలు తగ్గిపోతూ వస్తున్నాయి. జీతాలు పెరగటం లేదు. ఖర్చు తగ్గించుకోవడానికి ఔట్‌సోర్సింగ్ పేరుతో అమెరికాలోని పెద్ద కంపెనీలన్నీ – ట్రంప్ కంపెనీతో సహా – తక్కువ జీతాలకు యితర దేశస్తుల సేవలను వినియోగించుకుంటున్నారు. ఇతర దేశాల్లో తమ శాఖలను తెరిచి చాలా భాగం పని అక్కడే చేయిస్తున్నారు. అమెరికాలో అయితే స్థానికులకు జీతాలు ఎక్కువ యివ్వాలి. అంతకంటె చాలా తక్కువ జీతానికి, అంతకంటె ఎక్కువ విద్యావంతులైన, నిపుణులైన విదేశీయులు దొరుకుతున్నారు. ఇలా సంపాదించిన డబ్బుపై అమెరికన్ కంపెనీలు పన్నులు కట్టి ప్రభుత్వానికి ధనం చేకూరుస్తున్నారు. దానిలోంచే అమెరికన్ నిరుద్యోగులకు భృతి అందుతోంది. కానీ సగటు అమెరికన్‌కు కావలసినది ఉద్యోగం, యిలాటి బిచ్చం కాదు. తమ కంపెనీలు తమను కాదని వేరే దేశస్తులను పోషించడం వారిని రగిలిస్తోంది. 1973 నుంచి వారి అసలైన జీతాలు పెరగలేదన్న విషయాన్ని రిపబ్లికన్ పార్టీకి చెందిన ట్రంప్‌యే కాదు, డెమోక్రాటిక్ పార్టీ తరఫు అభ్యర్థిత్వానికి హిల్లరీతో పోటీపడిన సోషలిస్టు భావాల బెర్నీ శాండర్స్ కూడా ఎత్తి చూపాడు. కానీ దాన్ని ఎలా ఎదుర్కోవాలన్నదానిలోనే యిద్దరివి వేర్వేరు మార్గాలు. పట్టణాలకు చెందిన మధ్యతరగతి ప్రజలు, అమెరికా పౌరసత్వం వున్న యితర జాతీయులు, యూనియన్లు శాండర్స్‌ను సమర్థిస్తూండగా, ట్రంప్ చెప్తున్న మొరటు విధానాలను గ్రామీణ ప్రాంతాల్లో వున్న తెల్లజాతి వారు మెచ్చుకుంటున్నారు. లౌక్యం, మొహమాటం, యితర వర్గాలు, ప్రపంచ దేశాలు ఏమనుకుంటాయోనన్న నదురు, బెదురు లేకుండా తమ తరఫున మాట్లాడే ట్రంప్ అంటే వారికి అభిమానం వెల్లువెత్తుతోంది.

శ్వేతజాతి వారి ఆక్రోశం ః ఆఫ్రో–అమెరికన్లను తెల్లజాతివారు కొన్ని వందల యేళ్ల క్రితం బానిసలుగా తీసుకుని వచ్చారు. వారిని నీచంగా చూస్తూ అణగదొక్కారు. జాతి వివక్షత పాటించారు. కొన్నాళ్లకు అది తప్పని గ్రహించి సమానహక్కులు యివ్వసాగారు. ఇవ్వడంతో సరిపెట్టలేదు, గతంలో చేసిన అత్యాచారాలకు ప్రాయశ్చిత్తంగా అన్నట్లు వారికై విపరీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయసాగారు. వాటికోసం పన్నులు పెంచారు. 'పూర్వతరాలు చేసిన పాపాలకు మా తరం మూల్యం చెల్లించడమేమిటి? ఇంత చేసినా నల్లజాతివారు పౌరహక్కులకోసం యింకా పోరాడుతున్నారేమిటి?' అని ఈ తరం తెల్లజాతి యువకులు ప్రశ్నిస్తున్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగా రిచర్డ్ నిక్సన్ 1968లో "సదరన్ స్ట్రాటజీ" అని ప్రతిపాదించాడు. వలస వచ్చినవారు, నల్లజాతివారు హక్కుల కోసం చేసే పోరాటాలను పట్టించుకోనక్కరలేదని, పట్టించుకుంటే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని అతని వాదన. అందువలన సంక్షేమ పథకాలు తగ్గించి, పన్నులు కూడా ఆ మేరకు తగ్గించాలని అతని ఆలోచన. కానీ యితర జాతుల వారి ఓట్లు పోతాయన్న బెదురుతో యివేవీ సక్రమంగా అమలు చేయలేకపోయారు. 1990ల నుంచి రిపబ్లికన్ పార్టీ అభిమానుల్లో యీ ఆలోచన బలపడుతూ వచ్చింది. ఇటీవలి కాలంలో అమెరికన్లకు తక్కువ జీతాలకు పనిచేసి తమ పొట్ట కొట్టే మెక్సికో వలస కార్మికుల పట్ల అసూయ పెరిగింది. సక్రమంగా, అక్రమంగా వలస వచ్చేవారి వలన స్థానికుల ఉద్యోగాలు హరించిపోతున్నాయని, వారు నిరుద్యోగులుగా మారి ప్రభుత్వం యిచ్చే నిరుద్యోగభృతిపై ఆధారపడుతున్నారని ట్రంప్ ఎత్తి చూపుతున్నాడు. వలస వచ్చినవారు ఉన్నతోద్యోగాలు సంపాదించుకుని ఆర్థికంగా బలపడుతున్నారు. ఒక పక్క వారికి హెచ్చు జీతాలు చెల్లిస్తూ, మరో పక్క తన పౌరులకు యిచ్చే

నిరుద్యోగ భృతి పెరుగుతూ రెండు విధాలా అమెరికా ఖజానా తరిగిపోతోందని అతని వాదన. తను అధికారంలోకి వస్తే వీసా విధానాలను కఠినతరం చేసి, ఔట్‌సోర్సింగును కనీసస్థాయికి తెచ్చి, అమెరికన్లకు మళ్లీ పని కల్పిస్తానని హామీ యిస్తున్నాడు. దానికి సంబంధించిన నినాదమే 'మేక్ అమెరికా వర్క్ ఎగైన్'.

రైల్వే కంపార్టుమెంటాలిటీః ఆఫ్రో–అమెరికన్లు, లాటిన్ దేశాల నుంచి వచ్చినవారి పరిస్థితి ఒబామా అధికారంలోకి వచ్చిన నాటి కంటె మరింత దిగజారిందని, దానికి కారణం ఆ కాలంలో అక్రమ వలసలు విపరీతంగా జరిగి, నిరుద్యోగం పెరిగి, వేతనాలు తగ్గాయని అతనంటున్నాడు. ఈ విధమైన వాదనతో సక్రమంగా వలస వచ్చి పౌరసత్వం సంపాదించుకున్నవారిని ఆకట్టుకుంటున్నాడు. రైల్వే కంపార్టుమెంటాలిటీ అనే ధోరణి ఒకటుంది. జనరల్ బోగీలోకి ఎక్కబోయేవాణ్ని లోపలున్నవాళ్లు చోటు లేదు, వేరే బోగీ వెతుక్కో అంటూ అడ్డుకుంటారు. కానీ అతను ఎలాగోలా ఎక్కేశాడనుకోండి. తర్వాతి స్టేషన్లో ఎక్కబోయేవాణ్ని అడ్డుకునేవారిలో అతనే ప్రథముడిగా వుంటాడు. 'నేను వచ్చేశాను, యింకెవ్వరూ – నా వాళ్లయినా సరే – రాకూడదు' అనుకుంటాడు. మొన్న బ్రెగ్జిట్‌లో చాలా మంది తెలుగువాళ్లు 'లీవ్'కు అనుకూలంగా ఓటేశారట. 'మనం తక్కువ జీతాలకు పని చేస్తూ ఏదో అవస్థ పడుతున్నాం. సిరియా నుంచి వలస జనం వచ్చిపడి మన కంటె తక్కువ జీతానికి సిద్ధపడి మనకు ఎసరు పెడుతున్నారు. టర్కీ నుంచి కూడా వస్తే మరీ ప్రమాదం.' అనుకున్నారు వాళ్లు. ఇవాళ యూరోప్ వలసదారులను పంపేస్తున్నట్లే, రేపు తెల్లవారు కానివాళ్లందరూ దేశం విడిచి పోవాలంటూ మనల్ని కూడా పంపేస్తారేమో అనే భయం లేదు వారికి. అదే విధంగా అమెరికాలో స్థిరపడిన హిస్పానిక్స్ (దక్షిణ అమెరికా దేశస్తులు) ట్రంప్‌ను సమర్థించినా సమర్థించవచ్చు.

ముస్లిములంటే భయం ః ఇస్లాము తీవ్రవాదం పట్ల భయం పౌరులందరినీ చుట్టుముట్టింది. దానికి తగ్గట్టుగానే యూరోప్‌లో కూడా ఇస్లాము తీవ్రవాదుల దాడులు యీ మధ్య మరీ పెరిగాయి. దేశంలో శాంతిభద్రతల విషయంలో ఒబామా ఘోరంగా విఫలమయ్యాడని, టెర్రరిజాన్ని ఉత్పత్తి చేసే దేశాల నుంచి వలస వచ్చేవారిని ఆపలేక పోయాడని, వారు మన దేశంలోనే మన ఉప్పు తింటూనే మనకు ముప్పుగా మారారని నిర్దాక్షిణ్యంగా వారిని తరిమికొట్టకపోతే మనకు మనుగడే వుండదని ట్రంప్ చేస్తున్న వాదన ఆకట్టుకుంటోంది. ఒర్లాండో ఘటనను తన కనుగుణంగా మార్చుకుని ఎల్‌జిబిటిలను విదేశీ సిద్ధాంతాలతో ప్రభావితమైన తీవ్రవాదుల దాడి నుంచి రక్షిస్తానని మాట యిచ్చాడు. నిజానికి రిపబ్లికన్లలో అత్యధికులు ఎల్‌జిబిటిలకు వ్యతిరేకులు. ఆ మాట ట్రంప్ చెప్పటం లేదు. తను అధికారంలోకి వస్తే టెర్రరిజం పట్ల కఠినంగా వ్యవహరించని దేశాల నుంచి వచ్చే వ్యక్తులను దేశంలోకి అనుమతించబోనని చెప్తూ 'అమెరికా సేఫ్ ఎగైన్' అనే నినాదం కూడా యిచ్చాడు. తమలో కొందరు తీవ్రవాద చర్యలు చేపడుతున్నారని తెలిసినా స్థానిక ముస్లిములు పోలీసులకు ముందస్తు సమాచారం యివ్వటం లేదని, ఆ విధంగా వారు దేశద్రోహులని ట్రంప్ ఆరోపించాడు. అది నిజం కాదని, వాళ్లిచ్చిన సమాచారంతో ఎన్నో నేరాలు అరికడుతున్నామని ఎఫ్‌బిఐ ప్రకటించింది. ''వాళ్ల మతం పేరుతో జరిగే హింసను కాని, వాళ్ల మతస్తుడు చేసే హింసను కాని వాళ్లు సహించరు. ఎఫ్‌బిఐ సమర్థవంతంగా పనిచేయడానికి వాళ్లిచ్చే సహకారమే కారణం'' అని చెప్పింది. కోర్టు రికార్డులు కూడా యిదే విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. ముస్లిం–అమెరికన్లపై అధ్యయనం చేసిన నార్త్ కరోలినా యూనివర్శిటీ ప్రొఫెసర్ కూడా దీన్ని సమర్థించాడు. ''వారితో జరిగిన గ్రూపు డిస్కషన్స్‌లో వాళు ఒక అంశం ప్రస్తావించారు – 'మేం హింసను ఆపుదామని, కుట్రను భగ్నం చేద్దామని చూస్తున్నాం. కానీ కొన్ని సందర్భాల్లో పోలీసులు కుట్రను జరగనిచ్చి, అరెస్టు చేద్దామని చూస్తున్నారు. మేం వారిని నమ్మినట్లుగా వాళ్లు మమ్మల్ని నమ్మటం లేదు.' అని వాపోయారు.'' ట్రంప్ అధికారంలోకి వస్తే పోలీసుల్లో యీ ధోరణి మరింత పెరగవచ్చేమో!

చర్చికి, తుపాకీకి రెండింటికీ ఆప్తుడే ః ఇస్లాం వ్యతిరేకతతో బాటు క్రైస్తవ మతవాదులను ట్రంప్ మచ్చిక చేసుకుంటున్నాడు. అబార్షన్లను, స్వలింగ సంపర్కులకు వ్యతిరేకించడం ద్వారా వారికి చేరువవుతున్నాడు. తను అధికారంలోకి వస్తే ఎవాంజలిస్టులతో సహకరిస్తానని చెప్తున్నాడు. ఎవాంజలిస్టులు ట్రంప్‌ను చూసి మొదట్లో బెదిరారు కానీ, పోనుపోను అతని పద్ధతులను ఆమోదించారు. అయితే వారిలో అనుయాయుల్లో హిస్పానిక్స్ కూడా వున్నారు. అందుకని వారితో ట్రంప్‌కు ఒక రహస్య సమావేశం ఏర్పాటు చేసి యిద్దరి మధ్య సయోధ్య కుదిరేట్లు చేశారు. ఇక తుపాకుల విషయానికి వస్తే – నిజానికి రిపబ్లికన్లందరినీ ఒక్క తాటిపై తెచ్చిన ఘనత తుపాకీలకే చెందుతుంది. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ప్రతి వారూ ఆయుధం ధరించడమొకటే శరణ్యమని, దాన్ని పౌరుడి హక్కుగా పరిగణించాలని వాళ్లు భావిస్తున్నారు. రిపబ్లికన్ సమావేశానికి హాజరైన నేషనల్ రైఫిల్స్ అసోసియేషన్ నాయకుడు క్రిస్ కాక్స్ ''అమెరికాలో అత్యంత ప్రాచీనమైన ప్రజాహక్కుల సంస్థ మాదే. స్త్రీలు తమను తాము రక్షించుకునే ఏకైక సాధనం. ఇటీవలి కాలంలో తుపాకీలు కొనేవర్గంలో మహిళలదే ప్రథమస్థానం.'' అని ప్రకటించాడు. ఎటొచ్చీ తెల్లవాళ్లకే ఆ హక్కులు అనకుండా జాతి, వర్ణ వివక్షత లేకుండా అమెరికాలో వున్న ప్రతి పౌరుడికి ఆ హక్కు వుందన్నాడు. ట్రంప్, అతని పిల్లలు తమ సంస్థలో సభ్యులని, హిల్లరీ క్లింటన్ అధికారంలోకి వస్తే యీ హక్కు హరించుకుపోతుందని, దాన్ని మళ్లీ తెచ్చుకోవడానికి దశాబ్దాలు పట్టవచ్చని, అందువలన మీ ఓటు రాబోయే నాలుగేళ్లను కాదు, నలభై ఏళ్లను ప్రభావితం చేస్తుందని ప్రసంగించి రిపబ్లికన్లను ఒప్పించాడు. అమెరికాలో గన్ లాబీ చాలా పలుకుబడి, డబ్బు గలదని అందరికీ తెలుసు.

విదేశీ వ్యవహారాలు ః అమెరికన్ల కష్టార్జితాన్ని, దేశవ్యతిరేక శక్తులకు డెమోక్రాట్లు ధారపోస్తున్నారని ట్రంప్ ఆరోపిస్తూ ''అణు ఒప్పందం పేరుతో ఇరాన్‌కు 150 బిలియన్ డాలర్లు అప్పనంగా యిచ్చేశారు'' అన్నాడు. నిజానికి అది అమెరికా ప్రభుత్వం యిచ్చినదేమీ

కాదు, అమెరికన్ బ్యాంకుల్లో వున్న ఇరాన్ ఖాతాలను యిన్నాళ్లూ స్తంభింపచేసి యిప్పుడు విడుదల చేశారంతే. అది కూడా 50-60 బిలియన్లకు మించి వుండదంటున్నారు పరిశీలకులు. 1993 నాటి ఇరాక్ యుద్ధాన్ని నిరసిస్తున్న ట్రంప్ యిప్పుడు మాత్రం సిరియాలోని ఐసిస్, ఇరాక్‌లపై బాంబులు వేసి తుడిచి పెట్టి (బాంబ్ ద హెల్ ఔట్ ఆఫ్...) పారేయాలంటాడు. అంతేకాదు, సౌదీ అరేబియా, నాటో దేశాలు మన ఔదార్యాన్ని బలహీనతగా భావించాయని, యివ్వాల్సిన డబ్బు యివ్వటం లేదని వాదించాడు. గ్లోబలైజేషన్ పేరుతో చైనా వంటి దేశాలు వస్తువులతో, ఇండియా వంటి దేశాలు సేవలతో అమెరికాను ముంచెత్తి దాని ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చి, ప్రపంచంలో దాని స్థాయి దిగజార్చాయని, తను గెలిస్తే యిటువంటివి అరికట్టి అమెరికాను మళ్లీ అగ్రరాజ్యంగా నిలుపుతానని అంటున్నాడు. 'మేక్ అమెరికా ఫస్ట్ ఎగైన్', 'మేక్ అమెరికా వన్ ఎగైన్' నినాదాలు యీ కోవకే చెందుతాయి. ''1994 నాటి ఫ్రీ ట్రేడ్ ఎగ్రిమెంటు నుంచి యిప్పటి ట్రాన్స్-పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్ వరకు అన్ని ఒప్పందాల్లో అమెరికా నష్టపోయింది. నాకు అధికారం యిస్తే యివన్నీ రద్దు చేస్తా. నా నినాదం గ్లోబలిజం కాదు, అమెరికనిజం! అమెరికా ప్రయోజనాలే నాకు ముఖ్యం. 'అమెరికా ఫస్ట్' అనేదే నా ఫిలాసఫీ. డిఫెన్సు ఒప్పందాలన్నిటినీ తిరగరాయిస్తా, వాణిజ్య లోటులో వున్న మన ఆర్థిక వ్యవస్థను మార్చి మన నుంచే ఎగుమతులు ఎక్కువ వెళ్లేట్లు చేస్తా. ఇక ముందు చేయబోయే ఒప్పందాల గురించి చెప్పాలంటే మన వర్కర్లకు నష్టం కలిగించే లేదా మన స్వాతంత్ర్యం హరించే, ఏ ఒప్పందంపై సంతకం పెట్టనని మాట యిస్తున్నాను. కొన్ని దేశాలు కూటమిగా ఏర్పడి మనతో గీచిగీచి బేరాలాడి మనల్ని నష్టపరచాయి. ఇకపై నేను ప్రతి దేశంతో విడివిడిగా ఒప్పందాలు చేసుకుంటా.'' అంటున్నాడు ట్రంప్.

'ఆడు మగాడ్రా, బుజ్జీ' ః ట్రంప్ తనను తాను ఒక రాజకీయవేత్తగా చూపించుకోలేదు. ఎప్పుడూ సెనేట్ సభ్యుడిగా కూడా లేని అతను రాజకీయ పరిజ్ఞానం చాటుకోలేదు. ఒక వ్యాపారవేత్తగా రెండు పార్టీలకూ విరాళాలు అందిస్తూ వచ్చాడు. ఆ విషయాన్ని గొప్పగా చెప్పుకున్నాడు కూడా. ''నేనొక విజయాన్ని కైవసం చేసుకున్న వ్యాపారస్తుణ్ని. తెలివితో, కష్టపడి పైకి వచ్చాను. హౌసింగ్ సంక్షోభం వచ్చినపుడు చౌకగా యిళ్లు కొనేసి బాగుపడ్డాను. ఒక సంకటంలోంచి ప్రయోజనం ఎలా పొందాలో చేసి చూపించాను. నాలాగే అందరు అమెరికన్లు ఎదగాలని కోరుకుంటున్నాను.'' అని నిర్భయంగా చెప్తున్నాడు. 'నేను దమ్మున్నవాడిని, జంకూగొంకు లేనివాణ్ని' అని చెప్పుకోవడం వలన సగటు పౌరుడిలో అతనిపై ఆరాధన పెరుగుతోంది. 'ఆడు మగాడ్రా, బుజ్జీ' అనే డైలాగులో ఎంత పవరుందో చూడండి. 'నేను మన్‌మోహన్ సింగ్‌లా పిరికివాణ్ని కాను, 56 యించిల ఛాతీ కలవాణ్ని, పాకిస్తాన్, చైనాలకు బుద్ధి చెప్పగల మొనగాణ్ని' అని మోదీ చెప్పిన డైలాగులు ఎంతమంది భారతీయుల ఛాతీ ఉప్పొంగేట్లు చేశాయో గమనించండి. తర్వాత ఏం చేయగలిగినా, చేయలేకపోయినా ఎన్నికల ప్రచారంలో యివి గొప్ప టానిక్‌లా పనిచేస్తాయి. 'తక్కిన దేశాలవాళ్లందరూ మనల్ని లోకువ కట్టారు, వాళ్లకు మన సత్తా చూపించాలి, తన్ని తగిలేయాలి' అని కోరుకునే వాళ్లకు ట్రంప్ హీరోగా ఎందుకు కనిపించడు? అది మేచో యిమేజికి మూడు పెళ్లిళ్లు చేసుకున్న విషయం కూడా కలిసి వచ్చింది. హిల్లరీ గురించి 'భర్తనే తృప్తి పరచలేకపోయినామె దేశాన్నేం తృప్తి పరుస్తుంది?' అంటూ సెక్సిస్టు రిమార్కు చేశాడు. ట్రంప్‌కు 'మగసిరి' వుందని నొక్కి వక్కాణించినవారిలో అతనికి సహచరుడిగా ఉపాధ్యక్ష పదవికి నిలబడుతున్న మైక్ పెన్స్ ఒకడు. తనను తాను ''క్రిస్టియన్‌గా, కన్సర్వేటివ్‌గా, రిపబ్లికన్‌గా - ఆ వరుసలో'' వర్ణించుకున్న అతను ట్రంప్‌గురించి మాట్లాడుతూ 'అతనిది లార్జ్ పర్సనాలిటీ, కలర్‌ఫుల్ స్టయిల్, ఆకట్టుకునే కరిజ్మా. వాటిన్నిటిని బాలన్స్ చేయడానికి కాబోలు అవేమీ లేని నన్ను ఎంచుకున్నాడు'' అన్నాడు. మైక్ అంటే రిపబ్లికన్ కన్సర్వేటివ్స్‌లో చాలా మందికి యిష్టం. వాళ్లకు, ట్రంప్‌కు మధ్య యితను వారధిగా వుంటాడని అనుకుంటున్నారు.

పైన చెప్పిన విషయాలను నొక్కి చెప్పడానికి కొన్ని వివరాలు యిస్తున్నాను. వీటివలన సగటు అమెరికన్ వ్యథ, మార్పు కోసం అతను ఎదురుచూస్తున్న కారణం అవగతమౌతాయి.

అసమానతల అమెరికా ః అమెరికన్ ఎకానమీ ఎటువంటి స్థితికి వచ్చిందంటే దేశజనాభాలో 1% మంది వద్ద 40% సంపద వుంది. సంపదలోని 7%ను అట్టడుగున వున్న 80% మంది పంచుకోవలసి వస్తోంది. సాధారణ పనివాడు నెలంతా కష్టపడితే వచ్చేది ఒక కంపెనీ సిఇఓ గంటలో సంపాదిస్తున్నాడు. మధ్యతరగతి వద్ద వున్న సంపద కంటె వెయ్యి రెట్లు టాప్ 10% ధనికుల వద్ద వుంది. ఆ 10% వద్ద వున్న సంపద కంటె వెయ్యి రెట్లు వారిలో 1% వద్ద వుంది. గ్లోబలైజేషన్, ఫ్రీ ట్రేడ్‌తో బాగు పడినది ఆ వర్గాలే. లక్షలాది ఉద్యోగాలను ఔట్‌సోర్సు చేసి, విదేశాల్లో తమ ఆఫీసులు తెరిచి, పనంతా అక్కడే చేయిస్తూ, ఉదారమైన వీసా విధానాల ద్వారా అనేకమందిని ఆన్-సైట్ తెప్పించుకుంటూ, ఒకప్పటి అమెరికన్ పారిశ్రామిక నగరాలను మరుభూములుగా మార్చి వీరు మరింతగా సంపాదించారు. ఆర్థిక సంక్షోభం నుంచి తేరుకున్నాక అంటే 2009 నుంచి వచ్చిన ఆర్థిక లాభాల్లో 95% యీ 1% కే దక్కాయని రాబర్ట్ రీచ్ అనే అనే అతను 2013లో డాక్యుమెంటు చేసి చూపాడు.

వేతనవ్యత్యాసాలతో కృంగిన పనివాళ్లు ః అమెరికాలోని వేతనవ్యత్యాసాల గురించి 2015 జనవరిలో చేసిన అధ్యయనంలోని గణాంకాలు కాస్త ఓపిగ్గా పరిశీలిస్తే అమెరికా లోని సాధారణ ప్రజలు ఎందుకు కుతకుతలాడుతున్నారో అర్థమవుతుంది. అమెరికన్ ఆర్థిక వ్యవస్థ గత కొన్ని దశాబ్దాలుగా ఎంతో ఆదాయం గడించినా, జీతాలపై ఆధారపడిన అనేక వర్గాల వారికి (జనాభాలో వీరు 60% వుంటారు) నాలుగు దశాబ్దాలుగా అసలైన జీతాలు (అంటే ద్రవ్యోల్బణాన్ని లెక్కలోకి తీసుకున్న సవరించిన అంకె) పెరగలేదు. అప్పట్లో 50 డాలర్లు వస్తే యీ రోజు 80 వస్తే 30 పెరిగింది కదా అనకూడదు. ఆ 50 డాలర్లకు అప్పుడు కొనుక్కోగల వస్తువుల (కొనుగోలు శక్తి) కంటె యిప్పుడు 80 డాలర్లతో కొనగలిగేవి తక్కువ అని గుర్తించాలి. 1979ని బేస్‌గా తీసుకుని చూస్తే 2007లో

యీ 60% కుటుంబాల సరాసరి సంవత్సరాదాయం తక్కినవారితో సమానంగా పెరిగి వుంటే 94,310 డాలర్లు వుండాలి కానీ దానికంటె 23% తక్కువగా 76,443 డాలర్లు మాత్రమే వుంది. ఆర్థిక సంక్షోభం తర్వాత 2007 తర్వాత తక్కినవారికి కూడా జీతాలు తగ్గాయి, వ్యత్యాసం తగ్గింది కానీ 2011 నాటికి కూడా రావలసినదాని కంటె 16% తక్కువే వచ్చింది. 1973 కంటె 30 ఏళ్ల క్రితం ఉత్పాదకవృద్ధి (ప్రొడక్టవిటీ గ్రోత్) 97% పెరిగితే వాళ్ల జీతాలు కూడా 91% పెరిగాయి. కానీ 1973-2013 మధ్య ఉత్పాదకత 74% పెరిగితే ఒక సాధారణ పనివాడి జీతం 9% మాత్రమే పెరిగింది. ఉత్పత్తి పెరగడం వలన వచ్చిన లాభం ఎవరికి వెళ్లింది అంటే ఉన్నత స్థానాల్లో వున్నవారికి వెళ్లింది. 1979 నుంచి కార్పోరేట్ సంస్థల్లో పనిచేసే వారిలో టాప్ పొజిషన్‌లో వున్నవారి జీతాలు 138% పెరిగాయి. కింది స్థాయి జీతగాళ్ల జీతాలు 15% పెరిగాయి. 1979లో కూడా వారి జీతాల్లో వ్యత్యాసం వుండేది. ఆ వ్యత్యాసాన్ని అలాగే మేన్‌టేన్ చేసి వుంటే కింది వాళ్ల జీతాలు 32% పెరిగి వుండాల్సింది. కానీ దానిలో సగమే పెరిగాయి.

అభివృద్ధిని స్వాహా చేసిన సిఇఓలు ః ఇక మధ్యతరగతి పనివారు అంటే మొత్తం వర్క్‌ఫోర్స్‌లో 50% మంది సగటు సంపాదన కంటె ఎక్కువ సంపాదించేవారు అన్నమాట. వారి సంగతి చూస్తే 1979-2013 మధ్య వారి దాదాపు జీతాలు స్తంభించాయి. కరక్టుగా చెప్పాలంటే ఏడాదికి 0.2% చొప్పున యిన్నేళ్లలో 6% పెరగాయి. కాలేజీ చదువు చదివినవారిలో కూడా జీతాలు పెరగలేదు. నిజానికి వారి జీతాలు 2000 నుండి తగ్గిపోతూ వచ్చాయి. చదువుపై పెట్టాల్సిన ఖర్చు పెరుగుతోంది. చదివినా సరైన జీతం రావటం లేదు. జీతం పెరక్కపోయినా యజమాని యిచ్చే హెల్త్ యిన్సూరెన్సు సౌకర్యం వుంటుంది కదా అనుకుంటే అదీ ఘనంగా లేదు. 1989లో 61% మందికి వుండే ఆ సౌకర్యం 2012 వచ్చేసరికి 31% మందికే వచ్చింది. హైస్కూలు చదువు చదివినవారిలో అయితే యిది 24% నుంచి 7%కి పడిపోయింది. ఇదే సందర్భంలో అమెరికన్ పబ్లిక్ సెక్టార్‌లో వున్న అతి పెద్ద సంస్థల్లో 350 వాటిలో సిఇఓల జీతాలు ఎలా పెరిగాయో చూదాం. 1965లో ఒక మామూలు (టిపికల్) పనివాడు సంపాదించే దాని కంటె సిఇఓ 20 రెట్లు ఎక్కువ సంపాదించేవాడు. 2013 వచ్చేసరికి యిది 300 రెట్లయింది. కార్పోరేట్ సంపాదించిన లాభాల కంటె వీరి జీతంలో పెరుగుదల రెట్టింపు వుంది.

1% వారు ఎటు వుంటారు? ః సోషలిస్టు అయిన బెర్నీ శాండర్స్ యీ వ్యత్యాసాల్నే మాటిమాటికీ ఎత్తిచూపుతూ ఆర్థిక సంస్కరణలు తెచ్చి, 1% సూపర్ రిచ్ వారికి ముకుతాడు వేస్తానంటున్నాడు. ట్రంప్ స్వయంగా వ్యాపారవేత్త కాబట్టి అలాటివాటి జోలికి పోడని ఆ 1% వారి నమ్మకం. అందువలన వారూ అతన్ని సమర్థించి నిధులు అందించవచ్చు. ఔట్‌సోర్సింగ్‌పై ఆధారపడిన ఐటీ పరిశ్రమ ట్రంప్ విధానాలను ఆమోదించదని అందరూ అనుకున్నారు. గూగుల్ సిఇఓ సుందర్ పిచాయి ట్రంప్‌కు వ్యతిరేకంగా బహిరంగ ప్రకటన చేశాడు. అయితే పేపాల్ వ్యవస్థాపకుల్లో ఒకడు, సిలికాన్ వ్యాలీలో టెక్ మొఘల్ అనదగిన పీటర్ థియెల్ ట్రంప్‌కు మద్దతు తెలిపాడు. ''నా చిన్నపుడు అపోలోతో ఒక అమెరికన్‌ను చంద్రుడిపైకి పంపించాం. ఈ పాటికి సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెంది, యింకో అమెరికన్‌ను కుజగ్రహంపై పంపవలసిన వాళ్లం. కానీ పోయిపోయి మధ్యఆసియాపై దాడుల గొడవల్లో యిరుక్కుపోయాం. సాంకేతికంగా మనకున్న ఆధిక్యత పోగొట్టుకుని, యితర దేశాల కంటె వెనకపడ్డాం. మనకు కావలసినది అంతర్జాతీయ వ్యవహారాల్లో తలదూర్చడం కాదు, అమెరికాపై ప్రగతిపై దృష్టిని కేంద్రీకరించడం. ఆ విషయంలో ట్రంప్‌ది సరైన దృక్పథం.'' అని మాట్లాడాడు.

అయినవారిలో ఆకుల్లో, కానివారికి కంచంలో ః ప్రారంభదశలో జార్జి వాషింగ్టన్ వంటి వారు స్థానికంగా ఉద్యోగాలు సృష్టించడానికి రోడ్లు వేసి, వంతెనలు కట్టి దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించారు. పోనుపోను అమెరికా ప్రభుత్వంపై ప్రైవేటు కంపెనీల పెత్తనం పెరిగి, తమ కనుకూలంగా చట్టాలు మార్పించుకుని, తక్కువ జీతాలు, ఉత్పత్తి వ్యయం వుండే దేశాలతో ఒప్పందాలు చేసుకుని దిగుమతి చేసుకోవడం మరిగారు. 1990ల చివర్లో చైనాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్న దగ్గర్నుంచి చైనా మాన్యుఫేక్చరింగ్ సెంటరుగా పెరిగి, అమెరికా ఒక మార్కెట్‌గా మారిపోయింది. అమెరికన్లకు హెచ్చు జీతాలివ్వడం కంటె చైనా, ఇండియాలలో, కొరియాల వంటి దేశాలలో యూనిట్లు పెట్టి తక్కువ జీతాలతో ఎక్కువ లాభం పొందసాగాయి అమెరికన్ కంపెనీలు. అమెరికాలో యూనియన్ల శక్తి క్షీణిస్తూ వచ్చి, ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉద్యోగం పీకేసే శక్తి కంపెనీలకు వచ్చింది. వారాంతానికి ఉద్యోగం వుంటుందో లేదో తెలియని స్థితిలో కార్మికుడు తన జీతం పెంపు కోసం యూనియన్ ద్వారా బేరాలాడే సందర్భమే లేదు. చివరకు అమెరికా 'అయినవారిలో ఆకుల్లో, కానివారికి కంచంలో పెట్టే' వ్యవస్థగా తయారైంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలంటే ప్రభుత్వమే ఉద్యోగకల్పనకై కొన్ని ప్రాజెక్టులు చేపట్టి, కనీస వేతనాలు పెంచి, పెన్షన్, సిక్ లీవ్ సౌకర్యాలు పెంచడం, అసంఘటిత కార్మికుల హక్కులను కాపాడడం, తమ కంపెనీలు విదేశాల్లో ఉత్పత్తి చేసి స్వదేశంలో అమ్మడాన్ని నియంత్రించడం వంటివి చేయాలి. కానీ ప్రభుత్వం వద్ద డబ్బు లేదు, పైగా కంపెనీలు చెప్పినట్లు ఆడుతోంది. ఇవాళ్టి దుస్థితికి ట్రంప్‌ను ఒబామా ఒక్కణ్ణే నిందిస్తున్నాడు కానీ యిది రిపబ్లికన్లు, డెమోక్రాట్లు కలిసి దశాబ్దాలుగా తగలేసిన వ్యవహారం. డబ్బు లేకపోవడానికి కారణం - సామ్రాజ్యవాద స్వభావంతో యితర దేశాల వ్యవహారాల్లో తలదూర్చడం. గతంలో రష్యా యిలాగే చేసింది. కమ్యూనిజం వ్యాప్తికి కృషి చేస్తున్నామంటూ సొంత ప్రజలను ఎండగట్టి, విదేశాలకు విందు కుడిపింది. చివరకు సొంత ప్రజలే తిరగబడ్డారు.

సామాజిక అశాంతి ః పైన రాసిన గణాంకాల్లో, వివరణల్లో, నా అవగాహనలో, అన్వయంలో పొరపాట్లు వుండవచ్చు. కానీ మొత్తం మీద పరిస్థితి బాగా లేదని గ్రహిస్తే చాలు. ఆర్థిక అసమానతలు సమాజంలో అశాంతి సృష్టించాయి. డబ్బు లేకపోయేసరికి భార్యాభర్తల మధ్య కీచులాటలు, విడిపోవడాలు, పిల్లలకు ఆలనాపాలనా లేక చెడు మార్గాలవైపు మళ్లడాలు, ఫ్రస్ట్రేషన్, డిప్రెషన్,

మత్తుపదార్థాలు, హింసకు పాల్పడడం, విదేశాల నుంచి వచ్చి సంపాదించుకుంటున్న వారిని చూసి అసూయ పడడం, వీలైతే దోచుకోవడం.. యిలా రకరకాలుగా సమాజం భ్రష్టు పట్టింది. రేపేమిటో తెలియక అల్లాడుతున్న అమెరికన్ల అభద్రతాభావాన్ని ట్రంప్ సొమ్ము చేసుకుంటున్నాడు. తెలంగాణలో చూశాం – స్థానిక నిరుద్యోగానికి, ఆంధ్రుల్ని దోషులుగా చూపి, కెసియార్ లాభపడ్డారు. ఆంధ్రులను తరిమివేస్తాం, ప్రయివేటు కంపెనీల్లో స్థానికులకు రిజర్వేషన్లు చేయిస్తాం, యింటికో ఉద్యోగం ఖాయం అన్నాడు. జనాలు నమ్మారు. ఇప్పుడు ట్రంప్ వలసవాదులను తరిమివేస్తా, మీకే అన్ని వుద్యోగాలూ అని వూరిస్తున్నాడు. కెసియార్ కంటె కటువైన భాష వుపయోగిస్తున్నాడు. నెగ్గాక ఏం చేస్తాడో తెలియదు కానీ, సగం చేసినా ఫర్వాలేదుగా అనుకుంటారు విసిగి వేసారిన స్థానికులు.

డైలమా ః ట్రంప్ తయారుచేస్తున్న విద్వేషపూరిత వాతావరణం ఏ స్థాయికి చేరిందో తెలుసుకునేందుకు ఒక సూచన ఏమిటంటే – కూ క్లక్స్ క్లాన్ అనే జాత్యహంకార సంస్థ కొన్నాళ్ల క్రితం అమెరికాలో బలంగా వుండేది. తెల్లజాతి వారే అధికులని, యితరులకు తమ దేశాల్లో నివసించే హక్కు లేదని వాదిస్తూ వారు ఆ జాతులపై హింసాత్మక దాడులకు తెగబడేవారు. క్రమేపీ వాళ్లు బలహీనపడ్డారు. ఇన్నాళ్లకు దాని నాయకుడు డేవిడ్ డ్యూక్ తను లూసియానా రాష్ట్రం నుంచి అమెరికన్ సెనేట్‌కు అభ్యర్థిగా నిలబడతానని ప్రకటించాడు. అతను రిపబ్లికన్ పార్టీకి చెందినవాడే అయినా, పార్టీ అతన్ని సమర్థించనని చెప్పింది. అయినా నిలబడతానని అతనంటున్నాడంటే దానికి కారణం – అమెరికాలో ప్రబలుతున్న వేర్పాటు వాదం! ట్రంప్ గెలిచి, యిప్పటి తన హెచ్చరికలను అమలు చేయడానికి చూస్తే ప్రపంచానికి ఏ ముప్పు వాటిల్లుతుందో అని ఒక భయం. అతను ఓడిపోయినా మరో ప్రమాదం వుంది. అతను రెచ్చగొట్టి వదిలిపెట్టిన అమెరికన్ శ్వేతజాతివారు అదుపు తప్పి దేశంలో వున్న పరజాతీయులకు ప్రమాదకరంగా మారవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 43, 44 **ఎమ్బీయస్ ః మాయమైన కేరళ ముస్లిముల గమ్యం..?**

కేరళ నుంచి 21 మంది మే నెలాఖరు నుంచి మిస్సయ్యారని అందరికీ తెలుసు. ఐసిస్‌లో చేరడానికే వెళ్లారని ప్రస్తుతానికి అనుకుంటున్నా, వీళ్ల వ్యవహారం కాస్త వింతగా వుంది. వీళ్లు ప్రాణాలకు తెగించి ఆత్మాహుతికి పాల్పడే పేద కుటుంబాలకు చెందిన పాత బస్తీ యువకులు కారు. విద్యావంతులు, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతికి చెందినవారు. పైగా ఈ 21 మందిలో బాలబాలికలున్నారు, ఆరుగురు ఆడవాళ్లున్నారు, వారిలో ముగ్గురు గర్భవతులు కూడా. ఐసిస్ ఆడవాళ్లతో ఎలా వ్యవహరిస్తోందో, బానిసలుగా ప్రకటించి ఎలా అమ్మకానికి పెడుతోందో తెలియని అమాయకులు కారు వీరు. ఎంత మతఛాందసం వుంటే మాత్రం అలాటి చోటికి కుటుంబాలతో ఎలా వెళ్లారు? మగవాళ్లు మతయుద్ధాలలో పాల్గొనాలనుకున్నా, తమకేమైనా అయితే కుటుంబసభ్యుల గతి ఏమౌతుందో వాళ్లు ఆలోచించలేదా? పోనీ ఆడవాళ్లు కూడా మతం పేరుతో మమ్మల్ని ఏం చేసినా ఫర్వాలేదు అనుకున్నా, స్వయం నిర్ణయం తీసుకోలేని పిల్లల మాటేమిటి? వారిని బలిచేసే హక్కు తమకుందని వీళ్లెలా అనుకున్నారు? వీరెవరికీ యిప్పటివరకు క్రిమినల్ రికార్డు ఏమీ లేకపోవడం చేత పోలీసులు కాని, యిరుగుపొరుగు గాని వీళ్లను శంకించలేదు. అసలు యిప్పటిదాకా ఇస్లాం ఉగ్రవాద ప్రభావిత రాష్ట్రాలంటే మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ అనుకున్నారు తప్ప కేరళ వైపు ఎవరూ దృష్టి సారించలేదు. మరి కేరళలో ఎందుకిలా జరిగింది?

సౌఫాన్ గ్రూపు అనే అమెరికన్ ప్రయివేటు యింటెలిజెన్సు సంస్థ 2015 డిసెంబరులో విడుదల చేసిన నివేదిక ప్రకారం ఐసిస్‌లో 86 దేశాలకు చెందిన 27–30 వేల మంది విదేశీ పోరాటయోధులున్నారు. ఇరాక్, సిరియాలలో కొంత భాగాన్ని తన అదుపులో పెట్టుకున్న ఐసిస్ అఫ్గనిస్తాన్‌లో కూడా కాలూనింది. తమ నాయకుడు ఆబు బకర్ అల్ బాగ్దాదీని యీ తరం ఖలీఫాగా ప్రకటించి, ప్రపంచ వ్యాప్తంగా వున్న ముస్లిముల నుద్దేశించి సోషల్ మీడియా ద్వారా, వివిధ భాషల్లో నడిపే ఆన్‌లైన్ మ్యాగజైన్ల ద్వారా, బ్లాగుల ద్వారా సందేశాలు పంపుతున్నారు. వాటి సారాంశం ఒక్కటే 'మీరుంటున్న దారుల్ కాఫిర్, దారుల్ హర్బ్ (విశ్వాసహీనుల దేశం, యుద్ధోన్మాదుల దేశం) విడిచి పెట్టి యీ దారుల్ ఇస్లామ్ (ఇస్లాంను పక్కాగా అవలంబించే దేశం)కు వచ్చేయండి.' అని. ఐసిస్ సానుభూతపరులైన 15 మంది కేరళ యువకులు 'ముజాహిర్' పేర నడుపుతున్న ఆన్‌లైన్ మలయాళీ పత్రికలో యిప్పటికే 39 వ్యాసాలు ప్రచురించారు. ఐసిస్ అజమాయిషీలో వున్న ప్రాంతం ఎంత పవిత్రంగా వుందో వర్ణిస్తూ కాఫిర్ల దేశాలలో నివసించేవారు యీ ప్రాంతానికి పవిత్రయాత్ర చేసి తీరాలని ఉద్బోధిస్తున్నారు. ఇప్పుడు మాయమైన వారిలా ఎందరు యీ ప్రచారానికి లొంగారో తెలియదు.

దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ముస్లిములలో ధనికులు తక్కువ, పేదలు ఎక్కువ. పేద వర్గాల్లో చదువు, ఆరోగ్యం, మహిళా అభ్యున్నతి తక్కువ. కానీ కేరళలో ముస్లిములు ఏ మాత్రం వెనకబడి వుండరు. ఇతర మతస్తులతో సమానంగా చదువుసంధ్యలు, ఉద్యోగాలు, ఆస్తిపాస్తులు, వ్యాపారవాణిజ్యాలు – అన్నీ వున్నాయి. ఇతర ప్రాంతాల్లో ముస్లిముల కంటె వారిలో ప్రగతిశీల భావాలు ఎక్కువ. మహిళలకు విద్యావకాశాలు, స్వేచ్ఛ ఎక్కువ. అందుకే సలాఫీ ఉద్యమాన్ని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వారు మార్చుకున్నారు. 18వ శతాబ్దానికి చెందిన ముహమ్మద్ అబ్ద్ అల్–వహాబ్ అనే అరేబియన్ పండితుడు కురాన్‌లో రాసినదాన్ని అక్షరాలా పాటిస్తూ శుద్ధ ఇస్లాంకు కట్టుబడి వుండాలని ప్రచారం చేస్తూ సలాఫీ మార్గం ప్రారంభించాడు. కేరళలో 1922లో ముస్లిం

ఐక్య సంఘం అనే పేర సంఘం ఏర్పరచి అన్ని రకాల సిద్ధాంతాల ముస్లిముల మధ్య ఐకమత్యాన్ని సాధించే ప్రయత్నాలు చేశారు. దానిలోనే సలాఫీ (ముజాహిద్ అని కూడా అంటారు) మార్గాన్ని అవలంబించేవారు కూడా చేరారు. ఈ ఐక్యసంఘటన లోంచి సలాఫీ సంస్థగా 1950లో కేరళ నద్వత్తుల్ ముజాహిదీన్ (కెఎన్ఎమ్) ఏర్పడింది. దాని నాయకులు చాదస్తాలకు కట్టుబడకుండా ముస్లింలలో మూఢనమ్మకాలు పోగొట్టి, ఆధునికత వైపు మళ్లించి, కేరళ హిందూ సమాజానికి అనువుగా మహిళలకు విద్య గరపి, వారికి హక్కులు కూడా కల్పించి ప్రగతిపథంలో నడిపించారు.

1990లలో కేరళ నుంచి ఉద్యోగాలకై, వ్యాపారాలకై గల్ఫ్ వెళ్లిన మలయాళీ ముస్లిము యువకులు అక్కడున్న సలాఫీ ఉద్యమం తీరుతెన్నులు గమనించి, ఆశ్చర్యపడ్డారు. తమ దగ్గర ఆ పేరుతో ఆధునిక ధోరణులు మప్పుతున్నారని గ్రహించి, అసలైన సలాఫీలో వున్న ఛాందసవాదాన్ని యిక్కడెందుకు అమలు చేయరని కెఎన్ఎమ్‌ను ప్రశ్నించసాగారు. 2002 వచ్చేసరికి ఆ సంఘాన్ని చీల్చారు. ఆ చీలికకు నాయకుడు జుబైర్ మంకాడా అనే ముస్లిం టీచరు. ముస్లిం మెజారిటీ వున్న మళప్పురం జిల్లాలోని నీలాంబుర్‌లో అతను అసలైన సలామీ విధానం అమలు చేసే ఒక సమూహాన్ని (కమ్యూన్) 2007లో తయారుచేశాడు. అక్కడున్న వారు 1400 ఏళ్ల క్రితం మహమ్మద్ ప్రవక్త జీవించినంత స్వచ్ఛంగా ఇస్లామిక్ పద్ధతిలో జీవించే ఏర్పాట్లు వుంటాయి. కానీ భారతదేశం వివిధ మతాలతో, వివిధ రకాల జీవనవిధానాలతో కూడిన సెక్యులర్ దేశం. పోనీ ఏదైనా ముస్లిం దేశానికి వెళదామన్నా అనేక ముస్లిము దేశాలు కూడా కురాన్ బోధనలకు అనుగుణంగా పాలన సాగించడం లేదు. ఆధునిక పద్ధతులకు అనుగుణంగా మారాయి. అందువలన ఇస్లాంను తూచా తప్పకుండా, ప్రాచీన పద్ధతిలో అవలంబించే ప్రాంతమో, దేశమో కావాలని వారు ఉవ్విళ్లూరారు. యూదులు తమ మతవిధానాలకు అనువుగా ఇజ్రాయేలును రూపొందించుకున్నట్లు, అచ్చమైన ముస్లిముల కోసం మేం ఇస్లామిక్ స్టేట్ ఏర్పరుస్తున్నాం, రారండి అంటూ ఐసిస్ ఇరాక్, సిరియాలలోని కొన్ని ప్రాంతాలలో తన రాజ్యాన్ని స్థాపించి, అందర్నీ ఆహ్వానిస్తోంది. ఇప్పుడు కేరళ నుంచి వెళ్లినవారు అలాటి ఆహ్వానానికి స్పందనగానే వెళ్లారు. వాళ్లను యీ భావజాలానికి మళ్లించి, ఐసిస్ నడిపేది స్వర్గసీమ అని వాళ్లను నమ్మించిన దెవరు?

అబ్దుల్ రషీద్ అబ్దుల్లా అనే 30 ఏళ్ల యువకుడు అని అనుమానం. అతను ఒమాన్‌లో కొంతకాలం చదువుకుని, తర్వాత కేరళకు తిరిగి వచ్చి పాలాలో కమ్యూనికేషన్ ఇంజనీరింగు చేశాడు. అక్కడే అతనికి సోనియా సెబాస్టియన్ అనే క్రైస్తవుల అమ్మాయి పరిచయమైంది. ఇతన్ని ప్రేమించి, మతం మార్చుకుని, ఆయిషాగా పేరు మార్చుకుని పెళ్లాడింది. వాళ్లకు రెండేళ్ల కూతురు కూడా. ఈ లోగా రషీద్ ఒమాన్‌లో మంచి వుద్యోగం చేసేవాడు. అది వదిలేసి నాలుగేళ్ల క్రితం కేరళకు తిరిగి వచ్చి ఎర్నాకులంలో ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేయసాగాడు. వాళ్ల నాన్న ఓ లక్ష రూపాయలు యిచ్చి వ్యాపారం ఏదైనా చేసుకో అన్నాడు. కానీ యితను ఉద్యోగం వదిలేసి ఎం ఎం అక్బర్ అనే ఆయన నడిపే పీస్ ఫౌండేషన్ అనే సంస్థ కాసరగోడు జిల్లాలో నిర్వహించే పీస్ ఇంటర్నేషనల్ స్కూలులో 30 వేల రూ.ల జీతానికి పని చేయసాగాడు. టీచర్లకు తర్ఫీదు యివ్వడం అతని పని. మల్టీ నేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పని చేసిన అనుభవం వున్న అతని భార్య ఆయిషా కూడా తన ఉద్యోగం మానేసి, అదే స్కూల్లో టీచరుగా చేరింది. వాళ్లతో బాటు అదే పీస్ ఫౌండేషన్‌లో ఫాతిమా అనే 23 ఏళ్ల అమ్మాయి, షిహాస్ అనే 24 ఏళ్ల అబ్బాయి పనిచేసేవారు. ఈ ఫాతిమా అసలు పేరు నిమిషా. హిందూగా పుట్టింది. డెంటల్ కాలేజీలో చదివేది. 2015 నవంబరులో ఆమె కాలేజీ నుంచి మిస్సయిందని తెలిసి ఆమె తల్లి వెళ్లి రషీద్‌ను అడిగితే "ఆమె ముస్లింగా మతం, పేరు మార్చుకుంది. పాలక్కాడ్ జిల్లాకు చెందిన 31 ఏళ్ల బెక్సన్ విన్సెంట్ అనే క్రైస్తవుడు ఇస్లాంలోకి మారి తన పేరు ఈసా అని పెట్టుకున్నాడు. అతన్ని పెళ్లాడింది." అని చెప్పాడు. ఇప్పుడు వాళ్లిద్దరూ మిస్సింగ్. ఫాతిమా గర్భవతి కూడా. వాళ్లతో బాటు ఈసా సోదరుడు 26 ఏళ్ల బెట్సన్ విన్సెంట్ (అతనూ మతం మారి ఎహిసా అయ్యాడు), అతని 22 ఏళ్ల భార్య మెరీన్ (మతం మార్పిడి కేసే) అలియాస్ మిరియం కూడా మిస్సింగే.

ఈ ఫౌండేషన్‌లో షిహాస్ అనే అతను కూడా వున్నాడన్నాను కదా. అతను బెంగుళూరులో బిబిఏ చదివాడు. వెస్టర్న్ మ్యూజిక్ అన్నా, వాళ్ల జీవనసరళి అన్నా మహా యిష్టం. అయితే మూడేళ్ల క్రితం ముంబయి వెళ్లి వచ్చిన దగ్గర్నుంచి అదంతా మారిపోయింది. తను ఛాందస ముస్లిములా జీవించడమే కాదు, కుటుంబ సభ్యుల్ని కూడా అలా వుండమని ఒత్తిడి చేయసాగాడు. పీస్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వారికి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తూంటాడు. అతని భార్య అజ్మాలా స్పీచ్ థెరపీలో డిప్లొమా చేసింది. ఆమె క్కూడా యీ సలాఫీ విధానం నచ్చింది. బురఖా వేసుకోసాగింది. ప్రస్తుతం గర్భవతి. షిహాస్ తన అన్న డాఎఎ కెపి ఐజాస్‌ను కూడా దీనిలోకి లాక్కుని వచ్చాడు. ఆయనకు 28 ఏళ్లు. చైనాలో మెడిసిన్ చదివి, కాసరగోడ్ జిల్లాలోని పడన్నా గ్రామంలో ప్రయివేటు ప్రాక్టీసు చేస్తున్నాడు. అతని భార్య రిఫీలా డెంటిస్టు. ఇద్దరూ కోళికోడ్‌లోని ఓ హాస్పటల్లో కలిసి పనిచేశారు. వీళ్లకు అయాన్ అనే రెండేళ్ల కొడుకున్నాడు. ఆమె మళ్లీ గర్భం ధరించింది. వీళ్లంతా కూడా మాయమైన వారిలో జాబితాలో వున్నారు. షిహాస్ అన్నతో బాటు అత్తకొడుకును కూడా ఆకర్షించాడు. అతని పేరు అష్ఫాఖ్ మజీద్. వయసు 25. బికాం చదివి ముంబయిలో హోటల్ నడుపుతున్న తండ్రికి సాయపడుతున్నాడు. అతని భార్య శాంసియాకు 23 ఏళ్లు. కోయంబత్తూరు కాలేజీలో మైక్రో బయాలజీ చదివింది. వారికి ఆయిషా అనే 18 నెలల కూతురు వుంది. వీళ్లంతా మాయమయ్యారు.

వీరితో బాటు మాయమైన మరో కాండిడేటు 23 ఏళ్ల హఫీసుద్దీన్. అతనిదీ అదే వూరు. తల్లి యిక్కడే వుంటుంది కానీ అతని తండ్రి అబు ధాబిలో 30 ఏళ్లగా ఆటోమొబైల్ వర్క్‌షాప్ నడుపుతూంటాడు. హఫీసుద్దీన్ అక్కడే టెన్త్ క్లాస్ పాసయ్యాడు. మూడేళ్ల

క్రితం కేరళకు తిరిగి వచ్చి ఐజాస్‌తో స్నేహం కలిశాక అతనిలో మార్పు వచ్చింది. ఇక అక్కణ్నుంచి యింటి సభ్యులను అచ్చమైన ముస్లిములుగా బతకమని పోరు పెట్టడం మొదలుపెట్టాడు. అప్పు తీసుకుని కొన్న కారు వాడడం మానేశాడు. ''అప్పుకు వడ్డీ చెల్లిస్తున్నాం, వడ్డీ యివ్వడం, పుచ్చుకోవడం ఇస్లాంకు వ్యతిరేకం.'' అని సమాధానమిచ్చాడు. ''వ్యాపారం కూడా ఇస్లాంకు వ్యతిరేకమే. నువ్వు అదంతా కట్టిపెట్టి, ఆస్తులన్నీ అమ్మేసి, యింటికి వచ్చి ముస్లింగా బతుకు'' అని తండ్రికి, ''మీరు టీవీలో సినిమాలు చూడడం మానేయండి, అవన్నీ 'హరామ్' (నిషిద్ధం)'' అని తల్లిని, సోదరిని హెచ్చరించసాగాడు. ఓ సారి టీవీ కేబుల్ కత్తిరించేశాడు కూడా. తను ఉద్యోగం, వ్యాపారం వంటి ఏ పనీ చేసేవాడు కాదు. ఇస్లాం పుస్తకాలు ముందేసుకుని చదువుతూ వుండేవాడు. పెళ్లయితే మారతాడేమోననుకుని పొరుగూరికి చెందిన అమ్మాయితో యీ మార్చిలో పెళ్లి చేశారు. పెళ్లి రోజున గడ్డం గీయను, ఖరీదైన బట్టలు తొడగను అన్నాడు. ఇవన్నీ కుర్రచేష్టలు అనుకుని తలిదండ్రులు అన్నిటికీ తల వూపారు. జూన్‌లో కోళికోడ్ కెళ్లి కురాన్ అధ్యయనం చేస్తానన్నాడు. చివరకు జూన్ నెలాఖరు గాయబ్ అయిపోయాడు. ''అల్లా దీవెనలతో నేను నా గమ్యాన్ని చేరాను. ఇది భూతలస్వర్గమే. ఇక్కడ వడ్డీ లేదు, పన్ను లేదు, రాజులు లేరు. నన్ను అనుసరించమని నా భార్యను కోరుతున్నాను.దుష్టశక్తులతో పోరాడుతున్న ఐసిస్‌కు తప్పక జయం చేకూరుతుంది.'' అంటూ తల్లికి ఎస్సెమ్సెస్ పంపాడు.

మాయమైన వారందరూ తమ తల్లితండ్రుల నుంచి వాస్తవాలు దాచారు. వేరే వూరు వెళుతున్నామని అబద్ధాలు చెప్పారు. తమ పిల్లల చాదస్తపు పోకడలను సీరియస్‌గా తీసుకోనందుకు తలితండ్రులందరూ బాధపడుతున్నారు. వాళ్లు ఐసిస్‌లో చేరి వుంటే వారి మొహాలు కూడా చూడమని చెప్తున్నారు. తమను చూసి తక్కిన తలితండ్రులు మేల్కోవాలని పిలుపు నిస్తున్నారు. అదే వూళ్లోంచి జూన్ 27న మాయమైన ఫిరోజ్ ఖాన్ తలితండ్రులు వెంటనే మేల్కొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పీస్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌లో గతంలో పని చేసిన ఫిరోజ్ కూడా ఐసిస్ బాటే పట్టి వుంటాడనుకుని, పోలీసులు అతన్ని ఆచూకీ కోసం వెతికారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారా అతను ముంబయి శివార్లలో వున్నాడని కనిపెట్టి పట్టేసుకున్నారు. ఇప్పుడు పోలీసులు పీస్ ఫౌండేషన్‌పై గట్టి నిఘా వేశారు. మాయమైన 21 మంది ఐసిస్‌లో చేరడానికి వెళ్లారో లేక అల్-కైదాకు చెందిన సిరియా విభాగమైన నస్రా ఫ్రంట్‌లో చేరారో తెలియదు. ఏది ఏమైనా పిల్లలు మతఛాందసం వైపు మరలుతూంటే వారిని ఓ కంట కనిపెట్టడం మంచిదని వీరి తలిదండ్రులు హెచ్చరిస్తున్నారు. – ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)

జులై 45, 46 ఎమ్బీయస్ ః టర్కీ ః తిరుగుబాటుతో లాభపడ్డ పాలకుడు

జులై 15 న టర్కీ దేశాధ్యక్షుడికి వ్యతిరేకంగా సైన్యం తిరగబడిందని, దానికి బుద్ధి చెప్పమని దేశాధ్యక్షుడు ఎర్దోగాన్ ప్రజలకు పిలుపు నిచ్చిన 12 గంటల్లోనే తిరుగుబాటు విఫలమై, సైన్యం లొంగిపోయిందని మనకు తెలుసు. ఇది వినగానే ప్రజాస్వామ్యం పరిరక్షింప బడిందని మనం ఆనందించడం కద్దు. టర్కీ రాజకీయాలు ఎలా వున్నాయో, సైన్యం ఎందుకలా తిరగబడిందో, తిరుగుబాటు తర్వాత ఎర్దోగాన్ తీసుకున్న చర్యలు ఎంత తీవ్రంగా వున్నాయో వివరాలు తెలిస్తే తప్ప యిది మంచి పరిణామం అవునో కాదో తేల్చుకోలేం.

ఆధునిక టర్కీ రిపబ్లిక్‌కు పితామహుడిగా పేరుబడిన కెమాల్ పాషా టర్కీని సెక్యులర్ దేశంగా తీర్చిదిద్దాడు. సెక్యులరిజం పాటిస్తున్న కొద్ది ముస్లిం దేశాల్లో అది ఒకటి. అయితే రాజకీయాలన్నాక ఏదో ఒక వాదాన్ని బలంగా వినిపించకపోతే మనుగడ వుండదు కాబట్టి కొన్ని పార్టీలు ఇస్లామ్ పేరు మీద ప్రజలను ఆకట్టుకోవడానికి చూశాయి. కానీ వాటికి పూర్తి ఆదరణ లేకపోవడంతో యితరవాదాల పార్టీలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పరచాయి. అవి రాజ్యాంగానికి మతపరమైన సవరణలు చేద్దామనుకున్నపుడు టర్కీ సైన్యం దాన్ని ప్రతిఘటిస్తూ సెక్యులరిజానికి పరిరక్షకురాలిగా వ్యవహరిస్తూ వచ్చింది. వెల్‌ఫేర్ పార్టీ అనే ఇస్లామిస్ట్ పార్టీ ద్వారానే ఎర్దోగాన్ రాజకీయాల్లోకి వచ్చాడు. తండ్రి కోస్టల్ గార్డ్. ఇతను ఇస్తాంబుల్ ఇస్లామిక్ స్కూలులో, మర్మరా యూనివర్శిటీలో చదివి మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పాసయ్యాడు. ఫుట్‌బాల్ ఆటగాడిగా వృత్తి చేపట్టాడు. టీనేజరుగా ఇస్లామిస్టు సర్కిల్స్‌లో తిరిగాడు, వెల్‌ఫేర్ పార్టీలో చేరి 1994లో తన 40వ యేట ఇస్తాంబుల్‌కు మేయరయ్యాడు.

1997లో ఎర్బకాన్ నాయకత్వంలోని వెల్‌ఫేర్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వం మతపరమైన విధానాలు చేపడుతూంటే మిలటరీ కలగచేసుకుని అతని చేత రాజీనామా చేయించింది. 1998లో ఆ పార్టీని నిషేధించింది. మిలటరీ చర్యకు వ్యతిరేకంగా ఎర్దోగాన్ మతం పేర ప్రజలను రెచ్చగొట్టడానికి తీవ్రమైన పదజాలంతో ఉపన్యాసాలు చేశాడు. దాంతో మిలటరీ అతన్ని అరెస్టు చేసి నాలుగు నెలల పాటు జైలుకి పంపింది. పదవులు చేపట్టకుండా నిషేధం విధించింది. బయటకు వచ్చాక 2001 ఆగస్టులో అబ్దుల్లా గుల్ అనే సహచరుడితో కలిసి ఎకెపి (జస్టిస్ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ) అనే మరో ఇస్లామిస్టు పార్టీ ఏర్పరచాడు. తనను తాను మోడరేట్ కన్సర్వేటివ్‌గా అభివర్ణించుకున్నాడు. ఆ పార్టీ 2002లో జరిగిన ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. తనపై నిషేధం వుంది కాబట్టి గుల్‌ను ప్రధానిని చేసి ఉపయెన్నికలో నెగ్గాక అతన్ని దింపి 2003 మార్చిలో తనే ప్రధాని అయ్యాడు. 2007, 2011 ఎన్నికలలో అతని నేతృత్వంలో పార్టీని మళ్లీమళ్లీ గెలిచింది. 11 ఏళ్ల పాటు ప్రధానిగా పాలించాక ఎర్దోగాన్ అధ్యక్ష పదవికి మొట్టమొదటిసారిగా 2014లో ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించి నెగ్గాడు.

2014 ఆగస్టులో ప్రధాని పదవిని అహ్మద్ దావుతోగ్లూకు అప్పగించి తను దేశాధ్యక్షుడయ్యాడు. అప్పటిదాకా అలంకారప్రాయంగా వున్న అధ్యక్షపదవికి ఎన్నో అధికారాలు కట్టబెట్టసాగాడు. ఈ వరస బాగాలేదని అభ్యంతర పెట్టిన అహ్మద్‌ను తొలగించి తన అనుచరుడైన బినాలీ యిల్‌దిరిమ్‌ను ప్రధానిగా చేసి, అధికారాలన్నీ తన చేతిలో పెట్టుకున్నాడు. ఈ 14 ఏళ్లలో ఎర్డోగాన్ టర్కీకి ఆర్థిక సుస్థిరత తెచ్చాడు. టర్కీని మాన్యుఫ్యాక్చరింగ్ సెంటర్‌గా, ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దాడు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై బాగా ఖర్చు పెట్టి కొత్త రోడ్లు, ఎయిర్‌పోర్టులు, హైస్పీడు రైల్ నెట్‌వర్క్ నిర్మించాడు. అతను వ్యాపారస్తులకు అనుకూలుడు. అమెరికాతో సఖ్యం నెరపి, నాటోలో చేరాడు. యూరోపియన్ యూనియన్‌లో చేరదామని చూస్తున్నాడు. అతని పాలనలో సరాసరి అభివృద్ధి రేటు 4.5% వుంది. ద్రవ్యోల్బణ రేటును చాలా బాగా నియంత్రించాడు, కానీ యితర దేశాలతో పోలిస్తే యిప్పటికీ అక్కడ ధరలు ఎక్కువే. 2014 నుంచి ఎకానమీ దిగజారసాగింది. ప్రస్తుతం గ్రోత్ రేటు 2.9% కి తగ్గి, నిరుద్యోగం 10%నికి పెరిగింది. ప్రపంచమంతటా గమనిస్తాం – ఆర్థికాభివృద్ధి జరిగిన కాలంలోనే అవినీతి, బంధుప్రీతి, నియంతృత్వం, విమర్శించినవారిపై కాఠిన్యం వుంటాయి. ఇక్కడా అదే జరిగింది.

అతని అవినీతికి, ప్రభుత్వధనాన్ని దుర్వ్యయం చేయడానికి ఉదాహరణగా రాజధాని అంకారా శివార్లలో కొండ మీద కట్టిన వెయ్యి గదుల శ్వేతసౌధం (దాని పేరు అక్ సరాయ్) కనబడుతోంది. అది వైట్ హౌస్ కంటె, క్రెమ్లిన్ భవనం కంటె పెద్దది. ఖర్చు 615 మిలియన్ డాలర్లను మించిందంటున్నారు. 2013లో 100 బిలియన్ డాలర్ల అవినీతి స్కాండల్ బయటపడడంతో అతని కాబినెట్‌లో ముగ్గుర్ని, అతని సహచరులను అరెస్టు చేయించవలసి వచ్చింది. అవినీతిలో అతని పాత్రను నిరూపించే సంభాషణ రికార్డింగ్ సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో ఫేస్‌బుక్, ట్విటర్, యూట్యూబ్‌లను నిషేధించాడు. ఎన్నికలలో అక్రమాలు చేశాడని కూడా ఆరోపణలు రావడంతో అతని యిమేజి దెబ్బ తినసాగింది. తన అవినీతిని, అధికారదాహాన్ని బయటపెడుతున్న స్థానిక జర్నలిస్టులను వేధించడమే కా, అంతర్జాతీయ మీడియాకు సంబంధించిన వారిపై కూడా దాడుల జరిపించాడు. అతని నియంతృత్వానికి, అవినీతికి వ్యతిరేకంగా 2013 మేలో దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. పోలీసులు కాల్పులు జరిగి 22 మంది చనిపోయారు. ఇతర దేశాలు దీన్ని ఎత్తి చూపాయి. యూరోపియన్ యూనియన్‌లో చేరడానికి అతను జరుపుతున్న చర్చలు ఆగిపోయాయి.

విదేశీ వ్యవహారాల్లో కూడా చాలా తప్పులు జరిగాయి. ఒకప్పుడు టర్కీకి మిత్రదేశంగా వున్న ఇజ్రాయేలుతో సంబంధాలు చెడగొట్టుకున్నాడు. సిరియా పాలకుడైన బషర్ అల్ అసాద్ ప్రభుత్వాన్ని బలహీనపరచడానికి ప్రయత్నిస్తున్న ప్రతిపక్షాలకు అండగా నిలిచాడు. వారితో బాటు ఐసిస్‌కు, లేవాంత్ మిలిటెంట్లకు కూడా ధనసహాయం చేస్తున్నట్లు బయటకు వచ్చేసింది. కుర్దులతో టర్కీవారికి 1978 నుంచి వైరం నడుస్తోంది. కుర్దిస్తాన్ వర్కర్స్ పార్టీ (పికెకె)తో 2012 నుంచి చర్చలు సాగించి రాజీ పడి కొంతమేరకు విజయం సాధించినా, ఐసిస్‌తో పోరాడుతున్న సిరియన్ కుర్దులకు సాయపడడానికి నిరాకరించడంతో, తక్కిన కుర్దులు కూడా అతనికి వ్యతిరేకు లయ్యారు. ఐసిస్ వాళ్లు టర్కీలో కూడా టెర్రరిస్టు కార్యకలాపాలు మొదలెట్టడంతో ప్రజల్లో ఎర్డోగాన్ పట్ల విముఖత ఏర్పడింది. వీరికి మిలటరీ బలం కూడా తోడైతే తనకు పదవీచ్యుతి తప్పదని గ్రహించాడు ఎర్డోగాన్. ఇతని పార్టీ అధికారంలోకి వచ్చేముందు మిలటరీ నాలుగు సార్లు ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంది. అందువలన యితను ఎప్పటికప్పుడు మిలటరీని నిర్వీర్యం చేస్తూ, తన అనుయాయులను దానిలో భర్తీ చేస్తూ జాగ్రత్తపడ్డాడు. మిలటరీ అధికారులు మతచిహ్నాలను ధరించకూడదని కెమాల్ పాషా చేసిన చట్టాన్ని యితను మార్చేశాడు. మిలటరీ యొక్క సెక్యులర్ స్వభావాన్ని మార్చడానికి ఉన్నత పదవుల్లో మతాభిమానులను నియమించసాగాడు. తిరుగుబాటు జరిగినప్పుడు వీళ్లు దానిలో పాలు పంచుకోలేదు. కింది స్థాయిలో వున్న వారే తిరగబడి, అణచబడ్డారు.

తిరుగుబాటు సందర్భంగా చెప్పుకోవలసిన ఒక ముఖ్య వ్యక్తి – 75 ఏళ్ల ఫెతుల్లా గ్యులెన్! ఇతను కూడా ఇస్లామిస్టే. సూఫీ వర్గానికి చెందినవాడనవచ్చు. తన ధోరణిలో ఇస్లాంను వ్యాప్తి చేస్తూ వుంటాడు. అతనికి టర్కీలోనే కాదు, ఆసియాలోని యితర దేశాల్లో కూడా అనుయాయులున్నారు. వారు స్థాపించిన విద్యాలయాలు చాలా ప్రఖ్యాతి చెందాయి. 1998లో మిలటరీ పెత్తనం నడిచేటప్పుడు తను చేసిన తీవ్రధోరణి మతోపన్యాసాల వలన యిబ్బంది వస్తుందన్న భయంతో 1999లో అమెరికాకు వలస వచ్చి 2001లో గ్రీన్ కార్డ్ సంపాదించాడు. 2002 ఎన్నికలలో సాటి ఇస్లామిస్టు అయిన ఎర్డోగాన్‌కు మద్దతు యిచ్చాడు. చాలాకాలం సన్నిహితుడిగా వున్నాడు. మిలటరీలో ఇస్లామిస్టుల నియామకానికి సహకరించాడు. అతని అనుయాయులు కూడా మిలటరీలో పెద్ద ఉద్యోగాలు ఆక్రమించారు. కొంతకాలానికి ఎర్డోగాన్ సర్వాధికారాలు తన చేతిలోకి తీసుకుని అవినీతికి పాల్పడడంతో గ్యులెన్ అతన్ని వ్యతిరేకించసాగాడు. దాంతో ఎర్డోగాన్ అతనిపై, అతని వర్గీయులపై పగబట్టాడు. 2013లో గ్యులెన్ అనుయాయులైన మిలటరీ పెద్దలు కొందరు ఎర్డోగాన్‌కు వ్యతిరేకంగా కుట్ర చేద్దామనుకున్నారు. ఇది అతను ముందుగానే పసిగట్టి వాళ్లందరినీ అరెస్టు చేయించాడు. శిక్షలు వేయించడానికి న్యాయవ్యవస్థలో కూడా గ్యులెన్ అనుయాయులను తొలగించి, చట్టాల్లో మార్పులు చేసేశాడు. కానీ వాటికి ఆధారాలు చూపలేకపోవడంతో అవి అమలు కాలేదు. గ్యులెన్‌పై టెర్రరిస్టు ముద్ర కొట్టి, కేసు పెట్టించి, తమ దేశానికి వెనక్కి పంపమని అమెరికాను కోరాడు. అతని టెర్రరిస్టు కార్యకలాపాలు తమ దృష్టికి రానందున పంపటం లేదని అమెరికా అంది.

నాటోలో రెండో ముఖ్య దేశంగా వున్న తమ మాట అమెరికా వినలేదని ఎర్డోగాన్‌కు కోపం వచ్చింది. ఇప్పుడీ తిరుగుబాటు వెనక్కాల అమెరికా హస్తం వుందని, గ్యులెన్‌తో బాటు కుర్దుల పికెకె కూడా చేతులు కలిపిందని ఆరోపించాడు కూడా. అతని

పాలనపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతున్న సమయంలో యీ తిరుగుబాటు జరిగింది. ఎర్డోగాన్ తన వాక్చాతుర్యంతో దీన్ని ప్రజాస్వామ్యంపై దాడిగా ప్రజలను నమ్మించగలగడం చేత విఫలమైంది. అటూయిటూ కలిపి 264 మంది చనిపోయారు. వారిలో 173 మంది పౌరులు, 62 మంది పోలీసులు, 5గురు సైనికులు, 24 మంది తిరుగుబాటుదారులు. 2 వేల మంది గాయపడ్డారు. నిజానికి యిది ఇస్లామిస్టు రాజకీయనాయకుల్లోనే రెండు గ్రూపుల మధ్య అధికార పోరాటం. టర్కీ సమాజంలో వివిధ రంగాల్లో పెద్ద పదవుల్లో వున్న గ్యులెన్ మనుషులను ఏదో ఒక విధంగా తొలగించాలని ఎర్డోగాన్ ప్రణాళికలు రచించి జాబితా తయారుచేసుకుని ఎప్పణ్నుంచో ఎదురు చూస్తున్నాడు. రెండేళ్లకోసారి జరిగే మిలటరీ నియామకాల, బదిలీల, పదవీవిరమణల సమావేశం ఆగస్టు 1న జరగాలి. దానిలో గ్యులెన్ మనుష్యులను తీసేసి, తనవాళ్లను పెడదామనుకున్నాడు.

ఇప్పుడు యీ తిరుగుబాటు పేరు చెప్పి అతను అరెస్టు చేసినది – 118 జనరల్స్, అడ్మిరల్స్‌తో సహా 7500 మంది మిలటరీవారు, 1000 మంది పోలీసు అధికారులు, ఉద్యోగాలు తీసేసినది లేదా సస్పెండ్ చేసినది – 8 వేల మంది పోలీసు అధికారులు, 3 వేల మంది న్యాయాధికారులు, 15,200 మంది విద్యాశాఖాధికారులు, 21 వేల మంది టీచర్లు 1577 మంది యూనివర్శిటీ డీన్లు, 1500 మంది ఫైనాన్స్ శాఖాధికారులు, 492 మంది మతబోధకులు, 393 మంది సోషల్ పాలిసీ మినిస్ట్రీ సిబ్బంది, 257 మంది ప్రధాని కార్యాలయంలో ఉద్యోగులు, 100 మంది నిఘా విభాగ అధికారులు! సైనికులు తిరుగుబాటు చేస్తే వారిని శిక్షించాలి కానీ టీచర్లను, మతబోధకులకు శిక్షేమిటి అనుకోవద్దు. వాళ్లంతా గ్యులెన్ ఉద్యమం నడిపే విద్యాసంస్థలకు చెందినవారై వుంటారు, ఆ ఉద్యమ కార్యకర్తలై వుంటారు.

ఈ చర్యలతో బాటు దేశంలో మూణ్నెళ్ల ఎమర్జన్సీ విధించాడు. ఈ కాలంలో ప్రభుత్వం పార్లమెంటుతో, ప్రతిపక్షాలతో సంప్రదించకుండా ఏ చట్టమైనా చేయవచ్చు, చేసిన చట్టాన్ని కోర్టులు ప్రశ్నించలేవు, మీడియాపై ఆంక్షలు విధించడానికి, పదిమంది గుమిగూడినా, ఎవరిమీదనైనా అనుమానం వచ్చినా అరెస్టు చేయడానికి ప్రభుత్వానికి సర్వహక్కులూ దఖలు పడ్డాయి. ఏ రాజకీయ పార్టీ తిరుగుబాటుకు మద్దతు తెలపలేదు. అయినా వారందరి రాజకీయ హక్కులూ హరించి, ప్రెస్ నోరు నొక్కి తన నియంతృత్వానికి బాటలు వేసుకుంటున్నాడు ఎర్డోగాన్. "వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి యీ తిరుగుబాటు మనకు దేవుడు పంపిన సువర్ణావకాశం." అని ప్రకటించాడు ఎర్డోగాన్. అవకాశం దేవుడు పంపాడో లేదో కానీ, దాన్ని అలా మలచుకున్న ఘనత మాత్రం యీ మానవుడిదే! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 47 **ఎమ్బీయస్ : అరుణాచల్: జిలానీలు ఎటైనా దూకగలరు**

రానురాను బిజెపి కాంగ్రెసుకు నకలుగా తయారవుతోంది. ఫిరాయింపుదార్లను, గవర్నర్లను ఉపయోగించుకుని ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చడం వంటి టక్కుటమార విద్యలను ప్రాక్టీసు చేస్తోంది. కానీ ఎంతైనా గురువు గురువే. అరుణాచల్‌లో ఆ సంగతి రుజువైంది. జంపు జిలానీలు కప్పల వంటి వారనీ, కప్పల తక్కెడ తమ వైపే ఒరుగుతుందని అనుకోవడం మూర?త్వమని యీ పాటికే బిజెపికి తెలిసి వచ్చి వుంటుంది.

అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి నబామ్ టుకీ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమను పట్టించుకోవటం లేదని, అవినీతికి పాల్పడుతున్నాడని కాంగ్రెసు ఎమ్మెల్యేలు హై కమాండ్‌కు ఫిర్యాదు చేస్తూ వచ్చారు. అయినా మాతాసుతులకు తీరిక లేకపోయింది. పట్టించుకోలేదు. ఆ అలుసు చూసుకుని టుకీ రెచ్చిపోయాడు. ఎవర్నీ పట్టించుకోవడం మానేశాడు. తన మాట కాదన్నవారిని కాబినెట్‌లోంచి తీసేయసాగాడు. పోనుపోను అసమ్మతివాదులు పెరిగారు. వారికి నాయకులు కూడా ఏర్పడ్డారు. పేమా ఖండూ అనే అతని వద్ద 11 మంది ఎమ్మెల్యేలు, చౌనా మీన్ అనే అతని వద్ద 6గురు, కలికో పాల్ అనే అతని వద్ద 12 మంది ఎమ్మెల్యేలు చేరారు. ఈ పరిణామాల పట్ల కాంగ్రెసు అధిష్టానం కళ్లు మూసుకుంది కానీ, బిజెపి కళ్లు విప్పార్చి చూసింది. కాంగ్రెసు కొంప కూల్చి, అవే యిటికలతో తన యిల్లు కట్టుకుందామనుకుంది. నిజానికి 2014 పార్లమెంటు ఎన్నికల ప్రచారం సందర్భంగా 2014 మార్చి 31 న అరుణాచల్ వచ్చిన మోదీ, సిఎం టుకీని హెచ్చరిస్తూ "మే 16 ఎన్నికల ఫలితాలు వచ్చాక కాంగ్రెసు ప్రభుత్వాలను రక్షించడడానికి ఢిల్లీలో ఎవరూ వుండరు." అన్నాడు. ఆ మాట నిజం చేయడానికి కాబోలు గవర్నరును వాడుకున్నాడు. స్పీకరు టుకీ వైపు వున్నాడని గ్రహించిన గవర్నరు స్పీకరు అధికారాన్ని తన చేతిలోకి తీసుకుని అసెంబ్లీ సమావేశం తేదీని జనవరి 14 నుంచి డిసెంబరు 16కి మార్చి, హోటల్లో డిప్యూటీ స్పీకరు చేసిన సమావేశాన్ని గుర్తించి, టుకీకి బలం లేదని తీర్మానించి, రాష్ట్రపతి పాలన పెట్టించి, ఫిబ్రవరిలో తిరుగుబాటు నాయకుడు కలికో పాల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయమని ఆహ్వానించాడు. కాంగ్రెసు లోంచి బయటకు వచ్చిన 29 ఎమ్మెల్యేలు పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ (పిపిఎ)గా ఏర్పడితే తన 11 సభ్యుల మద్దతు అందించింది. ఇంకో యిద్దరు స్వతంత్రులు కూడా చేరారు. 42 మంది మద్దతు వుంది కాబట్టి పాల్ ముఖ్యమంత్రి అయిపోయాడు. టుకీ సుప్రీం కోర్టుకి వెళ్లాడు.

ఐదు నెలల పాటు పాల్ పాలించాక, జులై 13 న సుప్రీం కోర్టు తీర్పు చెపుతూ అసెంబ్లీ సమావేశం తారీకు మార్చడానికి గవర్నరుకు అధికారం లేదంది. గడియారాన్ని వెనక్కి తిప్పి డిసెంబరు 15 నాటి యథాపూర్వస్థితికి తీసుకుని వచ్చి టుకీయే ముఖ్యమంత్రి అంది. అసెంబ్లీలో కొత్తగా తన బలాన్ని నిరూపించుకోమంది. చట్టరీత్యా ముఖ్యమంత్రి అయ్యాడు కానీ అతని దగ్గర బలమేది?

అసెంబ్లీలో 60 మందిలో యిద్దరు రాజీనామా చేయడం చేత మిగిలిన 58 సభ్యులలో యితని అనుచరులు 15 మాత్రమే. 29 మందిని వెనక్కి తీసుకురావాలంటే కాస్త టైము కావాలి. బలనిరూపణకు కాస్త టైమివ్వమని గవర్నరును అడుగుదామా అనుకుంటూండగానే గవర్నరుగారే చురుగ్గా అడుగేశారు. కోర్టు తీర్పు వచ్చిన రాత్రి 9గంటలకే యీ మెయిల్ ద్వారా జులై 16 కల్లా మెజారిటీ నిరూపించుకో అని గడువు విధించాడు. ఇతను రాజ్‌ఖోవా కాదు. అతను అనారోగ్యంతో లీవులో వెళితే త్రిపుర గవర్నరు తథాగత రాయ్‌ను తాత్కాలికంగా వేశారు. కానీ యితనూ అదే జాతి పక్షిలా వ్యవహరించాడు. ఎందుకంటే టుకీ అప్పుడు ఢిల్లీలో వున్నాడు. అతను అరుణాచల్ రాజధాని ఈటానగర్ రావాలి, పాత సహచరులను పలకరించాలి, ఒప్పించాలి. ఇదంతా రెండు రోజుల్లో జరగడం సాధ్యమా? సాధ్యం కాదనే బిజెపి కూడా ధీమాగా వుంది.

అయితే వాళ్లకు తెలియని విషయం ఏమిటంటే కలికో పుల్ ప్రభుత్వం సజావుగా సాగటం లేదు. అతను తన పార్టీని బిజెపిలో కలిపేస్తాననడం సాటి తిరుగుబాటుదారులకు నచ్చలేదు. పైగా టుకీలాగే యితను కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని ఖండూ, ఉప ముఖ్యమంత్రిగా వున్న మీన్ బహిరంగంగా కూడా అనసాగారు. ఢిల్లీ కాంగ్రెసు నాయకులకు యీ విషయం తెలిసింది. సోనియా గాంధీ యీ బేరసారాల్లో కలగజేసుకోనని చెప్పి కపిల్ సిబ్బల్‌కు, అరుణాచల్ ఎంపీ నినాంగ్ ఎరింగ్‌కు అప్పచెప్పింది. నినాంగ్ అసమ్మతి నాయకులతో చర్చలు సాగించాడు. ''టుకీని దింపడం ఖాయం. మీలో ఎవరు సిఎం కావాలో మీలో మీరే తేల్చుకోండి'' అని చెప్పాడు. ఓ పక్క టుకీకి సిబ్బల్ నచ్చచెప్పసాగాడు – ''రేపు కోర్టులో మనం గెలిచినా, నువ్వు సిఎం కాలేవు. నువ్వు వెనక్కి తగ్గి తిరుగుబాటు నాయకులకు ఛాన్సిస్తే వాళ్లు వెనక్కి పార్టీలోకి వస్తారు. లేకపోతే 15 మందితో ఎటూ కాకుండా పోతావు.'' అని. ఇవన్నీ బిజెపికి తెలిసినట్లు లేదు. తెలిసినా మితిమీరిన ఆత్మవిశ్వాసంతోనో, అసాంలో కాంగ్రెసు నుంచి ఫిరాయించి బిజెపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చిన హిమాంత్ విశ్వ శర్మ శక్తిసామర్థ్యాలపై నమ్మకం చేతనో ఖాతరు చేయలేదేమో.

కోర్టు తీర్పు రాగానే టుకీ కాంగ్రెస్ హెడ్‌క్వార్టర్సుకి వెళ్లాడు. అక్కడ ఒక సీనియరు నాయకుడు చెప్పాడు – ''నీకు మెజారిటీ వుంటుందనుకుంటే ప్రయత్నించు, లేకపోతే మర్యాదగా తప్పుకుని తక్కినవాళ్లకు ఛాన్సియ్యి. కోర్టు తీర్పు ద్వారా బిజెపి నైతికంగా దెబ్బ తింది. దాన్ని సొమ్ము చేసుకునే తరుణమిది.'' అని. సోనియా, రాహుల్ కూడా అదే చెప్పారు – 'నిన్ను వెనకేసుకుని వచ్చి ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నాం. ఇప్పుడు నువ్వేం చేస్తావో మాకు తెలియదు, మాకు కావలసినది అక్కడ మళ్లీ కాంగ్రెసు ప్రభుత్వం' అని. ఎవరికి బలం వుందో అంచనా వేసి, వ్యవహారాలు చక్కబెట్టడానికి కాంగ్రెసు నాయకులు ముకుల్ వాస్నిక్, సిపి జోషి, కె జయకుమార్ అతనితో బాటు ఈటానగర్ వెళ్లారు. జులై 14న టుకీ ఢిల్లీ అరుణాచల్ భవన్‌లో ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీసులో బాధ్యతలు స్వీకరించి, ఆ రోజే ఈటానగర్ వెళ్లాడు. తను దిగిపోవడానికి సిద్ధంగా వున్నానని కబురంపాడు. దానికి మొదటగా స్పందించినది పేమా ఖండూ. అతను 2011లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన గత ముఖ్యమంత్రి దోర్జీ ఖండూ కొడుకు. బౌద్ధుడు. ఢిల్లీలో హిందూ కాలేజీలో డిగ్రీ చదివాడు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు. గత ప్రభుత్వంలో మంత్రిగా చేశాడు. టుకీ ప్రభుత్వంలో టూరిజం మంత్రిగా చేసి అతనితో విభేదాలు రావడంతో 2015 అక్టోబరులో రాజీనామా చేసి పుల్ క్యాంపులో చేరాడు. అతని వద్ద 11 మంది ఎమ్మెల్యేలున్నారు. ఆరుగురు ఎమ్మెల్యేలతో చౌనా మీన్ కూడా వచ్చి చేరాడు.

నిజానికి వీళ్లంతా గువాహాటిలో ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో బిజెపి నడుపుతున్న క్యాంప్‌లోనే వున్నారు. వీళ్లంతా ఎక్కడికీ పోరనే ధీమాతో, కోర్టు తీర్పు రాగానే అసెంబ్లీలో టుకీకి బలం లేదు, నాకే వుంది అంటూ పుల్ తన తరఫున వున్న 42 మంది ఎమ్మెల్యేలను జులై 14 న మీడియా ముందు ప్రదర్శించాడు. హిమాంత విశ్వ శర్మ జులై 15 న కూడా మాకు మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతుంది అని ప్రకటించాడు. కోర్టులో ఓడిపోయినా, అసెంబ్లీలో గెలుస్తామన్న ధీమా వ్యక్తపరచాడు. కానీ ఒక్కోళ్లు జారిపోతున్న విషయం గ్రహించిన పుల్ చివరగా తను కూడా వచ్చి చేరాడు. ఎందుకంటే యింతమంది మద్దతు వుంటే స్పీకరు అసమ్మతి వాదులను అనర్హులుగా ప్రకటించి, టుకీని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయవచ్చు. అందుకని చర్చల్లో కూర్చున్నాడు. ముగ్గురి మధ్య చర్చలు జరిగి 37 ఏళ్ల ఖండూను ముఖ్యమంత్రిని చేయడానికి ఒప్పందం కుదిరింది. స్వతంత్రులు కూడా ఫిరాయించేశారు. మొత్తం 44 మంది మద్దతు కూడగట్టారు. ఈ చర్చలన్నీ 15 అర్ధరాత్రి తర్వాత జరిగాయి. తెల్లవారుఝామున అందరూ ఈటానగర్ చేరారు. రాత్రికి రాత్రి ఫిరాయింపులు పూర్తయ్యాయని బిజెపి గ్రహించలేక పోయింది. వ్రతమూ చెడింది, ఫలమూ దక్కలేదు.

జంప్ జిలానీలను ఎల్లవేళలా నమ్మకూడదనే నీతి యీ కథలో వుంది. పరిస్థితి అటూయిటూ అయితే వాళ్లు ఎటైనా దూకగల సమర్థులు. మన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు యీ కథను ఓ సారి చదువుకుని నెత్తిమీద తమకు తామే అక్షింతలు వేసుకుంటే మంచిది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

జులై 48 – 50 **ఎమ్బీయస్ : పురాణగాథః ఏకలవ్యుడు ఏ కులం?**

ఇదో పెద్ద ప్రశ్నా!? ఏకలవ్యుడు నిషాదుడు కదా, అంటే కోయ, బోయ వంటి గిరిజనుడు అని చెప్పేస్తాం. ఆ సమాధానం ఎంతవరకు కరక్టనేది వివరించడమే యీ వ్యాసం లక్ష్యం. మనందరికీ తెలిసున్న మహాభారత కథ ఒక్కసారి గుర్తు చేసుకుందాం. పేద బ్రాహ్మణుడైన ద్రోణుడు, పాంచాల దేశపు యువరాజైన యజ్ఞసేనుడు (ద్రుపదుడు) అగ్నివేశ మహర్షి దగ్గర సహాధ్యాయులై అస్త్రవిద్యను,

ధనుర్వేదాన్ని అభ్యసించారు. మిత్రుడిపై ప్రేమతో ద్రుపదుడు 'మా నాన్నగారు నాకు పట్టాభిషేకం చేయగానే నా ధనమంతా నీదే' అని ద్రోణుడికి మాట యిచ్చాడు. చదువు పూర్తయ్యాక ద్రోణుడు కృపిని పెళ్లాడి అశ్వత్థామను కన్నాడు. ద్రోణుడు ఎక్కడా ఉద్యోగం చేయనందున ఆదాయం లేదు. అశ్వత్థామ ఆవుపాల కోసం ఏడవడం చూడలేక గోదానం తీసుకుందామని ద్రోణుడు చాలా చోట్లకు వెళ్లాడు. ఎక్కడా దొరకలేదు. ఇంటికి తిరిగి వచ్చేసరికి చుట్టుపక్కల పిల్లలు అశ్వత్థామను ఆటపట్టించడానికి పిండినీళ్లను పాలని చెప్పి తాగిస్తున్నారు. ఆ పిల్లవాడు అవి నిజంగా ఆవుపాలనుకుని ఆనందిస్తూ వుంటే ద్రోణుడికి పట్టరాని దుఃఖం వచ్చింది. ఇంతలో తన మిత్రుడు రాజయ్యాడని విని, వెళ్లి ఆవునిమ్మని అడుగుదామనుకున్నాడు. రాజస్థానంలో యితను "మిత్రమా" అని సంబోధించగానే ద్రుపదుడు "స్థాయి బట్టి స్నేహం మారుతుంది. ఇప్పుడు నాకు, నీకు అంతస్తులో ఎంతో తేడా వుంది. నీకిచ్చిన మాట నాకు గుర్తే లేదు. కావాలంటే ఓ పూట భోజనం పెట్టగలను." అన్నాడు. భార్యాబిడ్డలతో వెళ్లిన ద్రోణుడికి తలకొట్టేసినట్లయింది. సరైన శిష్యుణ్ని తయారుచేసి, యితన్ని అతని చేత ఓడించి, బుద్ధి చెప్పాలని అప్పుడే ప్రతిజ్ఞ చేసుకున్నాడు. ఉద్యోగార్థం కురుదేశానికి వచ్చినపుడు పిల్లలైన కురుపాండవులు ఆడుకుంటున్న బంతి నూతిలో పడితే బాణాలతో కొట్టి పైకి తీసియిచ్చాడు. అతని ప్రజ్ఞ విన్న భీష్ముడు వచ్చి నీవెవరవని అడిగితే యీ కథంతా చెప్పాడు. పిల్లలకు గురువుగా భీష్ముడు ఉద్యోగం యిచ్చాడు.

కురుపాండవులకు విద్య నేర్పాక కొన్నాళ్లకు అందర్నీ కూర్చోబెట్టి "అస్త్రవిద్య ముగిశాక నా కోరిక మీరు తీర్చాలి. సరేనా?" అని అడిగాడు. అందరూ మౌనంగా వుంటే అర్జునుడు మాత్రం "గురుకార్యాన్ని నెరవేరుస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను." అన్నాడు. ఆ క్షణంలోనే ద్రోణుడికి అతడు అత్యంత ఆత్మీయుడై పోయాడు. అతనికి ప్రత్యేక శ్రద్ధతో అస్త్రాలు నేర్పసాగాడు. ద్రోణుడి ఖ్యాతి విని వృష్ణి వంశజులు, అంధక వంశస్థులూ, వివిధ దేశాల రాజులూ, కర్ణుడు అందరూ వచ్చి అతని శిష్యులుగా చేరారు. ఎందరు చేరినా అర్జునుడు విద్య నేర్చుకోడంలో, గురువును సేవించడంలో చూపినంత శ్రద్ధ మరెవరూ చూపలేదు. ఒక రోజు చీకట్లో కూడా బాణాలు వేయడం అభ్యసిస్తూ వుంటే అది చూసిన ద్రోణుడు అర్జునుని కౌగలించుకుని "విలువిద్యలో లోకంలో మరెవ్వరూ నీకు సమానులుగా నిలువలేనట్లు నిన్ను తీర్చదిద్దడానికి ప్రయత్నిస్తాను." అని మాట యిచ్చాడు. అన్నట్టుగానే తన కొడుక్కి నేర్పని అస్త్రాలు కూడా అర్జునుడికి నేర్పాడు. అతని ద్వారానే తన పగ తీరుతుందన్న ఆశ అతనిది. ఒక రోజు ఏకలవ్యుడు వచ్చి విద్య నేర్పమని అడిగాడు. నువ్వెవరివని అడిగితే "నిషాద రాజైన హిరణ్యధన్వుని (కొన్ని వెర్షన్లలో హిరణ్యధనుషుడు) కొడుకుని" అన్నాడు. నిషాదులంటే పశు పక్ష్యాదులను వేటాడే ఆటవికులు. నువ్వు నిషాదుడివి కాబట్టి నేర్పనన్నాడు ద్రోణుడు.

అలా ఎందుకని వుండవచ్చు? వేటాడేవారికి క్షాత్రవిద్య నేర్పకూడదన్న నిషేధం వుందా? నగరాలను ఏలే క్షత్రియరాజులకు అడవుల్లో వుండే నిషాదులు సామంతరాజులుగా వుంటూ అప్పుడప్పుడు తిరగబడేవారా? వాళ్లకు విద్య నేర్పితే పోలీసు అకాడెమీలో పోలీసులతో బాటు మావోయిస్టులకూ తర్ఫీదు యిచ్చినట్లవుతుందా? కేవలం కులవివక్షత మాత్రమే అనుకుంటే ద్రోణుడు బ్రాహ్మణులు, క్షత్రియులకే కాక సూతుడైన కర్ణుడికీ విద్య నేర్పాడు. మరి నిషాదులకు ఎందుకు నేర్పలేదు? ఏది ఏమైనా యీ చర్యను ఏకలవ్యుడితో సహా ఎవరూ తప్పుపట్టలేదు. మీ ప్రతిమను పెట్టుకుని అభ్యసిస్తాను అని ఏకలవ్యుడు అంటే సరేనన్నాడు ద్రోణుడు – అలా ఏ మాత్రం విద్య నేర్చుకుంటాడులే అనే ధీమాతో కాబోలు. కొన్నాళ్లకు తన శిష్యుల నందరినీ వేటకు పంపాడు. వేట కవసరమైన సామగ్రి తీసుకుని ఒక మనిషి తన పెంపుడు కుక్కతో సహా వారి వెంట వచ్చాడు. వీరంతా వేటాడుతూంటే ఆ కుక్క ఏకలవ్యుడి వద్దకు వెళ్లింది. అప్పటికే అతను మట్టితో ద్రోణుడి ప్రతిమ చేసి ముందర పెట్టుకుని, విలువిద్యలో అద్భుతమైన పాటవాన్ని సాధించాడు. ఆటవికుడు కాబట్టి జింకతోలు ధరించాడు, జటలు పెంచాడు. శరీరమంతా మలినమై వుంది. అసలే నల్లనివాడు. అతన్ని చూసి కుక్క మొరిగింది. దాన్ని దండించడానికి ఏకలవ్యుడు ఆ కుక్క ముఖం మీద ఒకే సారి ఏడుబాణాలను ప్రయోగించాడు. ఆ కుక్క మొర్రోమంటూ కురుకుమారుల వద్దకు వచ్చింది. ఆ బాణాల తీరును చూసి, ఆ నైపుణ్యానికి అబ్బురపడి కుక్క వెంబడి ఏకలవ్యుడి వద్దకు వెళ్లి కలిశారు. నువ్వెవరు అంటే ఫలానా అని చెప్పాడు. ద్రోణశిష్యుణ్ని అని చెప్పాడు.

వీళ్లంతా తమ నగరానికి తిరిగి వెళ్లి ద్రోణుడితో విషయం చెప్పారు. అర్జునుడు ఫిర్యాదుగా "గురువర్యా, నన్ను మించినవాడు ఎవరూ లేకుండా లేరన్నారు. తమ శిష్యుడు ఏకలవ్యుడు నన్ను మించిన వీరుడు ఎలా అయ్యాడు?" అని అడిగాడు. ద్రోణుడు రెండు గడియలు ఏకలవ్యుడి గురించి ఆలోచించి ఏకలవ్యుణ్ని నిర్వీర్యుణ్ని చేయాలనే ఒక నిర్ణయానికి వచ్చాడు. దానికి తన 'ఆచార్యత్వాన్ని' వుపయోగించదలచుకున్నాడు. ఏకలవ్యుడి దగ్గరకు వెళ్లి 'వీరుడా! నువ్వు నాకు శిష్యుడివే అయితే జీతం ఇయ్యి' అన్నాడు. (నన్నయ్య గారు చేసిన అనువాదంలో గురుదక్షిణ అని వుంది). ఏకలవ్యుడు సరేననగానే 'నీ కుడిచేతి బొటనవేలు ఇయ్యి' అన్నాడు. ఇది చాలా దుర్మార్గం. ఏకలవ్యుడికి ప్రత్యక్షంగా విద్య నేర్పని మనిషికి వేతనమడిగే హక్కు ఎక్కణ్నుంచి వచ్చింది? ద్రోణుడి యీ ప్రవర్తనకు కారణమేమిటి? తన పగ తీర్చడానికి సమ్మతించిన అర్జునుణ్ని ఎలాగైనా మంచి చేసుకోవాలన్న తాపత్రయమే కావాలి. కొందరు యింకో కారణం వుందని వ్యాఖ్యానిస్తారు – శిష్యుడి స్వభావాన్ని బట్టి, అర్హత బట్టి వారికి ఎంత విద్య గరపాలో నిర్ణయించే గురువు ద్రోణుడు. అందుకే తన కుమారుడు అశ్వత్థామకు కూడా చెప్పని కొన్ని అస్త్రాలు అర్జునుడికి నేర్పాడు. నిజానికి యుద్ధానంతరం అశ్వత్థామ అందరి కంటె నీచంగా ప్రవర్తించి రాత్రి పూట పాండవ శిబిరానికి వెళ్లి హత్యలు చేశాడు. అలాటి బుద్ధి వుందనే కాబోలు ద్రోణుడు అతనికి పూర్తిగా నేర్పి వుండడు. ఇక ఏకలవ్యుడి దగ్గరకు వస్తే – అతను కుక్క పట్ల చూపిన క్రౌర్యం కారణంగా, యిటువంటివాడికి అడ్డుకట్ట వేయకపోతే లోకానికి వినాశకారుడు అవుతాడు అనుకున్నాడట. ఈ విషయాలు మహాభారతం రాసిన

కవి రాయలేదు. వ్యాఖ్యాతలు చెప్పేవే. గురువు కోరిక వినగానే ఏకలవ్యుడు ఏ మాత్రం దిగులుపడకుండా ప్రసన్నముఖంతో బొటనవేలు కోసి యిచ్చేశాడు. ద్రోణుడు సంతోషించి అతనికి తక్కిన వేళ్లతో బాణాలు ఎలా వేయాలో నేర్పాడు. కానీ యిదివరకంతటి వేగం ఆ బాణాల్లో లేదు. ఇదీ భారతం ఆదిపర్వంలో వున్న ఏకలవ్య ప్రస్తావన.

ఈ బొటనవేలు ఖండింపచేయడం ప్రస్తావన మళ్లీ ద్రోణపర్వంలో వస్తుంది. ఇంద్రుడు యిచ్చిన శక్త్యాయుధాన్ని కర్ణుడు అర్జునుడికై దాచి పెట్టుకున్నాడు కానీ ఒక రాత్రి ఘటోత్కచుడు విజృంభించడంతో తర్వాతి సంగతి తర్వాత చూసుకుందామని దానితో ఘటోత్కచుణ్ని చంపివేశాడు. దాంతో పాండవులంతా శోకంలో మునిగితే కృష్ణుడు మాత్రం హర్షం వ్యక్తం చేశాడు. అదేమిటని అడిగితే – కర్ణుడి శక్త్యాయుధం ఖర్చయిపోయింది, అతన్ని నిర్జించడం యిక సులభం కదా అన్నాడు. అతనే కాదు మీ విజయం కోసం ముందు నుండి హిడింబ, బక, శిశుపాల, జరాసంధాదులను ఎలా అడ్డు తొలగిస్తూ పోయానో గుర్తు చేసుకోండి అని చెపుతూ 'ఏకలవ్యుడికి బొటనవేలు వుండి వుంటే అతన్ని ఎవరూ అడ్డుకోలేకపోయారు. నీ మేలు కోసమే ద్రోణుడు అతని బొటనవేలు ఖండింపచేశాడు' అన్నాడు. పుల్లెల శ్రీరామచంద్రుడుగారు చేసిన అనువాదంలో 'ఏకలవ్యుడు అంగుష్ఠాన్ని కోల్పోయేట్లు నేనే చేశాను' అని వుంది. అప్పటికి కృష్ణుడు రంగంపైకి రాలేదు. భగవద్గీతలో 'అందర్నీ నేనే చంపాను, నువ్వు వొట్టి నిమిత్రమాత్రుడవే' అని చెప్పిన ధోరణిలో వుందీ వాక్యం.

కొన్ని వెర్షన్లలో 'నీ మేలు కోరి మహావీరుడైన ఏకలవ్యుణ్ని నేనే చంపాను' అని కూడా వుంది. సభా పర్వంలో శిశుపాలుడు కృష్ణుడికి అగ్రపూజ చేయడాన్ని నిరసిస్తూ 'గౌరవించాలంటే వీరులు వారు లేరా, వీరు లేరా' అంటూ ఏకలవ్యుడి పేరు కూడా చెప్తాడు. అంటే బొటనవేలు పోయిన తర్వాత కూడా ఏకవీరుడు మహావీరుడై వెలిగాడా అన్న సందేహం వస్తుంది. కృష్ణుడి చేతిలో చనిపోయిన ఏకలవ్యుడు ఎవడు? దీనిపై ఆరుద్రగారు పరిశోధన చేశారు. ఏకలవ్యుడు కృష్ణుడికి, పాండవులకి కూడా బంధువే అంటూ వ్యాసం రాశారు. దానికి ఆధారం హరివంశం అన్నారు. సంస్కృత హరివంశం ప్రకారం కృష్ణుడి తండ్రి యైన వసుదేవుడికి అయిదుగురు అక్కచెల్లెళ్లు. వారిలో పృథ (ఈమెను కుంతిభోజుడనే రాజు పెంచుకుని కుంతి అని పేరు పెట్టాడు) ఒకరు. ఆవిడ పాండవులలో ముగ్గురికి తల్లి. శ్రుతశ్రవ అనే ఆవిడ కొడుకు శిశుపాలుడు. పృథుకీర్తి అనే ఆవిడ కొడుకు దంతవక్త్రుడు. జయవిజయులే యీ శిశుపాల, దంతవక్త్రులుగా పుట్టి కృష్ణుడి చేతిలో మరణించారు. శ్రుతదేవ అనే ఆమె కొడుకి పేరు ఏకలవ్యుడు. ఇతను మహావీరుడు. ఉగ్రసేనుడికి వియ్యంకుడైన (అంటే కంసుడికి మామగారైన) జరాసంధుడి వద్ద సేనాపతిగా పనిచేశాడు. కంసుణ్ని చంపినందుకు కృష్ణబలరాములపై పగబట్టిన జరాసంధుడు మధురపై 18 సార్లు దండెత్తాడు. వాటిలో ఏకలవ్యుడే సైన్యాధిపత్యం వహించాడు. ఇతను బలరాముడితో భీకరయుద్ధం చేశాడు. ఇవన్నీ హరివంశంలో వున్నాయి. ఇతన్నే కృష్ణుడు చంపివేశాడు. ఎప్పుడు అన్నది స్పష్టంగా తెలియదు. ద్రోణపర్వం పాటికే చంపేశాడని మాత్రం భారతంలో ఘటోత్కచ వధ తర్వాత కృష్ణుడు చెప్పినదాని ప్రకారం అనుకోవాలి.

ఆరుద్రగారు హరివంశంలో ఏకలవ్యుడు, భారతంలో వేలు పోగొట్టుకున్న ఏకలవ్యుడు ఒకడే అని తీర్మానించారు. దీనికి ఆయన ఉటంకించిన ఆధారం హరివంశంలోని 1–34 లో 33 వ శ్లోకం. దేవశ్రవ కుమారుడు ఏకలవ్యుడు నిషాదుల చేత పెంచబడ్డాడని దానిలో వుంది. దేవశ్రవుడు వసుదేవుని తమ్ముళ్లల్లో ఒకడు. "శ్రుతదేవ అనే పేరుకు బదులు దేవశ్రవ అనే పేరు ఈ శ్లోకంలో చోటు చేసుకుంది. ఎఱ్ఱన్నగారు ఆంధ్ర హరివంశంలో దాన్ని సవరించి శ్రుతదేవకు కేకయేశ్వరుని వలన ఏకలవ్యుడు పుట్టి నిషాదులలో పెరిగి.. అని రాశారు." అని ఆరుద్రగారు రాశారు. ఆరుద్రగారు ఎఱ్ఱన్న పద్యాన్ని అనుసరించి, పాండవులకు, కృష్ణుడికి రక్తబంధువు, జరాసంధుడి సేనాపతి అయిన ఏకలవ్యుడు, ద్రోణుడు చేతిలో బొటనవేలు పోగొట్టుకున్న ఏకలవ్యుడు ఒకడే అని తేల్చేశారు. ఈ వాదన నమ్మితే చాలా ప్రశ్నలే వస్తాయి. ద్రోణుడు నువ్వు నిషాదుడివి కాబట్టి విద్య నేర్పను అన్నపుడు ఏకలవ్యుడు 'అబ్బే, నేను సుక్షత్రియుణ్నే, నిషాదులు పెంచుతున్నారంతే' అని చెప్పలేదేం? అడవిలో ఏకలవ్యుడు తారసిల్లినపుడు నువ్వెవరివి అని పాండవులు అడిగినపుడు 'మీ బంధువునే' అని ఎందుకు చెప్పలేదు? మహాభారతం ప్రకారం రాజసూయ యాగం చేసినప్పుడు ధర్మరాజుకి అతని రక్తబంధువులందరూ సత్కరించారు. శిశుపాలుడు రథానికి జండా కట్టాడు. పినతల్లి కొడుకులైన విందానువిందులు నానారాజులు తెచ్చిన వివిధ నదీజలాలను అందుకుని పెద్దపెద్ద పాత్రలలో పోశారు. ఈ జాబితాలో ఏకలవ్యుడు కూడా వున్నాడు. అతను పాదరక్షలు తెచ్చి ధర్మరాజు పాదాలముందు పెట్టాడు. తన బొటనవేలు పోవడానికి కారకుడైన పాండవులకు ఏకలవ్యుడు యింత సత్కారం చేస్తాడా? ఇది పొసగడం లేదు.

నిజానికి ఏకలవ్యుడి గురించి ఎంతో చెప్పిన హరివంశంలో చిన్నపుడు ద్రోణుడికి బొటనవేలు అర్పించాడని ఎక్కడా లేదు. కాస్సేపు మనం కృష్ణుడి మేనత్త కొడుకు క్షత్రియ ఏకలవ్యుడు, ద్రోణుడికి బొటనవేలు సమర్పించుకున్న నిషాద ఏకలవ్యుడు వేర్వేరు అనుకుందాం. అప్పుడు సందర్భాలు సరిపోతాయి. క్షత్రియ ఏకలవ్యుడు వీరుడు, బంధువైన జరాసంధుడి సేనాపతి. శిశుపాల, దంతవక్త్రుళ్లలాగే మేనమామ కొడుకైన కృష్ణుడిపై పగబట్టినవాడు. చివరకు కృష్ణుడి చేతిలో చనిపోయినవాడు. రాజసూయంలో పినతల్లి కొడుకు ధర్మరాజుకి గౌరవం యిచ్చాడన్నా, అదే మండపంలో కృష్ణుడికి అగ్రపూజ జరిగేటప్పుడు శిశుపాలుడు ప్రత్యామ్నాయంగా ఏకలవ్యుడి ప్రతిపాదించాడన్నా అన్నీ సరిపోతాయి. అంతేకాదు ద్రోణపర్వంలో ఘటోత్కచ వధ తర్వాత కృష్ణుడు మహా యోధులను ముందే నిర్జింపచేసి మీ మార్గం నిష్కంటకంగా చేశాను అని చెప్పే పేర్లలో ఏకలవ్యుడి పేరు అతుకుతుంది.

ఏకలవ్యుడు పేరు వున్న యిద్దరు వ్యక్తులున్నారని, ఒకతను నిషాదరాజు కొడుని, ద్రోణబాధితుడని, మరొకడు పాండవుల రక్తబంధువని,

జరాసంధ సేనాపతి అని అనుకుంటే అంతా స్పష్టంగా వుంటుంది. అయితే యీ వాదనకు అవరోధంగా నిలిచేవి – సంస్కృత హరివంశంలో దేవశ్రవకు ఏకలవ్యుడు జన్మించి నిషాదులచే పెంచబడ్డాడనే శ్లోకం, తెలుగు హరివంశంలో 'శ్రుతదేవకు ఏకలవ్యుడు పుట్టి నిషాదులచే పెంచబడ్డాడనే పద్యం! ఈ రెండు ప్రక్షిప్తాలు కావచ్చు. పేరు సామ్యం వలన గందరగోళపడిన రాయసకాడెవరో యిద్దరికీ ముడిపెట్టబోయిన ప్రయత్నం కావచ్చు. ఇతనే కాదు, మహాభారతాన్ని తిరగరాసే రాయసకాళ్లు కూడా గందరగోళ పడ్డారు. ఏకలవ్యుణ్ని చంపాను అని ఒక వెర్షన్‌లో వుంటే, మరో వెర్షన్‌లో అతని బొటనవేలును ద్రోణుడి చేత అడిగించాను అని చేర్చారు. ఏది ఏమైనా ఆరుద్రగారు యిద్దరూ ఏకలవ్యులూ ఒకరేనని నమ్మారు. ఆరుద్ర వ్యాసాన్ని ఉటంకిస్తూనే శ్రీ జె.వి.శాస్త్రి (మహాభారత వైజయంతి 7 వ భాగం 336వ పేజీ) 'వీరిద్దరూ ఒకరేనా అనే సందేహం కలుగుతుంది.' అని రాశారు. నా మట్టుకు నాకు ఆరుద్ర గారి వంటి పరిశోధకుడు పొరబడి వుంటారా అనే సందోహంతో బాటు యిద్దరూ వేర్వేరనే నమ్మకం కలిగింది.

అందువలన బొటనవేలు యిచ్చిన ఏకలవ్యుడు నిషాదుడే, తర్వాత అతను విలువిద్యలో ప్రావీణ్యత పోగొట్టుకుని సామాన్యుడిగా జీవించి వుంటాడు. ఈ వ్యాసంలో పొరపాట్లు వుంటే ఎత్తి చూపించగోరతాను. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2016)**

ఆగస్టు 01 **ఎమ్బీయస్ : హిల్లరీ పరువు తీసినది రష్యానా?**

అమెరికా ఎన్నికలలో డెమోక్రాటిక్ అభ్యర్థిగా హిల్లరీ క్లింటన్ వివాదరహితంగా జరగలేదు. రాష్ట్రాల ఎన్నికలలో డెమోక్రాటిక్ పార్టీ నేషనల్ కమిటీ పక్షపాత వైఖరి అవలంబించి, శాండర్స్‌పై దుష్ప్రచారం చేసి, హిల్లరీని ఎలాగైనా నెగ్గించాలని ప్రయత్నించిందని నిరూపించే ఈమెయిల్స్ బయటపడడంతో హిల్లరీ పరువు పోయింది. ఈ కమిటీ నాయకురాలైన డెబ్బీ షుల్ట్జ్ రాజీనామా చేయవలసి వచ్చింది. కమిటీ సభ్యులు అంతర్గతంగాను, రాష్ట్రాలలోని తమ పార్టీ నాయకులకు పంపిన 20 వేల ఈమెయిల్స్‌ను వికీలీక్స్ బయటపెట్టింది. ఇదంతా రష్యా ప్రమేయంతోనే జరిగిందని హిల్లరీ వర్గం ఆరోపిస్తోంది. నిజానిజాలు తేల్చడానికి పార్టీ క్రౌడ్‌స్ట్రయిక్ అనే డిజిటల్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థను వినియోగించింది. డెమోక్రాటిక్ పార్టీ ఓటర్ల సమాచార సేకరణకు, నిధుల సేకరణకు ఉపయోగిస్తున్న కంప్యూటర్లపై 2015 జూన్ నుంచి "కోజీ బేర్" అనే సంస్థ ద్వారా, 2016 ఏప్రిల్ నుంచి "ఫ్యాన్సీ బేర్" అనే సంస్థ ద్వారా హ్యాక్ చేసిందని, దానికి రష్యన్ మిలటరీ యింటెలిజెన్సు సర్వీసు (జిఆర్‌యు)కు సంబంధం వుందని హిల్లరీ అనుయాయులంటున్నారు. ఈ విషయాలను అమెరికా ప్రభుత్వాధికారులు కూడా ధృవీకరిస్తున్నారు. ఈ విషయాలను సహజంగానే రష్యా ఖండించింది. ఈమెయిల్స్ బయటపడితే హిల్లరీ కెందుకు యిబ్బంది?

హిల్లరీ అందరికీ పరిచితురాలే. ప్రజాహక్కుల కోసం, బాలల, మహిళల హక్కుల కోసం పోరాడే న్యాయవాదిగా గుర్తింపు తెచ్చుకుంది. 1975లో పెళ్లయినా స్వతంత్ర భావాలు కల హిల్లరీ రోధామ్ అనే తన యింటిపేరు ఓ పట్టాన మార్చుకోలేదు. ఆమె భర్త బిల్ క్లింటన్ అర్కన్సాస్‌కి గవర్నరు అయినా దరిమిలా 1992లో, 1996లో దేశాధ్యక్షుడైనా తనకంటూ ఒక ప్రత్యేకత ఎప్పుడూ నిలబెట్టుకుంటూనే వచ్చింది. ఆమెను ఎంపిక చేసిన సమావేశంలో ఒబామా దంపతులు, బిల్ క్లింటన్ అందరూ ఆమెను ఆకాశానికి ఎత్తివేశారు. ఆమె నెగ్గితే ప్రప్రథమ మహిళా అధ్యక్షురాలిగా చరిత్ర సృష్టిస్తుంది. హిల్లరీ నెగ్గితే ఒబామాకు మూడో టెర్మ్ యిచ్చినట్లే అని రిపబ్లికన్లు చెప్పేది నిజమే అనుకోవాలి. దాన్ని మెప్పుగా అనుకోవాలో, నిందగా అనుకోవాలో అనేది వారివారి దృక్పథంపై ఆధారపడి వుంటుంది. తన విధానాలను కొనసాగించాలంటే హిల్లరీనే ఎన్నుకోవాలని ఒబామా పిలుపు నిచ్చాడు. హిల్లరీ కూడా అదే చెపుతోంది. ఇప్పటిదాకా జరుగుతున్నదేమిటి? అమెరికాలోని 40% సంపదను పోగేసుకున్న 1% కంపెనీలు, సంస్థలు తమ చిత్తం వచ్చినట్లు లాభాలు ఆర్జిస్తూ వచ్చాయి. పరదేశాలలో శాఖలు పెడుతూ, పరదేశస్తుల చేత పనులు చేయించుకుంటూ స్థానికులకు ఉద్యోగావకాశాలు లేకుండా చేశాయి. ఒబామా ప్రభుత్వం దాన్ని అనుమతిస్తూ వచ్చింది. దీనివలన అమెరికన్ కార్మికుల జీవితం అతలాకుతలం అయిపోయాయని డెమోక్రాటిక్ పార్టీలోనే హిల్లరీకి ప్రత్యర్థి ఐన బెర్నీ శాండర్స్ వాదిస్తూ వచ్చాడు. తను అధికారంలోకి వస్తే యీ 1%ను నియంత్రిస్తానన్నాడు. మధ్యతరగతి ప్రజలు, యువత, కార్మికులు అతన్ని సమర్థించారు. అందువలన అతను ఎన్నిక కావడం 1% వాళ్ల ప్రయోజనాలను దెబ్బ తీస్తుంది. రిపబ్లికన్ పార్టీ తరఫున ట్రంప్ కూడా యిలాటి భాషే మాట్లాడుతున్నాడు. అందువలన యథాతథ పరిస్థితి కొనసాగాలంటే హిల్లరీయే నెగ్గాలని వారి ఆశ. దానికి అనువుగా పావులు కదిపారు. డెమోక్రాటిక్ పార్టీ సభ్యుల్లో కొందరికి కూడా యిలాటి ఆలోచనలే. వాళ్లు వీళ్లతో చేతులు కలిపారు. ప్రైమరీలలో హిల్లరీకు అనుకూలంగా శాండర్స్‌కు వ్యతిరేకంగా వ్యవహరించారు.

మరో రకమైన ఈ మెయిళ్లతో కూడా హిల్లరీ విమర్శల నెదుర్కుంది. ఆమె సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా వున్నపుడు రహస్య (క్లాసిఫైడ్) సమాచారాన్ని తన వ్యక్తిగత ఈ మెయిల్ సర్వర్‌ద్వారా పంపింది. అది దేశద్రోహం కిందే వస్తుందని ట్రంప్ విమర్శించాడు. 'దానిలో ఆమె నిర్లక్ష్యమే కనబడుతోంది తప్ప దురుద్దేశం కనబడటం లేదు' అని ఎఫ్‌బిఐ అంది. ఎఫ్‌బిఐ ప్రభుత్వసంస్థ కాబట్టి, ప్రభుత్వం హిల్లరీకి అనుకూలం కాబట్టి ఆ సర్టిఫికెట్టుకి విలువ ప్రశ్నార్థకమే. విషయం బయటకు రాగానే హిల్లరీ 30 వేల ఈమెయిళ్లను డిలీట్ చేసిందని, ఆ 30 వేల ఈ మెయిళ్లలోని సమాచారమేమిటో చెప్పాల్సింది మీరేనని ట్రంప్ రష్యన్లను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. అలా అడగడం జాతీయభద్రతపై రాజీ పడడమే అని హిల్లరీ క్యాంప్ ట్రంప్‌ను నిందించింది. డెమోక్రాటిక్ పార్టీలో హిల్లరీ మద్దతుదారులకు

కొదవ లేదు. 34 రాష్ట్రాలలో గెలిచింది. జూన్ 7 నాటికే తనతో పోటీ పడిన శాండర్స్‌పై ఆమె ఆధికత్యత సాధించింది. పరాజితుడైన శాండర్స్ చాలా హుందాగా ప్రవర్తించాడు. హిల్లరీకి బలం వుందని తోచగానే ఆమెను బలపరచమని తన అనుచరులకు పిలుపు నిచ్చాడు. నిజానికి వారందరూ హిల్లరీకి పూర్తి వ్యతిరేకంగా వున్నారు. సమావేశస్థలంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వారిని చల్లార్చడానికి శాండర్స్ చాలా కష్టపడ వలసి వచ్చింది. ఇంత చేసినా హిల్లరీ అతన్ని తనతో పాటు ఉపాధ్యక్ష పదవికి ఎంపిక చేయలేదు. పెద్ద వ్యాపారస్తులతో సంబంధాలున్న టిమ్ కేన్‌ను తన రన్నర్‌గా ఎంచుకుంది. వారి దగ్గర్నుంచి ఖరీదైన బహుమతులు తీసుకున్న అతనికి ట్రంప్ 'కరప్ట్ కేన్' అనే పేరు పెట్టాడు.

ట్రాన్స్-పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్ వాణిజ్య ఒప్పందాన్ని ముందుకు తీసుకువెళ్లినది ఒబామాయే. హిల్లరీ దాన్ని గతంలో సమర్థించింది కానీ ప్రస్తుతం వ్యతిరేకిస్తోంది ఎందుకంటే దాన్ని వ్యతిరేకించిన శాండర్స్ చాలామందికి ఆప్తుడయ్యాడు. ఆ ఒప్పందాన్ని ట్రంప్ కూడా వ్యతిరేకిస్తున్నాడు. ఇవన్నీ ఎన్నికల ముందు జరిగే వాదనలే తప్ప రిపబ్లికన్లు నెగ్గినా, డెమోక్రాట్లు నెగ్గినా అమెరికాలో విధానపరమైన మార్పు పెద్దగా వస్తుందని ఆశించలేము. ఎందుకంటే మార్పు తీసుకురావడం అంత సులభం కాదు. ముస్లిములంటే ట్రంప్‌కు పడదు కాబట్టి పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్తాడని మన భారతీయులు ఆశపెట్టుకున్నాం కానీ రిపబ్లికన్ పార్టీ జాతీయ సమావేశంలో ఆమోదించిన తీర్మానం చూడండి - ఇండియా కీలకస్థానంలో వున్న మిత్రుడు! మరి పాకిస్తాన్? 'టెర్రరిజంను, తాలిబన్లను ఎదుర్కోవడంలో మన భాగస్వామి. పాకిస్తాన్ అణ్వాయుధాలను మనం కాపాడుకోవాలి.' అన్నారు. అమెరికన్ మిలటరీ స్థావరాలు పాకిస్తాన్‌లో వున్నాయి. వాటిని రక్షించుకోవడానికైనా పాకిస్తాన్‌తో చెలిమి కొనసాగిస్తారు. హిల్లరీ కూడా పాకిస్తాన్ అభిమానే. ఇలాగే మధ్యప్రాచ్యం వ్యవహారాల్లో అమెరికా తలదూర్చడం మానేస్తుందని అనుకోవడానికి లేదు. ఎందుకంటే వాళ్లకు చౌకగా పెట్రోలు కావాలి. ఆ దేశాల్లో పెట్టుబడులు పెట్టి కార్యకలాపాలు నిర్వహిస్తున్న అమెరికన్ కంపెనీల ప్రయోజనాలను కాపాడాలి.

ఇక ఎన్నికల విషయానికి వస్తే హిల్లరీ ప్రస్తుతం లీడ్‌లో వుంది. డెమోక్రాట్లకు అన్ని జాతులవారు ఓట్లేయడం చాలాకాలంగా సాగుతోంది. శ్వేతజాతీయులు కానివారి పట్ల ట్రంప్‌పై నానాటికీ ద్వేషం ప్రకటించడంతో పోలరైజేషన్ జరిగి యితర జాతులన్నీ హిల్లరీని సమర్థించవచ్చు. హిల్లరీ యథాతథ స్థితి కొనసాగిస్తుందనే నమ్మకంతో 1% వారి నిధులిచ్చి ఆదుకోవచ్చు కూడా. ఇది జరగకూడదని పుతిన్ వ్యూహరచన సాగించాడని అంటున్నారు. విదేశీ వ్యవహారాలు చూసిన హిల్లరీ రష్యాకు, పుతిన్‌కు వ్యతిరేకంగా చాలా చర్యలు చేపట్టింది. వ్యక్తిగతంగా దెబ్బ తీయడానికి తనకు వ్యతిరేకంగా 2011లో రష్యా వీధుల్లో నిరసన ప్రదర్శనలు జరిపించిందని పుతిన్ నమ్మకం. ఆమెకు ప్రత్యర్థిగా నిలబడుతున్న ట్రంప్ రాజకీయభావాలు ఎటువంటివో తెలియదు కాబట్టి అతను ఒక ప్రశ్నార్థకమే కానీ హిల్లరీ మాత్రం శత్రువు. రిపబ్లికన్ పార్టీలో ట్రంప్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేసిన మిట్ రోమ్నీ రష్యాను "మన రాజకీయ శత్రువు నెం. 1" అని వర్ణించాడు. ట్రంప్ మాత్రం రష్యాలో మానవహక్కుల హరణం గురించి వ్యాఖ్యానించడానికి నిరాకరించాడు. అంతేకాదు, తనను హీరోగా వర్ణిస్తూ ఓ సారి ట్వీట్ చేయడం, నాటో ఒప్పందానికి విరుద్ధంగా బహిరంగంగా మాట్లాడడం పుతిన్‌ను మెప్పించి వుంటుంది. ట్రంప్ కాంపెయిన్ సలహాదారుల్లో ఒకడైన కార్టర్ పేజ్ రష్యన్ ప్రభుత్వానికి చెందిన ఎనర్జీ సంస్థ గాజ్‌ప్రోమ్‌కు సలహాదారు. ఉక్రెయిన్ మాజీ ప్రెసిడెంటు, పుతిన్ అనుయాయి అయిన విక్టర్ యానుకోవిచ్‌కు వ్యూహకర్తగా వున్న పాల్ మానాఫోర్ట్ యిప్పుడు ట్రంప్ కాంపెయిన్‌కు చైర్మన్. రిపబ్లికన్ జాతీయ సమావేశానికి ముందు తయారుచేసిన చిత్తుప్రతి తీర్మానంలో 'ఉక్రెయిన్ తిరుగుబాటుదారులకు మారణాయుధాలు సరఫరా చేయాలనే' తీర్మానం వుంది. కానీ ట్రంప్ వర్గీయులు దాన్ని మార్పించి 'ఉక్రెయిన్ తిరుగుబాటుదారులకు తగిన సాయం చేయాలి' అని తీర్మానం చేయించారు. మానాఫోర్ట్-ఉక్రెయిన్-రష్యా సంబంధాలపై లోతుగా పరిశోధించబోయిన డెమోక్రాటిక్ పార్టీ ఆఫీసు ఉద్యోగస్తురాలి ఈ మెయిల్ కూడా హ్యాకింగ్‌కు గురైంది.

తన శత్రువు హిల్లరీపై ట్రంప్ పైచేయి సాధించేట్లు చూడడానికి పుతిన్ యత్నిస్తున్నాడని అనుకోవచ్చు. అందుకే రిపబ్లికన్ సమావేశం పూర్తయి, డెమోక్రాట్ల సమావేశం ప్రారంభం కావడానికి మధ్య నున్న 3 రోజుల వ్యవధిలో హిల్లరీకి యిబ్బంది కలిగించే ఈమెయిళ్లను వికీలీక్స్ ద్వారా విడుదల చేయించాడని "టైమ్" అంటోంది. పుతిన్ రష్యన్ గూఢచారి వ్యవస్థలో గతంలో పనిచేసి వున్నాడు. సమాచార సేకరణకై రెండేసి గూఢచారి సంస్థలను ఒకరికి తెలియకుండా మరొకరిని నియమించే అలవాటు అతనికి వుందట. శత్రువుల పట్ల సైబర్ ఎటాక్ చేసే అలవాటు కూడా వుందట. రష్యా నుంచి విడివడిన ఇస్టోనియా దేశం తమ ప్రాంతంలోని సోవియట్ యుద్ధవీరుల స్మారకచిహ్నం తొలగించినపుడు పుతిన్ దానికి ప్రతీకారంగా ఆ దేశపు కంప్యూటర్ వ్యవస్థపై సైబర్ దాడి చేయించాడట. దాంతో కొన్ని వారాల పాటు సమస్త కార్యకలాపాలు స్తంభించిపోయాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్ దౌత్యాధికారులు వ్యక్తిగత సంభాషణల్లో దొర్లిన అసభ్యపదాల దగ్గర్నుంచి అన్నీ వెలుగులోకి వచ్చేశాయి. క్రిమియా, ఉక్రెయిన్ వ్యవహారాల్లో డిస్-యిన్‌ఫర్మేషన్ కూడా ప్రధాన భూమిక వహిస్తోంది. హిల్లరీ ఎన్నికకై క్లింటన్ ఫౌండేషన్ ద్వారా నిధుల సేకరణ ఎప్పణ్నుంచో చేస్తున్నారు. ఆ ఫౌండేషన్ కంప్యూటర్‌ను జూన్‌లోనే హ్యాక్ చేశారంటాడు - ఆమెకు మద్దతుగా నిలిచిన మీడియా మోతుబరి బ్లూమ్‌బెర్గ్! ఇప్పుడు యీ ఇ-మెయిల్స్ ద్వారా హిల్లరీ ఓటమికి పుతిన్ తన వంతు ప్రయత్నం చేస్తున్నాడని అనుకోవచ్చు. కానీ రష్యాపై అమెరికన్లకు ఆగ్రహం కాబట్టి యీ ప్రయత్నం వలన హిల్లరీపై సానుభూతి పెరిగి ఆమె నెగ్గేందుకు దోహదపడవచ్చు కూడా! **- ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

'రెండు కళ్లు' అనగానే నేత్రవైద్యులు కాకుండా చంద్రబాబు గుర్తుకు వస్తున్నారు జనాలకు. గతంలో 'వెన్నుపోటు' అనగానే ఎముకల వైద్యుడికి బదులు ఆయనే గుర్తుకు వచ్చేవారు. 'ఆంధ్ర, తెలంగాణ రెండూ నాకు రెండు కళ్లు' అన్న దగ్గర్నుంచి యిక దానిపై విమర్శలు, వెక్కిరింతలు అన్నీ పుట్టుకుని వచ్చాయి. చివరకు అది రెండు పడవల ప్రయాణంలా తయారైంది. సినీరచయిత జనార్దన మహర్షి "వెన్నముద్దలు" అని అద్భుతమైన కవితా సంకలనాన్ని వెలువరించారు. దానిలోని ఒక కవితలో ప్రాపంచిక నిత్యసత్యాన్ని అతి చమత్కారంగా చెప్పారు. 'మా అమ్మ, మా ఆవిడ, నా రెండు కళ్లు,.. కళ్లు – ఒకదానినొకటి చూసుకోవు' అని! చంద్రబాబుగారు రెండు కళ్లుగా చెప్పుకున్న ఆంధ్ర, తెలంగాణ యిప్పుడు ఒకదాన్ని ఒకటి చూసుకోవటం లేదు. బద్ధశత్రువుల్లా తయారయ్యాయి. రెండూ కావాలనుకున్నవారికి పెద్ద చిక్కొచ్చిపడింది. ప్రస్తుతం చంద్రబాబుగారికి రాష్ట్రం, కేంద్రం రెండు కళ్లుగా తయారయ్యాయి. ఆ ఉపమానం యిప్పుడాయన ఉపయోగించడం లేదు కానీ అదే తరహాలో వ్యవహరిస్తున్నారు. మరి యీ రెండు కళ్లూ కూడా ఒకదాన్ని మరొకటి చూసుకోవటం లేదు. అరుణ్ జేట్లీ మాటలు విన్నా, యితర నాయకులు పదేపదే కుండబద్దలు కొట్టి హోదాగీదా లేదని చెపుతున్న మాటలు చెవిన పడినా, కేంద్రం ఆంధ్రపై పగబట్టిందని, అందువలన ఆంధ్ర కేంద్రంపై అలిగిందనీ చిన్నపిల్లవాడికి కూడా అర్థమవుతోంది. కానీ తనకు మాత్రం అర్థం కాలేదని బాబు నటించవలసి వస్తోంది. కొడుకు చేసిన తప్పులకు అమ్మ బాధపడుతుంది, కానీ పక్కింటివాళ్లు ఫిర్యాదు చేసినా, భర్త దండించబోయినా పిల్లవాణ్ని వెనకేసుకుని వస్తుంది. ఈ ద్విపాత్రాభినయం చాలా కష్టం. అభినయం చేయాలి, కానీ చేసినట్లు కనపడకూడదు, అదీ అసలు చిక్కు.

బాబును మధ్యరాత్రి నిద్రలో లేపి 'ప్రత్యేక హోదా వలన లాభమా? నష్టమా?' అని అదాటున అడిగితే ఏం జవాబు చెప్తారా అని ఆలోచిస్తూ వుంటాను. ఎందుకంటే మెలకువగా వున్నపుడు యీ ప్రశ్నకు ఆయన రకరకాలుగా సమాధానాలు చెప్తూ వచ్చారు. ఆయన మనసులో ఏముందో తెలియకుండా పోయింది. 'విభజన వలన అన్యాయం జరిగిన ఆంధ్రను ఆదుకునే ఏకైక కల్పవృక్షం ప్రత్యేక హోదా! దాన్ని సంపాదించి పెట్టినది బిజెపియే! కాంగ్రెసు ఆ వూసు లేకుండా లోకసభలో బిల్లు పాస్ చేయించుకున్నా, రాజ్యసభలో మోకాలు అడ్డుపెట్టి బిజెపి యీ వరాన్ని తెచ్చింది. పదేళ్లు అడిగితే దుష్ట కాంగ్రెసు ముష్టి ఐదేళ్లు యిచ్చింది. 'మేం ఎలాగూ అధికారంలోకి వస్తాం, పదేళ్లిస్తాం' అంటోంది బిజెపి. బిజెపితో జట్టుకట్టి పదిహేనేళ్లు సాధిస్తాం. అసలు మేం జట్టు కట్టేది, రాష్ట్రాభివృద్ధి కోసమే. ఆ హోదా రాగానే కొత్త పరిశ్రమలు ఆంధ్రను ముంచెత్తుతాయి. ఓ పక్క హోదా కారణంగా పన్ను రాయితీలు, మరో పక్క బాబు వంటి చురుకైన, సమర్థుడైన ముఖ్యమంత్రి. పెట్టుబడుల కుండపోత ఆపలేం. అప్పుడే తమిళనాడు కుళ్లుకోవడం మొదలుపెట్టింది. తెలంగాణ భయంతో వణికిపోతోంది.' అంటూ టిడిపి ఎన్నికల ప్రచారంలో చెప్పుకుంది. అధికాంశం ప్రజలు నమ్మారు. అధికారాన్ని అప్పగించారు.

అ తర్వాత కొద్ది రోజులకే అందరికీ అర్థమయిపోయింది – ప్రత్యేక హోదా యిచ్చేందుకు మోదీ సుముఖంగా లేరని. బాబుకి యీ సమాచారం ముందే తెలిసి వుంటుంది. బయటపెడితే రాష్ట్రప్రజలు కేంద్రంపై భగ్గుమంటారు. తనకు రెండూ కావాలి. అందువలన చెరో పడవలో తలో కాలు పెట్టి, రెండు పడవల ప్రయాణం మొదలుపెట్టారు. ఓ పడవలో 'హోదా వచ్చేస్తోంది, మనకిస్తే మిగతావాళు ్ల ఏడ్చిపోతారని ఆలోచిస్తున్నారంతే' అనే బ్యానర్ కట్టారు. ఆ పడవ నడిపే భారం సుజనా చౌదరి, కంభంపాటి వగైరాలకు అప్పగించారు. మరో పడవలో 'హోదా వస్తే ఎంత, రాకపోతే ఎంత? దానికి బదులు ప్రత్యేక ప్యాకేజీ తీసుకుంటే లాభం' అనే బ్యానర్ కట్టారు. దీని స్టీరింగు రాష్ట్ర టిడిపి నాయకులకు అప్పగించారు. హోదా వలన ఒనగూడే వాటి కంటె మెరుగైన ప్రయోజనాలతో ప్యాకేజీ ఎలా యిద్దామాని కేంద్ర బిజెపి నాయకులు బుర్ర బద్దలు కొట్టుకుంటున్నారనీ, కేంద్రంలో వున్న టిడిపి నాయకులు వారికి ఆ పనిలో సాయపడుతున్నారనీ చెప్పసాగారు. ప్యాకేజీ మాట ఎలా వున్న హోదా వస్తుందా, రాదా అది చెప్పండి అని జనాలు ఎన్నిసార్లు అడిగితే అన్ని వేర్వేరు సమాధానాలు వచ్చాయి. ఇవ్వకపోతే ఊరుకోమని..., ఇస్తారనే ఆశ వుందనీ...., ఇస్తే మంచిదేననీ.., ఇచ్చినంత మాత్రాన సంజీవని కాదని..., ఇస్తే కాదనమనీ.... – యిలా స్థిరత్వం లేకుండా తమకేం కావాలో మనకు తెలియనీకుండా కాలక్షేపం చేశారు. మన్‌మోహన్ రాజ్యసభలో ప్రకటన చేసి, కాబినెట్ తీర్మానంలో పెట్టినదాన్ని గట్టిగా అడగరేం? అని నిలదీస్తే '...బిల్లులో పెట్టలేదు కాబట్టి' అంటున్నారు. బిల్లులో పెట్టేసి వుంటే ప్రత్యేక హోదా ఎన్నికలలో అంశమే అయ్యేది కాదు, మీకు దానివలన లబ్ధి చేకూరేదే కాదు. చట్టరూపం ధరించకుండా అస్పష్టంగా వున్నదాన్ని నయానో, భయాన్నో అడిగి తేగల సమర్థులు కదాని మీకు ఓట్లు వేశారు. కాంగ్రెస్సే పెట్టి వుంటే.. అని మీరు యివాళ చెపితే ఆయనే వుంటే... సామెత గుర్తుకు వస్తుంది. పెట్టక కాంగ్రెసు ఎన్నికలలో చావుదెబ్బ తిన్న విషయమైనా మీరు గుర్తు పెట్టుకోవాలి కదా.

హోదా గురించి ప్రతిపక్షాలు అడిగినప్పుడల్లా బాబు ప్యాకేజీ గురించి మాట్లాడతారు. తెనాలి రామకృష్ణుడి ముందు కాళికా దేవి రెండు ముంతలు పెట్టి 'పాలా పెరుగా ఏదో ఒకటే తీసుకో' అందిట. అలా మోదీ బాబు ముందు ముంతలేవైనా పెట్టారా? వాటిలో వున్నవి పాలూ, పెరుగేనా? మరేవైనానా? అలాటిది జరిగితే ఆ ముక్క జనాలకు చెప్పేస్తే దేనిలో ఏముందో ఓ సారి చూసుకుని ఎంచుకుంటారు. అదే అడగవచ్చు. ఆ ప్యాకేజీ అనే బ్రహ్మపదార్థాన్ని ఎప్పటికీ విప్పిచెప్పరు. చేతికివ్వరు. రెండేళ్లు దాటింది, యిప్పటికీ యివ్వరేం? అంటే హోదా అడిగాంగా, అందుకని ఆలస్యమవుతోంది అంటారు. పోనీ ఆ హోదాయైనా దయచేయించండి అంటే

'హెూదా అనుభవించిన రాష్ట్రాలు ఏం బావుకున్నాయి?' అని బాబు గద్దిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లో మన తెలుగువాళ్లే బోల్డు పవర్ ప్లాంట్లు పెట్టారు. హెూదా వలన రాయితీలు వస్తాయని కాకపోతే అంత దూరం వెళ్లేవారా? హెూదా వలన నష్టమే తప్ప లాభమే లేదని తెలిసినపుడు బిజెపి, టిడిపి అంధ్ర రాష్ట్రానికి అది కావాలని ఎందుకు పట్టుబట్టినట్లు? పదేళ్లు, పదిహేనేళ్లు పాటు వుండేలా సాధిస్తామని ప్రజల కెందుకు చెప్పినట్లు? అనాథలుగా మిగిలిన ఆంధ్రులను మరింత బికారులు చేద్దామనా? హెూదా పొందిన రాష్ట్రాలు అభివృద్ధి చెందలేదని తాను చెప్తున్నది అబద్ధమని బాబుకి తెలియకుండా వుండదు. గణాంకాలే చెప్తాయి. అందని ద్రాక్ష పుల్లన అన్నట్లు, కేంద్రం హెూదా యివ్వలేదు కాబట్టి యిచ్చినా వేస్టు అంటున్నారు. ఇచ్చి వుంటే 'నేనే తెచ్చి ఆంధ్రను బతికించాను, మరెవరి వలన అయ్యేది కాదు' అని చెప్పుకునేవారు.

ఆంధ్ర నుంచి కాంగ్రెసు ఎంపీలు పుష్కలంగా వున్నంత కాలం వీళ్లంతా దండగ, కేంద్రం నుంచి ఏమీ తేలేకపోయారు, దద్దమ్మలు దొరికారు మనకు అంటూండేవారు బాబు. ఇప్పుడు వారి స్థానంలో టిడిపి వారు వచ్చారు. వీళ్లూ ఏమీ తేవటం లేదు. వీరి నేమంటారో మరి! నిధుల విషయంలో కేంద్రం నాటకాలు ఆడుతోంది. 14 వ ఫైనాన్స్ కమిషన్ వచ్చింది కాబట్టి హెూదా లేదంటుంది, యిప్పటికే మీకు చాలా యిచ్చామంటుంది, శంకుస్థాపన రాళ్లు వేసిన ప్రాజెక్టులను చూపించి లక్షలు లక్షలు కుమ్మరించామంటుంది. బజెట్‌లో కేటాయింపులు లేవు, నిధులు పంపలేదు, పంపలేదేం అంటే మీకు మేం వేసిన క్వెరీలకు సమాధానాలు యివ్వలేదంటుంది, డిపిఆర్‌లు లేవంటుంది, నిధులు మళ్లించారంటుంది. వాళ్లు యిచ్చిన నిధులేవైనా వుంటే అవి తక్కిన రాష్ట్రాలతో సమానంగా న్యాయప్రకారం రావలసినవే తప్ప, దెబ్బ తిన్న రాష్ట్రం కదాని విడిగా చేతిలో పెట్టినదేమీ లేదు. ఈ మాటను బాబు ఓ సారి చెప్తారు, మరోసారి కేంద్రం ఆదుకుంటోంది అంటారు. అయినా నాకు తృప్తి లేదు అంటూ ముక్తాయింపు యిస్తారు. కేంద్రం యిచ్చిన నిధులపై శ్వేతపత్రం రిలీజు చేయండని ప్రతిపక్షాలు అడిగితే కిమ్మనరు. కేంద్రాన్ని వెనకేసుకుని రావడం ఎంతవరకూ వచ్చిందంటే అమరావతి శంకుస్థాపన సందర్భంగా మోదీ వస్తే సభాముఖంగా ఆయన్ని అడగలేనంత మొహమాటం! అదేమంటే మర్చిపోయా అన్నారు. రాష్ట్రం కోసం అహర్నిశలు కలవరిస్తున్నా, పలవరిస్తున్నా అనే వ్యక్తి మర్చిపోయేటంత చిన్న అంశమా అది? ఒకవేళ ఒరిజినల్ స్పీచ్‌లో వుండి వుంటే ఏ పిఏ నో గుర్తు చేసి వుండేవారు.

బాబు బిజెపిని ఏమీ అనరు, అననివ్వరు. ఒకవేళ ఏదైనా అనాల్సి వస్తే, కాంగ్రెసును పది అని, చివర్లో బిజెపిని ఒకటి మెత్తగా అంటారు. ఆంధ్రప్రజలు విభజన కోరలేదని, అయినా కాంగ్రెసు చీల్చిందని యిప్పుడు మాటిమాటికి అంటున్నారు. విభజన కోరుతున్నారని ఎర్రన్నాయుడు కమిటీ రిపోర్టు యిచ్చిందని, దాని ఆధారంగానే విభజన కోరుతూ లేఖ యిచ్చామనీ బాబు మర్చిపోయారా? మేం లేఖ యిచ్చాం, మీరు యివ్వలేదు అంటూ కాంగ్రెసును తోమేసిన విషయం మర్చిపోయారా? ఇది ద్రవ్య బిల్లు, హెూదా యివ్వడంలో కష్టాలున్నాయి అని యిప్పుడంటున్న అరుణ్ జేట్లీని ఆ ముక్క అప్పుడు తెలియదా అని బాబు అడిగారా? మాట్లాడితే ఢిల్లీ 50 సార్లు వెళ్లాను, 70 సార్లు వెళ్లాను అంటారు. వెళ్లమని ఎవడడిగాడు? జయలలిత ఎన్నిసార్లు వెళ్లిందని తమిళనాడుకి ప్రాజెక్టులు వస్తూంటాయి?

కేంద్రంతో పోరాడితే నష్టం అంటున్నారు బాబు. తెలుగుదేశం పార్టీలో వుంటూ ఆ మాట అనడానికి తల దించుకోవాలి. ఆ పార్టీ పుట్టినదే రాష్ట్రప్రభుత్వాల హక్కులు కాపాడేందుకు. కేంద్రం మిథ్య అని హుంకరించిన ఎన్టీయార్ వారసులా వీరు? విభజన బిల్లులో వున్నవాటిని కూడా సాధించుకోలేక పోతున్నారే! కేంద్రంలో కాంగ్రెసు వుండి వుంటే బాబు యిలాగే మాట్లాడేవారా? తిట్టితిట్టి పోసేవారు కారా? మిత్రపక్షం కాబట్టి పోట్లాట ఎందుని చూస్తున్నాం అంటున్నారు. ఈ మిత్రపక్షం, శత్రుపక్షం రాజకీయ పరమైన సమీకరణాలు. ఆంధ్రప్రజలకు ఏ పార్టీతో ప్రమేయం లేదు. వారికి రావలసిన న్యాయమైన వాటా కేంద్రం నుంచి రావాలి. దట్సాల్. హుదూద్ తుపాను వలన జరిగిన నష్టమెంత? దానికి కేంద్రం నుంచి వచ్చిన పరిహారమెంత? తక్కువ వస్తే ఎందుకు వచ్చింది? రాలేదేమని అడగవలసిన పని ప్రజాప్రతినిధులది, ముఖ్యంగా సిఎంది, ఎంపీలది కాదా? టిడిపి-బిజెపి చెట్టాపట్టాలు వేసుకోవచ్చు, జుట్టూజుట్టూ పట్టుకోవచ్చు, అది వేరే విషయం. ఆంధ్ర ప్రజల తరఫున ప్రభుత్వంలో వున్న టిడిపి మిత్రుణ్ణయినా, శత్రువునైనా నిలదీసి అడగాల్సిందే. లేకపోతే మిత్రధర్మం మాట ఎలా వున్నా ప్రజాధర్మం తప్పినట్లే! ఈ మధ్య నాలుగైదు రోజులుగా చేసిన అడావుడి కూడా హెూదా అంశాన్ని ప్రతిపక్షాలు సెంటిమెంటుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నాయన్న భయం చేతనే. బంద్ ఫలితం చూశాక మరింత కంగారు పుట్టింది. టిడిపి ఎంపీలు పగటివేషాలతో సహా దిగిపోయారు. గొంగళిని యథాస్థానానికి తెచ్చేశారు.

బిజెపితో ఈ మొహమాటాలెందుకు అని ప్రతిపక్షాలు అడుగుతున్నాయి. దానికి వాళ్లకు తోచిన ఊహాగానాలను జత చేస్తున్నాయి. అవేమీ కాదంటారీయన. కాకపోవచ్చు, మరి మౌనానికి అసలు కారణం ఏమిటో చెప్పాలి. కూటమి నుంచి బయటకు వచ్చేమని వాళ్లిచ్చే సలహా వినక్కరలేదు కానీ అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్లి వాళ్ల చేతే గట్టిగా అడిగిస్తే పోయేది కదా! అలా చేయరు సరికదా, ప్రతిపక్షాలు యిక్కడ గొడవ చేస్తే లాభమేముంది, ఢిల్లీ వెళ్లి చేయాలి కానీ అంటున్నారు. అంటే ఢిల్లీలో నిరసన ఊరేగింపు చేస్తే ఫలితం వుంటుందన్నమాట. అలా అయితే ఆంధ్ర రాజకీయపక్షాలన్నిటితో వూరేగింపు ఏర్పాటు చేసి ఆ వూరేగింపుకు తమరే ముందువరసలో నిలబడవచ్చు కదా? అదెందుకు చేయరు? కేంద్రాన్ని యిబ్బంది పెట్టనివ్వకూడదని అంత తాపత్రయం దేనికి? ఆంధ్ర, తెలంగాణ రెండు కళ్లు అనుకుంటూ ఓ కన్ను పోగొట్టుకున్నారు. ఇప్పుడు దాని స్థానంలో కేంద్రాన్ని తెచ్చిపెట్టుకుని ఆంధ్ర కన్నుని నిర్లక్ష్యం చేస్తున్నారు. కేంద్రం పట్ల మెతక వైఖరి అవలంబించే ముఖ్యమంత్రిని ఏ రాష్ట్ర ప్రజలూ మెచ్చరు. ఇదే ధోరణి కొనసాగితే ఆంధ్ర కన్ను పోయి, కేంద్రం కన్ను ఒక్కటే మిగలవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఎమ్బీయస్‌ఃఖఖ1ః మంత్రిగా మొదటి రోజు

సరిగ్గా నాలుగేళ్ల క్రితం యీ "ఎస్ మినిస్టర్" సీరీస్ మొదలుపెట్టి రెండు భాగాలు రాసి ఆపేశాను. ఆ విషయం చాలామందికి గుర్తుండకపోవచ్చు కాబట్టి ఆ రెండు భాగాలు మళ్లీ యిస్తూ, తక్కిన భాగాలు కూడా రాస్తున్నాను. ప్రతీ బుధవారం ఒక్కో కొత్త కథ మొదలుపెడతాను. అది రెండు, మూడు భాగాలు నడుస్తుంది. అందువలన 1/1, 1/2... 2/1, 2/2.. అలా వుంటుంది నంబరింగ్. గమనించగోర్తాను.

2011 డిసెంబరులో బయటకు వచ్చిన శ్రీలక్ష్మి-సబితా ఇంద్రారెడ్డి వ్యవహారం ధర్మమాని ఐయేయస్ ఆఫీసర్లకు, మంత్రులకు మధ్య వుండే సమీకరణాలు మళ్లీ వెలుగులోకి వచ్చాయి. ఎవరు ఎవర్ని ఆడిస్తారు? అనేది బయటవాళ్లకు అంతుపట్టని విషయం. ఈ అంశంపై వచ్చిన అతి గొప్ప రచన 'ఎస్ మినిస్టర్'. బిబిసి సీరియల్‌గా టీవీలో చాలాసార్లు చూసినవారు, పుస్తకరూపంలో చదివినవారు చాలామంది వున్నారు. కానీ దాని గురించి పూర్తిగా తెలియనివారు, తెలిసినా భాషాసమస్య వలన పూర్తిగా ఆస్వాదించలేనివారు వుండి వుంటారనే అభిప్రాయంతో "ఎస్ మినిస్టర్" కథల్ని పరిచయం చేస్తాను. ఇవి అనువాదాలు కావు. కథాంశాన్ని చెప్పి దానిలోని వ్యంగ్యాన్ని, సాంకేతిక అంశాలను వివరిస్తాను. ఓ నాలుగు కథలు చెప్పి రెస్పాన్సు బావుందంటే తక్కినవీ చెప్తాను.

ఈ కథలను బ్రిటన్‌లో జరిగినట్టుగా రచించారు. జిమ్ అనే ఓ రాజకీయవేత్త మొట్టమొదటిసారి మంత్రి కావడంతో కథలు ప్రారంభమవుతాయి. అతనికీ, అతని శాఖకు సంబంధించిన సీనియర్ అధికారి హంఫ్రీకి మధ్య జరిగే పిల్లీ-ఎలుకా ఆటలను వ్యంగ్యవైభవంతో మన ముందుకు తెచ్చారు. మంత్రి ఒక డైరీని మేన్‌టేన్ చేశాడనీ, దాన్ని, బ్రిటిష్ ప్రభుత్వం ఆర్కయివ్స్‌తో సరిచూచుకుని ఇద్దరు సంపాదకులు 2019లో పుస్తకరూపంలో తెచ్చారని బిల్డప్ యిస్తారు. నిజానికి 40 ఏళ్ల క్రితమే తెచ్చారు. పుస్తకమంతా జిమ్ ఆత్మకథలా సాగుతుంది. మధ్యలో సంపాదకులు తమ వ్యాఖ్యలు జోడిస్తూంటారు. ఏది ఏమైనా ఈ పుస్తకం, ఈ సీరియల్ ఎందరో రాజకీయనాయకుల (ఇందిరా గాంధీ వారిలో ఒకరు), అధికారుల ప్రశంసలు కూడా అందుకున్నాయి. ఈ వ్యాసాలు చదివి వూరుకోకండి. ఇంగ్లీషు భాషను ప్రేమించేవారయితే పుస్తకం తప్పకుండా చదవండి.

మొదట జిమ్ గురించి - అతను పాలిటెక్నిక్ కాలేజీలో లెక్చరరుగా పనిచేసి, తర్వాత 'రిఫార్మ్' అనే పత్రికకు ఎడిటరుగా వుండేవాడు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వెళ్లి బర్మింగ్‌హామ్ ఈస్ట్ పార్లమెంటరీ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యాడు. ప్రతిపక్షంలో వుండగా వ్యవసాయశాఖకు షాడో మినిస్టర్‌గా వుండేవాడు. (ప్రతిపక్షంలో ఒక్కొక్క సభ్యుడు అధికారపక్షంలో ఒక్కొక్క శాఖపై దృష్టి కేంద్రీకరించి దానిలోని తప్పొప్పులని ఎండగడుతూ వుంటారు. ఆ శాఖ చూసే మంత్రిని వీళ్లు నీడలా, పీడలా వెంటాడతారు. మంత్రి కంటె వీళ్లకే ఎక్కువ తెలుస్తుంది. ఎందుకంటే మంత్రి తరచుగా మారిపోవచ్చు. కానీ వీళ్ల ఫోకస్ ఎప్పుడూ స్థిరంగానే వుంటుంది కదా). కొత్తగా జరిగిన ఎన్నికలలో జిమ్, అతని పార్టీ నెగ్గాయి. అక్టోబరు 23న జిమ్ పార్టీ నాయకుడు ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాడు. జిమ్‌కు మంత్రిపదవి దక్కవచ్చని మీడియాలో ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఆ వూహలు నిజం కావాలని జిమ్ కోరుకుంటున్నాడు.

23 వ తారీకు రోజంతా జిమ్ ఫోన్ పక్కనే చతికిలపడ్డాడు. మంత్రి కాగోరే ఏ వ్యక్తియైనా ఆ దశలో టెలిఫోన్‌కి 20 అడుగుల దూరం దాటి వెళ్లకపోవడం సహజం కదా! కానీ జిమ్ భార్య ఏనీ అర్థం చేసుకోదు. అంతగా నిన్ను కాబినెట్‌లో చేర్చుకోవాలనుకుంటే మళ్లీ ఫోన్ చేయడా ఏం? వెళ్లి నాకు సిగరెట్లు పట్టుకు రా అంది. జిమ్ ఆదుర్దా జిమ్‌ది. ఎందుకంటే పార్టీ నాయకుడిగా గతంలో ఎన్నిక జరిగినప్పుడు జిమ్ యింకో అతన్ని సమర్థించాడు. అతని కోసం విస్తృతంగా ప్రచారం చేశాడు. తీరా చూస్తే యీయన నెగ్గాడు, ఇప్పుడు ప్రధాని కూడా అయ్యాడు.

చివరకు 24 న ఉదయం 9 గంటలకు రెండురోజులుగా 'కల'వరించి, పలవరించిన ఫోన్ కాల్ వచ్చింది. జిమ్ తన రాజకీయ సలహాదారు ఫ్రాంక్‌తో బాటు లండన్ రైలెక్కాడు. ప్రధాని నివాసానికి వెళితే ఆయన "ఎడ్మినిస్ట్రేటివ్ ఎఫయిర్స్ శాఖను తీసుకో" అన్నాడు. ఇది కాబినెట్ ర్యాంకు. ప్రాధాన్యతా క్రమంలో ఎనిమిదోదో, తొమ్మిదోదో. జిమ్ హితైషులు అతన్ని హెచ్చరించారు. "నిన్ను రాజకీయంగా సమాధి చేయడానికే ప్రధాని ఆ శాఖ యిచ్చాడు. అన్ని మంత్రిత్వ శాఖలనూ సమన్వయం చేసే ఆ శాఖ నిర్వహణ చాలా కష్టం. ఆయన నిన్ను ఓవర్‌ప్రమోట్ చేశాడు - ప్రేమతో కాదు, పగతో!" అని.

వ్యవసాయశాఖకు ఏడేళ్లపాటు షాడో మినిస్టర్‌గా వున్నాను కాబట్టి, దానిలో సర్వం తెలుసుకాబట్టి ఆ శాఖే యిస్తారని జిమ్ అనుకున్నాడు. కానీ నిజానికి జరిగిందేమిటంటే "జిమ్ యీ శాఖ గురించి చాలా సమాచారం సేకరించాడు కాబట్టి అతను మంత్రి కాకుండా చూస్తే మంచిది" అని వ్యవసాయశాఖ పెర్మనెంట్ సెక్రటరీ తన సీనియర్ అయిన కాబినెట్ సెక్రటరీకి రాయడం, కాబినెట్ సెక్రటరీ కొత్త ప్రధానికి 'జిమ్ ఆ శాఖతో చాలా యిన్వాల్వ్ అయిపోయాడు కాబట్టి ఇప్పుడు మంత్రి అయితే పాత మూసలో, అదే నలిగినబాటలో వెళ్లి కొత్తతరహాగా ఆలోచించలేకపోయే ప్రమాదం వుంద'ని హెచ్చరించడం జరిగాయి. దాని ఫలితమే ఈ శాఖ!

జిమ్‌ను ఆ మంత్రిత్వశాఖ వున్న బిల్డింగుకి తీసుకెళ్లగానే అక్కడ బెర్నార్డ్ అనే అతను కలిశాడు. అతను ఎవరు మంత్రిగా వుంటే వాళ్లకి ప్రైవేట్ సెక్రటరీ. అంటే యిప్పుడు జిమ్‌కు ప్రైవేట్ సెక్రటరీ అన్నమాట. అతనికో అసిస్టెంటు. జిమ్ వెంట వచ్చిన అతని రాజకీయసలహాదారు ఫ్రాంక్‌ను యిక్కణ్నుంచే అధికారులు తప్పించసాగారు. బెర్నార్డ్ ఎదురై జిమ్‌ను కారిడార్లోంచి అతని ఆఫీసుకి

తీసుకుని వెళుతూండగా అతని అసిస్టెంటు ఫ్రాంక్‌ను ఏదో పని వున్నట్టు పక్కగదిలోకి తీసుకెళ్లి అక్కడ కూర్చోబెట్టేశారు. అధికారులు ఎందుకైనా మంచిదని అందరు రాజకీయనాయకుల గురించి రకరకాల సమాచారాలు సేకరించి వుంచుతారు. జిమ్‌ను తమ చేతిలోకి తెచ్చుకోవాలంటే ఫ్రాంక్‌ను తప్పించాలని తెలుసు కాబట్టే యిలా ప్లాను చేశారు.

తన శాఖలోని అధికారులతో స్నేహం నెరపి, వారినుండి పని రాబట్టాలని జిమ్ ప్లాను. అందుకని బెర్నార్డ్ తనను మినిస్టర్ అని పిలుస్తూంటే, ఆ ఫార్మాలిటీ వద్దు, నన్ను పేరు పెట్టి పిలు అన్నాడు. కానీ అధికారగణం యిటువంటి ఉచ్చుల్లో పడరు. ఎవరు ఎంతకాలం అధికారంలో వుంటారో తెలియనప్పుడు మంత్రితో ఆత్మీయంగా మెలగడం రిస్కు. రేపు యీయన దిగిపోయి యీయనంటే పడనివాడు యీ పదవిలోకి వస్తే..? వచ్చి నువ్వు పాతవాడి స్నేహితుడివి అంటూ తొక్కేస్తే..? అందుకని వీళ్లకు దూరం మేన్‌టేన్ చేస్తేనే మంచిదని బ్యూరాక్రసీ అభిప్రాయం. అందుకని జిమ్ ఎంత చెప్పినా బెర్నార్డ్ మినిస్టర్ అనే పిలిచాడు. తనను మాత్రం బెర్నార్డ్ అని పిలవమన్నాడు.

ఇప్పుడు హంఫ్రీ దిగాడు. అతను ఆ శాఖకు పెర్మనెంట్ సెక్రటరీ. మొత్తం ఆ శాఖకు అధిపతి. ఉపద్రవమైన తెలివితేటలు కలవాడు. టక్కరి. మాటలతో ఆడుకుంటాడు. ఈ ఆఫీసుకి స్వాగతం అన్నాడు జిమ్‌తో.

''మీ ఇద్దరూ యింతకుముందు కలిశారనుకుంటా'' అన్నాడు బెర్నార్డ్.

''అవును కితం ఏడాది యీయన పబ్లిక్ ఎక్కవుంట్స్ కమిటీ ఎస్టిమేట్స్ మీద ప్రశ్నలడిగి నన్ను వేపుకుని తినేశారు. ఏ ప్రశ్నలైతే అడగకూడదని ఆశించానో సరిగ్గా అవే అడిగాడాయన.'' అన్నాడు హంఫ్రీ.

జిమ్ ముగ్ధుడైపోయాడు–తన విషయం యింత బాగా గుర్తుపెట్టుకున్నందుకు. ఓ రకమైన సంజాయిషీ చెపుతున్నట్టు ''ఇబ్బందికరమైన ప్రశ్నలడగడమేగా ప్రతిపక్షం అంటే ..!'' అన్నాడు.

హంఫ్రీ అతనితో ఏకీభవిస్తూ, ''....ఆ ప్రశ్నలకు జవాబు చెప్పకపోవడమేగా ప్రభుత్వం పని..'' అని చేర్చాడు.

''అదేమిటి, మీరు నా ప్రశ్నలన్నిటికీ జవాబులు చెప్పారుగా..'' అని ఆశ్చర్యపడ్డాడు జిమ్.

''వాటిని మీరు జవాబులని అనుకున్నందుకు చాలా సంతోషం'' అన్నాడు హంఫ్రీ గుంభనగా. ఇక్కడే వుంటుంది ప్రభుత్వం యిచ్చే సమాధానాల్లో కిటుకు. ఫలానా స్కీము లోపభూయిష్టముగా వున్నది కావున దానిని సంస్కరించే వుద్దేశము ప్రభుత్వమునకు వున్నదా? అని అడిగితే – ' పరిశీలనలో ఉన్నది' అని సమాధానం యిస్తారు మంత్రి. పరిశీలనలో వున్నది స్కీమా? సంస్కరణ పథకమా? అన్నది తేలదు. అనుబంధప్రశ్న అడిగినా దాని జవాబు యింకా అస్పష్టంగా వుంటుంది.

''ఇంతకీ యీ డిపార్టుమెంటులో ఎవరెవరున్నారు?'' అని అడిగాడు జిమ్.

''నేను పర్మనెంటు సెక్రటరీని. బెర్నార్డ్ మీ ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీ. నాక్కూడో ఓ ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీ వున్నాడు. అతను కాకుండా నా కింద పదిమంది డిప్యూటీ సెక్రటరీలు, 87 మంది అండర్ సెక్రటరీలు, 219 మంది అసిస్టెంటు సెక్రటరీలు వుంటారు. వీళ్లు కాక.. '' అంటూ పెద్ద లిస్టు చదివాడు.

జిమ్‌కు మతిపోయింది. ఇదంతా మార్చిపారేయాలనుకున్నాడు. అదే వాళ్లకు చెప్పాడు – రాజకీయ ఉపన్యాసం యిచ్చే ధోరణిలో..''ఈ పాతచింతకాయ పచ్చడి బ్యూరాక్రసీ తన బూజు పట్టిన తమ పద్ధతులకు స్వస్తి చెప్పాలి, కిటికీలు తెరవాలి, కొత్తగాలి రానివ్వాలి, కొత్త చీపురుతో పాతనంతా తుడిచి పారేయాలి..'' అంటూ మొదలుపెట్టి ''పని చేయకుండా యితరులకు అదనపు పని కల్పించేవారిని తీసిపారేయాలి'' అని ముగించాడు.

''..అంటే ఉద్యోగస్తుల సీట్లను అటూ యిటూ మార్చాలంటారు..'' అన్నాడు హంఫ్రీ. బ్యూరాక్రసీ యిలాగే వ్యవహరిస్తుంది. వాళు వ్యవస్థను మార్చడానికి ససేమిరా ఒప్పుకోరు. రాజకీయనాయకులు ఉత్సాహంలో ఏవేవో కొత్తమార్పులు తెచ్చేద్దామనుకుంటారు. అలా మార్చేస్తే అంతా అస్తవ్యస్తమయిపోతుందని బ్యూరాక్రసీ ప్రగాఢంగా నమ్మి అడ్డు తగులుతూంటుంది. అయితే అడ్డు తగిలినట్టు కనబడకుండా ''మీరు చెప్పినట్టే...'' అంటూనే తమ ఉద్దేశాలను వాళ్ల నోటి ద్వారా అనిపిస్తారు. ''మీరు అనుకుంటున్న మార్పులు అమలు చేస్తే మీకే దెబ్బ చూసుకోండి..'' అని నర్మగర్భంగా హెచ్చరిస్తారు.

ఇప్పుడు అదే జరిగింది. ఉద్యోగాలు పీకేస్తే ఉద్యోగివర్గమంతా తమకు ఎదురుతిరుగుతుందని గ్రహించాడు జిమ్. 'ఏ శాఖలోనైనా స్టాఫ్ అదనంగా వుంటే తగ్గిద్దామంటున్నాను కానీ, ఉద్యోగులను పనిలోంచి పీకేద్దామనటం లేదు' అని తనను తాను సర్దిచెప్పుకున్నాడు. ఉద్యోగాలు పీకేయకుండా ఎలా తగ్గిస్తారు? అయినా తమ శాఖలో స్టాఫ్ అదనంగా వుంటుందని ఏ డిపార్టుమెంటయినా ఒప్పుకుంటుందా? అందుకని అసందర్భంగా ''..కొత్త మార్పులంటే మనం మరింత పారదర్శకంగా వుండాలన్నమాట. మేము ప్రజలను విశ్వాసంలోకి తీసుకుంటామని, అన్నీ ప్రజలకు చెప్పే చేస్తామని ఎన్నికలలో వాగ్దానాలు చేశాం. అవి నిజంగా అమలు చేద్దామనుకుంటున్నాం.'' అని అన్నాడు.

హంఫ్రీ, బెర్నార్డ్ వెంటనే ''తప్పకుండా'' అన్నారు. అడ్డుచెపుతారేమో వాదిద్దామని అనుకుంటున్న జిమ్ తెల్లబోయేట్టు ! అంతేకాదు, జిమ్ యీ అంశంపై పార్లమెంటులో యిచ్చిన ఉపన్యాసాలను హంఫ్రీ ప్రస్తావించి, వాటిని పేపరువాళ్లు ఎలా కవర్ చేశారో కూడా చెప్పి ''మీరు చెప్పిన లేవనెత్తిన అంశాలపై మేము కొంత వర్క్ చేసి ఒక డ్రాఫ్ట్ తయారుచేశాం. పేరు పెట్టలేదు. మీరు 'పాలనలో పారదర్శకత' అని పేరు పెట్టవచ్చు.'' అంటూ అతని ముందు ఓ కాగితాలబొత్తి పెట్టాడు.

జిమ్ ఆనందాశ్చర్యాలతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. 'నా ఉపన్యాసాలకు వీళ్లు యింత ప్రాధాన్యత యిచ్చి, యింత త్వరగా తయారుచేసి చేతిలో పెడుతున్నారే' అని పొంగిపోతూ "ఎవరు చేశారిదంతా?" అని అడిగాడు.

"..పాతచింతకాయపచ్చడి బ్యూరాక్రసీయే" అన్నాడు హంఫ్రీ జిమ్ మాటలను గుర్తు చేస్తూ.

ఈ ఎత్తిపొడుపుకి ఎలా స్పందించాలో జిమ్‌కు తోచక, వేదాంతిలా నవ్వి "నిజం చెప్పాలంటే మీరంతా సంస్కరణలకు అడ్డుపడతారేమో అనుకున్నా.." అన్నాడు నిజాయితీగా.

"బ్యూరాక్రసీ గురించి ప్రజలకు వింత వింత అభిప్రాయాలు లేకపోలేదు" అన్నాడు హంఫ్రీ విషాదాన్ని అభినయిస్తూ. "మేం యిక్కడ వున్నది విధానాలను రూపొందించడంలో, వాటిని అమలు చేయడంలో మీకు సహాయపడడానికే!"

ఇలా చెప్పాక హంఫ్రీ "వివిధ మంత్రిత్వశాఖలు పంపే ప్రతిపాదనల ఆమోదంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించే ప్రతిపాదనలు" అంటూ ఆరు పెట్టెలను చూపించాడు. "ఇవాళ శనివారం కదా. మీరు సోమవారం ఉదయాని కల్లా యివన్నీ చదివి మీ అభిప్రాయం చెప్తే మనం ఆలస్యం లేకుండా మీ సంస్కరణలు ఆచరణలో పెట్టవచ్చు" అన్నాడు. అన్ని పెట్టెలను చూడగానే జిమ్ గుండె పగిలింది.

జిమ్ పాపం చచ్చినట్టు వీకెండంతా ఖర్చుపెట్టి అవన్నీ చదువుకుని సోమవారం నాడు రాగానే హంఫ్రీ "ఇవాళ యింకో మూడు పెట్టెలున్నాయి" అన్నాడు. "అమ్మో యిన్నా?" అంటూ జిమ్ మొరాయించబోయాడు. వెంటనే హంఫ్రీ "అందుకే మేమే అన్నీ చూసేసి, మీకు ముఖ్యమైన కాగితాలు మాత్రం చూపిస్తాం" అని ఆఫర్ చేశాడు. జిమ్‌కు భయం వేసింది, దీనిలో ఏం గోల్‌మాల్ వుందోనని. "అలా వద్దు, నేను అన్నీ చూస్తాను.." అని మొండికేశాడు. నీ పని యిలాగుందా అనుకుని హంఫ్రీ "నేనింకా మూడని తప్పు చెప్పాను, ఐదున్నాయి" అంటూ యింకో రెండు యిచ్చి తెల్లవారేకల్లా పూర్తి చేసి పట్టుకు రమ్మన్నాడు.

అసలు అ?వేళ ఆఫీసులోకి రాగానే జిమ్ ముందు వీళ్లు ఓ డైరీ పెట్టారు. దాన్నిండా వారానికి సరిపడా బోల్డు ఎపాయింట్‌మెంట్స్ అప్పటికే రాసేసి వున్నాయి. "నేను యీ శాఖకు వస్తానో లేదో తెలియకుండా అప్పుడే యింతమంది ఎపాయింట్‌మెంట్స్ ఎలా తీసుకున్నారు!?" ఆశ్చర్యపడ్డాడు.

"మీరు కాకపోతే యింకోరు... ఎవరో ఒకరు మంత్రిగా వస్తారని తెలుసుగా.." అని నోరు చప్పరించాడు బెర్నార్డ్.

ఇంకా నయం కోన్‌కిస్కాయి అనలేదు, నోరెత్తకుండా వుంటే బాగుండేది అనుకుంటూ జిమ్ డైరీ కేసి చూశాడు. వారంలో తొమ్మిది కాబినెట్ మీటింగులు. బ్రిటిష్ కంప్యూటర్ అసోసియేషన్ వారితో రేపుదయం భేటీ, లా ఇన్‌స్టిట్యూట్‌లో రేపు రాత్రి ఉపన్యాసం, మర్నాడు యూనివర్శిటీ వైస్ ఛాన్సెలర్లతో లంచ్, గురువారం వుదయం నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ పబ్లిక్ ఎంప్లాయర్స్ వారి సమావేశానికి ప్రారంభ ఉపన్యాసం.. యిలా చాలానే వున్నాయి. అన్నీ పెన్సిల్‌లో రాసి వున్నాయి.

బెర్నార్డ్ కేసి జిమ్ ఆశగా చూసి "..పెన్సిల్ గీతలంటే మార్చుకోవచ్చన్నమాట... ఎందుకంటే నాకు కొన్ని వేరే పనులు కూడా వున్నాయి." అన్నాడు.

బెర్నార్డ్ కళ్లు చికిలించాడు – "వేరే పనులా!? అంటే?"

"అదే.. మా పార్టీ పాలసీ కమిటీలు నాల్గింటిలో నేను సభ్యుణ్ని.. అలాటివే.." అని జిమ్ చెప్పబోతూండగా హంఫ్రీ నిర్ఘాంతపోయినట్టు మొహం పెట్టి "దేశం కంటె పార్టీకి ప్రాముఖ్యత యిచ్చేవారనుకోలేదు మిమ్మల్ని.." అంటూ జిమ్‌ను మందలించాడు. దేశద్రోహీ అని తిట్టించుకున్నట్టు ఫీలై, జిమ్ యిక నోరెత్తలేకపోయాడు. వాళ్లిచ్చిన ఐదు పెట్టెలు మోసుకుని యింటికి బయలుదేరాడు.

జిమ్‌కి రాజకీయ సలహాదారు ఫ్రాంక్‌ను పక్కగదిలో కూర్చోబెట్టేసి 'మంత్రిగారు యిదిగో వస్తున్నారు, వెయిట్ చేయండి' అని చెపుతూ రోజంతా అక్కడే కూర్చోబెట్టేశారు. సోమవారమూ అదే తంతు. అతను చూసి చూసి ఓపిక హరించి, చివరకి మంగళవారంనాడు పెద్దగా అరుస్తూ జిమ్ గదిలోకి జొరబడబోయాడు. బెర్నార్డ్ గుమ్మం దగ్గరకి వెళ్లి "మంత్రిగారు సమావేశంలో వున్నారు. మీరు కాస్త ఓపిక పట్టాలి" అని చెపుతూ వుండగానే జిమ్ కలగజేసుకుని లోపలకి రానిమ్మని అన్నాడు.

నిజానికి యీ బ్యూరోక్రాట్ల గొడవలో పడి జిమ్ అతని గురించి బొత్తిగా మర్చిపోయాడు. అతన్ని చూడగానే గుర్తుకు వచ్చింది. "ఇతను నా సలహాదారు కాబట్టి యితనికి మన డిపార్టుమెంటులోనే ఓ రూము యివ్వండి" అన్నాడు. "మీకు సలహాలు యివ్వడానికి మా శాఖ మొత్తమంతా వుంది కదా, మళ్లీ యీయనకెందుకు శ్రమ?" అన్నాడు హంఫ్రీ. కాదు యివ్వాల్సిందే అని పట్టుబట్టాడు జిమ్.

"సరే అలా అయితే" అని కాస్సేపు ఆలోచించినట్టు నటించి "బెర్నార్డ్, ఊరికి అవతలవైపు మనకో బిల్డింగు వుంది కదా, అక్కడ యీయనకు ఓ ఆఫీసు ఏర్పాటు చేయి" అన్నాడు హంఫ్రీ.

ఫ్రాంక్‌కు తిక్కరేగిపోయింది. "నాకు యిక్కడే.. ఈ బిల్డింగ్‌లోనే.. ఆఫీసు కావాలి" అని అరవనారంభించాడు. జిమ్ కూడా అవునవును అన్నాడు. హంఫ్రీ వెంటనే "బెర్నార్డ్, మరి యిక్కడే చూడు" అని దిగి వచ్చాడు.

"అంతేకాదు, నాకిచ్చిన కాగితాల కాపీలన్నీ ఫ్రాంక్‌కు కూడా యివ్వాలి" అన్నాడు జిమ్ దృఢంగా.

"అన్నీనా!?" అని ఆశ్చర్యపడ్డాడు హంఫ్రీ.

''అవును, అన్‌న్నీ..''అని నొక్కి చెప్పాడు జిమ్.

''ఓకే, ఓకే.. యివ్వదగిన పేపర్లు అన్నీ.. యిస్తాం.'' అన్నాడు హంఫ్రీ మధ్యలో ఓ మాట జారవిడుస్తూ. దాన్ని గుర్తించని జిమ్ తనకు విజయం సిద్ధించినట్టు ఆనందించాడు. **(మొదటి కథ సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఎమ్బీయస్ : ఖ22ః పాలనలో పారదర్శకత

జిమ్ పార్టీలో కేవలం ముగ్గురు మాత్రమే గతంలో మంత్రులుగా పనిచేశారు. జిమ్‌తో సహా తక్కినవారందరూ ప్రతిపక్షంలోనే వుంటూ వచ్చారు. అందువలన సెక్రటరీలతో ఎలా వ్యవహరించాలో తెలియదు. నాలుగు రోజులు పోయేసరికి హంఫ్రీ, బెర్నార్డ్ కలిసి అతనికి తాము ఎంతో సహకరిస్తున్నట్లు అభిప్రాయం కలిగించేశారు. అంతా సవ్యంగానే వుందనే భ్రమలో అతను పడిపోయాడు. అయితే అతని గురించి హంఫ్రీ ఏమనుకుంటున్నాడు?

వారం గడిచాక నవంబరు 2న హంఫ్రీ, కాబినెట్‌కు సెక్రటరీ అయిన సర్ ఆర్నాల్డ్ రాబిన్‌సన్ రిఫార్మ్ క్లబ్‌లో డిన్నర్ చేస్తున్నారు. 'మీ కొత్త కాబినెట్ ఎలా వుంది?' అని అడిగాడు. 'అచ్చు పాతదానిలాగానే' అని జవాబిచ్చి ఆర్నాల్డ్ 'మీ కొత్త బిచ్చగాడు ఎలా వున్నాడు?' అని వాకబు చేశాడు. 'బుద్ధిమంతుడే. నేనూ బెర్నార్డ్ కలిసి మొన్న వీకెండులో బుట్టెడు ఫైళ్లు చదివించాం. కిమ్మనకుండా చదువుకుని వచ్చాడు. ఇక్కడ ఆట నియమాలు త్వరగానే నేర్చుకుంటున్నాడు.'' అని హంఫ్రీ సమాధానం చెప్పాడు. ఆర్నాల్ట్ పడిపడి నవ్వాడు.

అమెరికా రాయబారి యీ మధ్య ప్రధానితో చాలా సమయం గడుపుతున్నాడు. ఇంగ్లండు, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందమో, రక్షణ ఒప్పందమో ఏదో జరుగుతుందన్న పుకారు సెక్రటేరియట్‌లో షికారు చేస్తోంది.

అది నిజమేనా అని హంఫ్రీ అడిగాడు. 'మీడియాలో లీక్ రావాలని ఎదురుచూస్తున్నాం. మీడియా అడగ్గానే కాబినెట్ వద్ద సమాచారం ఏదీ లేదని చెప్పాలి. అందువలన డిఫెన్స్ గురించో బిజినెస్ గురించో కాబినెట్‌కు యింకా ఏమీ తెలియదన్నమాట' అని ఆర్నాల్డ్ జవాబిచ్చాడు.

ఓహో దీనర్థం డిఫెన్స్, బిజినెస్ రెండూ కలిసిన ఏరోస్పేస్ సిస్టమ్స్ కాంట్రాక్టు రాబోతోందన్నమాట అని హంఫ్రీ వూహించాడు. ఎందుకంటే అది చాలా రోజులుగా చర్చల్లో నలుగుతోంది. అది నాలుగున్న బిలియన్ డాలర్ల కాంట్రాక్టు, మిడ్‌లాండ్స్‌లో, నార్త్‌వెస్ట్‌లో బోల్డు ఉద్యోగాలు. ముఖ్యంగా అధికారపక్షం తక్కువ మార్జిన్లతో గెలిచిన సీట్లలో ఉద్యోగాలు వస్తే పార్టీ బలపడుతుంది. అధికారంలోకి వచ్చిన రెండు వారాల్లోనే యీ కాంట్రాక్టు ఖరారైతే ప్రధానికి ఎంతో పేరు వస్తుంది. చాలా నెలలుగా పూర్వప్రభుత్వం కసరత్తు చేయగా యిన్నాళ్లకు ఫలించిందని ఎవరికీ తోచదు. ఆ క్రెడిటంతా యీయన ఖాతాలోనే పడుతుంది.

వీళ్లు మాట్లాడుతూండగానే బెర్నార్డ్ వచ్చి చేరాడు. ఆర్నాల్డ్ బెర్నార్డ్‌ను పలకరించాడు. ''ఏమయ్యా, మీ కొత్త మంత్రిగారు పాలనలో పారదర్శకత అంటూ ఏదో మొదలెట్టాడట..'' అని.

బెర్నార్డ్ ఉత్సాహంగా ''అవునండి, మా మంత్రిగారు వస్తూనే దాని గురించి మాట్లాడారు. మా డిపార్టుమెంటంతా చాలా చిత్తశుద్ధితో దాన్ని అమలు చేద్దామని చూస్తున్నాం. ఇది యితర శాఖలకు కూడా స్ఫూర్తిదాయకంగా వుంటుంది.'' అన్నాడు.

అది విని హంఫ్రీ తెల్లబోయాడు. ఇలాటి అమాయకుడికి ప్రమోషన్ యిచ్చి పొరపాటు చేశానా అని చింతించాడు. ఈ కొత్త పాలసీకి ఎలా ఎసరు పెట్టాలో అప్పుడే అతను తన బుర్రలో ఓ పథకం వేసుకుని వున్నాడు. ఇప్పుడు బెర్నార్డ్ మాట విని ఆర్నాల్డ్‌కి తన సామర్థ్యం మీద అపనమ్మకం ఏర్పడుతుందని జంకు కలిగింది.

కంగారుగా ''చూడు బెర్నార్డ్, నేను మన డిపార్టుమెంటులో 'పాలనలో పారదర్శకత' అనే పేరుతో శ్వేతపత్రాన్ని విడుదల చేశానంటే దాని అర్థం అది అమలు చేస్తామని కాదు. కార్యాచరణలో అతి క్లిష్టమైన దాన్ని హెడింగ్‌లో పెట్టేస్తాం. 'ఇన్వర్స్ రెలవెన్స్' అనే సిద్ధాంతం యిక్కడ వర్తిస్తుంది. దేన్నయితే అతి తక్కువగా చేద్దామనుకుంటావో, దాని గురించి అతి ఎక్కువగా మాట్లాడతాం.'' అని వివరించాడు.

కానీ బెర్నార్డ్‌కు యిన్ని తిప్పలెందుకో అర్థం కాలేదు. ''మనం పారదర్శకంగా వుంటే వచ్చే నష్టం ఏముంది?'' అని అడిగాడు.

ఆర్నాల్డ్ చికాకు పడ్డాడు. ''పాలన – పారదర్శకత యీ రెండూ విరుద్ధపదాలు బెర్నార్డ్! రెండు విరుద్ధపదాలను ఒక మాటలో ఎలా సమన్వయం చేస్తావ్? నువ్వు పాలనైనా చేయి, పారదర్శకంగానైనా వుండూ. అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే కుదరదు.''

''ప్రజాస్వామ్యంలో వుంటున్నాం కాబట్టి పౌరులకు తెలుసుకునే హక్కు వుంటుంది.'' అన్నాడు బెర్నార్డ్.

''ప్రజాస్వామ్యంలో వుంటున్నారు కాబట్టి పౌరులకు అజ్ఞానంలో వుండే హక్కు వుంది'' అని సవరించాడు హంఫ్రీ.

''..అన్నీ తెలుసుకుంటే తప్పు జరగనిస్తున్నామనే అపరాధ భావన వుంటుంది. తెలియకుండా అంధకారంలో వుండడంలో ఒక డిగ్నిటీ, ఒక హుందాతనం వుంది'' అందించాడు ఆర్నాల్డ్.

బెర్నార్డ్ తన మొండిపట్టు వీడలేదు. ''పారదర్శకత కావాలని మంత్రిగారు పట్టుబడుతున్నారు.''

''అడిగాడు కదాని యిచ్చేయకూడదు. తాగుబోతు విస్కీ కావాలని అడుగుతాడు. ఇస్తామా?'' నచ్చచెప్పబోయాడు హంఫ్రీ.

"కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రతి మంత్రి మూడు వారాల్లో యిలాటి మాటలే మాట్లాడతాడు. మన అధికారయంత్రాంగం కలగజేసుకుని సరిదిద్దకపోతే నవ్వులపాలవుతాడు. మంత్రి చేసే తప్పొప్పులను కడుపులో పెట్టుకుని రహస్యాలు కాపాడవలసిన బాధ్యత సెక్రటరీది. సెక్రటరీ అనే పదంలోనే సీక్రసీ అనే మాట దాగి వుంది." అని ఆర్నాల్డ్ హెచ్చరించాడు.

అయినా బెర్నార్డ్ మూర?ంగా వాదిస్తూ వుండడంతో తన పథకం గురించి చెప్పకూడదని హంఫ్రీ నిశ్చయించుకున్నాడు.

ఇంగ్లండు ప్రభుత్వం అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న ఒక ఆర్డర్ యిన్‌వాయిస్ హంఫ్రీ ఆఫీసు కాగితాల్లో వుంది. ఫ్రాంక్‌కు అన్ని కాగితాలూ చూపించాలని ఆర్డరున్నా దీన్ని 'సెన్సిటివ్' గా పరిగణించి అతనికి కాపీ పంపలేదు. ఇప్పుడు హంఫ్రీ ఆ యిన్‌వాయిస్ ఫ్రాంక్ కంట పడాలని నిశ్చయించాడు. డైరక్టుగా అతనికి పంపించకుండా అతనంతట అతనే కనిపెట్టినట్లు వుండాలని అతని బల్లమీద వున్న కాగితాల కుప్ప కింద దీన్ని పెట్టమని తన అసిస్టెంటుకి చెప్పాడు.

అనుకున్నట్టుగానే నవంబరు 5 మధ్యాహ్నం అది ఫ్రాంక్ కంటపడింది. వెంటనే పెద్దగా అరుచుకుంటూ జిమ్ గదిలోకి చొరబడి "ఇది చూశావా?" అంటూ ఓ కాగితాన్ని అతని కళ్ల ముందు ఆడించాడు.

"అదేమిటో తెలియదు కానీ, మొత్తం మీద యీ ఆఫీసర్లు నీకు కాగితాలు పంపుతున్నందుకు సంతోషం" అన్నాడు జిమ్.

"పంపుతున్నారు కానీ, అసలైన కాగితాలు పంపటం లేదు."

"అలాగా, ఏ 'అసలైన' కాగితాలు పంపటం లేదు?"

"నాకు పంపనపుడు, ఏవి పంపలేదో ఎలా తెలుస్తుంది?"

ఈ మాట నిజమే అనిపించింది జిమ్‌కు. దీన్ని ఫ్రిజ్‌లో లైటు సమస్య అంటారు. ఫ్రిజ్ తలుపు మూసినపుడు లైటు వెలుగుతోందా లేదా అని తెలుసుకోవడం ఎలా? తెలుసుకోవాలంటే తలుపు తెరవాలి. తెరిస్తే తలుపు మూసినట్టు కాదు.

"అసలు సంగతి విను. నాకు వీళ్లు పంపేదంతా పరమ చెత్త. కానీ నేను తక్కువాణ్ని కాను. ఇదిగో యీ కాగితం పట్టుకున్నాను. దెబ్బకి యీ హంఫ్రీ గాడి పిలక మన చేతికి చిక్కింది." ఫ్రాంక్ వూగిపోతున్నాడు. "వీళ్లు అమెరికా నుండి వెయ్యి కంప్యూటర్ వీడియో డిస్‌ప్లే టెర్మినల్స్ కొనడానికి ఆర్డర్ యిచ్చారు. ఒక్కోటి పదివేల పౌండ్లు ఖరీదు. ఆ టెర్మినల్స్, యిక్కడ.. నీ నియోజకవర్గంలోనే బర్మింగ్‌హాంలో తయారవుతూంటే ఎక్కడో పిట్స్‌బర్గ్ నుంచి కోటి పౌండ్ల ఫారిన్ ఎక్స్‌ఛేంజ్ ఖర్చు పెట్టి తెప్పించాలా? ఆ కోటి పౌండ్లు ఎవరివి? బ్రిటిషు పౌరులవి. ఆ ఆర్డరు యిక్కడే యిస్తే నీ నియోజకవర్గంలోని ప్రజలకు ఆ మేరకు ఉద్యోగాలు వచ్చేవి కదా!" అని ఆవేశపడిపోయాడు.

జిమ్‌కు కూడా ఆవేశం ముంచుకుని వచ్చింది. "పారదర్శకత వుంటేనే యిలాటివి బయటకు వచ్చి ప్రజలకు తెలుస్తాయి. ఫ్రాంక్, నువ్వు మహోపకారం చేశావ్. ఆగు హంఫ్రీని సంజాయిషీ అడుగుతాను." అని హంఫ్రీ కోసం కబురు పెట్టాడు.

ఆ రోజంతా హంఫ్రీ మీటింగుల్లోనే వున్నాట్ట. రాలేకపోయాడు.

మర్నాడు వచ్చాడు. జిమ్ యీ కాగితం చూపించి "ఏమిటిది?" అన్నాడు. 'పాత ప్రభుత్వహయాంలో యిచ్చిన ఆర్డర్ అది. 'మొత్తం సెక్రటేరియట్‌కు కావలసిన టెర్మినల్స్ మన డిపార్టుమెంటు కొని వాళ్లకు అందచేస్తోంది." అన్నాడు హంఫ్రీ.

"అది తెలుసు. కానీ అవి మన దేశంలో తయారైనవి కావు."

"నిజమే"

"మా బర్మింగ్‌హాంలో కూడా తయారుచేస్తారు."

"కానీ క్వాలిటీలో తేడా వుంటుంది."

"ఏం వుండదు. అది నా నియోజకవర్గం." గర్వంగా చెప్పాడు జిమ్, అతనికి కంప్యూటర్లలో ఏమీ తెలియకపోయినా. "ఈ ఆర్డర్ కాన్సిల్ చేసేయండి."

"ఆర్థిక శాఖ ఒక్కటే ఆ పని చేయగలదు. ముందు చేసుకున్న ఒప్పందాలు – అదీ విదేశీ సప్లయిర్లతో చేసుకున్నవి – కాన్సిల్ చేయడమంటే మన వల్ల కాదు."

"అయితే ఏం చేయాలి?"

"మీరు కాబినెట్‌లో దీని గురించి చర్చ పెట్టండి. మిడిల్ ఈస్ట్ గురించి, అణ్వాయుధ వ్యాప్తి గురించి వాళ్లు చేస్తున్న చర్చలు ఆపి, ఆఫీసు ఫర్నిచర్ గురించి మొదలుపెడతారేమో" అని సూచించాడు హంఫ్రీ. కానీ దానిలో వెటకారం కనబడింది జిమ్‌కు. కాబినెట్ దాకా వెళ్లవలసినంత విషయం కాదిది. కానీ రేపు యీ విషయం బయటకు పొక్కినపుడు నా నియోజకవర్గంలో నా పరువేం కావాలి? అని వాపోయాడు.

'పొక్కడం దేనికి? విషయం బయటకు వెళ్లకుండా చూద్దాం' అన్నాడు హంఫ్రీ.

జిమ్ తెల్లబోయాడు – తన కొత్త పారదర్శకత పాలసీ అద్భుతంగా వుందని, అమలు చేసి తీరాలనీ ఉద్ఘాటించిన హంఫ్రీ యిప్పుడు యిలా మాట్లాడతాడేమా అని.

ఫ్రాంక్ కలగజేసుకున్నాడు – 'ఓకే, ఆర్డర్ కాన్సిల్ చేయలేకపోతే, దాని గురించి బయటకు చెప్పేద్దాం.'

దాని వలన లాభం ఏమిటని అడిగాడు హంఫ్రీ. జిమ్ దగ్గర జవాబు లేదు కానీ ఫ్రాంక్ ఠక్కున చెప్పాడు – 'ఒకటి యీ ప్రభుత్వం

తన మానిఫెస్టోకు కట్టుబడి వుందని ప్రజలకు తెలుస్తుంది. ఈ ఆర్డర్ యివ్వడం ద్వారా పాత మంత్రి ఇంగ్లండు ప్రయోజనాలు కాపాడని దేశద్రోహి అని, మనది ఓపెన్ గవర్నమెంట్ అనీ ప్రజలకు తెలుస్తుంది. దాని వలన మనకు రాజకీయప్రయోజనం కలుగుతుంది.'

హంఫ్రీ కంగారుపడ్డాడు. "అంటే.. మంత్రిగారు తన ఉపన్యాసంలో యీ రహస్య సమాచారాన్ని బయటపెట్టాలని మీ ఉద్దేశం కాదు కదా, కొంపదీసి.."

అప్పటిదాకా ఉపన్యాసం ఐడియా రాని ఫ్రాంక్ ఎగిరి గంతేశాడు. "అవునవును. ఆఫీసు ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులను ఉద్దేశించి మంత్రి ఉపన్యసిస్తారు. దానిలో యీ కుట్రను బయటపెడతారు. ఉపన్యాస ప్రతిని ముందుగానే ప్రెస్‌కు విడుదల చేస్తారు." అని డిక్లేర్ చేశాడు.

హంఫ్రీ మొహం చిట్లించాడు. "అమెరికన్లకు యిబ్బంది కలిగించడం అంత మంచిది కాదనుకుంటాను." అంటూ.

"మనం ఆలోచించవలసినది బ్రిటన్‌లోని పేదల గురించి కానీ అమెరికా కంపెనీల లాభాల గురించి కాదు హంఫ్రీ" అన్నాడు జిమ్ విజయగర్వంతో.

హంఫ్రీ నిట్టూర్చాడు. "ఇదే మీ నిర్ణయమైతే, మంచో చెడో డిపార్టుమెంటంతా మీ వెంటే నిలబడుతుందని హామీ యిస్తున్నాను."

"మీరు ఉపన్యాసం రెడీ చేస్తే క్లియరెన్సు కోసం అన్ని డిపార్టుమెంటల్‌కు సర్క్యులేట్ చేసే బాధ్యత నాది" అన్నాడు బెర్నార్డ్.

"తక్కిన డిపార్టుమెంట్లకు దీనితో సంబంధం లేదు. ఎవరికీ ముందుగా చూపించి అనుమతి తీసుకోనక్కరలేదు. వాళ్లకేదైనా అభ్యంతరాలుంటే పబ్లిగ్గా చెప్పమనండి. అదే కదా పారదర్శక ప్రభుత్వం అంటే." అన్నాడు జిమ్.

"ఆమోదం కోసం కాకపోయినా కనీసం సమాచారం యివ్వడానికైనా తక్కిన శాఖలకు తెలియపరచండి. మనం సమాచారాన్ని ప్రజలతో పంచుకోవడానికి సిద్ధపడినపుడు మన సహచరులతో పంచుకోవడంలో తప్పేముంది?" అని వాదించాడు హంఫ్రీ. జిమ్‌కు అంగీకరించక తప్పలేదు. "అయితే అన్ని శాఖలతో బాటు మీడియాకు కూడా కాపీ పంపండి." అని హంఫ్రీని ఆదేశించాడు.

"మీకు మేలు చేకూర్చేది చేయడానికే మేమున్నాం మంత్రిగారూ" అన్నాడు హంఫ్రీ.

రెండు రోజుల తర్వాత –

జిమ్‌కు ప్రధాని కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. సంగతేమిటని కనుక్కుంటే తెలిసింది – అమెరికాకు, బ్రిటన్‌కు అతి పెద్ద వాణిజ్య బంధం కుదురుతున్న ఏరోస్పేస్ ప్రకటన వెలువడుతున్న సమయంలో అమెరికాను నిందిస్తూ జిమ్ చేసిన ప్రకటన చూసి ప్రధాని మండిపడుతున్నాడు. ఆ విషయం హంఫ్రీ చెప్పగానే జిమ్ వణికాడు. "నా ప్రకటన కరెక్టే కానీ టైమింగ్ రాంగ్. ఈ ఏరోస్పేస్ ఒప్పందం చర్చ జరుగుతోందని నాతో ఎవరూ చెప్పలేదు. ప్రతిపక్షంలో వుండగా ఉమ్మడి బాధ్యత గురించి ఉపన్యాసాలు యిచ్చిన మా నాయకులే నాకు ఏమీ చెప్పకుండా చీకట్లో వుంచేశారు." అని తల పట్టుకున్నాడు.

"ప్రధాని కార్యాలయం నన్ను పిలిచి రద్దు గురించి, ఉపన్యాసం గురించి వాళ్ల ముందస్తు అనుమతి ఎందుకు తీసుకోలేదని అడుగుతున్నారు."

"నువ్వేం చెప్పావ్?"

"పాలనలో పారదర్శకత సిద్ధాంతాన్ని వివరించి చెప్పాను. దాని వలన వాళ్లకు మరింత కోపం వచ్చింది. ప్రధాని మీతో మాట్లాడతారట."

"ఏం జరుగుతుందంటావు?" జిమ్ అడిగాడు భయంగా.

"పెట్టే చెయ్యే కొట్టగలదు. మంత్రి పదవి యిచ్చినది ప్రధానే, తీసుకోగలిగినదీ ఆయనే.." అని తేల్చాడు హంఫ్రీ.

నేనూ, హంఫ్రీ, ఫ్రాంక్ వెళ్లి ప్రధాని కార్యాలయం బయట కూర్చున్నాం.

అక్కడికి చీఫ్ విప్ వచ్చాడు. అతనిదంతా మోటు వ్యవహారం. జిమ్‌ను చూస్తూనే "గొప్ప తలనొప్పి తెచ్చిపెట్టావయ్యా, ప్రైమ్ మినిస్టర్ పెనం మీద పేలగింజలా ఎగిరిపడుతున్నాడు. అలాటి స్పీచి యివ్వడానికి మతి పోయిందా?" అని కేకలు వేశాడు.

"మనది పారదర్శక ప్రభుత్వం" అన్నాడు ఫ్రాంక్.

"నువ్వు నోర్మూయ్." అంటూ అతన్ని కసిరి, జిమ్‌తో "మానిఫెస్టోలో వుంది కదాని ఏది పడితే అది మాట్లాడడమేనా? కాస్త లౌక్యం వుండద్దా? అవునూ, నువ్వు మంత్రి పదవి ఆయుర్దాయం ఎంత? వారంన్నరా? బాగుంది, గిన్నెస్ బుక్‌లోకి ఎక్కుతావులే. రేపు పేపర్లో హెడ్‌లైన్సు ఎలా వుంటాయో వూహించగలను. 'అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కాబినెట్‌లో నిట్టనిలువునా చీలిక. ప్రధానికి వ్యతిరేకంగా జిమ్ నేతృత్వంలో తిరుగుబాటు!" అంటూ చేతులు తిప్పుతూ వెళ్లిపోయాడు.

జిమ్‌కు మతిపోయింది. పదవి వూడడం ఖాయం అని అర్థమై పోయింది. అంతలో ఆర్నాల్డ్ వచ్చాడు. హంఫ్రీ కేసి చూసి "మీ మంత్రిగారిని బాగా చూసుకోవాల్సిన బాధ్యత లేదా? ఎటువంటి యిరకాటంలో పెట్టావ్, మీ మంత్రే కాదు, మొత్తం కాబినెట్ అప్రదిష్ట పాలవుతోంది." అని చివాట్లేశాడు.

హంఫ్రీ జిమ్ కేసి ఓ చూపు పడేసి "మా మంత్రిగారు, ఆయన కింద పనిచేస్తున్న మా అధికారగణం అంతా పారదర్శక ప్రభుత్వానికి కట్టుబడి వున్నాం. ఇన్నాళ్ల దాకా మూసి వున్న కిటికీ తలుపులు తెరిచి కొత్తగాలిని లోపలకి రానిస్తున్నాం." అన్నాడు.

జిమ్‌ను అనుకరిస్తూ.

జిమ్ తల వూపాడు కానీ నోరెత్తలేకపోయాడు. ఆర్నాల్డ్ జమ్ కేసి తిరిగి "మంత్రిగారూ, పార్టీ వేదికల మీద యిదంతా వినడానికి బాగానే వుంటుంది. కానీ ప్రధానిని బాగానే యిరికించారు."

ఏదో ఒకటి మాట్లాడకపోతే లాభం లేదనిపించింది జిమ్‌కు. "పారదర్శక ప్రభుత్వ సిద్ధాంతం పట్ల మా అంకితభావం మాటేమిటి.." అన్నాడు నోరు పెగల్చుకుని.

"ఆ అంకితభావం అంకం యింకా వచ్చినట్లు లేదు. ఇప్పటిదాకా మొదటి అంకమే ప్రారంభం కాలేదు. అప్పుడే తెర పడేట్లు వుంది." అనేసి ఆర్నాల్డ్ వెళ్లిపోయాడు.

హంఫ్రీ జిమ్ కేసి తిరిగి "సర్ ఎందుకైనా మంచిది రాజీనామా పత్రం తయారుచేసి పట్టుకు రమ్మంటారా? మాటామాటా వస్తే మీరు చటుక్కున ప్రధాని బల్ల మీద పెట్టేయవచ్చు" అన్నాడు.

జిమ్‌కు ఏడుపొక్కటే తరువాయి. "ఇదంతా పైకి రాకుండా మనం కప్పిపుచ్చేయలేమా?" అని అడిగాడు లోగొంతుతో.

అనరాని, వినరాని మాట విన్నట్టుగా హంఫ్రీ ఆశ్చర్యం ప్రదర్శించాడు. "మీరు!? కప్పిపుచ్చడం గురించి మాట్లాడుతున్నారా!!? సమాచారం బయటకు రాకుండా తొక్కి పెట్టేయమంటున్నారా!!!?"

"అన్ని మాటలు ఎందుకులే, కానీ భావం అయితే అదే.." అని జిమ్ అన్నాడు ఆముదం తాగిన మొహం పెట్టి.

"..అంటే పాలనలో పారదర్శకత అనే మన సిద్ధాంతానికి కట్టుబడి వుంటూనే సందర్భం బట్టి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో కాస్త వెసులుబాటు కల్పించుకోవాలి – అంటారు." అన్నాడు హంఫ్రీ గంభీరంగా.

"అదే, అదే, నేను చెప్పదలచినదీ అదే." అన్నాడు జిమ్.

ఇంతలో బెర్నార్డ్ పరిగెట్టుకుని వచ్చాడు. "సర్, ప్రెస్ రిలీజు విషయంలో మన నూతన విధానం అమలులో వైఫల్యం నా దృష్టికి వచ్చింది.." అంటూ మొదలెట్టాడు. జిమ్ ఆదుర్దాగా ఏమైందేమైందన్నాడు. ఏదైనా ప్రకటన మీడియాకు పంపేముందు క్లియరెన్సు తెచ్చుకోవాలి అనే నిబంధన ఎప్పటినుంచో వుంది. ఆ నిబంధన తొలగిస్తానని హంఫ్రీ మాట యిచ్చాడు కానీ మర్చిపోయాడట. అందువలన పాత అలవాటు ప్రకారం డిపార్టుమెంటులో యితర అధికారులు మంత్రిగారి ప్రకటనను ప్రెస్‌కు రిలీజు చేయలేదు.

ఇది వింటూనే జిమ్ మొహం యింతైంది. అమ్మయ్య, విషయం మీడియా దాకా వెళ్లలేదు. తన పదవికి గండం లేదు. ప్రధానికి ఏదో చెప్పుకుని బతిమాలుకోవచ్చు.

కానీ హంఫ్రీ క్షమాపణలు చెప్పసాగాడు. "మంత్రిగారూ, తప్పంతా నాదే. మీ పారదర్శకప్రభుత్వ సిద్ధాంతాన్ని అమలు చేస్తానని మాట యిచ్చి మాట నిలబెట్టుకోలేకపోయాను. ఆ నిబంధన ఎత్తివేయనందుకు నన్ను మన్నించాలి." అని.

ఏదో ఔదార్యం ప్రదర్శిస్తున్నట్లు జిమ్ "ఓకేఓకే హంఫ్రీ, మనమంతా తప్పులు చేస్తాం. వదిలేయ్." అన్నాడు.

"ఎస్, మినిస్టర్" అన్నాడు హంఫ్రీ వినయం ఒలకబోస్తూ.

ఈ ఎపిసోడ్‌ను యింత విపులంగా చెప్పడానికి కారణం – పాలనలో పారదర్శకత అనేది మన దగ్గర కూడా తరచుగా వినబడే పదం. కానీ ఆదర్శాలను అమలులోకి తేవడం ఎంత కష్టమో దీనిలో చూపించారు. ఏదైనా చేద్దామంటే దానికి మరి దేనితోనో లింకు వుంటుంది. అధికారంలోకి రాగానే మన దగ్గర కూడా మంత్రులు నిరాడంబరంగా వుంటామని, ప్రజలకు అందుబాటులో వుంటామని, అన్ని విషయాలను ప్రజలకు చెప్పే చేస్తామనీ, అవినీతిని సహించమనీ ప్రకటిస్తారు. కానీ నిజంగా వాటిని ఆచరణలో పెట్టాలనుకున్నా పెట్టలేరు. ఉత్సాహం వురకలు వేసే కొత్త బిచ్చగాడిలా వున్న మంత్రిని రొటీన్ పద్ధతికి తేవడానికి అధికారులు తమ ట్రిక్కులు వుపయోగించి, ముకుతాడు వేస్తారు. దీనిలో ఏరోస్పేస్ డీల్ గురించి హంఫ్రీకి ముందు తెలిసినా మంత్రికి చెప్పడు. మంత్రిని ఎగదోయడానికి కంప్యూటర్ టెర్మినల్ బిల్లు అతనికి అందేట్టు చేశాడు. అది కూడా ఏదో పెద్ద ఘోరం జరిగిపోతూంటే తను వలవేసి పట్టుకున్నట్టు అతనికి అనిపించేట్టు సీను క్రియేట్ చేశాడు. అతను ఆర్డర్ ఆపడంతో సరిపెట్టబోతే స్టేటుమెంటు రూపంలో యిచ్చే ఐడియాను సటిల్‌గా తనే అతని మెదడులో ప్రవేశపెట్టాడు. దాని కారణంగా కొంప మునిగే పరిస్థితి వచ్చాక తనే చక్రం వేసి కాపాడాడు. అది కూడా తన వలన జరిగిన పొరపాటుగా చిత్రీకరించి మంత్రి అహాన్ని కాపాడాడు. పారదర్శకత పనికి రాదని మంత్రికి పాఠం నేర్పాడు. ఆ మాట కూడా పచ్చిగా అననీయకుండా, అంతా కలిసి కుట్ర పన్నినట్లు కాకుండా, దేశాన్ని ఉద్ధరించడానికి అన్నట్లు, రిఫైన్డ్ భాషలో ఏదో పెద్ద సిద్ధాంతం ప్రవచించినట్లు చెప్పాడు. అధికారుల పరిభాష (జార్గన్) ఎలా వుంటుందో రుచి చూపించాడు. ఈ ధోరణి అర్థమైతే తర్వాతి కథలు క్లుప్తంగానే చెప్పుకున్నా మీకు హంఫ్రీ, యితర అధికారగణం మేధస్సు (కుటిలత్వం అనవచ్చు కానీ మనమూ వాళ్ల పరిభాష ఉపయోగించాలిగా) మంత్రిని లొంగదీసుకునే విధానాల్లో స్వారస్యం బోధపడుతుంది. (రెండో కథ సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)

ఎమ్బీయస్ : ఖఖ3ః దేశాధిపతి పర్యటన

ఆఫీసులో చేరి మూడు వారాలయ్యేసరికి పని ఒత్తిడికి జిమ్‌కు కళ్లు తేలేసే పరిస్థితి వచ్చింది. అధికార్లు అతనికి పెట్టెల పెట్టెల కాగితాలు హోమ్‌వర్క్‌కై యిస్తున్నారు. అవి చదివి మతి పోగొట్టుకుని ఆఫీసుకి వస్తే అక్కడ 'ఇన్' ట్రేలో గుట్టగుట్టలుగా కాగితాలు. గుంపులుగుంపులుగా తనను చూడడానికి వచ్చే సందర్శకులు, డెలిగేషన్లు, పాల్గొనవలసిన కమిటీ సమావేశాలు, యివన్నీ చాలనట్లు మధ్యమధ్యలో హౌస్ ఆఫ్ కామన్స్‌కి వెళ్లి ఓటు వేసి రావడాలు...! అన్నిటికన్నా ముఖ్యంగా కరస్పాండెన్స్ సంగతి ఏం చేయాలో తోచటం లేదు. బెర్నార్డ్‌ని అడిగాడు –"ఇదంతా ఎప్పుడు చూడాలయ్యా బాబూ" అని.

"మీరు నిజంగా అవన్నీ చూడక్కరలేదని మీకు తెలుసనుకుంటా" అన్నాడు. జిమ్ కనుబొమలు ఎగరేయడం చూసి వివరించాడు – "మీరు కావాలనుకుంటే ఆ అఫీషియల్ రిప్లయి ఏదో మేమే పంపేస్తాం."

"..అంటే?"

"..అంటే మీ ఉత్తరానికి ధన్యవాదాలు తెలియచేయమని మంత్రి మమ్మల్ని కోరారు – అని ప్రారంభించి మీరు ప్రస్తావించిన అంశం పరిశీలనలో వుంది అంటాం. పోనీలే పాపం అనిపిస్తే 'చురుగ్గా పరిశీలిస్తున్నాం' అంటాం."

"తేడా ఏమిటో!?"

"పరిశీలనలో వుంది అంటే దానర్థం ఫైలు పోయింది అని. చురుకైన పరిశీలనలో వుంది అంటే దాని కోసం వెతుకుతున్నాం అని. నా సలహా ఏమిటంటే మీరు రోజూ ఉదయమే ఇన్ ట్రేలో వున్న కాగితాలన్నీ తీసి ఔట్ ట్రేలో పడేయండి. ఏదైనా అభ్యర్థనకు మా సమాధానం ఎలా వుందో తెలుసుకోవాలని కుతూహలంగా వుంటే మార్జిన్‌లో చిన్న నోట్ రాయండి. సమాధానం మీకు చూపిస్తాం."

అతని మాటల్లో 'నువ్వు వున్నా లేకపోయినా ఒక్కటే' అనే సందేశం ధ్వనించింది జిమ్‌కు. "మరి నేను యిక్కడ వున్నదెందుకు?" అన్నాడు కాస్త చికాగ్గా.

"విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి!"

"ఎన్నాళ్లకోసారి ఆ అవసరం పడుతుంది?"

"అప్పుడప్పుడు పడుతుంది." అన్నాడు కానీ ఎంత తరచుగా పడుతుందో చెప్పలేదు.

జిమ్‌కు అలాటి అవసరం యింకో రెండు మూడు రోజుల్లోనే పడింది.

బ్యురాండా అనే చిన్న ఆఫ్రికన్ దేశాధ్యక్షుడు ఇంగ్లండు పర్యటనకు రాబోతున్నాడు. అది ఒకప్పుడు బ్రిటన్‌కు వలసదేశంగా వుండింది. కొన్నేళ్ల క్రితమే స్వాతంత్ర్యం పొందింది. ఆ దేశంలో పెట్రోలు నిక్షేపాలు వున్న సంగతి యీ మధ్యే తెలిసింది. వచ్చే రెండేళ్లలో పెట్రోలు వెలికితీత ప్రారంభమవుతుంది. పెట్రోలుపై కన్నేసిన బ్రిటన్ యిప్పణ్నుంచి ఆ దేశంతో స్నేహం చేసుకుని, వ్యాపారవాణిజ్యబంధాలు ఏర్పరచుకోవాలనుకుని, ఆ దేశాధ్యక్షుణ్ని ఆహ్వానించింది. అదే సమయంలో కాస్త ఋణసహాయం చేస్తాం, మా దగ్గర ఆఫ్‌షోర్ ఆయిల్ రిగ్గులు కొనుక్కోండి అని అమ్మచూపుతోంది.

ఇవన్నీ చెప్పి చర్చల్లో, ఆంతరంగిక సంభాషణల్లో అలాటి దేశాలను ప్రస్తావించ్చేటప్పుడు ఎలాటి జాగ్రత్తలు తీసుకోవాలో హంఫ్రీ జిమ్‌కు చెప్పాడు. "అలాటి దేశాలను ఒకప్పుడు అండర్ డెవలప్‌డ్ (అభివృద్ధి చెందని) దేశాలని అనేవాళ్లం. అయితే వారికి అభ్యంతరకరంగా తోచింది. అందువలన వాటిని డెవలపింగ్ (అభివృద్ధి చెందుతున్న) దేశాలని అనసాగాం. కానీ అదేదో ఉద్ధరింపుగా మాట్లాడుతున్నట్లు తోచింది వారికి. అందువలన యిప్పుడు లెస్ డెవలప్‌డ్ (తక్కువగా అభివృద్ధి చెందిన) కంట్రీస్ – ఎల్‌డిసి – అంటున్నాం. ప్రస్తుతానికి దీనికి అభ్యంతరం తెలపటం లేదు. తెలిపిన రోజు మనం వాటిని ఎచ్‌ఆర్‌ఆర్‌సి – హ్యూమన్ రిసోర్సెస్–రిచ్ కంట్రీస్ – మానవవనరులు పుష్కలంగా కల దేశాలు – అని పిలుస్తాం. అంటే జనాభా ఎక్కువ, డబ్బు తక్కువ అన్నమాట."

ఇంతకీ కార్యక్రమం ఏమిటి అని అడిగితే తెలిసినదిది – దేశాధ్యక్షుడు వచ్చినపుడు బ్రిటన్ రాణి ఆయన్ను రిసీవ్ చేసుకోవాలి. అయితే ఆవిడ తన కుటుంబంతో వేసవి విడిదికి వెళ్లింది. అది లండన్‌కు ఉత్తరాన స్కాట్లండ్‌లో వున్న బాల్మోరల్‌లో వుంది. ఇప్పుడు యీయన కోసం ఆవిడ మళ్లీ లండన్ రావాలి. ఇదీ విదేశాంగ శాఖ నిర్ణయించిన కార్యక్రమం. ఇది వినగానే జిమ్‌కు ఒక ఆలోచన వచ్చింది. ప్రస్తుతం స్కాట్లండ్‌లో మూడు ఉపయెన్నికలు జరగబోతున్నాయి. ఇటీవలే జరిగిన ఎన్నికలలో నెగ్గిన అభ్యర్థి తన వంటి అవినీతిపరుణ్ని ప్రజలు మళ్లీ ఎలా ఎన్నుకున్నారా అన్న ఆశ్చర్యంతో గుండాగి చచ్చిపోయాడు. అలా ఏర్పడిన ఖాళీలో జరుగుతున్న ఉపయెన్నికతో బాటు, మరో రెండు చోట్ల కూడా జరుగుతోంది. అక్కడ అధికార పార్టీ కచ్చితంగా నెగ్గుతుందన్న పరిస్థితి కనబడటం లేదు. అసలే స్కాట్లండ్ వాళ్లకు ఇంగ్లండు వారిపై కోపం. తమను పట్టించుకోవటం లేదని, జాత్యంహకారంతో అణగదొక్కుతున్నారని ఫిర్యాదు. అందువలన యీ సమావేశం అక్కడ ఏర్పరచి వాళ్లను బుజ్జగించి తద్వారా ఉపయెన్నికలు గెలవవచ్చని జిమ్ ఊహ.

అందువలన "ఈ సమావేశాన్ని లండన్‌లో కాకుండా స్కాట్లండ్‌లోని ఎడింబరాలో వున్న హెూలీరూడ్ ప్యాలెస్‌లో నిర్వహిద్దాం. అలా అయితే రాణిగారికి యింతదూరం వచ్చి వెళ్లే శ్రమ తప్పుతుంది. పైగా ఆవిడ బ్రిటన్‌కే కాదు స్కాట్లండ్‌కు కూడా రాణి. అక్కడా కొన్ని కార్యక్రమాలు నిర్వహించాలి." అన్నాడు.

జిమ్ ఊహలు చదివేసిన హంఫ్రీ "దేశాధ్యక్షుల పర్యటనలను రాజకీయ ప్రయోజనాలకై వాడుకోలేము" అని నీతిబోధ చేశాడు. "విదేశీ ప్రముఖుణ్ని స్కాట్లండ్ వంటి మూలప్రదేశానికి వెళ్లమని ఒత్తిడి చేయలేం." అని కొత్త ఎత్తు ఎత్తాడు.

అప్పుడు జిమ్ కొత్త వాదన తెచ్చాడు. "మనం అమ్మచూపే ఆయిల్ డ్రిల్లింగ్ మెషిన్లు వున్నది స్కాట్లండ్ సముద్రతీరంలోని అబర్దీన్‌లో! లండన్‌లో కాదు. అవి కొనేముందు వాటి పనితీరు చూడడానికి దేశాధ్యక్షుడు లండన్‌లో కూర్చుంటే ఎలా?" అని.

హంఫ్రీ సణుక్కున్నాడు, గొణుక్కున్నాడు. చివరకు దీనిపై ఇంటర్‌డిపార్టుమెంటల్ కమిటీ వేస్తానన్నాడు.

అతను వెళ్లిపోయాక జిమ్ బెర్నార్డ్‌తో "ఎవరైనా అధికారి తన కిష్టం లేని పనిచేయవలసి వచ్చినపుడు, అభ్యంతరం చెప్పడానికి పాయింటు ఏదీ దొరకనప్పుడు, ఆ పని జరక్కుండా చేయడానికి ఇంటర్‌డిపార్టుమెంటల్ కమిటీ వేస్తారు." అన్నాడు.

బెర్నార్డ్ తల వూపాడు "రాజకీయనాయకులు కమిషన్లు వేసినట్లే.." అన్నాడు.

"ఇంతకీ యీ హంఫ్రీకి అభ్యంతరం ఏమిటయ్యా, పని తగ్గిందని సంతోషించవచ్చు కదా! స్కాట్లండ్‌లో జరిగితే యీయన సొమ్మేం పోయిందిట?"

"లండన్‌లో జరిగితే ఈయన ప్రముఖంగా వెలుగుతాడు. ఈయన చేతుల మీదుగా జరుగుతుంది. అందరిలో గుర్తింపు వస్తుంది. స్కాట్లండ్‌లో జరిగితే అది రాజధాని కాదు కాబట్టి యింత హంగామా వుండదు, యిన్ని డిన్నర్లు వుండవు. పైగా అది స్కాట్లండ్ పర్మనెంట్ సెక్రటరీ ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈయన పనిలో గుంపులో గోవిందాగా వుంటుంది." వివరించాడు బెర్నార్డ్.

"ఈ హంగామా గురించి హంఫ్రీకి యింత వెర్రేమిటి?"

"ఆయన బిరుదుల గురించి చూస్తున్నాడు. ఇప్పటికే నైట్‌హుడ్ వచ్చింది, ఆ పైన వుండే నైట్ కమాండర్ ఆఫ్ బాత్ పురస్కారం వచ్చింది. అది సరిపోవటం లేదు. జిసిబి అంటే 'నైట్ గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద బాత్' పురస్కారాల జాబితా ఆయన పేరు కూడా వుందని చెప్పుకుంటున్నారు. ఇప్పుడీ పర్యటన కార్యక్రమంలో ఒక వెలుగు వెలిగితే జాబితాలో పేరుంటుంది, లేకపోతే వేరేవాళ్లు తన్నుకుపోతారు."

జిమ్ హంఫ్రీని తలచుకుని పాపం అని నిట్టూర్చాడు. ఎందుకంటే 'నువ్వు ఏ కమిటీ వేసినా స్కాట్లండ్‌లోనే సమావేశం జరుగుతుంది. ఇది నా విధాన పరమైన నిర్ణయం. ఇలాటివి తీసుకోవడానికే నేనున్నాను' అని అతనికి అప్పటికే స్పష్టం చేసి వున్నాడు.

ఇది జరిగిన వారానికి బ్యురాండా దేశంలో సైనిక తిరుగుబాటు జరిగింది. ఆర్మీ చీఫ్‌గా వున్న కర్నల్ సెలీమ్ మొహమ్మద్ అధ్యక్షుణ్ని దింపేసి తనే ఆ పదవి చేపట్టాడు. ఆ వార్త వినగానే హంఫ్రీకి పట్టరాని ఆనందం కలిగింది. కానీ జిమ్ "కొత్త అధ్యక్షుణ్ని కూడా ఆహ్వానిద్దామని అనుకుంటున్నాం" అనగానే అతని మొహం మాడిపోయింది. ఇక అడ్డగోలు వాదనలు చేయడం మొదలెట్టాడు. "అలా ఎలా పిలుస్తాం? అతని ప్రభుత్వాన్ని మనం యింకా గుర్తించనేలేదు. ఒకవేళ ఆ ప్రక్రియ త్వరగా పూర్తి చేసినా అతనెటువంటివాడో, సవ్యంగా పెరిగాడో లేడో, గుణగణాలెలాటివో తెలియకుండా మన రాణిగార్ని ఎలా కలవనిస్తాం? కమ్యూనిస్టేమో? ఈడీ అమీన్ లాటివాడేమో? రాణిగారితో ఎలా వ్యవహరించాలో ఆ మర్యాదా మప్పితం తెలియనివాడైతే రాణికి ఎంత యిబ్బంది?"

ఇతనిలా అంటూండగానే టీవీలో వార్త వచ్చింది – కొత్త అధ్యక్షుడు ఇంగ్లండ్ పర్యటించడానికి నిశ్చయించుకుంటూ ప్రకటన చేశాడని. ఇక హంఫ్రీ ఏమీ చేయలేకపోయాడు.

వారం తిరక్కుండా అతను ఇంగ్లండు వచ్చేశాడు కూడా. విమానాశ్రయంలో అతను దిగిన దృశ్యాన్ని టీవీలో చూస్తూనే జిమ్ ఆశ్చర్యపడ్డాడు. అతను వేరెవరో కాదు, తనతో పాటు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకున్న చార్లీ ఉమ్టాలీ. కొన్నేళ్ల క్రితమే మతం మార్చుకుని సెలీమ్ మొహమ్మద్ అయ్యాడు. అతను వచ్చీ రాగానే స్కాట్లండ్ ఫంక్షన్‌లో తను యివ్వబోయే ఉపన్యాసం కాపీని ఇంగ్లండు ప్రభుత్వానికి ముందుగా పంపాడు.

దాంట్లో "బ్యురాండా ప్రజలు స్వాతంత్ర్యం కోసం పోరాడే అన్ని జాతుల ప్రజలతో మమేకం అవుతున్నారు. ఇంగ్లీషు బానిసత్వపు కాడిని విసిరికొట్టిన బ్యురాండా అదే ఇంగ్లండు ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న స్కాట్లండ్, ఐర్లండ్ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలవడమే కాక, సహాయసహకారాలు కూడా అందిస్తుందని యిందుమూలంగా హామీ యిస్తున్నాను." అని వుంది.

అసలే స్కాట్లండ్. ఐర్లండ్ ప్రజలు ఇంగ్లండు నుంచి విడిపోదామని చూస్తున్నారు. ఇప్పుడీ ప్రసంగం వాళ్లని మరింత రెచ్చగొడుతుంది. పైగా యీ సమావేశం స్కాట్లండ్‌లో జరగడం వలన మరింత డామేజి జరుగుతుంది. ఏం చేయాలో ఎవరికీ తోచలేదు. ఇంతకీ యిప్పుడేం చేయాలని జిమ్ అడిగాడు. హంఫ్రీ ఆరు మార్గాలున్నాయన్నాడు. అవేమిటంటే 1. ఏమీ చేయకపోవడం 2. అతని ప్రసంగాన్ని ఖండిస్తూ ఒక ప్రకటన చేయడం 3. అధికారపూర్వకంగా నిరసన తెలపడం 4. ఇచ్చే సాయాన్ని నిలిపేయడం 5. దౌత్యసంబంధాలన్నీ తెంపేసుకోవడం 6. యుద్ధం ప్రకటించడం.

అన్నీ విని జిమ్ వీటిలో ఏది మంచిదన్నాడు. అప్పుడు హంఫ్రీ మళ్లీ పరిష్కార మార్గాల గురించి వివరణ యిచ్చాడు. ''1. ఏమీ చేయకపోతే మనం అతని ఉపన్యాసంతో ఏకీభవించినట్లు అవుతుంది. 2. మన ప్రకటన హాస్యాస్పదంగా వుంటుంది 3. నిరసనను పట్టించుకోరు 4. సాయాన్ని నిలిపివేయడం అంత సులభమేమీ కాదు ఎందుకంటే మనం సాయం యిప్పటిదాకా ఏమీ యివ్వలేదు, అనుకోలేదు 5. దౌత్యసంబంధాలు తెంపేసుకుంటే ఆయిల్ రిగ్గులు అమ్మడం కుదరదు 6. యుద్ధం ప్రకటిస్తే మనం అతిగా స్పందించామని ప్రపంచం మనను తప్పుపడుతుంది.

మొత్తం మీద ఏం చేయాలో ఎవరికీ బోధపడలేదు. స్కాట్లండ్‌లో సమావేశం ప్రతిపాదన చేసినందుకు అందరూ జిమ్‌ను తిట్టుకున్నారు. కావాలని ప్రసంగం ముసాయిదాను ముందే పంపిన అధ్యక్షుడి బ్లాక్‌మెయిల్‌కి లొంగక తప్పదని అర్థం చేసుకున్నారు. ఆ బ్లాక్‌మెయిల్ ఖరీదెంతో కనుక్కునే బాధ్యతను అధ్యక్షుడికి పాత క్లాస్‌మేట్ అయిన జిమ్‌కి అప్పగించారు.

చార్లీ జిమ్‌ను సాదరంగా ఆహ్వానించాడు. అతనికి స్కాట్లండ్ ఉపయెన్నికల గురించి, తన పర్యటన ద్వారా అధికార పార్టీ రాజకీయలాభం పొందుదామనుకుంటోన్న సంగతి తెలుసు. డైరక్టుగా పాయింటుకు వచ్చేశాడు. ప్రసంగాన్ని మార్చాలంటే తన దేశానికి 5 కోట్ల పౌండ్ల ఋణం వడ్డీలేకుండా యివ్వాలని, చెల్లింపు పదేళ్ల తర్వాతే ప్రారంభం కావాలని షరతు విధించాడు. జిమ్‌తో పాటు వెళ్లిన హంఫ్రీ ఓ కాగితం మీద 'ఏటా వడ్డీ 10% అనుకుంటే పదేళ్ల పాటు వడ్డీ లేదంటే ఆ ఋణం వూరికే యిచ్చినట్లవుతుంది' అని రాసిచ్చాడు. ఆ ముక్క జిమ్ చార్లీకి చెపితే 'కానీ ఆ ఋణం తీసుకునేది మీ రిగ్గులు కొనడానికే కదా'' అన్నాడు. వెంటనే హంఫ్రీ 'వీడు మన రిగ్గులను మన డబ్బుతోనే కొంటున్నాడు' అని.

కానీ జిమ్‌కు దానిలో అభ్యంతరపెట్టవలసినది ఏమీ కనబడలేదు. బోల్డన్ని ఉద్యోగాలు వస్తాయి అన్నాడు. హంఫ్రీ మళ్లీ ఏదో కాగితం మీద గిలకబోయాడు. క్లాసురూములో టీచరును వెక్కిరిస్తూ కాగితాలు రాసి మార్చుకునే అల్లరి పిల్లల్లా వున్నామని తోచి జిమ్ హంఫ్రీని వెంటపెట్టుకుని కారిడార్‌లోకి వెళ్లాడు.

''ఈ డబ్బు మళ్లీ వెనక్కి రాదు. మన రిగ్గులూ పోతాయి. మీ నియోజకవర్గాల్లో ఉద్యోగాలు వస్తాయి కదాని మీరు తలూపుతున్నారు. బ్లాక్‌మెయిల్‌కు లొంగి రాజకీయ ప్రయోజనాలకై ప్రజాధనం యిలా దుర్వినియోగం చేయడం అన్యాయం, అక్రమం, ఆర్థికశాఖ ఎప్పటికీ ఒప్పుకోదు.'' అని హంఫ్రీ ఉపన్యాసాలు దంచసాగాడు.

జిమ్ హఠాత్తుగా, అసందర్భంగా ''జిసిబి'' అన్నాడు.

హంఫ్రీ ఒక్కసారిగా ఆగిపోయాడు. తను ఆ పురస్కారం కోసం ఎదురుచూస్తున్న సంగతి జిమ్‌కు తెలిసిపోయిందని అర్థం చేసుకున్నాడు. అది పెట్టుకుని యిప్పుడు జిమ్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని గ్రహించాడు. కానీ బ్లాక్‌మెయిల్‌కు లొంగినట్లు కనబడకుండా ''మీరు చెప్పినదానిపై దీర్ఘంగా ఆలోచిస్తే చాలా మంచి ఆలోచన అనిపించిందండి. మనం యీ ఆఫర్ తీసుకోకపోతే రష్యన్లు రంగంలోకి వచ్చి అవకాశాన్ని గద్దలా తన్నుకుపోవచ్చు. అదీకాక ఎల్‌డిసి దేశాలకు ఉదారంగా సాయం చేయవలసిన నైతిక బాధ్యత మన తెల్లవాళ్లపై వుంది. మన ఆర్థిక శాఖ అభ్యంతరాలు తెలుపుతుంది కానీ మనం ఉద్యోగకల్పన శాఖను, పరిశ్రమల శాఖలను కలుపుకుని వెళితే వాళ్లు నచ్చచెప్పవచ్చు. అనేక విధాలుగా యీ ఒప్పందం లాభదాయకం కాబట్టి ఒప్పించండం సాధ్యమే అనుకుంటున్నాను.'' అని ప్లేటు ఫిరాయించాడు.

ఇద్దరూ లోపలకి వెళ్లి చార్లీతో ''మనం ఒక అంగీకారానికి రాగలమని అనుకుంటున్నాం.'' అన్నాడు.

చార్లీ ''మరి దానికి చెల్లించాల్సిన మూల్యం ఏమిటో తెలుసుగా'' అన్నాడు.

జిమ్ హంఫ్రీ వైపు తిరిగి ''ఆశ్చర్యమేముంది? ప్రతీ మనిషికి ఒక మూల్యం వుంటుంది, ఏమంటావ్ హంఫ్రీ'' అన్నాడు.

''ఎస్ మినిస్టర్'' అన్నాడు హంఫ్రీ తలూపుతూ.(మూడో కథ సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)

ఎమ్బీయస్ : ఖఖ4:ఎకానమీ డ్రైవ్

ఈ కథ ప్రభుత్వం తలపెట్టదలచిన పొదుపు చర్యల గురించి. ఇది కూడా మన వ్యవస్థలో తరచు వినబడే అంశమే. ''డెయిలీ మెయిల్'' డిసెంబరు 7 నాటి సంచికలో ప్రభుత్వ సిబ్బంది చాల ఎక్కువగా వున్నారని, ఉదాహరణకు నేవీలో వున్న సైనికుల కంటె రెవెన్యూ శాఖలో ఎక్కువమంది వున్నారని, అవసరానికి మించి వున్నవారిని గుర్తించి తొలగించవలసిన శాఖ ఎడ్మినిస్ట్రేషన్ వ్యవహారాల శాఖది కాబట్టి దాని మంత్రి జిమ్ హాకరే దానికి బాధ్యుడని, అతన్ని తీసేస్తే కాని పరిస్థితి మెరుగుపడదని ఒక వ్యాసం ప్రకటించింది. ఇది రాజకీయంగా కూడా చాలా చెఱుపు చేస్తుంది కాబట్టి తక్షణం దిద్దుబాటు చర్యలు చేపట్టాలని జిమ్ రాజకీయ సలహాదారు ఫ్రాంక్

పట్టుబట్టాడు. జిమ్ పట్టుబట్టి అతనికి తన డిపార్టుమెంటులోనే ఒక గది కేటాయింప చేసుకున్నాడు. అతను మాటిమాటికి వచ్చి 'జిమ్, నువ్వు మీ ఆఫీసర్లకు వంతపాడుతున్నావు. నిన్ను వాళ్లు హౌస్ ట్రైన్ చేసేశారు. వాళ్ల కళ్లతోనే ప్రతి విషయాన్ని చూస్తున్నావు. అందుకే గతంలో ప్రతిపక్షంలో వుండగా నీకు తప్పులుగా కనబడ్డవి యిప్పుడు ఒప్పులుగా కనబడుతున్నాయి' అని హెచ్చరిస్తూన్నాడు. అతనికి లౌక్యం తక్కువ కాబట్టి ఉన్నదున్నట్టు చెప్పడంతో అతన్ని చూస్తే జిమ్‌కు యీ మధ్య చికాకు వేస్తోంది. ఇప్పుడు యీ వ్యాసంపై అతను చేసే హంగామా చూసి జిమ్ ఏదో ఒకటి చేయాలని నిశ్చయించుకున్నాడు.

హంఫ్రీని పిలిచి "మన ఆఫీసుతో క్షాళన మొదలుపెడదాం. అసలు మన శాఖలో ఎంతమంది పనిచేస్తున్నారు?" అని అడిగాడు.

హంఫ్రీ జవాబు దాటవేస్తూ "అబ్బే, ఎక్కువమంది లేరు, మనది చిన్న శాఖ.." అన్నాడు.

"అదే, ఎంతమంది అని.. రెండు వేలా, మూడు వేలా?"

"రమారమి 23 వేల మంది.."

జిమ్ తెల్లబోయాడు. ఇతర శాఖల పనితీరును పర్యవేక్షించవలసిన యీ శాఖలో యింతమందా? "మనం ఒక అధ్యయనం చేసి ఎంతమంది అక్కరలేదో తేల్చాలి."

"గత ఏడాది అలాటి అధ్యయనం చేశాం. ఇంకో ఐదు వందల మంది కావాలని తేలింది. మీరు తగ్గించాలని గట్టిగా అనుకుంటే మీరు కొత్తగా ప్రారంభించిన బ్యూరోక్రాటిక్ వాచ్‌డాగ్ డిపార్టుమెంటు మూసేయచ్చు. దానిలో నాలుగు వందలమంది వున్నారు." అన్నాడు హంఫ్రీ.

జిమ్ ఎన్నికలలో చేసిన వాగ్దానానికి అనుగుణంగా ఆ డిపార్టుమెంటు ప్రారంభించాడు. ప్రభుత్వపు పనితీరుపై, అధికారుల వ్యవహారసరళిపై , ప్రభుత్వం చేస్తున్న వ్యర్థా వ్యయంపై ఫిర్యాదులు చేద్దామనుకుంటే ఆ శాఖకు చెప్పుకోవచ్చు. వారు సదరు అధికారిని పిలిచి నిజానిజాలు నిగ్గతీస్తారు. దానిలో సిబ్బంది ప్రభుత్వోద్యోగులే అయినా నడిపేది ప్రజల తరఫున విద్యాధికులు, సమాజసేవకులు. దానికి ప్రజల నుంచి మెప్పు వచ్చింది కానీ అధికారగణం నుంచి వ్యతిరేకత వచ్చింది. హంఫ్రీ దానిపై పగబట్టి వున్నాడు. కానీ జిమ్ ఆ సూచన ఒప్పుకోలేదు. తను వచ్చిన దగ్గర్నుంచి చేసినదేమైనా వుందా అంటే అదొక్కటే. మూసేస్తే తక్కినవారి మాట ఎలా వున్నా ఫ్రాంక్ విరుచుకుపడతాడు – నువ్వు బ్యూరోక్రాట్ల మాయలో పడిపోయావు అంటాడు.

హంఫ్రీ దీర్ఘాలోచనలో పడినట్లు నటించి "టీ సప్లయి చేసే అమ్మాయిలిద్దర్ని తీసేయవచ్చు." అన్నాడు.

జిమ్‌కు ఒళ్లు మండిపోయింది. "అసలిక్కడ ఎంతమంది పనిచేస్తున్నారు? వాళ్లేం చేస్తున్నారు? మన అజమాయిషీలో వున్న ఆఫీసులు ఏ యే బిల్డింగుల్లో వున్నాయి? అక్కడ ఎంతమంది వున్నారు, ఏం చేస్తున్నారు? ఈ ప్రశ్నలకు నాకు సమాధానాలు కావాలి. మన యిల్లు చక్కబెట్టుకున్నాక యితర శాఖలపై పడదాం." అని చెప్పాడు. వస్తున్న కోపాన్ని అణచుకుంటూ హంఫ్రీ చెప్పాడు – "పార్లమెంటు చట్టాలు చేస్తూన్నంతకాలం దాన్ని అమలు చేయడానికి అధికారులు, సిబ్బంది వుండాలి. వాళ్లను చట్టాలు చేయడం ఆపేయమనండి. మనమూ సిబ్బంది తగ్గించేయవచ్చు." అని. జిమ్ వినదలచుకోలేదు. "జరగని పనుల గురించి మాట్లాడవద్దు. పాత అధ్యయనం మనకు పనికి రాదు. కొత్తగా మళ్లీ చేపట్టండి. నేనడిగిన సమాచారం తీసుకురండి. అప్పుడు పరిష్కారమేమిటో నేనే చెప్తాను." అన్నాడు.

అతను వెళ్లిపోయాక ఫ్రాంక్ జిమ్‌తో "నీకు తెలుసా? వాయువ్య ప్రాంతపు కంట్రోలర్ వాళ్ల రీజియన్‌కు కేటాయించిన బజెట్‌లో గత ఏడాది కంటె యీ ఏడాది 32 మిలియన్ పౌండ్ల ఖర్చు తగ్గించాడు. ఆ విషయం బయటకు వస్తే తమ ప్రాంతాల్లో కూడా పొదుపు చేయమని అని మంత్రులు అంటారని సివిల్ సర్వీసెస్ వారు ఆ సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు." అని చెప్పాడు. హంఫ్రీని అడిగితే అస్సలు చెప్పడని బెర్నార్డ్‌ని పిలిచి అడిగాడు జిమ్. బెర్నార్డ్ 'ఈ మాట నేను నిర్ఘాంతపోతున్నాను. ఎవరినైనా వాకబు చేసి అవునో కాదో చెప్తాను' అన్నాడు.

రెండు రోజులు పోయాక అతను హంఫ్రీ దగ్గరకు వెళ్లి అడిగాడు. హంఫ్రీ 'నేనూ నిర్ఘాంతపోతున్నాను – యీ విషయం బయటకి ఎలా పొక్కిందాని' అన్నాడు. తర్వాత బెర్నార్డ్‌కు హితోపదేశం చేశాడు. 'అసలు ఆ నార్త్‌వెస్ట్ కంట్రోలరును పొదుపు చేయమని ఎవడడిగాడు? ఇక అందరూ యిదే మొదలుపెడితే? స్టాఫ్‌ను తగ్గించేస్తారు. అసలు ఏదైనా శాఖ ముఖ్యమైనది కాదు అనడానికి కొలబద్ద ఏమిటి? వ్యాపారసంస్థ పెద్దదో చిన్నదో తెలుసుకోవాలంటే దాని టర్నోవరు చూడాలి. శాఖ విషయంలో అయితే ఎంతమంది స్టాఫ్ వున్నారన్నదాని బట్టి దాని విలువ తెలుస్తుంది. మనం పనిచేసే శాఖలో సిబ్బంది తగ్గిపోతే మనకు పరువేమైనా మిగుల్తుందా? పొదుపు చేసి మన పరపతిని మనమే పాతిపెడతామా?' అని.

'మంత్రిగారు పొదుపు చేయాలని మహా పట్టుదలతో వున్నాడే' అన్నాడు బెర్నార్డ్.

'చూడు ఏదైనా శాఖలో మంత్రి వుండే సమయం సగటున పదకొండు నెలలు. బాగా పనిచేస్తే యింకో పెద్ద శాఖకు వెళతాడు, చేయకపోతే చిన్న శాఖకు వెళతాడు, ఒకే చోట పాతుకుపోడు. మనమైతే శాఖను అంటిపెట్టుకుని వుంటాం. నాలుగురోజులుండి పోయే మంత్రి ప్రతిదానికి కంగారు పడి ఏమేమో అంటాడు. అతను కంగారు పడకుండా ఎప్పటిలాగ బండి నడుపుకుని పోవాలి. రాజకీయనాయకుడు ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూన్నట్లు కనబడాలి. చురుగ్గా వుండడమే విజయం సాధించడం అనే భ్రమలో వుంటారు వాళ్లు. అందువలన వాళ్ల చేత ముందుకీ వెనక్కీ నాలుగు అడుగులు వేయించి, గుండ్రంగా తిప్పి ఎక్కడున్నారో అక్కడికే

మళ్లీ తీసుకురావాలి. ఏదో ఒకటి చేసిన తృప్తి వాళ్లకు దక్కుతుంది.'

'మరి అవతలివాళ్లు పొదుపు ఎలా చేశారని మంత్రి అడిగితే ఏం చెప్పమంటారు?'

'వాళ్లు ఎక్కవుంటింగ్ సిస్టమ్ మార్చేశారని చెప్పు, లేదా ఆ ప్రాంతపు సరిహద్దులు గత ఏడాదికి, యీ ఏడాదికి మారిపోయాయని అందువలన గత ఏడాది అంకెలతో పోల్చడం కుదరదని చెప్పు, లేదా గత ఏడాది రావలసిన బాకీలు యీ ఏడాది వచ్చాయని చెప్పు, లేదా యీ ఏడాది చెల్లింపులను వచ్చే ఏడాదికి వాయిదా వేశారని చెప్పు, లేదా కేటాయించిన పెద్ద ప్రాజెక్టు కాన్సిల్ కావడం వలన దానికై వుంచిన నిధులు మిగిలిపోయాయని చెప్పు..' అంటూ పలు మార్గాలు సూచించి పంపేశాడు.

అతను వెళ్లిపోయిన తర్వాత హంఫ్రీ ఆలోచనలో పడ్డాడు. జిమ్‌కు యీ సమాచారం ఫ్రాంక్ ద్వారానే అంది వుంటుందని, అతని మీద కన్నేయాలని నిశ్చయించుకున్నాడు. అందుకని అతనికి అఫీషియల్ కారు కేటాయించాడు. తమకు నచ్చనివారి గురించి సమాచారం సేకరించడానికి కారు డ్రైవరు చాలా వుపయోగపడతాడు. ఎందుకంటే బ్యాక్‌సీటులో కూర్చుని వాదోపవాదాలు చేసుకునేవారు ముందు సీటులో వున్న డ్రైవరు ఒక మనిషని, అతనికి చెవులుంటాయని మర్చిపోతారు. ముఖ్యమైన ఫైళ్లు కార్లో మర్చిపోతూ వుంటారు. అవన్నీ డ్రైవరు వీళ్లకు చెపుతూ వుంటాడు. పైగా అవతలివాడు ఎక్కడెక్కడికి వెళ్లాడో పూస గుచ్చినట్లు రాసి యిస్తాడు, పెట్రోలుకి లెక్క చెప్పాలి కాబట్టి! కారు ఎలాట్ చేసినందుకు ఫ్రాంక్ సంతోషించాడు.

జిమ్ చేస్తున్న హడావుడి ఫారిన్ అండ్ కామన్‌వెల్త్ ఆఫీసులో పర్మనెంట్ సెక్రటరీగా వున్న ఫ్రెడరిక్ స్టీవార్ట్ చెవికి చేరింది. 'ఏమిటి హంఫ్రీ, మీ మంత్రిగారు పొదుపుపొదుపు అంటూ ఏదో సందడి చేస్తున్నాడట, మీరంతా ఏం చేస్తున్నారు?' అని ఓ మెమో పంపాడు. ఇవి అఫీషియల్‌వి కావు, వ్యక్తిగతమైనవి. 'ఇప్పటిదాకా తలపెట్టిన పొదుపు కార్యక్రమాల్లాగానే యిదీ నడుస్తుందని అనుకుంటున్నాను. త్వరలోనే పరిస్థితి కుదుటబడవచ్చు' అని హంఫ్రీ జవాబిచ్చాడు. 'పరిస్థితులు వాటంతట అవే చక్కబడవు. స్వయంగా అమలు చేసి చూపమంటే మార్గం సుగమమౌతుంది' అని ఫ్రెడరిక్ సలహా యిచ్చాడు. మంత్రిగారికి బుద్ధి వచ్చేట్లా ఎలా చేయాలో హంఫ్రీకి బోధపడింది.

డిసెంబరు 15 న జిమ్ శాఖలో సమావేశం జరిగింది. అప్పటికి రెండు వారాలుగా ఫ్రాంక్ ఊరంతా చెడతిరిగేసి, బోల్డు సమాచారం మోసుకొచ్చాడు. అది పెట్టుకుని హంఫ్రీ తాట తీద్దామని ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నాడు. సమావేశం మొదట్లోనే జిమ్ "మన డిపార్టుమెంటులోనే పొదుపు చేయడానికి ఎంతో ఆస్కారం వుందని మా అధ్యయనంలో తేలింది." అన్నాడు హంఫ్రీ కేసి సూటిగా చూస్తూ. హంఫ్రీ ఆందోళన కనబరచాడు. జిమ్ విజయగర్వంతో "ముందుగా బిల్డింగుల సంగతి చూద్దాం. ...చాడ్విక్ హౌస్.." అని మొదలుపెట్టాడు.

"పేద్ద బిల్డింగు, ఉద్యోగులు చూడబోతే గుప్పెడు.." అన్నాడు ఫ్రాంక్.

"ప్రస్తుతానికి చాలా ఖాళీగా వున్నమాట నిజమే. కానీ కొత్తగా పెట్టబోయే ఎన్వైర్‌మెంట్ కమిషన్‌కు అక్కడే చోటు చూపిద్దామనుకుంటున్నాం. అప్పుడు అది సరిపోతుందో లేదోని భయంగా వుంది." అన్నాడు హంఫ్రీ.

అలాగే లేడీస్మిత్ బిల్డింగ్ ఖాళీగా వుందని ఒప్పుకుంటూనే అది దేశరక్షణకు సంబంధించిన వ్యవహారం కాబట్టి మాట్లాడనన్నాడు. వెల్లింగ్టన్ హౌస్‌లో బీరువాలు తప్ప స్టాఫ్ ఎక్కువగా లేరన్నదానికి ఫైర్ ఎస్కేప్ లేదన్న కారణంగా ఉన్న స్టాఫ్‌కు మించి ఎక్కువమందిని అక్కడకు తరలించడం ప్రమాదకరం అన్నాడు. "అగ్నిప్రమాదం జరిగితే పారిపోయే అవకాశం లేనివిధంగా కట్టిన బిల్డింగుకు మరమ్మత్తులు చేసి, ఆ ఏర్పాటు చేయవచ్చు కదా" అని జిమ్ అడిగితే "అది లిస్టెడ్ బిల్డింగ్. ఏదైనా మార్పులు చేయడానికి పర్యావరణ చట్టం ఒప్పుకోదు' అన్నాడు. "పోనీ అమ్మేస్తే..?" అంటే "ఎవరూ కొనుక్కోరు" అన్నాడు. మరో బిల్డింగ్ పేరు చెపితే 'దాన్ని బిల్డింగ్ పర్మిషన్ తీసుకోకుండా కట్టారు, అదీ ఎవరు కొనరు' అన్నాడు.

ఏ బిల్డింగ్ పేరు చెప్పినా ఠక్కుఠక్కున హంఫ్రీ దాని గురించిన సమాచారం వల్లిస్తూండడంతో ఫ్రాంక్‌కు అనుమానం వచ్చేసింది. "నేను ఎక్కడెక్కడికి వెళ్లి ఏయే బిల్డింగులను పరీక్షించి వచ్చానో యీయనకు తెలుసు." అని అరిచాడు.

హంఫ్రీ నిర్మొగమాటంగా ఒప్పుకున్నాడు. "నిజమే, ఏం? ఈయనేమైనా గూఢచర్యం చేస్తున్నాడా? మేం తెలుసుకోకూడదా? పైగా జిమ్‌గారి ఆదర్శం పాలనలో పారదర్శకత కదా" అని అడిగాడు.

జిమ్ ఏమీ అనలేక "సరే మాన్‌పవర్ విషయంలో జరుగుతున్న వ్యర్థావ్యయం గురించి చూద్దాం. సండర్‌లాండ్‌లో వున్న 90 మంది ఉద్యోగులు వైట్‌హాల్‌లో వున్న 90 మంది ఉద్యోగుల పనే చేస్తున్నారు. ఈ డూప్లికేషన్ వేస్టు." అన్నాడు.

హంఫ్రీ నిస్సంకోచంగా ఒప్పుకున్నాడు. "కానీ అది మంత్రివర్గ నిర్ణయం. ఈశాన్యప్రాంతాల్లో ఉద్యోగాలకల్పన పథకంలో భాగంగా యిచ్చారు."

హంఫ్రీ ఒప్పుకోవడంతో జిమ్ ఉత్సాహంగా "అది పాత కాబినెట్ నిర్ణయం. మనం ఒక్క స్ట్రోక్‌తో 90 ఉద్యోగాలు తీసేద్దాం" అని అరిచాడు.

"..ఒక్క స్ట్రయిక్‌తో అంటే కరక్టుగా వుంటుందేమో" అని సవరించాడు హంఫ్రీ.

"అదేం?" తెల్లబోయాడు జిమ్.

"ఒక వెనకబడిన ప్రాంతంలో, రాజకీయంగా సున్నితమైన నియోజకవర్గంలో ఉద్యోగకల్పన పథకం కింద యిచ్చిన ఉద్యోగాలను

వెనక్కి లాక్కుంటే సమ్మె ఖాయం. దాన్ని ఎదుర్కోవాలంటే చాలా ధైర్యమే వుండాలి." అని హంఫ్రీ వూరుకున్నాడు.

జిమ్‌కి ఏం చేయాలో పాలుపోలేదు. దాంతో కాస్సేపు మౌనం రాజ్యమేలింది. కాస్సేపు పోయాక హంఫ్రీ నెమ్మదిగా "మనం బిల్డింగుల వంటి భారీ వాటి గురించి ఆలోచించే బదులు చిన్నచిన్న ఖర్చులు తగ్గిస్తూ పోతే కనబడకుండానే చాలానే ఆదా అవుతుంది. ఉదాహరణకి, కార్లు, ఫర్నిచర్, వ్యక్తిగత సిబ్బంది, జిరాక్సు మెషిన్లు, ఎంటర్‌టైన్‌మెంట్.." అంటూ ఏదో గుర్తుకు తెచ్చుకుంటున్నట్లు ఒక్కొక్కటి ఉచ్చరించాడు.

జిమ్‌కు ఉత్సాహం తిరిగి వచ్చింది. "ఇదేదో బాగున్నట్లుంది." అని ప్రోత్సహించాడు.

"కానీ మనం ఆచరించి చూపకుండా యితరులను ఆదా చేయమంటే బాగుండదేమో" అని హంఫ్రీ సందేహించాడు.

జిమ్ గాలానికి చిక్కుకున్నాడు. "మనమే చేసి చూపిద్దాం. రేపణ్నుంచి నాకు కారు వద్దు, డ్రైవర్ని కూడా తీసేయండి. మన ఆఫీసులో స్టాఫ్ సగానికి సగం మందిని తీసేయండి." అని ఆదేశాలు జారీ చేసేశాడు.

హంఫ్రీ మెచ్చుకోలుగా చూశాడు. "మీ చిత్తశుద్ధికి జోహారు. తక్కినవాటి మాట ఎలా వున్నా దీనికి చాలా పబ్లిసిటీ వస్తుంది. 'ఆచరించి ప్రవచిస్తున్న జిమ్' అనే కాప్షన్‌తో పేపర్లో హెడ్‌లైన్స్ కూడా రావచ్చు." అన్నాడు.

ఆచరణకు వచ్చేసరికి ఆదా చేయడంలో కష్టాలు జిమ్‌కు తెలిసి వచ్చాయి. కారు వద్దన్నాడు కాబట్టి రైలు పట్టుకుని ఎప్పుడో అర్ధరాత్రి యిల్లు చేరాడు. టాక్సీ కోసం ప్రయత్నించాడు కానీ వర్షం వలన ఏదీ దొరకలేదు. చదవడానికి యిచ్చిన మూడు ఎఱ్ఱ బాక్సులు మోసుకుని ట్యూబ్‌లో ఎక్కడం కష్టమై పోయింది. రెండు రైళ్లు మిస్సయితే కానీ ఏదీ దొరకలేదు. ఇల్లు చేరేటప్పటికి చచ్చేచావైంది. భార్య పడుక్కుని నిద్రపోతోంది. ఆలస్యం ఎందుకైందో చెప్తో మండిపడింది. "ఈ సౌఖ్యాల కోసం 20 ఏళ్లపాటు కలవరించి, అవి చేతికి అందినప్పుడు యీ తిక్క వేషాలేమిటి? మంత్రి అయితే ట్యూబ్‌లో వస్తున్నారు. కొంపదేసి రేపు ప్రధాని అయినప్పుడు ఏం చేస్తారు? ఎవణ్ణయినా లిఫ్ట్ అడిగి వస్తారా?" అని దులిపేసింది.

కారు లేకపోతే కష్టాల మాట ఎలా వున్నా ఆఫీసులో సిబ్బంది సగానికి సగం తగ్గించేయడంతో పెద్ద ఉపద్రవం వచ్చిపడింది. ఒక్కోళ్లు రెండేసి బాధ్యతలు ఒకేసారి చేయవలసి వస్తోంది. జిమ్ ఎపాయింట్‌మెంట్స్ చూడవలసిన బెర్నార్డ్ ఓ రోజు వేరే చోటకి వెళ్లవలసి వచ్చింది. ఆ సమయంలో నార్త్ ఈస్ట్ ప్రాంతపు మ్యాన్‌పవర్ ప్లానింగ్ శాఖకు చెందిన మ్యాక్ అనే అధికారి ఎపాయింట్‌మెంట్ తీసుకున్నాడు. అతనూ పొదుపు చర్యల్లో భాగంగా రైలు ఎక్కబోయి, అది మిస్సయి, ఎపాయింట్‌మెంట్ టైముకి రాలేకపోయాడు.

సరిగ్గా అదే సమయానికి రాన్ వాట్సన్ అనే అతను ఎపాయింట్‌మెంట్ లేకుండా వచ్చాడు. బెర్నార్డ్ అయితే వచ్చినవాడు మ్యాక్ కాదని గుర్తించగలిగేవాడు. కానీ అతను ఎపాయింట్‌మెంట్లు చూసే పని టైపిస్టుకి అప్పగించి వెళ్లిపోయాడు. టైపిస్టుకి అతనెవరో తెలియదు కాబట్టి ఎపాయింట్‌మెంట్ అడిగినవాడు యితనే అయి వుంటాడనుకుని వాట్సన్‌ను లోపలకి పంపించేసింది. జిమ్ అంతకుముందు మ్యాక్‌ను చూడకపోవడం చేత వచ్చినవాడు మ్యాన్‌పవర్ ప్లానింగ్ మనిషే అనుకుని ఉత్సాహంగా 'సిబ్బంది తగ్గించేందుకు నేను కొన్ని ఉపాయాలు చెప్తాను, విను' అంటూ చెప్పుకుపోసాగాడు.

అయితే వచ్చిన వాట్సన్ 'సివిల్ సర్వీసెస్ ట్రాన్స్‌పోర్టు అండ్ అసోసియేటెడ్ గవర్నమెంట్ వర్కర్స్ యూనియన్'కు జనరల్ సెక్రటరీ. జిమ్ శాఖలో డ్రైవర్లను తీసివేయడం గురించి నిరసన తెలపడానికి వచ్చాడు. కానీ అతను నోరెత్తకుండానే జిమ్ తను యింకా ఎంతమంది డ్రైవర్లను తీసేయబోతున్నాడో చెప్పసాగాడు. ఈ ముక్క యూనియన్ వాళ్లకు పొక్కకుండా చూడమన్నాడు.

అంతా విని వాట్సన్ 'మరి యూనియన్ వాళ్లతో చర్చించకుండానే యింత తీవ్రమైన చర్యలు చేపడతారా?' అని అడిగాడు.

'చర్చలు జరుపుతాం. జస్ట్ కంటితుడుపుకే. ఉత్తుత్తినే. నీకు తెలుసుకదా యూనియన్ లీడర్లవి మట్టిబుర్రలు, ఆవేశం తప్ప ఆలోచన వుండదు. మన ఉద్దేశాలు పసిగట్టలేరు." అంటూ యింకా అవాకులు చవాకులు మాట్లాడాడు.

"మరి డ్రైవర్ల మాటేమిటి?" అడిగాడు వాట్సన్.

"అందరి కంటె ముందు పీకేసేది వాళ్లనే! ఇప్పటికే సగం పీకేశాం. కార్లు, డ్రైవర్ల మీద ఎంత తగలేస్తున్నామో తెలుసా?" అన్నాడు జిమ్.

ఆ దశలో వాట్సన్ చెప్పాడు – తనెవరో! "డ్రైవర్లను తీసేస్తారన్న పుకారు ఎంతవరకు నిజమో కనుక్కుందామని వచ్చాను. మీరు కావలసినదాని కంటె ఎక్కువ సమాచారమే యిచ్చారు" అని వెళ్లిపోయాడు.

వెళ్లి ఓ పత్రికకు యింటర్వ్యూ యిచ్చి యిదంతా బయటపెట్టాడు. వెంటనే డ్రైవర్ల సమ్మె ప్రారంభమైంది.

క్రిస్‌మస్ నాడు ఫ్రెంచ్ ఎంబసీలో పార్టీకి భార్యను తీసుకెళ్లవలసిన జిమ్‌కు యీ సమ్మెతో మహా అవస్థ వచ్చిపడింది. భార్య

కారుకి మరమ్మత్తు చేయించవలసి వుంది. కానీ దానికి టైము లేదు. ఏదో కాస్త రిపేరు చేసి యిద్దరూ బయలు దేరారు. దారిలో విపరీతమైన ట్రాఫిక్. కుండపోతగా వర్షం. కారు ఆగిపోయింది. జిమ్ దిగి మరమ్మత్తు చేయబోయాడు. భార్యకు ఒళ్లు మండిపోయింది. 'నువ్వూ నీ పొదుపూ' అని తిట్టి, ఉన్న ఒక్క గొడుగూ తను వేసుకుని పార్టీకి వెళ్లి పోయింది. కారుతో తంటాలు పడి, ఎలాగోలా స్టార్ట్ చేయించుకుని జిమ్ పార్టీకి లేటుగా చేరాడు – అదీ తడిసి ముద్దయి!

విపరీతంగా తడిసిపోవడంతో కాస్త వేడిగా వుంటుందని షాంపేన్ కాస్త బాగానే పుచ్చుకున్నాడు. పార్టీ తర్వాత బయటకు వచ్చి కోటు జేబులోంచి కారు తాళంచెవులు తీస్తూంటే జారి పక్కన మురికినీరు పోయే చట్రం ద్వారా లోపల పడిపోయింది. ఇక తప్పక బోర్లా పడుక్కుని దానిలోంచి తాళం చెవికోసం వెతకసాగాడు. సరిగ్గా అదే సమయంలో ఒక ప్రెస్ ఫోటోగ్రాఫరు టక్కున ఫోటో తీసేసి మర్నాటి పేపర్లో వేసేశాడు – పైన 'మిస్టర్ ఎకానమీ ఫాల్స్ డౌన్ యిన్ గట్టర్ ఆఫ్టర్ షాంపేన్ పార్టీ' (మందు పార్టీ తర్వాత మురికిగుంటలో పడ్డ పొదుపుశ్రీ) అని శీర్షిక పెట్టాడు.

మర్నాటి పేపర్లో యిది చూసి బెంగ పెట్టుకున్న జిమ్‌కు యింకో పేపర్లో మరో వార్త చూసి యింకా బెంగపడ్డాడు. ''హ్యాకర్ తన శాఖలో 400 మంది కొత్త ఉద్యోగులను వేసుకుంటున్నాడు' అనే వార్త అది. అది డ్రైవర్లను మరీ మండించింది. ఆదా పేర ఓ పక్క మమ్మల్ని బయటకు పంపేస్తూ కొత్తవాళ్లని ఎలా వేసుకుంటున్నారు? అని వాళ్లు ప్రశ్నలు సంధించారు. జిమ్ ఆఫీసుకి వస్తూనే హంఫ్రీని పిలిచి 'ఈ నాలుగు వందలమందిని ఎవరు వేశారు?' అని అడిగాడు.

హంఫ్రీ అమాయకంగా మొహం పెట్టి 'మీ ఆదేశాల మేరకే వేశామండి' అన్నాడు.

'నేనెక్కడ చెప్పాను?'

'ఆదా చేసే విధానాలపై అధ్యయనం చేయించమన్నారు కదా, చేయడానికి మనుష్యులు కావద్దా?'

అప్పటికే రకరకాలుగా మతి పోయి వున్న జిమ్‌కి మరీ మతిపోయింది. 'ఇప్పుడేం చేద్దామంటావ్? అని అడిగాడు.

''మీరు పొదుపు కార్యక్రమాన్ని వాయిదా వేసుకుని, అధ్యయనం మాట ఎత్తకపోతే యీ నాలుగు వందల వుద్యోగాలూ ఆదా చేయవచ్చు. ఆ వాచ్‌డాగ్ డిపార్టుమెంటు మూసేస్తే యింకో నాలుగు వందల మందిని యింటికి పంపవచ్చు. మన శాఖలో మొత్తం 800 మందిని తగ్గించి పొదుపు చేసినట్లు రేపు పేపర్లో వచ్చేట్లు చూడవచ్చు.''

ఉద్యోగాలు వేయకుండానే తీసేసి, పొదుపు చేసినట్లు చెప్పుకోవడమా? అని జిమ్ సంకోచించలేదు. అలాగే చేద్దాం అంటూనే 'నా అత్మతృప్తికి నిజంగా కొంతైనా ఆదా చేయాలి' అన్నాడు కాస్త ప్రాధేయపడుతున్న స్వరంతో.

హంఫ్రీ చాలా ఉదారంగా ''టీలు అందించే ఒకళ్లిద్దరు అమ్మాయిలను తీసేయవచ్చు, మినిస్టర్'' అన్నాడు. (నాల్గవ కథ సమాప్తం)
ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)

ఆగస్టు

ఎమ్బీయస్ : గిరిజన బాలికల తరలింపు

ప్రభుత్వ సాయం అందని గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం పేరుతో క్రైస్తవ మిషనరీలు శతాబ్దాలుగా చొచ్చుకుపోయి వారిని క్రైస్తవంలోకి మారుస్తూండడం జరుగుతోంది. దానికి ప్రతిగా ఆరెస్సెస్ తన అనుబంధ సంస్థల ద్వారా గత కొన్ని దశాబ్దాలుగా ఆ ప్రాంతాల్లో స్కూళ్లను ఏర్పరచి, సహాయ కార్యక్రమాలను నిర్వహించి గిరిజనులను ఆకట్టుకుని వారిని హిందూత్వ శక్తులుగా మారుస్తోంది. ఇద్దరి మధ్య పోటీ పెరిగినకొద్దీ కొంతమందిని చిన్నవయసులోనే కుటుంబాలకు దూరంగా తీసుకుపోయి, వారిని సుశిక్షితులైన మత వాలంటీర్లగా మార్చడానికి చూస్తున్నారు. అసాం, మణిపూర్ నుంచి 76 మంది బాలబాలికలను క్రైస్తవ మిషనరీలు తమిళనాడుకు తీసుకుని పోయి క్రైస్తవులు నడిపే అనాథాశ్రమాలలో చేర్చడంతో విచారణ జరిగింది. కేసు పెట్టారు. దానిపై సుప్రీం కోర్టు 2010 సెప్టెంబరు 1న తీర్పు చెప్పి అసాం, మణిపూర్ రాష్ట్రాల ప్రభుత్వాలు 12 ఏళ్ల లోపు పిల్లలను, వయసుతో సంబంధం లేకుండా ప్రైమరీ స్కూల్లో చదివే పిల్లలను యితర రాష్ట్రాలలో చదువుకై పంపకుండా చూడాలంది. ఈ తీర్పు వచ్చాక కూడా 2012–15 మధ్య చదువు పేర మీద అసాం నుంచే 5 వేల మంది పిల్లలను తీసుకుపోయారని ఒక అధ్యయనంలో తేలింది.

2015 జూన్ 9 న ఆసాంలోని 5 జిల్లాల నుంచి బోడో, సంతాల్ జాతులకు చెందిన 3 నుంచి 11 సంఎఎల వయసులో వున్న 31 మంది గిరిజన బాలికలను సంఘ్ పరివార్‌కు చెందిన రాష్ట్ర సేవికా సమితి, సేవాభారతి సంస్థల నాయకురాళ్లు కొరోబీ బసుమతారీ, సంధ్యాబెన్ తిక్‌డేలు పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలకు ఢిల్లీ ద్వారా తీసుకెళ్లడానికై పూర్వోత్తర్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలెక్కించారు. ఈ విషయాన్ని ఒక అజ్ఞాత వ్యక్తి 1098కు ఫోన్ చేసి కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వం కింద పనిచేసే చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్, ఢిల్లీ శాఖకు ఫోన్ ద్వారా తెలియపరిచాడు. సమాచారం అందగానే వారు రైల్వే పోలీసులు, క్రైమ్ బ్రాంచ్ సహాయంతో న్యూ ఢిల్లీలో పిల్లలను రక్షించి నాయకురాళ్లను పహాడ్‌గంజ్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. 2000 నాటి సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగానే కాక జువెనైల్ జస్టిస్ చట్టం (2000) ప్రకారం వుండవలసిన సర్టిఫికెట్లు లేవేమని నిలదీశారు.

ఆ చట్టప్రకారం దేశంలోని ప్రతి జిల్లా స్థాయిలో చైల్డ్ వెల్‌ఫేర్ కమిటీ (సిడబ్ల్యుసి)లు నెలకొల్పి వాటికి ఫస్ట్‌క్లాస్ జుడిషియల్ మెజిస్ట్రేట్ అధికారాలిచ్చారు. అనాథలైన లేదా తప్పిపోయి దొరికిన చిన్నపిల్లల విషయంలో వారి నేపథ్యాన్ని తెలుసుకుని, సమాచారం సేకరించి ఏ కుటుంబానికి అప్పగించాలి, వారి సంరక్షణకు ఏయే చర్యలు తీసుకోవాలి అనే విషయాల్లో వారి తీర్పులిచ్చే అధికారం కమిటీలదే. జిల్లాలోని చిన్నపిల్లలను తరలించాలంటే వారిని ఆ జిల్లా కమిటీల ముందు ప్రవేశపెట్టి, కమిటీల నుంచి నిరభ్యంతర పత్రం (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్టు) తీసుకోవాల్సి వుంది. కానీ యీ ఆపరేషన్‌లో పాలు పంచుకున్న రాష్ట్ర సేవికా సమితి, సేవాభారతి, విద్యాభారతి సంస్థలు అలాటిదేదీ చేయకపోవడం వలన చట్టవిరుద్ధ చర్య అయింది. ఆ విషయమై ఢిల్లీ పోలీసులు అడుగుతూండగానే మర్నాటి కల్లా సురేంద్రనగర్ సిడబ్ల్యుసి వారిని విడిచిపెట్టమని, 20 మంది పిల్లలను గుజరాత్‌కు, 11 మందిని పటియాలాకు పంపమని ఢిల్లీ పోలీసులకు ఆదేశమిచ్చింది. వారి ఆదేశాలను ఢిల్లీ పోలీసులు అమలు చేసేట్లా ఎవరు ఒత్తిడి చేశారో ప్రస్తుతానికి తెలియదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వారిని విడిచిపెట్టేసినా చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సుష్మా విజ్ ఢిల్లీలోని మయూర్ విహార్‌లోని చైల్డ్ వెల్‌ఫేర్ కమిటీకి విషయమంతా తెలియపరుస్తూ "అసాంలోని ఐదు జిల్లాల సిడబ్ల్యుసిల నుండి సమాచారం తెప్పించుకుని తగురీతిగా వ్యవహరించండి" అని రాశారు. అయితే వాళ్లూ ఉలుకూ, పలుకూ లేకుండా కూర్చున్నారు.

ఈ విషయం తమ దృష్టికి రాగానే అసాం స్టేట్ కమిషన్ ఫర్ ద ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ వారు జూన్ 16 న ఈ చట్టవిరుద్ధమైన తరలింపు (ఇది 'చైల్డ్ ట్రాఫికింగ్' అన్నారు వారు, నిజానికి అది చాలా పెద్ద పదం, నేరాలు చేయించడానికి పిల్లలను దొంగతనంగా రవాణా చేయడాన్ని ట్రాఫికింగ్‌గా వ్యవహరిస్తారు) గురించి ఏ చర్య తీసుకున్నారో ఐదు రోజుల్లో తెలపమని అసాం పోలీసులో సిఐడి విభాగంలో ఎడిజిపికి లేఖ రాశారు. దాని కాపీని నేషనల్ కమిషన్ ఫర్ ద ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్‌కి పంపారు. అసాం పోలీసు ఏ చర్యా తీసుకోలేదు. అదేమని నేషనల్ కమిషన్ అడగలేదు. కానీ కోక్రఝార్ జిల్లాలోని చైల్డ్ వెల్‌ఫేర్ కమిటీ (సిడబ్ల్యుసి) సభ్యులు ఆ 31 మంది బాలికల యిళ్లకు వెళ్లి వాకబులు చేయసాగారు. అందువలన కోక్రఝార్ సిడబ్ల్యుసి చైర్మన్ అయిన మలయా దేకా జూన్ 22న సురేంద్రనగర్ జిల్లా సిడబ్ల్యుసికి 'మీ జిల్లాలోని హల్వాడ్ పట్టణంలో వున్న సరస్వతీ శిశు మందిరంలోని అసాం పిల్లలను వెనక్కి పంపించే ఏర్పాట్లు చూడ'మని ఉత్తరం రాశారు. కానీ వారు ఉలకలేదు, పలకలేదు.

పిల్లల్లో 20 మందిని గుజరాత్‌లోని సురేంద్రనగర్‌కు తీసుకెళ్లారు. వారిని ఆ జిల్లా సిడబ్ల్యుసి ముందు ప్రదర్శించలేదు. కొండప్రాంతాల నుంచి వచ్చిన పిల్లలు పూర్తి భిన్నమైన గుజరాత్ యిసుక ప్రాంతాలలో ఎలా యిమడగలరో సిడబ్ల్యుసి అంచనా వేయనేలేదు. హల్వాడ్‌లోని విద్యాభారతి ట్రస్టుకు చెందిన సరస్వతీ శిశు మందిర్‌కు పంపమని ఆదేశాలు జారీ చేసింది. ఇదేదో ఘనకార్యం అన్నట్లు జూన్ 17 నాటి "గుజరాత్ సమాచార్"లో "అసాంలో యిటీవల వచ్చిన వరదల కారణంగా అనాథలైన 5 నుంచి 8 సంఎఎల లోపు 20 మంది ఆడపిల్లలను హల్వాడ్‌లోని సరస్వతీ శిశు మందిర్ ఆదుకుని తమ దగ్గర పెట్టుకుని విద్యాబుద్ధులు చెప్పించడానికి ముందుకు వచ్చింది. ఈ ఔదార్యం వలన గుజరాత్ ప్రతిష్ఠ మరింత పెరిగింది." అని వార్త వేయించారు కూడా. దాని ప్రకారం –వీరి ప్రచారం కోసం ఆ పిల్లల తలిదండ్రులను చంపేశారన్నమాట! ఈ వార్త వచ్చిన మర్నాడు అసాం స్టేట్ చైల్డ్ ప్రొటక్షన్ సొసైటీకి మెంబర్–సెక్రటరీగా వున్న కుదుమ్ కాలితా అనే ఐయేయస్ అధికారిణి కోక్రఝార్, గోసాల్‌గావ్ జిల్లాలలోని సిడబ్ల్యుసిలకు లేఖ రాస్తూ, '31 మంది పిల్లలను ఢిల్లీలో రక్షించినా, రాజకీయ శక్తుల జోక్యంతో వారిని గుజరాత్, పటియాలాలకు తరలించుకుపోయారని, సురేంద్రనగర్ సిడబ్ల్యుసి ఆదేశాలు జారీ చేయడానికి ముందు, పిల్లల స్వస్థలాలలో వున్న సిడబ్ల్యుసిలను సంప్రదించి వుండాలని, ఇప్పుడు పిల్లలు ఎక్కడున్నారో తెలిసింది కాబట్టి వారిని వెనక్కి రప్పించి, వారివారి తలిదండ్రులకు అప్పగించాలని' చెప్పింది. అసాంలోని సిడబ్ల్యుసిలన్నిటికీ యిదే విధమైన హెచ్చరిక చేసింది. ఆ లేఖ అందుకున్నాక కోక్రఝార్‌లోని సిడబ్ల్యుసి సురేంద్రనగర్ సిడబ్ల్యుసికి పిల్లలను వెనక్కి పంపివేయమని అడుగుతూ లేఖ రాసింది. సురేంద్రనగర్ సిడబ్ల్యుసి యిప్పటిదాకా సమాధానం యివ్వలేదు. సరి కదా, గుజరాత్ రాష్ట్రపు మహిళా, శిశు శాఖ మంత్రిణి వసుబెన్ త్రివేది సురేంద్రనగర్ సిడబ్ల్యుసి చేసిన పనిని హర్షించింది. హల్వాడ్ శిశు మందిర్ పిల్లలకు 'ఆశ్రయం' కల్పించి గుజరాత్ సంప్రదాయానికి వన్నె తెచ్చిందని ప్రకటించింది.

ఈ పిల్లలలో 20 మంది గుజరాత్‌కు చేరగా 11 మంది పటియాలాకు చేరారు. ఆరెస్సెస్ అనుబంధ సంస్థలు నడుపుతున్న మాతా గుజరీ కన్యా ఛాత్రవాస్ అనే చోట వాళ్లను వుంచారు. చైల్డ్‌లైన్ ఢిల్లీ వారి సూచన మేరకు పటియాలా చైల్డ్‌లైన్ శాఖ సభ్యులు, పటియాలా సిడబ్ల్యుసి సభ్యులతో కలిసి అక్కడకు వెళ్లి పిల్లలను చూడబోయారు. సొసైటీగా రిజిస్టర్ చేసిన ఆ సంస్థకు జువినైల్ జస్టిస్ యాక్ట్ కింద హాస్టల్‌గా అనుమతి లేదు. అక్కడ యీ 11 మందితో పాటు వున్న 20 మంది స్కూలుకి వెళుతున్నారు. మంచాలు లేవు, పరుపులు అధ్వాన్నంగా వున్నాయి. పిల్లలకు సంబంధించిన దస్తావేజులు చూపమంటే, ఏమీ చూపలేకపోయారు. ఇంకా లోతుగా విచారిస్తూ వుంటే ఆరెస్సెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. కమిటీ సభ్యుల్లో శిఖ్ఖు ఆయన గట్టిగా మాట్లాడుతూంటే సేవికా సమితి వాళు ్ల వచ్చి "నువ్వు హిందువువి కాదు కాబట్టి, యిలా చేస్తున్నావు" అంటూ నిందించారు.

దీని గురించి యింత రచ్చ జరిగాక సేవాభారతి, రాష్ట్ర సేవికా సమితి పిల్లల్ని వెనక్కి తెచ్చేసి చేతులు దులుపుకుంటే పోయేది. గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వం వుంది. పంజాబ్‌లో బిజెపి–అకాలీదళ్ ప్రభుత్వం వుంది. ప్రభుత్వం మద్దతు తమకుండడంతో యిలాటి నిరసనలు పట్టించుకోవడం అనవసరం అనుకుని వేరే మార్గం పట్టారు. ఆ పిల్లల తలిదండ్రుల నుంచి తమ యిష్టప్రకారమే పిల్లలను పంపామని అఫిడవిట్లు సంతకాలు చేయించి జులై 13 న నోటరీ వద్ద నోటిఫై చేయించి దగ్గర పెట్టుకున్నారు. ఇలా అఫిడవిట్లు

దాఖలు చేసే వీలు – పైగా పిల్లల్ని పంపేసిన నెల తర్వాత – చట్టంలో కల్పించలేదు. ఇంగ్లీషులో ఒకే రకమైన మేటరుతో వున్న యీ అఫిడవిట్లపై సంతకాలు చేసిన తలిదండ్రులెవరికీ యింగ్లీషు రాదు. వారిలో కొందరికి చదువే రాదు. వాటిలో రాసినదేమిటంటే – 'నేను రైతును. 2014 జనవరి 25 న జరిగిన కలహాల్లో మా యిల్లు నాశనమైంది. నేను శరణార్థి శిబిరంలో వుంటున్నాను. నాకు ఆదాయం లేదు. మా అమ్మాయి స్కూలు ఫీజు చెల్లించలేకపోతున్నాను. అందువలన నా యిష్టప్రకారం గుజరాత్‌లోని ఫలానా శిశు మందిరానికి చదువు నిమిత్తమై పంపిస్తున్నాను.' అని. విచారణలో తేలిందేమిటంటే – ఈ పిల్లల తలిదండ్రులెవరూ కలహాల బాధితులు కారు. ఎవరూ శరణార్థి శిబిరాల్లో లేరు. అందరికీ చిన్నదో, పెద్దదో యిల్లుంది, ఆదాయముంది. కొందరికి భూములు కూడా వున్నాయి. సేవాభారతి యిలా ఏదో గోల్‌మాల్ చేసి, ప్రభుత్వం మద్దతుతో వ్యవహారాన్ని అణగదొక్కి వుంచింది.

అయితే కోక్రఝార్ సిడబ్ల్యుసి వదిలిపెట్ట దలచుకోలేదు. 2016 ఫిబ్రవరిలో ఒక అధికారిని తలిదండ్రుల వద్దకు పంపి విచారించి యీ వాస్తవాలు పైకి లాగింది. తరలింపులో పాల్గొన్న కార్యకర్తలు విచారణ జరుపుతున్న అధికారులను బెదిరించారు. దాంతో మలయా దేకా దొంగ అఫిడవిట్లు యిప్పించినవారిపై, బెదిరించినవారిపై చర్య తీసుకోమని గువాహతి హైకోర్టుకు, కోక్రఝార్ జిల్లా జడ్జికి ఫిర్యాదు చేశారు. కానీ వారి నుంచి స్పందన కరువైంది. ఇక విసిగి వేసారి, వారు పత్రికల వాళ్లను పిలిచి కేసు పూర్వాపరాలు వాళ్లకు చెప్పేశారు. వాళ్లు మూణ్నెళ్లపాటు అన్ని చోట్లకూ వెళ్లి కూపీలు లాగి, పిల్లలు తరలి వెళ్లి ఏడాది దాటిన సందర్భంగా కథనాలు వేయసాగారు. పిల్లలను యిష్టపూర్వకంగా పంపిన తలిదండ్రులు యీ లోగా తము చేసినదానికి పశ్చాత్తాప పడుతున్నారు. ఎందుకంటే వాళ్ల పిల్లలు ఎక్కడున్నారో వాళ్లకు తెలియదు. చూడడానికి లేదు, ఫోన్‌లో మాట్లాడడానికి లేదు. వాళ్ల చదువు ఎలా సాగుతోందో వాళ్లకు ప్రోగ్రెసు రిపోర్టులు పంపినవారు లేరు. వీళ్లకు నచ్చచెప్పి తమ కూతుళ్లను కూడా తోడుగా పంపిన కార్యకర్తలు తమ పిల్లలతో ఫోన్లో మాట్లాడుతున్నాడు కానీ వీళ్లకు ఆ సౌకర్యం లేదు. అది వీళ్లలో కడుపుమంట కలిగించింది. మొదట్లో ఏడాది పాటే విడిగా వుంటుంది అని చెప్పి ఒప్పించారు. ఇప్పుడు నాలుగైదేళ్ల దాకా రాదంటున్నారు. ఎందుకు పంపామా అని వాళ్లు బాధపడుతున్న తరుణంలో పత్రికల వాళ్లు వెళ్లడంతో వాళ్లు నోళ్లు విప్పి అన్నీ చెప్పసాగారు. దాంతో సేవాభారతి వాళ్లు ఉలిక్కిపడ్డారు. తమ కార్యకర్తలను పంపించి, పిల్లల తాలూకు డాక్యుమెంట్లు, ఫోటోలు అన్నీ తమ వద్దకు తెప్పించేసుకున్నారు. ఎవరితో మాట్లాడడానికి వీల్లేదని కట్టడి చేశారు.

అయినా "ఔట్‌లుక్" పత్రిక తన ఆగస్టు 8 సంచికలో పూర్తి కథనం వేసింది. దానిపై బిజెపి వర్గాలు మండిపడ్డాయి. ఆ పత్రికను హిందూ వ్యతిరేకిగా తిట్టిపోశాయి. 'మేం చెప్పిన వాస్తవాలను ఖండించలేక పోయారు కదా' అని పత్రిక నిలదీస్తోంది. గతంలో క్రైస్తవ సంస్థలు కావచ్చు, యిప్పుడు హిందూ సంస్థలు కావచ్చు – ఆ పిల్లలను యిన్ని చట్టాలతిక్రమించి వేరే రాష్ట్రానికి తీసుకెళ్లే బదులు అసాంలోనే వుంచి తామనుకున్న శిక్షణ గరిపితే నష్టమేముందో మన కర్థం కాదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఆగస్టు 18, 19 **ఎమ్బీయస్ : అస్మదీయుడా? తస్మదీయుడా?**

యుపిఏ ప్రభుత్వ హయాంలో జరిగిన భారీస్థాయి అవినీతి చూసి వేసారిన భారతీయ ప్రజను మోదీ యిచ్చిన 'తినను, తిననివ్వను' స్లోగన్ విపరీతంగా ఆకర్షించింది. అది కేవల వాగ్దానంతో ఆగిపోదని, అమలు చేసి చూపిస్తాడని ఆశ పెట్టుకున్నారు. ఇప్పటిదాకా ఎన్‌డిఏ హయాంలో భారీ స్కామ్ ఏదీ బయటపడలేదన్నది వాస్తవం. అయితే అక్రమం జరగగానే వెంటనే బయటకు రావడం జరగదు. అలా జరిగి వుంటే యుపిఏ 2 అధికారంలోకి వచ్చేదే కాదు. అదానీ, అంబానీ వంటి వ్యాపారవేత్తలకు గతంలో కంటె ఎక్కువగా దోచి పెట్టడం సాగుతూనే వుంది. కొన్నేళ్లు పోయాక వివరాలన్నీ బయట పడినపుడే మోదీ పాలనపై సరైన అంచనా వస్తుంది. చేసినదాన్ని మించి ప్రచారం చేసుకోవడంలో, వాస్తవాలు కప్పిపుచ్చడంలో చంద్రబాబుకూ పాఠాలు చెప్పగల సత్తా మోదీకి వుంది.

పాలకులు ఏం చెప్పినా నిజానిజాలు మీడియా వెలికి తీస్తుందని మన బోటి అమాయకులం అనుకుంటూ వుంటాం. అవన్నీ గతకాలపు రోజులు. ఇప్పుడు అధికారంలో వున్న ప్రతివారు ఎడ్మినిస్ట్రేషన్ కంటె మీడియా మేనేజ్‌మెంట్‌లో దిట్టలై పోయారు. నయాన నచ్చచెప్తున్నారో, భయాన బెదిరిస్తున్నారో చెప్పలేం కానీ మీడియా చాలా పక్షపాత ధోరణిలో వ్యవహరిస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో వాస్తవం చెప్పవలసి వచ్చినా, దాన్ని మనం అవగాహన చేసుకోలేని రీతిలో, అంతరార్థం గ్రహించలేని తీరులో చెప్తున్నారు. అందువలన ఒకటికి నాలుగు పత్రికలు, ఆరు ఛానెల్స్ చదవాల్సి వస్తోంది, చూడాల్సి వస్తోంది. పైగా సరైన టైములో మీడియా నోరు విప్పదు. విషయం బయటకు వచ్చాక మాత్రం మసాలా వేసి, కవిత్వం రంగరించి అందిస్తుంది. ఉదాహరణకి నయీం వ్యవహారమే చూడండి. అతనిలాటివాడు, అలాటివాడు, వ్యవస్థ మొత్తాన్ని గుప్పిట్లో పెట్టుకున్నాడు, అందర్నీ శాసించాడు అని యిప్పుడు కథనాలు వండి వారుస్తూన్న మీడియా అతను బతికుండగా దీనిలో పదో శాతమైనా రాసిందా? నిజానికి యిప్పుడు నిర్జీవుడైన నయీం కంటె, సజీవంగా వున్న అతని వంటి అనేక మంది డాన్‌ల గురించి చెప్పాల్సి వుంది. అవేమీ చెప్పటం లేదు. జాతీయ వ్యవహారాల గురించి కూడా తెలుగు మీడియా చెప్పవలసినంత చెప్పటం లేదు. ప్రజలకు సమాచారం అందివ్వడం మీడియా ప్రధాన బాధ్యత. వాళ్ల అభిప్రాయాలను తీర్చిదిద్దే పని పెట్టుకోనక్కరలేదు. అందిన సమాచారంతో పాఠకుడు సొంత తెలివితేటలుపయోగించి ఒక అభిప్రాయాన్ని

ఏర్పరచుకోగలడు, అవసరమున్న చోట మార్చుకోగలడు.

అన్నా హజారే ఉద్యమం సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్ పేరు దేశమంతటా మారుమ్రోగింది. ప్రధాని పదవికి తగిన అభ్యర్థి అతనే అంటూ రాహుల్ గాంధీతో (ఇంకెవరూ దొరకనట్లు) అతన్ని పోల్చి చూపుతూ ఫార్వార్డ్‌లు వచ్చాయి. పోలిస్తే గీలిస్తే అప్పటి ప్రధాని మన్‌మోహన్‌తో పోల్చాలి కానీ బడుద్ధాయిగా, దేనిలోనూ ఆసక్తి లేని వ్యక్తిగా పేరుబడిన రాహుల్‌తో పోలికెందుకు? అప్పట్లో అరవింద్ కాంగ్రెసుకు వ్యతిరేకంగా పోరాడుతున్నాడు కాబట్టి, బిజెపి అన్నా ఉద్యమానికి మద్దతు యిస్తోంది కాబట్టి యివన్నీ చాలా ఉత్సాహంగా చదివారు నెటిజన్లు, మధ్యతరగతి జనాలు. పోనుపోను అరవింద్ బిజెపికి పోటీగా ఎదగసాగడంతో, ఢిల్లీలో గెలిచి మోదీకి చెవిలో జోరీగలా తయారవడంతో ఎవర్ని సమర్థించాలో తెలియక వాళ్లు గందరగోళ పడసాగారు. ఉన్నదున్నట్లు చెప్పుకోవాలంటే మోదీ అరవింద్‌పై వ్యక్తిగతంగా కక్ష సాధిస్తున్నట్లే కనబడుతోంది. లెఫ్టినెంటు గవర్నరు ద్వారా అతన్ని అదుపులో వుంచుతూ, అతని ప్రభుత్వానికి అవరోధాలు కల్పిస్తూ, అతని పార్టీ ఎమ్మెల్యేలను సతాయిస్తూ ఉక్కిరిబిక్కిరి చేయడానికి నిశ్చయించుకున్నాడు. అరవింద్ కూడా నోరు పారేసుకుంటూ, ప్రచారార్భాటం చేసుకుంటూ, తనపై జరుగుతున్న దాడిని భూతద్దంలో చూపుకుంటూ, 'ఇతను అప్పటి మేధావి ఉద్యమకారుడు కాదు, యింకో రాజకీయ నాయకుడు మాత్రమే' అని అందరూ అనుకునేట్లు ప్రవర్తిస్తున్నాడు. ఆప్ ఎమ్మెల్యేలపై డజన్ల కొద్దీ కేసులు బనాయిస్తున్నారు. వీట ఔచిత్యంపై వ్యాఖ్యానించడానికి నెటిజన్లు, యువత, టీవీ చర్చల్లో పాల్గొనే మేధావులు.. ఎవరూ ఆసక్తి చూపటం లేదు. అవే కేసులు కాంగ్రెసు ఎమ్మెల్యేలపై వేసి వుంటే ఎన్నో కార్టూన్లు, సెటైర్లు పేలి వుండేవి.

ఇంతకీ ఆప్ ఎమ్మెల్యేలపై వేసిన కేసులు ఎలాటివి? ముందుగా తెలుసుకోదగినది – యితరుల కంటె తాము భిన్నం అని ఆప్ ఎంత చెప్పుకున్నా, గతంలో బిజెపి లేదా కాంగ్రెసులో పనిచేసిన వారిలో చాలామందిని ఆప్ తీసుకుంది. వారిలో చాలామంది హిస్టరీ షీటర్సున్నారు. ఢిల్లీ పోలీసులు చెప్పేదాని ప్రకారం 67 మంది ఆప్ ఎమ్మెల్యేలలో 23 మందిపై 2015 అసెంబ్లీ ఎన్నికలకు ముందే క్రిమినల్ చార్జెస్ వున్నాయి. అరవింద్‌తో కొంతకాలం పనిచేసి తర్వాత విభేదించి విడిగా వెళ్లిన యోగేంద్ర యాదవ్, ప్రశాంత్ భూషణ్‌లు 'శరద్ చౌహాన్, అమానతుల్లా ఖాన్ వంటి అనేక మందిని తీసుకోవద్దని మేం అరవింద్‌ను ముందే హెచ్చరించాం. కానీ అతను వినలేదు' అంటున్నారు. ఆత్మహత్యకు ప్రోద్బలం చేసిన (ఎబెటింగ్ సూసైడ్) కేసుపై శరద్ చౌహాన్‌ను జులై 31 న అరెస్టు చేశారు. సోనీ అనే ఆప్ మహిళా కార్యకర్త తనను సాటి ఆప్ కార్యకర్త లైంగికంగా వేధిస్తున్నాడని శరద్ వద్ద ఫిర్యాదు చేసింది. అయినా అతను ఆమెను గోడు పట్టించుకోకుండా ఆరోపితుణ్నే సమర్థించాడట. ఆమె ఆత్మహత్య చేసుకుంది. 'నువ్వు తగిన చర్య తీసుకోకుండా ఆమెను ఆత్మహత్య చేసుకునేట్లు చేశావు' అంటూ పోలీసులు యితనిపై కేసు పెట్టారు. అంతకు 8 రోజుల క్రితం అమానతుల్లా ఖాన్‌పై కేసు పెట్టిన కేసు – హత్యాయత్నం, బెదిరింపు, బలాత్కారం!

ఎవరైనా మహిళ నన్ను ఆప్ ఎమ్మెల్యే లైంగికంగా వేధించాడు అని ఫిర్యాదు చేస్తే చాలు, ఆధారాలు చూపకపోయినా పోలీసులు వెంటనే అరెస్టు చేసేస్తున్నారు. జులై 9 న అరెస్టయిన ప్రకాశ్ జర్వాల్, జూన్ 25 న అరెస్టయిన దినేశ్ మొహానియా కూడా యిలాటి కేసులను ఎదుర్కుంటున్నారు. దినేశ్‌పై సీనియర్ సిటిజన్‌ను కొట్టినట్లు అభియోగం. సరైన ఆధారాలు చూపకపోవడంతో వీళ్లందరికీ బెయిలు లభిస్తోంది. అమానతుల్లా ఖాన్ కేసులో కూడా 'మీరు చూపుతున్న సాక్ష్యం సరిగ్గా లేదు' అని కోర్టు పోలీసులతో వ్యాఖ్యానించింది. అతనిపై ఫిర్యాదు చేసినామె 'పోలీసుల ఒత్తిడికి లొంగి నేను అతన్ని బెదిరింపు కేసులో యిరికించాను' అని వీడియోలో చెప్పింది. ఆమె అలా చెప్పినా పోలీసులు కేసు కొనసాగించి కోర్టుచేత అక్షింతలు వేయించుకున్నారు. సురేందర్ సింగ్ కేసు విషయంలో 'మీరు చేస్తున్న అభియోగానికి, మోపిన సెక్షన్లకు పొంతన లేకుండా వుంది' అంది కోర్టు. అల్లర్లలో పాల్గొన్నాడంటూ 2015 నవంబరులో అఖిలేశ్ త్రిపాఠీపై పెట్టిన కేసు కొట్టేసింది. అరవింద్‌కు అత్యంత సన్నిహితుడిగా మెలగుతున్న సోమనాథ్ భారతిపై 2015 డిసెంబరులో కేసు పెట్టారు. అతని భార్య 'నాపై దాడి చేయమని మా కుక్కను మా ఆయన ఉసిగొల్పాడు' అని ఫిర్యాదు చేస్తే దాని ఆధారంగా గృహహింస, హత్యాయత్నం సెక్షన్లతో కేసు పెట్టేశారు. తర్వాత చూడబోతే ఆ కుక్క భార్య పెంపుడు కుక్క. ఇతని మాట విననే వినదట! ఓ హోల్‌సేల్ కూరల వ్యాపారి ఫిర్యాదు చేశాడంటూ ఏకంగా ఉపముఖ్యమంత్రి మనీశ్ శిశోదియాపై కేసు పెట్టారు.

ఏడాది క్రితం భూ ఆక్రమణ నేరంపై మనోజ్ కుమార్‌ను, డిగ్రీ సర్టిఫికెట్టుకై ఫోర్జరీ చేసినందుకు జితేందర్ తొమార్‌పై కేసులు పెట్టారు. ఆప్ పంజాబ్‌గోదాలో దిగి బిజెపికి సవాళ్లు విసురుతున్న కొద్దీ కేసులు పెరిగిపోతున్నాయి. ఖురాన్‌లో పేజీలు చింపాడంటూ నరేశ్ యాదవ్ అనే ఎమ్మెల్యేపై కేసు పెట్టారు. పంజాబ్ పోలీసులు ఢిల్లీ పోలీసులంత తెలివైనవారు కాదు కాబోలు, మొదట్లో ముగ్గురు ఆరెస్సెస్ కార్యకర్తలు చింపారని కేసు పెట్టి, మధ్యలో మాట మార్చి, ఆప్‌ను లాక్కుని వచ్చారు. ఇవన్నీ కాకుండా పార్లమెంటరీ సెక్రటరీలుగా నియమితులైన 21 మందిపై 'అది ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ కాబట్టి మిమ్మల్ని ఎమ్మెల్యేలుగా అనర్హులుగా ఎందుకు చేయరాదు?' అని అడుగుతున్నారు. 'కాంగ్రెసు హయాంలో కూడా యిలాటి నియామకాలు జరిగాయి. అప్పుడు ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ కానిది, మా హయాంలోనే ఎందుకయింది?' అని అరవింద్ మండిపడుతున్నాడు. ఆప్ విషయంలో యింత 'సమర్థవంతం'గా పనిచేస్తున్న ఢిల్లీ పోలీసులు మరి బిజెపి నాయకుల విషయంలో మాత్రం ఎందుకు చేతకానివారై పోతున్నారని కొందరికి సందేహం. ఎన్‌డిఎమ్‌సి లీగల్ ఆఫీసరు ఎంఎం ఖాన్ హత్య కేసులో నిందితుడైన, ఢిల్లీ మునిసిపల్ కౌన్సిల్ వైస్ చైర్మన్, బిజెపి నాయకుడు కరణ్ సింగ్‌ను ఎందుకు అరెస్టు చేయలేదు? పటియాలా హౌస్ కోర్టు ఆవరణలో జర్నలిస్టులు కొడుతూ వీడియో కెమెరాలకు పట్టుబడిన ఒపి శర్మ అనే బిజెపి ఎమ్మెల్యేను ఎందుకు అరెస్టు చేయలేదు? అని అడుగుతున్నారు.

ఈ ప్రశ్నను మహారాష్ట్రలో కాంగ్రెసు-ఎన్‌సిపి వేరే రకంగా అడుగుతున్నాయి. ఢిల్లీ ఎమ్మెల్యేలపై అన్ని కేసులు పెట్టేస్తున్నారే, మరి మహారాష్ట్ర ఎమ్మెల్యేలను ఎందుకు రక్షిస్తున్నారు? మీ పార్టీ వారనా? అని అడుగుతున్నారు. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో ఏకంగా 17 మంది మంత్రులపై అవినీతి ఆరోపణలు చేసి న్యాయపరమైన విచారణ కావాలన్నారు. ముఖ్యమంత్రి ఫడ్నవీస్ అవన్నీ ఉత్తుత్తివే అంటూ విచారణకు నిరాకరించాడు. టూరిజం మంత్రి జయకుమార్ రావల్ విషయంలో మాత్రం కాస్త వింతగా ప్రవర్తించ వలసి వచ్చింది. ఎందుకంటే అతని కథ యిప్పటిది కాదు. ధూలే జిల్లాలో దొండాచియా పట్టణంలో దాదాసాహెబ్ రావల్ కోఆపరేటివ్ బ్యాంకు లి. అని వుంది. దానిలో జయకుమార్ రావల్, అతని బంధువులు డైరక్టర్లు. వాళ్లంతా డిపాజిటర్లు దాచుకున్న డబ్బును తమకు, తమ బంధువులకు ఋణాలుగా తీసేసుకున్నారు. అప్పిచ్చేటప్పుడు ఆస్తులు తనఖా పెట్టలేదు. జయకుమార్, అతని బంధువులు కలిసి పెట్టిన స్టార్చ్ ఫ్యాక్టరీ కూడా ఋణగ్రస్తుల్లో ఒకటి. డబ్బు తిరిగి కట్టలేదు. ఇలాటి చావుబాకీలు రూ. 28 కోట్లకు చేరి, బ్యాంకు ఆర్థిక పరిస్థితి అల్లకల్లోలమై పోయింది. 2003-04 ఆర్థిక సంవత్సరం నుంచి మూడేళ్లపాటు వెలువడిన ఆడిట్ రిపోర్టులో యీ విషయాన్ని ఎత్తి చూపారు. అవి చూసి రిజర్వు బ్యాంకు ఆ బ్యాంకు లైసెన్సు రద్దు చేసింది. ఈ ఆడిట్ రిపోర్టు ఆధారంగా కొందరు డిపాజిటర్లు బ్యాంకు డైరక్టర్లపై పోలీసు కంప్లయింటు యిద్దామని చూశారు. కానీ పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదు. తీసుకొనేట్లా పోలీసులను ఆదేశించమని కోరుతూ శరద్ పాటిల్ అనే డిపాజిటరు 2007లో బాంబే హైకోర్టు వారి ఔరంగాబాద్ బెంచ్‌లో పిటిషన్ పెట్టాడు. ఆ విషయం తెలిసి రావల్ సోదరి, కజిన్ తాము యివ్వాల్సిన బాకీలు కట్టేసి ఆ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవద్దంటూ కోర్టును కోరారు. కానీ కోర్టు పిటిషన్ స్వీకరించింది.

స్థానికంగా జయకుమార్ ప్రభృతులకున్న పలుకుబడి కారణంగా యీ కేసు నత్తనడక కూడా నడవదని గ్రహించిన ధూలే జిల్లా డియస్పీ యీ కేసును సిఐడికి అప్పగించమని, ముంబయిలోని డైరక్టరు జనరల్ (డిజి) ఆఫీసుకి రాశాడు. అయితే డిజి ఆఫీసు ఒత్తిళ్లకు లొంగి కాబోలు, దానిపై చర్య తీసుకోలేదు. కేసును వేగవంతం చేయమని డిపాజిటర్లు హైకోర్టుకి వెళ్లారు. కోర్టు పోలీసును ఒక సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీము) ఏర్పాటు చేసి నిర్దిష్టమైన సమయంలో విచారణ పూర్తి చేయమంది. 2015 ఆగస్టు 21 న సిట్ ధూల్ ఎస్పీకి లేఖ రాస్తూ తమకు 8 మంది పోలీసు ఆఫీసర్లు, 55 మంది పోలీసులు, 5గురు లేడీ పోలీసు ఆఫీసర్లు, రెండు రయట్ కంట్రోలు టీములు, ఒక క్విక్ రెస్పాన్సు టీము, 10 వాహనాలు ఆగస్టు 23 ఉదయం 9 గంటల కల్లా సిద్ధం చేయమంది. ఎందుకిదంతా అంటే 56 మంది నిందితులలో యిద్దరు బిజెపి ఎమ్మెల్యేలు- ఒకరు దొండాచియా నియోజకవర్గపు శాసనసభ్యుడు జయకుమార్ రావల్ కాగా, మరొకరు నంద్‌దర్బార్ నియోజకవర్గపు శాసనసభ్యుడు విజయకుమార్ గావిట్. వారిని అరెస్టు చేయబోతే వారి అనుచరులు కల్లోలాలు సృష్టిస్తారనే భయంతో యీ ముందస్తు ఏర్పాట్లు!

ఈ లేఖ వస్తోందని తెలియగానే ఆగస్టు 20 న ఆరుగురు నిందితులు హోం శాఖ కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కు లేఖ రాస్తూ "ఇది రాజకీయ కక్షతో నడుస్తున్న కేసు. స్థానిక పోలీసులు మాకు వ్యతిరేకంగా వ్యవహరించవచ్చు. అందువలన కేసు విచారణను సిఐడికి బదిలీ చేయాలి." అని కోరారు. ఇలాటి కోరిక ప్రతిపక్ష సభ్యుల నుంచి వస్తే అర్థం చేసుకోవచ్చు. అధికారపక్షం వారు చేశారంటే దాని అర్థం - కేసు విచారణను ఎలాగోలా జాప్యం చేయించాలనే! లేఖ అందగానే ముఖ్యమంత్రి కార్యాలయం ధూలే ఎస్పీ ఆఫీసుకి ఫోన్ చేసి 'లేఖపై నిర్ణయం తీసుకోబోతున్నాం కాబట్టి, అరెస్టులు చేయకండి' అని చెప్పింది. అంతేకాదు విచారణను సిఐడికి బదిలీ చేస్తూ ఆగస్టు 24 న హోం శాఖ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. "ఇదెక్కడి చోద్యం? తనను ఎవరు విచారణ చేయాలో నిందితుడు అడగడమేమిటి? మీరు ఒప్పుకోవడమేమిటి?" అని ప్రతిపక్షాలు ఫడ్నవీస్‌ను కడిగేశాయి. ఫడ్నవీస్ దానికి డైరక్టుగా సమాధానం చెప్పకుండా 'ఈ కేసుకు అనుబంధంగా వేసిన తన కేసును కక్షిదారుడే విత్‌డ్రా చేసుకున్నాడు. దాన్ని బట్టే యీ కేసులో బలం లేదని తెలుస్తోంది' అన్నాడు. జరిగినదేమింటే యోగేశ్ షిండే అనే అతను సిఐడికి బదిలీ చేయడాన్ని సవాలు చేస్తూ పిల్ వేశాడు. దానికి కోర్టు 'మీరు కేసు వేయడానికి రెండు నెలల ముందే సిఐడికి బదిలీ అయిపోయింది. ఇప్పుడు వాళ్లే విచారణ కొనసాగిస్తారు.' అని చెప్పింది. దాంతో అతను పిల్ ఉపసంహరించుకోవలసి వచ్చింది. ఇందులో జయకుమార్ రావల్ నిర్దోషి అని ఎవరూ చెప్పలేదు. "సిఐడి 24 మంది నిందితులను గుర్తించి, వారిపై చార్జిషీటు దాఖలు చేసింది." అని ఫడ్నవీస్ సభలో చెప్పాడు. కానీ జయకుమార్ రావల్ పేరు 25వ నిందితుడిగా వుందని చెప్పలేదు.

అవినీతి పట్ల మాది జీరో టోలరెన్స్ అని చెప్పుకునే బిజెపి మహారాష్ట్రలో వ్యవహరిస్తున్న తీరు యిది. అవినీతి విషయంలో మాట ఎలా వున్నా ఆప్ పట్ల మాత్రం బిజెపి జీరో టోలరెన్సు చూపుతోంది. దేశం మొత్తంలో 290 ప్లస్ బిజెపి ఎమ్మెల్యేల పట్ల క్రిమినల్ కేసులున్నాయని, ఆప్ ఎమ్మెల్యేల విషయంలో వ్యవహరించినంత జోరుగా వారిపై కూడా వ్యవహరిస్తేనే బిజెపి నిజాయితీ తెలుస్తుందని పరిశీలకులు అంటున్నారు. ఎవరి విషయంలో చొరవ తీసుకుంటారు, ఎవరి విషయంలో తాత్సారం చేస్తారు అనేది తెలుసుకోవాలంటే మనం ఒకే ప్రశ్న వేయాలి - 'అస్మదీయుడా? తస్మదీయుడా?' అని. **- ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఆగస్టు 20 **ఎమ్బీయస్ : కాలిఖో పుల్ ఆత్మహత్య**

ఇటీవలి దాకా అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా వుండి మారిన సమీకరణాలతో పదవి పోగొట్టుకున్న కాలిఖో పుల్ ఆగస్టు 9

న తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మరణించి 12 రోజులైంది. అతని ఆత్మహత్యకు కారణం యితమిత్థమని యిప్పటిదాకా ఎవరూ గట్టిగా చెప్పటం లేదు. అతని అనుయాయులు మృతిపై సిబిఐ విచారణ జరగాలని డిమాండ్ చేయగా, రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ పోలీసు అధికారుల చేత ఇంక్వయిరీ కమిషన్ వేసింది. దాని నివేదిక కూడా ఎటూ తేలుస్తుందని అనుకోవడానికి లేదు. వాళ్లేం చెప్పినా పుల్ అనుయాయులు నమ్మరు. అరుచికరమైన కారణాలున్నా వాటిని బయటపెట్టడానికి ముఖ్యమంత్రికి ధైర్యం చాలదు. ఆత్మహత్య వార్త బయటకు రాగానే పుల్ అనుచరులు మంత్రుల యిళ్లపై దాడి చేసి ఫర్నిచర్ విరక్కొట్టారు. వాళ్ల మూడ్ గమనించిన ముఖ్యమంత్రి అంత్యక్రియలకు హాజరు కాలేదు. ఇది భావోద్వేగాలకు సంబంధించిన సమస్య అయిపోయింది.

గెలుపోటములను నిబ్బరంతో స్వీకరించే లక్షణం రాజకీయ నాయకులకు సహజంగా వుంటుంది. దశాబ్దాలుగా అనుభవిస్తూ వచ్చిన మంత్రి పదవి పోగొట్టుకుని, 20 ఏళ్లకు పైగా వున్న పార్టీలోంచి బహిష్కరించబడిన కష్టసమయంలో పుల్ మానసికంగా తట్టుకున్నాడు. టుకీకి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తూ వచ్చాడు. చివరకు బిజెపితో బేరాలాడుకుని, గవర్నరు సహాయంతో అడ్డదారిలో ముఖ్యమంత్రి అయిపోయాడు. అయితే అది ఐదునెలల ముచ్చటైంది. అలా వచ్చిన పదవి శాశ్వతమని ఎలా భ్రమించాడో తెలియదు. సుప్రీం కోర్టు తీర్పు రాగానే "ఇది అన్యాయం. టుకీకి మెజారిటీ నిరూపించుకునే అవకాశం యివ్వకపోవడం తప్పయితే, అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకున్న నన్ను తొలగించడం కూడా అన్యాయమే" అని వాపోయాడు యితను, మొదటి తప్పు కారణంగానే తనకు గద్దె దక్కిందన్న విషయం మర్చిపోయి. తీర్పు రాగానే తన పక్షాన మెజారిటీ సభ్యులున్నారని మీడియాకు ప్రదర్శించి తనకు ఢోకా లేదనుకున్నాడు. కానీ కాంగ్రెసు చురుగ్గా వ్యవహరించి, కాళ్ల కింద తివాచీ లాగేసింది. చివరిదాకా వేచి చూసి గత్యంతరం లేక అందరి కంటె ఆఖరున మళ్లీ పార్టీలో చేరాడు. వేరేవారిని ముఖ్యమంత్రిగా ఒప్పుకోవలసి వచ్చింది. అది అతన్ని కృంగదీసింది.

నిజానికి పుల్ జీవితమంతా ఎగుడుదిగుళ్లే. అతనికి ఏడాదిన్నర వయసులో తల్లి పోయింది. 11 ఏళ్ల వయసులో తండ్రి పోయాడు. బంధువుల యిళ్లలో పెరుగుతూ వడ్రంగం పని నేర్చుకున్నాడు, పిల్లలకు పాఠాలు చెప్పాడు, వాచ్‌మన్‌గా పనిచేశాడు, కిళ్లీ కొట్టు పెట్టుకున్నాడు, వెదురు కంచెలు కట్టే వ్యాపారం చేశాడు, మేస్త్రీగా పనిచేశాడు. ఇవన్నీ చేస్తూనే డిగ్రీ చేశాడు. కాలేజీలో చదువుతూండగానే రాజకీయాల్లో చురుగ్గా పనిచేశాడు. అతని తెలివితేటలు చూసి, కాంగ్రెసు పార్టీ అతన్ని సభ్యుడిగా చేర్చుకుని 1995లో ఎమ్మెల్యే టిక్కెట్టు యిచ్చింది. నెగ్గాడు. అక్కణ్నుంచే నాలుగు సార్లు నెగ్గాడు. ఎప్పుడూ ఏదో ఒక మంత్రి పదవి అనుభవిస్తూనే వచ్చాడు. పన్నులు, ఎక్సయిజ్ మంత్రిత్వ శాఖల్లో పనిచేశాడు. 2003లో గెగాంగ్ అపాంగ్ ముఖ్యమంత్రి ఐనప్పుడు 34 ఏళ్ల వయసులోనే యితను ఆర్థికమంత్రి అయి నాలుగేళ్ల పాటు ఆ పదవి నిర్వహించాడు. అతని తర్వాత ముఖ్యమంత్రి ఐన దోర్జీ ఖండూ ముఖ్యమంత్రిగా వుండగా మళ్లీ 2011 వరకు అదే పదవిలో వున్నాడు. ఖండూ ప్రమాదంలో చనిపోగా గామ్లిన్ ముఖ్యమంత్రి అయ్యాడు. అయితే నబామ్ టుకీ అతనిపై తిరుగుబాటు చేసి ఆర్నెల్లలోనే దింపేసి 2011 అక్టోబరులో ముఖ్యమంత్రి అయిపోయాడు. 2014 అసెంబ్లీ ఎన్నికల తర్వాత నబామ్ టుకీ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాక పుల్‌కి ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ దక్కింది. ఎప్పటికైనా యితను తనకు పోటీదారు అవుతాడని గ్రహించిన టుకీ అతని స్థాయిని తగ్గించాడు. కానీ పుల్‌కి ముఖ్యమంత్రి అయితీరాలనే పట్టుదల. తన శాఖ ద్వారా చాలా పనులు చేపట్టి, దానికి నిధులివ్వటం లేదని ముఖ్యమంత్రిని విమర్శించసాగాడు. ప్రభుత్వంలో అవినీతి జరుగుతోందని విమర్శలు గుప్పించసాగాడు.

పుల్‌కు మంచి పదవి యిచ్చి ప్రోత్సహించిన అపాంగ్ 2010లో వెయ్యి కోట్ల అవినీతి కుంభకోణంలో చిక్కుకున్నాడు. బిజెపి అతన్ని 2014 ఫిబ్రవరిలో తమ పార్టీలో చేర్చుకుంది. అతను తనకు సన్నిహితుడైన పుల్ ద్వారా కాంగ్రెసులో ముసలం పుట్టించడానికి శతథా ప్రయత్నించాడు. కాంగ్రెసును చీలిస్తే బిజెపి మద్దతుతో ముఖ్యమంత్రిని చేస్తానని ఆశ కల్పించాడు. ఇదంతా తెలిసిన టుకీ, పుల్‌ను కట్టడి చేయడానికి ప్రయత్నించాడు. 2014 డిసెంబరులో కాబినెట్ నుంచి తీసేశాడు. పుల్ ఢిల్లీ వచ్చి పార్టీ హై కమాండ్‌తో మొర పెట్టుకోబోతే వినే నాథుడు లేకుండా పోయాడు. అప్పణ్నుంచి పుల్ 'టుకీ హయాంలో అవినీతి పెరిగిపోయింది' అంటూ ప్రచారం మొదలుపెట్టి ఢిల్లీ వచ్చి జాతీయ మీడియా దగ్గరకు కొన్ని దస్తావేజులు యిచ్చి, అరుణాచల్‌పై కథనాలు రాయమని కోరాడు. అలా అందుకున్న "ద వైర్" ప్రతినిధి అతని మృతి తర్వాత కథనం రాస్తూ "అతను చేసిన ఆరోపణలకు, చూపిస్తున్న ఆధారాలకు ఎక్కడా పొంతన కుదరలేదు. అందుకనే రాయలేదు." అని రాసింది. అవినీతి మాట ఎలా వున్నా, 20 ఏళ్ల పాటు తమ పార్టీ తరఫున మంత్రి పదవులు అనుభవించిన వ్యక్తి దాని గురించి బహిరంగంగా మాట్లాడడం పార్టీకి రుచించలేదు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డావంటూ 2015 ఏప్రిల్‌లో షో కాజ్ నోటీసు కూడా యివ్వకుండా ఆరేళ్లపాటు పార్టీ నుంచి బహిష్కరించారు. దాంతో యితను పార్టీపై, టుకీపై పగబట్టాడు. అది గ్రహించిన బిజెపి అతన్ని దువ్వింది. టుకీ మూర?ంగా, నియంతలా వ్యవహరించడం వారి పనిని సులభతరం చేసింది.

ఆ తర్వాత కాంగ్రెసులో టుకీ వ్యతిరేకులందరినీ పోగు చేసి గవర్నరు సాయంతో అతని ప్రభుత్వాన్ని పడదోసి, బిజెపి మద్దతుతో ముఖ్యమంత్రి అయిపోయాడు. అమ్మయ్య చిరకాల వాంఛ నెరవేరింది అని ఆనందిస్తూండగా సుప్రీం కోర్టు తీర్పు అశనిపాతంలా వచ్చిపడింది. బిజెపి ఏదో చిట్కా వేసి తనను బయటపడేస్తుందని ఆశ పెట్టుకుంటే ఆశ నిరాశ అయింది. సుప్రీం కోర్టు తీర్పుపై అప్పీలుకి వెళదామని సూచించినా బిజెపి స్పందించలేదు. ఎందుకంటే, ఉత్తరాఖండ్‌లో, అరుణాచల్‌లో కేంద్రం వ్యవహరించిన తీరుపై ఎన్నో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు కూడా పుల్‌ని యింకా సమర్థిస్తూ పోతే పరువు పోతుందని వారు భయపడ్డారు. "మా

పార్టీలో చేరిపో. ఎప్పటికైనా విజయం సాధిస్తాం." అని చెప్పారట. అయితే పుల్ ఎటూ తేల్చుకోలేకపోయాడు. చిన్నప్పణ్నుంచి ఎదిగిన కాంగ్రెసులో న్యాయం జరగలేదన్న ఫీలింగు, బిజెపి మాటలు నమ్మి మోసపోయానన్న ఫీలింగు. పదవి పోయినా అధికార నివాసం ఖాళీ చేయలేదు. దానిలోనే ఫ్యానుకు ఉరేసుకున్నాడు. ఆ గదిలో "మేరే విచార్" (నా ఆలోచనలు) అనే 60 పేజీల పుస్తకం దొరికిందట. దానిలో రాష్ట్రంలో అవినీతి గురించి రాశాడట. సూసైడ్ నోట్ రాశాడని ఓ పోలీసు అధికారి అన్నాడట కానీ అలాటిది ఏదీ దొరకలేదని ప్రభుత్వం, అధికారులు అంటున్నారు. 47 ఏళ్ల వయసుకే ముఖ్యమంత్రి అయిన వ్యక్తి యీ మాత్రం దానికే నిరాశ, నిస్పృహలకు గురై ఆత్మహత్య చేసుకోవడం ఒక విషాదం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఆగస్టు 21, 22 **ఎమ్బీయస్ : ఇరోమ్ షర్మిల భవిష్యత్తు**

సుమారు 16 ఏళ్లగా నిరాహారదీక్ష చేస్తూ, ప్రపంచంలోనే రికార్డు స్థాపించిన షర్మిల తన లక్ష్యం పూర్తి కాకుండానే హఠాత్తుగా దీక్ష విరమించడం మణిపూర్ ప్రజలు జీర్ణం చేసుకోలేక పోతున్నారు. ఎవరినీ సంప్రదించకుండా స్వనిర్ణయంతో దీక్ష ప్రారంభించినపుడు ఆమెను ఆకాశానికి ఎత్తేసి, దీక్ష కొనసాగిస్తున్న కొద్దీ అక్కడే స్థిరంగా వుంచేసిన మణిపూర్ ప్రజలు ఆమె 'నన్ను దేవతను చేయకండి, నేను మామూలు మనిషినే, నా కంటూ ఆశలూ, అభిప్రాయాలూ వుంటాయి' అని మొత్తుకుంటూ వుంటే వినిపించుకోవటం లేదు.

షర్మిల దీక్ష విరమణ వెనుక తన ఉద్యమం విఫలమైందన్న నిస్పృహతో బాటు, తోడు కోసం మనసు పడే ఆరాటం కూడా వుందని అందరికీ తెలుసు. కానీ ఆమె సమర్థకులు దానికి అంగీకరించటం లేదు. ఆమె ప్రియుడైన డెస్మాండ్ కౌటిన్హో మీద విరుచుకు పడుతున్నారు. అతని కుటుంబం గోవాకు చెందినదంటారు కానీ 'నేను టాంజానియాలో పుట్టి అక్కడే స్థిరపడిన జంటకు పుట్టినవాణ్ని. ప్రస్తుతం బ్రిటిషు పౌరుణ్ని.' అంటాడతను. షర్మిల చేస్తున్న దీక్ష గురించి విని 2009లో ఆమెకు ఉత్తరాలు రాశాడు. ఒంటరితనంతో బాధపడుతున్న ఆమెకు క్రిస్టియన్ ఎవాంజలిజం, బుద్ధిస్ట్ విపాసనా కలిసిన అతని ఆధ్యాత్మిక దృక్పథం, భావ వ్యక్తీకరణ బాగా నచ్చాయి. జవాబులు రాసేది. ఇద్దరి మధ్య లేఖానుబంధం గట్టిపడింది. ఆమె కతను లాప్‌టాప్, రాధాకృష్ణ విగ్రహంతో సహా అనేక బహుమతులు పంపసాగాడు. చివరకు ఆమెను చూడడానికి 2011 ఫిబ్రవరిలో ఇంఫాల్‌కు వచ్చాడు. అప్పటికే అతనితో షర్మిల ఉత్తరప్రత్యుత్తరాలు నడపడం నిరసిస్తున్న మహిళా కార్యకర్తలు అతనిపై విరుచుకు పడి కొట్టారు. అతను నిరాహార దీక్ష చేపట్టడంతో రెండు రోజుల తర్వాత వాళ్లు దిగి వచ్చి ఆమెను కలవనిచ్చారు. చివరకు షర్మిలపై ఆత్మహత్యాయత్నం కేసు విచారణ నడుస్తున్న కోర్టుకి మార్చి 9న వచ్చి ఆమెను ప్రత్యక్షంగా కలిసి పలకరించాడు. "మా వాళ్లకు అతని వేషధారణ, ప్రవర్తన నచ్చలేదు. నన్నేమైనా అంటే అతను సహించడు. దాంతో ఘర్షణ తలెత్తింది. కొంచెం వుంటే మా వాళ్లు అతన్ని చంపేసేవారు. మా వాళ్ల దృష్టిలో నేను మణిపూర్‌కు చెందిన పబ్లిక్ ప్రాపర్టీని. మరి అతనికి నేనంటే పిచ్చి యిష్టం. నా కంటూ జీవితం వుండాలని వాదిస్తాడు. అందుచేత అతనికి రక్షణ కల్పించండి" అని షర్మిల కోర్టును కోరింది.

షర్మిల దీక్ష భగ్నం చేయడానికి ప్రభుత్వం సంధించిన మన్మథాస్త్రం ఆమెకంటె 9 ఏళ్లు పెద్దవాడైన డెస్మాండ్ అని ఆమె కార్యకర్తల అనుమానం. పైకి మాత్రం "అతనికి తిక్కతిక్కగా మాట్లాడతాడు. మొదట్లో ఇంఫాల్ వచ్చి ఆశ్రమం కడతానన్నాడు. సరేనంటే మరి డబ్బివ్వండి అన్నాడు. ఖట్మండూకి వెళ్లాలి, నాకు ఎయిర్ టిక్కెట్లు బుక్ చేయండంటాడు. ఇలాటివాణ్ని పెళ్లి చేసుకుంటానని షర్మిల అంటే ఏం చెప్తాం?" అంటారు. షర్మిల పెళ్లి చేసుకుని స్థిరపడడం ఆమె తల్లికి, సోదరుడికి, అనుయాయులకు ఎవరికీ యిష్టం లేదు. దీక్ష విరమణ తర్వాత ఆమె బయటకు వస్తే ఎవరూ ఆశ్రయం యివ్వలేదు. ఆమెపై దాడి చేస్తారన్న భయం కూడా కలిగింది. చివరకు రెడ్‌క్రాసు వారు తమ వద్ద పెట్టుకున్నారు. ఇది షర్మిలను బాధిస్తోంది. "వీళ్లంతా భర్తాబిడ్డలతో సుఖంగా కాపురాలు చేసుకుంటున్నారు. నాకు మాత్రం ఆ సౌకర్యం వుండకూడదట." అని 2014 డిసెంబరులోనే వాపోయింది. క్షణికావేశంలో తీసుకున్న ఒక నిర్ణయం ఆమెకు పులిసవారీ అయిపోయింది. దిగితే ప్రజలు చావగొడతారని, తన ప్రియుణ్ని ఖతం చేస్తారని భయం. అందుకే బెదిరింది. ఇన్నాళ్లకు తెగించి, ఏమైతే అది అయిందని నిర్ణయం తీసుకుంది. పులి నుంచి దిగిపోయింది. పులి తినేస్తుందో, జాలి పడి వదిలేస్తుందో వేచి చూడాలి.

అసలామె పులి ఎక్కిన సందర్భం ఏమిటి? 1972లో తొమ్మిది మంది పిల్లల్లో ఆఖరి పిల్లగా పుట్టిన ఆమె ఇంటరు చదివింది. సోషల్ వర్కరుగా మారి మానవహక్కులు, మహిళా హక్కులు వంటి ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ వాలంటీరుగా వుండేది. నవంబరు, 2000లో సైన్యం చేతిలో బలాత్కారానికి, దౌర్జన్యానికి గురైన మహిళల వివరాలు సేకరించడానికి యిల్లిల్లూ సైకిలు మీద తిరుగుతున్న షర్మిలకు 10 మంది ప్రజలు సైన్యం దాడికి గురై మరణించిన వార్త తెలిసింది. అసాం రైఫిల్స్ వారి వాహనాలు వెళుతూండగా మణిపూర్ తీవ్రవాదులు బాంబు విసిరారు. ఒక వాహనం కొద్దిగా దెబ్బ తింది. అంతే! ప్రతీకార చర్యగా సైన్యం బస్సు కోసం వేచి వున్న పదిమంది పౌరులపై విచక్షణా రహితంగా కాల్పులు కాల్చి చంపివేసింది. మణిపూర్‌లో అమలులో వున్న సైన్యవిశేషాధికార చట్టం ఎత్తివేయాలంటూ ఆమరణ నిరాహార దీక్ష చేయాలని ఆమె అప్పటికప్పుడు నిర్ణయించుకుంది. హితైషులు వద్దవద్దని వారించినా వినలేదు. 'నేను విజయం సాధించాకనే నిన్ను కలుస్తాను' అని తల్లితో చెప్పి 28 ఏళ్ల అవివాహిత ఐన షర్మిల దీక్ష నవంబరు 2 న ప్రారంభించింది. అలా వదిలేస్తే ఆమె చనిపోతుందని పోలీసులు భయపడ్డారు. నవంబరు 6 న ఆత్మహత్యా ప్రయత్నం కేసుపై అరెస్టు

చేశారు. ఆమెకు బలవంతంగా ముక్కు ద్వారా ఆహారం ఎక్కించసాగారు. గొంతు ద్వారా నీళ్లు కూడా తాగలేదామె. 15 ఏళ్ల 9 నెలల తర్వాత దీక్ష విరమించాక ఆమె ఆహారం తీసుకునే స్థితిలో లేదు. ఆమె జీర్ణవ్యవస్థకు ఆహారాన్ని అరిగించుకునే శక్తి పోయింది. ప్రస్తుతం ద్రవాహారాల మీద బతుకుతోంది. మామూలు జీవితానికి ఎప్పటికి అలవాటు పడుతుందో చెప్పలేం. ఆమె నిరసన తెలుపుతూ వచ్చిన సైన్యవిశేషాధికార చట్టం సంగతేమిటి?

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో తలెత్తిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని అణచడానికి బ్రిటిషు ప్రభుత్వం సైన్యానికి విశేషాధికారాలు కల్పిస్తూ చేసిన చట్టాన్నే కాస్త మార్పులు చేసి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (స్పెషల్ పవర్స్) యాక్ట్ (ఎఎఫ్‌సిపిఎ) అని 1958లో తయారు చేశారు. ఏదైనా ప్రాంతాన్ని కల్లోల ప్రాంతంగా ప్రకటించి అక్కడకు సైన్యాన్ని పంపితే యీ చట్టం అమల్లోకి వస్తుంది. దీని ప్రకారం సైన్యాధికారులు ఏం చేసినా ఎవరూ నోరెత్తడానికి లేదు. ఏ వారంటూ లేకుండా వారు ఎవరినైనా సోదా చేయవచ్చు, ఎవరి యింట్లోకైనా ప్రవేశించవచ్చు. శాంతిభద్రతల పేరు చెప్పి ఎవరినైనా కాల్చిపారేయవచ్చు. వారికి యిమ్యూనిటీ (చట్టం నుంచి రక్షణ) వుంటుంది. చైనా మద్దతుతో ప్రత్యేక నాగాలాండ్ ఉద్యమం చేపట్టిన నాగా ఉద్యమకారుల నడుం విరచడానికి ఈశాన్య ప్రాంతాల్లో మొదట దీన్ని ప్రయోగించారు. 1997లో నాగాలతో ఒప్పందం కుదిరినా, క్రమేపీ ఈశాన్యంలోని అన్ని రాష్ట్రాలకూ విస్తరిస్తూ పోయారు. పంజాబ్‌లో 1983-97 మధ్య ఉపయోగించారు. 1990 నుంచి కశ్మీరులో దాన్ని ఉపయోగిస్తూనే వున్నారు. సైనికులు అనగానే మనకు దేశభక్తులు, దేశరక్షణ కోసం ప్రాణాలు అర్పించేవారే గుర్తుకు వస్తారు. కానీ ఆక్రమిత ప్రాంతాల్లో అతివలపై అత్యాచారాలు చేసి 'వార్ బేబీ'లకు కారకులయ్యే వారూ వీరే! అమితాధికారాలు దఖలు పడ్డాక వాటిని సక్రమంగా వినియోగించే విచక్షణ అందరు సైనికాధికారులకు వుంటుందని అనుకోవడానికి లేదు. తిరుగుబాటుదారులు ఒక సైనికుణ్ని చంపితే వాళ్లకు బుద్ధి చెప్పడానికి వందమందిని కాలుస్తారు. వారిలో సాధారణ పౌరులు, అమాయకులు కూడా వుంటారు. కొన్ని సందర్భాల్లో వారు చేసినది తప్పని తెలిసినా ప్రభుత్వం బాహాటంగా చెప్పలేదు. వాళ్లను వెనకేసుకుని రావల్సి వస్తుంది. కశ్మీర్‌లో యీ చట్టం పెద్ద వివాదాస్పద అంశం. దాన్ని ఎత్తి వేయించేస్తామని స్థానిక నాయకులు ఎన్నికలలో వాగ్దానాలు చేస్తారు కానీ కేంద్రం ఒప్పుకోదు. సైన్యం చేసిన అత్యాచారాలకు కశ్మీరు వారు తక్కిన భారతీయులందరినీ నిందిస్తారు. ఈశాన్య భారతంలోను అదే పరిస్థితి. 2004 జులైలో తంగియమ్ మనోరమ అనే మణిపూర్ మహిళను సైనికులు బలాత్కారం చేశారు. దానికి నిరసనగా మధ్యవయస్కులైన కొందరు మహిళలు "ఇండియన్ ఆర్మీ, రేప్ అజ్" అంటూ బ్యానర్ రాసి, దాన్ని వెనక్కాల నగ్నంగా నిలబడి నిరసన తెలిపారు. ఇండియన్ ఆర్మీ, తద్వారా కేంద్రప్రభుత్వం మొత్తం ఆ నింద భరించవలసి వచ్చింది.

ఇంత జరుగుతున్నా మణిపూర్ రాష్ట్రప్రభుత్వాలేవీ ఆ చట్టాన్ని ఎత్తివేయించే ప్రయత్నం చేయలేదు. ప్రతి ఏడాదీ ఆ చట్టాన్ని పొడిగించాలని సిఫార్సు చేస్తూ పోయారు. కొన్ని ప్రాంతాల్లో ఎత్తివేశాం అంటూ సంజాయిషీ చెప్తూ వచ్చారు. కేంద్రంతో పోరాడి ఎత్తివేయిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టుకోవడానికి దాన్ని దాచి పెట్టుకుంటూ వచ్చారు. సైన్యం చేతిలో హతులైన వారి వితంతువులు సంఘంగా ఏర్పడి సైన్యం చట్టాన్ని అతిక్రమించిన 1528 కేసులను సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడ చట్టం ఎత్తివేస్తే కశ్మీరు వాళ్లూ ఎత్తివేయమంటారన్న భయం కేంద్రానిది. అందువలన యథాతథస్థితి కొనసాగి, పోనుపోను సాధారణ ప్రజలు ఆ పరిస్థితికి అలవాటు పడిపోయారు. ఆ చట్టం దారి చట్టానిదే. దాన్ని ఎత్తివేయాలంటూ దీక్ష చేస్తున్న షర్మిల దారి షర్మిలదే. దశాబ్దాల తరబడి దీక్ష సాగుతూ వుంటే ఎవరు మాత్రం రోజూ వెళ్లి పలకరిస్తారు? విశేషాధికారాలు కానీ, దీక్ష కానీ కొద్ది రోజుల పాటు, లేదా నెలల పాటు వుంటే ప్రభావం చూపిస్తుంది. ఏళ్ల తరబడి సాగితే అది రొటీన్ అయిపోతుంది. ప్రజలు ఎవరి యిళ్లల్లో వాళ్లు హాయిగా వుంటూ సుష్టుగా తింటూ, కాపురాలు చేసుకుంటూ, పిల్లలు కంటూ పోతున్నారు. కానీ వారి కోసం షర్మిల మాత్రం ఎండుతూ, ఒంటరిగా బతుకీడ్చాలి అనడం ఏం న్యాయం? ఎన్నాళ్లు చేసినా వాళ్లీ చట్టం ఎత్తివేసేట్లు లేరు, నేను విరమిస్తా అని షర్మిల ఏళ్ల తరబడి మొత్తుకుంటున్నా తాళ్ కుదరదు అంటున్నారు వీళ్లు. 'వేసేటప్పుడు వేపకొమ్మ, తీయబోతే అమ్మోరు' అని సామెత. 'నేను అమ్మోరిని కాను, వేపకొమ్మనే' అని వేపకొమ్మ మొత్తుకుంటున్నా వీళ్లు వినటం లేదు.

ఆర్ కె నారాయణ్ "గైడ్" నవలలో (సినిమా కూడా వచ్చింది) జీవితంలో ధక్కామొక్కీలు తిని, నేరం చేసి జైలుకెళ్లి వచ్చినతనిపై అనుకోని పరిస్థితుల్లో దైవత్వం ఆపాదించబడుతుంది. నీళ్ల తగాదాలో ఊళ్లో జనం కొట్టుకుంటున్నారని విని అతను 'నేను యివాళ మీరు పంపిన అన్నం, నీళ్లు ముట్టను' అని కోపంతో అంటే అది విన్న మందబుద్ధి ఒకడు 'వర్షం వచ్చేవరకూ స్వామీజీ ఆమరణ నిరాహార దీక్ష చేస్తారట' అని టాంటాం వేసేస్తాడు. దాంతో అందరూ అతన్ని ఆకాశానికి ఎత్తేస్తారు. ఇక దీక్ష చేయక తప్పని పరిస్థితి వస్తుందతనికి. దొంగతనంగా పారిపోదామన్నా పారిపోలేడు. తనపై ఆపాదించబడిన యీ బలవంతపు దైవత్వాన్ని భరించి, చివరకు అతను మరణిస్తాడు. షర్మిల బతుకు కూడా అలాగే ముగిసి వుండేది – ఆమె తెగించి దీక్ష మానేయకపోతే! ఇన్నాళ్లూ చేసిన పోరాటం వ్యర్థమైందని అనిపోతారని ఆమె 'నేను రాజకీయాల్లోకి వస్తాను, ఆ చట్టం ఎత్తివేసేదాకా పోరాడతాను, అప్పుడే మా అమ్మను చూస్తాను' అంటోంది. దీక్ష విరమణ తర్వాత ప్రజాగ్రహం చవి చూశాక ఆమె రాజకీయాల్లోకి వచ్చే సాహసం చేస్తుందని అనుకోను. షర్మిల కథ ఓటమికి ఉదాహరణగా చూడకూడదు. ఒక నిజాయితీ ఐన ప్రయత్నంగా, జీవితేచ్ఛకు, వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రతీకగా చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఆనందీబెన్ మార్పు తథ్యం అని జూన్‌లోనే వ్యాసం రాస్తూ చివర్లో అమిత్ షా సాటి జైన్–బనియా ఐన విజయ్ రూపాణీని ముఖ్యమంత్రిగా తెచ్చే అవకాశం వుందని రాశాను. కానీ ఆ మార్పు అంత సులభంగా జరగలేదు. పటేళ్లు బిజెపిపై కోపంతో వున్నారు కాబట్టి ఆనందీబెన్ స్థానంలో మరో పటేల్‌ను తెస్తే మంచిదని మొదట్లో అనుకోవడం జరిగింది. ఆమె రాజీనామా చేయగానే సమర్థుడిగా పేరు పొందిన నితిన్ పటేల్‌కే పగ్గాలు అప్పగిస్తారని అందరూ అనుకున్నారు. బిజెపి ఆఫీసుకి అతను వచ్చినపుడు కార్యకర్తలందరూ కాబోయే ముఖ్యమంత్రికి స్వాగతం చెప్పినట్లే చెప్పారు. కొన్ని టీవీ ఛానెల్స్ అతని భార్యను అప్పుడే యింటర్వ్యూ చేసేయసాగాయి. అయితే పటేళ్లు పార్టీకి ఎలాగూ దూరమయ్యారు కాబట్టి మరో పటేల్‌ను తెచ్చి ప్రయోజనం లేదని, అమిత్ ఆఖరి నిమిషంలో మోదీని ఒప్పించగలిగాడు. ఇన్నాళ్లూ పటేళ్లు బిజెపిలో ప్రముఖ పాత్ర వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో పెత్తనం చలాయించారు. అది తక్కిన కులాల వారికి మంటగా వున్నా సహించారు. ఆర్థికంగా కూడా బలవంతులైన పటేళ్లు ఇప్పుడు తమకు రిజర్వేషన్ కూడా కావాలనడంతో ఆ సౌకర్యం అనుభవిస్తూన్న బిసిలు వారికి ఎదురు తిరిగారు – మన దగ్గర కాపులను బిసిలుగా గుర్తించి రిజర్వేషన్ యిస్తామంటే బిసిలు మండిపడుతున్నట్లే! పటేలేతర కులాలను సమీకృతం చేసుకుంటే మంచిదని అమిత్ యిచ్చిన సలహా మోదీకి నచ్చింది. గోరక్షకులు దళితులను దండించడంతో యితీవల దళితులు కూడా బిజెపికి ఎదురు తిరుగుతున్నారు. పటేల్–దళిత సమస్య తమను పీడిస్తోందని బిజెపి నాయకులు అనుకుంటూన్న యీ తరుణంలో ఆ రెండు కులాలు కాని కులాలను సంఘటితం చేయడానికి విజయ్ రూపాణీకి పదవి యిస్తే మేలు అన్నాడు అమిత్.

అయితే రూపాణీకి పాలనానుభవం బొత్తిగా లేదు. అతనిది ఆరెస్సెస్ నేపథ్యం. కాలేజీ రోజుల్లో ఎబివిపి సభ్యుడు. ఎమర్జన్సీ కాలంలో జైలుకి వెళ్లాడు. సాటి ఆరెస్సెస్ కార్యకర్త అంజలీ బక్షీని పెళ్లాడాడు. బిజెపి పుట్టుక నుండి పార్టీలో వున్నాడు. పార్టీ కమిటీల్లో సభ్యుడిగా వుంటూ అప్పగించిన పనులన్నీ సమర్థవంతంగా నిర్వహిస్తూ, మంచి ఆర్గనైజర్‌గా పేరు గడించాడు. గుజరాత్ టూరిజం బోర్డుకి చైర్మన్‌గా కొంతకాలం వున్నాడు. 2006 నుంచి ఆరేళ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా వున్నాడు. 2007 అసెంబ్లీ ఎన్నికల సమయంలో సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాలకు యిన్‌చార్జిగా పనిచేశాడు. ఆ ప్రాంతాలు బిజెపికి కంచుకోటలా వుంటూ వచ్చినా యీసారి పటేళ్లు బిజెపికి వ్యతిరేకంగా వున్నారని అందువలన ఎక్కువ సీట్లు రావని అందరూ అంటూంటే రూపాణీ ఒక పాత్రికేయుడితో మొత్తం 57 సీట్లలో 42 సీట్లు గెలుస్తాం, చూడండి అన్నాడు. 43 గెలిచారు. అలాగే 2012 ఎన్నికలలో మళ్లీ అవే ప్రాంతాలు అతనికి అప్పగించారు. పటేల్ నాయకుడు, మోదీకి గురువు అయిన కేశూభాయ్ పటేల్ బిజెపి నుంచి రాజీనామా చేసి గుజరాత్ పరివర్తన్ పార్టీ ఏర్పాటు చేసి గోదాలోకి దిగాడు. అందరూ భయపడ్డారు. కానీ రూపాణీ మోదీతో కేశూభాయ్ గురించి పట్టించుకోవద్దని చెప్పాడు. చివరకు 35 సీట్లు వచ్చాయి. రూపాణీలో వున్న ఘనత ఏమిటంటే కలహించుకునే వర్గాలను ఒక దగ్గర కూర్చోబెట్టి, యిరువురికి నచ్చచెప్పి, కలుపుకుని వెళ్లగలగడం. మంత్రి కావడం కంటె పార్టీ నాయకుడిగా వుండటానికే ఎక్కువ యిష్టపడ్డాడు. రాజ్‌కోట (పశ్చిమ) నియోజకవర్గం నుంచి ఎన్నికైన వజూభాయ్ వాలా చేత రాజీనామా చేయించి కర్ణాటక గవర్నరుగా పంపాక ఆ స్థానంలో రూపాణీని నిలబడమన్నారు. నిలబడి, గెలిచాడు. మంత్రిగా తీసుకున్నారు. 2015 ఫిబ్రవరికి అతన్ని బిజెపి రాష్ట్రాధ్యక్షుణ్ని చేశారు. ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రిని చేశారు.

రూపాణీ ఆనందీ బెన్ కాబినెట్‌లోని 9 మందిని వదిలించుకున్నాడు. 25 మంది వున్న తన కాబినెట్‌లో 8 మంది కొత్త మొహాలకు అవకాశం యిచ్చాడు. ముఖ్యమంత్రి కాగలిగిన నితిన్ పటేల్‌కు ఉపముఖ్యమంత్రి పదవి యిచ్చాడు. తీసేసిన వాళ్లలో ప్రముఖుడు – ఆర్థిక, విద్యుత్ శాఖలు నిర్వహించిన సౌరభ్ పటేల్. సౌరభ్ మోదీకి అత్యంత ఆత్మీయుడు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి అతనెంతో కృషి చేశాడు. పెట్టుబడిదారులు అతనితో ఎంతో సన్నిహితంగా మెలగుతారు. అతను లేకుండా "వైబ్రంట్ గుజరాత్" సదస్సును ఊహించుకోవడం కష్టం. మరి అలాటతన్ని ఎందుకు తీసేశారు అంటే ఆనంది బెన్‌ను తృప్తి పరచడానికట. పదవిలో వున్నంతకాలం అతను తనకు సహకరించటం లేదని ఆమె ఫిర్యాదు చేస్తూ వుండేది. మోదీ అతన్ని ఢిల్లీకి రప్పించుకుని ఏదైనా ముఖ్యపదవి యివ్వవచ్చని అనుకుంటున్నారు. బిజెపిపై పటేల్, దళిత వర్గాలతో పాటు మరి కొన్ని వర్గాలు కోపంగా వున్నాయి. వారందరితో అనునయంగా మాట్లాడి, పార్టీ వైపుకి తిప్పుకుంటాడనే రూపాణీకి యీ అవకాశం యిచ్చారట. అలా యివ్వడం అసలే కోపం మీద వున్న పటేళ్లకు మరింత కోపం తెప్పించింది. "నితిన్ పటేల్‌ను ముఖ్యమంత్రి చేస్తామని మభ్యపెడుతూ వచ్చి, చివరిలో అతన్ని కరివేపాకులా తీసిపారేసి రూపాణీని తెచ్చారు. నిరసనగా నితిన్ రాజీనామా చేయాలి" అంటూ ప్రకటించాడు హార్దిక్ పటేల్. రూపాణీ పాత కాబినెట్‌లోని ముగ్గురు పటేళ్లకు ఉద్వాసన చెప్పినా, కొత్తగా నలుగుర్ని తీసుకున్నాడు. అయినా తృప్తి పడక పటేళు ఒకవేళ రూపాణీని వ్యతిరేకిస్తే ఆ మేరకు తక్కిన కులాలు అతన్ని సమర్థిస్తాయని బిజెపి ఆశ.

కులం మాట ఎలా వున్నా పాలన బాగుంటే అందరూ సమర్థిస్తారు. ఆనంది వైఫల్యాలలో ప్రధానమైనది అధికారగణంపై పట్టు లేకపోవడం. ఆమె హయాంలో అవినీతి హద్దులు దాటిందని పేరు వచ్చింది. ఆనంది ఎందుకు వైఫల్యం చెందిందో గమనించి, ఆ లోపాలు సవరించే ప్రయత్నం రూపాణీ చేయాలి. ఆమెలో ప్రధానమైన లోపం పటేల్ ఆందోళనను సరిగ్గా హేండిల్ చేయలేకపోవడం. మొదట్లో ఉదాసీనంగా వుంది, తర్వాత మరీ కఠినంగా వ్యవహరించింది. హార్దిక్ పటేల్‌పై దేశద్రోహం నేరం మోపారు, అతన్ని 9

నెలల పాటు జైలు శిక్ష అనుభవింపచేశారు, తర్వాత కూడా గుజరాత్‌కు రాకుండా బహిష్కరింప చేశారు. ఈ నిందంతా ఆనంది మోయవలసి వచ్చింది. చివరకు పటేళ్లను సంతృప్తి పరచడానికి ఇబిసి (ఆర్థికంగా వెనకబడినవారు)ల కోసం 10% కోటా ప్రకటిస్తానన్నపుడు ఆమె అభ్యంతర పెట్టింది. చివరకు ఆ ప్రకటన చేసినపుడు అమిత్ షా, విజయ్ రూపాణీ ఆనంది పక్కన కూర్చున్నారు. ఆ కేటాయింపును హైకోర్టు కొట్టి వేసేందుకు ముందు రోజే ఆమె రాజీనామా చేసింది. నిజానికి స్థానిక ఎన్నికలలో ఓటమి తర్వాత ఆమెకు తను దిగిపోవాల్సి వస్తుందని ముందే తెలుసు. నవంబరు 21న తనకు 75 నిండుతాయి కాబట్టి, వయోవృద్ధులు రాజకీయాల నుంచి రిటైరు కావాలనే సిద్ధాంతాన్ని చెప్పుకుంటూ హుందాగా రాజీనామా చేసే అవకాశం యివ్వాలని ఆమె మోదీని మేలో కోరింది. ఆమెపై అభిమానంతో మోదీ సరేనన్నాడు.

కానీ జులైలో ఊనాలో శివసైనికులు గోరక్షాదళం పేరుతో దళితులను చావగొట్టడంతో గుజరాత్ ప్రభుత్వం అప్రతిష్ఠపాలైంది. దళితులపై అత్యాచారాల విషయంలో గుజరాత్ రికార్డు ఎప్పుడూ బాగా లేదు. కానీ 2014లో 1130 కేసులుంటే 2015లో అది ఆరు రెట్లు పెరిగి 6655 అయింది. ఇక ఆనందిని వెంటనే దిగమని చెప్పక తప్పలేదు. జులై 28 న ఆ కబురు వెళ్లింది. ఆమె కాస్త గడువు అడిగి, దిగిపోయే ముందు ప్రజలను సంతృప్తి పరిచే ప్రయత్నం చేసింది. రాష్ట్ర రహదారులపై టోల్ టాక్సు రద్దు చేసింది, రాష్ట్రప్రభుత్వోద్యోగులకు ఏడవ పే కమిషన్ సిఫార్సులు అమలు చేసింది. పటేల్ ఆందోళనకారులపై మోపిన 430 కేసుల్లో 391టిని ఎత్తివేసింది. దారిద్ర్యరేఖకు దిగువ నున్న యిళ్లలోని బాలికలకు మెడికల్, డెంటల్ కాలేజీలలో ఉచిత విద్య కల్పిస్తామని ప్రకటించింది. చివరికి ఆగస్టు 3న తన రాజీనామాను ఫేస్‌బుక్‌లో పోస్టు చేసింది. ఇలా చేసిన ముఖ్యమంత్రి ఆమె ఒక్కరే కాబోలు.

మోదీ వారసురాలిగా ఆమె నిలదొక్కుకోలేక పోయిందంటే మోదీ ఎంపికలో కూడా లోపం వున్నట్లే లెక్క. ఆనందిలో కొంత మంచి వుంది, కొంత చెడు వుంది. చాలా కష్టపడే స్వభావం ఆమెది. 74 ఏళ్ల వయసులో కూడా రాష్ట్రంలో 60 వేల కి.మీ.లు తిరిగింది. 33 జిల్లాలలను అయిదేసి సార్లు పర్యటించింది. మోదీ లాగా వర్క్‌హాలిక్. మోదీ ఆర్థికాభివృద్ధిపై ఎక్కువగా దృష్టి పెడితే యీమె మానవ సూచిక (హ్యూమన్ యిండిసీస్)పై శ్రద్ధ చూపింది. స్వచ్ఛభారత్, మహిళా సాధికారత, పౌష్టికాహారం సమకూర్చడం వంటి అంశాల్లో ఫలితాలు సాధించింది. స్వచ్ఛభారత్ పథకం కింద లక్షకు పైగా స్కూళ్లల్లో టాయిలెట్లు కట్టించింది, సివిక్ బాడీ ఎన్నికలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి, పోలీసు నియామకాల్లో 33% రిజర్వ్ చేసింది. 2014లో 45 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే 2015 వచ్చేసరికి అది 3కు తగ్గింది. చిన్న పరిశ్రమలు మార్చి 2014లో 2.62 లక్షలుంటే ఏడాదిన్నర తర్వాత అది 3.75 లక్షలైంది.

నెగటివ్ పాయింట్ల కొస్తే మోదీలా ఆమె వక్త కాదు, కలుపుగోరు వ్యక్తి కాదు, ఎవరితోను ఆమె సన్నిహితంగా మెలగలేదు, కాబినెట్ సహచరులు, సీనియర్ నాయకులు ఆమెకు దూరంగానే వున్నారు. రాష్ట్ర జిడిపి 2012-13లో 10.8%, 2013-14లో 8.3% కాగా 2015 వచ్చేసరికి అది 7.7% అయింది. ఇవే సంవత్సరాల్లో ఆహారధాన్యాల ఉత్పత్తి 93.82 లక్షల టన్నుల నుంచి 61.92 లక్షల కోట్లకు తగ్గింది. అధికారులు ఆనందిని పెద్దగా లక్ష్యపెట్టలేదు. వారి అవినీతి ఆమె ఆపలేకపోయింది. ఇవన్నీ చాలనట్లు ఆమెకు తన కూతురి విషయంలో అవినీతి మచ్చ పడింది. 2012లో మోదీ మూడో సారి ఎన్నిక కావడానికి నాలుగు నెలల పాటు విపరీతంగా శ్రమించాల్సి వచ్చింది. అయినా గతంలో కంటె తక్కువగా 182 సీట్లకు 115 సీట్లు మాత్రమే వచ్చాయి. కాంగ్రెసు నిర్జీవంగా వుండటం వలననే తాము గెలుస్తూ వస్తున్నామని బిజెపి నాయకులకు తెలుసు. ఎన్నికలకు 16 నెలలు మాత్రమే మిగిలింది. ప్రజల్లో అసంతృప్తి బలంగా వుందన్న విషయం 2015 డిసెంబరులో జరిగిన స్థానిక ఎన్నికల ఫలితాలలో (బిజెపి ఆరు మునిసిపాలిటీల్లో గెలిచినా, గ్రామీణ ప్రాంతాల్లో ఓడిపోయింది. 31 జిల్లా పంచాయితీల్లో 23 పోగొట్టుకుంది. సరైన నాయకత్వం లేక, నిర్జీవంగా పడివున్న గుజరాత్ కాంగ్రెసు 18 ఏళ్ల తర్వాత ఊపిరి పోసుకుని 31 జిల్లా పంచాయితీల్లో 21, 230 తాలూకా పంచాయితీల్లో 110 గెలిచింది) మార్చి-ఏప్రిల్‌లలో పార్టీ నాయకుల చేత చేయించిన సర్వేలో (182కు 65 మాత్రమే వస్తాయన్నారట) బయటకు వచ్చింది. ఆమె ఎంతకాలం ముఖ్యమంత్రిగా కొనసాగితే కాంగ్రెసుకు అంత లాభం అని వాళ్ల సలహాదారు ప్రశాంత్ కిశోర్ చెప్పాడట. పొరపాట్లకు ఆనందిని బాధ్యురాల్ని చేసి పంపివేయకపోతే పార్టీకే ముప్పు అని బిజెపి గ్రహించింది. అయితే పాలనానుభవం లేని ఆమె వారసుడు కేవలం చాకచక్యంతో ఏ మేరకు బిజెపి ప్రతిష్ఠ పెంచుతాడు, పటేళ్లను ఎలా హ్యాండిల్ చేస్తాడు అనేది చూడాలి. ఆనంది వున్నంత కాలం అమిత్ షా ఆమెకు వ్యతిరేకంగా వ్యహరించాడు. రూపాణీకి ఆ చింత లేదు. అందువలన కొద్దో, గొప్పో చేయవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఆగస్టు 25 **ఎమ్బీయస్ : యెమెన్‌పై సౌదీ దాడికి అమెరికా మద్దతు**

ట్రంప్ వాచాలత వింటూ వింటే చికాకేస్తుంది కానీ 'గ్లోబల్ సంగతులు పక్కనపెట్టి అమెరికనిజం గురించే ఆలోచిద్దా'మంటూ అతను చెప్పేదానిలో అమెరికా హితం వుందనిపిస్తుంది. ఇప్పుడున్న ట్రెండు తిరగబడి, ఒకవేళ అతను అధ్యక్షుడిగా ఎన్నికైనా యితర దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అలవాటును అమెరికా చేత అతను మాన్పించగలడన్న ఆశ కలగదు. ఎందుకంటే అమెరికా రాజకీయాలపై ఆయుధ వ్యాపారుల పట్టు అలాటిది. ప్రస్తుతానికి మాత్రం అమెరికా విధానాలకు వ్యతిరేకంగా నోరు విప్పుతున్నాడనే సంగతి మనం గుర్తించి హర్షించాలి.

ఆగస్టు మొదటివారంలో అమెరికా సౌదీ అరేబియాకు 1.15 బిలియన్ డాలర్ల ఆయుధాలు అమ్మబోతున్నామని ఒబామా ప్రభుత్వం ప్రకటించింది. అమెరికా సౌదీకి ఆయుధాలు అమ్మడంలో వింతేమీ లేదు. అమెరికా ఆయుధాల ఎగుమతుల్లో 10% సౌదీకే వెళతాయి. దాని అనుయాయులైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)కి 9% వెళతాయి. 2015లో అమెరికా వాళ్లకు 20 బిలియన్ డాలర్ల ఆయుధాలు అమ్మింది. 2015 సెప్టెంబరులో వారితో కుదుర్చుకున్న 60 బిలియన్ డాలర్ల ఆయుధ ఒప్పందం గురించి అమెరికా ప్రకటించింది. అలాటప్పుడు ఆగస్టు నెల అమ్మకాల గురించి ప్రస్తావన ఎందుకు అంటే అది యెమెన్‌లో శాంతి చర్చలు విఫలమై, మూణ్నెళ్ల యుద్ధవిరామం తర్వాత సౌదీ యుద్ధాన్ని మళ్లీ ప్రారంభించింది కాబట్టి, యెమెన్‌పై యుద్ధంలో సౌదీ అనేక రకాల మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడిందని ఐక్యరాజ్యసమితి నెత్తీనోరు కొట్టుకుని చెపుతోంది కాబట్టి. ప్రపంచంలో ఎక్కడ ఏ ఉల్లంఘన జరిగినా కర్ర పట్టుకుని పెద్దన్నలా తయారయ్యే అమెరికా సౌదీ విషయంలో దానికి మద్దతుదారుగా, ఓ రకంగా భాగస్వామిగా ఎందుకు తయారైందంటే దానికో నేపథ్యం వుంది.

యెమెన్ సౌదీ అరేబియాకు పక్కనే వుంది. ఇంచుమించు పెరట్లోనే వున్న ఆ దేశంలో తమ మాటకు వత్తాసు పలికే పాలకులే వుండాలని సౌదీ పట్టుదల. యెమెన్ ఉత్తర, దక్షిణ భాగాలు రెండూ 1990లో కలిసిపోయి, ఉత్తర యెమెన్‌కు అధ్యక్షుడిగా వున్న ఆలీ అబ్దుల్లా సలే అధ్యక్షుడయ్యాడు. అమెరికా ఇరాక్‌లోని సద్దాం హుస్సేన్‌కు వ్యతిరేకంగా సౌదీ నాయకత్వంలో అరబ్బు దేశాలను కూడగట్టినపుడు అతను ఆ కూటమిలో చేరడానికి ఒప్పుకోలేదు. దాంతో అతని మెడలు వంచడానికి సౌదీ తన దేశంలో పని చేస్తున్న పది లక్షల మంది యెమెన్ పౌరులను బహిష్కరించింది. వారు నెలానెలా యింటికి పంపే 350 మిలియన్ డాలర్ల డబ్బు యెమెన్ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకం. అది పోయింది. పైగా సౌదీ ఆర్థికసాయం నిలిపేసింది. ఏం చేసినా సలే లొంగలేదు. పదేళ్లు పోయాక సౌదీతో రాజీ కుదిరింది. మొత్తం మీద అతను 23 ఏళ్ల పాటు పాలించాడు.

కొంతకాలానికి అతనికి వ్యతిరేకంగా హౌతీ జాతివారు హుస్సేన్ హౌతీ నాయకత్వంలో తిరగబడ్డారు. సలే సైన్యం హుస్సేన్‌ను 2004లో చంపివేయడంతో అతని స్థానంలో అబ్దుల్ మాలిక్ హౌతీ నాయకుడిగా వచ్చాడు. హౌతీలు 2011లో సలే నివాసంపై దాడి చేసి అతన్ని గాయపరచారు. సలే చికిత్స చేయించుకోవడానికి అమెరికా వెళుతూ ఉపాధ్యక్షుడైన మన్సూర్ హాదీని తన స్థానంలో కూర్చోబెట్టి వెళ్లాడు. అందుకు ప్రత్యుపకారంగా అతను పార్లమెంటు చేత సలే చర్యలపై ఎటువంటి విచారణ జరగకూడదని చట్టం చేశాడు. 2012 నుంచి రెండేళ్ల పాటు అధ్యక్షుడిగా తనను తానే ఎన్నిక చేసుకున్నాడు. ఇతనికి కూడా సౌదీ మద్దతు యిస్తూ పోయింది. హౌతీలు అతని పాలనను కూడా ఎదిరిస్తూ వచ్చారు. వారికి ఇరాన్ వెనక్కాల నుండి మద్దతు యిస్తూ వచ్చింది. 2014-15లో హౌతీలు తిరుగుబాటు చేయడంతో 2015 జనవరిలో హాదీ రాజీనామా చేసి, హౌతీలు అతన్ని గృహనిర్బంధంలో వుంచారు. నెల్లాళ్లు పోయాక అతను తప్పించుకుని తన స్వస్థలమైన ఏడెన్‌కు పారిపోయి రాజీనామాను ఉపసంహరించుకున్నాడు. హౌతీ పాలనను తృణీకరించాడు. హౌతీలు ఏడెన్‌కు వెళ్లి అతన్ని పట్టుకోబోవడంతో అతను సౌదీ అరేబియాలోని రియాద్‌కు వచ్చి తలదాచుకున్నాడు.

ఇక అప్పణ్నుంచి సౌదీ అతన్ని మళ్లీ ఎలాగైనా గద్దెపై కూర్చోబెట్టాలనే తపనతో హౌతీల పాలనలో వున్న యెమెన్‌పై దాడులు చేయసాగింది. మాజీ అధ్యక్షుడు సలేకు విధేయంగా వుండే సైనికవర్గాలు హౌతీలతో చేతులు కలిపి సౌదీని ఎదిరిస్తున్నాయి. ఈ సందట్లోనే అల్ కైదా ఇన్ అరేబియన్ పెనిన్సులా (ఎక్యూఎపి), ఐసిస్ కూడా చొరబడ్డాయి. దానితో ఉత్తర యెమెన్‌లో అరాచకం ఏలుతోంది. సౌదీ అరేబియా తను దిగడమే కాక, యుఎఇ, బెహరైన్, ఈజిప్టు, సుడాన్, మొరాక్, కువాయిత్‌లను కలుపుకుని దాడి చేయసాగింది. వీళ్లకు అమెరికా, యూరోప్ దేశాలైన యుకె, ఫ్రాన్సు మద్దతు పలుకుతున్నాయి. ఈ మద్దతుకు ఎవరి కారణాలు వారి కున్నాయి.

మధ్యప్రాచ్యంలో ఇరాన్ తన ప్రాబల్యం పెంచుకుంటోందని సౌదీకి కోపం. సౌదీలో ఇస్లాంలోని సున్నీ శాఖకు చెందిన వహాబిజం అమల్లో వుంది. ఇరాన్, ఇరాక్, బెహరైన్‌లలో షియా శాఖ ముస్లిములు మెజారిటీలో వున్నారు. యెమెన్‌లో సైతం మెజారిటీలో వున్నారని కొందరంటారు. ఇరాక్‌లో యిప్పటికే షియా పాలన వచ్చేసింది. లెబనాన్‌లో హెజ్‌బొల్లా వుంది. అందువలన వీరంతా ఏకమై తమ పెరట్లో వున్న యెమెన్‌ను ఆక్రమించి తమకు పక్కలో బల్లెంగా తయారవుతారని సౌదీకి అనుమానం. ఇరాన్ ఎదగకుండా దానిపై ఆర్థిక ఆంక్షలు కొనసాగుతూ వుండాలని దాని ఆకాంక్ష. అయితే ఆంక్షలు ఎత్తివేయడమే కాక, ఇరాన్‌తో అమెరికా అణు ఒప్పందం కుదుర్చుకోవడంతో సౌదీ అమెరికాపై ఆగ్రహించింది. వారి బంధం యీనాటిది కాదు. సౌదీ రాజు అబ్దుల్ అజీజ్‌తో 1945లో రూజ్వెల్ట్ ఒప్పందం కుదుర్చుకున్నాడు - 'రాజుగా వుండడానికి మీకు సాయం చేస్తాం, మేం అడిగినంత ఆయిలు యివ్వండి' అని. ఇటీవలి కాలంలో అమెరికాకు సౌదీ నుంచి ఆయిల్ అవసరం తగ్గినా ఆయుధాలు అమ్ముకునే అవసరం మాత్రం పెరుగుతూ వచ్చింది. 2010 నుంచి యిప్పటిదాకా 100 బిలియన్ డాలర్ల ఆయుధాలు సౌదీకి అమ్ముకుంది. అందువలన సౌదీ కోపం తగ్గించడానికి 'మీరు యెమెన్‌పై దాడి చేసినా మేం మద్దతిస్తాం' అని ఒబామా అన్నాడు. సౌదీ ఇరాన్‌పై కోపంతో ఇజ్రాయేలుతో కూడా బాంధవ్యం పెట్టుకుంది. ఈ మధ్య సౌదీ పాలక కుటుంబానికి చెందిన వారు ఇజ్రాయేలు అధికారులతో తరచుగా కలుస్తున్నారు. సౌదీ యువరాజు ఇజ్రాయేలు మాజీ రక్షణాధినేతలతో సమావేశమయ్యాడు కూడా. హౌతీలకు ఇరాన్ మద్దతు యిస్తోందని సౌదీ ఆరోపణ. 'మద్దతేమీ లేదు, మేం వారి ప్రభుత్వాన్ని గుర్తించామంతే' అంటోంది ఇరాన్.

సౌదీ, తన మద్దతుదారులతో కలిసి యెమెన్‌పై దాడికి తెగబడగానే అమెరికాతో బాటు బ్రిటన్ కూడా భళా అంటూ వారికి 3.8 బిలియన్ డాలర్ల ఆయుధాలు అమ్ముకుంది. వీరి అండ చూసుకుని సౌదీ, దాని మిత్రదళాలు యెమెన్‌పై బాంబు దాడులకు పాల్పడి సర్వనాశనం చేస్తున్నాయి. ఇప్పటివరకు 6500 మంది పౌరులు చనిపోయారు. సగం మంది విమానదాడుల్లోనే పోయారు. సౌదీలు స్కూళ్లపై, పాఠశాలలపై, ఫ్యాక్టరీలపై, మార్కెట్లపై దాడి చేసి పిల్లలతో సహా పౌరులను చంపేయడం, దానికి అమెరికా సాంకేతిక సహకారం యివ్వడంతో బాటు క్లస్టర్ బాంబులు సమకూర్చడం విమర్శలకు గురవుతోంది. యుద్ధానికి ముందు అమెరికా సాయంతో సౌదీ యెమెన్‌పై ఆర్థిక దిగ్బంధం విధించింది. మానవతా దృక్పథంతో యితరులు పంపిన ఆహారం, దుస్తులు తీసుకుని వస్తున్న ఓడలను కూడా రేవులో లంగరు వేయనివ్వలేదు. యెమెన్‌లోకి ఏది ప్రవేశించాలన్నా సౌదీలు తనిఖీ చేయాల్సిందే. యెమెన్‌లో జరుగుతున్నదాన్ని రిపోర్టు చేద్దామని వెళ్లిన విదేశీ మీడియాను సౌదీ అనుమతించలేదు.

ఇదంతా చూసి నెదర్లాండ్స్ యెమెన్‌లో అన్ని పక్షాల ద్వారా జరుగుతున్న యుద్ధనేరాల గురించి యునైటెడ్ నేషన్స్ చేత విచారణ జరిపించాలని ప్రయత్నించింది. కానీ అమెరికా, బ్రిటన్ మద్దతుతో సౌదీ దాన్ని అడ్డుకోగలిగింది. గత జూన్‌లో యునైటెడ్ నేషన్స్ వారు బాలల హక్కులు హరిస్తున్న దేశాల బ్లాక్ లిస్టు తయారుచేసి దానిలో సౌదీ పేరు చేర్చింది. 'అలా చేరిస్తే మేం మీ సంస్థలకు యిచ్చే విరాళాలను ఆపేస్తాం' అని సౌదీ బెదిరించడంతో లిస్టులోంచి దాని పేరు తీసివేయవలసి వచ్చింది. ఇలాటి ఒత్తిళ్లు యుఎన్ఓ జనరల్ సెక్రటరీ బాన్-కి-మూన్‌పై వస్తూనే వున్నాయి. చివరకు ప్రాణం విసిగి 'సౌదీ మాపై ఒత్తిడి చేస్తోంది' అని ఆయన ప్రకటించాడు. చొరవ తీసుకుని కువాయిత్‌లో శాంతి చర్చలు ప్రారంభించాడు. అన్ని పక్షాలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి, దాన్ని కొత్తగా నియమించిన తాత్కాలిక అధ్యక్షుడు నడపాలని హౌతీలు ప్రతిపాదించారు. సౌదీలో ప్రవాసంలో వుంటున్న మన్సూర్ హాదీ 'అదేం కుదరదు, నన్ను మళ్లీ అధ్యక్షుణ్ని చేయాలి. హౌతీలు ఆయుధాలు విసర్జించి, ఉత్తర యెమెన్‌కు వెళ్లిపోవాలి' అని పట్టుబట్టాడు. మూణ్నెళ్లపాటు సాగిన చర్చలు చివరకు విఫలమయ్యాయి.

కువాయిత్‌లో చర్చలు సాగుతూండగానే సౌదీలు విమానదాడులు మళ్లీ ప్రారంభించేశారు. యునైటెడ్ నేషన్స్ నిరసిస్తున్నా, అమెరికా, బ్రిటన్‌ల అండ చూసుకుని ఇరాన్‌పై కక్షతో సౌదీ యెమెన్‌పై భీకర యుద్ధం సాగిస్తోంది. వారు ఆక్రమించుకున్న ప్రాంతాల్లో ఎక్యూఎపి, యితర యిస్లామిక్ గ్రూపులు వారిని ఎదిరిస్తున్నాయి. ఈ యుద్ధం ఎంతకాలం సాగుతుందో తెలియదు. నిజం చెప్పాలంటే సౌదీ ఆర్థిక పరిస్థితి బాగాలేని యీ తరుణంలో యీ యుద్ధం దానికి పెనుభారం కాబోతోంది. ఏడాదిగా ఆయిలు ధరలు బ్యారెల్ 30-40 డాలర్ల మధ్య తచ్చాడుతోంది. 2015లో సౌదీకి 100 బిలియన్ డాలర్ల లోటు బజెట్. ఈ ఏడాది యింకా పెరుగుతుంది. అయినా పట్టుదలతో పౌరులను, బాలబాలికలను చంపుతూ యెమెన్‌లో యుద్ధం చేస్తోంది. ఇరాక్‌లో మానవహక్కులకు విఘాతం కలిగింది, లిబ్యాలో కలిగింది అంటూ ఆ దేశాల వ్యవహారాల్లో చొరబడే అమెరికా కంటికి యీ ఘోరాలేవీ ఆనటం లేదు. **- ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఆగస్టు 27 - 29 వీక్లీకై **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ - 92**

ఎమ్బీయస్ : బ్రెగ్జిట్‌పై తగ్గిన బ్రిటన్ ఉత్సాహం

ఎవరూ ఊహించని విధంగా బ్రెగ్జిట్‌కు ఓటేసిన బ్రిటన్లు యూరోప్ యూనియన్‌లోంచి బయట పడడానికి మరీ ఉబలాటంగా ఏమీ లేరు. బ్రిటన్‌కు ప్రధానిగా ఎన్నికైన థెరెసా మే 'రిమైన్' వర్గానికి చెందినది. కానీ ప్రధాని అవుతూనే 'బ్రెగ్జిట్టంటే బ్రెగ్జిట్టే. వెనకడుగు వేసే ప్రశ్నే లేదు. ఇయుతో చర్చలు యీ శిశిరానికల్లా మొదలుపెట్టేస్తాం' అని ప్రకటించింది. అంది కానీ అడుగు ముందు పడటం లేదు. ఎందుకంటే బ్రెగ్జిట్ అంటూ రంకెలు వేసినవారెవరూ ఈయు లోంచి బయటపడే మార్గం గురించి, ప్రత్యామ్నాయాలు వెతకడానికి ఎంత కష్టపడాలి, ఎన్నేళ్లు పడుతుంది అన్న విషయంపై లోతుగా ఆలోచించలేదు. 'లీవ్' అంటే చాలు యీ శరణార్థుల పీడ వదులుతుంది, ఉద్యోగాలన్నీ మనవే, బ్రస్సెల్స్ మాట మనం వినక్కరలేదు అనుకున్నారంతే. వెళ్లిపోతానన్నారుగా, యింకా వెళ్లరేం? అని ఇయు ఓ వైపు నుంచి వెక్కిరిస్తోంది. అసలు ఇయుతో చర్చలు ఎలా మొదలుపెట్టాలి, ఏ ప్రశ్నలడగాలి అనే విషయంలోనే బ్రిటన్‌కు స్పష్టత లేదు. అందువలన చర్చలు వచ్చే ఏడాది శిశిరం దాకా ప్రారంభమయ్యే సూచనలు కనబడటం లేదు.

ఇయులోంచి బయటపడడం మాట సరే, మరి ప్రపంచ వాణిజ్య సంస్థ (వ(ర)ల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్)లోని 163 దేశాలతో విడివిడిగా ఒప్పందాలు కుదుర్చుకోవాలంటే ఓ పట్టాన అయ్యే పని కాదు. ధరవరల టారిఫ్‌లు, కోటాలు, రాయితీలు, పన్నులు, ఎలాటి వస్తువులు అనుమతించాలన్న దానిపై ఆంక్షలు వంటి అనేక విషయాలపై క్షుణ్ణంగా పరిశీలించి ఒప్పందాలు చేసుకోవాలి. వీటిని హ్యాండిల్ నిపుణులను ట్రేడ్ నెగోషియేటర్స్ అంటారు. వారి చార్జీలు కూడా భారీగానే వుంటాయి. ఇయులోని ట్రేడ్ డిపార్టుమెంటులో 600 మంది యిలాటి నిపుణులున్నారు. బ్రిటన్ వద్ద ప్రస్తుతం 25 మంది వున్నారు. కనీసం 500 మంది వుంటే కానీ కథ ముందుకు నడవదని ఇంటర్నేషనల్ ట్రేడ్ లాయర్లు అంటున్నారు. ఈ ఏడాది చివరకు 300 మందినైనా నియమించాలని బ్రిటన్ సంకల్పించింది. వీరు రంగంలోకి దిగి చర్చలు మొదలుపెట్టి, అవతలి దేశపు నిపుణులతో తలపడడం, ఉభయతారకమైన ఒప్పందాలపై సంతకాలు

పెట్టడం ఎన్నాళ్లు పడుతుందో ఎవరికీ తెలియదు.

ఈ వాణిజ్య చర్చలు ప్రారంభం కావాలంటే ఇయు ఒప్పందంలోని ఆర్టికల్ 50 కింద బ్రిటన్ ఫలానా తేదీ లోపున తను వైదొలగుతున్నట్లు అధికారికంగా ప్రకటించాలి. ఆ ఫలానా తేదీ ఎప్పుడో థెరిసా తేల్చుకోలేక పోతోంది. ఆలస్యం చేసిన కొద్దీ వచ్చే ఏడాదిలో ఫ్రాన్సు, జర్మనీల్లో ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వాలు వస్తే సమస్య మరింత జటిలం కావచ్చు. (బ్రిటన్ ప్రధాని – థెరెసా మే) – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఎమ్బీయస్ : రియో – బానిస వ్యాపారానికి కూడలి

ఒలింపిక్స్ కారణంగా రియో పై అందరి దృష్టి పడింది. ఈ సందర్భంగానే అది ఒకప్పుడు ముమ్మరంగా జరిగిన బానిస వ్యాపారానికి కూడలి అనే విషయాన్ని చరిత్రకారులు తవ్వి తీశారు. ఒలింపిక్స్ జరిగిన స్థలానికి అతి సమీపంలోనే ఆఫ్రికా నుంచి బానిసలను తెచ్చి వివిధ దేశాలకు అమ్మిన మార్కెట్ వుంది. 16–19 శతాబ్దాల మధ్య పోర్చుగల్‌కు బ్రెజిల్ వలసదేశంగా వుండే ఆ రోజుల్లో చెఱుకు, కాఫీ పొలాల్లో పనిచేయించడానికి పోర్చుగల్ వారు 55 లక్షల మంది ఆఫ్రికా పౌరులను బ్రెజిల్ దేశానికి బానిసలుగా తీసుకుని రావాలని చూశారు. మార్గమధ్యంలో ఎదురైన దుర్భర పరిస్థితుల వలన చనిపోయినవారు 6 లక్షల మంది! ప్రాణాలతో బ్రెజిల్‌కు చేరిన 49 లక్షల్లో 20 లక్షల మంది రియో మార్కెట్టుకే వచ్చారు. పోల్చి చూడాలంటే ఉత్తర అమెరికాలోకి అడుగు పెట్టిన మొత్తం బానిసలు 4 లక్షల మంది! "ఇన్నాళ్లూ అట్లాంటిక్ సముద్రంపై బానిస వ్యాపారులు అనగానే బ్రిటన్ వాళ్లే గుర్తుకు వచ్చేవారు. వాళ్లు బానిసలను తీసుకుని వచ్చిన కరిబియన్ సముద్రం గుర్తుకు వచ్చేది. అసలైన బానిస వ్యాపారులు పోర్చుగీసు వాళ్లని యిప్పుడు తేటతెల్లమౌతోంది. బానిసలను అధికంగా వచ్చి చేరింది బ్రెజిల్‌కే!" అని పరిశీలకుడొకడు వ్యాఖ్యానించాడు.

రియోలోని వలోంగో వార్ఫ్‌ను 1811లో కట్టారు. లక్షలాది ఆఫ్రికన్లను సంకెళ్లలో అక్కడకు తెచ్చి అమ్మివేశారు. ఓడ ప్రయాణంలో చనిపోయినవారిని దగ్గర్లో వున్న 'సెమిటరీ ఆఫ్ న్యూ బ్లాక్స్'లో కప్పిపెట్టేవారు. అలా 40 వేల మందిని అక్కడ ఖననం చేశారు. ఖననం చేసిన కొన్నాళ్లకు బయటకు తీసి ఎముకలను పిండిపిండి చేసి, అక్కడ మరొకరిని కప్పిపెట్టేవారు. బానిసలను ఎంత పెద్ద సంఖ్యలో తెచ్చారంటే రియో పట్టణంలోని జనాభాలో సగం మంది వారే వుండేవారు. అయితే వారికి హక్కులు వుండేవి కావు. చిన్న తప్పుకి సైతం రహదారుల్లో నిలబెట్టి కొరడాలతో కొట్టేవారు. చివరకు 1850లో బానిస వ్యాపారాన్ని నిషేధించారు. కానీ అప్పటికే తెచ్చేసిన బానిసల చేత పని చేయించుకోవడం బానిసత్వాన్ని అధికారికంగా నిర్మూలించిన 1888 సంఎఎ వరకు సాగింది. ఆ మరుసటి ఏడాదే బ్రెజిల్ రిపబ్లిక్‌గా అవతరించింది. వలోంగో వార్ఫ్ పేరు తుడిచి వేయడానికి దాన్ని పడగొట్టి దాని స్థానంలో మరో పేరుతో యింకా పెద్ద రేవు కట్టారు. 1891లో బ్రెజిల్ ప్రభుత్వం తమపై వున్న మచ్చ పోగొట్టుకోవడానికి తమ దేశంలో బానిస వ్యాపారం సాగిందని నిరూపించే దస్తావేజులన్నీ తగలబెట్టమని ఆదేశాలిచ్చింది. అందువలన వలోంగో పేరు కూడా చరిత్ర పుటల్లో మాసిపోయింది. 2016 ఒలింపిక్స్ జరపడానికి వేదికగా రియోను 2009లో ప్రకటించాక అక్కడ 2 బిలియన్ డాలర్ల ఖర్చుతో యింకా పెద్ద రేవు కట్టారు. ఇంత చేసినా గతకాలపు చిహ్నాలు మాసిపోలేదు. రేవు వైపు వున్న పట్టణంలో నల్లవారు ఎక్కువగా కనబడతారు. పేదరికం తాండవిస్తూ వుంటుంది. అందుచేత పనివారి శ్రమను దోపిడీ చేసుకోవడమూ జరుగుతోంది. ప్రభుత్వం నియమించిన యిన్‌స్పెక్టర్లు వ్యాపారస్థలాలపై దాడులు చేసి దుర్భర పరిస్థితుల్లో పనిచేసే కార్మికులను రక్షించి, యజమానులపై కేసులు పెడుతూంటారు. 2003 నుంచి అలా పెట్టిన కేసులు 45 వేలు! అంత తక్కువ వేతనానికి పనిచేయవలసిన అవసరం పడుతోందంటేనే యిది ఆధునిక బానిసత్వం అనాలి. (ఫోటో – 125 ఏళ్ల క్రితం వలోంగో రేవు వున్న చోటు యిదే) – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఎమ్బీయస్ : చైనా వివాహవేదికలు

మన దగ్గర వివాహ వేదికలు ఎలా నడుస్తున్నాయో చూస్తున్నాం. ఫలానా కులం వారి వివాహ వేదిక అని పత్రికలో యాడ్ వస్తుంది. అక్కడకు ఆడ, మగ పిల్లల తలిదండ్రులు చేరతారు. తమ పిల్లల వివరాలు ప్రకటిస్తారు. నచ్చితే సంప్రదింపులు జరుపుతారు. కొన్ని సందర్భాల్లో అది పెళ్లి చూపులకు, పెళ్లికి కూడా దారి తీస్తుంది. ఇటీవలి కాలంలో యీ వేదికలకు వచ్చేవారిలో మగపిల్లల తలిదండ్రులు ఎక్కువగా వుంటున్నారు. ఆడపిల్లలు 'ఇప్పుడే కాదు' అనడం, సంబంధం తెచ్చి చూపినా ఎటూ తేల్చకపోవడం వలన వాళ్ల అమ్మానాన్నా ఏం చేయాలో, ఎలా చెప్పాలో పాలుపోని పరిస్థితుల్లో పడుతున్నారు. మంచి సంబంధం చూపిస్తే ఔనంటుందేమోనన్న ఆశతో వేదికలకు వచ్చి, మగపిల్లల అమ్మానాన్నలకు ఏం చెప్పి తప్పించుకోవాలో తెలియక యిబ్బంది పడుతున్నారు. చైనాలో కూడా యించుమించు యిదే పరిస్థితిట. బీజింగులోని ఝూంగ్‌షాన్ పార్కులో ఆదివారమయ్యేసరికి మూడు వేల మంది ఆడ, మగ పిల్లల తలిదండ్రులు ఓ ఎ4 కాగితం మీద అబ్బాయి లేదా అమ్మాయి వివరాలు ఆరేడు లైన్లలో రాసి తమ ఎదురుగా పెట్టుకుని కూర్చుంటున్నారు. పుట్టిన సంవత్సరం, చదువు, ఉద్యోగం, పొడుగు, శరీరపు రంగు, అలవాట్లు, హోబీలు, ఇల్లు వుందా లేదా అన్న విషయం దానిలో

వుంటాయి. వాళ్లకు కులం, మతం పట్టింపు లేదు కాబట్టి వాటి ప్రస్తావన వుండదు. అయితే వాళ్లకు జాతకాల పట్టింపు వుంది. ఒక్కో సంవత్సరం పుట్టినవారి లక్షణాలు ఒక్కోలా వుంటాయని వారి నమ్మకం. ఆ సంవత్సరానికి ప్రతీకగా ఓ జంతువో, పక్షో వుంటుంది. అవతలివాళ్లు పుట్టిన సంవత్సరపు జంతువుతో యిది మ్యాచ్ అవుతుందా లేదా అన్నది చూస్తారు. అంటే మన దగ్గరున్న 'యోనిపొంతన'లా అన్నమాట! 1989లో పుట్టినవాళ్ల రాశి పాము. 1990లో పుడితే గుఱ్ఱం. 1991 ఐతే గొఱ్ఱె. పాము రాశి వాళ్లు గుఱ్ఱం, గొఱ్ఱె రాశివాళ్లను చేసుకోరు. మన దగ్గర షష్టాష్టకాల పట్టింపు వున్నట్లు, అక్కడ కూడా ఆరేళ్ల గ్యాప్ వుంటే పెళ్లి విఫలమవుతుందని నమ్ముతారు. ఐదేళ్ల లేదా ఏడేళ్ల గ్యాప్ అయితే ఫర్వాలేదట.

చైనాలో ఆర్థిక సంస్కరణలు మొదలై యువతీయువకులు నగరాల బాట పట్టాకనే యీ వివాహ వేదికల సంస్కృతి వచ్చింది. నగరానికి వచ్చి, సొంతంగా సంపాదించడం మొదలుపెట్టాక అమ్మాయిలు తలిదండ్రులు చెప్పిన అబ్బాయిని గుడ్డిగా చేసుకోవడానికి సిద్ధపడటం లేరు. వారికి నచ్చినవారిని వెతికి తెచ్చే బాధ్యత కుటుంబంపై పడింది. సాంస్కృతిక విప్లవం తర్వాత ఒకరే బిడ్డ వుండాలి అని ఆంక్షలుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది మగపిల్లవాళ్లనే కన్నారు. గర్భంలో వున్నది అమ్మాయి అని తెలియగానే అబార్షన్లు చేయించుకోవడం వలన యిప్పుడు అమ్మాయిలకు కరువు వచ్చింది. 20-45 వయసు గ్రూపులో 2020 నాటికి ఆడవాళ్ల కంటె మగవాళ్లు 2.40 కోట్ల మంది ఎక్కువ వుంటారని అంచనా. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో రూ. 15 లక్షల దాకా కన్యాశుల్కం యిచ్చుకోవలసి వస్తోంది. అందువలన అమ్మాయిలు తమకు కావలసినది ముక్కు గుద్ది అడగగలుగుతున్నారు. పెళ్లి నాటికే అబ్బాయికి యిల్లు వుండి తీరాలని చెపుతున్నారు. బీజింగులో 60 చ.మీ.ల ఫ్లాటు అంటే కోటి నుంచి రెండు కోట్ల రూ.ల దాకా వుంటుంది. 30 ఏళ్ల వయసు లోపల అంత గడించడం అందరి వలనా సాధ్యపడే విషయం కాదు. అబ్బాయి నచ్చితే ఇల్లు లేకపోయినా చేసుకోమని అమ్మాయిని అమ్మానాన్నా పోరుతూ వుంటారు.

మావో విధానాల వలన చైనా మహిళలు విద్య, ఆరోగ్యం, ఉద్యోగం, వ్యాపారం విషయంలో భారతీయ మహిళల కంటె చాలా ముందుకు దూసుకుపోయారు. తమ కంటె తక్కువ సంపాదించేవాణ్ని, తమ కంటికి పెద్దగా ఆననివాణ్ని పెళ్లి చేసుకోవడానికి వాళ్లు సుముఖంగా లేరు. పార్కుకి వెళ్లి సంబంధాలు చూస్తామని తల్లి అంటే ఔనని, కాదని ఏమీ అనటం లేదు. మౌనం అర్ధాంగీకారం అనుకుని వీళ్లు పార్కుకి వచ్చి వేటాడుతున్నారు. ఎవరైనా కంటికి నదురుగా కనబడితే కూతుర్ని ఒప్పించవచ్చని ఆశ. అమ్మాయిలు పెళ్లిళ్లు వాయిదా వేయడం సమాజానికి మంచిది కాదని అక్కడి మీడియా కూడా భావిస్తోంది. అందువలన పాతికేళ్లు దాటగానే పెళ్లి చేసుకోవాలని ఉద్బోధిస్తూ, 30 ఏళ్లు వచ్చేసిన అమ్మాయిలను 'మిగిలిపోయినవాళ్లు' (లెఫ్టోవరు)గా వర్ణిస్తున్నారు. అక్కడ సాధారణంగా అయిదారేళ్ల వ్యత్యాసంతో పెళ్లి చేసుకుంటున్నారు. తెల్లగా వున్నవారికి గిరాకీ ఎక్కువ. మాట్రిమోనియల్ సైట్లలో దొంగ ఐడిలు పెట్టడమూ ఎక్కువే. అందువలన యిలా పార్కులకు వెళ్లి అబ్బాయి లేదా అమ్మాయి కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలవడం మంచిదే అనే అభిప్రాయంలో అందరూ వున్నారు. ఇలాటి పార్కులు బీజింగులోనే చాలా వున్నాయి. తక్కిన వూళ్లల్లో కూడా వున్నాయి. అక్కడ కనబడే జాబితాలలో చాలా ఉన్నతపదవుల్లో వున్న వధూవరులూ కనబడతారు, 40 ఏళ్లయినా పెళ్లికాని అబ్బాయిలూ కనబడతారు. చైనాకూ, మనకూ అనేక విషయాల్లో పోలికలున్నాయి. వాటిలో యిదీ వచ్చి చేరింది. (ఫోటో - బీజింగులో ఝూంగ్‌షాన్ పార్కులో ఓ ఆదివారం ఉదయం) **- ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఆగస్టు 30, 31 **ఎమ్బీయస్ : హమ్మయ్య, కృష్ణాష్టమికి ఏం చేయలేదు**

కృష్ణా పుష్కరాలు అయిపోయాయి కాబట్టి బాబు కృష్ణాష్టమి సందర్భంగా ఏదో ఒక కార్యక్రమం భారీ ఎత్తున చేస్తారేమోనని బెంగ పెట్టుకున్నాను. జిల్లా పేరు కృష్ణ కాబట్టి, ఆ కృష్ణుడికి, యీ జిల్లాకు ఎక్కడో లింకు కలిపి ఏదో ఫంక్షన్ పెట్టేస్తారనుకున్నాను. కృష్ణుడి వేషంలో ఎన్టీయార్ విగ్రహాన్ని కృష్ణవేణీ నదీతీరాన నిలపడమో, ఉట్టి కొట్టే సంబరానికి 13 జిల్లాల నుంచి యువతీ యువకులందరూ పాలు, పెరుగు కుండలు చేత ధరించి పట్టుకుని వచ్చే విధానం గురించి బాబు వివరించడమో, వచ్చినవారిని పదింతలుగా లేజరు కిరణాలతో చూపే గ్రాఫిక్‌కు బోయపాటి శ్రీనుకు కాంట్రాక్టు యివ్వడమో, ఉట్టికొట్టే కళలో తర్ఫీదు యిచ్చేందుకు ఒక అకాడమీ ప్రకటించి దానికి భూమి కేటాయించడమో... యిలాటివి ఏవో వుంటాయని వూహ పోయింది. పుష్కరాల అలసట వలననో ఏమో బాబు యీ ఏడాదికి కృష్ణాష్టమిని వదిలేశారు.

బాపు-రమణల వద్ద ఓ ముస్లిం డ్రైవరు దశాబ్దాలపాటు పనిచేసేవాడు. అతను ముస్లిం పండగలకు సెలవడిగి తీసుకోవడంతో మొదలు పెట్టి, క్రమేపీ దసరా, సంక్రాంతి, ఉగాదికి కూడా సెలవలడిగి తీసుకోసాగాడు. బాపు గారికి చిరాకేసినా దాన్ని జోక్‌గా మార్చి తన ఆఫీసులో పనిచేసే శ్రీరమణ (ముళ్లపూడి వెంకటరమణగారు వేరు, యీయన వేరు) గారి దగ్గర అన్నారట - "వాడికి హిందూ పండగల గురించి ఎవరు ఆచూకీ యిస్తున్నారో కాస్త కనిపెట్టండి. చూడబోతే వీడు భీష్మ ఏకాదశికి, పోలాల అమావాస్యకు కూడా సెలవడిగేట్లున్నాడు." అని. ఇప్పుడు బాబుగారి వరస చూస్తూంటే నాకు ఆ జోకే గుర్తుకు వస్తోంది. ఆయన కూడా పంచాంగం కాలండర్ దగ్గర పెట్టుకుని ఏ పండగ వస్తుందా ఎంత ధూమ్‌ధామ్ చేయాలా అని చూస్తున్నట్లుంది. సాంస్కృతిక సంఘాల వాళ్లుంటారు. వాళ్ల దగ్గర ఆర్గనైజ్ చేసే శక్తిసామర్థ్యాలుంటాయి, చేతిలో ఆర్టిస్టులుంటారు, స్పాన్సర్లుంటారు, కార్యక్రమం పెడితే వచ్చి

హాలు నింపే జనాలుంటారు. వాళ్లు నిరంతరం వెతికేది సందర్భం కోసం! ఎవరిదైనా శతజయంతి గట్రా అంటే సరేలే అనుకుంటాం. కానీ శతజయంతులు నూరేళ్లు పోయాక కానీ రావు. మరి వీళ్లకు పబ్లిసిటీ ఎలా? అందుకని ఫలానా సినిమా రిలీజై 32 ఏళ్లు, ఫలానా బ్యానర్ స్థాపించి 43 ఏళ్లు, ఫలానావారు మద్రాసులో అడుగుపెట్టి 48 ఏళ్లు.. అంటూ ఫంక్షన్లు చేస్తారు. పింగళి గీతాలు, విజయా సినిమాల వీనుల విందు, ఎన్టీయార్ హిట్స్... యిలా ఏ పేరు పెట్టినా అవే పాటలు, అదే హాలు! ఆహూతులు, ఆర్టిస్టులు, వక్తలు.. అంతా ఎప్పటివారే!

బాబుది కూడా యిదే తంతు! పండగ లేదా ఫంక్షన్ ఏదైనా సరే, అవే నినాదాలు, అవే ప్రకటనలు. 'ఏర్పాట్లన్నీ ఘనంగా, అంతర్జాతీయ స్థాయిలో వుండాలని, ముందస్తు ప్రణాళిక వేసుకుని సిద్ధంగా వుండాలని బాబు మూడు నెలల ముందుగానే అధికారులకు ఆదేశాలిచ్చారు', 'నిధులకు ఏ కొరత వుండదని హామీ యిచ్చారు', 'ఈ ఫంక్షన్ నిర్వహణాసామర్థ్యం చూసి రాష్ట్రానికి పెట్టుబడులు వరదగోదారిలా వచ్చిపడతాయని పరిశీలకులు వ్యాఖ్యానించారు', 'రాష్ట్రంలోని ప్రతీ యింటి నుంచి అందరూ దీనికై తరలి రావాలని బాబు పిలుపు నిచ్చారు, ఎలా రావాలో కూడా ఆ విధివిధానాల గురించి ముప్పావు గంట ఉపన్యాసం యిచ్చారు', 'పెట్టుబడుల కోసం విదేశాలు వెళ్లి తిరిగి వచ్చిన బాబు ఏర్పాట్లు పర్యవేక్షించి పెదవి విరిచారు, రాష్ట్రప్రతిష్ఠ పెంచాలని తను రోజులో 20 గంటలు శ్రమిస్తూ వుంటే అధికారులు అలసత్వం చూపడం బాధాకరంగా వుందన్నారు, దీనిలో ప్రతిపక్షాల కుట్ర వుందని, రాష్ట్రం అలా ముందుకు పోతూ వుంటే వారికి కిట్టదని, తన 45 ఏళ్ల రాజకీయజీవితంలో యింత దుర్మార్గుడైన ప్రతిపక్ష నాయకుణ్ని ఎప్పుడూ చూడలేదని అన్నారు', 'పనులు వేగవంతం చేయడానికి టెండర్ల ప్రక్రియ పక్కన పెట్టి నామినేషన్ పద్ధతిని పనులు చేపట్టమని ఆదేశాలిచ్చారు', 'ఆదరాబాదరాగా పనులు చేయడం వలన కట్టినవి అప్పుడే కూలిపోతున్నాయని, నాణ్యత విషయంలో మీరు తృప్తి పడ్డారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తనకు ఏ విషయంలోను ఎన్నడూ తృప్తి వుండదని, దానికి వెంకయ్యనాయుడే సాక్షి అనీ బాబు సమాధానమిచ్చారు', 'రాజధాని కూడా లేని రాష్ట్రంలో, నిధుల కొరత వున్నా, ప్రజలను ఉత్సాహపరచడానికి, రాష్ట్రాన్ని ప్రపంచపటంలో నిలపడానికి తను పడుతున్న శ్రమను గుర్తించడం మానేసి కోడిగుడ్డుకు యీకలు పీకితే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు', 'ఫంక్షన్‌కి వచ్చిన స్పందన చూసి ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు, వచ్చే ఏడాది దీనికి మించిన స్థాయిలో చేస్తానని ప్రజలకు వాగ్దానం చేశారు'.... యివే వార్తలు.

గోదావరి పుష్కరాలప్పుడూ యివే హామీలు, హుంకరింపులు విన్నాం. అప్పుడు వేసిన రోడ్లు, కట్టిన ఘాట్లు, చేసిన నిర్మాణాలు ఏడాది తర్వాత ఎలా వున్నాయో గమనించండి. అప్పుడూ సమయం తక్కువని చెప్పి నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు. పుష్కరాలు అనుకోకుండా వచ్చిపడేవి కావు, ఏడాది ముందుగానే ప్లాను చేయవచ్చు. బాబు బిజీగా వుంటారు కాబట్టి వేరేవారికి అప్పగించవచ్చు. దేవాదాయ మంత్రి వుంటాడు, రోడ్లు, బిల్డింగులు, పబ్లిక్ వర్క్స్, హెల్త్.. యీ శాఖలన్నిటికి మంత్రులుంటారు. వాళ్లేమీ పనిచేయరా? అధికారులకు ఆదేశాలివ్వాలన్నా, మందలించాలన్నా వారెవరూ పనికి రారా? అన్నిటికీ బాబేనా? ఆయన విదేశయాత్రకు వెళితే పనులు పడక వేయడమేనా? ఇదెక్కడి ఎడ్మినిస్ట్రేషన్? తక్కిన మంత్రులందరూ, డిపార్టుమెంటు హెడ్స్ ఏ గుఱ్ఱానికి పళ్లు తోముతున్నారు? సర్వమూ తానె ఐనా గోదావరి పుష్కరాల మొదటిరోజు దుర్ఘటనకు మాత్రం తాను బాధ్యులు కారంటారు బాబు. ఆ తప్పిదానికి కారకులు అధికారులు, ప్రజలు, ఆట్టే మాట్లాడితే పుష్కరుడు. కృష్ణా పుష్కరాల సమయంలోనే సింధుకు ఒలింపిక్ రజిత పతాకం వచ్చింది కాబట్టి రెండూ కలిపి చేసేయాల్సి వచ్చింది. లేకపోతే విడివిడిగా చేసే ఛాన్సుండేది. అదీ మంచిదే అయింది. పుష్కరజనం వున్నారు కాబట్టి కాస్త నిండుగా వుంది.

బాబు ఎప్పటిలాగానే సింధుకి మెడలు రావడంలో తన పాత్ర ఏమిటో చెప్పేసుకున్నారు. రెండేళ్లలో ఒలింపిక్స్ నిర్వహించేస్తామంటున్నారు. అలా ఎలా!? అంటూ ఎవరెన్ని జోకులు వేసినా ఆయన దూకుడు ఆగదు. సింధుకి 3 కోట్లు బహుమతి ప్రకటించేశారు. ఉద్యోగుల జీతాలకే కటకటలాడుతూన్న యీ స్థితిలో యీ వితరణ అవసరమా? ఆమెకు యిప్పటికే కోట్లు కురిశాయి. సింధులా అవకాశాలు అందని పేద క్రీడాకారిణులకు తలో లక్ష యిచ్చి ప్రోత్సహిస్తే 300 మంది తయారవుతారు. వారిలో 30 మంది జాతీయ స్థాయికో, 3గ్గురు అంతర్జాతీయ స్థాయికో వెళ్లవచ్చు. అలాటి స్కీముకి బదులు గోపీచంద్ అకాడెమీకి అమరావతిలో 15 ఎకరాలు భూమి యిస్తానన్నారు. ఆయనకే ఎందుకివ్వాలి? ఆయన హైదరాబాదు విడిచిపెట్టి వస్తానన్నాడా? స్థానికంగా ఎవరికైనా యివ్వవచ్చు కదా? అసలు యీ డబ్బుతో ప్రతీ స్కూల్లో డ్రిల్ టీచర్లను నియమించవచ్చు కదా? స్కూళ్లలో ఆటస్థలాలు ఏర్పాటు చేయవచ్చు కదా? గ్రామీణ ప్రాంతాల్లో ఆటవస్తువులు పంచవచ్చు కదా? రాజుల కాలంలో కవులకు భూములు దానం యిచ్చినట్లు, అమరావతిలో భూదానాలేమిటి? ఏ పంటా పండని హైదరాబాదు భూములంటే వేరు. ఇవి రైతులను లాలించి, బెదిరించి లాక్కున్న సస్యశ్యామలమైన భూములు.

అసలు పుష్కరాలకు యింత సందడి అవసరమా? అనే విషయం తెలుగు ముఖ్యమంత్రులిద్దరూ ఎందుకు ఆలోచించరో తెలియటం లేదు. కృష్ణ మహారాష్ట్ర, కర్ణాటక రెండు రాష్ట్రాల్లోనూ ప్రవహిస్తోంది. అక్కడ ప్రభుత్వపక్షాన ఏవైనా కార్యక్రమాలు జరుగుతున్నాయా అని యింటర్నెట్ గాలించినా ఏమీ దొరకలేదు. వాళ్ల పేపర్లలోనూ ఏ న్యూసూ లేదు. గతంలో మన దగ్గరా అలాగే వుండేది. ఏదైనా జాతర, ఉత్సవం ఏ వూళ్లోనైనా జరిగినప్పుడు ప్రభుత్వం బందోబస్తు ఎలా నిర్వహిస్తుందో అలాగే పుష్కరాల విషయంలో జరిగేది. పుష్కరాలకు జనం బాగా వస్తారు కాబట్టి వాళ్లను ఆకట్టుకోవడానికి ప్రయివేటు వ్యాపారస్తులు ఎగ్జిబిషన్లు, కుస్తీ పోటీలు, విమానం

తెచ్చి తిప్పడాలూ వంటివి చేసి డబ్బు గడించేవారు. ఆర్టీసి, రైల్వేలు బస్సులు, రైళ్లు ఎక్కువ వేసి ఆర్జించేది. సేవా సంస్థలు ప్రజాసేవ చేయడానికి యిదొక అవకాశంగా భావించి అన్నదాన శిబిరాలు, చలివేంద్రాలు, రేవుల దగ్గర వాలంటీర్లను సమకూర్చడాలు చేసేవారు. ఇక ప్రభుత్వం పని – కాస్త ముందుగా రేవులను మరమ్మత్తు చేయించడం, బారికేడ్లు కట్టించడం, పోలీసులను, పారిశుధ్య పనివారిని తగినంతగా నియోగించడం, శాంతిభద్రతలు కాపాడడం. ఇప్పటిలా ముఖ్యమంత్రి ఫోటోలతో 'రండు, పుష్కరస్నానం చేయుడు, పాపములను ప్రక్షాళన చేసుకొనుడు' అంటూ క్రైస్తవ పునీత/స్వస్థత సభల్లా వాల్‌పోస్టర్లు వేసే పద్ధతి లేదు.

ప్రతీ ఏడాదీ ఏదో ఒక నదికి పుష్కరాలు వస్తూనే వుంటాయి. ఏ రాష్ట్రంలోనూ యిలాటి పోస్టర్లు వెలిసి వుండవు. అసలు పుష్కరాలకు యింతమంది జనం తరలి వెళ్లేట్లా చేసిన ఘనత చంద్రబాబుదే! అది పెద్దలకు తర్పణాలు విడిచే స్నానం కాబట్టి, కుటుంబ పెద్దలు మాత్రమే వెళ్లేవారు. పిల్లా, పాపాతో తరలి వెళ్లే వాటర్‌స్పాట్ కాదది. తెలుగునాట పుష్కరమంటే గోదావరి పుష్కరమే, అదీ రాజమండ్రిలోనే సందడి వుండేది. గోదావరి ఎన్ని రాష్ట్రాలలో ఎన్ని మైళ్లు ప్రవహించినా రాజమండ్రి వద్దనే వెడల్పుగా కనబడి, అఖండ గౌతమి అనిపించుకుంటుంది. తరతరాలుగా పుష్కరస్నానం అక్కడే చేసేవారు. గోదావరి అవతలివైపు వున్న కొవ్వూరు వద్ద కూడా సందడి తక్కువే. గోదావరి పుష్కరానికి వున్న ప్రశస్తి కృష్ణాపుష్కరాలకు ఎప్పుడూ లేదు. బాబు ముఖ్యమంత్రిగా వుండే రోజుల్లో 2003లో గోదావరి పుష్కరాలు వచ్చాయి. ఆయన తన మార్కెటింగు బుర్రతో పుష్కరాలకు పెద్ద పబ్లిసిటీ కల్పించాడు. ఆబాలగోపాలం వెళ్లాలనే ప్రచారం సాగింది. అదో ఫ్యామిలీ ఎక్స్‌కర్షన్ అయిపోయింది. దాని వలన దైవభక్తి లేదా నదుల పట్ల పర్యావరణ స్పృహ పెరిగిందా అని అడిగితే ఎవరూ సమాధానం చెప్పలేరు. ఎందుకంటే గత 13 ఏళ్లల్లో నేరాలూ పెరిగాయి, వాతావరణ కాలుష్యమూ పెరిగింది.

అప్పుడే బాబు తెలంగాణలో అనేక గోదావరి ఘాట్లు నిర్మించి, అక్కడకు కూడా వెళ్లమని ప్రచారం చేశారు. అప్పటిదాకా గోదావరి తమ ప్రాంతాల ద్వారా ప్రవహిస్తోందన్న స్పృహే లేని తెలంగాణ ప్రజలు ఆయా క్షేత్రాల వైపు పరుగులు తీశారు. హైదరాబాదులో వున్న ఆంధ్రమూలాల వారు కూడా ఏదైనా గోదావరే కదా అనుకుంటూ అక్కడికి వెళ్లారు. కొందరు ఎందుకైనా మంచిదని యిక్కడా మునిగి, రాజమండ్రికీ వెళ్లారు. ఆనాడు బాబు తెలంగాణలో కలిగించిన పుష్కరస్పృహ యిప్పుడు ఆయనకు హాని కలిగించిందని చెప్పుకోవాలి. బాబు బాటలోనే వైయస్ వెళ్లారు. తెలంగాణలో కృష్ణ ప్రవహించే ప్రాంతాలను వెతికి పట్టుకుని హైలైట్ చేశారు. ఈసారి గోదావరి, కృష్ణ పుష్కరాలు వచ్చేసరికి బాబుకి పబ్లిసిటీలో ఏ మాత్రం తీసిపోని కెసియార్ తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారు. ఉధృత ప్రచారంతో చాలామంది తెలుగువాళ్లను తెలంగాణకే పరిమితమయ్యేట్లు చేయగలిగాడాయన. గోదావరి జలాలు కలవడం చేత పుష్కర సమయంలో కృష్ణ పవిత్రత ప్రశ్నార్థకం అంటూ తెలంగాణ పండితులు లేవనెత్తిన సెంటిమెంటు భక్తులపై బాగానే పనిచేసిందట. అసలు పుష్కరస్నానమే ఓ సెంటిమెంటు. దుర్గా ఘాట్‌లో కంటె ఫెర్రీల వద్ద ఎక్కువమంది స్నానాలు చేశారట. ఇవన్నీ ముందుగానే వూహించి ఆంధ్ర ప్రభుత్వం మరీ అంత భారీగా ఏర్పాట్లు చేయకుండా వుంటే సరిపోయేది. గత పుష్కరాల కంటె కృష్ణాజిల్లాలో ఘాట్ల సంఖ్య 10 రెట్లు పెరిగిందట. కానీ జనం ఆ మేరకు పెరగలేదే!

ఏ మేరకు జనం వచ్చి స్నానం చేశారన్నది ఎవరికి వారే వూహించుకోవాలి. ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వ లెక్కలు ఏవీ నమ్మడానికి లేదు. వాళ్లు వేల కోట్లు ఖర్చు పెట్టేసి, దాన్ని జస్టిఫై చేసుకోవడానికి జనాల సంఖ్య పెంచి చెపుతున్నారు. ఎన్నికల సభ నిర్వహించినపుడు చూడండి, 4 లక్షల మంది వచ్చారంటారు. నిజానికి ఆ మైదానం విస్తీర్ణం లెక్క వేసి చూస్తే ఒకళ్ల నెత్తిన మరొకళ్లు నిల్చున్నా 50 వేలకు మించరు అని పరిశీలకులు చెప్తారు. జనబాహుళ్యాన్ని కంటితో చూసి ఈ ఏరియాలో యింతమంది వున్నారు అని చెప్పడం మామూలు ప్రజలకు అసాధ్యం. పుష్కరాలలో మొదటి రోజు జనం లేరు. వరలక్ష్మీ వ్రతం కాబట్టి అన్నారు. తర్వాతి రోజు కొద్దిగా పెరిగారు. ఆదివారం, సోమవారం సెలవులు కాబట్టి జనం వచ్చారు. మళ్లీ ఆదివారం వచ్చారు. తక్కిన రోజుల్లో విజయవాడలో జనం పలచగానే వున్నారు. ఊహూ జనం వచ్చేస్తారని ఎక్కడెక్కడో వాహనాలు ఆపించేసి, నడవమన్నారు. ఎండలు దంచుతున్నాయి. ఎండలో నడవలేక ఉదయం 9 తర్వాత నుంచి సాయంత్రం 4 దాకా ఎవరూ స్నానాలకు వెళ్లడానికి సాహసించలేదు. నేను నా సొంత పనిమీద 19 శుక్రవారం నాడు విజయవాడ వెళ్లాను. స్టేషన్లో కట్టిన షెడ్లన్నీ ఖాళీ. బయట కట్టినవి కూడా ఖాళీగానే వుంటున్నాయని ఊళ్లో చెప్పారు. స్టేషన్లో ఎప్పుడూ వుండే హడావుడే వుంది. మహా అయితే 5% ట్రాఫిక్ ఎక్కువుందేమో. పోలీసులు, సఫాయి పనివారు తప్ప యాత్రికులు పెద్దగా లేరు. మధ్యాహ్నం వూళ్లో రోడ్లన్నీ ఖాళీగానే వున్నాయి. ఎక్కడా పండగ వాతావరణం లేదు. పుష్కరాలకని రేట్లు పెంచిన హోటళ్లు (రోజు లెక్కను 24 గంటల కాకుండా 12 గంటలు చేస్తామన్నారట) డిస్కౌంటులో రూములిస్తామంటున్నారు. నేను పుష్కరస్నానం చేయలేదు కాబట్టి ఘాట్లలో పరిస్థితి కళ్లతో చూడలేదు. కానీ వెళ్లినవాళ్లు రద్దీ లేదనే చెప్పారు. జాతీయ మీడియా వారు కూడా దీన్ని గమనించి అడిగితే బాబు 'కృష్ణాజిల్లాపై కమ్యూనిస్టుల ప్రభావం ఎక్కువ కాబట్టి..' అని సర్దిచెప్పారట. ఎప్పటి కమ్యూనిజం? ఇప్పుడు కృష్ణా జిల్లా నుంచి ఎన్నికైనవారిలో కమ్యూనిస్టులెవరైనా వున్నారా? ఈ తరం కమ్యూనిస్టులు దైవభక్తిని కాదనటమే లేదు. గణపతి నా యిష్టదైవం అని సిపిఎం రాఘవులుగారు బాహాటంగానే చెప్పారు. అసలు వాస్తవమేమిటంటే – జనాలు లేరు, పేపర్లలో పుష్కర యాడ్స్ లేవు, ప్రయివేటు వ్యాపారస్తుల్లో ఉత్సాహం లేదు.

ఉన్న ఉత్సాహమంతా బాబుగారిలోనే కనబడింది. వచ్చిన యాత్రికులకు బస్‌స్టాప్‌కు వెళ్లి బైబై చెప్పి వచ్చారట కూడా. సొంతింట్లో ఫంక్షన్కటనా యింత చేసి వుండరు. ఢిల్లీ వెళ్లి జాతీయ నాయకులు పిల్చుకుని వచ్చారు. వెంకయ్యనాయుడు, సురేశ్ ప్రభు (ఆంధ్ర

రాష్ట్రం నుంచి రాజ్యసభ ఎన్నికైనందుకు కాబోలు) మాత్రమే వచ్చినట్లున్నారు. ఈ మాత్రం భాగ్యానికి 1600 కోట్ల దాకా ఖర్చుపెట్టాలా? ఎంత ఖర్చు పెట్టారన్న అసలు ఫిగరు తర్వాతతర్వాత తెలియవచ్చు. డెక్కన్ క్రానికల్ జులై వార్త ప్రకారం అప్పటికే 1080 కోట్లు వివిధ శాఖలకు కేటాయించారని, అది సరిపోదని మరో వెయ్యి కోట్ల ఖర్చు ప్రతిపాదనలను శాఖలు పంపించాయని రాశారు. తాజా హిందూ వార్త ప్రకారం – రాష్ట్ర రెవెన్యూ 10% పెరుగుతూండగా గత ఐదు నెలలుగా ఖర్చు మాత్రం 26% పెరుగుతోంది. నగదు చేతిలో లేని రాష్ట్రం పుష్కరాలకై 1600 కోట్లు ఖర్చుపెట్టడంతో ఢిల్లీ కళ్లెగరేసింది. గతంలో యిచ్చిన నిధులకు లెక్కలు చెప్పకపోగా కొత్తగా నిధులడిగి, అవి యివ్వటం లేదని తమను నిందిస్తున్న రాష్ట్రం యిలాటి ఖర్చుకు పాల్పడడం వాళ్లకు సహజంగానే నచ్చదు.

ఇవేమీ బాబుకి తోచడం లేదు. 'పుష్కరాల నిర్వహణ తర్వాత ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెరిగింద'ంటూ స్టేటుమెంటు యిచ్చారు. పెరిగితే గిరిగితే దేవుడిమీద నమ్మకం పెరగాలి, ఇప్పటిదాకా చేసిన పాపాలు కడుక్కుపోతాయని గౌరవ ముఖ్యమంత్రి చెప్పారు కాబట్టి కొత్త పాపాలు చేసుకోవచ్చని! ప్రభుత్వం మీద నమ్మకం ప్రశ్న ఎలా వస్తుంది? 2018 కల్లా పోలవరం కట్టేస్తానని బాబు అంటున్నారు కాబట్టి కట్టేస్తారని వాళ్లు నమ్మగలరా? నిజంగా కడితే గోదావరి పుష్కర ఘాట్‌లాగే అవుతుందది. నమ్మకం అంటూ కలిగితే 'రాజధాని నిర్మాణం, ఢిల్లీ నడిగి ప్రత్యేక హోదా తేవడం, పరిశ్రమలు తేవడం యిలాటివి చేతకావు కానీ ఏదైనా సందర్భం దొరికితే మాత్రం, జనం వచ్చినా రాకపోయినా, రూపాయి పెట్టే చోట పదిరూపాయలు పెట్టయినా సరే, బాబు రెచ్చిపోయి అన్నీ తానై చేయగలరు. గతంలో నేను సిఎం కాదు, సిఇఓని అని చెప్పుకునేవారు. ప్రస్తుతం నేను సిఎంని కాను, సిఇఎం (చీఫ్ ఈవెంటు మేనేజర్) అని చెప్పుకోవచ్చు.' అని నమ్ముతారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఆగస్టు 32 **ఎమ్బీయస్ : నేపాలి ప్రధాని మార్పులో భారత్ హస్తం?**

ఆగస్టు మొదటివారంలో నేపాల్‌కి కొత్త ప్రధానిగా ప్రచండ మళ్లీ వచ్చారు. గద్దె దిగుతూ మాజీ ప్రధాని కెపి ఓలి తన పదవీభ్రష్టత్వంలో భారత్ హస్తం వుందని ఆరోపించాడు. పొరుగు దేశాల వ్యవహారాలలో కలగచేసుకుంటోందన్న ఆరోపణ రావడం ఏ దేశానికీ మంచిది కాదు. కానీ 338 పార్లమెంటు సభ్యుల అంటే 57% మంది సమర్థనతో 2015 అక్టోబరులో ఎన్నికైన ఓలి, తొమ్మిది నెలల్లోనే దిగిపోవడం, అతను పదవిలో వున్నంతకాలం భారత్ ఘర్షణ వైఖరి అవలంబించడం, భారత్‌కు పాఠం చెప్పడానికి అతను చైనాకు మరింత సన్నిహితం కావడం – యివన్నీ చూస్తే అతని ఆరోపణలో వాస్తవం వుందేమోనన్న సందేహం కలుగుతుంది.

64 ఏళ్ల ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్–లెనినిస్ట్) పార్టీ నాయకుడు. ఇటీవలి ఎన్నికలలో అతని పార్టీకి 175 సీట్లు వచ్చాయి. ప్రచండ నాయకత్వంలోని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు–సెంటర్)కు 80 వచ్చాయి. నేపాలీ కాంగ్రెసుకు 196 సీట్లు వచ్చాయి. దాన్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టడానికి ఓలి, ప్రచండ చేతులు కలిపారు. వాళ్లకు నేపాల్ రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ (24), మాధేశీ రైట్స్ ఫోరమ్–డెమోక్రాటిక్ (14) లతో పాటు మరో 13 చిన్న పార్టీలు కూడా – సమర్థించాయి. 9 నెలల తర్వాత 2016 జులైలో ప్రచండ పార్టీ తన మద్దతు ఉపసంహరించడంతో ఓలి సంకీర్ణ ప్రభుత్వం మైనారిటీలో పడింది. భారత్ ఉద్బోధకు లొంగే ప్రచండ యిలా వ్యవహరించాడని ఓలి అంటున్నాడు. నిజానికి విదేశీ వ్యవహారాల మంత్రిగా వున్నపుడు ఓలిని నేపాల్‌లో "ఇండియా పక్షపాతి"గా చూసేవారు. నేపాల్‌లో ప్రజాస్వామ్యం వచ్చాక 26 ఏళ్లల్లో 23 ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. గత తొమ్మిదేళ్లలో ఎనిమిది ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. ఈ అస్థిరతకు ఇండియా, చైనాల జోక్యం కూడా కారణమని నేపాల్ ప్రజల నమ్మకం. 2001లో రాజవంశీకుల మూకుమ్మడి హత్య తర్వాత అధికారంలోకి వచ్చిన రాజు గ్యానేంద్ర షా రాజకీయ పార్టీల మధ్య విభేదాలు సృష్టిస్తూన్నపుడు అతను చైనాతో చేతులు కలుపుతున్నాడని, నేపాల్ సైన్యానికి చైనా ఆయుధాలు సమకూరుస్తున్నాడని ఇండియా ఆరోపించి, అతనికి వ్యతిరేకంగా ఏడు ప్రజాస్వామ్య పార్టీలకు, మావోయిస్టులకు మధ్య 2015 నవంబరులో రాజీ కుదిర్చింది. అటు చైనా కూడా నేపాల్‌లో వున్న 20 వేల మంది టిబెట్ శరణార్థులపైనే కా నేపాల్ రాజకీయాలపై కూడా కన్నేసి వుంచింది. తమకు అనుకూలంగా వుండేవారు అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తూ వచ్చింది.

2008లో ప్రచండ నెగ్గి ప్రధాని అయినప్పుడు ఓలి సహించలేకపోయాడు. 1996 నుండి పదేళ్లపాటు మావోయిస్టులు ప్రభుత్వంపై సాయుధ తిరుగుబాటు చేసిన రోజుల్లో ఆర్మీ చీఫ్‌గా వున్న రుక్మాంగద కట్వాల్ 17 వేల మంది దాకా మావోయిస్టులు మరణించారు. గత్యంతరం లేక ప్రచండ శాంతి ఒప్పందం చేసుకుని ఎన్నికలలో పాల్గొన్నాడు. తను ప్రధాని కాగానే పాత పగను గుర్తు పెట్టుకుని రుక్మాంగదను పదవిలోంచి తొలగించాడు. అదే అదనని ఓలి ప్రతిపక్షాలన్నిటినీ కూడగట్టి ప్రచండ 2009 మేలో గద్దె దిగేట్లా చేశాడు. దానికి ఇండియా సాయపడిందంటారు. చైనా మావోయిస్టు పార్టీ భావాలతో ఎదిగిన ప్రచండ ఇండియాకు వ్యతిరేకి. అతను ప్రధాని కావడంతో ఇండియా అతన్ని మచ్చిక చేసుకోవాలని చూసింది. అయినా అతను కరగకపోవడంతో ఓలిని దువ్వి ప్రచండ స్థానంలో మాధవ కుమార్ నేపాల్ తెచ్చి వుండవచ్చు.

పదవి పోయిన తర్వాత ప్రచండ పరపతి తగ్గి, 2015 అక్టోబరు వచ్చేసరికి అతని పార్టీకి మూడో స్థానమే దక్కింది. ఓలి పార్టీతో పోలిస్తే సగం కంటె తక్కువ సీట్లు వచ్చాయి. ఓలికి మద్దతు యిస్తే అంతర్యుద్ధ సమయంలో తనపై మోపిన కేసులు ఎత్తివేస్తాడని, తను రాజకీయంగా బలపడవచ్చనే ఊహతో అతను ప్రధాని అయ్యేందుకు సహకరించాడు. ఈసారి యిద్దరూ కలిసి ఇండియాపై

ధ్వజమెత్తారు. ఎందుకంటే నేపాల్ కొత్త రాజ్యాంగం తమకు అనువుగా లేదనే వాదనతో భారత్ మూలాలున్న మాధేశీ గ్రూపులు రహదారుల బంద్ నిర్వహించాయి. వారికి భారతదేశం మద్దతు యిస్తోందన్నది బహిరంగ రహస్యం. ఈ ఆందోళన కారణంగా నాలుగు నెలల పాటు నేపాల్‌కు చమురు, యితర ముఖ్యమైన సరుకులు రవాణా కావడం మానేశాయి. అదే ఏడాది ఏప్రిల్‌లో నేపాల్‌లో భూకంపం వచ్చి సర్వనాశనమైంది. పునరావాస కార్యక్రమాలు యీ నిరసనల కారణంగా దెబ్బ తిన్నాయి. భూకంప సమయంలో భూరిసహాయం చేసినా, 2015 సెప్టెంబరులో ప్రకటించిన నేపాల్ రాజ్యాంగాన్ని ఆహ్వానించకపోవడం, మాధేశీలకు పౌరహక్కులు యివ్వాలని వాదించడం యివన్నీ ఇండియాపై అపనమ్మకాన్ని పెంచాయి. తమ మాట వినినందుకు మాధేశీల ద్వారా తమ నడుం విరుస్తోందని నేపాలీయులు విశ్వసించసాగారు. ఓలి, ప్రచండ వాళ్లను మరింత రెచ్చగొట్టారు. ఇదే అదనని చైనా రంగంలోకి దిగి నేపాల్‌కు అనేక విధాలుగా సాయపడింది. ఓలిని మరింత ఇండియా వ్యతిరేకిగా మార్చింది. 2016 మార్చిలో నేపాల్‌లోని పోఖారాలో అంతర్జాతీయ విమానాశ్రయం, రెండు హైడెల్ ప్రాజెక్టులు నిర్మించేందుకు చైనాతో ఒప్పందం చేసుకున్నాడు. అంతేకాదు, చైనాతో ట్రేడ్ అండ్ ట్రాన్సిట్ ఒప్పందం కూడా చేసుకున్నాడు.

చైనా సాయంతో ఓలి తన పదవిలో బలపడిపోతున్నాడని అనుకున్న ప్రచండ వ్యూహరచన చేశాడు. ఇండియా సాయం కోరి వుంటాడని, ఓలికి బుద్ధి చెప్పడానికి ఇండియా అతనికి హామీ యిచ్చి వుంటుందని అంచనా. 2016 మేలో ప్రచండ, ఓలికి తన మద్దతు ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించాడు. కానీ చైనా రంగంలోకి దిగి ప్రచండను వారించింది. ఒకప్పుడు తనను ఆదుకున్న చైనా మాట కొట్టివేయలేక ప్రచండ 24 గంటల్లోపుగా తన స్టేటుమెంటు వెనక్కి తీసుకున్నాడు. ప్రచండ, అతని సహచరులపై కేసులు ఎత్తివేస్తానని ఓలి, ప్రచండతో సయోధ్య కుదుర్చుకున్నాడు. కానీ రెండు నెలల్లోనే ఆ హామీలు అమలు చేయలేదంటూ ప్రచండ తిరగబడ్డాడు. ఈ సారి 196 సీట్లున్న నేపాలీ కాంగ్రెసుతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. వారి మద్దతుతో రాజకీయ సంక్షోభం సృష్టించాడు. బలం కోల్పోయిన ఓలి రాజీనామా చేయవలసి వచ్చింది. దిగిపోయే ముందూ, తర్వాత ప్రచండ ఇండియా చేతిలో కీలుబొమ్మ అని, తనపై పగ బట్టిన ఇండియా ప్రచండను తనకు వ్యతిరేకంగా ఎగదోసిందని ఆరోపించాడు. ప్రచండకు నేపాలీ కాంగ్రెసుతో బాటు 42 మంది సభ్యులున్న 28 పార్టీల కూటమి కూడా మద్దతిస్తోంది. వారిలో మాధేశీలు కూడా వున్నారు. మాధేశీ సమస్య తీర్చడానికి త్రిసభ్య కమిటీ ఒకటి వేశాడు ప్రచండ. ఏం చేసినా ప్రచండ చైనాకు పూర్తిగా వ్యతిరేకమై, ఇండియా చెప్పినట్లు ఆడతాడని భావించలేం. చైనా యిప్పటికే నేపాల్‌లో చాలా పెట్టుబడులు పెట్టింది. పైగా ప్రచండ మావోయిస్టు కూడా. చైనా సహాయసంపదలతోనే నేపాల్‌పై దశాబ్దాల తరబడి యుద్ధం సలిపాడు. అతను ప్రధాని కాగానే చైనా రాయబారి అతన్ని కలిసి పాత ఒప్పందాలన్నీ గౌరవిస్తాననే హామీ ప్రచండ నుంచి తీసుకున్నాడు. చివరకు ప్రచండ ఎలా తేలతాడో కొన్నాళ్లకు గాని తెలియదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఆగస్టు 33 **ఎమ్బీయస్ : రిలయన్స్ జియో దాడితో మొబైల్ దిగ్గజాల విలవిల**

కొద్దికాలంగా మొబైల్ రంగాన్ని సునీల్ భారతి మిత్తల్ నడిపే ఎయిర్‌టెల్ (26 కోట్లు), సునీల్ సూద్ నడిపే ఓడాఫోన్ (20 కోట్లు), కుమార మంగళం బిర్లా నడిపే ఐడియా సెల్యులార్ (18 కోట్లు) ఏలుతున్నాయి. వారి ఆధిపత్యాన్ని ఎదిరించడానికి ముకేశ్ అంబానీ రిలయన్సు జియో పేరుతో మూడేళ్లగా పోరాటం చేస్తున్నాడు. అత్యాధునికమైన టెక్నాలజీతో, భారతదేశమంతా విస్తరించిన నెట్‌వర్క్‌తో, అతి తక్కువ కాల్ రేట్లతో, అతి ఎక్కువ స్పీడుతో, నాణ్యతతో మార్కెట్‌ను వశపరుచుకోవాలని చూస్తున్నాడు. ఇప్పటికే అప్పులతో సతమతమవుతూ, కొత్తగా పెట్టుబడులు పెట్టలేని స్థితిలో వున్న ఆపరేటర్లు జియో మార్కెట్టులోకి వస్తే తాము కుదేలయిపోతామని భయపడుతున్నారు. అందువలన దాన్ని అడ్డుకుంటూ వచ్చారు. జియో తాము ట్రయల్ రన్ చేస్తున్నామంటూ 15 లక్షల మందికి ఫోన్లు యిచ్చి ఎలా పనిచేస్తున్నాయో చూడమంది. కానీ దానిలో 65% మంది సరిగ్గా పని చేయటం లేదని, కాల్స్ ఫెయిలవుతున్నాయని ఫిర్యాదు చేశారు. దానికి కారణం వుంది.

మన వద్ద ఎయిర్‌టెల్ కనక్షన్ వుంటే అవతలి వాళ్ల దగ్గర కూడా ఎయిర్‌టెల్లే వుండాలని లేదు కదా. ఓడాఫోన్ వుందనుకోండి. ఇద్దరు ఆపరేటర్ల మధ్య ఇంటర్‌కనక్షన్ వుంటేనే మన కాల్ అవతలివాళ్లకు వెళుతుంది. దాని కోసం యిద్దరు ఆపరేటర్ల మధ్య ఒక ఒప్పందం వుండాలి. మొదటి ఆపరేటరు సామగ్రి, యిన్‌ఫ్రాస్ట్రక్చర్ వినియోగించుకున్నందుకు రెండో ఆపరేటరు మొదటి ఆపరేటరుకు చార్జి చెల్లించాలి. కొత్తగా ఎవరైనా ఆపరేటరు మార్కెట్లోకి వస్తే సహజంగా ఆ కంపెనీ నుంచి వెళ్లే కాల్స్ కంటె వచ్చే కాల్స్ యిబ్బడిముబ్బడిగా వుంటాయి. అందువలన వాళ్లు పాతవాళ్లకు చెల్లించవలసిన చార్జిలకై ఎక్కువ ఖర్చవుతుంది. ఈ చార్జిలను ఇంటర్‌కనక్షన్ యూసేజ్ చార్జెస్ (ఐయుసి) అంటారు. రిలయన్సు జియో మార్కెట్లోకి కొత్తగా వస్తోంది కాబట్టి యీ చార్జీలు తగ్గించాలని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయసాగింది. రిలయన్సుకు మరింత సన్నిహితులైన ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2015 మార్చిలో ట్రాయ్ (టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) యీ చార్జీలను 20 పైసల నుండి 14 పైసలకు తగ్గించింది. ఈ ధరలను 2017–18 సంఎఎలో మళ్లీ సమీక్షిస్తానంది. ఇది రిలయన్సు లబ్ధి కోసమే చేసిన మార్పు అని గ్రహించిన ఆపరేటర్లు జియో కస్టమర్లకు ఇంటర్‌కనెక్టివిటీ సరిగ్గా యివ్వలేదు. అందుకే జియో కస్టమర్లకు కాల్స్ ఫెయిలయ్యాయి.

ఈ విషయమై జియో ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. ప్రభుత్వం ట్రాయ్‌పై ఒత్తిడి తెచ్చింది. అంతే జియోకు మరింత మేలు చేయడానికి అసలు చార్జీలే లేకుండా ఫ్రీ యింటర్‌కనెక్టివిటీ వుండాలని సూచిస్తూ ట్రాయ్ ఆగస్టులో ఒక కన్సల్టేషన్ పేపరు విడుదల చేసింది. 2017 తర్వాత చేయవలసిన సమీక్షను యిప్పుడే చేపట్టడం, చార్జీలను సొంతం ఎత్తివేయడం అన్యాయమని ఆపరేటర్లు భావించారు. తమ ఖర్చుతో తాము నిర్మించుకున్న సామగ్రి నుంచి సేవలు జియోకు ఉత్తినే అందించాలనడం ఏ విధంగా సమంజసమని వారి వాదన. తక్కువ ధరలతో జియో ప్రజల్లోకి దూసుకుపోతుంది. దానికి కాల్స్ చేసుకునేందుకు ఖఱ్చును వీరు భరించాలి. పైగా ట్రయల్ రన్ అంటే ఏకంగా 15 లక్షల మందికి సేవలందించడమేమిటి, యిది పూర్తి స్థాయి కమ్మర్షియల్ సర్వీసెస్ కాక మరేమిటి? లైసెన్సు రాకుండానే యింతమందికి ఎలా అందిస్తారు? అని ప్రశ్నలు సంధించారు.

సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిఓఏఐ) ప్రస్తుత దిగ్గజాల చేతిలోనే వుంది. జియో పట్ల ట్రాయ్ పక్షపాతం చూపుతోందని, దానికి అనుగుణంగా నిబంధనలు మారుస్తోందని వారు ఆ అసోసియేషన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దాని కాపీని డిపార్టుమెంట్ ఆఫ్ టెలికామ్ (డాట్)కు కూడా పంపారు. జవాబుగా జియో 'పాత వాళ్లు గూడుపుఠాణీ చేసి తమపై దుష్ప్రచారం చేస్తున్నారని, తమకు తగినంత ఇంటర్-కనెక్ట్ యివ్వటం లేదని' ఆరోపించింది. తాము 15 లక్షల మందికి సేవలందించడం నియమనిబంధనలకు అనుగుణంగా వుందంటోంది. తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానమిస్తూ ట్రాయ్ 'కన్సల్టేషన్ పేపరులో వున్నవి సూచనలు మాత్రమే, అమలు చేయడానికి ఆరేడు నెలలు పడుతుంది' అంటోంది. జియో యీ డిసెంబరులో మార్కెట్లోకి ప్రవేశించబోతోంది. అది జనాలకు చేరేసరికి యీ ఉచిత సర్వీసు అందివస్తుంది.

ఇలా ప్రభుత్వం యిస్తున్న మద్దతు ఒకవైపు. మరో వైపు వీలైనంత త్వరగా 10 కోట్ల మంది యూజర్ల లక్ష్యంగా రూ. 1.34 లక్షల కోట్లతో నెట్‌వర్కు ఏర్పాటు చేసుకుంది. 4 జి సేవలను వాణిజ్యపద్ధతిలో ప్రారంభిస్తోంది. మైక్రోమ్యాక్స్, పానాసోనిక్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని దాని యూజర్లతో పాటు, తన సిబ్బందికి 3 నెలల పాటు ఉచిత వినియోగం కల్పిస్తూ తన కస్టమర్ బేస్‌ను కోట్లలోకి తీసుకుపోతోంది. ఇది చూసి భయపడిన ఎయిర్‌టెల్, ఓడాఫోన్, ఐడియా సెల్యులార్ తమ డేటా చార్జీలను 67% వరకు తగ్గించాయి. జియో పోటీ తట్టుకునేందుకు వీటిలో రెండు విలీనం కావచ్చునే పుకారు కూడా వుంది. ఎయిర్‌సెల్, ఆర్‌కామ్, జియోలో విలీనం కావచ్చు. ఇలా సెల్‌ఫోన్ మార్కెట్లో చిన్న ఆటగాళ్లు మార్కెట్‌నుండి వైదొలగి, పెద్దవే మిగలవచ్చు. మరో నెలలో అతి పెద్ద స్పెక్ట్రం వేలానికి రాబోతోంది. దానిలో ముకేశ్ అంబానీతో పోటీ పడగల వారెవరూ కనబడటం లేదు. టెలికాం రంగంలో ముకేశ్ మోనోపలీకి యివన్నీ దారి తీస్తున్నాయి. మోనోపలీ ఏర్పడడం శుభసూచకం కాదు. పోటీదారులు లేకపోవడం చేత ఆ తర్వాత ధరలు పెంచినా, సేవల నాణ్యత తగ్గినా అడిగే దిక్కుండదు, వినియోగదారులకు ప్రత్యామ్నాయం వుండదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఆగస్టు 34, 35 **ఎమ్బీయస్ : ఆర్థిక సంస్కరణలు సౌదీని గట్టెక్కిస్తాయా?**

అనేకమంది భారతీయులు గల్ఫ్ దేశాలలో ఉద్యోగాలు పోగొట్టుకుని, అన్నాహారాలకై అలమటిస్తూ మన దేశానికి తిరిగి వచ్చారని వార్తలు చదువుతూన్నాం. ఒకప్పుడు సిరులతో అలరారిన అరబ్బుసీమలు యీనాడు తమ కార్మికులకు ఆరేసి నెలల జీతాలు బకాయి పెట్టి, వేలాది సంఖ్యలో ఉద్యోగులను తీసేయడం ఆశ్చర్యం కలిగించవచ్చు. గల్ఫ్‌లో మిగతా దేశాల మాట ఎలా వున్నా సౌదీ దగ్గర కుప్పలుతిప్పలుగా డబ్బు వుందని, మతపరంగా వుండే వారి ఆంక్షలను భరించడం నేర్చుకుంటే యిక్కడ పదేళ్లలో సంపాదించేది అక్కడ ఏడాదిలోనే సంపాదించుకోవచ్చని మనం నమ్ముతూ వచ్చాం. గల్ఫ్‌లో మొత్తం 60 లక్షల మంది భారతీయులుంటే, సౌదీలో 18 లక్షల మంది వున్నారు. వారిలో వేలాది మంది నాలుగైదు నెలల్లో నిరుద్యోగులయ్యారు. దీనికి కారణం సౌదీ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం. సౌదీలో అతి పెద్ద నిర్మాణ సంస్థ అయిన బిన్‌లాడెన్ గ్రూపు ఏప్రిల్ నెలలో 50 వేల మంది విదేశీ కార్మికుల ఉద్యోగాలు తీసేసి వీసాలు యిచ్చి యిళ్లకు పొమ్మంది. బకాయిపడిన జీతపు సొమ్ము యిస్తే తప్ప వెళ్లమని వాళ్లు మొండికేశారు. కంపెనీ యివ్వనంటే దాని బస్సులు తగలబెట్టారు. సౌదీ ఆగర్ అనే కంపెనీ జులైలో అనేక మంది భారతీయుల ఉద్యోగాలు పీకేసింది. 2014 జులైలో బారెల్ 110 డాలర్లు వుండే పెట్రోలు ధర తగ్గుతూ వచ్చి యిప్పుడు 30 డాలర్లు కావడంతో గల్ఫ్ దేశాల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమై పోయింది. ఆదాయంలో 90% తక్కిన దేశాల కంటె సౌదీ మరిన్ని చిక్కుల్లో పడింది. కితం ఏడాది పెట్రోలుపై వస్తాయనుకున్న లాభాల్లో 390 బిలియన్ డాలర్ల నష్టం వచ్చింది. ఈ ఏడాది బజెట్ లోటు 100 బిలియన్ డాలర్లు వుండవచ్చు.

అరబ్ దేశాల్లో గత సంవత్సరం కింగ్ సల్మాన్ రాజయ్యేనాటికే సౌదీ పరిస్థితి బాగా లేదు. చమురు అమ్మకాలపై యిన్నాళ్లూ యిబ్బడిముబ్బడిగా ఆదాయం వచ్చిపడడంతో అది పెట్టి స్వదేశంలో ప్రజల విధేయతను, విదేశాలలో పలుకుబడిని కొంటూ వచ్చింది. నియంతృత్వానికి వ్యతిరేకంగా 2011లో తిరుగుబాట్లు జరిగి అరేబియాలో అనేకమంది దేశాధినేతలు కుప్పకూలుతూండగా దడిసిన సౌదీ రాజు అబ్దుల్లా ప్రజలను ఊరుకోబెట్టడానికి 70 బిలియన్ల ఆర్థిక ప్యాకేజి ప్రకటించి విద్యుత్, నీరు చార్జిలలో సబ్సిడీలు యిచ్చాడు. ఈ రాయితీలతో, చమురు ధరలు తగ్గడంతో 2015 వచ్చేసరికి విదేశీ నిల్వలు 16% తగ్గి 616 బిలియన్ డాలర్లకు చేరాయి. 1991 తర్వాత తొలిసారి 10 బిలియన్ డాలర్ల విదేశీ ఋణం తీసుకోవలసి వచ్చింది. ఇలాటి కష్టాలతో బాటు రాజుకు

మరో కష్టం కూడా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ రూపంలో దాపురించింది. పేరుకు రక్షణమంత్రే కానీ ఆర్థిక, విదేశీ వ్యవహారాల్లో కూడా తల దూరుస్తాడు. దూకుడెక్కువ. యెమెన్‌పై యుద్ధం చేసి తీరాలన్న అతని పట్టుదల దేశం కొంప ముంచుతోంది. అమెరికా మద్దతుతో యిరుగుపొరుగు దేశాలపై పెత్తనం చలాయిద్దామని చూస్తున్న సౌదీకి ఇరాన్‌ను చూస్తే కన్నెఱ్ఱ. సిరియాను చూస్తే ఒళ్లు మంట. సిరియా పాలకుడు అసాద్‌ను గద్దె దించాలని అమెరికా, పశ్చిమ యూరోప్ దేశాల తోడ్పాటుతో తిరుగుబాటుదారులకు డబ్బు, ఆయుధాలు యిచ్చి ప్రోత్సహించడమనేది అబ్దుల్లా పాలనలోనే ప్రారంభమైంది. ఐదేళ్లగా తంటాలు పడినా అది సఫలం కాలేదు. ఇప్పుడు యెమెన్‌లో హౌతీలను అణచివేసే దుస్సాహసం నడుస్తోంది. ఇప్పటిదాకా అదీ సఫలం కాలేదు. ఇవన్నీ దేశానికి భారంగా పరిణమించాయి.

యువరాజు సల్మాన్ మెకెన్సీ వాళ్లను పిలిచి, ఆర్థిక పరిస్థితి ఎలా చక్కదిద్దాలో సూచించమన్నాడు. ప్రపంచ బ్యాంకుతో సహా అలాటి సంస్థలన్నీ ఎలాటి సలహాలిస్తాయో మన దేశానికి బాగా అనుభవమే. అవే సలహాలు వారికీ దయచేశారు. 'ప్రజలకు యిచ్చే రాయితీలు కట్ చేసి పడేయాలి, ప్రభుత్వ సెక్టార్‌లో పెట్టుబడులు ఉపసంహరించాలి, విదేశాలనుంచి ప్రయివేటు పెట్టుబడులు ఆహ్వానించాలి, ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే 30 లక్షల మంది విదేశీ ఉద్యోగులను తీసివేయాలి (నిజానికి వారి జీతాలు తక్కువే). ఆర్థిక కార్యకలాపాలలో ప్రభుత్వ జోక్యం పూర్తిగా తగ్గించివేసి, మార్కెటు ఆధారంగా నడపాలి. చమురు ఆధారిత ఎకానమీ నుంచి పరిశ్రమ–టూరిజం–ఫైనాన్స్ ఆధారిత ఎకానమీగా మార్పు తేవాలి. ఈ మార్పు తేవడానికి అయ్యే పెట్టుబడి కోసం ప్రభుత్వ ఆస్తులను అమ్మివేయాలి.' వినగానే ఇదంతా జరిగే పనేనా అనిపిస్తుంది. ఎందుకంటే యిప్పటిదాకా సౌదీ ప్రజలు పన్నులు కట్టనక్కరలేకుండా, హాయిగా రాయితీలు పొందుతూ, తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ పనివాళ్ల చేత సేవలు పొందుతూ కులాసాగా వున్నారు. ఇప్పుడు అవన్నీ పోయి, ఏ విదేశీ కంపెనీలోనే ఉద్యోగాలు చేసుకుంటూ, ఆ ఉద్యోగం వుంటుందో వూడుతుందో తెలియని అభద్రతా భావంతో బతకడం అంటే ఎంత హడిలిపోతారో వూహించుకోవచ్చు.

అయితే యువరాజు సల్మాన్‌కు మెకెన్సీ నివేదిక బ్రహ్మాండంగా నచ్చింది. సౌదీ విజన్– 2030 అని డాక్యుమెంటు పెట్టి దాన్ని యథాతథంగా దింపేశాడు. 2030 నాటికి 60 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తానన్నాడు. అతనిప్పటిదాకా చేసి చూపించిందేమీ లేకపోయినా, రాజుకి కొడుకు శక్తిసామర్థ్యాలపై అపారమైన నమ్మకం. అందువలన అతను 2020 కల్లా పెట్రోకెమికల్స్ పరిశ్రమలు, మధ్య స్థాయి మాన్యుఫేక్చరింగ్ పరిశ్రమలు పెడతానని అనడంతో దానికై ఆరామ్‌కో అనే ప్రభుత్వ చమురు సంస్థలో 2 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడుల ఉపసంహరణకు అనుమతి యిచ్చేశాడు. వీళ్లు అమ్మచూపితే కొనేవాళ్లెవరు అంటే చైనా ముందుకు వచ్చింది. సౌదీ నుంచి భారీ స్థాయిలో పెట్రోలు కొంటున్న చైనా యిప్పటికే 2.48 బిలియన్ డాలర్ల న్యూక్లియార్ డీల్ చేసుకుంది. చైనాకు సంబంధించిన సైనోపెక్, పెట్రో చైనా, యునాన్ యుంటియాహువా ఆరామ్‌కోతో కలిసి సౌదీలో, చైనా సముద్రతీరంలో ఆయిల్ రిఫైనరీలు నెలకొల్పుతున్నారు. చైనా కనస్ట్రక్షన్ కంపెనీలు హారామెయిన్ రైల్‌రోడ్డును కడుతున్నారు. సౌదీ అరేబియాకు ప్రస్తుతం చైనాయే అందరి కంటె పెద్ద వాణిజ్యభాగస్వామి. ఇప్పటిదాకా అమెరికాతో కలిసి వూరేగుతున్న సౌదీ చైనాను ఆదరించడానికి వెనుక కొన్ని కారణాలున్నాయి.

వహాబి మార్గాన్ని అనుసరించే సౌదీకి షియా మార్గం అవలంబించే ఇరాన్ అంటే పడదు. ఇరాన్ ఆధిపత్యానికి గండి కొట్టడానికి అది ఎంత దూరమైనా వెళుతుంది. దాని ప్రోద్బలంతో అమెరికా ఇరాన్ ఆర్థిక దిగ్బంధాన్ని ప్రకటించింది. కానీ యిటీవల దానితో అణు ఒప్పందం కుదుర్చుకుని దిగ్బంధం ఎత్తివేసింది. అది సౌదీకి ఆగ్రహం కలిగించింది. వెంటనే సౌదీలో వున్న షియా మతగురువు ఆయొతొల్లా నిమ్రను 46 మందితో కలిపి ఉరి తీసింది. దానికి ఇరాన్ అభ్యంతరం తెలిపింది. చమురు ధరలు పడిపోతున్నకొద్దీ తమ దేశాలు దెబ్బ తింటున్నాయని గుర్తించిన పెట్రోలు ఎగుమతి చేసే దేశాలన్నీ దోహాలో సమావేశమై చమురు ఉత్పత్తిని యిదే స్థాయిలో స్తంభింపచేసి, ధర మరీ పడిపోకుండా చేద్దామని ప్రతిపాదించాయి. దానికి సౌదీ ప్రతినిధి సుముఖంగానే కనబడినా ఆఖరి నిమిషంలో అడ్డుపుల్ల వేశాడు. ఇరాన్ తన అమ్మకాలను యీ స్థాయిలో స్తంభింపచేస్తేనే తను ఒప్పుకుంటానని మడత పేచీ పెట్టింది. ఇన్నాళ్లూ ఆర్థికదిగ్బంధం వలన కొట్టుమిట్టులాడిన ఇరాన్ యీ ప్రతిపాదనకు అంగీకరించడం అసంభవం. అందువలన ఒప్పందం కుదరలేదు. సౌదీ ప్రతినిధి చేత అలా చెప్పించినది యువరాజు సల్మానేట. ఆ ప్రాంతంలో తమ ఆధిపత్యం పోకుండా వుండడానికే యిలా చేశాడట. తమ వద్ద ఆస్తులు బాగానే వున్నాయి కాబట్టి యింకా రేటు తగ్గినా తాము తట్టుకోగలం కానీ చిన్న దేశాలు విలవిలలాడి తమ చెంత చేరతాయని అతని అంచనా. అంతేకాక, రేటు తగ్గిపోతున్నకొద్దీ యిటీవలే అమ్మకాలు మొదలుపెట్టిన ఇరాన్, రష్యా బాగా దెబ్బ తింటాయి. మూడో కారణం కూడా వుంది – అమెరికాలో గల్ఫ్ ఆయిలుకు ప్రత్యామ్నాయంగా షేల్ (మట్టి కలిసిన ఖనిజం) నుండి తీసిన పెట్రోలు అమ్ముతున్నారు. గల్ఫ్ పెట్రోలు ధర హెచ్చుగా వున్నపుడే షేల్ పెట్రోలు వ్యాపారం బాగుంటుంది. దీని ధర పడిపోతే ఆ వ్యాపారం కిట్టుబాటు కాక మూతపడుతుంది. ఇటువంటి లెక్కలు వేసి సౌదీ పెట్రోలు ఉత్పత్తిని ఫ్రీజ్ చేయకుండా చూసి ధరలు పడిపోనిస్తోంది.

ఇరాన్‌కు సాయపడి, తమ ప్రాంతంలో తమకు పోటీదారుగా తయారుచేస్తున్నందుకు సౌదీకి ఒబామా ప్రభుత్వంపై గుర్రుగా వుంది. అంతేకాదు, మరో సమస్య కూడా వుంది. 9/11 దాడుల గురించి సమర్పించిన యింటెలిజెన్సు నివేదికలో సౌదీ పౌరుల, నాయకుల పాత్ర గురించి 28 పేజీలలో వివరాలున్నాయి. సౌదీలోని వహాబిజం నుంచి గతంలో అల్ కైదా, ప్రస్తుతం ఐసిస్ స్ఫూర్తి

పొందుతున్నాయని పాశ్చాత్య దేశాలు నమ్ముతున్నాయి. అల్ కైదాకు సౌదీ రాచకుటుంబీకులు ధనసహాయం చేసినట్లు ఆధారాలున్నాయి. ఆ డబ్బు 9/11 దాడులకు ఉపయోగపడింది. దానిలో పాల్గొన్న 19 మంది హైజాకర్లలో 15 మంది సౌదీలే. అమెరికాలోని సౌదీ డిప్లోమాట్, సౌదీ గూఢచారి సంస్థ దాడికి తోడ్పడ్డాయని ఎఫ్‌బిఐ ఏజంట్లు తెలిపారు. ఈ నివేదికను బయటపెట్టినపుడు సౌదీ వారి పాత్ర గురించి వున్న 28 పేజీలను సెన్సార్ చేసి విడుదల చేయాలని బుష్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ పేజీలను విడుదల చేసింది నేటి ఒబామా ప్రభుత్వం. దానిపై అమెరికన్ సెనేట్ బిల్లు పాస్ చేస్తానంది. అది పాస్ అయితే 9/11 దాడిలో నష్టపోయినవారు సౌదీ ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కోరవచ్చు. అలా చెల్లిస్తే సౌదీ ప్రభుత్వానికి కోలుకోలేని దెబ్బ తగులుతుంది. 'బిల్లు పాస్ చేస్తే మీ దేశంలో మేం దాచుకున్న 750 బిలియన్ డాలర్ల డిపాజిట్ విత్‌డ్రా చేస్తాం జాగ్రత్త' అని సౌదీ బెదిరించింది. ఎందుకంటే బిల్లు అధ్యక్షుడి ఆమోదం పొందితే కోర్టులు ఆ డిపాజిట్లను ఫ్రీజ్ చేసేయవచ్చు. 1980లలో లెబనాన్‌లో, 1996లో సౌదీలో జరిగిన దాడుల్లో ఇరాన్ హస్తం వుందని నిర్ణయిస్తూ అమెరికా సుప్రీం కోర్టు ఇరాన్‌కు చందిన 2 బిలియన్ డాలర్ల ఆస్తులను స్తంభింపచేసింది. అదే గతి తమకూ పడుతుందని సౌదీ భయం. ఈ నేపథ్యంలో మార్చి నెలలో ఒబామా సౌదీ రాజధాని రియాద్‌కు వచ్చినపుడు సౌదీ రాజు ఎయిర్‌పోర్టుకి వచ్చి అతన్ని రిసీవ్ చేసుకోలేదు. ఒబామా రాకను ప్రభుత్వ టీవీ కవర్ చేయలేదు. సౌదీ రాజు ఒబామాతో దీని గురించి మాట్లాడితే వీటో చేసే నా హక్కును ఉపయోగించి, దాన్ని అమలు కాకుండా చేస్తానని హామీ యిచ్చాడు. మే నెలలో సెనేట్ బిల్లు పాస్ చేసేసింది. అధ్యక్షుడు ఏం చేస్తాడో చూడాలి.

సౌదీ తమమీద అలుగుతోందని తెలిసిన అమెరికా యెమెన్‌పై యుద్ధంలో దానికి పూర్తి మద్దతు ప్రకటించడమే కాక ఆయుధాలు కూడా భారీ ఎత్తున అమ్ముతోంది. ప్రపంచంలో ఆయుధాలు కొనుగోలు చేసే దేశాలలో సౌదీది మూడో స్థానం. కానీ దానిలో 2% మాత్రమే దేశీయంగా ఉత్పత్తి చేసుకుంటుంది. తక్కిన దానిలో చాలా భాగం అమెరికా నుంచే కొనుగోలు చేస్తోంది. 2030 నాటికి తన అవసరాల్లో 50% తనే తయారు చేసుకోవాలనే పట్టుదలతో వుంది. అప్పుడు ఆయుధాల కోసం అమెరికాపై ఆధారపడే అవస్థ తప్పిపోతుంది. ఈ లక్ష్యాన్ని సాధించి తీరతానని యువరాజు అంటున్నాడు. సౌదీ ఆర్థిక వ్యవస్థ ఆయిలుపై ఆధారపడే పరిస్థితిని నాలుగేళ్లలో మార్చేస్తానంటున్నాడు. తక్కిన వాళ్లకు అంత ఆశలు లేవు. ప్రపంచ బ్యాంకు సౌదీ యువతలో 30% నిరుద్యోగం వుందంటోంది. ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ గత ఏడాది నివేదికలో సౌదీ ఖర్చులు, తగ్గిపోతున్న రాబడి చూస్తూంటే 2020 నాటికి దివాలా తీస్తుందని చెప్పింది. సౌదీ యువతలో కొందరు నిరాశతో సిరియాకు వెళ్లి ఐసిస్‌లో చేరుతున్నారు. రాజకుటుంబం వారి ఖర్చులు తగ్గించే సత్తా యువరాజుకి ఎంత వుందో తెలియదు. అందువలన యీ సంస్కరణలు ఎటు దారి తీస్తాయో కాలమే చెప్పాలి.

– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)

ఆగస్టు 36 **ఎమ్బీయస్ : హిల్లరీ తప్పిదాలు**

నవంబరు 8 న జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నిక ఎటు మొగ్గుతుందో తెలియకుండా పోతోంది. ట్రంప్‌పై హిల్లరీకి పది రోజుల క్రితం 8 పాయింట్ల లీడ్ వుంటే అది ప్రస్తుతం 7 కు వచ్చింది. వివిధ సర్వేల సరాసరి చూస్తే 6.1 పాయింట్లు వుంది. ఇప్పుడిలా వున్నా 75 రోజుల తర్వాత కూడా పరిస్థితి యిలాగే వుంటుందని చెప్పలేం. 1988లో జార్జి బుష్, 2000లో అల్ గోర్ యిలాటి వ్యత్యాసాన్ని అధిగమించగలిగారు. ట్రంప్ విషయంలో ప్రచారం జరిగే తీరు గురించి ఓటర్లలో నిరాశ కలుగుతూండగా, హిల్లరీ విషయంలో ఆమె గతప్రవర్తన గురించి చర్చ జరుగుతోంది. అధికార రహస్య సమాచారానికి సంబంధించిన 15 వేల ఈ మెయిళ్లను ఆమె తన సొంత సెర్వర్ ద్వారా పంపడం వివాదాస్పదం అయింది. "ఈ విషయం బయటకు రాగానే సెర్వర్‌ను తుడిచిపెట్టివేశారట (వైప్‌డ్ యిట్ ఆఫ్) కదా?" అని విలేకరులు అడిగితే ఆమె "ఏమిటి? గుడ్డపెట్టి తుడిచేశానా?" అని జోక్ చేసి తప్పించుకోబోయింది. కానీ జోక్ పేలలేదు. ఎఫ్‌బిఐ డైరక్టరు తనదేమీ తప్పు లేదన్నాడని ఫాక్స్ టీవీ విలేకరికి ఆమె చెప్పుకున్నది అసత్యమని తేలింది. మీడియా ప్రశ్నలు ఎదుర్కోవడంలో తన భర్తకున్న చాకచక్యం, ఛా(ర్)మ్ తనకు లేవని గ్రహించిన హిల్లరీ 2015 డిసెంబరు తర్వాత సాంప్రదాయకమైన ప్రెస్ మీట్ పెట్టటం లేదు. ఒక్కరే వచ్చి విడిగా అడిగే యింటర్వ్యూలు మాత్రమే యిస్తోంది. ఏదైనా సమావేశం ముగిశాక ప్రెస్ వాళ్లు చుట్టుముట్టి గట్టిగా అరుస్తూ యిబ్బందికరమైన ప్రశ్నలడుగుతూ వుంటారు. వాటికి హిల్లరీ స్పందన అక్వారియం స్టయిల్లో వుందంటున్నారు. అక్వారియంలోని చేపలకు మనకు మధ్యలో గాజు గోడ వుంటుంది. మన పాటికి మనం వాటిని చూస్తూ వుంటాం, కేరింతలు కొడుతూ వుంటాం. వాటి పాటికి అవి ఈదుకుంటూ పోతూంటాయి. అలాగే హిల్లరీ కూడా ప్రశ్నలను పట్టించుకోకుండా చిరునవ్వుతో ముందుకు సాగిపోతోంది.

కానీ క్లింటన్ ఫౌండేషన్ వ్యవహారాల గురించి సోమవారం బయటపడిన ఈమెయిళ్లు అంత తేలికగా చిరునవ్వుతో కొట్టి పారేయదగ్గవి కావు. క్లింటన్ ఫౌండేషన్ (పూర్తి పేరు క్లింటన్ గ్లోబల్ ఇనీషియేటివ్) కు విదేశాల నుంచి విరాళాలు ధారాళంగా వస్తూంటాయి. హిల్లరీ విదేశీ వ్యవహారాల సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా పని చేస్తున్నపుడు ఆమె ద్వారా ఏదైనా పని కావాలంటే విదేశీ నాయకులు యీ ఫౌండేషన్‌కు విరాళాలిచ్చి పనులు చేయించుకున్నారని తేలుతోంది. ఉదాహరణకి, బహరైన్ యువరాజు సల్మాన్ బిన్ హమాద్ బిన్ హిల్లరీ క్లింటన్‌తో ఎపాయింట్‌మెంట్ కోసం స్టేట్ డిపార్టుమెంటు ద్వారా ఎంతో ప్రయత్నించాడు. ఎపాయింట్‌మెంటు దొరకలేదు.

అప్పుడు హిల్లరీకి సన్నిహితంగా వుంటూ, క్లింటన్ ఫౌండేషన్‌కు, హిల్లరీకి వారధిగా పనిచేసే ఆమె సహాయకురాలు హ్యూమా అబెదిన్‌ను సంప్రదించాడు. హ్యూమా తండ్రి అమెరికాలో స్థిరపడిన భారతీయ ముస్లిము. అతను కాలిఫోర్నియాలో 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ ముస్లిమ్ మైనారిటీ ఎఫయిర్స్' స్థాపించి, దానికి అనుబంధంగా 'ముస్లిము మైనారిటీ ఎఫయిర్స్' అనే పత్రిక వెలువరిస్తూ వుండేవాడు. ఈమె 17వ యేట ఆయన పోయాడు. ఆమె తల్లి పాకిస్తానీ మహిళ. సౌదీలో ఓ యూనివర్శిటీలో టీచరుగా పనిచేస్తూంటుంది. 1996లో బిల్ క్లింటన్ అధ్యక్షుడిగా వుండగా ఆమె వైట్‌హౌస్‌లో ఇంటెర్న్‌గా చేరింది. హిల్లరీకి నచ్చింది. అప్పటి నుంచి హిల్లరీనే అంటిపెట్టుకుని వుంది. ఇప్పుడు హిల్లరీ క్యాంపయిన్‌లో ఆమెది ప్రధాన పాత్ర. హ్యూమా సలహా మేరకు బహరైన్ యువరాజు క్లింటన్ ఫౌండేషన్ వారి స్కాలర్‌షిప్ కార్యక్రమానికి 32 మిలియన్ డాలర్లు యిస్తానని మాట యిచ్చాడు. అంతేకాకుండా తన రాజ్యం నుంచి 50 వేల డాలర్లు బహుమతిగా యిస్తానన్నాడు. ఆ విరాళం ముట్టాక ఫౌండేషన్ యొక్క సహవ్యవస్థాపకుడు, క్లింటన్లకు మిత్రుడు అయిన డగ్లస్ బ్యాండ్ హిల్లరీకి ఈమెయిల్ రాశాడు – 'ఇతను మనకు మంచి మిత్రుడు, ఎపాయింట్‌మెంటు యివ్వగోర్తాను' అని. అపాయింట్‌మెంట్ దొరికింది. ఆ సందర్భంగా అమెరికా తరఫు నుండి బహరైన్‌కు ఆమె ఏ సాయం చేసిందో యింకా తెలియదు. మధ్యప్రాచ్య వ్యవహారాలు మాట్లాడుకున్నారు అని మాత్రమే బయటకు వచ్చింది.

ఈ విషయం బయటకు రాగానే తన పదవీకాలంలో హిల్లరీ కలిసిన ప్రభుత్వేతర వ్యక్తులెందరు, వారిలో ఫౌండేషన్‌కు విరాళాలు యిచ్చిన వారెవరు అని అసోసియేటెడ్ ప్రెస్ వారు కూపీ లాగారు. 154 మందిలో 85 మంది విరాళాలు యిచ్చినవారేట. ఇజ్రాయేలులో శాంతి నెలకొల్పడమే నా పరమాశయం అని చెప్పుకునే డేనియల్ అబ్రహాం, హిల్లరీ ఎన్నికల ప్రచారానికి, ఫౌండేషన్‌కు భూరి విరాళాలు యిస్తూనే వుంటాడు. "వాళ్లంతా మా స్నేహితులు" అని క్లింటన్లు చెప్పుకుంటూ వుంటారు. ఇలా డబ్బులు తీసుకుంటూనే హిల్లరీ "ప్రజాస్వామ్యం డబ్బున్నవారి కోసమే కాదు, నేను రాజధానిలో అవినీతికి వ్యతిరేకంగా పోరాడతాను." అని చెప్పుకుంటూ వుంటుంది. 'ఇలా డబ్బు కోసం కోసం తన పదవిని వుపయోగించుకోవడం దేశద్రోహమే. ఇలాటామె దేశాధ్యక్షురాలైతే అమెరికాను విదేశీ శక్తులకు తాకట్టు పెట్టదా?' అంటాడు ట్రంప్. ఇది కాకతాళీయంగా జరిగింది తప్ప దీనిలో యిచ్చిపుచ్చుకోవడాలు లేవు అంటోంది క్లింటన్ ఫౌండేషన్. 'హిల్లరీ దేశాధ్యక్షురాలైతే ఫౌండేషన్‌కు విదేశీ విరాళాలను తిరస్కరిస్తాం' అంటున్నాడు బిల్ క్లింటన్. డగ్లస్ ఈ మెయిల్‌తో బాటు బయటకు వచ్చిన మరో ఈ మెయిల్ వలన తెలిసిందేమిటంటే – హిల్లరీ తను ప్రయివేటు సర్వర్ ద్వారా పంపిన ఈ మెయిళ్లన్నీ ఎఫ్‌బిఐకు అప్పగించలేదు! ఆ 15 వేల ఈ మెయిళ్లను సమీక్షించి, విడుదల చేయమని ఫెడరల్ కోర్టు సోమవారమే స్టేట్ డిపార్టుమెంటును ఆదేశించింది.

హిల్లరీకి, ఫౌండేషన్‌కు వారధిగా వుంటున్న హ్యూమా భర్త కారణంగా చిక్కుల్లో పడింది. ఆమె ఆంథోనీ వైనర్ అనే యూదుణ్ని పెళ్లి చేసుకుంది. అతను డెమోక్రాటిక్ పార్టీ తరఫున 1999 నుండి 2011 దాకా కాంగ్రెస్‌మన్‌గా వున్నాడు. 2011లో తన స్నేహితురాలికి పంపిన అసభ్యకరమైన మెసేజి (సెక్స్‌టింగ్ అంటున్నారు) వెలుగులోకి రావడంతో రాజీనామా చేయవలసి వచ్చింది. అది కాస్త సద్దు మణిగి 2013లో న్యూయార్కు మేయరు పదవికి పోటీ చేస్తే అప్పుడు యింకోటి సెక్స్‌టింగ్ బయటపడి ఓడిపోయాడు. ఇప్పుడు హిల్లరీ ప్రచారం ఉధృతంగా సాగుతూండగా మొన్న ఆదివారం నాడు న్యూయార్కు పోస్టు 2015 జులైలో సాగిన మరో సెక్స్‌టింగ్ ప్రహసనాన్ని బయటపెట్టింది. ఇతను పంపిన అశ్లీలచిత్రాన్ని అందుకున్న యువతి దాన్ని పత్రిక వాళ్లతో పంచుకుంది. పత్రిక మార్కెట్లోకి రాగానే వివాదం చెలరేగింది. వెంటనే ట్రంప్ అందుకున్నాడు. "హిల్లరీకి అతి సన్నిహితంగా వుండే హ్యూమా మతం ఏమిటో, ఆమె తల్లి ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తోందో పరికించండి. హ్యూమా భర్త తనపై తనకే నియంత్రణ లేని 'సిక్' ఫెలో. హిల్లరీ అధ్యక్షురాలైతే హ్యూమా వద్ద దేశభద్రతకు సంబంధించిన అనేక పేపర్లు వుంటాయి. భర్తగా ఆంథోనీకి అవి అందుబాటులో వుంటాయన్న విషయం తలచుకుంటేనే భయం వేస్తోంది." అన్నాడు. ఈ మాట అందరి మనసుల్లో నాటుకుంటుందనే భయంతో కాబోలు హ్యూమా వెంటనే తన భర్తకు విడాకులు యిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సంఘటనల ప్రభావం హిల్లరీ క్యాంపెయిన్‌పై ఏ మేరకు వుంటుందో చూడాలి.

అమెరికా అధ్యక్ష ఎన్నికల గురించి జోకేమిటంటే – అభ్యర్థులు ఎవరి గొప్ప వారు చెప్పుకోకుండా అవతలివాళ్లు ఎంత ప్రమాదకారులో చెప్పడంలో నిమగ్నమయ్యారని! మతిస్థిమితం లేని వ్యక్తి ట్రంప్ అని హిల్లరీ క్యాంప్ అంటే, హిల్లరీ నమ్మదగిన వ్యక్తి కాదని ట్రంప్ క్యాంప్ అంటోంది. చూడబోతే యిద్దరూ కరక్టే అనిపిస్తోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2016)**

ఆగస్టు 37 **ఎమ్బీయస్ : రాజులతో నెయ్యము**

రాజులతో నెయ్యము ఎప్పుడూ ప్రమాదకరమే అన్నారు పెద్దలు. దాదాపు తెలుగు ప్రాంతంగా వుండే, మనం పర్లాకిమిడిగా పిలుచుకునే పర్లాఖేముండికి సంస్థానాన్ని ఏలిన రాచకుటుంబానికి చెందిన 74 ఏళ్ల గోపీనాథ గజపతి నారాయణ దేవ్‌కి, ఆయన తమ్ముడికి తాతముత్తాతల నుంచి సంక్రమించిన రూ. 500 కోట్ల విలువైన ఆస్తిపై వివాదం నడుస్తోంది. ఆ ఆస్తుల్లో వారికి సంబంధించిన 173 ఏళ్ల గజపతి ప్యాలస్ కూడా వుంది. ఆరు ఎకరాలలో విస్తరించిన ఆ మహల్ ఎలా కట్టాలో ప్లాను వేసిన బ్రిటిషు ఆర్కిటెక్ట్‌కు 1835లోనే నాలుగున్నర లక్షల ఫీజు యిచ్చారట. ఎస్టేటుకు ఒడిశా, ఆంధ్రలలో 100 ఎకరాల భూమి చెన్నయ్‌లో చాకొలేట్

ఫ్యాక్టరీ కూడా వుంది. గోపీనాథ్ తాత మహారాజా కృష్ణచంద్ర నారాయణ దేవ్‌ను ఆధునిక ఒడిశాకు నిర్మాత అంటారు. బ్రిటిషు వారి హయాంలోనే ఒడిశాను ప్రత్యేక రాష్ట్రంగా సాధించడానికి ఆయనే కారకుడు. ఆయన కారణంగానే తెలుగువారు మెజారిటీలో వున్న గంజాం, కోరాపుట్ జిల్లాలను ఒడిశాలో కలిపివేశారట. ఆ రాష్ట్రానికి తొలి ప్రధాని (అప్పట్లో ముఖ్యమంత్రిని అలా అనేవారు) ఆయనే.

1943లో పుట్టిన గోపీనాథ్ కూడా కాంగ్రెసులో చేరి, 1989లో, 1991లో బరంపురం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 1996లో కూడా ఎన్నికవుదామని చూస్తే పివి నరసింహారావు నంద్యాలతో బాటు బరంపురం నుంచి పోటీ చేద్దామనుకుని యీయన్ని తప్పుకోమన్నారు. రెండు చోట్లా గెలిచాక పివి నంద్యాల వదిలేసి, బరంపురం వుంచుకుని యీయనకు మళ్లీ పోటీ చేసే అవకాశం లేకుండా చేశారు. అది ఆయనను బాధించింది. పార్టీ వదిలేసి 1998లో బిజెపి పక్షాన పోటీ చేస్తే, కాంగ్రెసు తరఫున పోటీ చేసిన ముఖ్యమంత్రి జెబి పట్నాయక్ భార్య జయంతి యీయన్ని ఓడించింది. 2009లో అధికార పక్షమైన బిజెడిలో చేరారు కానీ వాళ్లూ టిక్కెట్టు యివ్వలేదు. ప్రస్తుతం ఆ పార్టీలోనే వున్నారు. ఆయన కాంగ్రెసులో వుండే రోజుల్లో గంజాం జిల్లాలో మహిళా కాంగ్రెసుకు అధ్యక్షురాలిగా వున్న అనంగ మంజరి పాత్రా అనే ఆమెతో పరిచయమైంది. ఇద్దరి మధ్య 20 ఏళ్లు తేడా వున్నా స్నేహం బలపడింది. ఆయన ఎస్టేటుకు మేనేజరుగా కుదురుకుంది. ఆమె తమ్ముడు సంజయ్ రాజా వారికి పిఏగా వున్నాడు. గోపీనాథ్‌కు ధరమ్‌పూర్ యువరాణి ఐన పూర్ణాదేవితో 1967లో పెళ్లయింది. వారికి దిగ్విజయ్ అనే కొడుకు, కల్యాణీ దేవి అనే కూతురు. దిగ్విజయ్ 2015లో ఆత్మహత్య చేసుకున్నాడు. కల్యాణి అవివాహితగా చెన్నయ్‌లో వుంటోంది. భార్య విడిపోయారో, అసలు జీవించి వున్నారో లేదో కూడా తెలియటం లేదు. ఆస్తుల గురించి గోపీనాథ్‌కు, తమ్ముడు సర్వజ్ఞ జగన్నాథ్‌కు మధ్య ఆస్తుల పంపకం గురించిన తగాదా 2006 నుంచి కోర్టులో నడుస్తోంది.

కుటుంబసభ్యులెవరూ దగ్గర లేకపోవడం చేతనో ఏమో అనంగ మంజరి, ఆమె సోదరుడు అనారోగ్యపీడితుడైన గోపీనాథ్‌కి చేరువై అతన్ని తమ స్వాధీనంలో వుంచుకోసాగారు. అతని ఆస్తులు అమ్మివేశారని, ధనం కాజేశారని కొందరు ఆరోపిస్తున్నారు. దాని మాట ఎలా వున్నా వీళ్లు రాజాను ప్యాలస్‌లోనే బందీగా వుంచి, బంధువులు సైతం చూడడానికి వీల్లేకుండా దిగ్బంధం చేశారు. ఈ మాట బయటకు రాగానే స్థానిక కాంగ్రెసు ఎమ్మెల్యే కె.సూర్యారావు నాయకత్వంలో "పర్లా మహారాజా సురక్షా కమిటీ" పేర ఒక సమితి వెలిసింది. వాళ్లు అక్కా తమ్ముళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా మహారాజా వారి దర్శనం కాలేదు. దాంతో ఆగస్టు 14 న సమితి వాళ్లు ధర్నా నిర్వహించి రాష్ట్రప్రభుత్వం కలగజేసుకోవాలని డిమాండ్ చేశారు. మరుసటి రోజే ప్రభుత్వం కదిలింది. సుగర్, బిపి, గొంతునొప్పితో బాధపడుతున్న మహారాజాను చెన్నయిలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించి, అతని కూతురి సంరక్షణలో పెట్టింది. రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి అతనూ సవ్యసాచి నాయక్ చెన్నయ్ వెళ్లి రాజాను పలకరించి, చికిత్స ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని హామీ యిచ్చి వచ్చాడు. గత 30 ఏళ్లగా తండ్రి ఆస్తుల విషయంలో జరిగిన లావాదేవీలపై విచారణ జరిపించమని కల్యాణీదేవి ప్రభుత్వాన్ని కోరింది. తన సంరక్షణలో వున్న తండ్రికి నచ్చచెప్పి అనంగ మంజరిని, ఆమె తమ్ముడు సంజయ్‌ను ఎస్టేటు మేనేజరు, పిఏ పదవుల నుంచి తీయించి వేసింది.

ఆ అవమానాన్ని వాళ్లిద్దరూ తట్టుకోలేక పోయారు. మహారాజాను తీసుకుని వెళ్లిపోయిన దగ్గర్నుంచి వాళ్లు బయటకు రావడం మానేశారు. తమను అందరూ దోషులుగా చూస్తూండడం భరించలేకపోయారు. ఆగస్టు 21 న మహల్‌కు కొద్ది దూరంలోనే వున్న జంగమ్ సాహీ నివాసంలో ఆమె, తమ్ముడు యిద్దరూ విషం తాగి చనిపోయారు. చిత్రం ఏమిటంటే వాళ్లిద్దరితో బాటు రాజావారి ఎస్టేటుతో ఏ సంబంధం లేని విజయలక్ష్మి అనే సోదరి కూడా విషం తాగింది. సంతోష్ (తులు అని కూడా అంటారు) అనే మరో సోదరుడు ఉరి వేసుకుని ప్రాణాలతో కొట్టుమిట్టులాడుతూండగా పక్కింటి వాళ్ల కంటపడ్డాడు. బరంపురంలోని ఆసుపత్రికి తరలిస్తే మర్నాడు చనిపోయాడు. అనంగ వయసు 54, ఆఖరతని వయసు 35. వీళ్లెవరికీ పెళ్లిళ్లు కాలేదు. ఆత్మహత్య చేసుకునే ముందు సూర్యారావుపై నింద మోపుతూ ఉత్తరాలు రాశారట. పోలీసులు ఇంకా బయటపెట్టలేదు. "రాజావారి తమ్ముడు జగన్నాథ్ ప్రోద్బలంతో సూర్యారావు చేసిన దుష్ప్రచారం చేతనే వారు ఆత్మహత్య చేసుకున్నారు." అని కొందరంటున్నారు. "వాళ్లు నిజాయితీపరులైతే బయటకు వచ్చి నా వాదన తప్పని పోరాడాలి. ఆత్మహత్య చేసుకుంటారంటేనే నా ఆరోపణ కరక్టని తెలుస్తోంది' అంటాడు సూర్యారావు. ఆస్తులు అమ్మేశారా అని న్యాయవాదిని అడిగితే "వివాదంలో వున్న ఆస్తులేవీ అమ్మకూడదని పర్లాఖెముండి సబార్డినేట్ జడ్జి 2010లోనే మధ్యంతర ఉత్తర్వు యిచ్చాడు. నాకు తెలిసి స్థిరాస్తులు చేతులు మారలేదు." అన్నాడు.

నిజానిజాలు తేల్చడానికి ఒడిశా ప్రభుత్వం సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీము) వేసింది. అదేం తేల్చినా ఒకటి మాత్రం నిజం. రాజులు లేదా పాలకులకు మరీ సన్నిహితంగా వెళ్లకూడదు. వాళ్లు ఆరోగ్యంగా వున్నపుడు ఎలా వున్నా అంత్యదశ వచ్చేసరికి కుటుంబం మాటే సమాజంలో చెల్లుతుంది. బయటివాళ్లు బయటివాళ్లగానే మిగిలిపోతారు, నింద పడతారు కూడా. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

ఆగస్టు 38 – 39 వీక్లీకై

ఎమ్బీయస్ : ఐసిస్‌ను తరిమిన లిబియా

ట్యునీసియా, ఈజిప్టులలో నియంతల పాలన అంతమయ్యాక లిబియాలో గడ్డాఫీ వ్యతిరేకులకు ధైర్యం వచ్చింది. 2011లో అతనిపై తిరగబడ్డారు. గడ్డాఫీ సేనలు వాళ్లని అణచివేశాయి కానీ అమెరికా నేత ృత్వంలోని నాటో సేనలు విమానదాడులతో తిరుగుబాటుదారులకు సాయం చేశాయి. అక్టోబరు కల్లా గడాఫీని చంపివేశారు కానీ అప్పణ్నుంచి దేశంలో అంతర్యుద్ధం నడుస్తోంది. యునైటెడ్ నేషన్స్ ఆధ్వర్యంలో కొందరు నాయకులు తమ మధ్య ఒప్పందానికి వచ్చి "గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ ఎకార్డ్" (యూనిటీ గవర్నమెంట్) పేరుతో ప్రభుత్వం ఏర్పరచి నడిపిస్తున్నారు. కానీ యీ మార్పును సమ్మతించని మిలటరీ జనరల్ ఖలీఫా హఫ్తార్ దేశంలోని కొన్ని ప్రాంతాల్లో తన అధికారం చలాయిస్తున్నాడు. దేశం యీ రెండు ప్రభుత్వాల మధ్య కొట్టుమిట్టులాడుతూంటే సందట్లో సదేమియాలా 2014లో ఐసిస్ దూరింది. సముద్రతీరంలో వున్న గడ్డాఫీ జన్మస్థలమైన సిర్టి ని 2015 కల్లా తన అధీనంలోకి తీసుకుంది. అక్కడ పని చేసే ఈజిప్టు నుంచి క్రైస్తవ కార్మికులను పట్టుకుని చంపివేసి 2015 ఫిబ్రవరిలో వీడియో ద్వారా లోకానికి చూపి భయభ్రాంతులను చేసింది. అంతర్జాతీయ దేశాల ఒత్తిడి వలన సిరియా, ఇరాక్‌లపై తన పట్టు కోల్పోయినా ఐసిస్ లిబియాలో తిష్ట వేస్తుందని పరిశీలకులు భయపడ్డారు.

ఐసిస్‌ను ఎలాగైనా అదుపు చేయమని యూనిటీ గవర్నమెంటు అమెరికాను కోరింది. ఐసిస్ స్థావరాలపై ఆగస్టు 1 నుంచి అమెరికా ఐదు విమానదాడులు చేసి రెండు ట్యాంకులను, మిలటరీ వాహనాలను ధ్వంసం చేసింది. ఆ ధైర్యంతో సిర్ట్‌కు దగ్గర్లోనే వున్న మిసరాతాలో వున్న యూనిటీ ప్రభుత్వపు సైన్యాలు పది రోజుల తర్వాత ఐసిస్ ఆక్రమణలో వున్న ప్రాంతాలపై దాడి చేశాయి. ఈ మిసరాతా బ్రిగేడ్‌లలో గడ్డాఫీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన అనుభవజ్ఞులూ వున్నారు, ఏ అనుభవమూ లేని యువకులూ వున్నారు. అవతల ఐసిస్ వారు యిలాటి యుద్ధాల్లో ఆరితేరిన వారు. తక్కువ సంఖ్యలోనే వున్నా వీరికి అడుగడుగునా అవరోధాలు కల్పిస్తూ విపరీతంగా ప్రాణనష్టం కలగజేశారు. చాలామందిని పోగొట్టుకున్నా చివరకు మిసరాతా వారు ఐసిస్‌ను ఆ ప్రాంతం నుంచి తరిమివేస్తున్నారు. పోరాటం యింకా సాగుతున్నందున తాజాగా అమెరికా హెలికాప్టర్లు కూడా పంపుతోంది. ఇలాటివి ఎదురుదెబ్బలు తగులుతేనే ఐసిస్ విస్తరణ తాత్కాలికంగానైనా ఆగుతుంది. **(ఫోటో – సిర్టిని ఐసిస్ ఆక్రమించిన నాటి దృశ్యం) – ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

ఎమ్బీయస్ : థాయ్‌లాండ్ ఆర్మీ నీడలో రాజ్యాంగ సంస్కరణలు

థాయ్‌లాండ్‌లో ఆగస్టు మొదటివారంలో కొత్త రాజ్యాంగం పై ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. 1932లో రాజుగారి నుంచి ప్రజలకు అధికారం బదిలీ అయ్యాక, పాత రాజ్యాంగాన్ని రద్దు చేసి, కొత్త రాజ్యాంగాన్ని చేపట్టడం 19 సార్లు జరిగింది. ఇవన్నీ మిలటరీ వాళ్లు రాసినవే. ఇప్పుడీ యిరవయ్యో రాజ్యాంగం కూడా 2014 మేలో హింసాత్మకంగా కుట్ర చేసి అధికారంలో వచ్చిన మిలటరీ వారి చలవే. 1932 నుంచి యిప్పటిదాకా వాళ్లు 12 సార్లు హింసాత్మకంగా అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. దశాబ్దాలుగా నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు, సైన్యపాలన ఏర్పడడం వంటివి నివారించడానికి ఈ రాజ్యాంగం ప్రకారం 2017 నవంబరులో ఎన్నికలు నిర్వహించి, సుస్థిర ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి యిది తొలిమెట్టు అంటూ వారీ రిఫరెండం నిర్వహించారు. దీని ప్రకారం కూడా అధికారమంతా మిలటరీ చేతిలోనే వుండేట్లు చూసుకున్నారు. అందుకే 55% మంది మాత్రమే ఓట్లేశారు. వేసినవారిలో 60% మంది కొత్త రాజ్యాంగాన్ని ఆమోదించారని ప్రకటించారు. ఇక థాయ్‌లాండ్ యొక్క 6 కోట్ల 80 లక్షల మంది ప్రజలు దాని ప్రకారమే పాలింపబడతారు. దాని ప్రకారం ఎగువ సభ, దిగువ సభ వుంటాయి. ఎగువ సభలోని 250 మంది మిలటరీచేతనే నియమింపబడతారు. దిగువ సభలో 500 స్థానాలుంటాయి. ఎన్నికలలో పార్టీలు తెచ్చుకున్న ఓట్ల నిష్పత్తిలో కొన్ని, నియోజకవర్గాల నిష్పత్తిలో కొన్ని నింపుతారు. ప్రధానిని ప్రజలు నేరుగా ఎన్నుకోనవసరం లేదు. ఈ రెండు సభలు ఎవర్ని ఎన్నుకుంటే వారే ప్రధాని. దిగువ సభలో వున్న వేర్వేరు పార్టీల వాళ్లు ఒక్కతాటిపై రావడం, సంకీర్ణ ప్రభుత్వం ఏర్పరచడం జరగని మాట. అందువలన మిలటరీ ఏమనుకుంటే అది, దాని ప్రతినిధులతో నిండిన ఎగువ సభ ద్వారా అమలవుతుంది.

గతంలో ప్రధానిగా పనిచేసిన టెలికామ్ మొఘల్ తక్సిన్ షినవ్రతా అధికారంలోకి రాకుండా చూడడానికే మిలటరీ యీ జాగ్రత్తలు తీసుకుంటోందని పరిశీలకులు భావిస్తున్నారు. అతనికి పేదవారిలో, రైతుల్లో, కులీనవర్గాల్లో, రాజుగారితో సైతం మంచి పలుకుబడి వుంది. 2001 నుంచి అతన్ని అనేకసార్లు ఎన్నుకున్నారు. కానీ రెండు సార్లు అతని ప్రభుత్వాలను మిలటరీవాళ్లు కూలదోశారు. మూడుసార్లు కోర్టులు రద్దు చేశాయి. అతను అధికార దుర్వినియోగం చేశాడని, అవినీతికి పాల్పడ్డాడని కోర్టులు 2008లో తీర్పు వెలువడ్డాక అతను ప్రవాసంలో నివసించసాగాడు. అయితే అతను కుటిల రాజకీయవేత్త. తన వాక్చాతుర్యంతో అందరినీ ఆకట్టుకోగలడు. 2014లో అతని అభిమానులు కొందరు అతనికి క్షమాభిక్ష ప్రసాదించాలని, దేశానికి తిరిగి తీసుకుని వచ్చి 1.2 బిలియన్ డాలర్ల అతని ఆస్తిని అతనికి అప్పగించాలని సూచించారు. దానికి నిరసనగా ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ఆ ప్రదర్శనలు సాకుగా చూపి మిలటరీ అధికారాన్ని తన చేతిలోకి తీసుకుంది. అలా తీసుకోవడాన్ని థాయ్‌లాండ్‌కు ఎప్పణ్నుంచో సన్నిహితంగా వున్న అమెరికా

ఆమోదించలేదు. దానిపై ఆర్థిక అంక్షలు విధించింది. ఇస్తానన్న కోట్లాది సహాయాన్ని నిలిపివేసింది. అదే అదనుగా చైనా, రష్యా రంగంలోకి దిగి సైన్యపాలనకు అండగా నిలబడింది.

వీరితో బాటు థాయ్‌లాండ్ ఉన్నతవర్గాలు కూడా సైన్యానికి మద్దతు యిస్తున్నాయి. థాయ్‌లాండ్ రాజు భూమిబల్ అదుల్యదేజ్ అంటే ప్రజలకు గౌరవం. ప్రభుత్వాలు కూడా ఆయన మాట గౌరవిస్తాయి. కానీ ఆయన వయసు 88. అనారోగ్యంగా వున్నాడు. ఆయన కేదైనా అయితే ప్రజలను అదుపు చేసేవారు లేరు. ఎందుకంటే ఆయన కొడుకు మహావజ్రలంగకర్ణ అనేక స్కాండల్స్‌లో యిరుక్కుని మర్యాద పోగొట్టుకున్నాడు. ప్రజలు తిరగబడిన పక్షంలో వారిని వారించగల స్థాయిలో వున్న రాజుగారికి ఏదైనా జరిగితే, రాజమహల్ ప్రభావం ప్రభుత్వంపై లేకుండా పోతుందని, తమకు ముప్పు వాటిల్లుతుందని ఉన్నతవర్గాలు భయపడ్డాయి. వారికి అభయం యివ్వడానికి, తమతో పాటు వారికీ న్యాయపరమైన రక్షణను యీ రాజ్యాంగంలో కల్పించింది మిలటరీ. ఇవన్నీ మేధావుల విమర్శలకు గురవుతాయని తెలుసు కాబట్టి రాజ్యాంగంపై చర్చలు అనుమతించలేదు. వ్యాఖ్యలు చేసిన విమర్శకులను, పాత్రికేయులను జైలుపాలు చేసింది. ఎన్నికల నిర్వహణ ఎలా జరుగుతుందో పర్యవేక్షించడానికి స్వతంత్ర ఏజన్సీ ముందుకు వస్తే దాన్ని అనుమతించలేదు. ఇలాటి పరిస్థితుల్లో జరిగిన ఎన్నిక ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించిందని ఎలా అనగలం? **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

ఎమ్బీయస్ : చైనా టూరిస్టులు ఉత్తర కొరియాకు ఎందుకెళతారు?

ఉత్తర కొరియాలో దుర్భరమైన నియంతృత్వ పరిస్థితులున్నాయని అందరికీ తెలుసు. టూరిస్టుగా వెళ్లినా ప్రమాదమేమో అనిపిస్తుంది. ధైర్యం చేసి వెళదామన్నా అదేమీ భూతలస్వర్గం కాదు, చౌక ధరల్లో అమరసౌఖ్యాలందించే నందనవనమూ కాదు. ఆ మాట కొస్తే అక్కడ ఆధునిక సౌకర్యాలు బొత్తిగా లేవు. పైగా కఠినమైన రూల్సున్నాయి. చనిపోయిన కిమ్ సుంగ్ విగ్రహాన్ని ముందు నుంచి తప్ప వెనకనుంచి ఫోటో తీయడానికి వీల్లేదని టూరిస్టులను గైడ్లు హెచ్చరిస్తారు. అలాటి చోటికి చైనా పర్యాటకులు ఎందుకు వెళుతున్నారో ఓ పట్టాన ఎవరికీ అర్థం కాలేదు. అఫ్‌కోర్సు, వాళ్లకు ఉ. కొరియా బాగా దగ్గర. సరిహద్దుల్లో వున్న డాన్‌డాంగ్ వూరి నుంచి యాలూ నది దాటితే చాలు వెళ్లిపోవచ్చు. వెళ్లడం సులభమే కానీ, అక్కడేముందని వెళ్లాలి? అని అడిగితే 'ఏమీ లేదు కాబట్టే వెళుతున్నాం' అంటున్నారు చైనావారు. 'అక్కడ సెల్‌ఫోన్లు కంప్యూటర్లు వగైరాలు ఏమీ లేవు కాబట్టి ప్రాణానికి సుఖంగా వుంటుంది. మనశ్శాంతి దొరుకుతుంది' అని జవాబిస్తున్నారు.

ఉత్తర కొరియాపై మార్చి నుండి ఆర్థికపరమైన ఆంక్షలు పెంచడంతో బొగ్గు, ఖనిజాల ఎగుమతుల ద్వారా సంపాదిస్తున్న విదేశీమారక ద్రవ్యానికి గండి పడింది. దాన్ని టూరిజంతో పూరించుకుందామని ఉ.కొరియా చూస్తోంది. జులై నెల నుంచి చైనా దేశస్తులు వీసా–పాస్‌పోర్టులాటివి లేకుండానే ఒక పూట పర్యాటనలు చేయవచ్చని ప్రకటించింది. అంతకంటె ఎక్కువకాలం గడపదలచుకుంటేనే వీసా తీసుకోవాలి. ఇదే అవకాశంగా డజన్ల కొద్దీ చైనీస్ టూరిస్టు కంపెనీలు కొరియాకు టూర్లు ఆపరేట్ చేస్తున్నారు. చైనా పర్యాటకుల్లో 85% వచ్చే దారిలో వారికి అతి దగ్గరగా సరిహద్దు దాటగానే వచ్చే సిన్యుజు నగరంలో లగ్జరీ హోటళ్లు, స్కీ రిసార్టులు, రెస్టారెంట్లు అవీ నెలకొల్పింది. కానీ అవన్నీ ఖరీదైనవే. అయితే చైనావాళ్లు కొరియాకు వెళుతున్నది ఆ ఫైవ్‌స్టార్ సౌఖ్యం కోసం కాదు, ప్లాస్టిక్ కవర్లు, చెత్తా చెదారంతో కలుషితం కాని ప్రకృతి కోసం! ఆధునికత, మానవప్రమేయం అంటకుండా ప్రకృతి అందాలు సహజంగానే వుండిపోవడం వాళ్లకు ఆకర్షణగా మారింది. "వైఫై లేని లోకాన్ని, కొండలు, జలపాతాలున్న సహజసీమను మా పిల్లలకు, మనుమలకు పరిచయం చేస్తున్నాం. చైనాలో కూడా ఎంతో మార్పు వచ్చేసి పల్లెలు పల్లెల్లా లేవు. గ్రామీణులు కూడా తెలివి మీరి కృత్రిమంగా అయిపోయారు. కొరియా సహజమైన పరిసరాలను, మనుష్యులను చూస్తూంటే మేం బాల్యంలో చూసిన గ్రామీణ చైనా గుర్తుకు వస్తోంది." అంటున్నారు వృద్ధులు.

అంతేకాదు, చైనాలో జనాభా పెరుగుతున్న కొద్దీ వారికి ఆహారం అందించడానికి మన దగ్గర లాగానే ఎరువులు వేయడాలు, క్రిమి సంహారక మందులు చల్లడాలు, కృత్రిమ వంగడాలతో ఆహారోత్పత్తి పెంచడాలు జరిగాయి. వీటివలన కాయగూరలకు రుచి పోయిందని, ఆహారపదార్థాల నాణ్యత తగ్గిందని, రసాయనాల వాడకం చేత అనారోగ్యం కలుగుతోందని చైనీయులు ఆందోళన చెందుతున్నారు. కొరియాలో అలాటి బాధలేవీ లేవు. అంతా సహజంగా పండేవే, మనం ఆర్గానిక్ పేరుతో హెచ్చు ధరలు పెట్టి కొంటున్నవి అక్కడ అతి మామూలుగా దొరుకుతున్నాయి. "బంగాళా దుంపలు, బీన్స్‌ల అసలు రుచి ఎలా వుంటుందో తెలియాలంటే కొరియా వెళ్లాల్సిందే, చైనాలో అలాటి రుచి చాలా అరుదుగా లభిస్తుంది." అంటున్నారు చైనా పర్యాటకులు. ట్రావెల్ ఏజంట్లు కూడా అదే ధోరణిలో యాడ్స్ గుప్పిస్తున్నారు. "ఉత్తర కొరియాలో సముద్రం 100% క్లీన్. ఎక్కడా చెత్త కనబడదు.,, రాసన్ సిటీ మొత్తం ఆర్గానిక్‌యే!... సిగ్గుపడే మొగ్గల్లాటి పల్లెపడుచులను చూడాలంటే ఉత్తర కొరియాకు రావాల్సిందే.." అంటూ. మన దేశంలో కూడా నదీతీరంలో లేదా కొండల మధ్య టీవీలు లేని, మొబైల్ సిగ్నల్సు రాని, ప్లాస్టిక్ వాడని, ఎరువులు వేయకుండా పంటలు పండించే శుభ్రమైన పల్లెటూళ్లను తయారుచేసుకుని టూరిస్టు స్పాట్లగా తీర్చిదిద్దితే సిటీ జనాలు ఏడాదికో సారైనా పరుగెత్తుకు వస్తారనుకుంటా.

(ఫోటో – ఉ.కొరియాలో మౌంట్ మైయోహ్యాంగ్ వద్ద చైనా టూరిస్టులు) – ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)

ఎమ్బీయస్ : దహనాలకు మొగ్గుతున్న అమెరికన్లు

అమెరికా క్రైస్తవదేశం కాబట్టి చనిపోయాక ఖననం చేయడమే అనాదిగా వస్తున్న ఆచారం. అయితే యిటీవలి కాలంలో ఖననాల స్థానంలో దహనాలు పెరుగుతున్నాయి. మతపరంగా వుండే అభ్యంతరాలు కూడా క్రమేపీ సడలుతూ వచ్చాయి. ఇప్పుడు దహనాల సంఖ్యే పెరిగిపోయింది. క్రెమేషన్ అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, నేషనల్ ఫ్యునరల్ డైరక్టర్స్ అసోసియేషన్ వారి గణాంకాల ప్రకారం 2015లో మొత్తం మరణాలలో 49% మందిని దహనం చేశారు, 45% మందినే ఖననం చేశారు. ఈ మార్పుకు కారణం ఆర్థికపరమైనదే. ఖననం అనగానే శవపేటిక కొనాలి, పాతిపెట్టడానికి కొంత స్థలం కొనాలి, సమాధి కట్టించాలి, ఫలకం పెట్టించాలి – యిదంతా వేలాది డాలర్ల ఖర్చు. సాధారణంగా సమాధి చేయడం కూడా ఎక్కడపడితే అక్కడ చేయరు. వారి కుటుంబసభ్యులను గతంలో ఎక్కడ పాతిపెట్టారో, అక్కడే పక్కన స్థలం చూసుకుని పాతిపెడతారు. అక్కడి దాకా శవాన్ని రవాణా చేయాలి. అమెరికన్లలో చాలామంది స్వస్థలం కంటె దూరంగా నివసిస్తూ వుంటారు. అక్కణ్నుంచి శవాన్ని తరలించడం కూడా ఖఱ్చుతో, శ్రమతో కూడుకున్నది. అదే దహనం అయితే ఎక్కడ పోతే అక్కడే చేసి వేయవచ్చు. సమాధి, దాని మేన్‌టెనెన్స్ గొడవ ఏమీ వుండదు.

జనాలు యిలా దహనాలవైపు మళ్లడంతో 16 బిలియన్ డాలర్ల డెత్ యిండస్ట్రీ దెబ్బ తింటోంది. 2005 నుంచి చూస్తే 10% ఫ్యునరల్ హెూమ్స్ మూతపడ్డాయి. కొన్ని కంపెనీల ఉద్యోగులు దహనం జరిగే చోటికి వెళ్లి అస్థికలు దాచడానికి పాత్రలు, అలంకరించిన పెట్టెలు అమ్ముతున్నారు. వాటిని పాతిపెట్టడానికి చిన్నసైజు స్థలాలు కూడా అమ్మచూపుతున్నారు. 2000 సం॥లో దహనాలు 30% వుండేవి. ప్రస్తుత ధోరణి కొనసాగితే 2030 నాటికి దహనాలు 70%కి చేరి, ఖననాలే 30% కావచ్చని అంచనా. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

ఆగస్టు 40

ఎమ్బీయస్ : భర్త వాచాలత్వం – భార్యకు లాభం

ఎవరెక్కువ డబ్బిస్తే వారికి పార్టీ టిక్కెట్లు అమ్ముకుంటున్నారని మాయావతిపై ఆరోపణ చేస్తూ ఆమెను వేశ్యతో పోల్చి వివాదాన్ని నెత్తికి తెచ్చుకున్న యుపి బిజెపి నాయకుడు దయాశంకర్ సింగ్ పేరు వినే వుంటారు. అతని కథలో కొత్త ట్విస్టు ఏమిటంటే అనుకోకుండా అతని భార్య నాయకురాలై పోయింది. మాయావతి పార్టీ టిక్కెట్లు 4–5 కోట్లకు అమ్ముకుంటోందని ఆమె పార్టీలోంచి వెళ్లిపోయిన స్వామి ప్రసాద్ మౌర్య, ఆర్‌కె చౌధురి కూడా ఆరోపించారు. మామూలుగా అమ్ముకోవడం కదాని వేలం వేసి మరీ అమ్ముతోందని, అందువలన ఆమెను 'దళిత్ కే బేటీ' అనడం కంటె 'దౌలత్ (సంపద)కి బేటీ' అనడం సబబని వారు చమత్కరించారు కూడా. దాన్నే దయాశంకర్ యింకా ఘాటుగా, రసవత్తరంగా చెప్పబోతూ వేశ్యతో పోల్చాడు. దాంతో కొంప మునిగింది. మాయావతి పార్లమెంటులో మండిపడుతూ 'నన్ను కాదు అతనన్నది, అతని యింట్లోవాళ్లని, తల్లిని, భార్యను, అక్కచెల్లెళ్లను, కూతుర్ని అన్నాడు' అంటూ కుటుంబసభ్యులను తెరపైకి తెచ్చింది. దయాశంకర్ చేసిన పోలిక అశ్లీలంగా, అసభ్యంగా వుంది కాబట్టి 'కావాలంటే అతన్ని అను, మధ్యలో అతని కుటుంబసభ్యులెందుకు?' అని ఏ పార్టీ నాయకుడూ వారించలేకపోయాడు. బిజెపి క్షమాపణ చెప్పడమే కాక దయాశంకర్‌ను యుపి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించడమే కాక, గొడవ యింకా ముదరడంతో పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించింది కూడా. 2017 ఎన్నికలలో యుపిలో దళిత ఓట్లు చాలా ముఖ్యం. గుజరాత్‌లో గోరక్షకుల కారణంగా బిజెపిని దళిత వ్యతిరేకిగా చిత్రీకరిస్తున్నవేళ పార్టీ నాయకుడు యిలాటి వ్యాఖ్య చేయడం మరింత యిబ్బందికరమనుకుని అతనికి ఆ దండన విధించింది.

అయితే యీ అవకాశాన్ని ప్రతిపక్షాలు వదులుకోదలచుకోలేదు. సమాజ్‌వాదీ పార్టీ అతనిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసు పెట్టి అరెస్టు చేయబోయింది. అతను అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇక మాయావతి పార్టీ బియస్పీ యిదే అదనని దీన్ని మరింత పెద్దది చేయసాగింది. దయాశంకర్ వంటి దుష్టుణ్ని చేరదీసినందుకు బిజెపిని, యింకా అరెస్టు చేయకుండా కాపాడుతున్నందుకు ఎస్పీని నిందిస్తూ రాజధానిలో నిరసన ప్రదర్శనలు చేయసాగింది. వాటికి మాయావతి కుడిభుజంగా వున్న నసీముద్దీన్ సిద్దిఖి నాయకత్వం వహించాడు. జులై 21 నాటి ప్రదర్శనలో దయాశంకర్‌ని దూషిస్తూ నినాదాలివ్వడంతో ఆగకుండా 'దయాశంకర్ భార్యను, కూతుర్ని తీసుకురండి (పేష్ కియా జాయ్)' అని అరుపులు అరిచారు. ఆ విధంగా వాళ్లు దయాశంకర్ తరహాలోనే వాచాలత్వం ప్రదర్శించారు. కానీ వాటిని ఖండించే ధైర్యం బిజెపి చేయలేకపోయింది. పక్కనే బిజెపి ఆఫీసు వున్నా ఎవరూ వచ్చి అభ్యంతర పెట్టలేదు. అసలే దళిత వ్యతిరేకి అంటున్నారు, యిప్పుడు ఏం మాట్లాడినా తప్పుగానే వుంటుందనుకున్నారు. వాళ్ల ఆగ్రహం ఎలాగోలా తగ్గితే అదే చాలనుకున్నారు.

అయితే యీ నినాదాలకు అభ్యంతరం తెల్పడానికి ఒక మహిళ ముందుకు వచ్చింది. ఆమె వేరెవరో కాదు, దయాశంకర్ భార్య స్వాతి సింగ్. ఆమె సాధారణ గృహిణి. రాజకీయాల్లోకి రాలేదు. రాజకీయ కలహాల్లో తన పేరు, 13 ఏళ్ల తన కూతురు పేరు బయటకు రావడం ఆమె సహించలేకపోయింది. వెళ్లి పోలీసుల వద్ద బియస్పీ నాయకులపై, ముఖ్యంగా మాయావతి, సిద్దిఖీపై ఫిర్యాదు చేసింది. ఆమె క్షత్రియ కులానికి చెందినది కాబట్టి ఠాకూర్ వనితలందరి మానమర్యాదలకు యిది సవాల్ అని ఆమె

చిత్రీకరించింది. ''మాయావతి 'దళిత్ కీ బేటీ' అయితే నేను 'ఇన్‌సాన్ కీ బేటీ'' అని చెప్పుకోసాగింది. ఇది ఠాకూర్లందరికీ మనసు కెక్కింది. వాళ్లంతా అఖిల భారతీయ క్షత్రియ మహాసభ ద్వారా స్వాతీ సింగ్‌కు మద్దతు తెలపసాగారు. ఇది గ్రహించగానే మాయావతి కంగారు పడింది. దయాశంకర్ అరెస్టు కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన నిరసన కార్యక్రమాలన్నీ రద్దు చేసింది. దయాశంకర్ భార్య, కూతుళ్లను తెరపై తెచ్చినందుకు అనుచరులను మందలించిందట కూడా. బిజెపికి క్రమంగా కళ్లు తెరుచుకున్నాయి. దయాశంకర్‌ను దిక్కుమాలినవాడిగా వదిలేస్తే ఠాకూర్లు కూడా తమపై కోపం పెంచుకుంటారని గ్రహించుకుంది. పోయిన దళితులు ఎలాగూ పోయారు, ఠాకూర్ల నెందుకు వదులుకోవాలి? అనుకుని స్వాతీ సింగ్‌కు లోపాయికారీగా మద్దతు యివ్వసాగింది. జులై 29 న దయాశంకర్ బిహార్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. అరెస్టయి, వెంటనే బెయిలు పొంది బయటకు వచ్చాడు. శ్రావణ పౌర్ణమి రోజున ఆరెస్సెస్ వారు నిర్వహించిన రాఖీ ఉత్సవంలో పాల్గొన్నాడు.

ఇప్పుడు దయాశంకర్, అతని భార్య స్వాతి కలిసి క్షత్రియులు ఎక్కువగా వున్న గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఆ సభలను పార్టీ బ్యానర్లు లేకుండా, తన మిత్రపక్షమైన అప్నాదళ్ పేర, క్షత్రియసభ పేర బిజెపి నాయకులు నిర్వహిస్తున్నారు. ఎందుకైనా మంచిదని కొన్ని చోట్ల సమాజ్‌వాదీ పార్టీ వారు కూడా వచ్చి చేరుతున్నారు. ఇప్పటిదాకా యింట్లోనే వున్న స్వాతీ సింగ్ యిప్పుడు మంచి వక్తగా మారి తనను, తన కూతుర్ని అవమానించిన మాయావతిపై కాని, సిద్ధిఖీపై కాని, యితర బియస్పీ నాయకులపై కానీ రాష్ట్రప్రభుత్వం చర్య తీసుకోలేదని, మరి ఎఫ్ఐఆర్‌కు విలువేముందని ఝాడించి పడేస్తోంది. మహిళలను అవమానించిన బియస్పీకి ఎవరూ ఓటేయకూడదని పిలుపు నిచ్చింది. ఆ సభలోనే దయాశంకర్ మాట్లాడుతూ 'ఇది స్వాతి చేస్తున్న పోరాటం. రాజకీయాలతో సంబంధం లేదు. కూతురు కోసం ఒక తల్లి పడే ఆవేదన యిది. మాయావతి తన పార్టీ సహచరులపై చర్య తీసుకుని వుంటే బాగుండేది. కానీ ఆమె అలా చేయలేదు. పోలీసులు పట్టించుకోవటం లేదు. క్షత్రియులను ఏం చేసినా ఫర్వాలేదని వారి అభిప్రాయం కాబోలు. ఏదైనా జనరల్ సీటు నుంచి మాయావతి పోటీ చేసే సాహసం చేస్తే స్వాతి ఆమెకు వ్యతిరేకంగా నిలబడుతుంది. మాయావతి టిక్కెట్లు అమ్మిన మాట వాస్తవం. సిబిఐచే విచారణ జరిపిస్తే నిజాలు బయటకు వస్తాయి. అది చెప్పే క్రమంలో నా నోట తప్పుమాట దొర్లింది. నేను వెంటనే క్షమాపణ చెప్పాను కూడా. నన్ను పార్టీ వెలివేసింది. కానీ నేను ఆరెస్సెస్, బిజెపిలలోనే పెరిగాను. అవి నా రక్తంలోనే వున్నాయి.' అన్నాడు. సభలోని తక్కిన క్షత్రియ వక్తలందరూ యిది తమ కులవనితలకు జరిగిన అవమానంగానే భావిస్తున్నామన్నారు. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' పేరుతో తను ఒక ఉద్యమం నడుపుతానని స్వాతి ప్రకటించింది.

ఇవన్నీ మాయావతికి దడ పుట్టిస్తున్నాయి. కేవలం దళితుల ఓట్లతో ఆమె నెగ్గలేదు. దానికి అగ్రకులాల ఓట్లు, ముస్లిముల ఓట్లు కూడా తోడవ్వాలి. గతంలో బ్రాహ్మణులతో చేతులు కలిపి ఆమె నెగ్గింది. ఇప్పుడు బ్రాహ్మణులు ఆమెకు దూరమయ్యారు. గతంలో బ్రాహ్మణులను బిజెపికి చేజార్చుకున్న కాంగ్రెసు యిప్పుడు వారిని దువ్వుతోంది. మాయావతి పార్టీ నుంచి బ్రాహ్మణ నాయకులు బయటకు వచ్చేసి బిజెపిలో కలుస్తున్నారు. వారికి తోడు యిప్పుడీ క్షత్రియులతో కూడా వైరం తెచ్చుకుంటే, అగ్రకుల వ్యతిరేక ముద్ర పడితే బిస్పీ గెలుపు కష్టం. ఎందుకంటే బిసిలకు దళితులకు మధ్య వున్న వైరం చేత బిసిలు ఎక్కువభాగం మంది ఎస్పీవైపు మళ్లుతున్నారు. ముస్లిములు, దళితులు తప్ప తక్కిన వర్గాలన్నిటినీ హిందూత్వ పేరుతో సంఘటితం చేద్దామని బిజెపి చూస్తోంది. ఇలాటి పరిస్థితుల్లో స్వాతి అనే క్షత్రియ వనిత బిజెపికి అంది వచ్చింది. ఆమెకు టిక్కెట్టు యిచ్చినా యివ్వవచ్చు. ఆమె భర్త వదరుబోతుతనంతో నోరు పారేసుకోవడం వలననే స్వాతికి యీ నాడు యింత గుర్తింపు వచ్చిందన్నది వాస్తవం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 01 **ఎమ్బీయస్ : ట్రంప్ యిక్కట్లు**

ఇప్పటిదాకా ఏ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ఎదుర్కోని కష్టాన్ని ట్రంప్ ఎదుర్కుంటున్నాడు. ఒక సర్వే ప్రకారం అతని అభ్యర్థిత్వాన్ని ఆమోదించని రిపబ్లికన్లు పార్టీ అభిమానులు సగం కంటె ఎక్కువమంది, కరక్టుగా చెప్పాలంటే 54% మంది వున్నారు. హిల్లరీ అభ్యర్థిత్వాన్ని ఆమోదించని డెమోక్రాట్లు కూడా వున్నారు. వారి శాతం 44. మరో సర్వే ప్రకారం హిల్లరీ డెమోక్రాట్లమని చెప్పుకునే వారిలో 85% మంది అభిమానాన్ని చూరగొనగా, ట్రంప్ విషయంలో అది 78% మాత్రమే. ఎలా చూసినా, హిల్లరీ వెనుక డెమోక్రాట్లు నిలిచిన స్థాయిలో ట్రంప్ వెనుక రిపబ్లికన్లు లేరనేది వాస్తవం. డెమోక్రాట్ నాయకుల్లో హిల్లరీని విమర్శించేవాళ్లు లేరు కానీ, ట్రంప్‌ను అనేకమంది నాయకులు బహిరంగంగా వ్యతిరేకిస్తున్నారు.

రిపబ్లికన్ సమావేశంలో, తనను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత ట్రంప్ ఎన్నో పొరపాట్లు చేశాడు. రష్యన్ గూఢచారులను హిల్లరీ ఈమెయిలు ఎక్కవుంటును హ్యాక్ చేయమంటూ పిలుపిచ్చాడు. 'హిల్లరీ ఎన్నికైతే ఆమె నియమించే జడ్జి ఆయుధాలు ధరించే హక్కు యిచ్చే రెండో సవరణ (సెకండ్ ఎమెండ్‌మెంట్) తొలగించవచ్చు. అప్పుడు మీరూ నేనూ ఏమీ చేయలేం. చేస్తేగీస్తే గన్‌లాబీల వాళ్లే ఏమైనా చేయాలి' అంటూ గన్ లాబీల మీద వేసిన జోకు వికటించింది. హిల్లరీని హత్య చేయమని ప్రేరేపించినట్లుందని అందరూ విమర్శించారు. అన్నిటిని మించి గోల్డ్‌స్టార్ సైనికుడి కుటుంబంతో అనవసరంగా గొడవలు పెట్టుకున్నాడు. ''మేం ముస్లిలం. 2004లో ఆత్మాహుతి దాడిలో ఇరాక్ నేలపై అమెరికా కోసం ప్రాణాలర్పించిన సైనికుడు హుమయూన్ నా కొడుకు. మరి నువ్వేం త్యాగాలు

చేశావ్?" అని ఖిజిర్ ఖాన్ అనే సైనికుడి తండ్రి ప్రశ్నిస్తే "బిల్డింగులు కట్టాను, ఉద్యోగాలు యిచ్చాను" అంటూ కుంటి సమాధానం యివ్వడంతో బాటు 'ఆ వేదిక మీదనే వున్న తల్లి ఎందుకు మాట్లాడలేదు? బహుశా బహిరంగ ఉపన్యాసాలివ్వకూడదని మతపరమైన ఆంక్షలున్నాయేమో' అంటూ ఇస్లాంపై తన ద్వేషాన్ని మరోసారి కక్కాడు. బాధాతప్త హృదయం కారణంగా మాట్లాడలేకపోయింది కానీ, మతపరంగా నిషేధం ఏమీ లేదని ఖిజిర్ ఖాన్ జవాబిచ్చాడు. అంతకు ముందే "2001లో వ(ర)ల్డ్ ట్రేడ్ సెంటరు కూలిపోయినపుడు న్యూ జెర్సీలోని ముస్లిములు హర్షధ్వానాలు చేసిన సంగతి టీవీల్లో వచ్చింది. ఆ ఫుటేజి నేను కళ్లారా చూశాను." అని చెప్పాడు ట్రంప్. అసలలాటి ఫుటేజే లేదని టీవీ వర్గాలు చెప్పినా ట్రంప్ తన మాట వెనక్కి తీసుకోలేదు. 'నిజానిజాలతో సంబంధం లేకుండా యితను ముస్లిములపై ద్వేషం కక్కుతున్నాడు, ముస్లిములు యితను చిత్రీకరిస్తున్నంత చెడ్డవాళ్లు కారేమో' అని ప్రజలు అనుకుంటున్న తరుణంలో దేశభక్తుడి తల్లి గురించి ట్రంప్ చేసిన యీ వ్యాఖ్యలు వారిలో చికాకును పెంచాయి. అది ఏ మేరకు అని సర్వే చేయిస్తే 70% మంది అని తేలింది. వారిలో 59% మంది రిపబ్లికన్లే.

ఆ ముస్లిము దంపతులు డెమోక్రాటిక్ పార్టీ సమర్థకులు కాబట్టి ట్రంప్ అలా మాట్లాడేడు అనుకోవడానికి లేదు. తన పార్టీలోని సహచరులమీదే అతను దయాదాక్షిణ్యాలు చూపటం లేదు. అతనితో పోటీ పడి ఓడిపోయిన టెడ్ క్రూజ్ సమావేశంలో ట్రంప్ విధానాలను విమర్శిస్తూ వుంటే ట్రంప్ అభిమానులు గోలగోల చేశారు. టెక్సాస్ వాస్తవ్యురాలైన క్రూజ్ భార్య మాజీ కాల్ గర్ల్ అనీ, ఆమె తన కస్టమర్లకు ఫోన్లు చేస్తూండగా తను ఆ గదిలోనే వున్నాననీ అన్నాడు. కెనెడీను హత్య చేసిన ఆస్వాల్డ్‌తో బాటు క్రూజ్ తండ్రి వున్న ఫోటో చూపించి, హత్యలో అతనికీ హస్తం వుందన్న పుకారు గురించి ప్రస్తావించి అతన్ని అవమానించాడు. ట్రంప్‌తో పోటీ చేసి ఓడిపోయిన ఒహైయో గవర్నర్ జాన్ కాసిక్, ఓటమి తర్వాత ట్రంప్ కుమారుడు తనకు వైస్‌ప్రెసిడెంటు పదవి యివ్వజూపాడని చెప్పుకుంటే, అదేమీ లేదని చెప్పించాడు. ఓటమికి, అవమానాన్ని జోడించాడు. తన మైనారిటీ, మెక్సికన్ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ వచ్చిన సాటి రిపబ్లికన్ నాయకుడు, స్పీకరు పాల్ ర్యాన్‌ను ప్రైమరీలలో ఎండార్స్ చేయడానికి తిరస్కరించి అవస్థ పెట్టాడు. 2008లో పార్టీ అభ్యర్థి ఐన జాన్ మెకైన్ గురించి మాట్లాడుతూ "అతను యుద్ధంలో పట్టుబడిపోయాడు కాబట్టి వార్‌హీరో అంటున్నారు, పట్టుబడని వాళ్లంటేనే నాకు గౌరవం" అన్నాడు. పార్టీకి అది నచ్చలేదు. యుద్ధవీరులందరినీ అది బాధిస్తుందనే అభిప్రాయంతో ట్రంప్‌ను క్షమాపణ చెప్పమంది. కానీ అతను మొరాయించాడు. చివరకు మెకైన్‌ను ఎండార్స్ చేశాడు.

ఇక క్యాంపెయిన్ పరంగా చేసిన పొరపాట్లు కూడా చాలా వున్నాయి. 13 మందితో ఎకనమిక్ ఎడ్వయిజరీ కమిటీ వేస్తే దానిలో ఒక్క మహిళయినా లేదు. మగవాళ్లలో నిపుణులైన ఎకనమిస్టులు ముగ్గురే ముగ్గురున్నారు. ఓ డిబేట్‌లో ఫాక్స్ టీవీకి చెందిన మహిళా యాంకర్ గురించి అశ్లీలం స్ఫురించేలా వ్యాఖ్యానించాడు. ఒక శ్వేతజాతీయుడు నల్లవారి చేతిలో హతులైన శ్వేతజాతీయుల సంఖ్యను విపరీతంగా పెంచి ట్వీట్ చేస్తే, ట్రంప్ దాన్ని రీట్వీట్ చేశాడు. నీ గణాంకాలు తప్పు, వాటిని ఎలా ప్రచారం చేస్తావు అని అడిగితే రీట్వీట్‌లలో వుండే అంకెలకు తను బాధ్యుణ్ని కానన్నాడు. విదేశాలు అమెరికాను ఎలా దోచుకుంటున్నాయో చెప్పడానికి ఉదాహరణగా 'ఇరాన్‌లో బందీలుగా పట్టుకున్న అమెరికన్ పౌరులను విడిపించడానికి 400 మిలియన్ డాలర్ల సొమ్ముతో అమెరికన్ విమానం వెళ్లడం నేను చూశాను.' అని ట్రంప్ చెపుతూంటాడు. 'ఆ వీడియో ఫుటేజి ఇరాన్‌లోది కాదు, జెనీవాలోని ఖైదీలను విడిపిస్తున్నది' అని సొంత క్యాంప్ మేనేజర్లు చెప్పినా ట్రంప్ వినకుండా మళ్లీమళ్లీ ఆ కథ రిపీట్ చేస్తున్నాడు. తన మీద నడుస్తున్న ఓ కేసులో ఫలానా జడ్జి తన పట్ల న్యాయబద్ధంగా వ్యవహరించకపోవచ్చని, దానికి కారణం అతని తలిదండ్రులు మెక్సికన్లని అన్నాడు.

ఇలా మైనారిటీల పట్ల, విదేశీయుల పట్ల, మహిళల పట్ల అబద్ధాలాడుతూ వ్యతిరేక ప్రచారం చేస్తే గెలవడం ఎలా అని అనుకున్న 50 మంది అనుభవజ్ఞులైన రిపబ్లికన్లు ట్రంప్‌ను వ్యతిరేకిస్తూ ఉత్తరం రాశారు. అనేకమంది కాంగ్రెసుమెన్, కొందరు సెనేటర్లు కూడా 'ట్రంప్‌కు ఓటు వేయం' అని చెప్పసాగారు. ప్రచారంలో భాగంగా ట్రంప్ తమ నగరానికి వస్తే రిసీవ్ చేసుకునేందుకు ఎయిర్‌పోర్టులకు రాని, తమ సభల్లో మాట్లాడించని నాయకులెందరో! ఈ వరసంతా చూసి రిపబ్లికన్ పార్టీ బాస్ రైన్స్ ప్రైబస్ ట్రంప్‌కు ఫోన్ చేసి "మన పార్టీ అంతర్గతంగా జరిపిన సర్వేలో నీ ఓటమి తథ్యం అని తేలింది. రాబోయే వారాల్లో నీ ధోరణి మారి, నీ పాప్యులారిటీ పెరగకపోతే యిక నీ ఎన్నికపై ఆశ వదులుకుని, పార్టీ శక్తియుక్తులను, ఆర్థిక వనరులను హౌస్, సెనేట్ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు మళ్లించాలని రిపబ్లికన్ నేషనల్ కమిటీ ఆలోచిస్తోంది." అని చెప్పాడట. దెబ్బకి ట్రంప్‌కి దిమ్మ తిరిగిపోయిందట. "నేను పార్టీ కోసం, దాని అభ్యర్థుల కోసం లక్షలాది డాలర్లు పోగుచేస్తున్నది యిందుకేనా?" అని అడిగాడట. ఈ మధ్యే అతను 8 లక్షల డాలర్ల ఫండ్స్ సేకరించడానికి డిన్నర్ ఏర్పాటు చేశాడు. అనేకమంది 50 వేల డాలర్లకు చెక్కులు రాసి యిచ్చారు. ఇదంతా తనను చూసే అని ట్రంప్ నమ్మకం. "నువ్వు కాస్త మృదువుగా, లౌక్యంగా, యీజీగోయింగ్‌గా మాట్లాడు అని నాకు సలహా చెపుతున్నారు నా హితైషులు. సరే అలాగే కానీయండి, అది దేశాధ్యక్షుడికి యిలాటి గుణాలు మాత్రమే వుంటే దేశానికి అది మంచి చేస్తుందో లేదో నాకు తెలియటం లేదు. హిల్లరీని నెగ్గించాలని ఆమె పార్టీ యాడ్స్‌పై యిప్పటికే 240 మిలియన్ డాలర్ల ఖర్చు పెట్టింది (యిది అతిశయోక్తి). మరి నా విషయంలో నేను ఒక్క సెంటు కూడా ఖర్చు పెట్టలేదు, పెట్టించలేదు." అని చెప్పుకున్నాడు ట్రంప్.

ఇలా లౌక్యం లేకుండా, మొరటుగా, ఉన్నదున్నట్లు (?) మాట్లాడడం కూడా చాలామంది శ్వేతజాతి ఓటర్లకు నచ్చుతోంది. సర్వేలో 65% మంది హిల్లరీ హిపాక్రసీని ఎండగట్టారు. నమ్మదగిన వ్యక్తి కాదన్నారు. విదేశీ శక్తులతో కుమ్మక్కయి, దేశానికి ముప్పు తెచ్చిపెట్టగల దనుకుంటున్నారు. ప్రస్తుతం వున్న దుర్భర పరిస్థితి కొనసాగాలంటే హిల్లరీకి, మార్పు కావాలంటే ట్రంప్‌కు వేయాలని

అనుకుంటున్నారు. కాస్త తెలివితక్కువగా, మూర?ంగా వున్నా ట్రంప్ అమెరికా భవిష్యత్తు గురించే ఆలోచిస్తున్నాడని నమ్ముతున్నారు. వీరి సంఖ్య పెరిగిన కొద్దీ రిపబ్లికన్ పార్టీ నాయకులు తమ అపనమ్మకాలను, అభిప్రాయభేదాలను పక్కనపెట్టి, అతని చుట్టూ మూగవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 02–05 **ఎమ్బీయస్ : మదర్ థెరిసా**

వాటికన్ పునీతత్వం (సెయింట్‌హుడ్) యిస్తున్నట్లు ప్రకటించిన మదర్ థెరిసా గురించి రాయమని చాలామంది పాఠకులు కోరుతున్నారు. ఈ ప్రకటన సందర్భంగా చాలా పత్రికలు చాలా వివరాలు యిచ్చినా నన్నూ రాయమంటూ కోరారు. 1997 సెప్టెంబరులో ఆమె మరణించినప్పుడు "అమ్మ" పేరుతో ఒక పెద్ద వ్యాసం రాశాను. అప్పట్లో ఖదీర్‌బాబు (తర్వాత రచయితగా ఎదిగి, యిప్పుడు "సాక్షి"లో సీనియర్ పొజిషన్‌లో వున్నారు) ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం సెక్షన్‌లో వుండేవారు. దానికి యిన్‌చార్జిగా ఉమా మహేశ్వరరావు వుండేవారు. నేను వారికి తరచుగా ముఖపత్ర కథనాలు (కవర్ స్టోరీస్) రాసేవాణ్ని. నెహ్రూ, జిన్నా, అట్లీ, గాంధీ, విన్నీ మండేలా, పటేల్.. అన్నీ అలా రాసినవే. మదర్ థెరిసా పోయినపుడు ఉమా లీవులో వున్నారు. ఖదీర్ నా దగ్గరకు వచ్చి "అమ్మ అనే పేరుతో కవర్‌స్టోరీ రాసిపెట్టండి. మీరు సాధారణంగా వివాదాలు కూడా ప్రస్తావిస్తారు కదా. ఇది నివాళిగా, పాజిటివ్‌గా వుండాలి. వివాదాలు వద్దు" అన్నాడు. "ఒక వ్యక్తి గురించి పూర్తి అవగాహన రావాలంటే వారిపై జరిగిన చర్చలు కూడా రాయాలి కదా. నేను కలకత్తాలో మూడున్నరేళ్లు వున్నాను. ఆవిడ సంస్థ కూడా చూశాను. నా అభిప్రాయాలు నిర్మొగమాటంగానే రాస్తాను. మీకేమీ మాట రాదు." అని హామీ యిచ్చి, నా దగ్గరున్న పుస్తకాలు, వ్యాసాలలో వున్న మెటీరియలంతా (అప్పట్లో యింటర్‌నెట్ లేదు) వుపయోగించి రాశాను. ఆ వ్యాసాన్ని కింద యథాతథంగా యిస్తున్నాను. అప్పటికీ, యిప్పటికీ నా అభిప్రాయాల్లో మార్పు రాలేదు. ఒక వ్యక్తి స్థాపించిన సంస్థ వారి తదనంతరం కూడా చక్కగా నడిస్తే, అప్పుడు పునాదులు బాగా పడ్డాయని అర్థం. ఆవిడ పోయి 19 ఏళ్లయినా ఆ సంస్థ బాగానే నడుస్తోంది. వివాదాలతో రచ్చ కెక్కలేదు. ప్రతీదాన్నీ వ్యతిరేకించే బెంగాలీలు కూడా ఆ సంస్థను ఆదరించారు. ఆమె క్రైస్తవ భాషే మాట్లాడేదనే ఫిర్యాదు వుంది. కానీ ఆమె పెరిగిన, నమ్మిన వాతావరణమే అది. మనం కాగితంపై ఓనమాలు రాస్తాం, అవతలివాడికి శ్రీరామరక్ష వుండాలని ఆశీర్వదిస్తాం. అంతమాత్రం చేత వాళ్లని మనం మతంలోకి మార్చేశామని అర్థం కాదు. ఆవిడలో మూర?త్వం వుంది, చాదస్తం వుంది, మతఛాందసం వుంది. ఇలాటివి ఎన్ని వున్నా ఆవిడ సేవాతత్పరత ఎవరూ కాదనలేనిది. ఇక ఆవిడకు సెయింటుహుడ్ యివ్వడం అనేది వాటికన్‌కు సంబంధించిన వ్యవహారం. దానికై రెండు మహిమలు (మిరకిల్స్) చేశారని ధృవీకరించాలట. ఆవిడ పేరు తలచుకుంటే ఒక యిండియన్‌కు కాన్సర్ తగ్గిపోయిందని, మరో అతనికి మెదడులో కణతులు నయమయ్యాయని యిద్దరు చెప్పారు. వాటికన్ నమ్మింది. మనకు కూడా యిలాటి స్వామీజీ మహత్యాలు చాలా చెప్తారు. నమ్మినవాళ్లు నమ్ముతారు. ఆవిడకు 'పునీత' స్థాయి వుందా లేదా అని గతంలో యిచ్చినవారితో పోల్చి చూసే పని నేను పెట్టుకోలేదు. అది వారి మతానికి సంబంధించిన విషయం. మనకు సంబంధించినంత వరకు ఆవిడ ఒక సాధారణ ప్రజలను ప్రేమించి, సేవించిన మహానుభావురాలు. ఇక ఆంధ్రజ్యోతి సౌజన్యంతో పునః వెలువరిస్తున్న 1997 సెప్టెంబరు 14 నాటి వ్యాసం చదవండి –

– మనలో ప్రతి వొక్కరికి తల్లి వుంటుంది. కానీ మనందరికీ ఉమ్మడిగా ఒక తల్లి వుంది – భూమాత. మృత్యువు మనని కబళించిన వేళ యెలాంటి అసహ్యమూ లేకుండా మన మృతశరీరానిన తన వొడిలోకి తీసుకుంటుంది. తనలో కలుపుకుంటుంది. భూమాత లాటిదే మదర్ థెరిసా కూడా. మృత్యుముఖంలో వున్న అనాథలను చేరదీసి, సేదదీర్చే అమ్మ ఆమె. వారి మలినాన్ని, రక్తాన్ని, చీమునీ తీసివేసి చావుకోసం నిరీక్షించేవారి బాధను కాస్తయినా దూరం చేయగల అమృతమూర్తి ఆమె. దయామయి. అలాంటి అమ్మ యిక లేదంటే ఎందరో నిర్భాగ్యులూ, ఆమె ఆప్తవచనంతో వూరడిల్లే ప్రతి ఒక్కరూ అనాథలైనట్లే. కానీ క్షమామయిగా, కరుణామయిగా, అమ్మగా ఆమె లోకానికి చేరువైన క్రమంలో ఎన్ని అడ్డంకులు? ఎన్ని యిబ్బందులు? ఒక్కోసారి ఎన్ని విమర్శలు...

'అసలు మదర్ థెరిసాకు మృత్యుముఖంలో వున్నవారి గురించి ఆలోచన ఎందుకు వచ్చింది?' అని ఆశ్చర్యం వేస్తుంది. ప్రపంచంలో అనేక సేవాసంస్థ లున్నాయి – ప్రజారోగ్యానికి కృషి చేసేవి, విద్యాబుద్ధులు నేర్పేవి, పరలోకసౌఖ్యానికి దారి చూపేవి..యిలా. కానీ నిర్మల్ హృదయ్ – హెూమ్ ఫర్ డైయింగ్ డెస్టిట్యూట్స్ (మృత్యుముఖంలో వున్న నిరాశ్రయుల నివాసం) వంటి సంస్థ ఈమె మాత్రమే ఆరంభించారు. దానికి కారణం ఏమిటో 1950లో ఆమె యింటి యజమానిగా వున్న మైకేల్ గోమ్స్ వివరించారు – 'ఒకసారి నేనూ, ఆమె కలిసి హౌరా(డా)కు వెళ్లడానికి ట్రామ్ కోసం వేచి వున్నాం. కాంప్‌బెల్ హాస్పటల్ (ప్రస్తుతం దాని పేరు నీల్‌రతన్ సర్కార్ ఆసుపత్రి) గేటు వద్ద చావు దగ్గరపడ్డ ఒక అనాథ కనబడ్డాడు. "అతను పోతాడేమో" అందామె. మేం తిరిగి వచ్చేటప్పటికి అతను మరణించాడు కూడా. "ఏం జరిగిందో చూశావా మైకేల్, యిటువంటి వారి కోసం నేనేదైనా నివాసం ఏర్పాటు చేయలి. చావు దగ్గర పడినపుడు వారికి ఊరట కలిగించాలి. చావును ఎలాగూ తప్పించలేం కానీ మనం దగ్గరుండి నాలుగు స్వాంతన వచనాలు చెప్పవచ్చునే, కాసిన్ని నీళ్లడిగితే యివ్వవచ్చునే, అతనేదైనా చెప్పబోతే వినవచ్చునే. ప్రతీ ప్రాణీ సునాయాసంగా తక్కినవారికి బరువు కాకుండా మరణించాలని కోరకుంటాడు, గౌరవంగా పోవాలనుకుంటాడు. మనం వారికా పాటి భాగ్యం కూడా

కలగచేయలేమా?" అందామె.

బిబిసి కోసం ఇంటర్వ్యూ చేసినప్పుడు ఆమె చెప్పింది – "1952లో మేము నిర్మల్ హృదయ్ మొదలు పెట్టినప్పుడు చేరిన తొలి వ్యక్తి ఎవరో తెలుసా? నిస్సహాయంగా పడివున్న రోగగ్రస్తురాలైన ఒక అనాథ స్త్రీ. ఎవరూ పట్టించుకోకపోవడం వలన ఎలుకలు, చీమలు ఆమె శరీరాన్ని అప్పటికే సగం స్వాహా చేశాయి. జీవితం చరమఘడియలలోనైనా ఆమెకు ఒక తృప్తి కలిగించాము. తనంటే అభిమానాన్ని ప్రదర్శించే మనుషులున్నారనీ, తనకోసం వగచేవారున్నారనీ, పట్టించుకునే వారున్నారనీ అనుకుంటూ ఆమె మృత్యువు రాకకు సిద్ధపడింది."

అయితే చావుబతుకుల మధ్య వున్నవారిని చేరదీయడానికి ప్రారంభించిన ఆమె ప్రయత్నాలు అంత సజావుగా సాగలేదు. కలకత్తా కాళీఘాట్ దగ్గరలో పాడుబడిన సత్రంలో ఆమె తన నిర్మల్ హృదయ్‌ను ఆరంభించిన కొద్దిరోజులకే ఆ ఏరియాలో వున్న కుర్రాళ్లు గొడవ మొదలుపెట్టారు – 'ఎవరో ఫారిన్ లేడీ వచ్చి మనవాళ్లందరినీ మతం మార్చేస్తోందని. ఆమె, ఆమె వెంటనున్న నన్స్ వీధుల్లో దిక్కూమొక్కూ లేకుండా పడివున్న వాళ్లందరినీ తీసుకొచ్చి చచ్చేముందు క్రిస్టియన్స్‌ను చేసేసి హిందూమతానికి ద్రోహం చేస్తున్నారని వెళ్లి పోలీసు కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయనొచ్చి స్వయంగా అంతా చూశాడు. బయటకు వచ్చి కుర్రాళ్లకు ఒకటే చెప్పాడు – "మీరు అడిగినట్లే ఆవిడను బయటకు తోసిపారేస్తాను. కానీ ఒకటే షరతు, మీ యింటి నుండి మీ మీ అమ్మలను, అక్కలను తీసుకొచ్చి ఆవిడ చేసే చాకిరీ చేయమనండి. సరేనా?" అని. కుర్రాళ్లు నోళ్లు వెళ్లబెట్టారు.

ఏదో ఆశ్రమం పెట్టిన కొత్తరోజుల్లో తెలిసీ తెలియని వయసులో రికామీగా తిరిగే కుర్రాళ్లు అన్నారంటే పోనీలే అనుకుంటాం, కానీ ఆవిడ ప్రముఖ వ్యక్తి అయిన తర్వాత కూడా యిలాటి ఆరోపణ చేశాడు క్రిస్టఫర్ హిచెన్స్ అనే పెద్దమనిషి. వాషింగ్టన్‌లో పత్రికా రచయిత అయిన హిచెన్స్ 1994లో వెలువరించిన 'ది మిషనరీ పొజిషన్ – మదర్ థెరిసా యిన్ థియరీ అండ్ ప్రాక్టీస్' అనే పుస్తకంలో అనేక ఆరోపణలు చేశాడు. వాటిల్లో ఒకటి – 'ఆమె ఆశ్రమంలో మరణశయ్య మీద వున్న రోగులకు స్వస్థత చేకూర్చే మిషతో తడి తువ్వాలుతో నుదుటిమీద రాసి బాప్టయిజ్ చేసేసి క్రైస్తవులుగా మార్చేస్తున్నారు' అని. ఎవరిమీదనైనా సరే బురద చల్లడానికి రెడీగా వుండే ఖుశ్వంత్ సింగ్‌కి కూడా యీ విషయం హాస్యాస్పదంగా కనిపించింది. "రోమన్ కాథలిక్ విధానాల్లో జరిగే బాప్టిజం గురించి ఏ మాత్రం అవగాహన వునాన్న యిలా మాట్లాడకూడదు. దేవుడి కరుణ ప్రాప్తించుగాక అని ఆశీర్వదించే పద్ధతిలో మదర్ రోగుల నుదుటిమీద తట్టే అలవాటుని యిలా వక్రీకరించడం తప్పు' అన్నారాయన.

తన జీవిత చరిత్ర రాసిన డెస్మాంగ్ డాయిగ్‌తో మదర్ యిలా అన్నారు – 'నేను మనుషులను మార్చాలని చూస్తున్నాను, మతాన్ని కాదు. ఒక వ్యక్తి తనంతట తాను కోరుకుంటే తప్ప భగవంతుడు కూడా అతని మతాన్ని మార్చలేడు. మన కర్మ ద్వారా మనం దేవుడికి చేరువైతే చాలు, మనం ఉత్తమమైన హిందువులుగా, ఉత్తమమైన ముస్లిములుగా, ఉత్తమమైన క్రైస్తవులుగా రూపుదిద్దుకుంటాం.' మదర్‌మీద తొలి రోజుల్లో వచ్చిన నిందలు చూస్తే 'అసలావిడ దేశం కాని దేశంలో కలకత్తా ఎందుకు రావాలి? ఎక్కడే ఏ క్రైస్తవదేశంలోనే ప్రజాసేవ చేసుకుంటే కనీసం యీ నింద తప్పేది కదూ పాపం' అనిపిస్తుంది. భారతదేశం అంటే ఆమెకి ఆసక్తి కలిగించింది – ఆంథోనీ అనే ఆయన రాసిన వ్యాసాలు. ఆ రోజుల్లో, అంటే 1920లలో మదర్ స్వదేశమైన యుగోస్లావియా నుండి కొంతమంది క్రైస్తవ మిషనరీలు వచ్చి గంగాతీరంలో, బెంగాల్‌లో మతప్రచారకులుగా పనిచేస్తూండేవారు. వారిలో ఆంథోనీ ఒకరు. ఆయన ఇండియా గురించి రాసిన వ్యాసాలు చదివి స్కూల్లో చదువుకుంటున్న మదర్ భారతదేశం అంటే ఉత్సుకత చూపించింది. 1928లో 18 వ యేట భగవంతుని సేవలో నన్‌గా మారాలని నిశ్చయించుకుని ఐర్లండ్‌లో డబ్లిన్ వెళ్లి 'సిస్టర్స్ ఆఫ్ లోరెటో (17వ శతాబ్దంలో స్థాపించిన సంస్థ)లో చేరి కొన్ని నెలలపాటు శిక్షణ పొంది, డార్జిలింగ్‌లోని లోరెటో కాన్వెంట్‌కు వచ్చి టీచరుగా చేరింది మదర్.

ఆమె సన్యాసిని కావడానికి ఆర్థిక కారణాలేమీ లేవు. ఆమె తండ్రి రైతు కుటుంబానికి చెందినా కనస్ట్రక్షన్ కంపెనీలో భాగస్వామి. కలిగిన కుటుంబమే. తలిదండ్రులు (నికోలా, డ్రోండా బొజాక్సూ) అల్బేనియాకు చెందినవారు. యుగోస్లావియా (యిప్పటి మాసిడోనియా)కు చెందిన స్కోప్జీలో స్థిరపడ్డారు. 1910 ఆగస్టు 27న పుట్టిన తమ కూతురికి ఏగ్నెస్ గోంక్షా అని పేరు పెట్టుకున్నారు. 1931 మేలో ఏగ్నెస్ తన పేరు థెరిసాగా మార్చుకుంది. సెయింట్ థెరిసా (ఆవిలా) 16 వ శతాబ్దికి చెందిన స్పానిష్ నన్. ఆమె పట్ల గౌరవం చేతనే ఏగ్నెస్ తన పేరు మార్చుకుంది. థెరిసా పేరుకే వన్నె తెచ్చింది.

1929లో డార్జిలింగ్‌లో నన్ శిక్షణలో చేరి 1931లో నన్‌గా స్వీకరింపబడింది. ఆరేళ్లపాటు ఆమె భగవత్సేవలో గడిపింది. 1937లో కలకత్తాలో వున్న ఎంటాలీ ప్రాంతంలోని లోరెటో కాన్వెంటులో జాగ్రఫీ టీచరుగా చేరినిది. తరువాత ప్రిన్సిపాల్‌గా కూడా పనిచేసింది. ఆ స్కూలు చుట్టూ వున్న బీదసాదలను చూసి ఆమె చలించిపోయింది. వారికోసం ఏదో చేయాలని తపించింది. చర్చిలోనే భగవద్ధ్యానం చేస్తే చాలదని అనిపించిందామెకు. భారతదేశ విభజన సమయంలో మతకల్లోలాలు అనేకమందిని అనాథలుగా చేశాయి. బెంగాల్ రెండుగా చీలింది. హిందువులు పశ్చిమ బెంగాల్‌కి, ముస్లిములు తూర్పు బెంగాల్‌కి తరలి వెళ్లసాగారు. తూర్పు పాకిస్తాన్ నుండి లక్షోపలక్షలుగా హిందూ శరణార్థులు తరలి రాసాగేరు. వారికి యిల్లు, వాకిలి ఏమీ లేవు. కలకత్తా పేవ్‌మెంట్ల మీదనే నివసించసాగారు. పారిశుధ్యం అనేది కలికంలోకి లేకుండా పోయింది. రోగాలు చుట్టుముట్టాయి. అంటువ్యాధులు ప్రబలాయి. ఎటూచూసినా దరిద్రం, అనారోగ్యం తాండవిస్తున్నాయి. శరణార్థులుగా ప్రాణాలు అరచేతబట్టి పారిపోయి వచ్చిన వారిలో సొంతవారిని పోగొట్టుకున్న వారెందరో. వారికి రోగం, రొష్టూ వస్తే చూసేవారెవరు?

ఇలాటి పరిస్థితుల్లోనే మదర్ ప్రజాజీవితంలోకి వద్దామనుకుంది. కానీ చర్చికి అంకితమై సన్యాసినిగా మారినవారు లౌకిక ప్రపంచంలో రావడమంటే అంత తేలిక కాదు. పోప్ అనుమతి కావాలి. మదర్ చిత్తశుద్ధిని అర్థం చేసుకున్న పోప్ పయస్ 12 1948లో స్వచ్ఛంద సన్యాసినిగా జీవించడానికి ఆమెకు అనుమతి ప్రసాదించారు. అప్పటి నుండి ఆమె నీలం అంచుగల తెల్లచీర (భుజంపై చిన్న శిలువతో సహా) ధరించడం మొదలుపెట్టారు. తరువాత ఆమె ఆశ్రమంలో పనిచేసే సేవికలందరూ అదే విధమైన దుస్తులు వేసుకోవడం ఆనవాయితీ అయింది. రోగపీడితులకు సేవ చేయాలంటే నర్సింగ్ తెలిసి వుండాలి. అందువలన మదర్ పట్నాకు వెళ్లి అమెరికన్ మిషనరీ స్కూలులో మూడు నెలలపాటు నర్సింగ్ అభ్యసించింది. కలకత్తాకు తిరిగి వచ్చి 'లిటిల్ సిస్టర్స్ ఆఫ్ పూర్'తో బాటు వుంది. కానీ కొన్ని రోజులకి విడిగా వుంటే మంచిదనిపించిం దామెకు. ఫాదర్ వాన్ ఎగ్జెమ్ అనే బెల్జియం మిషనరీ సెంట్రల్ కలక్తాలోని చర్చ్ ఆఫ్ అవర్ లేడీ డాలర్స్‌లో పనిచేస్తున్నారు. ఆయనను కలిసి తన ఉద్దేశం వివరించిందామె. ఆయన మైకేల్ గోమ్స్‌తో చెప్పి వాళ్లింట్లో ఒక గది యిప్పించారు. లోరెటో వారు ఆమెకు ఐదు రూపాయలు ఫండ్‌గా యిచ్చారు, నిరక్షరాస్యులైన ఒక స్త్రీ (చరూర్ మాఉ అనేవారు)ని సహాయకురాలిగా యిచ్చారు. నాలుగైదు రోజులు పోయాక మదర్ చదువు చెప్పిన స్కూలులో విద్యార్థిని సుహాసిని (తరువాత సిస్టర్ ఏగ్నెస్‌గా పేరుకెక్కింది) వచ్చి చేరింది. తరువాతి రోజుల్లో ఆమె పాత విద్యార్థినులెందరో మదర్‌తో చేయి కలిపారు.

అలా ఐదు రూపాయలతో ఆరంభించిన ఆమె సంస్థ పెరిగి, పెరిగి యీ రోజు వటవృక్షమైంది. ఆ సంస్థ శాఖోపశాఖలు 87 దేశాలలో విస్తరించాయి. 160 నగరాలలో వారి కార్యకలాపాలు సాగుతున్నాయి. సుమారు 30 వేల మంది పిల్లలు, వృద్ధులు వారి ఆదరణకు నోచుకుంటునాన్నరు. 3 వేల మంది క్రైస్తవ సన్యాసినులున్నారు. 1955 ప్రాంతాల్లో మదర్ కుష్ఠు రోగులకు ఆశ్రమాన్ని ఆరంభించారు. అసన్‌సోల్ వద్ద 34 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం ఆమెకు సమకూర్చింది. ఆ ఆశ్రమం పేరు శాంతినగర్. మరణోన్ముఖులైన నిరాశ్రయుల కోసం ఏర్పాటు చేసినది – నిర్మల్ హృదయ్. అనాథ శిశువుల ఆదరణకు నెలకొల్పినది – నిర్మల్ శిశు సదన్. సేవానిలయాల పేరు – 'మిషనరీస్ ఆఫ్ చారిటీ'. 1955లో 'మిషనరీస్ ఆఫ్ చారిటీ విశిష్టతను గుర్తించి పోప్ పాల్ 6 దాన్ని వాటికన్ అధీనంలోకి చేర్చుకున్నారు. సిస్టర్స్ ఆఫ్ చారిటీకి అనుబంధంగా మగ సభ్యులతో బ్రదర్స్ ఆఫ్ చారిటీ 1965 ప్రాంతాల్లో ఏర్పడింది. 1969లో ఇంటర్నేషనల్ కో–వర్కర్స్ ఆఫ్ మదర్ థెరిసా ఏర్పడింది.

ఈ సంస్థ యింత యిదిగా పెరగడానికి నిధులు అవసరం కదా, అవన్నీ ఎవరిస్తారన్న ప్రశ్న రావడం సహజం. ఆమె నిస్సంకోచంగా విరాళాలు సేకరించారు. మాధవుని సేవకై, అంటే మానవుని సేవకై ఉపయోగపడే ప్రతీ పైసా సద్వినియోగపడినట్లేనని భావించారామె. జోలె కట్టుకుని దేశదేశాలూ పర్యటించారు. అది అంత సులభమైన పని కాదు. వారిని ఒప్పించడం ఒక కష్టమైతే చందా యిచ్చినవారి గుణగణాలను బట్టి నిందపడడం మరో కష్టం. చందా యిచ్చినవారెవరైనా సరే, భగవత్కార్యం కదాని స్వీకరించడం వలన ఆమె పలు విమర్శలకు గురయ్యింది. సమాజంలో పెద్దమనుషులుగా చలామణి అయ్యేవారిలో ఎవరు ఎటువంటివారో తెలుసుకోవడం సాధ్యమా? దొరికేవరకూ అందరూ దొరలే. మీరు చేసే మంచిపనిలో సహాయపడతానంటూ వచ్చినవారు సహృదయంతోనే వచ్చి వుంటారని అనుకోవడంలో వింతేముంది? తరువాత వాళ్లు దొరలు కాదని, దొంగలని తేలితే చేయగలిగేదేముంది? క్రైస్తవమతంలో 'క్షమించడం' అనేది అతి ప్రాచుర్యంలో వున్న పదం. ఒక నిజమైన క్రిస్టియన్‌గా మదర్ ఆ పదాన్ని ఎన్నోసార్లు ఉపయోగించారు. అవతలివాడు ఎటువంటివాడైనా సరే క్షమించాలన్నది క్రైస్తవం నేర్పే పాఠం. భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగినప్పుడు, బాధితులను పరామర్శిస్తూ యూనియన్ కార్బయిడ్ వారిని క్షమించమని సలహా నిచ్చింది మదర్. అది 'బహుళజాతి సంస్థలపై ఆమెకు గల పక్షపాతం' అంటూ విపరీతార్థాలు తీశారు కొందరు.

తమ్ముడితో పోట్లాడి, అమ్మ దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేస్తే ఏమంటుంది? 'పోన్లేరా, చిన్నవాడు కదా, సర్దుకో, యీసారికి వదిలేయ్' అంటుంది. అది మనకు నచ్చదు, అమ్మ పక్షపాతం చూపిస్తోంది అనుకుంటాం. రేపు మన పిల్లవీ పోట్లాడినప్పుడు మనమూ అదే సలహా చెప్తాం, ఆ పాటికే మనకు వివేకం వస్తుంది కాబట్టి, మనిషికి కావలసినది బలాబలాలు తేల్చుకోవడం కాదని, ప్రేమాభిమానాలే ముఖ్యమని తెలిసివస్తుంది కాబట్టి. మదర్ థెరిసా అందరికీ అమ్మే. కాబట్టి అందర్నీ క్షమించమంటుంది. ఆ క్షమాగుణాన్ని చాలామంది తప్పుబట్టారు. సాల్వడార్‌లో హత్యలు చేయిస్తున్న రోనాల్డ్ రీగన్ హస్తాల మీదుగా 'మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' స్వీకరించడాన్ని, అల్బేనియాను ప్రపంచంలో ప్రప్రథమ నాస్తికదేశంగా ప్రకటించిన స్టాలినిస్టు ఎన్నవర్ హెూరూ సమాధిపై పుష్పగుచ్ఛాన్ని ఉంచడాన్ని, హైతీ నియంత బేబీ డాక్ డ్యూవాలియర్స్ ఆతిథ్యాన్ని స్వీకరించి అతన్ని ప్రస్తుతించడాన్ని వాళ్లు విమర్శించారు. వారి రాజకీయాలకు సంజాయిషీ చెప్పమని మదర్‌ని నిలదీస్తే ఆమేం చెపుతుంది? ఆమెకు వారి రాజకీయాలతో పనేముంటుంది? వారు పిలిచారు, ఆమె చేసే పనిని మెచ్చి, ఆమెకు సహాయపడతానన్నారు, పడ్డారు. అది ప్రచారం కోసం చేసుకున్నారో, మరే ఉద్దేశంతో చేసుకున్నారో వారికే తెలియాలి. మదర్‌కు తెలిసినంతవరకు తాను చేసేది దైవకార్యం. అందుకు ఎవరు సహాయపడినా స్వీకరించడమే మంచిది.

ఈ విషయంపై మదర్ తర్కం గురించి ప్రఖ్యాత జర్నలిస్టు జగ్ సూరియా ఒక సంఘటన రాశారు. పోప్ ఇండియాకు వచ్చినపుడు ఆయనకు ఒక పెద్ద కారు బహుమతిగా లభించింది. ఆయన దాన్ని మదర్‌కు బహూకరించారు. ఆమె దానిని సరిగా చూడను కూడా చూడలేదు. ఒక లాటరీ ఏర్పాటు చేసి ఆ కారుని బహుమతిగా యిస్తాననీ, లాటరీలో వచ్చిన సొమ్మును నిర్మల్ హృదయ్‌నకు యిస్తానని ప్రకటించారు. ఆ సందర్భంలో జగ్ సూరియా అడిగారట – 'లాటరీ అంటే జూదమే కదా, ఆశనూ, అసూయనూ

పెంచుతుంది కదా, మీరిలా చేయడం భావ్యమా?" అని. మదర్ చమత్కారంగా చిరునవ్వు నవ్విందట – 'వాళ్లు జూదం ఆడుతున్నామనుకుంటున్నారు. కానీ తెలియకుండానే భగవంతునికి సేవ చేస్తున్నారు. తమాషాగా లేదూ?' అందిట. వాషింగ్టన్ పోస్టు కూడా ఓ సారి ఓ రాయి వేసి చూసింది – 'ఆమె సంస్థకు 50 మిలియన్ల డాలర్లున్నాయి. అయినా లెక్కాడొక్కా సరిగ్గా వుంచరు' అని. 'సన్యాసులు ఆడిట్లకు అతీతులు కాబోలు' అంటూ వ్యాఖ్యానించింది కూడా.

సంగతేమిటంటే మదర్‌కి యివన్నీ తలకాయనొప్పి పనులు. రోగులకు సేవ చేయడం ముఖ్యం కానీ, యీ పద్దులు రాసుకుంటూ కూచోడం ఏమటని ఆవిడ బాధ. ఆవిడ కట్టుకుపోయేదేమీ లేదు, సన్యాసిని. వారసులే లేరు. ఆవిడ వెనకేసినా ఎవరికోసం వెనకేయాలి? అందువల్ల ఆడిట్లకు భయపడవలసిన అగత్యం ఆమెకు లేదు. ఆలెక్కల ఆరాలంటే తలనొప్పి వలననే ఆమె ప్రభుత్వం యిచ్చే గ్రాంట్లు తీసుకోదు. ఈ విషయమై మాల్కొమ్ మగరిడ్జ్ 'సమ్‌థింగ్ బ్యూటిఫుల్ ఫర్ గాడ్'లో రాశారు – 'నేనొకసారి మదర్‌ని అడిగేను కూడా – ప్రభుత్వం యిస్తానంటున్న గ్రాంట్లు తీసుకోవచ్చు కదా'ని. 'వాటికి జమాఖర్చులన్నీ చూపించాలి. అదో పెద్ద పని. మేం మిగతా పనులు మానేసి యివే పట్టుక్కూచోవాల్సి వస్తుంది' అందామె. నిజమే, వారి సంస్థ మొత్తం అజమాయిషీ చేస్తున్నది యిద్దరు నన్స్. వారికి తోడున్నది వంకర పోయిన ఓ పాత టైపు మిషన్. మదర్ తన రాతకోతలు తనే చేసుకుంటుంది. అందరూ పడుకున్నాక తన ఉత్తరాలు స్వహస్తాలతో తనే రాసుకుంటుంది. ఇక యీ గ్రాంట్లు తీసుకుంటే దీనికోసం ఏ పెద్ద ఆఫీసే నడపాల్సి వస్తుంది" అని రాశారు మాల్కోమ్.

ఇన్ని కోట్ల రూపాయలు సమకూర్చిన సంస్థల్లో ఆమె అనుభవించిన సుఖాలూ లేవు, సౌకర్యాలూ లేవు. ఆమె తత్వమే అంత. తన వద్దకు చేరిన అనాథలకు ఏర్పాటు చేయలేనిది తనూ అనుభవించకూడదని ఆమె సిద్ధాంతం. జగ్ సూరియా రాసినదాని ప్రకారం – 'నేను మదర్‌ను మొదటిసారి కలిసినది – బంగ్లాదేశ్ యుద్ధసమయంలో. ప్రభుత్వ అధికారులతో, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో ఒక హైలెవెల్ మీటింగు జరుగుతోంది. చర్చలు సాగి, సాగి గణాంకాల వూబిలో కూరుకుపోయాయి. ఏ సహాయం ఎవరు, ఎలా, ఎందుకు చేయాలి, అసలు చేయగలమా లేదా అన్న వాదనలు ఎడాపెడా సాగిపోతున్నాయి. ఇంతలో మదర్ చల్లగా, సద్దు చేయకుండా వచ్చింది. ఆమెకీ లెక్కలు పట్టలేదు. 'అవతల మనుషులు చచ్చిపోతున్నారు. ఈ విషయం గుర్తు పెట్టుకుని సాయం చేసేయడమే. ఎంత, ఎలాగ దాన్ని సమకూర్చుకోవడం అన్న విషయాలు అవతల చూసుకోవచ్చు. ముందు కార్యరంగంలోకి దూకేయడమే' అంది. తల్లితో వాదించగల ఘనుడెవడున్నాడు? అందరూ సరే అనేశాం.'

దారిద్ర్యాన్ని గ్లోరిఫై చేస్తోందని మదర్‌ను చాలామంది తప్పుపట్టారు. తమ సంస్థ కొచ్చిన డబ్బంతా పెట్టి కలకత్తాలోనే పెద్ద హాస్పటల్ కట్టి పడేయకుండా 87 దేశాల్లో అరకొరగా, చాలీచాలని సౌకర్యాలతో అన్ని ఆశ్రమాలు నెలకొల్పడం ఎందుకు? అని విమర్శించారు. ఆమె ఆశ్రమాల్లో వున్న వాళ్లకు సేవాభావం వున్న విషయం కరక్టే కానీ చికిత్సా విధానం తెలియదని, ఖరీదైన వైద్యం చేయించకుండా వూరికే ప్రార్థన చేయమంటే సరిపోదనీ అన్నారు. ఆమె వద్ద పనిచేసిన ఒక సహాయకురాలు నొప్పితో బాధపడుతున్న రోగులకు పెయిన్ కిల్లర్స్ యిస్తానంటే మదర్ వారించారట. ప్రయోజనం ఏముంది? అన్నారట. అలా అని ఆ సహాయకురాలు టీవీ ఫిల్మ్‌లో చెప్పారు. నిజమే కావచ్చు, పెద్దవాళ్లవుతున్న కొద్దీ వేదాంత ధోరణి అలవడుతుంది. మనం పరిణతి చెందిన కొద్దీ మానవప్రయత్నాల నిష్ప్రయోజకత్వం తెలిసి వస్తుంది. పెయిన్ కిల్లర్స్ యిచ్చే తాత్కాలిక ఉపశమనంతో రోగులను ఊరుకోబెట్టడం కంటె బాధను భరించి, మృత్యువును ఆహ్వానించే మానసిక శక్తిని వారికి కలగజేయడం మంచినదనిపించే ఆలోచన వస్తుంది. మరణ శయ్య మీద వృద్ధులనేకమంది 'ఎలాగూ చావు దగ్గర పడింది. ఇంజక్షన్లచ్చి బాధపెట్టకండి, పోయా ప్రాణాన్ని సుఖంగా పోనీయండి. ఆసుపత్రిలోంచి డిస్చార్జి చేసి యింటికి పంపేయండి' అని బతిమాలుకుంటూ వుంటారు. కానీ మన బాధ్యతగా మనం వారి ఆక్రందనలు పట్టించుకోకుండా ఐసియులో పెట్టి పొడిపించేస్తూ వుంటాం. కానీ జీవితసారం వంటబట్టినవారు వారి ఆవేదనను అర్థం చేసుకుంటారు.

దరిద్రులను చేరదీయడం కంటె దారిద్ర్యానికి మూలకారణాన్ని వెతికి పట్టుకుని దాన్ని రూపుమాపి రేపటి దరిద్రుల సంగతి చూడమని మదర్‌కు సలహాలు యిచ్చిన మేధావులూ వున్నారు. లాటిన్ అమెరికాలో ప్రీస్టులు కూడా యీ సలహా యిచ్చినవారిలో వున్నారు "మీరంతా రేపటి పేదల గురించి పట్టించుకోండి, నేను యివాళ్టి పేదల బాగోగులు చూసుకుంటాను" అని జవాబిచ్చింది మదర్. అదీ సంగతి! మదర్‌ను యీ పని చేయమని ఎవరూ పురమాయించలేదు. తన దగ్గరకు రమ్మనమని ఆమె ఎవరినీ బలవంతపెట్టలేదు. ఆమెకు తోచిన రీతిలో, తనకు చేతనైనంత వరకు ఆమె సేవ చేసుకుంటూ పోయింది. ఆ పని నచ్చినవారికి నచ్చుతుంది. అందరికీ నచ్చితీరాలని ఆమె అనుకోదు. కానీ కొన్ని కొన్ని విషయాలలో ఆమె వాదన మనకు మింగుడు పడదు. ముఖ్యంగా గర్భస్రావాల విషయంలో – ప్రపంచంలో అన్నిటికంటె పెద్ద సమస్య స్వచ్ఛంద గర్భస్రావాలంటుందామె. గర్భనిరోధకాలు కూడా వాడవద్దంటుంది. యునైటెడ్ నేషన్స్ సభలో కూడా ఆమె 'ఈ రోజు శాంతిని నాశనం చేసేవాటిలో ముందుగా చెప్పాల్సింది అబార్షన్‌లే. తన డుపులో వున్న బిడ్డను కన్నతల్లే నిర్దయగా నిర్మూలింప చూస్తూంటే, మీరూ నేనూ ఒకరినొకరు సంహరించడానికి సమకడితే అర్థమేముంది?" అని వాదించిందామె. శక్తి లేకపోయినా పిల్లన్ని పుట్టించి వదిలేస్తే మాత్రం పాపం కాదా, వారినేం చేయాలిట? అని అడిగితే "నా కిచ్చేయండి, నేను పెంచుతాను' అంటుందామె. ఇలా ఎంతమందిని పెంచగలుగుతుందట? ఇవన్నీ ఆమె ఆలోచించే మాట్లాడుతోందా? అనిపిస్తుంది మనలా చదువుకున్నవారికి. ఒకసారి ఆమె చెప్పింది – 'అసాంప్రదాయకమైన శ

ృంగార జీవితానికి భగవంతుడు విధించే శిక్షే ఎయిడ్స్' అని. ఇంకోసారి 'చర్చికి, గెలీలియోకి జరిగిన సంఘర్షణ సమయంలో తాను వుండి వుంటే చర్చినే సమర్థించేదాన్ని' అంది.

అంతుపట్టని ఆమె ఆలోచనా విధానానికి మాల్కమ్ మగరిడ్జ్ చక్కటి కారణం చెప్తారు – 'మదర్ ఒక పల్లెటూరి రైతు కుటుంబం నుంచి వచ్చింది. పల్లెటూరి వారికి తర్కం గట్రా తెలియవు. హృదయంతోనే ఆలోచిస్తారు. ప్రపంచ రాజకీయాల లుకలుకలు, భవిష్యత్ ప్రణాళికల తికమకలు అవన్నీ ఆమె లోకంలో కనబడవు. ఆవిడకు తోచినది, విశ్వసించినదీ ఆమె చెపుతుంది. దానిలో నిజాయితీ మాత్రం కనబడుతుంది.' అందుకనే మదర్ విషయంలో మనం కన్నతల్లి చాదస్తాన్ని విసుక్కున్నట్టే ఆమెనూ సుతారంగా మనసులో మందలిస్తాం – రేపు మన పిల్లలకు మన ఆలోచనలు ఛాందసంగా కనబడవచ్చుననే విషయం మనసులో మెదలుతుంది కాబట్టి. ఎంతైనా అమ్మ అమ్మే కదా. మదర్‌కు ప్రచారం అంటే ప్రీతి అనే మాటా వుంది. జగ్ సూరియా ఒక చోట రాశారు – "ఒకసారి ఆమె వద్దకు వెళితే ఒక రోగికి బాండేజి కట్టడంలో సాయపడమని ఆమె కోరింది. 'బాండేజి కట్టడం నాకు రాదు. నాకు వచ్చిన విద్య పత్రికల్లో రాయడం. మీరు తీరిక చేసుకుని మీ సేవ గురించి నాతో ముచ్చటిస్తే వ్యాసం రాసి పత్రికలలో వేస్తాను. పదిమందీ చదువుతారు. ఓపికున్న కొందరు వచ్చి చేయి కలుపుతారు, అది చేయలేనివారు ధనసహాయం చేస్తారు. మీ కృషి పదిమందికి తెలియడం మంచిది కదా' అన్నాను. ఆమె నేను చెప్పిన అంశం గ్రహించారు. బాండేజి కట్టమనకుండా నాకు ఇంటర్వ్యూ యిచ్చారు." ట్రెవర్ ఫిష్‌లాక్ కూడా ఒకసారి అన్నారు – 'కలకత్తాలో ఒకసారి ఆమెను యింటర్వ్యూ చేసిన తరువాత ఆమె విలువైన సమయాన్ని హరించినందుకు క్షమాపణలు చెప్పాను. ఆమె చిరునవ్వు నవ్వుతూ 'పాత్రికేయులు కూడా భగవంతుని సేవ చేసి పెడుతున్నారుగా' అంది. నిజానికి బిబిసిలో ప్రసారం చేసిన ఆమె యింటర్వ్యూ ఎంతోమందిని ఆకట్టుకుంది. దాన్ని పునః ప్రసారం చేయమని ఎన్నోసార్లు అభ్యర్థనలు వచ్చాయి. అది ప్రసారం కాగానే 20 వేల పౌండ్లు విరాళంగా వచ్చాయి.

ఎవరేమన్నా మదర్ తన కార్యకలాపాల్లో మునిగి వుండేది. దేశాధిపతులకు సైతం ఫోన్ చేసి సహాయం అడగగలిగే స్థాయిలో వుండేది. ఆమె అంత్యక్రియల కారణంగా దేశదేశాల ప్రముఖులు కలకత్తా విచ్చేశారు. సునీల్ గంగోపాధ్యాయ్ చెప్పినట్లు – "ఆ మహానుభావురాలు తన క్రియాయజ్ఞానికి మా నగరాన్ని ఎంచుకోవడం మాకెంతో గర్వకారణం." చిదానంద్ దాస్‌గుప్తా "ఒక మానవ సముదాయాన్ని గుర్తించడానికి మతం అనేది ఒక గుర్తయితే అది లేకుండా మేం ఉండగలం. కానీ మదర్ లేకుండా వుండలేం." అంటే ఖుశ్వంత్ సింగ్ "నాకు భగవంతుడిలో నమ్మకం లేదు కానీ భగవంతుడిలో నమ్మకం వున్న మదర్‌లో నమ్మకం వుంది. ఆమె మూర్తీభవించిన మంచితనం అని మాత్రం నాకు బాగా తెలుసు" అన్నాడు.

మనం ఎన్ని చెప్పినా, ఎంత రాసినా అమ్మ ఆప్తవచనాన్ని నిర్వచించే భాష మనకెక్కడిది చెప్పండి?' **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

2016 సెప్టెంబరు 06-07 **ఎమ్బీయస్ : గాయని ముబారక్ బేగమ్**

శీర్షిక చూసి సినిమా ప్రియులు కూడా 'ఎవరండీ యీవిడ?' అని అడిగినా నేను ఆశ్చర్యపోను. ఆవిడ హిందీసినిమాల్లో కొన్ని మంచి పాటలు పాడింది. మంచి వాయిస్. హిందూస్తానీ శాస్త్రీయసంగీతం వచ్చు. పెద్ద సంగీతదర్శకులకు కూడా పాడింది. అయినా పైకి రాలేదు. కారణం లతా మంగేష్కర్ అని అంటారు. ఏ రంగంలోనైనా పైకి రాలేకపోయిన ప్రతీ వ్యక్తి తమను టాప్ పొజిషన్లో వున్నవారు తొక్కేశారనీ వాపోవడం కద్దు. కానీ లతాపై యిలాటి ఆరోపణలు గట్టిగా వున్నాయి. లతా చాలా ప్రతిభావంతురాలు. కష్టపడి పైకి వచ్చింది. అతి త్వరగానే గుర్తింపు తెచ్చుకుంది. హిందీ సినిమా సంగీతసీమను ఏలిన స్వరసామ్రాజ్ఞి అయింది. పేచీ వస్తే ఎంత పెద్ద మ్యూజిక్ డైరక్టరైనా సరే, ఎంత పెద్ద సహగాయకి లేదా గాయకుడైనా 'నేను మీతో కలిసి పనిచేయను' అని చెప్పేసేది. అవతలివాళ్లే దిగివచ్చేవారు. ఒక్క ఒపి నయ్యర్ మాత్రమే ఖాతరు చేయలేదు. తక్కినవాళ్లందరూ ఆమె చెప్పినట్లు ఆడేరు, రాజ్ కపూర్ వంటి పెద్ద దర్శకనిర్మాత కూడా! తనకు పోటీగా గాయని ఎవరైనా ఎదుగుతున్నారు అనగానే 'వాళ్ల చేత ఒక్క పాట పాడించినా, నేను మళ్లీ మీకు ఎప్పటికీ పాడనంతే' అని బెదిరిస్తే చాలు వాళ్లు వణికిపోయేవారు. అవతలి గాయని పాటను తీసేసి, మళ్లీ యీమె చేత పాడించేవారు. లతా కారణంగా అవకాశాలు రాక దెబ్బ తిన్న గాయనీమణుల జాబితాలో సుమన్ కళ్యాణ్‌పుర్, సుధా మల్‌హోత్రా, సులక్షణా పండిట్, రూనా లైలా.. యిలా చాలామంది వున్నారు. వారిలోనే ముబారక్ బేగమ్ కూడా వుంది. అందువలన ఆమె 1949-81 మధ్యలో 115 సినిమాల్లో 178 పాటలు మాత్రమే పాడగలిగింది. కళాకారుడు అనామకంగా జీవించేకాలంలో ఆదరించకపోయినా, ఆర్థిక సాయం చేయకపోయినా చనిపోయిన తర్వాత మాత్రం 'ఆహా, ఓహో, ఫలానావారు లేని లోటు తీర్చలేనిది' అంటూ పత్రికల్లో వ్యాసాలు, నివాళి వస్తూ వుంటాయి. "ప్యాసా"లో చెప్పి(పాడి)నట్లు మనది "ముర్దాపరస్తోంకి బస్తీ" (చనిపోయినవాళ్లను పట్టుకుని వేళ్లాడే నగరం). కానీ జులై 18న ముబారక్ బేగమ్ పోతే అది కూడా జరగలేదు. తెలుగు పత్రికలలో, టీవీల్లో దాదాపు విస్మరించారు. అందుకే ఆవిడ గురించి సంక్షిప్తంగానైనా పరిచయం చేయాలనిపించింది.

లతాకు, రఫీకి ఎందుకు గొడవ వచ్చిందంటే – 1960లలో గాయనీగాయకులకు పాటలపై రాయల్టీ యివ్వాలని లతా ఉద్యమం లేవదీసింది. టాప్ మేల్ సింగర్‌గా వున్న రఫీ కూడా తనతో కలిసి వస్తే నిర్మాతలు దిగి వస్తారని ఆశించింది. రిస్కు తీసుకుని, తమపై,

సంగీతకారుడిపై, సాహిత్యకారుడిపై పెట్టుబడే పెట్టే నిర్మాతకు మాత్రమే సినిమాపై కాని, పాటపై కాని హక్కు, రాయల్టీ రావాలి తప్ప తక్కినవారికి కాదని రఫీ వాదన. పాడిన పాటకు పారితోషికం తీసుకున్నాక యిక రాయల్టీ ఎలా అడుగుతాం అన్నాడు. అది లతాకు నచ్చలేదు. తనతో కలిసి రాలేదని రఫీతో పాటలు పాడనంది. వాళ్లిద్దరూ కలిసి కొంతకాలం పాటలు పాడలేదు. ఆ రోజుల్లో లతాతో యితర మేల్ సింగర్స్, రఫీతో యితర ఫిమేల్ సింగర్స్ మంచి మంచి పాటలు పాడారు. కానీ రఫీ–లతా అంత మ్యేజిక్ వర్కవుట్ కావటం లేదని ఫీలైన నిర్మాతలు, సంగీతదర్శకులు వారిద్దరి మధ్య రాజీ కుదిర్చి మళ్లీ పాడించారు. గాయనీగాయకులకు రాయల్టీ యిస్తామని ఒప్పుకున్నారు. ఆ విధంగా లతా విజయం సాధించింది.

రఫీతో తన వివాదం గురించి చెపుతూ లతా యిటీవల ఒక యింటర్వ్యూలో ''నా రాయల్టీ ఉద్యమాన్ని వ్యతిరేకించమని రఫీసాబ్‌కు ఎవరూ నూరిపోశారు. ఓ సారి ఓ సమావేశంలో 'మీ అభిప్రాయం చెప్పండి' అని రఫీసాబ్‌ను అడిగితే ఆయన ముకేశ్ కేసి తిరికి 'మనమేం చెప్పాలో యీ మహారాణియే చెపుతుంది కాబోలు' అన్నారు. దాంతో నాకు కోపం వచ్చింది. అంతలో ఆయనే 'నేను యీవిడతో కలిసి పాడను' అన్నారు. అప్పుడు నేను 'అంత కష్టం మీకెందుకు లెండి. నేనే మీతో పాడను' అన్నాను.'' అని చెప్పుకుంది. 'మహారాణి' అని వెక్కిరించిన తర్వాత యీవిడేమందో చెప్పలేదు. ఏమీ లేకుండా 'నేను యీవిడతో కలిసి పాడను' అని సహజంగా మృదుస్వభావి, మృదుభాషి ఐన రఫీ అని వుంటారా? 'గొడవ ఎలా చల్లారింది?' అనే ప్రశ్నకు జవాబుగా 'శంకర్ జైకిషన్‌లు రాజీ కుదర్చడానికి వచ్చినపుడు ఆ మీటింగులో తనన్న మాటను వెనక్కి తీసుకుంటున్నానని రఫీసాబ్ చేత ఉత్తరం రాయించి యిస్తేనే మళ్లీ పాడతానని చెప్పాను.' అని చెప్పుకుంది. ఈ ఉత్తరం గొడవ యింతముందు చెప్పినట్లు లేదు. వాస్తవాలు నిర్ధారించడానికి రఫీ జీవించి లేరు.

ఏది ఏమైతేనేం రఫీ–లతా గొడవల సమయంలోనే ''నాదీ అడజన్మే''కు హిందీ వెర్షన్ ఐన ''మై భీ లడ్కీ హూఉ'' (1964)లో లతాతో పాటు పాడే ఛాన్సు పిబి శ్రీనివాస్‌కు వచ్చింది. ''సంగమ్'' (1964)లో 'హర్ దిల్ జో ప్యార్ కరేగా' పాటలో లతా, ముకేశ్‌లతో బాటు రాజేంద్రకుమార్‌కు పాడే ఛాన్సు మహేంద్ర కపూర్‌కు వచ్చింది. రఫీతో ''మనసే మందిరం'' రీమేక్ అయిన ''దిల్ ఏక్ మందిర్'' (1963) లో టైటిల్ సాంగ్, ''ఏప్రిల్ ఫూల్'' (1964)లో 'తుఝే ప్యార్ కర్‌తే హైఉ, కర్‌తే రహేంగే' పాట, ''జీ చాహతా హై'' (1964)లో టైటిల్ సాంగ్, ''రాజ్‌కుమార్'' (1964)లో 'తుమ్‌నే పుకారా, హమ్ చలే ఆయే' అనే పాట, ''సాంఝ్ ఔర్ సవేరా'' (1964)లో 'ఆజున్ నా ఆయే బాల్‌మా, సావన్ బీతా జాయ్' పాట, ''జబ్ జబ్ ఫూల్ ఖిలే'' (1965)లో 'నా నా కర్‌తే ప్యార్ తుమ్సేసే కర్ బైఠే' పాట, ''దిల్‌నే ఫిర్ యాద్ కియా'' (1966) టైటిల్ సాంగ్, యివన్నీ పాడే అవకాశం సుమన్ కల్యాణ్‌పుర్‌కు వచ్చింది. రఫీ, లతా రాజీ పడ్డాక కూడా ఆమెకు వచ్చిన మంచి పాటల్లో కొన్ని – ''ఛోటీసీ ములాకాత్'' (1967) 'తుఝే దేఖా తుఝే చాహా' పాట, ''పాల్కీ'' (1967)లో 'దిల్ ఏ బేతాబ్ కో సీనేసే లగానా హెూగా' పాట, ''బ్రహ్మచారి'' (1968)లో ''ఆజ్‌కల్ తేరేమేరే ప్యార్ కే చర్‌చే హర్ జుబాన్ పర్' పాట. ''జిగ్రీ దోస్త్''(1969) లో 'రాత్ సుహానీ జాగ్ రహీ హై'! ఆమె పాట వింటూ వుంటే లతాయే పాడిందేమో అనుకోవాలి. అందుకే తనను లతా, ఆశా కలిసి తొక్కేశారని ఆమె ఆరోపించింది. తన తర్వాత ఎవరికైనా ఛాన్సు రావాలంటే తన చెల్లెలు ఆశాకు తప్ప వేరేవారికి రాకూడదు అని లతా పట్టుబట్టేదని ఆవిడ బహిరంగంగా చెప్పింది. సుమన్ కళ్యాణ్‌పుర్ గొంతు అచ్చు లతాలా వుండడం వలన పైకి రాలేకపోయిందని, ఒరిజినల్ వుండగా డూప్లికేట్‌ను ఎవరు ఆదరిస్తారని సంజాయిషీ చెప్పేవాళ్లున్నారు. కానీ ముబారక్ బేగమ్ విషయంలో ఆ మాట అనడానికి లేదు. ఆమె వాయిస్ వీరెవరినీ పోలి వుండదు. ఆమె పాడిన రెండు మంచి పాటల లింకులు కింద యిస్తున్నాను. గమనించండి. నీశిశిచీరీ://గీగీగీ.గిళితిశితిలీలి.బీళిళీ/గీబిశిబీనీ?ఖీవ6గిజుచి8శిది0న్నచవీ, నీశిశిచీరీ://గీగీగీ.గిళితిశితిలీలి.బీళిళీ/గీబిశిబీనీ?ఖీవజీచీఖఓబిలీ53బివిఖ

ముబారక్ బేగం వయసు కచ్చితంగా తెలియదు. 76 పైన 80కి లోపు వుండవచ్చు. రాజస్థాన్‌లోని ఝున్‌ఝునులో పుట్టింది. పేద కుటుంబం. ఆమె తండ్రికి కూడా హిందూస్తానీ శాస్త్రీయ సంగీతం తెలుసు. అయినా అన్నగారితో కలిసి పళ్ల వ్యాపారం చేసేవాడు. రాజస్థాన్ నుంచి అహ్మదాబాద్‌కి వచ్చేసి, అక్కడ వ్యాపారం చేసేవాడు. ముబారక్ బేగం అక్కడే పెరిగింది. సినిమాలకు తీసుకెళితే హీరోయిన్ల పాటలు నేర్చుకుని పాడేసేది. సురయ్యాను చూసి సింపుల్‌గా, సునాయాసంగా పాడడం ప్రాక్టీసు చేసింది. ఆమెలో టాలెంటు వుందని గమనించిన తండ్రి, తను కాలేకపోయినా కూతురైనా గాయని కావాలనే లక్ష్యంతో రియాజుద్దీన్ ఖాన్ వద్ద శాస్త్రీయసంగీతం నేర్పించాడు. సినిమాల్లో పాడాలంటే లలిత సంగీతం బాగా వచ్చి వుంటే మంచిదనుకుని ఆలిండియా రేడియోలో ప్రయత్నించాడు. ఘజల్స్ పాడే అవకాశం వచ్చింది. రఫీక్ ఘజనవీ అనే సినీసంగీత దర్శకుడు రేడియోలో ఆమె వాయిస్ విని సినిమాలో అవకాశం యిస్తాను బొంబాయి తీసుకుని రమ్మనమన్నాడు. బాగా చిన్నపిల్ల కావడం చేత ముబారక్‌కు మైకు చూస్తే భయం వేసింది. సరిగ్గా పాడలేకపోయింది. అయినా ఆమె తండ్రి బొంబాయికి మకాం మార్చి అనేకమంది సంగీతదర్శకుల వద్దకు తీసుకెళ్లాడు. ఎస్‌డి బర్మన్ వద్దకు వెళితే 'నీ వాయిస్ పాగా పాలిష్ చేసుకుని రామ్మా' అన్నాడు. శ్యామ్ సుందర్ అనే ప్రఖ్యాత సంగీతదర్శకుడు ఆమెకు రెండో ఛాన్సు యిచ్చాడు. అక్కడా అదే కథ రిపీటైంది. రిహార్సల్స్‌లో బాగా పాడడం, ఫైనల్ టేక్ వచ్చేసరికి భయపడి చెడగొట్టడం. మూడో ఛాన్సు యిచ్చిన షౌకత్ దెహ్లవి ''ఆయియే''లో ఒక పాట పాడించి ఆమె భయాన్ని పోగొట్టాడు. దాంతో ఆమె ఆత్మవిశ్వాసం పెరిగింది. కానీ అవకాశాలు రాలేదు.

చివరకు ప్రఖ్యాత దర్శకుడు కెమాల్ అమ్రోహి తీసిన ''దాయిరా'' (1953)లో జమాల్ సేన్ సంగీతదర్శకత్వంలో ఆమెకు పాడే

అవకాశం వచ్చింది. చాలా చక్కగా పాడడంతో ఏడు పాటలు యిచ్చారు. "దేవ్‌తా తుమ్‌హెూ మేరా సహారా" అనే భజనను రఫీతో కలిసి పాడింది. దురద ృష్టం, సినిమా ఫెయిలయింది. పాటలకు పెద్ద గుర్తింపు రాలేదు. ఆమెకు మైకు భయం పోయింది కానీ పిరికితనం, సిగ్గు పోలేదు. ఆ సినిమా విడుదలయ్యాక అమీన్ సయానీ రేడియోలో యింటర్వ్యూ చేస్తానని ముందుకు వస్తే "నాకు మాట్లాడడం రాదు. నా బదులు మా చెల్లెలు విజయబాల మాట్లాడుతుంది. మధ్యలో పాటలు పాడాల్సివచ్చినపుడు నేను పాడతాను." అంది. ఇంటర్వ్యూ అలాగే సాగింది. అవకాశాల వేటలో మళ్లీ ఎస్‌డి బర్మన్ వద్దకు వెళ్లింది. ఆమె పాటలు అప్పటికే విన్న బర్మన్ తను పనిచేస్తున్న బిమల్ రాయ్ "దేవదాసు" (1955)లో 'వో నా ఆయేంగే పలట్‌కర్, ఉన్హే లాఖ్ హమ్ బులాయే' అనే రెండు లైన్ల గేయాన్ని పాడమన్నాడు. ఈమె పాడిన తీరు చూసి నచ్చి, ఆ గేయాన్ని పూర్తి స్థాయి పాటగా పెంచారు. సినిమా హిట్ కావడంతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. దాని తర్వాత సలిల్ చౌధురి సంగీతదర్శకత్వంలో తను తీసిన "మధుమతి" (1958)లో 'హాల్–ఎ–దిల్ సునాయేంగే' పాట పాడే అవకాశం కూడా బిమల్ రాయ్ యిచ్చాడు.

ఆమెకు టాలెంటు వున్నా అవకాశాలు వచ్చేవి కావు. సుమన్ కళ్యాణ్‌పుర్ అంత ఓపెన్‌గా ముబారక్ బేగం ఎప్పుడూ మాట్లాడలేదు కానీ దారిద్ర్యం, అనారోగ్యం చుట్టుముట్టిన అంత్యదశలో మాత్రం 'వాళ్లు (పేరు చెప్పేది కాదు) కావాలని నా పాట చెడగొట్టేవారు. నేను రిహార్సల్ చేస్తూ వుంటే, రికార్డు చేస్తూ వుంటే కావాలని నవ్వి ఏకాగ్రత చెడగొట్టేవారు. టేకు సరిగ్గా రాలేదని చెప్పి నన్ను పంపించేశాక వచ్చి పాడేవారు. గీతా దత్ మాత్రం ఏ గాయని పట్ల యిలా ప్రవర్తించేది కాదు.' అని చెప్పింది. అప్పట్లో టాప్‌లో వున్నది లతా, ఆశా, గీతాయే. "ఓసారి నాకు ఫోన్ వచ్చింది. 'నేను తలచుకుంటే నిన్ను యిండస్ట్రీలోంచి తోసి అవతల పారేయగలను' అని చెప్పారు. 'ఎవరు మీరు' అన్నాను. అప్పుడు అవతలి వ్యక్తి విరగబడి నవ్వుతూ తన పేరు చెప్పింది. ఓ ఏడాది రంజాన్ మాసం నడుస్తూండగా నాకు ఓ కవర్లో రూ. 500 రూఎఎలు పెట్టి పంపించారు. కవరు మీద అగ్రశ్రేణి గాయని పేరుంది. రంజాన్‌లో పేదలకు యిచ్చే జకాత్‌లా తోచి, ఆమెకు ఫోన్ చేశాను. ఆమె సోదరి ఫోన్ తీసింది. "మీరు నాకు సాయం చేద్దామనుకుంటే అంతకంటె ఎక్కువే పంపాల్సింది" అన్నాను. "మా ఖర్చులు మాకే సరిపోవటం లేదు" అందామె." అని ముబారక్ చెప్పుకొచ్చింది.

కిదార్ శర్మ అనే ప్రఖ్యాత దర్శకనిర్మాత "జవాన్ మొహబ్బత్" అనే సినిమా తీస్తూ ముబారక్ చేత 'కభీ తన్‌హాయియోం మేఉ యూఉ హమారీ యాద్ ఆయేగీ' అనే పాట పాడించారు. ఆ పాట రికార్డింగు జరుగుతూన్నంత సేపు ఆయన కళ్లు మూసుకుని వింటూ వున్నాడు. దానిని నేపథ్యగీతంగా చిత్రీకరిద్దామనుకున్న ఆలోచన మార్చుకుని హీరోయిన్‌పై చిత్రీకరించాడు. అంతేకాదు, సినిమా పేరును కూడా "హమారీ యాద్ ఆయేగీ' అని మార్చేశాడు. పాట పూర్తవగానే ముబారక్‌కు బహుమతిగా పావలా యిచ్చాడు. తీసుకోవడానికి ఆమె వెనకాడుతూండగా సంగీతదర్శకుడు స్నేహల్ భాట్కర్ 'తీసుకో, ఆయన చేతుల మీదుగా బహుమతి తీసుకున్నవారందరూ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు' అన్నాడు. ముబారక్‌కు రావలసినంత పేరు రాకపోయినా, ఆ పాట మాత్రం హిందీ పాటల్లో ముఖ్యమైన పాటగా చరిత్రలో మిగిలిపోయింది. పైన యిచ్చిన లింకుల్లో ఒక పాట అదే.

రెండో పాట మన "భార్యాభర్తలు" హిందీ రీమేక్ అయిన "హమ్‌రాహీ" (1963) సినిమాలోని టైటిల్ సాంగ్, 'ముఝ్‌కో అప్‌నే గలే లగాలో' రాజేంద్రకుమార్ సరసన నటించిన తెలుగు నటి జమునకు ప్లేబ్యాక్ పాడింది. అప్పట్లో ఎయన్నార్, ఎన్టీయార్‌లతో పేచీ వలన జమున హిందీరంగంలో నటించారు. రఫీకి, లతాకు మధ్య వచ్చిన పేచీ వలన లతాకు బదులు ముబారక్ పాడారు. చాలా అందమైన పాట. సినిమా కూడా హిట్. తక్కినవేవీ వినకపోయినా యిది ఒక్కటీ విన్నా, యిలాటి గాయనికి అవకాశాలు ఎందుకు రాలేదన్న సందేహం వచ్చి తీరుతుంది. ఆమె చేత ఒక పాట పాడించినా తను వూరుకోనని లతా బెదిరించిందని అంటారు. రికార్డు చేయించిన పాటలు కూడా తీయించేసిందని ఆరోపణలున్నాయి. నిజానిజాలు వారే చెప్పాలి. ఏమైతేనేం, రోజూ సాధన చేస్తూ గాత్రాన్ని బాగా వుంచుకున్నా, ముబారక్‌కు అవకాశాలు రాలేదు. ప్రైవేటుగా ఘజల్స్ పాడింది కానీ ఆదాయం పెద్దగా లేదు. డిప్రెషన్‌లోకి వెళ్లి నిద్రమాత్రలు వేసుకోసాగింది. వెన్ను నెప్పి బాధించింది. అప్పుడప్పుడు స్టేజిషోలు యిచ్చింది. ఎచ్ఎమ్‌వి వారు రాయల్టీ కూడా యివ్వలేదంటుంది. దరిద్రంలోనే బతికింది. ఆమె చివరి దశలో జావేద్ అఖ్తర్ కళాకారుల కోటాలో ముంబయి శివారు జోగేశ్వరిలో ఆమెకో ఫ్లాట్ యిప్పించాడు. నెలకు 1500 పెన్షన్ వచ్చేది. చివర్లో దాన్ని 3 వేలు చేశారు. కొడుకు ప్రయివేటు టాక్సీ నడుపుతాడు. కూతురికి పార్కిన్‌సన్స్ డిసీజ్. కూడా కలిసి రాలేదు. చివరకు దాదాపు అనామకంగానే పోయింది పాపం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 08–09 వీక్లీకై

ఎమ్బీయస్ : అక్రమ వలస కార్మికులను ఉపయోగించుకున్న ట్రంప్

అమెరికాలోని చిరుద్యోగులను, నిరుద్యోగులను రెచ్చగొట్టడానికి ట్రంప్ వుపయోగిస్తున్న ట్రంప్ కార్డ్ – వలస కార్మికుల కారణంగా ఆర్థిక సంక్షోభం కలుగుతోంది. వారందరినీ పంపించివేయాలి అనే నినాదం. అతను ఆగస్టు మూడోవారంలో తన కాంపెయిన్‌లో చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా నియమించుకున్న స్టీఫెన్ బానన్ ఎచ్–1బి వీసాలకు బద్ధవిరోధి. వేలాది భారతీయ నిపుణులు అమెరికా వచ్చేందుకు అనువుగా వున్న ఎచ్–1బి వీసాలకు వ్యతిరేకంగా రైట్‌వింగ్‌కు చెందిన బానన్ బ్రియట్‌బార్ట్ న్యూస్ అనే వెబ్‌సైట్ ద్వారా

చాలాకాలంగా ఉద్యమం నడుపుతున్నాడు. 2015 నవంబరులో ఒక యింటర్వ్యూలో సిలికాన్ వాలీలో వున్న కంపెనీలలో 65% మంది సిఇఓలు ఆసియన్లే అని వాపోయాడు. ఇటువంటివాడు సారథిగా వుంటే ట్రంప్ ఎంత రెచ్చిపోతాడో వూహించుకోవచ్చు. కానీ యిటీవల ట్రంప్ ధోరణిలో మార్పు వచ్చింది. ఉపన్యాసాల్లో ఘాటు తగ్గించాడు. ఎందుకంటే పోలండ్ నుంచి అక్రమంగా వలస వచ్చిన వలస కార్మికుల చేత గతంలో తనే పని చేయించుకున్నాడన్న విషయం ఆగస్టు నెలాఖరులో పత్రికల్లో వచ్చేసింది కాబట్టి!

మాన్‌హట్టన్‌లోని ట్రంప్ టవర్స్ అనే భవనసముదాయం ట్రంప్ వ్యాపారసామ్రాజ్యానికి ఆయువుపట్టు. అతని కాంపెయిన్ నడిచేది కూడా అక్కణ్నుంచే. అది కట్టడానికి ముందు అక్కడ బాన్‌విట్ బిల్డింగు వుండేది. దాన్ని పడగొట్టి 50-50 పద్ధతిపై యీ టవర్స్ డెవలప్ చేసే పనిని 1979లో ట్రంప్ తలకెత్తుకున్నాడు. అది కమ్మర్షియల్ జోన్ కాదని అభ్యంతరాలు వస్తూంటే రాజకీయనాయకులకు విరాళాలిచ్చి, న్యూయార్క్ బోర్డులోని సభ్యులను మెత్తబరచి మినహాయింపు సాధించాడు. 12 అంతస్తుల భవంతి కూలగొట్టే ప్రారంభించాడు కానీ అది మెల్లగా సాగుతోంది. 1979 చివర్లో ఒకసారి అతను సైట్ దగ్గరకు వచ్చినపుడు పక్కనున్న సైట్‌లో కన్‌స్ట్రక్షన్ చెత్తను శుభ్రం చేస్తున్న పోలిష్ పనివారు పనిచేస్తూండగా చూశాడు. ఎవరు వీళ్లు? అని అడిగితే అక్రమంగా వలస వచ్చినవాళ్లు. అన్‌డాక్యుమెంటెడ్ పనివారు. యూనియన్ (చట్టబద్ధమైన) వర్కర్లలా కాకుండా, పనిగంటల గురించి పేచీ పెట్టకుండా, అతి కొద్ది కూలీకి, కష్టపడి పనిచేస్తారని ఫోర్‌మన్ చెప్పాడు. వాళ్లను పనిలో పెట్టిన కంపెనీ యజమాని విలియం కస్‌జైకీని ట్రంప్ తన ఆఫీసుకి రమ్మనమని కబురు పెట్టాడు. ఆ కంపెనీకి అప్పటిదాకా కిటికీలు శుభ్రం చేయడం, నిర్మాణం జరిగే సైట్‌ను శుభ్రపరచడం తప్ప పెద్ద భవంతులు కూల్చడంలో అనుభవం లేదు. "నువ్వు కొత్త కంపెనీ ఒకటి ప్రారంభించి యీ పని కూడా చేపట్టు. పనివాళ్లకు వేరే యిన్సూరెన్సు తీసుకో. మా పనికి 7,75,000 డాలర్లు చెల్లిస్తా. అనుకున్నదాని కంటె త్వరగా పూర్తి చేసే పైన పాతికా కలిపి 8 లక్షల డాలర్లిస్తా." అన్నాడు ట్రంప్. కస్‌జైకీ ఎగిరి గంతేశాడు. 1980 జనవరి నుంచి పొరుగున చేస్తున్న పనిలోంచి పోలిష్ పనివారు వంతుల వారీగా బయటకు వచ్చేసి యిక్కడ పని చేపట్టారు. పొద్దున్న 6 నుంచి సాయంత్రం 6 దాకా ఒక షిఫ్టు. సాయంత్రం 6 నుంచి, పొద్దున్న 6 దాకా మరో షిఫ్టు చొప్పున పన్నెండేసి గంటల షిఫ్టుల్లో మూణ్నెళ్ల పాటు పని చేశారు. కొందరు 24 గంటల షిఫ్టు కూడా చేశారట. గంటకు 4 నుంచి 5 డాలర్ల దాకా వాళ్లకి కూలీ ముట్టింది. అప్పట్లో యూనియన్ కార్మికుడికి గంటకు 10 డాలర్ల దాకా యివ్వాల్సి వచ్చేది. పైగా యిన్ని గంటలు వాళ్లు పనిచేయరు కాదా!

గోడలు పడగొట్టడం, పైపులు కోయడం, ఎలక్ట్రిక్ వైర్లు బయటకు లాగడం వంటి ప్రమాదకరమైన పనులన్నీ సరైన భద్రతా సామగ్రి లేకుండానే పోలిష్ కార్మికులు చేసేవారు. కనీసం గట్టి టోపీలైనా వుండేవి కావు. ఓ రోజు పెద్ద ఉక్కు దూలం అల్బిన్ అనే ఒక పనివాడి చేతి మీద పడి అతని చెయ్యి విరిగింది. ఇంత కష్టపడి పనిచేసినా పనివాళ్లకు కస్‌జైకీ జీతాలు సరిగ్గా చెల్లించేవాడు కాదు. దాంతో వాళ్లు అక్కడకు కాస్త దూరంలోనే వున్న జాన్ జాబో అనే న్యాయవాది దగ్గరకు వెళ్లి మొర పెట్టుకున్నారు. జాబో కస్‌జైకీ కోసం ప్రయత్నిస్తే అతను ఫ్లారిడాలో వుంటున్నాడని తెలిసింది. అప్పుడు ట్రంప్ ఆఫీసులో ఆపరేషన్స్ విభాగంలో వైస్ ప్రెసిడెంటుగా పని చేస్తూ యీ కూల్చివేత పనిని స్వయంగా పర్యవేక్షిస్తున్న థామస్ మకారీకి ఫోన్ చేశాడు. పనివాళ్లకు జీతాలివ్వకపోతే ట్రంప్ టవర్స్‌పై 'మెకానిక్స్ లియన్' (బకాయి పడిన జీతాలకు బదులుగా పనివాడికి అక్కడ కట్టిన ఆస్తిలో వాటా యిస్తారు) యివ్వాలంటూ కోర్టుకెక్కుతానని చెప్పాడు. ఇది ట్రంప్ దాకా వెళ్లడంతో అతను పనివాళ్లను స్వయంగా కలిశాడు. కస్‌జైకీ తప్పుకుంటే తనే స్వయంగా వాళ్లకు బకాయి పడిన జీతాలిస్తానని చెప్పాడు. మకారీ సంతకంతో బ్యాంకు ఖాతా తెరిచి, దానిలోంచి డబ్బులు విత్‌డ్రా చేసి పనివాళ్లకు రొక్కంలో చెల్లించాడు. ఇది కొద్దికాలమే సాగింది. పనివాళ్లలో కొంతమందికి జీతాలు ముట్టలేదు. చేయిపోయాక ఫోర్మన్‌గా మారిన అల్బిన్ ట్రంప్ ఆఫీసుకి వెళ్లి అడిగాడు. 'వాళ్ల తాలూకు డబ్బు నేను కస్‌జైకీకి ముందే చెల్లించాను కాబట్టి మీరు వెళ్లి అతన్నే అడగాలి' అని ట్రంప్ జవాబిచ్చాడు.

1980 జూన్ వచ్చేసరికి పోలిష్ వర్కర్ల జీతాల బకాయి మొత్తం లక్ష డాలర్లయింది. వాళ్లు గొడవ చేయసాగారు. ట్రంప్‌కు ఏం చేయాలో పాలుపోక డేనియల్ సలివాన్ అనే లేబరు కన్సల్టెంట్‌ను కలిశాడు. ట్రంప్ న్యూ జెర్సీలో కడుతున్న కాసినో గురించిన ఒప్పందం గురించి అతను సాయపడుతున్నాడు. ఈ పోలిష్ వర్కర్ల విషయం చెప్పగానే అతను తెల్లబోయాడు "ఇక్కడ యింత పెద్ద ప్రాజెక్టు చేతిలో పెట్టుకుని అక్కడ అక్రమంగా వలస వచ్చిన కార్మికుల చేత చట్టవిరుద్ధంగా పని చేయించుకుంటావా? మీ కంపెనీ ఉద్యోగి ద్వారా డైరక్టుగా జీతాలిస్తున్నావా? ఇది బయటకు వస్తే నీ పరువు నిలుస్తుందా? బ్లాక్‌లిస్టు అయిపోవా? నీకే మాత్రం బుర్రున్నా వెంటనే వాళ్లను ఉద్యోగాల్లోంచి పీకేయ్" అని చెప్పాడు. అయినా ట్రంప్ లక్ష్యపెట్టలేదు. పని కొనసాగించాడు. 1980 జూన్ 27న జాబో ట్రంప్ ఆఫీసుకి వెళ్లి మెకానిక్స్ లియన్ నోటీసు సెర్వ్ చేశాడు. పోలిష్ కార్మికులు కంపెనీ వైస్ ప్రెసిడెంటు మకారీని బిల్డింగు మీద నుండి వేళ్లాడదీస్తామని బెదిరించారు. అప్పుడు ట్రంప్ సలివాన్‌కు ఫోన్ చేశాడు. 'సెప్టెంబరు 1 కల్లా బాన్‌విట్ బిల్డింగు కూలగొట్టకపోతే నేను రియల్ ఎస్టేటు టాక్స్ కింద భారీ మొత్తం కట్టాల్సి వస్తుంది.' అని మొత్తుకున్నాడు. 'ఇప్పటికైనా పోలిష్ పనివారిని తప్పించి యూనియన్ కార్మికులను పనిలో పెట్టుకో' అని సలివాన్ సలహా యిచ్చాడు.

ఈ లోగా జాబో రెండవ, మూడవ నోటీసు కూడా సెర్వ్ చేశాడు. ఆగస్టు 8న మకారీకి ఫోన్ చేసి 'ట్రంప్ నేరుగా జీతాలు చెల్లిస్తున్నందున అతనే వారి యజమాని (ఎంప్లాయర్) అవుతాడని, అందువలన ఫెయిల్ లేబర్ స్టాండర్డ్స్ చట్టం ప్రకారం వారి బకాయిలు చెల్లించనిదే బిల్డింగులో ఒక్క అంగుళం కూడా ఎవరికీ అమ్మలేడ'ని స్పష్టం చేశాడు. 45 నిఎఎల తర్వాత 'ట్రంప్

ఆఫీసులోని లీగల్ డిపార్టుమెంటు నుంచి బ్యారన్‌ను మాట్లాడుతున్నా' అంటూ ఒకతను ఫోన్ చేసి 'నువ్వు అక్రమంగా మెకానిక్స్ లియన్ నోటీసులు మాకు యిస్తున్నందున నీ పై 100 మిలియన్ డాలర్లకు కేసు వేయబోతున్నా' అని చెప్పాడు. నిజానికి ఆ పేరుతో ఏ ఉద్యోగీ లేడు. ఇబ్బందులు వచ్చినపుడు ట్రంప్, అతని ఆఫీసులో మరో ఉన్నతోద్యోగి ఆ మారుపేరు పెట్టుకుని మాట్లాడడం కద్దు. ఆ విషయం ట్రంపే కోర్టులో చెప్పాడు. జాబో తన చర్యలను సమర్థించుకుంటూ ఆగస్టు 18న బ్యారన్ పేర పెద్ద ఉత్తరం పంపాడు. కొన్ని రోజుల తర్వాత ట్రంప్ లాయరు ఇర్విన్ డర్బిన్ జాబోకు ఫోన్ చేసి 'మీరు కేసు విత్‌డ్రా చేసుకోకపోతే ట్రంప్ ఇమ్మిగ్రేషన్ అండ్ నేచురలైజేషన్ సర్వీసుకి ఫిర్యాదు చేసి యీ పోలిష్ వర్కర్లందరినీ దేశం నుంచి పంపించివేస్తాడు జాగ్రత్త' అని హెచ్చరించాడు. జాబో ఫిర్యాదు మేరకు 1980 ఏడాది చివరకి వచ్చేసరికి, ట్రంప్, కస్‌జైకీ అక్రమ కార్మికుల సేవలు వినియోగిస్తున్నారన్న విషయంపై లేబరు డిపార్టుమెంటు విచారణ జరిపింది. ఒక యిన్వెస్టిగేటర్‌ను సైట్‌కి పంపి ఎవరు పనిచేస్తున్నారో చూడమంది. ట్రంప్ సలివాన్‌కు ఫోన్‌కు చేసి ఆ యిన్వెస్టిగేటర్ సంగతి చూసుకోమన్నాడు. చివరకు కోర్టు కేసులో జాబో, లేబరు డిపార్టుమెంటు నెగ్గాయి. కస్‌జైకీ 2,54,524 డాలర్లు చెల్లించవలసి వచ్చింది. ట్రంప్ ఏమీ చెల్లించనక్కరలేక పోయింది.

ఈ కేసు సంగతి ఎప్పటికీ బయటకు వచ్చేది కాదు, కేసుకి సంబంధించిన రికార్డులు 36 ఏళ్లగా భద్రపరచేవారూ కాదు – ట్రంప్ చేసిన మరో అక్రమంపై కేసు పడకుండా వుండి వుంటే! హౌస్ రెకర్స్ యూనియన్ (ఇళ్లు కూల్చే పనివారి సంఘం) తాలూకు లోకల్95 అనే సంస్థ వుంది. కూల్చే పనిలో పాలు పంచుకుంటున్న పనివారి పేర – వారు చట్టబద్ధంగా పనిచేసినా, చట్టవిరుద్ధంగా పనిచేసినా – పని చేసిన గంటకు యింత చొప్పున, పెన్షన్, వెల్‌ఫేర్ ఫండ్ (సంక్షేమ నిధి)కై కాంట్రాక్టర్లు ప్రతి నెలా యూనియన్‌కు డబ్బు కడుతూ వుండాలి. ట్రంప్ టవర్స్‌పై పనిచేస్తున్న పనివారిలో ఎక్కువగా పోలిష్ వారు, వారి కంటె బాగా తక్కువ సంఖ్యలో చట్టబద్ధమైన యూనియన్ వర్కర్లు యిద్దరూ వున్నా కేవలం యూనియన్ వర్కర్ల పేర మాత్రమే ట్రంప్, కస్‌జైకీ డబ్బులు కట్టారు. పోలిష్ వారి గురించి నోరెత్తకుండా లోకల్95 సభ్యులను మేనేజ్ చేశారు. అయితే దానిలో సభ్యుడిగా వున్న మాజీ బాక్సర్ హేరీ డైడక్ కొన్నాళ్లకు దీనితో విభేదించాడు. అతను అతని లాయర్లు కలిసి 1983లో కస్‌జైకీ మీద, యూనియన్ ప్రెసిడెంటు మీద, ట్రంప్ మీద కేసులు వేశారు. ట్రంప్ అతని భాగస్వాములు పెన్షన్ ఫండ్‌కు 6 లక్షల డాలర్లు యివ్వాలని క్లెయిమ్ చేశారు. హేరీ లాయర్లు గుట్టల కొద్దీ డాక్యుమెంట్లు సేకరించారు. ట్రంప్ వారిని అడుగడుగునా ప్రతిఘటిస్తూనే వచ్చాడు. కింది కోర్టులో దోషి అని తీర్పు వస్తే అప్పీలుకి వెళ్లాడు. ఆ కేసు 15 ఏళ్లు నడిచింది. ముగ్గురు జడ్జిలు మారారు. 1998లో తనకు శిక్ష తప్పదని తెలిసిన దశలో ట్రంప్ కోర్టు బయట సెటిల్ చేసుకున్నాడు. అతను ఎంత యిచ్చుకున్నాడో ఎవరికీ తెలియదు. ఈ కథనాన్ని బయటపెట్టిన "టైమ్" ఆ డీల్ బయటపెట్టాలని కోర్టును కోరుతోంది.

ఈ కేసు వలన ఆ రికార్డులన్నీ ఫెడరల్ కోర్టులో భద్రపరచారు. అప్పుడు ట్రంప్ అనేకమంది వ్యాపారస్తుల్లో ఒకడు. మరి యిప్పుడు? అయితేగియితే దేశాధ్యక్షుడు. అందుకే యివన్నీ బయటకు లాగుతున్నారు. ఆ రికార్డులు అందివచ్చాయి. 'అక్రమకార్మికుల కారణంగానే మనవాళ్ల ఉద్యోగాలు పోతున్నాయి' అంటూ ఉపన్యాసాలు దంచుతున్న ట్రంప్ యిప్పుడు మెత్తబడక తప్పటం లేదు. **(ఫోటో – ట్రంప్ టవర్స్ కనస్ట్రక్షన్ సైట్‌లో ట్రంప్ ఫోటో, 1980) – ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

ఎమ్బీయస్ : గుజరాతీ సైనికులు

గుజరాతీలు వ్యాపారస్తులుగా ప్రసిద్ధులు. ఉద్యోగస్తుల్లో కూడా కొందరు కనబడతారు. మోదీ హయాం వచ్చాక రాజకీయాల్లో, ప్రధాని కార్యాలయంలో, ఉన్నత పదవుల్లో ఎక్కడ చూసినా గుజరాతీలో, గుజరాత్ క్యాడర్ అధికారులో కనబడుతున్నారని గగ్గోలు పుడుతోంది. గుజరాతీ వ్యాపారస్తుల హవా ఎప్పటికంటె యిప్పుడు ఉధృతంగా వీస్తోందంటున్నారు. మరి గుజరాతీలు అన్ని రంగాల్లో గణనీయంగా వున్నారా?

ఫీల్డ్ మార్షల్ మానెక్‌షాను అహ్మదాబాద్‌లో ఓ బహిరంగసభలో మాట్లాడమని పిలిచారు. ఆయన ఇంగ్లీషులో తన ప్రసంగం ప్రారంభించగానే, సభలో కలకలం పుట్టింది. "గుజరాతీలో మాట్లాడండి. గుజరాతీలో మాట్లాడితేనే మేం వింటాం." అని కేకలు వేశారు. ఆయన జన్మతః పార్శీ కాబట్టి గుజరాతీ వచ్చే వుంటుందని అంచనా. మానెక్‌షా ఆగిపోయి, చుట్టూ పరికించాడు. ఆయన చాలా ధైర్యశాలి. 1971 ఏప్రిల్‌లో బంగ్లాదేశ్ (అప్పటి తూర్పు పాకిస్తాన్)లో అలజడి రేగుతున్నపుడు రెండు నెలల వ్యవధిలోనే యుద్ధానికి వెళ్లవలసి వస్తుందని ఇందిరా గాంధీ అనుకుంది. కాబినెట్ సమావేశం ఏర్పరచి దానికి ఆర్మీ చీఫ్‌గా వున్న మానెక్‌షాను కూడా పిలిచింది. 'అవసరమైతే రెండు నెలల్లో యుద్ధానికి సిద్ధం కావాలి' అంటూ మానెక్‌షాకు ఇందిరా చెప్పింది. 'అది చాలా తక్కువ సమయం, చాలా ప్రాక్టికల్ ప్రాబ్లెమ్స్ వున్నాయి' అన్నాడు మానెక్‌షా. ఆ సమావేశంలో రక్షణ, విదేశాంగ శాఖ, ఆర్థిక శాఖ, వ్యవసాయంకు చెందిన సీనియర్ మంత్రులున్నారు. వారి ఎదుట ఆర్మీ చీఫ్ యిలా మాట్లాడడం ఇందిరకు రుచించలేదు. "నాలుగు గంటలకు మళ్లీ సమావేశమవుదాం." అంటూ ప్రకటించింది. అందరూ బయటకు వెళుతూండగా, మానెక్‌షాతో మాత్రం "మీరు కాస్త ఆగుతారా?" అని అడిగింది. ఏకాంతంలో ఆమె కటువైన భాష ఉపయోగించే ప్రమాదం వుందని గ్రహించిన మానెక్‌షా "మేడమ్ ప్రైమ్ మినిస్టర్, మీరేదో చెప్పాలనుకుంటున్నాను. దానికి ముందు నా రాజీనామా లేఖలో ఏ కారణం చేత పదవి వదులుకుంటున్నానని

రాయాలో చెప్తారా? ఆరోగ్యసమస్యా, మానసిక సమస్యా, కుటుంబకారణమా, ఏం రాయను?" అన్నాడు. అతని కఠినవైఖరిని ఇందిర గుర్తించింది. అతని సామర్థ్యం కూడా ఆమెకు తెలుసు కాబట్టి, తక్కువ వ్యవధిలో యుద్ధం సాధ్యం కాదని గ్రహించి ఆయన చెప్పినట్లే విం‌ది.

దేశప్రధాని వద్దనే అలా మాట్లాడిన మానెక్‌షా ఆ రోజు సభలో గుజరాతీలో మాట్లాడలన్న డిమాండ్ రాగానే "స్నేహితురాలా, నేను చాలాకాలం ఆర్మీలో పనిచేసి, చాలా మందితో కలిసి యుద్ధరంగంలో పోరాడాను. సిఖ్ రెజిమెంటు నుంచి వచ్చినవారి నుండి పంజాబీ నేర్చుకున్నాను, మరాఠా రెజిమెంటు నుంచి వచ్చినవారి వద్ద మరాఠీ నేర్చుకున్నాను, మద్రాసు సాపర్స్ నుండి తమిళం నేర్చుకున్నాను, బెంగాల్ సాపర్స్ నుండి బెంగాలీ నేర్చుకున్నాను. గూరా? రెజిమెంటు నుంచి నేపాలీ సైతం నేర్చుకున్నాను. కానీ దురదృష్టవశాత్తూ నాకు సైన్యంలో గుజరాతీలు ఎవరూ ఎదురు కాకపోవడం వలన గుజరాతీ నేర్చుకోలేక పోయాను." అన్నాడు.

సూది కింద పడినా వినబడేటంత నిశ్శబ్దం అలముకుంది ఆ బహిరంగ సభలో! **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 10 ఎమ్బీయస్ : ఉజ్బెకిస్తాన్ నియంత కరిమోవ్ మృతి

ఇనుప పిడికిలితో పాతికేళ్ల పాటు ఉజ్బెకిస్తాన్‌ను ఏలిన దేశాధ్యక్షుడు ఇస్లామ్ కరిమోవ్ బ్రెయిన్ హెమరేజితో ఆగస్టు 29న కుప్పకూలి, సెప్టెంబరు 2 న చనిపోయాడు. పేరుకు ప్రజాస్వామ్యం, ఎన్నికలు అని చెప్పుకుంటూనే ప్రతిపక్షాలను దారుణంగా అణచివేసి పాలించాడు. రెండున్నరేళ్లగా కన్నకూతుర్ని, మనవరాలితో సహా జైల్లో పెట్టించాడు. తన రాజకీయ వారసుడిగా ఎవర్నీ ప్రకటించలేదు. ఒక్కసారిగా అతను కనుమరుగు కావడంతో దేశాన్ని ఎవరు పాలిస్తారో తెలియక ప్రజలంతా తబ్బిబ్బు పడుతున్నారు.

1965 ఇండో-పాక్ యుద్ధం గుర్తుకు రాగానే తాష్కెంట్ గుర్తుకు వస్తుంది. ఎందుకంటే అక్కడే ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య రష్యా అధ్యక్షుడు కోసిగిన్ రాజీ కుదిర్చాడు కనుక, అక్కడే లాల్ బహదూర్ శాస్త్రి మరణించారు కనుక. తాష్కెంట్ రాజధానిగా గల ఉజ్బెకిస్తాన్ రిపబ్లిక్ అప్పట్లో రష్యన్ సమాఖ్యలో భాగం. 1991లో రష్యా నుంచి విడిపోయాక స్వతంత్రదేశంగా మారి, తాష్కెంట్‌ను దేశరాజధానిగా చేసుకుంది. రష్యా నుంచి విడిపోయే ప్రక్రియ చేపట్టినది కరిమోవ్‌యే. అతను 1938లో సమర్‌ఖండ్‌లో పుట్టాడు. ఇద్దరు ప్రభుత్వోద్యోగులకు పుట్టిన అక్రమసంతానం కాబట్టి అనాథాశ్రమంలో పెరిగాడని కొందరంటారు. మెకానికల్ యింజనియంగు చేశాక, యింజనియరుగా ప్రభుత్వ జలవనరుల శాఖలో పనిచేశాడు. 1967లో ఎకనమిక్స్‌లో డిగ్రీ సంపాదించాడు. 1966-86 మధ్య ఉద్యోగంలో పదోన్నతి సంపాదిస్తూ వచ్చాడు. చీఫ్ స్పెషలిస్టుగా, శాఖాధిపతిగా, మంత్రిగా, స్టేట్ ప్లానింగ్ కమిషన్ చైర్మన్‌గా, మంత్రివర్గానికి డిప్యూటీ చైర్మన్‌గా ఎదుగుతూ వచ్చి 1996లో యుఎస్ఎస్ఆర్ ఉజ్బెక్ ప్రాంతీయ శాఖ కమ్యూనిస్టు పార్టీ ఫస్ట్ సెక్రటరీ అయ్యాడు. సెంట్రల్ కమిటీలో ఫస్ట్ సెక్రటరీగా వున్నతను 1989లో ఫెర్గానా ప్రాంతంలో తలెత్తిన వర్గకలహాలను అదుపు చేయడంలో విఫలం కావడంతో అతని స్థానంలో యితన్ని వేశారు. సెంట్రల్ కమిటీలో పాలిట్‌బ్యూరోలో 1990 నుండి 91 వరకు పనిచేశాడు. 1990 మార్చిలో ఉజ్బెక్ రిపబ్లిక్‌కు అధ్యక్షుడయ్యాడు. అతనా పదవిలో వుండగానే 1991 ఆగస్టులో మాస్కోలో ఒక కుట్ర జరిగి విఫలమైంది. అదే అదనుగా అది జరిగిన పదిరోజులకు ఉజ్బెకిస్తాన్‌ను స్వతంత్రదేశంగా వ్యవహరిస్తుందని ప్రకటించాడు. అప్పటికే పొరుగున వున్న కిర్గిస్తాన్ అలా ప్రకటించుకుంది.

1991 సెప్టెంబరు 1 నుంచి ఉజ్బెకిస్తాన్ స్వాతంత్ర్యం పొందింది. కమ్యూనిస్టు పార్టీ ఉజ్బెక్ యూనిట్ తన పేరును పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ ఆఫ్ ఉజ్బెకిస్తాన్ (పిడిపి)గా మార్చుకుంది. కరిమోవ్ మూణ్నెళ్లపాటు తాత్కాలిక అధ్యక్షుడిగా వ్యవహరించి డిసెంబరు నెలలో ఎన్నికలు నిర్వహించాడు. అతనికి 86% ఓట్లు రాగా, అతని ప్రత్యర్థి ఎర్క్ పార్టీ చైర్మన్ సలీహాకు 12.3% ఓట్లు వచ్చాయి. ఎన్నికలో, ఓట్ల లెక్కింపులో చాలా మోసాలు జరిగాయని అంతర్జాతీయ సంస్థలు ఎలుగెత్తి చాటాయి. కరిమోవ్ క్రమేపీ అధికారాలన్నీ తన చేతిలోకి తీసుకోవడంతో, అతనికి పార్టీ సహచరుడిగా వున్న మిర్సాడోవ్ ఎదురు తిరిగాడు. అతన్ని అణచడానికి కరిమోవ్ ప్రజా సంస్థ ఐన బిర్లిక్, ఇస్లామిక్ రినైజాన్స్ పార్టీలను దువ్వి మిర్సాడోవ్‌ను అణచాడు. బిర్లిక్ రాజకీయపార్టీగా మారి బలం పుంజుకుందామని చూస్తే అప్పుడు కరిమోన్ రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్‌ను కష్టతరం చేశాడు. దానికి కనీసం 60 వేల మంది సంతకాలుండాలన్నాడు. ఆ సంతకాలు సేకరించడానికి ఒక్క రోజు మాత్రమే గడువు యిచ్చాడు. తీరా సంతకాలు తెస్తే వాటిలో 25 వేల సంతకాలను తిరస్కరించాడు. (గద్వాల్ జిల్లా ఏర్పాటుకై చేసిన సంతకాలను కెసియార్ తిరస్కరించినట్లు..) ఇలా తనను ప్రతిఘటించిన వారిని చంపేస్తూ, జైలుపాలు చేస్తూ, చిత్రహింసలు పెడుతూ 2015లో నాలుగోసారి 90% ఓట్లతో మళ్లీ అధ్యక్షుడిగా నెగ్గాడు. 2002లో యిద్దరు ఖైదీలను సజీవంగా నూనెలో వేసి కాల్పించాడట.

తన వారసురాలిగా తన పెద్దకూతురు గుల్‌నారా కరిమోవాను తీర్చిదిద్దాడు కానీ అంతలోనే ఏం తేడా వచ్చిందో ఏమో, 2014 ఫిబ్రవరి నుంచి గృహనిర్బంధంలో వుంచాడు. ఉజ్బెకిస్తాన్‌లో సహజవనరులు, ఖనిజాలు పుష్కలంగా వున్నాయి. భౌగోళికంగా కూడా చాల కీలకమైన ప్రదేశంలో చైనాను, మధ్య ప్రాచ్యాన్ని కలుపుతూ వుంది. కానీ కరిమోవ్ పరిపాలనలో అవినీతి, అసమర్థత రాజ్యమేలాయి. అతని స్థానంలో దృఢమైన నాయకత్వం రాకపోతే దేశం ఆర్థికంగా బలహీనపడి, అఫ్గనిస్తాన్‌లో బలంగా వున్న ఇస్లామిక్ అతివాదులు యీ దేశంలో చొరబడవచ్చు. కరిమోవ్ అంత్యక్రియలు అతని జన్మస్థలమైన సమర్‌ఖండ్‌లోని రేగిస్థాన్

స్క్వేర్‌లో జరిగాయి. (ఫోటో చూడండి. ఇన్‌సెట్‌లో కరిమోవ్). వాటికి అఫ్గనిస్తాన్, తజికిస్తాన్, టర్క్‌మెనిస్తాన్ వంటి 17 దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. పుతిన్, ఒబామా సంతాప సందేశాలు పంపారు. సెనేట్ స్పీకరైన నిగ్మాతిల్లా తాత్కాలిక అధ్యక్షుడిగా వున్నాడు. ప్రధానిగా వున్న షౌకత్ మిర్జియోయెవ్ అధ్యక్షుడు కావచ్చని కొంతమంది రాస్తూండగా మంత్రుల్లో ఎవరు ఆ పదవి అలంకరించాలో నిర్ణయించేది రుస్తమ్ ఇనోయాటోవ్ అంటున్నారు కొందరు. అతను అందరూ వణికి చచ్చే సెక్యూరిటీ శాఖకు అధిపతి. ఏది ఏమైనా కొత్తగా వచ్చే అధ్యక్షుడు కరిమోవ్ అంతటి నియంత కాకూడదని ఆశిద్దాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 12, 13 **ఎమ్బీయస్ : పవన్ చేస్తున్నదేమిటి?**

శుక్రవారం పవన్ కళ్యాణ్ ఏం చెప్పారో వేరే ఎవరూ చెప్పనక్కరలేదు. ప్రత్యక్ష ప్రసారాల ద్వారా, చర్చల ద్వారా టీవీలు హోరెత్తించాయి. ఇవాళ పేపర్లు ఫుల్ పేజీ కవరేజితో మోతెక్కించాయి. చెప్పినది సరే, యింతకీ ఆయన ఏం చేయబోతున్నాడో మాత్రం నా కర్థం కాలేదు. జనసేన ప్రతినిధి ఒకాయన శుక్రవారం ఉదయం ఓ టీవీ చర్చలోకి ఫోన్ లైన్–యిన్‌లోకి వచ్చి 'మేం కాకినాడ సభలో కార్యాచరణ ప్రకటించబోతున్నాం' అని చెప్పారు. కాకినాడలో సభ జరగబోతుందని తిరుపతిలో ప్రకటించినట్లు మరో చోట యింకో సభ జరగబోతుందని ప్రకటించి, అదే కార్యాచరణ అంటారా, లేక మరేదైనా చెప్తారా అని ఎదురు చూశాను. కార్యాచరణ కాదు కదా, తర్వాతి సభ గురించైనా చెప్పలేదు. ప్రభుత్వవైఖరిని వ్యతిరేకించేవాళ్లు కార్యాచరణ అన్నారంటే నిరసన దీక్షలు, నిరాహార దీక్షలు, ర్యాలీలు, ప్రదర్శనలు, బంద్‌లు, అధమపక్షం చర్చాసదస్సులు వుంటాయి. పవన్ వీటిలో దేన్నీ ప్రకటించకపోవడానికి కారణం ఏమిటి? ఢిల్లీ నుంచి గాని, అమరావతి నుండి గాని ఏదైనా ఒత్తిడి వచ్చిందా? తెలియదు. తెలుసుకునే మార్గమూ లేదు. ఎవరి పాటికి వారు వూహించుకోవాల్సిందే.

కేంద్రం, ఉత్తరాదివారి అహంకారం అంటూ విరుచుకుపడిన పవన్ కేంద్రానికి ప్రతినిధి వెంకయ్య నాయుడు అన్నట్లు ఆయనపై ఉరిమారు. వెంకయ్య నాయుడు ఉత్తరాది వారు కారు. ఇక కేంద్ర కాబినెట్‌లో ఆయన మాట ఏ మేరకు చెల్లుబాటు అవుతుందో తెలుసుకునే దాఖలాలు లేవు. ఈ రోజు దేశంలో అత్యంత శక్తిమంతుడు మోదీయే. ఆయనపై అంకుశం మోపడానికి అవకాశమున్నది బిజెపి పార్టీ ఒక్కదానికే. కానీ దాని అధ్యక్షుడూ మోదీ జేబులో మనిషే. మంత్రివర్గంలో వున్న ఏ సహచరుడూ మోదీతో విభేదించడం మాట అటుంచి, చర్చించేవాడు కూడా లేడంటారు. తన శాఖల్లోని అధికారులను నియమించే వెసులుబాటు కూడా వాళ్లకు లేదుట. ఇందిర హయాంలో ఎలా వుండేదో, సేమ్ టు సేమ్, యిప్పుడలాగే వుందిట. అన్నిటికీ 'ట', 'ట' అని రాయడం దేనికంటె యిలా ఏకపక్షంగా పాలన సాగే రోజుల్లో ఎవరూ బహిరంగంగా పెదవి విప్పరు. మోదీ బలహీనపడ్డాకనే యిలాటివి బయటకు వస్తాయి. మోదీ తలచుకుంటే ప్రత్యేక హోదా కాదు, ప్యాకేజీ కాదు ఏదైనా సరే గంటల్లో గుద్దుకుంటూ వచ్చేసేది. తలచుకోలేదు కాబట్టే ఆంధ్ర యిలా అల్లాడుతోందని అందరికీ తెలుసు. పవన్ ఏదైనా అనదలచుకుంటే మోదీని అనాలి. ఆయనకు గొడుగు పట్టి, పక్కవాయిద్యాలపై దరువేస్తే లాభం ఏముంది? కాంగ్రెసుది వెన్నుపోటు, బిజెపిది పొట్టలో పోటు అన్నపుడు కూడా అది బిజెపి అధ్యక్షుడు అమిత్ షాకు తగులుతుంది తప్ప, మోదీకి నేరుగా తగలదు.

అమరావతి ప్రమేయం గురించి సందేహం ఎందుకంటే 'నాకు టిడిపి ప్రభుత్వంపై గౌరవం వుంది' అంటూ పవన్ చంద్రబాబు చుట్టూ కూడా రక్షణ వలయం కట్టేశారు. కొందరు టిడిపి ఎంపీలను మాత్రం తిట్టారు, వాళ్లు రాష్ట్రప్రభుత్వంలో భాగం కాదనుకున్నారేమో! చంద్రబాబును ఏమీ అనకపోవడం కూడా హేతుబద్ధంగా లేదు. ఎందుకంటే ప్రత్యేక హోదా అనేది మాజీ ప్రధాని యిచ్చిన హామీ, కాంగ్రెసు ముష్టి ఐదేళ్లంది, మేం పదిహేనేళ్లు సాధిస్తాం చూడండి అంటూ చంద్రబాబు ఎన్నికల సభల్లో పదేపదే వాగ్దానం చేశారు. ఏవో మొహమాటాలకు పోయి ఆ హోదాపై యీయన మాట నాన్చితే నష్టం ఎవరికి? ఆయనకు కాదు, రాష్ట్రప్రజలకు! 14 వ ఆర్థిక సంఘం చెప్పింది కాబట్టి... అని జేట్లీ చెపుతూంటే 'మీరు అధికారంలోకి వచ్చిన ఆర్నెల్ల తర్వాత వచ్చిన సంఘం సాకుగా చూపిస్తారేమిటి? అయినా వద్దని అది చెప్పలేదు కదా, చెప్పినా ఆ సిఫార్సు మీరు పట్టించుకోనక్కరలేదు కదా, తక్కిన రాష్ట్రాలకు కొనసాగుతోంది కదా' అని బాబు అడగవద్దా? ఒకసారి హోదా కావాలని, మరోసారి సంజీవని కాదని, యింకోసారి యిస్తే వద్దనన్నని, యిస్తే బాగానే వుంటుంది కానీ, యివ్వకపోతే మనమేం చేస్తాం? అనీ యిలా మాట్లాడుతూంటే యిదెక్కడి అన్యాయం అని పవన్ అడగవద్దా? ' కేంద్రం తానుగా ఇవ్వాల్సింది, కానీ యివ్వకపోయినా సర్దుకుంటాం' అంటే రేపు ప్రజల కూడా కట్టాల్సిన పన్నులు కట్టం, సర్దుకోండి అనవచ్చు. మన నియోజకవర్గ ప్రయోజనాల గురించి పోరాడని ఎమ్మెల్యేనే ఛీత్కరిస్తాం. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడని ముఖ్యమంత్రిని కనీసం నిలదీయవద్దా? కేంద్రమంత్రిగా వుంటూ కూడా విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీలో యిప్పించలేకపోతున్నాడని సంజీవరెడ్డి విగ్రహాన్ని పడగొట్టారు ఆంధ్రులు. ఉక్కు ఫ్యాక్టరీ ఒక ప్రతిపాదన మాత్రమే. దానికే అంత రియాక్షనుంటే మరి యిప్పుడు పార్లమెంటు సాక్షిగా యిచ్చిన హామీకి విలువ లేకుండా చేయడమేమిటని ఆంధ్రుల తరఫున అడగని ముఖ్యమంత్రిని ఏమనాలి?

'అడక్కపోవడమేం, నేను ఢిల్లీ పాతికసార్లు వెళ్లాను' అంటారు చంద్రబాబు. అప్పుడెందుకు వెళ్లారో ఏమో కానీ మొన్న ఏదో జరిగిపోతోంది అని హడావుడి జరిగినప్పుడు వెళ్లవచ్చుగా! పుష్కరాల పిలుపుల కోసం స్పెషల్ విమానాల్లో వెళ్లినాయన ప్రత్యేక

హెూదా మరియు లేదా ప్రత్యేక ప్యాకేజీ గురించి తేల్చే తరుణంలో అక్కడకు వెళ్లద్దా? సుజనా చౌదరి మీద వదిలేయడ మేమిటి? సహాయ మంత్రిగా వున్న ఆయన తన కంటె సీనియర్లయిన జేట్లీనీ, వెంకయ్య నాయుణ్నీ కాదనగలడా? ఇలా అయితే కుదరదంటూ గద్దించగలడా? ఆయన మీద ఆర్థిక నేరాల గురించిన కేసులున్నాయి, అటు జేట్లీ ఆర్థికమంత్రి. తను నిప్పు అంటూ ఆత్మవిశ్వాసం తొణికిసలాడే చంద్రబాబు స్వరం ఆయన అరువు తీసుకోగలడా? బాబే స్వయంగా వెళ్లి "ఇప్పటికే చాలా ఏళ్లగా యివే నాటకాలూ ఆడుతూ వచ్చాం, సుజనా చౌదరి ఏదో తీపి కబురంటూ చెప్పడం, దానికి కంభంపాటి రేపో ఎల్లుండో అంటూ వంత పాడడం, వెంకయ్య నాయుడు మా ప్రతిభే అనడం, అదే అదనుగా మేమేమో 'మేం హెూదాతో బాటు ప్యాకేజీ కూడా తెస్తూ వుంటే యిదిగో యీ కాంగ్రెసు, వైకాపా అడ్డుపడుతున్నాయి' అంటూ వాళ్లమీద నిష్టూరాలు వేయడం, చివరకు మీరు తుస్సుమనిపించడం..! మీరు హిందీలో ఏమంటారో గానీ మా తెలుగులో 'పాడిందే పాటరా పాచిపళ్ల దాసరీ' అంటారు యిలాటి దాన్ని. మేమిక దాసరి వేషం కట్టలేం. మేము జిల్లాకు 350 కోట్లడిగితే ఆ అంకె మాత్రం గుర్తు పెట్టుకుని అది యిచ్చి 7 జిల్లాలకు అదే అన్నారు. ఓ ఎంపీని కొనుక్కోవాలంటే 50 కోట్లు చాలటం లేదు, అలాటిది జిల్లా మొత్తానికి ఏభై అంటే ఏమొస్తుందండీ. పోనీ తెలంగాణ లాగ మేమూ జిల్లాలను విడగొట్టి, ఆ ఏడును పధ్నాలుగు చేస్తే అప్పుడు జిల్లాకు 50 చొప్పున యిస్తారా? లేక 'ఏడు కాదు మీరేం ఏడుపు ఏడిచినా ఆ మూడువందల ఏభైలోనే ఏడవాల'ంటారా? అయినా ఐఐటి, ఐఐఎమ్‌ల కిచ్చినది కూడా మాకు ప్రత్యేకంగా యిచ్చినట్లు చెపితే ఎలాగండి? అన్ని రాష్ట్రాలలోని అలాటి విద్యాసంస్థలకు మీరు యిచ్చేదే కదా! రెవెన్యూ లోటు కూడా మరో 11 రాష్ట్రాలతో బాటు మాకూ చేశారు. పోలవరం సంగతి కూడా విభజన చట్టంలోనే వుంది కదా! దానిలో పరిశీలిస్తానన్న వైజాగ్ రైల్వే జోనైనా విదిలించడానికి ఏం పోయేకాలం? ఒకప్పుడు కేంద్రంలో చక్రం తిప్పిన నాకు యివన్నీ తెలియనివా? మీరు నన్ను మభ్యపెట్టలేరు." అని దబాయించవద్దా? ఎందుకు దబాయించలేదని పవన్ ఆయన్ను దబాయించవద్దా?

"అందాల రాముడు" సినిమాలో అల్లు రామలింగయ్యది తీ(సేసిన) తా(సిల్దారు) పాత్ర. పట్టిసీమలో దిగి తనను కలవడానికి వచ్చిన రైతు మీద విరుచుకుపడతాడు 'ఏవోయ్! సుబ్బులూ – ఎదర గోదారి మేటేసి లంకకట్టి రెండేళ్లయిందని నాకు తెలీదనుకున్నావా – లేపోతే నీబాబు గాడి సొమ్మనుకున్నావా? పొగాకేసుకుని మింగడానికి.." అని. అతను "అమ్మమ్మ, ఎంత మాట బాబూ, తవరికి తెలీకుండా, అజలోకి రాకుండా లంకమీద పొగాకు ఏసుకోడమా? ఏదీ ఏసి చూశాను బాబూ! బావుంటే తవరికి సూపిద్దామని.." అంటూ ఓ పొగాకు బుట్ట అందిస్తూ దాని మధ్యలో లంచం యిస్తాడు. ఇతను చల్లబడి "ఇదిగో నువ్వు బాగుపడటమే నాకు కావాలిసింది. రూలు ప్రకారం మేం అడుగుతాం.. నువ్వు చెబుతావ్ – మేం రాసుకుంటాం.. మిగతావన్నీ యిక అనవసరం.." అంటూ తేల్చేస్తాడు. ఇప్పుడు ఆంధ్రకు ప్రత్యేక హెూదా, ప్యాకేజీ వ్యవహారం కూడా యిలాగే నడుస్తోంది. టిడిపి వాళ్లు ఏదో అడిగేసినట్లు, బిజెపి వాళ్లు యివ్వబోతున్నట్లు, యిప్పటికే చాలా యిచ్చేసినట్లు తెగ నటించేస్తూ వుంటారు. మళ్లీ అంతలోనే వాళ్లేమీ యివ్వలేదని టిడిపి అంటుంది. రూలు ప్రకారం యివ్వాల్సినదానిలో ఎంత యిచ్చారో, యిచ్చిన దానికి లెక్కలు అప్పచెప్పలేదని కేంద్రం చేస్తున్న క్లెయిమ్ ఎంతవరకు కరక్టో, శ్వేతపత్రం విడుదల చేయమంటే చేయరు. పదవీకాలంలో సగకాలం యిలాగే సాగిపోయింది. రాష్ట్రానికి దిక్కూదివాణం వున్నట్టు తోచటం లేదు.

ఇలా నడుస్తూండగానే యీ సారి టూ మచ్ అయిపోయింది. విభజన చట్టంలో వున్నవి కొన్ని విదిల్చి, ఏదో యిచ్చేశామని కేంద్రం పోజు కొట్టడమేమిటి? ఔనౌను అంటూ చంద్రబాబు స్వాగతించడం, ఆంధ్ర బిజెపి లీడర్లు వెంకయ్యనాయుడు, నిర్మలా సీతారామన్, జేట్లీ, మోదీలకు సన్మానం చేయడమేమిటి? అబ్బే మేం చేసిందేముందండి అనకుండా నిస్సిగ్గుగా వాళ్లు చేయించేసుకోవడ మేమిటి? విభజన చట్టప్రకారం యివ్వవలసినది కూడా రెండున్నరేళ్లగా యివ్వకుండా, యిప్పుడు కూడా యిస్తాంలే అని ప్రకటన చేసినంత మాత్రాన సత్కారాలు చేయాలా? అలా అయితే ప్రతి నెలా జీతాలు యిచ్చినప్పుడల్లా ఆ శాఖాధిపతులు కూడా సత్కారాలు చేయించుకోవాలి. హెూదా గురించి గతంలో తాను చెప్పినదంతా మర్చిపోయి, బాబు శాసనమండలిలో 'హెూదా వేస్టు, అది తీసుకున్నవాళ్లెవరూ బాగుపడలేదు' అంటూ ప్రకటించడమేమిటి? హెూదా అంత పనికిమాలినదైతే పొరుగు రాష్ట్రాలు ఆంధ్రను చూసి ఉలిక్కిపడి అడ్డుపడడం దేనికి? బిహార్ కూడా హెూదా అడగడం దేనికి? 'హెూదా వలన పరిశ్రమలకు లాభం కలుగుతుంది, ఉద్యోగాలు వస్తాయి అని గతంలో చెప్పిన విషయం అబద్ధం, మిమ్మల్ని మోసగించాను' అని కూడా బాబు చేర్చేస్తే సరిపోయేది కదా!

ఇవి ఎప్పుడూ చెప్పుకునే విషయాలే, యీసారి స్పెషలేమిటంటే పవన్ కళ్యాణ్ అతిథి పాత్ర. సినిమాల్లో అయితే యిలాటి పాత్రను ఎలా వర్ణించాలి? అడుగుతా, అడుగుతా, లేస్తే మనిషిని కాను అంటుంది, మళ్లీ వెళ్లి పడుక్కుంటుంది (సారీ ధ్యానం చేస్తుంది), ఆర్నెల్లకో, పదినెల్లకో ఓసారి వచ్చి గర్జించి, డైలాగులు కొట్టి మళ్లీ బబ్బుంటుంది. ఇది హీరోయిజం కాదు, హీరోయినిజమూ కాదు (ఎందుకంటే హీరోయిన్ కనబడినపుడు ఆహ్లాదంగా ప్రవర్తిస్తుంది తప్ప హెచ్చరికలు చేయదు), ఐటమ్ గర్లిజమూ కాదు (ఐటమ్ గర్ల్ డైలాగులు కొట్టదు, మాటిమాటికీ రాదు), సీనియర్ నటుడు వేసే అతిథి పాత్రకు కాస్త దగ్గరగా వస్తుంది, ఎందుకంటే వాళ్లు ఉన్న కాస్సేపటిలో తెగ ఓవరాక్షన్ చేస్తారు. సరిగ్గా చెప్పాలంటే ఓ సినిమాలో టీవీలో నేరాలు–ఘోరాలు చెప్పే టీవీ యాంకర్ అప్పుడప్పుడు కనబడి హెచ్చరికలు చేస్తూంటాడు, అలాటి పాత్ర వేస్తున్నారు పవన్. నిజానికి యీయన రాజకీయాల్లోకి వస్తానన్నపుడు నేనెంతో ఆశ పెట్టుకున్నాను, యువతరానికి కదిలించగల సత్తా వున్నవాడని. అప్పటి నా ఆర్టికలు మళ్లీ చదువుకుంటే నాకే సిగ్గేసింది, యింతమందిని చూసి కూడా యితని విషయంలో ఎలా బోల్తా పడ్డానా అని. నిన్న మీటింగులో కూడా చూడండి, జనాలను ఎలా ఉర్రూతలూగించాడో,

అంతా చేసి చివరకు క్లయిమాక్సు లేకుండా చప్పగా ముగించాడు. 'మాట తప్పేవారిని జనమే నిలదీయాలి' అంటాడు. జనం మాట సరే, జనసేన మాటేమిటి? నిలదీయడానికి జనం కుతూహలంగా వున్నారు. కానీ వారికి సరైన నాయకుడేడీ? ప్రజల్లో అసంతృప్తిని ఛానెలైజ్ చేసే సత్తా ప్రతిపక్ష నాయకుడికి కొరవడింది. ఈయన లాటి వాడు మార్గనిర్దేశం చేయాలి. 'బంద్‌కు వ్యతిరేకం కాదు' అంటూనే 'పాల్గొనడం, పాల్గొనకపోవడం మీ యిష్టం' అంటూ అస్పష్టంగా మాట్లాడడమేమిటి? నాయకుడన్నవాడు ఇదీ దారి అని చెప్పాలి.

అసలు పవన్ వ్యవహారమే అనుమానస్పదంగా నడుస్తోంది. రాజధాని భూముల గురించి ఊళ్లల్లో ఒకటి మాట్లాడతాడు, హైదరాబాదు వచ్చి మరోటి మాట్లాడతాడు. ఈ మధ్యే ప్రత్యేక హోదా విషయంలో కేంద్రం ఏమీ చెప్పటం లేదు, అడగడానికి సమయం కోసం ఆగుతున్నానన్నాడు. ఇంకో రెండున్నరేళ్లల్లో సర్కారు దిగిపోయాక అడుగుతాడా అనిపించింది. ఉపన్యాసాల్లో ఎప్పుడో చచ్చిపోయిన కాంగ్రెసును తిడతాడు. ప్రతిపక్షం సరిగ్గా లేదంటాడు. ఉంటే నీ మీటింగుకి అంతమంది ఎందుకు వస్తారు? ప్రజల్లో నిరాశ అలుముకుంది. వాళ్లను ఎవరు గట్టెక్కిస్తారా అని చూస్తున్నారు. నువ్వు ఆశ చూపుతున్నావు. అంతలోనే గందరగోళంగా మాట్లాడతావు. 'ఓట్లు అడగడానికి వచ్చినపుడు అర్థమయ్యే భాషలో, ఎన్నికయ్యాక అర్థంకాని భాషలో మాట్లాడతార'ని యితర నాయకుల గురించి అన్నది పవన్‌కీ వర్తిస్తుంది. హోదా యివ్వం మొర్రో అని అన్ని భాషల్లో కేంద్రనాయకులు చెప్తూ వుంటే 'ఇస్తాం, యివ్వం ఏదో ఒకటి చెప్పండి. ఇవ్వం అని చెబితే, ఏం చేయాలో అది చేస్తాం' అనడంలో అర్థముందా? ఇవ్వమని వాళ్లు కుండ మాటిమాటికీ బద్దలు కొడుతూనే వున్నారు. మీ పాటికి మీరు ఏం చేయాలో అది చేస్తారా? లేదా? చేస్తే ఎప్పుడు చేస్తారు? ఎలా చేస్తారు? దాని గురించి చెప్పకుండా వేదిక దిగిపోతే ఎలా? ఆయన పార్టీకి ఎన్నికల కమిషన్ గుర్తింపు వుంది. కానీ ఎన్నికలలో పోటీ చేయదు. ఆఫీస్ బేరర్స్ ఎవరూ కనబడరు, వినబడరు. అధికార ప్రతినిధి ఎవరూ మాట్లాడరు. ఈయన మాత్రం ఏడాది కోసారి ప్రత్యక్షమై డైలాగులు కొట్టేసి, రాజకీయ తెర వెనక్కి వెళ్లిపోయి, సినిమా తెర ఎక్కేస్తాడు.

అసలు ప్రస్తుతం అధికారంలో వున్నవాళ్లని నిలదీయకుండా గతం తవ్వితే ఏం లాభం? నిన్న మీటింగులో కూడా కొందరు టిడిపి ఎంపీలను తప్ప టిడిపి విధానాన్ని, యిప్పటిదాకా చూపిన అసమర్థతను విమర్శించలేదు. బిజెపిని సమాధి చేశారని ఆంధ్ర బిజెపి నాయకులను తిట్టాడు. చేసుకుంటే చేసుకుంటారు, వాళ్ల పార్టీ వాళ్ల యిష్టం. బిజెపి ఆంధ్ర యూనిట్ మూతపడితే యీయన కెందుకు ఖేదం? ఆయన బిజెపిని తిట్టడమే పెద్ద ఎఫీవ్‌మెంట్‌లా నిన్నంతా టీవీల్లో చర్చలు. తిట్టి ఏం చేశాడన్నది ముఖ్యం. బిజెపి సభలను బహిష్కరించమని పిలుపు నిచ్చాడా? ఆ నాయకుల యిళ్ల వద్దకు వెళ్లి హోదా గురించి శాంతియుత ప్రదర్శనలు చేయమన్నాడా? పోనీ టిడిపి నాయకులకు ఫలానా తారీకులోగా చేయండి, లేకపోతే... అనే అల్టిమేటమ్ యిచ్చాడా? ప్రశ్నిస్తానన్నావ్ ఏం చేశావ్ అని ప్రజలు తనను ప్రశ్నించే సమయం వచ్చేసరికి పవన్ బయటకు వచ్చి నాలుగు ప్రశ్నలేసి యోగధ్యానంలోకి వెళ్లిపోయాడు. తన అసంపూర్తి ప్రణాళికకు యిలాటి స్పందన వస్తుందని పవన్‌కు తెలియదంటే నేను నమ్మను. ఆయన చిన్నప్పటినుంచి రకరకాల పుస్తకాలు చదివే రకమనీ, ఆలోచించే వ్యక్తి అని అందరూ చెప్తున్నారు. చిరంజీవిలో ఒక అమాయకత్వం, తెలియనితనం కనబడుతుంది. ఆయన సినిమా కథలను కూడా నాగుబాబు వినేవారట. పవన్ చిరంజీవి కంటె ఎక్కువ ఆలోచనాపరుడు, మెరుగైన వక్త. చిరంజీవి రాజకీయాల్లో చాలా తప్పటడుగులు వేసినది, అజ్ఞానం చేతనే అనిపిస్తుంది. కానీ పవన్‌కి అన్నీ తెలిసే యీ విధంగా ప్రవర్తిస్తున్నాడని తోస్తుంది. ఆయన కేదో ఎజెండా వుంది. మధ్యమధ్యలో వచ్చి తనపై ఫోకస్ తిప్పుకుని ప్రజల్ని వెర్రిగొఱ్ఱెలను చేయడం అందులో భాగమే. తర్వాతి ఎన్నికల వేళ గొఱ్ఱెల కాపరి అవతారం ఎత్తి యీ గొఱ్ఱెలను ఎటు మళ్లిస్తాడో చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్**
(సెప్టెంబరు 2016)

సెప్టెంబరు 14, 15 **ఎమ్బీయస్ : ప్రత్యేక హోదా అవసరమా?**

ప్రత్యేక హోదా గురించి మాట మారుస్తున్నవారి గురించి నేను రాసినప్పుడల్లా 'ఇలా విమర్శించే బదులు, అసలు ప్రత్యేక హోదా మంచిదో, ప్రత్యేక ప్యాకేజీ మంచిదో వివరంగా చెప్పవచ్చు కదా, దాన్ని ఎలా సాధించాలో చంద్రబాబుగారికి నిర్మాణాత్మక సలహాలు యివ్వవచ్చు కదా' అంటూ నన్ను విమర్శించేవాళ్లు ఎక్కువగా వుంటున్నారు. ఇక్కడ గమనించవలసిన దేమిటంటే – ప్రత్యేక హోదాతో ప్రత్యేక ప్యాకేజీ పోల్చి చూడవలసిన పనే లేదు. అది కాని, యిది కాని యిస్తామని కేంద్రం, తెస్తామని రాష్ట్రం అనలేదు. హోదాతో బాటే ప్యాకేజి అని చెప్తూ వచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాతనే 'హోదా లేదా ప్యాకేజి' అనే సూచనను ప్రజల మెదళ్లలోకి చొప్పించారు. ఇక హోదా ఎలా సాధించాలో నేను చంద్రబాబు గారికి సలహా యివ్వడమేమిటి నా బొంద, ఆయనకు సలహాదారులు లేకనా? నేను రాసిన కొన్ని వ్యాసాలు చదివి కొందరు ఉత్తరాలు రాస్తూంటారు – 'ఇది చంద్రబాబుగారు చదివితే బాగుండును' అని. తమకే చాలా తెలుసు అని ముఖ్యమంత్రులు అనుకుంటూ వుంటారు. కాబినెట్ సహచరులు చెప్పినా వినే పరిస్థితి వుండదు. అలాటిది 'ఫలానా పత్రికలో ఒకాయన వ్యాసంలో మంచి సూచనలు చేశాడండి' అని ఏ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరో చెపితే 'ఏడిశాడు, పత్రికలో ఏదో గిలకడం కాదు, యిక్కడ కొచ్చి ఒక్కరోజు కూర్చుంటే తెలుస్తుంది మా అవస్థలేమిటో' అనుకోవచ్చు. మంత్రులు, ముఖ్యమంత్రుల మాట వదిలేయండి, వాళ్లకు ఆత్మీయంగా వుంటూ సలహాలిద్దామనుకునేవారు కూడా యివన్నీ చదువుతారని

నేననుకోను. మాకు తెలియని విషయమేముంది అనే అహంకారం ఎలాగూ వుంటుంది.

'హెూదా విషయంలో, హుదూద్ సహాయం విషయంలో, వెనుకబడిన జిల్లాల ప్యాకేజీ విషయంలో, రాజధాని నిధుల విషయంలో, రాష్ట్ర ఆర్థిక లోటు భర్తీ విషయంలో బిజెపి రాష్ట్రాన్ని మోసం చేసింది కాబట్టి దానితో పొత్తు వదులుకోండి' అని నేను చెపితే బాబు వింటారా? పొత్తు వదులుకుంటానని బెదిరించగానే మోదీ వణికిపోయి యిచ్చేస్తారా? దశాబ్దాలుగా మిత్ర పక్షాలుగా వున్న శివసేన, అకాలీదళ్‌లనే బిజెపి లెక్క చేయడం లేదు, ఈ మధ్యే కూటమిలోకి వచ్చిన టిడిపి లెక్కేమిటి? వీళ్ల మద్దతు వున్నా లేకపోయినా కేంద్ర ప్రభుత్వం నడుస్తుంది. టిడిపి పొత్తు తెంపుకోగానే వైసిపి నేనున్నానంటూ బిజెపి వద్దకు వెళ్లినా ఆశ్చర్యం లేదు. ఇక అక్కణ్నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయి కాబట్టి రాష్ట్రప్రభుత్వాన్ని రద్దు చేయాలని రోజూ గవర్నరు వద్దకు విన్నపాలు చేసినా అబ్బురం లేదు. అనేక రాష్ట్రాలలో యిది జరిగే తంతే యిది. తమిళనాడులో అయితే చెప్పనే అక్కరలేదు. బెంగాల్‌లో సిపిఎం రాజ్యం చేసే రోజుల్లో తృణమూల్ కేంద్రంతో సఖ్యం చేస్తూ సిపిఎం సర్కారును డిస్మిస్ చేయమని అడుగుతూ వుండేది. మమత ఎన్‌డిఏ తోనూ ఊరేగింది, కాంగ్రెసుతోనూ వూరేగింది. ఏ పార్టీకైనా రాజకీయ అవసరాలే ముఖ్యం తప్ప విధానాలు కాదు, కమ్యూనిస్టులు మా సహజమిత్రులు అంటూ తృతీయ ఫ్రంట్‌కు కన్వీనరుగా వుంటూ చాలా ఏళ్లు బిజెపిని అధికారానికి దూరంగా వుంచిన చంద్రబాబు రాత్రికి రాత్రి ఎన్డీఏ కన్వీనరు అవతారం ఎత్తారు. ఇవాళ ఎన్డీయేలో వున్నారు, రేపు బిజెపి బలహీనపడితే మళ్లీ తృతీయ ఫ్రంట్‌లో లీడరవుతారు.

బిజెపితో వైరం తెచ్చుకున్నా లాభం లేదు కాబట్టి కేంద్రం ఏం యిచ్చినా, యివ్వకపోయినా పడి వుండండి అని కూడా బాబుకు సలహా యివ్వలేం. ఆంధ్రజ్యోతి రాధాకృష్ణగారు మాత్రం యివ్వగలరు. 'బిజెపితో మిత్రబంధానికి బాబు స్వస్తి పలికితే కేంద్ర-రాష్ట్ర సంబంధాలు దెబ్బ తింటాయి. రాష్ట్రానికి కేంద్రం నుంచి సహాయం అందదు. అప్పుడు నష్టపోయేది ఎవరు? ప్రజలు కాదా?' అని తన కాలమ్‌లో రాశారు. ఈయన లాజిక్ ప్రకారం కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం వుంటే రాష్ట్రాలలో కూడా అదే పార్టీ ప్రభుత్వాలు వుండాలి, కనీసం వారి మిత్రపక్షాల ప్రభుత్వాలు వుండాలి. మరి యుపిఏ హయాంలో ఎన్ని రాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వాలున్నాయో గుర్తు చేసుకోండి. మోదీ గుజరాత్‌ను ఏలి పేరు తెచ్చుకున్న కాలంలో కేంద్రంలో ఎన్‌డిఏ మాత్రమే వుందా? ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతో ఘర్షణవైఖరి కొనసాగిస్తూనే తమ పాలన సాగించడం లేదు? పెద్ద రాష్ట్రాలైన యుపి, బిహార్, బెంగాల్, తమిళనాడులలో బిజెపి ప్రభుత్వాలు వున్నాయా? వాటికి నిధులు అందడం మానేశాయా? కేంద్ర-రాష్ట్రాల మధ్య నిధుల పంపిణీ గురించి ఒక ఫార్ములా వుంటుంది. ఆ విధంగా కొన్ని యిచ్చి తీరాల్సిందే. కొన్ని మాత్రం ముఖ్యమంత్రి చాకచక్యం మీద ఆధారపడి వుంటాయి. బతిమాలి తెస్తారా, బెదిరించి తెస్తారా, బెట్టు చేసి తెస్తారా అన్నది ఒక్కొక్కరిది ఒక్కో టెక్నిక్కు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సంగతి చూడండి. మొదటి నుంచి కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్సే. 1977లో కేంద్రంలో జనతా పార్టీ వచ్చినపుడు మన దగ్గర కాంగ్రెసు గెలిచింది. కేంద్రంలో మళ్లీ కాంగ్రెసు వచ్చిన కొన్నాళ్లకే మనం టిడిపిని ఎన్నుకున్నాం. 1989-94 మధ్య రాష్ట్రంలో కాంగ్రెసు అధికారంలోకి వస్తే కేంద్రంలో కాంగ్రెసు ఓడిపోయింది. 1994 లో రాష్ట్రంలో టిడిపి వచ్చేటప్పటికి కేంద్రంలో కాంగ్రెసు ప్రభుత్వం వుండి, కొన్నాళ్లకు తృతీయ ఫ్రంట్ ప్రభుత్వం వచ్చింది. 1999లో రాష్ట్రంలో టిడిపి, కేంద్రంలో దానికి అనుకూలమైన ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చాయి. 2004 నుంచి పదేళ్లపాటు రాష్ట్రంలో, కేంద్రంలో ఒకే పార్టీ ఏలింది. ఇప్పుడు రెండు చోట్లా కాంగ్రెసేతర ప్రభుత్వాలే. అక్కడా, యిక్కడా ఒకే పార్టీ వున్నా, పరస్పర వ్యతిరేక పక్షాలు వున్నా కేంద్రం నుంచి మనకు రావలసినంత రాలేదు. హైదరాబాదు తప్ప తక్కిన జిల్లాలేవీ తగినంతగా అభివృద్ధి చెందలేదు.

'రాష్ట్రం నిత్యం, కేంద్రం మిథ్య' అని హుంకరించిన ఎన్టీయార్ నెలకొల్పిన పార్టీకే రాధాకృష్ణ కేంద్రంతో సఖ్యంగా వుండకపోతే సహాయం అందదు అంటూ హెచ్చరించడం ఎంత విచిత్రం! బిహార్ ప్రజల్ని చూడండి, బిజెపిని గెలిపించకపోతే, కేంద్రం నుంచి సహాయం రాదు అని బెదిరించినా వాళ్లేమీ బెదరలేదు. ఢిల్లీ వాళ్లూ బెదరలేదు. రోజూ తర్జనితో కేంద్రాన్ని హెచ్చరిస్తూ వచ్చిన ఎన్టీయార్‌ను మళ్లీమళ్లీ గెలిపించారు తెలుగుజనం. గాల్లో డబ్బుల మూట వూపితే ప్రజలు బుట్టలో పడతారనుకోవడం అవివేకం. మామూలుగా యివ్వాల్సిన చెల్లింపులకు కూడా ప్రత్యేక ప్యాకేజీ, నిధుల వెల్లువ వంటి పేరు పెట్టి ఎన్నాళ్లు మోసగించగలరు? పక్క రాష్ట్రానికి ఎంత యిచ్చారు? వారితో పోలిస్తే మాకు ఎంత ఎక్కువ యిచ్చారు? అని ప్రజలు లెక్కలు వేసుకోలేరా?

ఇక ప్రత్యేక హెూదా సంగతికి వద్దాం. అది పేరుకు మాత్రమే ప్రత్యేకం, దానివలన బాగుపడినవారు లేరు అని బాబు యీ మధ్య మరీమరీ చెపుతున్నారు. ప్రత్యేక హెూదా వున్న రాష్ట్రాలు బాగు పడ్డాయా లేదా, దానివలన కలిగే ప్రత్యేక ప్రయోజనాలేమిటి అన్న విషయం గురించి "సాక్షి" బోల్డు గణాంకాలు యిస్తోంది. గతంలో హెూదా వలన ఆంధ్ర రాష్ట్రం రూపురేఖలు మారిపోతాయని కాన్వాస్ చేసే రోజుల్లో "ఈనాడు", "ఆంధ్రజ్యోతి" కూడా చాలా యిచ్చాయి. గ్రేట్ ఆంధ్రాలోనే 'పవన్‌కి ఆ ఆలోచన ఉందా' (http://telugu.greatandhra.com/politics/political-news/pawan-kalyan-ki-aa-alochana-vunda-74271.html) అనే ఆర్టికల్ కింద కామెంట్స్‌లో నాంచారయ్య నాయుడు ఒక పాఠకుడు రాసిన కామెంట్స్ చూడండి. ఆయన చేసిన వ్యాఖ్యలు కటువుగా అనిపిస్తాయనిపిస్తే డైరక్టుగా జిడిపి స్టాటిస్టిక్స్ లింకుకి (https://knoema.com/atlas/India/ranks/GDP-growth?baseRegion=IN-UT) వెళ్లిపోండి. హెూదా యిచ్చిన రాష్ట్రాల జిడిపి పెరిగిందో లేదో తెలుస్తుంది. ఆయనే శ్రీధర్ అనే ఆయన ఫేస్‌బుక్ లింకు కూడా (https:https://www.facebook.com/sridhar.avuthu/posts/10210609424622160)

యిచ్చారు. అక్కడ చాలా వివరాలున్నాయి. ఓపికున్నవాళ్లు విపులంగా చదువుకోవచ్చు.

అంత ఎకడమిక్ స్టడీ బోరు అనుకునేవాళ్ల కోసం కొన్ని సింపుల్ లాజిక్కులు చెప్తాను. ప్రత్యేక హోదా వలన లాభం లేదని టిడిపితో బాటు స్వరం మార్చిన ఆంధ్రజ్యోతిలో రాధాకృష్ణ తన వాదనకు వూతంగా 'హోదా వున్న 11 రాష్ట్రాలలో ఏడు రాష్ట్రాలలో నిరుద్యోగుల శాతం పెరిగింది' అంటూ గణాంకాలు యిచ్చారు. పోల్చడానికి అదొక్క పెరామీటరే దొరికిందా? అభివృద్ధి గురించి మాట్లాడినపుడు జిడిపి హెచ్చుతగ్గుల గురించి చెప్పాలి. ముఖ్యంగా హోదాకు, పరిశ్రమల రాకకు లింకు కాబట్టి హోదా వచ్చాక పరిశ్రమలు, ఉద్యోగాలు, రాష్ట్ర ఆదాయం పెరిగాయా లేదా అన్నది పోల్చి చెప్పాలి. నిరుద్యోగుల శాతం మాట కొస్తే గత పదిపదిహేనేళ్లలో హైదరాబాదులో కూడా పెరిగే వుంటుంది. అంతమాత్రం చేత అభివృద్ధి జరగలేదని చెప్పగలమా? ఉద్యోగార్థులు పెరిగినకొద్దీ నిరుద్యోగుల శాతం పెరిగి తీరుతుంది. ఇంకోమాట, అభివృద్ధి చెందడానికి హోదాతో బాటు యితర అంశాలు అనేకం కలిసిరావాలి. సముద్రతీరం వున్న రాష్ట్రాలన్నీ గుజరాత్‌తో సమానంగా లాభపడలేదు. ఈశాన్య రాష్ట్రాలలో విద్రోహ కార్యకలాపాలు, శాంతిభద్రతలే ప్రధాన సమస్య. ఆంధ్రలో అది లేదు కదా! పైగా అవి పర్వతప్రాంతాలు. రాకపోకలు కష్టం. ఆంధ్రకున్న కనెక్టివిటీ వాటి కెక్కడ వుంది? అవి బాగుపడలేదు కాదు, కాబట్టి మనమూ బాగుపడం అనడం సరి కాదు.

నాకు తెలిసే చాలామంది తెలుగు పారిశ్రామికవేత్తలు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో పరిశ్రమలు పెట్టారు. అవేమీ పొరుగున లేవు. హోదా వల్ల వచ్చే రాయితీలు లేకపోతే అంతదూరం వెళ్లేవారు కారు. రాష్ట్రం విడిపోయినప్పుడు కూడా ఆంధ్రకు వచ్చే హోదాల వలన ఏం లాభం వుంటుందో చూసి యిండస్ట్రీని అక్కడకు మార్చడమో, అనుబంధంగా మరోటి పెట్టడమో చేద్దామని కొంతకాలం వేచి చూశారు. హోదా లేదనడంతో ఎక్కడివాళ్లు అక్కడే వుండిపోయారు. వెంకయ్య నాయుడు తన యింటర్వ్యూలో "నేను రాజ్యసభలో ఆంధ్రకు హోదా గురించి అడిగి సాధించగానే మర్నాడు బిహార్, అసాం లోని మా పార్టీ నాయకులే కాక బెంగాల్, ఒడిశా, యుపికి చెందిన అనేకమంది నేతలు లేచి నానా గొడవ చేసి తమకు కూడా ప్రత్యేక హోదా యివ్వాలని అడిగారు" అని చెప్పారు. అంతేకాదు, "పక్క రాష్ట్రాలకు హోదా యివ్వొద్దని తమిళనాడు సిఎం జయలలిత చెప్పారు. మీరు హోదా యిస్తే పొరుగు రాష్ట్రాల నుంచి పెట్టుబడులు తరలిపోతాయని కేంద్ర ఆర్థికమంత్రిగా పనిచేసిన వీరప్ప మొయిలీ పార్లమెంటులోనే మాట్లాడారు." అని కూడా చెప్పారు. 'ఇదంతా 14 వ ఫైనాన్స్ కమిషన్ రిపోర్టు వచ్చేముందు, యిప్పుడు పరిస్థితి మారిపోయాక హోదా అన్నది అజాగళస్తనమే' అనుకుందామన్నా మొన్న కెవిపి ప్రయివేటు బిల్లు పెట్టగానే మరో 9 రాష్ట్రాల నుంచి డిమాండ్ వచ్చింది. అంతెందుకు, యిప్పుడున్న హోదా తీసేస్తున్నాం అని ఉన్న రాష్ట్రాలకు చెప్పమనండి చూదాం, అమ్మయ్య వదిలిపోయింది అంటారో, కుదరదు అంటారో చూస్తే తెలిసిపోతుంది. హోదా శుద్ధ వేస్టు వ్యవహారమే అయితే యిన్ని రాష్ట్రాలు, యింతమంది అనుభవజ్ఞులైన నాయకులు ఎందుకిలా మాట్లాడతారు చెప్పండి. వారెవ్వరికి చంద్రబాబుకున్న విజ్ఞత లేదా?

హోదా గురించి రాజ్యసభలో తను ఎంతగా పట్టుబట్టానో వెంకయ్యనాయుడు పదేపదే చెప్తున్నారు. ఒప్పుకున్నాం. మేం అడుగుతున్నది కాంగ్రెసు అధికారంలో వుండగా మీరు డిమాండు చేయడం గురించి కాదు, తమరు అధికారంలోకి వచ్చాక ఏం చేశారు? అని. దానికి ఆయన 'కాంగ్రెసు చట్టంలో పెట్టి వుంటే..' అనడం తప్ప సరైన సమాధానం చెప్పరు. 'వాళ్ల సంగతి వదిలేయండి, మీరెందుకు పెట్టరు?' అని అడిగితే దానికి ఆయన సమాధానమేమిటో తెలుసా? "...చట్టంలో పెట్టాలనుకుంటే అప్పుడు వీరప్ప మొయిలీ చెప్పిందే జరుగుతుంది. ఎన్డీసీ (నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) ముందుకు వెళితే, వారంతా వ్యతిరేకిస్తూ తమ డిమాండ్లను ముందుకు తీసుకొస్తే నవ్వులపాలవుతాం." అని. మరి యిదే కారణం చేత కాంగ్రెసు పెట్టలేదు అని అర్థమవుతోంది కదా. కాంగ్రెసు పెట్టి వుంటే.. అని దీర్ఘాలు తీయడం దేనికి, పెట్టి వుంటే ఆంధ్రలో శూన్యస్థితికి వచ్చేది కాదు కదా. చట్టంలో వున్నది చేయడంలో గొప్పేముంది? వాళ్ల లోపాన్ని మీరు సరిదిద్దుతేనే మీకు గౌరవం దక్కుతుంది.

రాధాకృష్ణగారు తన వ్యాసంలో 'ప్రత్యేక హోదా పొందడానికి కావలసిన అర్హతలలో ఏ ఒక్కటీ ఏపికి లేకపోయినా వెంకయ్యనాయుడు ఏపికి ప్రత్యేక హోదా కావాలని కోరడం, అందుకు స్పందించిన మన్మోహన్ సింగ్ 'ఇస్తున్నాం పొమ్మనడం'లోనే వంచన వుంది.' అని స్పష్టంగా రాశారు. అంటే వెంకయ్యనాయుడు వంచకుడనేగా. ఆయన 2014 ఎన్నికల్లో ప్రచారం చేస్తూ 'ఐదేళ్లు కాదు, 15 ఏళ్లపాటు హోదా' అని అదరగొడుతున్నపుడు ఈ ముక్క రాధాకృష్ణ గారు రాసి వుంటే ఎంతో బాగుండేది. రాశారా? అందరూ కలిసి హోదా వస్తుంది, ఆంధ్రుల జీవితాల్లో వెలుగులే వెలుగులు అని వూదరగొట్టారు. ఇప్పుడు అదే వ్యాసంలో 'హోదా రాకపోతే ఏపీ సర్వనాశనం అవుతుందని ప్రజలు గుండెలు బాదుకునేలా చేశారు' అంటూ ప్రతిపక్షాలను తప్పుపడుతున్నారు. అసలు ప్రత్యేక హోదా గురించి ఆంధ్రుల్లో అవగాహన కల్పించినది వెంకయ్యనాయుడే, హోదా యిస్తున్నాం కాబట్టి విభజన వలన కలిగే నష్టాలు పూరిస్తున్నాం అంటూ ఎన్నికల ప్రచారాల్లో, అధికారంలోకి వచ్చిన కొత్త రోజుల్లో చెప్పుకున్నదీ వారే. అదే పల్లవి ఎత్తుకుని చరణాలు సమకూర్చి టిడిపి యింకా ముందుకు తీసుకెళ్లింది. 'హోదా వలన రాయితీలు, బాబు వంటి అనుభవజ్ఞుడైన నేత సారథ్యం రెండూ డెడ్లీ కాంబినేషన్, ఇక ఆంధ్రను అందుకోగలిగేవారే వుండరు' అని హోరెత్తించారు. మీడియా కూడా వంత పాడింది. ఆంధ్ర ప్రజలు నమ్మారు. అందుకే హోదా అనేది సెంటిమెంటు అయిపోయింది. దాన్ని సాఫ్ట్ పెడల్ చేద్దామన్నా, రివర్సు చేద్దామన్నా అంత యీజీ కాదు. కెవిపి ప్రయివేటు బిల్లు పెట్టినపుడు బిజెపి ఆడిన నాటకం చూస్తేనే మండిపోయింది. 'ఇంత డ్రామా అవసరమా, పోనీ లాభం వుందో లేదో, ఉత్తుత్తిదే అయినా హోదా యిచ్చాం పొండి అనేస్తే వీళ్ల సొమ్మేం పోయింది' అనిపించింది.

చివరగా చెప్పాలంటే – ప్రత్యేక హోదా వలన పరిశ్రమలు వస్తాయి, ఉద్యోగాలు పెరుగుతాయి. ప్రజలు బాగుపడతారు. ప్యాకేజి అనగానే రాజకీయనాయకులకు, కాంట్రాక్టర్లకు పండగ. అది కూడా ఏ మేరకు జరుగుతుందో తెలియదు. ఎందుకంటే ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం ఓ 10% విదల్చడం (బజెట్‌లో కేటాయింపులు చూస్తే యిది బాగా అర్థమవుతుంది), దానికి లెక్కలు అడగడం, ఆంధ్ర ప్రభుత్వం లెక్కలు పంపలేక తబ్బిబ్బు పడడం, దాంతో తక్కిన నిధులు ఆగిపోవడం జరుగుతోంది. బాబు హయాంలో ఆంధ్ర బాగుపడడం బిజెపికి, ముఖ్యంగా మోదీకి యిష్టం లేదని స్పష్టంగా తెలుస్తోంది. ఎందుకు అనేది మనక్కూడా సులభంగా అర్థమయ్యే రీతిలో రాజకీయాలుండవు. మరి ఆంధ్రుల ఆగ్రహాన్ని బిజెపి ఎలా ఎదుర్కుంటుంది, బిజెపి కేంద్రనాయకత్వం చేజేతులా ఆంధ్ర యూనిట్‌ను నాశనం చేసుకుంటుందా అనే ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం రానున్న రోజులే చెపుతాయి. ఒకటి మాత్రం మనం గుర్తించాలి. బిజెపి రాజకీయ అవసరాల కోణంలో చూస్తే రాజస్థాన్, ఎంపీ, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రం కాదు ఆంధ్ర. కనీసం పొరుగున వున్న ఒడిశా, తెలంగాణ వంటిది కూడా కాదు. ఆంధ్రలో స్టేక్స్ చాలా తక్కువ. ఇప్పుడు ఆంధ్ర బిజెపిలో వున్నవారిలో తొలి నుంచీ ఆరెస్సెస్, బిజెపి రక్తం లేదు. కాంగ్రెసు, టిడిపిల నుంచి గోడదూకి వచ్చినవారే. కేంద్ర నాయకత్వాన్ని నిలదీయగల సత్తా ఎవరికీ లేదు. విస్తృతమైన రాజకీయ అవసరాల వ్యూహంలో భాగంగా బిజెపి ఆంధ్రను నిర్లక్ష్యం చేయవలసి వస్తే చేయనూ వచ్చు – నష్టపోయేది తక్కువే కాబట్టి! **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 16, 17 వీక్లీకై ఎమ్బీయస్ : పాక్‌లో భారత్ వలసదారుల పార్టీ

1947లో దేశవిభజన జరిగినప్పుడు పశ్చిమ (ప్రస్తుత) పాకిస్తాన్ నుంచి అనేక మంది హిందూ పంజాబీలు, సింధీలు మన దేశంలోకి శరణార్థులుగా వచ్చారని మనకు తెలుసు. లాహోర్ నగరం నుంచి తరిమివేయబడిన పంజాబీలు ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, జమ్మూలతో బాటు దేశంలోని అనేక ప్రదేశాలలో స్థిరపడి ఆటోమొబైల్ వంటి కొన్ని రంగాలలో ఆధిక్యత సాధించి వ్యాపారస్తులుగా, నిలదొక్కుకున్నారని తెలుసు. సింధ్ ప్రాంతంలోని మహా నగరాలైన కరాచీ, హైదరాబాదులలో ఆస్తులు వదులుకుని కాందిశీకులుగా వచ్చిన సింధీలు బొంబాయి, గుజరాత్‌లతో బాటు అనేక నగరాలలో అనేక చిన్న వూళ్లల్లో కూడా వ్యాపారస్తులుగా స్థిరపడి శ్రమతో పైకి వచ్చారు. కరాచీ స్వీట్సు, కరాచీ బేకరీలు, కరాచీ స్టోర్సు వంటివి తెలుగు నాట చిన్న వూళ్లల్లో కూడా కనబడతాయి. మరి పాకిస్తాన్‌కు వెళ్లిన భారతీయ ముస్లిముల మాటేమిటి? సరిహద్దు ప్రాంతాల్లో ముస్లిములైతే ప్రాణాలు అరచేత పట్టుకుని పాకిస్తాన్ చేరారు. కానీ యుపి, బిహార్ వంటి దేశమధ్యంలో వున్న రాష్ట్రాల నుంచి పాకిస్తాన్ అంటే ముస్లిముల స్వర్గధామం అనుకుంటూ కొందరు భారతీయ ముస్లిముల వెళ్లారు. వాళ్ల సంగతేమైందో తెలుసుకోవాలనే కుతూహలం కలగడం సహజం. వాళ్లని పాక్‌లో 'ముహాజిర్' (మహాజిర్, మొహాజిర్ అని కూడా అంటారు, వలసదారుడు అని అర్థం) అంటారు. వాళ్లు ఎక్కువగా పాక్ అప్పటి రాజధాని, మహా నగరమూ ఐన కరాచీలో స్థిరపడ్డారు. వారి పక్షాన కొన్నాళ్లకు ఒక పార్టీ వెలిసింది. ఎమ్‌క్యూఎమ్ అని. దాని స్థాపకుడు అల్తాఫ్ హుస్సేన్ ప్రస్తుతం చావుబతుకుల్లో వుండి వార్తల్లో వ్యక్తి అయ్యాడు. అతని జీవితాన్ని పరామర్శించే క్రమంలో యీ ముహాజిర్ల కథ కూడా కాస్త తెలుస్తుంది.

కరాచీ ప్రాచీన కాలం నుంచీ, అంటే అలెగ్జాండరు కంటె ముందు నుంచి, గొప్ప నగరం. ఓడరేవు వున్న వ్యాపార, కూడలి. పాక్‌కు రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రాజధాని. అభివృద్ధి అంతా దాని చుట్టూనే జరుగుతోందని గమనించి స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దంన్నరకు రాజధానిని కరాచీకి దూరంగా ఇస్లామాబాద్‌లో పెట్టారు. ఇక హైదరాబాదు కూడా సింధు నదీతీరాన వుండడం చేత వ్యాపారానికి, పరిశ్రమలకు వాసి కెక్కింది. అలాటి నగరాలకు యీ ముహాజిర్లు ఎక్కువగా చేరారు. స్థానికులు సింధీ మాట్లాడగా వీరు ఉర్దూ మాట్లాడేవారు. వీళ్లంతా జిన్నాకు, లియాకత్ ఆలీ ఖాన్‌కు సన్నిహితులు. స్వతహాగా ఆస్తిపరులు, విద్యావంతులు, ఉన్నత పదవుల్లో పనిచేసి వచ్చినవారు, కాందిశీకుల్లా సర్వం పోగొట్టుకుని వచ్చినవారు కారు. కరాచీ ఆధునిక జీవనం, విద్య, నైపుణ్యం, సంస్కృతికి నిలయంగా వుండడంతో అక్కడ త్వరగా యిమిడిపోగలిగారు. అదే రాజధాని కూడా కావడంతో ప్రభుత్వాన్ని నడిపే ఉద్యోగవర్గాల్లో చొరబడిపోయారు. ప్రయివేటు ఉద్యోగాలలో మేనేజర్లు కూడా వారే. వాటికి తోడు చిన్నా, పెద్దా వ్యాపారాలు కూడా వారి చేతిలోనే! పారిశ్రామికీకరణ పెరుగుతూంటే కార్మిక నాయకులుగా కూడా వారే! జనాభా ప్రకారం చూస్తే వీరి సంఖ్య 8% మాత్రమే అయినా ఎక్కడ చూసినా వీరి అధిక్యతే కనబడడంతో స్థానికులు గోలపెట్టారు. "పాకిస్తాన్ ఏర్పడడానికి మేం చేసిన త్యాగాలే కారణం. హిందువుల మధ్య వుంటూ, వారితో పోట్లాడుతూ సాధించి పెట్టాం. మీరైతే వున్న చోటే వున్నారు." అని వీరు వాదించేవారు. అప్పటి పశ్చిమ పాకిస్తాన్‌లో పంజాబీలు 55% మంది వుండేవారు కానీ వారిలో అధికాంశం గ్రామీణ ప్రాంతాల వారే. ఈ ముహాజిర్ల కున్న నైపుణ్యం వారికి లేదు. వారు వీరిని చూసి అసూయపడేవారు. వారి ప్రాధాన్యత తగ్గించాలని గోల పెట్టేవారు.

మొత్తానికి రాజధానిని కరాచీ నుంచి ఇస్లామాబాద్‌కు 1966 లో తరలించారు. దాదాపు అదే సమయంలో పరిశ్రమలు పెరుగుతున్న కరాచీకి పంజాబీలు, ఫక్తూన్లు తరలి రాసాగారు. ప్రభుత్వం స్థానికంగా వున్న సింధీలకు కాలేజీ ఎడ్మిషన్లలో, ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లు యివ్వసాగింది. వీటివలన తమ ఆధిక్యానికి గండి పడుతోందని, రిజర్వేషన్ల వలన తాము నష్టపోతున్నామని యిప్పటిదాకా

ఆధిక్యంలో వున్న ముహాజిర్లు వ్యథ చెందారు. ఆ వ్యథకు ఒక స్పష్టమైన రూపం యిచ్చి, కార్యాచరణకు ప్రోత్సహించినవాడు అల్తాఫ్ హుస్సేన్. 63 ఏళ్ల క్రితం కరాచీలో పుట్టిన అల్తాఫ్ ఆగ్రా నుంచి తరలి వచ్చిన ముస్లిం కుటుంబానికి చెందినవాడు. కరాచీ యూనివర్శిటీలో చదువుతూండగా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా "ఆల్ పాకిస్తాన్ ముహాజిర్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్" అని తన 25వ ఏట 1978లో ఒక సంస్థ పెట్టి ముహాజిర్ల హక్కుల కోసం పోరాడాడు. మరో ఆరేళ్లు పోయేసరికి దాన్ని రాజకీయ పక్షంగా మార్చాడు. ముహాజిర్ క్వామీ మూవ్‌మెంట్ (ఎంక్యూఎమ్) పేర పార్టీ పెట్టి ఎన్నికలలో పోటీ చేయసాగాడు. 1997 వచ్చేసరికి ముహాజిర్ అంటే బొత్తిగా వాళ్లకోసమే అని తెలిసిపోతుందని ఎంక్యూఎమ్ పేరులో ఎం అంటే ముహాజిర్ కాదు, ముత్తహిదా (ఐక్య) అని ప్రకటించాడు. ఏం పేరు పెట్టుకున్నా ఆ పార్టీ ప్రభావం కరాచీకి, హైదరాబాదుకి పరిమితమైంది. సింధు ప్రాంతంలో స్థానిక సింధీల హక్కుల కోసం భుట్టో 1967లో స్థాపించిన పిపిపి (పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ) అతి పెద్దది కాగా, రెండో స్థానం వీళ్లదే. దేశంలో చూసుకుంటే మొన్నటిదాకా దేశంలో మూడో పెద్ద పార్టీ కానీ ప్రస్తుతానికి నాలుగో పెద్ద పార్టీ.

అన్నిటి కంటె పెద్దది, పంజాబ్ కంచుకోటగా గల పాకిస్తాన్ ముస్లిం లీగ్ (నవాజ్). వీళ్లది రైటిస్టు, కన్సర్వేటివ్ పార్టీ. పాకిస్తాన్ ముస్లిం లీగ్ 1988లో జియా మరణం తర్వాత ముక్కలు కాగా నవాజ్ షరీఫ్ నాయకత్వంలోని వర్గం 'పిఎంఎల్-ఎన్' పేరుతో రాజకీయాల్లో కొనసాగుతోంది. పంజాబ్‌తో బాటు బలోచ్‌స్తాన్ వంటి యితర ప్రాంతాల్లోను బలం వుండడం చేత 2013 ఎన్నికలలో దానికి 33% ఓట్లు వచ్చాయి. రెండో స్థానంలో వున్న పిపిపి సోషలిస్టు భావాలు గల పార్టీగా చెప్పుకుంటుంది. కానీ భుట్టో, అతని అల్లుడు జర్దారీ కుటుంబాల కనుసన్నల్లోనే నడుస్తుంది. దక్షిణ సింధులో, ఆక్రమిత కశ్మీరులో అధికారంలో వుంది. 2013లో 15% ఓట్లు తెచ్చుకుంది. మూడో పార్టీ మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ 1996లో స్థాపించిన పాకిస్తాన్ తెహరీక్-ఎ-ఇన్సాఫ్. ఇది సెంట్రిస్టు, సెక్యులర్ పార్టీ. విద్య, వైద్యం, ఉద్యోగవకాశాలు కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే అంటాడు. ఈ పార్టీకి 2013 ఎన్నికలలో 10% ఓట్లు వచ్చాయి. ఇక నాలుగో స్థానంలో వున్న ఎంక్యూఎమ్‌కి 5.4% ఓట్లు వచ్చాయి. తన పరిమితబలంతోనే ఎంక్యూఎమ్ 1988-90, 1990-92, 2002-2007, 2008-13 లలో నడిచిన సంకీర్ణ ప్రభుత్వాలలో భాగస్వామిగా వుంది. ప్రస్తుతం కరాచీ, హైదరాబాదు మేయర్లు యీ పార్టీవారే. ఇతర స్థానిక సంస్థల్లో కూడా వారిదే బలం.

పార్టీ సంగతి యిలా వున్నా పార్టీ వ్యవస్థాపకుడు అల్తాఫ్ మాత్రం పాతికేళ్లగా లండన్‌లో ప్రవాసిగా వుంటున్నాడు. ఎందుంటే అతని హింసా రాజకీయాలు అలా వుంటాయి. కరాచీని గుప్పిట్లో వుంచుకోవడానికై తన అనుచరుల చేత అరాచకాలు చేయించడానికి అతను వెనుకాడడు. 'మా అనుమతి లేనిదే యిక్కడ ఆకు కూడా అల్లాడదు' అని అతను చెప్పుకుంటాడు. లండన్ నుంచి ఒక్క ఫోను కొడితే చాలు అతని అనుచరులు నగరజీవనాన్ని స్తంభింపచేస్తారు. హింసను ప్రేరేపిస్తూ అల్తాఫ్ యిచ్చే ప్రసంగం టేపును అన్ని టీవీ ఛానెళ్లు ప్రదర్శించాల్సిందే, లేకపోతే వాటి ఆఫీసులు ధ్వంసం! అసలైన ఫాసిస్టు సేన అంటే వాళ్లదే. ఎదిరించినవాళ్లను భయకంపితులను చేస్తూన్నా ముహాజిర్ మూలాలున్న కార్మికులు, మధ్యతరగతి వారు, ఉన్నతవర్గాల వారూ ఆ పార్టీకి అండగా నిలిచారు. ఓట్ల వర్షాన్ని కురిపించారు. అది చూసి ప్రభుత్వం అల్తాఫ్‌పై చర్య తీసుకోవడానికి జంకింది. ఆ అలుసు తీసుకుని ప్రత్యర్థులను హత్య చేయడం, బెదిరించి డబ్బు లాగడం వంటివి మరీ తీవ్రం చేశాడతను. ఇక ప్రభుత్వం కేసులు మోపక తప్పలేదు. వాటిని తప్పించుకోవడానికి అతను లండన్ పారిపోయి రాజకీయ ఆశ్రయం కోరితే బ్రిటన్ ప్రభుత్వం 1992లో అనుమతి యిచ్చింది. అక్కడ వుంటూనే పర్వేజ్ ముషారఫ్‌తో పొత్తు పెట్టుకుని 1999-2007 మధ్య ఆర్థికంగా, రాజకీయంగా బలపడ్డాడు.

కానీ కరాచీకి దూరంగా వుండడం చేత, అనారోగ్యం పాలు కావడం చేత అనేక తప్పుడు నిర్ణయాలు తీసుకుని ముజాహిర్లను విముఖుల్ని చేసుకున్నాడు. చాలాకాలంగా అపస్మారక స్థితిలో వుంటూ రావడం వలన మతిమాలిన నిర్ణయాలు తీసుకుని పార్టీని నష్టపరచాడని కొందరి అనుమానం. 2007 మేలో చీఫ్ జస్టిస్‌ను మళ్లీ నియమించాలంటూ లాయర్లు ఉద్యమించినపుడు వాళ్లకు కరాచీవాసులు అండగా నిలిచారు. అండగా నిలిచినవారిని అల్తాఫ్ మూకుమ్మడిగా హత్యలు చేయించాడు. దాన్ని ముజాహిర్లు సైతం అసహ్యించుకున్నారు. తన నిర్ణయాలను ప్రశ్నించిన పార్టీ అనుచరులను కూడా చంపించాడు. వాళ్లల్లో చాలామంది ఊళ్లు విడిచి పారిపోయారు. వీటికి తోడు అతనిపై పాకిస్తాన్‌లోను, బ్రిటన్‌లోను చాలా కేసులున్నాయి. తనకు కుడిభుజంగా వున్న ఇమ్రాన్ ఫారూఖ్‌ను చంపించాడన్న అభియోగాన్ని లండన్ పోలీసులు విచారిస్తున్నారు. విద్వేషపూరిత ప్రసంగం చేసినందుకు 2013లో కేసు పెట్టి అరెస్టు చేశారు. అదే సమయంలో అతని యింట్లో మిలియన్ పౌండ్ల అక్రమధనం దొరికింది. 2014లో మనీ లాండరింగు (బ్లాక్ మనీని వైట్‌గా చేసే ప్రయత్నం) కేసూ పెట్టారు. అతని పార్టీకే చెందిన కరాచీ మేయరు, హైదరాబాదు మేయర్లు కూడా టెర్రరిజం కేసుల్లో యిరుక్కున్నారు. ఇదంతా రాజకీయ కక్షతో చేస్తున్నారని ఆరోపిస్తూ ఎంక్యూఎం పార్టీ ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేశారు.

కొద్దికాలంగా అల్తాఫ్ చావుబతుకుల్లో వున్నాడని కొందరు, అబ్బే చచ్చిపోయాడని, అతని స్థానంలో అదే పోలికలతో యింకోణ్ని కూర్చోబెట్టి, పాత వీడియో రికార్డులనే కొత్తగా విడుదల చేస్తున్నారని కొందరూ అనడంతో పార్టీ కార్యకర్తలు గందరగోళంలో పడ్డారు. తమపై కేసుల వలన ఉక్కిరిబిక్కిరైన ప్రథమశ్రేణి పార్టీ నాయకులు తప్పుకున్నారు. ద్వితీయశ్రేణి వారు వారి స్థానాల్లోకి వచ్చారు. మగవాళ్లపై దేశద్రోహం కేసులు వుండడం చేత సంస్థాగత వ్యవహారాలను మహిళలు చక్కబెడుతున్నారు. రాబోయే ఉపయెన్నికలను ఎలా ఎదుర్కోవాలో ఎవరికీ తెలియలేదు. గతంలోలా డబ్బు పుట్టడం లేదు, కార్యకర్తలూ ముందుకు రావటం లేదు. ఈ ఏడాది మే

నెలలో పార్టీ ఆవిర్భావోత్సవం జరిగే వేళ అదీ పరిస్థితి. ఆ సమయంలో కరాచీలోని జిన్నా గ్రౌండ్స్‌లో పెద్ద బహిరంగ సభ పెట్టారు. ఎంక్యూఎం డిప్యూటీ కన్వీనరు ఫరూఖ్ సత్తార్ ప్రసంగిస్తూండగా సడన్‌గా దీపాలు ఆరిపోయాయి. వెనక్కాల తెరపై లండన్‌లోని పార్టీ హెడాఫీస్ నుంచి లైవ్ రిలే వచ్చింది. పార్టీ నాయకులందరూ వున్న హాల్లోకి అల్తాఫ్ వచ్చాడు, అందర్నీ కౌగలించుకున్నాడు. కరాచీ అభిమానులను ఉద్దేశించి 'నేను చచ్చిపోయానని పుకార్లు వచ్చాయి. నా ఆరోగ్యం ఫస్ట్‌క్లాస్‌గా వుందని చెప్పలేను కానీ బతికే వున్నాను, మీతో మాట్లాడుతున్నాను.' అని ప్రసంగించాడు. అంతే కార్యకర్తల్లో ఉత్సాహం మిన్ను ముట్టింది. ఉపయెన్నికలలో పార్టీ విజయం సాధించింది.

అయిదు నెలల క్రితం అల్తాఫ్ పై చూపిన ఆ గుడ్‌విల్ యిప్పుడు లుప్తమై పోయింది. ఇటీవలి కాలంలో అల్తాఫ్ ఆరోగ్యం బాగా దెబ్బ తిందని వార్తలు రావడంతో కొందరు ధైర్యం చేసి వెనక్కి వచ్చి అల్తాఫ్‌కు వ్యతిరేకంగా మాట్లాడసాగారు. లండన్‌లోని ఎంక్యూఎం హెడాఫీసు భారతీయ గూఢచారి వ్యవస్థతో కలిసి పని చేస్తోందని పాక్ సైన్యం నమ్మి, ప్రచారం చేయడంతో అల్తాఫ్ 'రా' (ఇండియన్ గూఢచారి సంస్థ) ఏజంటని, హంతకుడని, దేశద్రోహి అని అనసాగారు. దీనికి తోడు ఆగస్టు 22న ప్రసంగిస్తూ అల్తాఫ్ పాక్ ప్రభుత్వ టెర్రరిస్టు అని, ప్రజా వ్యతిరేకి అని నిందించి, పాకిస్తాన్ వ్యతిరేక నినాదాలు చేశాడు. కొన్ని టీవీ స్టేషన్లపై దాడి చేయమని అనుచరులకు పిలుపు నిచ్చాడు. వాళ్లు దాడి చేశారు కూడా. ప్రభుత్వం పార్టీ కరాచీ ఆఫీసుపై దాడి చేసి మూసేసింది. నాయకుల యిళ్లు సోదా చేయసాగింది. బాధిత కార్యకర్తలు పాకిస్తాన్ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందుకు అల్తాఫ్‌కు ఎదురు తిరిగారు. 'దేశద్రోహి అల్తాఫ్‌కు మీరంతా ఎదురు తిరిగి, మీ పార్టీ రాజ్యాంగాన్ని సవరించి, అతని వీటో అధికారాన్ని తీసేయాలి' అంటూ జాతీయ స్థాయిలో సాధారణ ప్రజలు ఎంక్యూఎమ్‌పై ఒత్తిడి తెస్తున్నారు. వాళ్ల పార్టీ జండాలపై అల్తాఫ్ పేరు వున్న భాగాన్ని కత్తిరించేస్తున్నారు. ఫరూఖ్ సత్తార్ తమ పార్టీ పేరు సవరించి చివర్లో పాకిస్తాన్ (ఎంక్యూఎమ్-పి) చేర్చి తమ పాక్‌భక్తిని చాటుకోవాలని చూస్తున్నాడు. ఆ పార్టీకి అల్తాఫ్ ఒక గుదిబండలా తోస్తున్నాడు. తమ పార్టీ వ్యవస్థాపకుడికి, తమకు యికపై సంబంధం లేదని చూపించుకోవడానికి ఫారూఖ్ ప్రయత్నిస్తున్నా అల్తాఫ్ ముద్ర లేని ఎంక్యూఎం మనగలుగుతుందా లేదా అన్నది వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 18, 19 ఎమ్బీయస్ : స్నోడెన్‌కు ఆశ్రయం యిచ్చిన సామాన్యులు

"రోమన్ హాలీడే" సినిమాలో హీరోయిన్ బ్రిటన్ యువరాణి. రోమ్‌కు అధికార పర్యటనపై వస్తుంది. తనను పలకరించడానికి వచ్చిన వందలాది అతిథులను పలకరించడాలు, రాచరికపు కట్టుబాట్లు, వీటితో విసుగుపుట్టి, అస్వస్థురాలవుతుంది. నిద్ర పట్టకపోతే వైద్యుడు వచ్చి మత్తు యింజక్షన్ యిచ్చి వెళతాడు. మత్తు ఆవహించగా ఆమె అర్ధరాత్రి నైట్‌డ్రస్‌తో తనకిచ్చిన రాజప్రాసాదం నుండి బయటకు వచ్చి వీధుల్లో తిరుగుతూ ఓ చోటకి వచ్చి తూలుతూ వుంటుంది. అమెరికన్ పత్రికకు రోమ్‌లో రిపోర్టరుగా పనిచేసే హీరో ఆమెను చూసి ఎవరో అమ్మాయి మందు కొట్టి వీధిలో పడింది అనుకుని అయ్యోపాపమని తనతో పాటు టాక్సీ ఎక్కించి, తన ఫ్లాటు దగ్గర తను దిగిపోయి, ఆ అమ్మాయిని యింటి దగ్గర దింపేయమని టాక్సీవాడికి డబ్బివ్వబోతాడు. అతను నేను తీసుకెళ్లను, యిక్కడే దింపేసి పోతానని గొడవ చేస్తాడు. గత్యంతరం లేని హీరో ఆమెను తన ఫ్లాటుకి తీసుకుని వస్తాడు. ఆమె మత్తులో ఏదేదో వాగుతుంది. ఇతని మంచమెక్కి పడుక్కుంటుంది. ఇదెక్కడి తద్దినంరా అని తిట్టుకుంటూనే ఆ రాత్రికి ఆశ్రయం యిస్తాడు, తెల్లారగానే తరిమివేద్దామనుకుంటాడు. పొద్దున్న లేచి పేపరు కొనుక్కుని వచ్చి చూస్తే ఫ్రంట్ పేజీలో బ్రిటన్ యువరాణి ఫోటోలుంటాయి. ఎక్కడో చూసినట్లుందే అనుకుంటూ తన పక్క మీద నిద్ర పోతున్న అమ్మాయికేసి చూస్తే అదే మొహం! ఉలిక్కిపడతాడు....

వానెస్సా రాడెల్ అనే ఆమె 42 ఏళ్ల ఫిలిప్పైన్ వనిత. రాజకీయ ఆశ్రయం కోరుతూ హాంగ్‌కాంగ్‌లో నివసిస్తున్న 11 వేల మంది శరణార్థుల్లో ఆమె ఒకతె. వాళ్లు తమ దేశంలో పనిచేయడానికి హాంగ్‌కాంగ్ ప్రభుత్వం అనుమతించదు కానీ నెలనెలా కొంత స్టయిపెండు యిస్తూంటుంది. అది వారి ఖర్చులకు సరిపోదు. హాంగ్‌కాంగ్‌లో అతి పేద లొకాలిటీలలో అతి చిన్న ఎపార్టుమెంటు బ్లాకులలో నివసిస్తూ బతుకు బండిని నెట్టుకొస్తూ వుంటారు. తమ కెలాగైనా ఆశ్రయం కల్పించి వర్క్ పెర్మిట్ యిప్పించమని ప్రభుత్వానికి అర్జీలు పెట్టుకోవడానికి లాయర్లను పెట్టుకుంటూ వుంటారు. ఈ రాడెల్‌కు లాయర్లు రాబర్ట్ టిబ్బో, జోనాథన్ మ్యాన్. 2013 జూన్‌లో ఓ రోజు ఆమె తలుపు చప్పుడైంది. తెరిచి చూస్తే వాళ్లిద్దరితో బాటు యింకో 30 ఏళ్ల కుర్రాడున్నాడు. 'ఇతను మీ యింట్లో కొన్ని రోజులు దాక్కుంటాడు. సాయం చెయ్యి' అని లాయర్లడిగారు. ఆ అబ్బాయి పేరు కూడా చెప్పారు కానీ ఆమెకు అది తలకెక్కలేదు. చూడబోతే అమెరికన్‌లా వున్నాడు. లాయర్లు అడిగాక కాదనడం ఎలా? సరే, లోపలకి రమ్మనమంది. ఆ రాత్రి అతను ఆమె బెడ్‌రూములో పడుకున్నాడు. ఏడాది వయసున్న తన కూతురితో ఆమె మిగిలిన మరో గదిలో పడుకుంది. పగలైనా, రాత్రయినా అతను కంప్యూటరు మీద పని చేసుకుంటూన్నట్లు గమనించింది. మనకెందుకులే అనుకుంది. మర్నాడు పొద్దున్న అతను "ద సౌత్

చైనా మార్నింగ్ పోస్టు" పేపరు తెచ్చిపెట్టగలరా?" అని అడిగాడు. హాంగ్‌కాంగ్‌లో ప్రముఖ ఆంగ్ల దినపత్రిక అది. బయటకు వెళ్లి పేపరు కొంది. ఫ్రంట్ పేజీలోనే అతని ఫోటో. అతనెవరో, అతను చేసిన ఘనకార్యమేమిటో, ప్రపంచంలో కల్లా శక్తివంతమైన అమెరికా ప్రభుత్వం అతని కోసం ఎలా వెతుకుతోందో దానిలో రాసి వుంది. "ఓ మై గాడ్, అన్‌బిలీవబుల్, ఇంత మోస్ట్ వాంటెడ్ మాన్ మా యింట్లోనా? నా చేతి తిండి తింటూనా!?" అనుకుంది ఆమె తన భాషలో.

ఇంగ్లీషులో అండర్‌గ్రౌండ్ వెళ్లాడంటారు, తెలుగులో అజ్ఞాతవాసంలో గడిపాడంటారు. తెలుగుపదమే సరైన పరిస్థితిని సూచిస్తుంది. అ–జ్ఞాతం – తెలియబడకుండా గడపడం! కమ్యూనిస్టులను వేటాడే రోజుల నాటి సంగతి గుర్తు చేసుకుంటూ ఒకాయన చెప్పారు – అది ఏడెనిమిది వాటాలున్న పెద్ద యిల్లట. పెద్ద పెరడు, నుయ్యి, నూతి దగ్గర ఆడవాళ్లు బట్టలు ఉతుక్కోవడం, మగవాళ్లు స్నానాలు చేయడం, పెరట్లో నానారకాల మొక్కలు, ఆ పక్కనే మల్లె పందిరి.. యిలాటి యింట్లో యీయన ఒక వాటాలో అద్దె కుండేవారు. వాళ్ల పక్కింటి వాటాలో ఉండే ఆయన ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. పలకరించినా ముభావంగా వుండేవాడు. ఇంట్లో ఆయన గొంతూ వినబడేది కాదు. ఎప్పుడు చూసినా మల్లె పందిరి కింద కూర్చుని చేతిలో ఓ పుస్తకం పెట్టుకుని చదువుకుంటూ వుండేవాడు. పొద్దస్తమానం ఆయన పెరట్లోనే అలా కూర్చుంటే నూతి దగ్గర మసలే ఆడవాళ్లకు చికాగ్గా వుండేది. అలా అని ఆయన ఎవరికేసీ చూసేవాడు కాదు. 'వెళ్లి యిది పద్ధతి కాదని చెప్పండి' అని వీళ్లావిడ పోరితే 'పెద్దమనిషిలా వున్నాడు, ఏమని ఫిర్యాదు చేయమంటావు?' అని యీయన అనేవాడట. ఆయన పేరూ, వూరూ కూడా తెలియదు. కొన్ని నెలలు యిలా గడిచాక ఆయన వాటా ఖాళీ చేసి వెళ్లిపోయాక తెలిసిందట – ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లోంచి తప్పించుకుని పారిపోయిన ప్రఖ్యాత కమ్యూనిస్టు నాయకుడు మహీధర రామమోహనరావుగారి ("రథచక్రాలు") తమ్ముడు జగన్మోహనరావు అని. ఆయనా కమ్యూనిస్టే, అరెస్టు వారంటుంది, ఎవరి దృష్టిలో పడకుండా అలా అజ్ఞాతంగా గడుపుతున్నాడు అని. జగన్మోహనరావు గారు 'విశ్వసాహిత్యమాల' అనే సంస్థ పెట్టి అనేక రష్యన్ నవలలు అనువాదం చేసి, తమ్ముడు కృష్ణమోహనరావు ("అవంతీ ప్రెస్") అచ్చాఫీసులో దొంగతనంగా అచ్చువేసి పంపిణీ చేసేవారు.

మనం తెలుసుకోదగిన దేమిటంటే చట్టం నుంచి తప్పించుకుని తిరిగేవారు గొయ్యి తవ్వుకుని దాక్కోరు, సినిమాల్లో చూపించినట్లు మారువేషాల్లో తిరగరు. సామాన్యుల్లా, మనలో కలిసిపోయి తిరుగుతారు. అంతేకాదు, కొంతకాలానికి నిషేధం ఎత్తివేశాక, కేసులు కొట్టివేశాక వాళ్లు బహిరంగంగా తిరిగినా, అజ్ఞాతవాస కాలంలో తమకు ఆశ్రయం యిచ్చినవారి ఆనుపానులు చెప్పి యిబ్బందుల్లోకి నెట్టరు. ఎమర్జన్సీ రోజుల్లో జైలుపాలై అనారోగ్యంతో మరణించిన స్నేహలతా రెడ్డి ఉదంతం గుర్తు తెచ్చుకోండి. కెవి రెడ్డి గారి "జయంతి ఫిల్మ్స్" భాగస్వామిగా తెలుగు సినిమాల నిర్మాతగా, కవిగా వన్నె కెక్కిన పట్టాభిగారి భార్య స్నేహలత. ఇద్దరూ కలిసి గిరీశ్ కర్నాడ్‌తో "సంస్కార" తీసి కొత్త తరహా సినిమాలకు బాట వేశారు. ఎమర్జన్సీలో జార్జి ఫెర్నాండెజ్‌పై కేసు పెట్టి అతని కోసం చాలా తీవ్రంగా గాలించారు, వెంటాడారు, వేటాడారు. అతనికి డిఎంకె ప్రభుత్వం తమిళనాడులో ఆశ్రయం యిచ్చింది. ఇందిర అక్కడ రాష్ట్రపతి పాలన విధించడంతో ఫెర్నాండెజ్ కర్ణాటక పారిపోయి, సాటి సోషలిస్టు అయిన స్నేహలత ఆశ్రయం కోరాడు. ఆమె యిచ్చింది. కొద్ది రోజులుండి వేరే చోటకి వెళ్లిపోయాడు. కానీ స్నేహలత యింట్లో వున్నాడన్న సంగతి తెలిసి పోలీసులు ఆమెను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. పట్టాభి పలుకుబడి, వాళ్ల కూతురు నందిని నిరసన ప్రదర్శనలు ఏవీ పని చేయలేదు. చివరకు ఆమె ఆరోగ్యం పూర్తిగా ధ్వంసమయ్యాక విడిచి పెట్టారు. జైలు నుంచి బయటకు వస్తూనే ఆమె చనిపోయింది. అందువలన చట్టం నుంచి పారిపోతున్నవారికి ఆశ్రయం యిచ్చేవారు అప్పుడే కాదు, తర్వాత కూడా యిక్కట్ల పాలవుతారు.

అది తెలిసి కూడా ఫిలిప్పీన్ వనిత రాడెల్ స్నోడెన్‌ను తన యింట్లో వుండనిచ్చింది. ఎడ్వర్డ్ స్నోడెన్ అప్పటికే అమెరికన్ ప్రభుత్వానికి చెందిన నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ (ఎన్ఎస్ఏ) రహస్యాలను, బ్రిటన్ జిసిఎచ్‌క్యూ రహస్యాలను బయటపెట్టి అమెరికా ప్రభుత్వాగ్రహానికి గురయ్యాడు. అతను కంప్యూటర్ స్పెషలిస్టు. డెల్‌లో పనిచేశాడు. అమెరికన్ గూఢచారి సంస్థ సిఐఏకు కూడా పనిచేశాడు. అవన్నీ చూసి ఎన్ఎస్ఏ కంప్యూటరు పనులు కాంట్రాక్టు తీసుకున్న హామిల్టన్ అనే అతను 2013లో అతన్ని ఉద్యోగంలోకి తీసుకున్నాడు. టెలికమ్యూనికేషన్ కంపెనీల, యూరోప్‌లో ప్రభుత్వాల సహకారంతో ఎన్ఎస్ఏ ప్రపంచదేశాలన్నిటిపై ఎలా నిఘా వేస్తోందో తెలియడంతో స్నోడెన్ నిర్ఘాంతపోయాడు. ఇక్కడ ఘోరం జరగబోతోంది అని ముందే చెప్పేసే విజిల్ బ్లోయర్ (పారాహుషారీ)లా యీ రహస్యాలను లోకానికి వెల్లడించాలని నిశ్చయించుకున్నాడు. అలా చేసిన వాళ్లను అమెరికన్ ప్రభుత్వం 30 ఏళ్లకు తగ్గకుండా జైలులో పెడుతుందని, లేకపోతే చంపించివేస్తుందని, మరో విజిల్‌బ్లోయర్ సంవత్సరాలుగా ఏకాంతశిక్ష (సోలిటరీ కన్‌ఫైన్‌మెంట్) అనుభవిస్తున్నాడని తెలుసు.

అన్నిటికి సిద్ధపడే అమెరికన్ గడ్డను 2013 మే మూడోవారంలో వదిలిపెట్టి హాంగ్‌కాంగ్ చేరాడు. అక్కడ మీరా అనే ఫైవ్‌స్టార్

హోటల్లో వుంటూ "గార్డియన్", "వాషింగ్టన్ పోస్టు" పత్రికలకు చెందిన యిద్దరు జర్నలిస్టులను పిలిచి వారికి అన్ని వివరాలతో బాటు సాక్ష్యాధారాలు కూడా అందించాడు. వారు జూన్‌లో తమ కథనాలను అచ్చు వేయగానే తీవ్ర సంచలనం చెలరేగింది. "డెర్ స్పయిగెల్", "న్యూయార్క్ టైమ్స్" యింకా లోతుగా పరిశోధించి మరిన్ని కథనాలు వేశాయి. జూన్ 21 న అమెరికా ప్రభుత్వం స్నోడెన్‌పై గూఢచర్యం చట్టం, ప్రభుత్వ ఆస్తి చౌర్యం చట్టాల కింద కేసులు పెట్టింది. పట్టుకోవాలని విశ్వప్రయత్నం చేసింది. అమెరికా నుంచి తప్పించుకోవాలంటే దానికి శత్రువైన రష్యాలో ఆశ్రయం కోరడమే శరణ్యం అనుకున్నాడు స్నోడెన్. జూన్ 23 కల్లా రష్యా చేరాడు. రష్యా ఒక ఏడాది ఆశ్రయం యిస్తానంది. తర్వాత దాన్ని పొడిగిస్తూ పోయింది. ఇప్పటికీ మాస్కోలోనే వున్నాడు. రష్యా అంతా పర్యటిస్తున్నాడు. హాంగ్‌కాంగ్‌లో హోటల్లో నుంచి మాయమయ్యాక రష్యాకు చేరే లోపున అతను ఎక్కడ వున్నాడో ఎవరికీ తెలియదు.

స్నోడెన్‌పై ల్యూక్ హార్డింగ్ రాసిన "ద స్నోడెన్ ఫైల్స్", అనటోలీ కుచెరెనా రాసిన "టైమ్ ఆఫ్ ఆక్టోపస్" పుస్తకాల ఆధారంగా ఆలివర్ స్టోన్ అనే అతను స్నోడెన్‌పై ఇంగ్లీషు, జర్మన్ భాషల్లో పొలిటికల్ థ్రిల్లర్ సినిమా తీయడానికి నిశ్చయించుకున్నాడు. అతను స్నోడెన్ గురించి సమస్త వివరాలు కావాలని పట్టుబట్టాడు, ముఖ్యంగా అతను అజ్ఞాతంలోకి ఎలా వెళ్లిపోయాడో, అప్పుడేం జరిగిందో చెప్పాలన్నాడు. అజ్ఞాతంలో వున్నవారి వివరాలు బయటపెడితే తర్వాత వారికి చిక్కులు వస్తాయని స్నోడెన్ లాయర్లు భయపడ్డారు. చివరకు వారిని సంప్రదించి వివరాలు బయటపెట్టడానికే నిశ్చయించుకున్నారు. ఆ సినిమా ఎల్లుండి శుక్రవారం అమెరికాలో, ఆ పై గురువారం జర్మనీలో రిలీజు కాబోతోంది. ఆ తర్వాత స్నోడెన్, డైరక్టరు స్టోన్ వీడియో లింకు ద్వారా ప్రేక్షకులతో చర్చలో పాల్గొంటారు. సినిమా ప్రజాదరణ పొందిందంటే స్నోడెన్ పట్ల అమెరికన్లకు సానుభూతి కలిగినట్లే. ఇదే అదనుగా పదవి విడిచి వెళ్లేలోగా తనకు క్షమాభిక్ష పెట్టమని అతను ఒబామాను కోరుతున్నాడు. అతని కుటుంబం అమెరికాలో వుంది, అప్పుడప్పుడు రష్యా వచ్చి అతన్ని కలుస్తోంది. అయినా అతను అమెరికాకు తిరిగి వద్దామనుకుంటున్నాడు. "నా చర్యల వలన ఎంతో నష్టం నివారింపబడి, అమెరికాలోని సామాన్య పౌరుడికి లాభం కలిగిందన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుని నన్ను క్షమించండి. నేను నేను బయటపెట్టిన విషయాల వలన 2013కు, యిప్పటికి మధ్య చట్టాలు కూడా మార్చారు. పాత చట్టాల ప్రకారం పెట్టిన ఆ కేసులు ఎత్తివేయండి." అని అతను అడుగుతున్నాడు. ఒబామా లాయరుగా వుండే రోజుల్లో యిలాటి స్వేచ్ఛ కోసం వాదించినవాడే. కానీ స్నోడెన్ చైనా గూఢచారి అని, రష్యా గూఢచారి అని కొన్ని వర్గాల్లో ప్రచారం జరుగుతున్న యీ రోజుల్లో ఎంతవరకు సాయపడతాడో తెలియదు. అతని మాజీ అటార్నీ జనరల్ మాత్రం స్నోడెన్‌ను క్షమించాలని అంటున్నాడు.

ఎలాగోలా తనపై కేసులు ఎత్తివేస్తారని, అందువలన తనకు ఆశ్రయం యిచ్చినవారికి ముప్పు కలగదని స్నోడెన్, అతని లాయర్లు అనుకున్నారు కాబోలు, సినిమా డైరక్టరుకి ఆనాటి వివరాలు చెప్పేశారు. జరిగిందేమిటంటే – జర్నలిస్టులతో మాట్లాడాక స్నోడెన్‌ను టిబ్బో, మ్యాన్‌లు హాంగ్‌కాంగ్‌లోని యుఎన్ ఆఫీసుకి తీసుకెళ్లారు. అక్కడ అతను శరణార్థి హోదాకై అప్లయి చేశాడు. అది వస్తే అమెరికా అతన్ని పట్టుకుని పోలేదు. ఆ హోదా వచ్చాకనే అతను రష్యా పారిపోగలడు. అప్పటిదాకా ఎక్కడ దాక్కోవాలి? లాయర్లు అతన్ని ఏదైనా గొడౌన్‌లో దాచుదామా అనుకున్నారు. కానీ తన క్లయింట్లయిన శరణార్థుల సాయం అడుగుదామని టిబ్బోకు ఐడియా వచ్చింది. స్నోడెన్ వంటి హై ప్రొఫైల్ మనిషి అలాటి దిక్కుమాలిన యిళ్లల్లో వుంటాడని అమెరికా, హాంగ్‌కాంగ్ పోలీసులు వూహించలేరని అంచనా వేశాడు. అదే జరిగింది. మొదట శ్రీలంక నుంచి వచ్చి హాంగ్‌కాంగ్ ఆశ్రయం కోరుతున్న సుపున్ కెల్లాపతా, నదీకాల యింటికి తీసుకెళ్లారు. అక్కణ్నుంచి రాడెల్ యింటికి. మళ్లీ అక్కణ్నుంచి మరో శ్రీలంక శరణార్థి అజిత్ పుష్పకుమారా వద్దకు వెళ్లారు. వీరెవరూ లాయర్ల మాట కాదనలేదు. అమ్మో, నాకు భయం, మా యింట్లో కుదరదు అనలేదు. అలాటి ధీమంతులు సినిమా కారణంగా వివరాలు బయటకు వచ్చి యిక్కట్లపాలవుతారన్న శంక స్నోడెన్‌కు కూడా వుంది. వాటిలోంచి బయట పడాలంటే డబ్బు కావాలి. గతంలోనే వాళ్లకు అతను తలా వెయ్యేసి అమెరికన్ డాలర్లు పంపి వున్నాడు. ఇప్పుడు వారిని ఆదుకోమని తన సమర్థకులకు పిలుపు నిచ్చాడు. వారి స్పందన ఎలా వుంటుందో చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 20, 21 **ఎమ్బీయస్ : బాబాయ్–అబ్బాయ్.. ఆపై అమర్**

యుపిలో పెద్ద పార్టీ ఐన సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)లో పుట్టిన ముసలానికి యివాళ సాయంత్రం ములాయం తెర దించడానికి రాజీ ఫార్ములా సూచించినట్లు తాజా వార్త. దీనిలో వున్న ముగ్గురు ముఖ్యపాత్రలు పైన శీర్షికలోనే వచ్చేశారు. అఖిలేశ్ ఎలాటి గడ్డుపరిస్థితుల్లో యుపి ప్రభుత్వం నడుపుతున్నాడో 'సగం తాపీ– సగం ఆదుర్దా' అనే (లింకు..)లో వివరించాను. ఏడు నెలల్లో ఎసెంబ్లీ ఎన్నికలున్నాయి. తన తండ్రి గతంలో పాలించినట్లే పాలిస్తే ఓటమి ఖాయం అని తెలిసిన అఖిలేశ్ తన మార్గంలో వెళదామని చూస్తున్నాడు. దానికి ఆదరణ కూడా రాసాగింది. అది ములాయం సోదరులకు నచ్చలేదు. ఎందుకంటే వాళ్లు ములాయం తరహా ఆటవిక పాలనకే అలవాటు పడ్డారు. ఎలాగోలా కులబలంతో, కండబలంతో ఎన్నికలు నెగ్గాలి తప్ప అభివృద్ధి, ఆనపకాయ అంటే ప్రజల తలకెక్కదని వారి ఉద్దేశం. ములాయం మళ్లీ సిఎం అయి వుంటే వారికి హాయిగా వుండేది. కానీ అఖిలేశ్‌కు యువతలో వున్న పాప్యులారిటీ చూసి ములాయం ఆఖరి నిమిషంలో కొడుక్కి గద్దె అప్పచెప్పాడు. నిజానికి ములాయంకు అక్షరాలా వారసుడు తమ్ముడు శివపాల్. ములాయం

ఢిల్లీలో చక్రం తిప్పుతూ వుంటే అతని నియోజకవర్గంలో క్యాడర్‌ను కాపాడుకునే పనులన్నీ శివపాలే చూస్తాడు. అతనివి పాత తరహా రాజకీయాలు కాబట్టి సామాన్య ప్రజలు, పార్టీ కార్యకర్తలు అతని వద్దకే వెళతారు. అఖిలేశ్ ముఖ్యమంత్రి, సెక్యూరిటీ ఎక్కువ. పైగా ఎంత హిందీలో మాట్లాడినా విద్యావంతుడు, నాగరికుడు, హింసా రాజకీయాలను నిరసిస్తాడు, తనపై అవినీతి మచ్చరాకుండా చూసుకుందామని తాపత్రయపడతాడు. అందువలన వాళ్లకు అతను పరాయివాడిగా అనిపిస్తాడు.

తనకు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టనందుకు శివపాల్ అలిగితే, ములాయం అతనికి ముఖ్యమైన మంత్రిత్వ శాఖలన్నీ యిచ్చి ఊరుకోబెట్టాడు. అఖిలేశ్ మంత్రివర్గంలోని చాలా శాఖలు అతని అనుయాయులతోనే నింపాడు. వీళ్లందరూ కలిసి అఖిలేశ్‌కు కాలుచేతులు ఆడకుండా చేశారు. చేసేదేమీలేక అఖిలేశ్ అలాగే కాలక్షేపం చేసుకుంటూ వచ్చాడు కానీ 2014 పార్లమెంటు ఎన్నికల ఫలితాలతో అతని కళ్లు విచ్చుకున్నాయి. ఇక మిగిలిన సగకాలం కాస్త అభివృద్ధి చూపించి పేరు తెచ్చుకుందామనుకున్నాడు. అవినీతిని, అరాచకాన్ని క్షమించనని ప్రజలకు చూపాలని కంకణం కట్టుకున్నాడు. శివపాల్ తదితరులు అఖిలేశ్‌కు అడ్డుకట్ట వేయడానికి తమ పాతమిత్రుడు అమర్ సింగ్‌ను పార్టీలోకి మళ్లీ లాక్కుని వచ్చారు. ములాయంతో సహా అందర్నీ తిట్టి, బయటకు వెళ్లి నానారకాల ప్రయోగాలు చేసి, ఫెయిలయి, ఆరేళ్ల తర్వాత తిరిగి వచ్చిన అమర్ అంటే అఖిలేశ్‌కు పడదు. పార్టీలోకి తీసుకోవద్దని చెప్పాడు, కానీ ములాయం వినలేదు. పైగా మే నెలలో అతన్ని రాజ్యసభ సభ్యుణ్ని చేశాడు. జూన్ నెలలో ముఖ్తార్ అన్సారీ నేతృత్వంలోని 'క్వామీ ఏక్తా దళ్' అనే పార్టీని, తూర్పు యుపిలో ముస్లిం ఓట్లు పడతాయనే కారణం చూపి ఎస్పీలో విలీనం చేద్దామని శివపాల్ ప్రయత్నించాడు, ములాయం, ఆజం ఖాన్ ఔనన్నారు. కానీ నేరచరిత్ర వున్నవాళ్లు చాలామంది వున్న పార్టీని చేర్చుకోవడం కంటె బూత్ లెవెల్లో మన పార్టీ వాళ్లే కష్టపడితే మంచిదంటూ విలీనాన్ని అఖిలేశ్ అడ్డుకున్నాడు. రాబోయే ఎన్నికలలో టిక్కెట్లు యిచ్చే అధికారం తన దగ్గర పెట్టుకుని రికార్డు కాస్త బాగున్నవాళ్లకి యిద్దామని ఉద్దేశపడుతున్నాడు. అదే శివలాల్ యిత్యాది ములాయం హార్డ్‌కోర్ అనుచరులకు కంటగింపు అయింది.

పార్టీలోకి వచ్చాక కొద్దికాలమైనా అణగి వుండే వుద్దేశం అమర్‌కు లేదు. ఆగస్టు 10న ఢిల్లీలో పెద్ద పార్టీ యిచ్చాడు. దాన్ని అఖిలేశ్ ఎగ్గొట్టాడు. అఖిలేశ్‌కు యిష్టం లేదని తెలిసి కూడా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా వున్న దీపక్ సింఘాల్ హాజరయ్యాడు. అసలతన్ని చీఫ్ సెక్రటరీ చేయడమే అఖిలేశ్‌కు యిష్టం లేదు. ఎందుకంటే యిరిగేషన్ సెక్రటరీగా పనిచేసే రోజుల్లో అతను శివపాల్‌కు ఆప్తుడు. అతనే యితన్ని.జులైలో అఖిలేశ్‌పై రుద్దాడు. ఈ పదవిలోకి వచ్చాక కూడా దీపక్ శివపాల్ అడుగుజాడల్లోనే నడుస్తున్నాడు తప్ప అఖిలేశ్‌ను లెక్క చేయడం లేదనడానికి యిది తాజా ఉదాహరణ. అఖిలేశ్ మండిపడ్డాడు, ఆగస్టు 13న దీపక్ సింగ్‌ను పదవిలోకి వచ్చిన రెండు నెలలు పూర్తి కాకుండానే బదిలీ చేశాడు.

ఇది తనకు జరిగిన అవమానంగా భావించాడు శివపాల్. అన్నగారి దగ్గరకు వెళ్లి యిలా అయితే తన అనుచరులకు రాబోయే ఎన్నికలలో టిక్కెట్లు యిప్పించుకోవడం అసాధ్యంగా అనిపిస్తోందని ఫిర్యాదు చేశాడు. అయితే అఖిలేశ్ స్థానంలో పార్టీ యుపి శాఖకు అధ్యక్షుడిగా నిన్నే వేస్తున్నాను, టిక్కెట్ల పంపిణీ నీ యిష్టం అన్నాడు ములాయం. శివపాల్ అధ్యక్షపదవి ప్రకటనను ములాయం కజిన్, అఖిలేశ్ పక్షపాతి ఐన రాంగోపాల్ యాదవ్ చేత చేయించారు. 'పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నువ్వు యీ నిర్ణయం తీసుకుంటే, ముఖ్యమంత్రి కుండే హక్కులు వుపయోగించి నేనూ ఓ నిర్ణయం తీసుకుంటా అంటూ అఖిలేశ్ బాబాయి నుంచి ముఖ్యమైన శాఖలు వెనక్కి తీసేసుకున్నాడు. వీళ్లిద్దరి మధ్యనే వ్యవహారం నలుగుతూంటే ఏమయ్యేదో తెలియదు కానీ మధ్యలో యింకోటి జరిగింది.

గాయత్రీ ప్రసాద్ ప్రజాపతి అనే మైనింగ్ మంత్రిపై అక్రమంగా గనుల తవ్వకం, అక్రమ సంపాదన ఆరోపణలు వచ్చాయి. అలహాబాదు హై కోర్టు వాటిపై విచారించి సిబిఐ విచారణకు ఆదేశించింది. అటువంటి కళంకితుడు మంత్రివర్గంలో వుంటే ప్రతిపక్షాలకు మంచి ఆయుధం అందించినట్లే అని భావించిన అఖిలేశ్ అతన్ని సోమవారం కాబినెట్‌లోంచి తీసేశాడు. తీసేసేముందు తండ్రికి మాట మాత్రం చెప్పలేదు. ఎందుకంటే ములాయం రెండో భార్య సాధనా గుప్తా కుమారుడైన ప్రతీక్ యాదవ్‌ది రియల్ ఎస్టేటు వ్యాపారమే అయినా, మైనింగ్ వ్యాపారం కూడా చేస్తున్నాడని వినికిడి. అతని భార్య అపర్ణ 2017 ఎన్నికలలో లఖ్‌నవ్ నుంచి పోటీ చేద్దామని చూస్తోంది. అతనికి ప్రజాపతికి లింకులున్నాయట. సాధనాకు సవతి కొడుకు అఖిలేశ్ అంటే పడదు కానీ శివపాల్‌తో సత్సంబంధాలే వున్నాయి. వాళ్ల సిఫార్సు మేరకే ఇరిగేషన్ శాఖ నుంచి అతన్ని మైనింగ్‌కు మార్చవలసి వచ్చింది. అతనిపై లోకాయుక్త విచారణ కూడా సాగుతోంది. ''పదేళ్లలో బిపియల్ (దారిద్ర్యరేఖకు దిగువ వుండేవాళ్లు) నుండి బిఎండబ్ల్యుకు చేరాడతను'' అని అమర్ ఉజాలా పత్రిక రాసింది. ప్రజాపతితో బాటు అఖిలేశ్ పంచాయితీ రాజ్ మంత్రి ఐన రాజ్ కిశోర్ సింగ్‌ను కూడా తీసేశాడు. తన నియోజకవర్గంలో అక్రమంగా భూమి ఆక్రమించాడని అతనిపై ఆరోపణలున్నాయి. సాధన చేసిన ఫిర్యాదు మేరకు శివపాల్ ప్రజాపతిని వెనక్కి తీసుకోవాలని పట్టుబట్టాడు. అఖిలేశ్ కుదరదన్నాడు. దాంతో శివపాల్ రాష్ట్ర అధ్యక్షపదవికి, మంత్రి పదవికి రాజీనామాలు చేసి అన్నగారికి పంపాడు. అతనితో పాటు అతని భార్య సరళ జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ పదవికి, కుమారుడు ఆదిత్య యుపి కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ పదవికి రాజీనామాలు చేసి పంపారు.

వీటన్నిటి వెనుక అమర్ సింగ్ పన్నాగం వుందని అందరూ అనుకునే మాట. 'ఇది కుటుంబ వ్యవహారమైతే సమసిపోయేది, కానీ బయటివాళ్లు జోక్యం చేసుకుంటున్నారు' అన్నాడు అఖిలేశ్. ఆ బయటి వ్యక్తి మీరేనా అని అమర్‌ను అడిగితే 'అఖిలేశ్ నాకు పుత్రసమానుడు. నాకు వ్యతిరేకంగా యిప్పటివరకు ఎప్పుడూ మాట్లాడలేదు' అని చెప్పుకున్నాడతను. 'అమర్ సింగ్ హస్తమేమీ లేదు,

అఖిలేశ్ తన తండ్రిని చూసి నేర్చుకోవలసినది చాలా వుంది, మేమంతా నేర్చుకోలేదా!?' అన్నాడు శివపాల్. వ్యవహారం యీ దశకు వచ్చాక ములాయం ఏదో ఒకటి చేయక తప్పదని శివపాల్‌ను, అఖిలేశ్‌ను పిలిపించి మాట్లాడాడు. రాజీ కుదిర్చాడు. ఎందుకంటే పార్టీవ్యవస్థాపరంగా అతనికి శివపాల్ కావాలి, పాలనాపరంగా కొడుకు కావాలి. రాజీ ఫార్ములా ప్రకారం శివపాల్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతాడు కానీ టిక్కెట్ల పంపిణీలో అఖిలేశ్ మాట చెల్లుతుంది. శివపాల్‌కు కాబినెట్‌లో తిరిగి చేరతాడు. అతని శాఖలన్నీ అతనికి దక్కుతాయి. ఆ విధంగా తమ్ముణ్ని, కొడుకుని చల్లార్చాడు. ప్రజాపతిని, రాజ్ కిశోర్‌ని అఖిలేశ్ మంత్రివర్గంలోకి వెనక్కి తీసుకుంటాడు కానీ పాత శాఖలు యివ్వడు, వేరే శాఖలు అప్పచెపుతాడు. ఆ విధంగా రెండో భార్య కోరిక తీర్చాడు ములాయం. అంతా బాగానే వుంది కానీ శకుని పాత్ర పోషించిన అమర్ మాటేమిటి? అనడిగాడు అఖిలేశ్. అదుపు చేస్తా, విభేదాలు పుట్టించడానికి చూశాడని తేలితే చర్య తీసుకుంటా అని ములాయం హామీ యిచ్చాడు. 'ములాయం పార్టీకి నిధులిస్తున్నది ప్రజాపతే, నన్ను బయటపెడితే మీ అందరి అవినీతి బయటపెడతా' అని అతను బెదిరించి వుంటాడు. అందుకే ములాయం యింత హడావుడి పడ్డాడు, రాజీ ఫార్ములా గురించి బయటకు వచ్చి చెప్పేటప్పుడు అందరి కంటె ముందు ప్రజాపతి గురించి చెప్పడంలోనే అతని ఆదుర్దా తెలుస్తోంది' అంటున్నారు పాత్రికేయులు.

ఇదీ నేటి పరిస్థితి. ఇది ఆచరణలో ఏ మేరకు అమలవుతుందో వేచి చూడాల్సిందే. పాత పద్ధతుల్లో రాటుదేలిన ములాయం కుటుంబానికి, పార్టీ రూపురేఖలు మారుద్దామంటూ అఖిలేశ్ తీసుకుంటున్న దిద్దుబాటు చర్యలు మింగుడు పడక, మళ్లీ రోడ్డున పడవచ్చు. ఎస్పీ బలహీనపడితే యితర పార్టీలపై ప్రభావం ఎలా పడుతుంది అనే దానిపై కూడా చర్చలు సాగుతున్నాయి. గతంలో కొన్ని వర్గాలు కొన్ని పార్టీలకు ఓట్లేస్తూ వచ్చాయి. కానీ యీసారి అందరూ ఓటు బ్యాంకుల చీలికలపై ఆధారపడుతూ వున్నారు. ముస్లింలు ఎస్పీ, బియస్పీ, కొంత మేరకు కాంగ్రెస్ మధ్య చీలుతున్నారు. బ్రాహ్మణులు 2007లో బియస్పీకి, 2012లో అఖిలేశ్‌కు, 2014లో బిజెపికి వేశారు. ఇప్పుడు వాళ్లూ కాంగ్రెస్, బిజెపిల మధ్య చీలుతున్నారు. బియస్పీ కూడా వారిని 'బ్రాహ్మణులు శంఖం పూరిస్తారు, మదగజం ముందుకు సాగుతుంది' అనే నినాదంతో ఆకట్టుకుందామని చూస్తోంది. బిసిలలో యాదవులు ఎస్పీవైపు వున్నా బిజెపి తక్కినవారిని చీల్చి తనవైపు తిప్పుకుందామని చూస్తోంది. దళితుల్లో కూడా కొన్ని వర్గాలు 2014లో బిజెపికి వేశాయి. ఇలా బిజెపి అన్ని వర్గాలలోని చీలిక ఓట్లతో గెలుద్దామని చూస్తోంది. ముస్లిములు ఎస్పీ, బియస్పీల మధ్య చీలిపోతే వారికి లాభం. కానీ యీ అంతఃకలహాల వలన ఎస్పీ బలహీనపడిందని తోచి ముస్లిములు బిజెపిని అడ్డుకోవడానికి బియస్పీకి గంపగుత్తగా ఓటేస్తే అప్పుడు మాయావతి ఏ 35% ఓట్లతోనే గెలుస్తుందని ఒక అంచనా. దీనికి విపర్యంగా యింకో ఆలోచన కూడా సాగుతోంది. 'ములాయం సోదరుల పాత ధోరణికి వ్యతిరేకంగా పోరాడుతున్నందుకు అఖిలేశ్‌పై అభిమానం పుట్టుకుని వచ్చి పార్టీల కతీతంగా యువత, మధ్యతరగతి ఓట్లేస్తే ఎస్పీయే గెలవవచ్చు. ఈ లెక్కల్లో కాంగ్రెసును ఎక్కడా సోదిలోకి తీసుకురాకుండా వున్నారు. పోనుపోను అది బలం పుంజుకుంటే ఎవరి ఓట్లు చీల్చుకుంటుందో అదీ తెలియదు. ఈ చతుర్ముఖ పారాయణం రసవత్తరంగా సాగే సూచనలే కనబడుతున్నాయి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 22, 23 **ఎమ్బీయస్ : చండశాసనుడు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు**

ఈ ఏడాది మేలో ఫిలిప్పీన్స్‌లో ఎన్నికలు జరిగి రోడ్రిగో డ్యూటెర్టె అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. దావో నగరానికి మేయరుగా వున్నప్పుడు అతను నేరస్తులను దడదడలాడించి పేరు తెచ్చుకున్నాడు. ఆ పేరుప్రతిష్ఠలతోనే 38% ఓట్లతో నెగ్గాడు. ఇక యిప్పుడు ఫిలిప్పీన్స్‌ను పట్టిపీడిస్తున్న డ్రగ్ వ్యాపారాన్ని తుదముట్టించడానికి కంకణం కట్టుకుని మాదకద్రవ్యాలు వాడేవాళ్లని, అమ్మేవాళ్లని అందర్నీ తన అనుచరుల చేత, పోలీసుల చేత చంపిపారేయిస్తున్నాడు. అతను పదవి చేపట్టిన జూన్ 30 నుంచి యిప్పటివరకు సగటున రోజుకు 36 మంది చంపబడ్డారని అంచనా. ముసుగు వేసుకున్న కార్యకర్తల చేతిలో కొందరు హతులైతే, మరి కొందరు పోలీసుల చేతిలో చచ్చిపోతున్నారు. ఇంకొందరిని ఎవరు చంపారో తెలియటం లేదు. శవాలుగా తేలుతున్నారు. చట్టాన్ని చేతిలో తీసుకున్నందుకు పోలీసులపై చర్యలు తీసుకోనని రోడ్రిగో ప్రకటించాడు. మీరేం చేసినా నేనేమీ అనన్నాడు. ఈ మరణాలతో గడగడ వణికిన డ్రగ్ వాడకందార్లు, డీలర్లు లక్షలాది మంది చట్టానికి లొంగిపోతున్నారు. కానీ కోర్టుకి యీ వరస నచ్చలేదు. చీఫ్ జస్టిస్ యీ పోకడను విమర్శించాడు. 'నా చర్యలకు అడ్డు వస్తే పార్లమెంటును రద్దు చేసి పారేస్తా, మార్షల్ లా పెట్టేస్తా' అని రోడ్రిగో బెదిరించాడు. 'మానవహక్కులు హరించిపోతున్నాయి, యిదెక్కడి ప్రభుత్వం' అని పాశ్చాత్య మీడియా గగ్గోలు పెడుతోంది కానీ ఫిలిప్పీన్స్ ప్రజలు ఫిర్యాదు చేయడం లేదు. సర్వే చేస్తే 91% మంది అతని చర్యలను ఆమోదిస్తాం అన్నారు. అతని మిత్రులు, శత్రువులు అందరూ చెప్పేది ఒకటే – 'చెప్పింది చేసి తీరగలడు' అని. ఫిలిప్పీన్స్‌ను క్షాళన చేస్తానని ఎన్నికలలో వాగ్దానం చేశాడుగా, చేసి చూపిస్తున్నాడు అంటున్నారు.

ఫిలిప్పీన్స్ ప్రజలు వారి అధ్యక్షుల చేష్టలతో విసిగిపోతూ వచ్చారు. అవినీతిపరుడైన ఫెర్డినాండ్ మార్కోస్ అమెరికా మద్దతుతో నియంతగా 1966 నుంచి 20 ఏళ్లపాటు ఏలాడు. అతని భార్య ఇమెల్డా విలాసాలకు జగత్ప్రసిద్ధం. ప్రజలు తిరగబడితే 1972లో మార్షల్ లా పెట్టాడు. 1986లో ప్రజాగ్రహం తట్టుకోలేక అమెరికా సలహాతో డబ్బు తీసుకుని దేశం విడిచి పారిపోయాడు. అతని

తర్వాత వచ్చిన అధ్యక్షుల్లో కొందరు అమెరికా కనుసన్నల్లోనే నడిచారు. సినిమా యాక్టరైన జోసెఫ్ ఎస్ట్రాడా 1998-2001 మధ్య అధ్యక్షుడిగా వుండి 80 మిలియన్ డాలర్ల అవినీతి కేసుల్లో యిరుక్కుంటే యావజ్జీవ శిక్ష పడింది. అయితే అతని తర్వాత వచ్చిన గ్లోరియా అరోయో అతన్ని క్షమించేసింది. తన తొమ్మిదేళ్ల (2001-10) పాలనలో ఆమె కూడా అవినీతికి పాల్పడిందని గృహనిర్బంధంలో వుంది. అయితే సుప్రీం కోర్టు ఆమెను క్షమించేసింది. ఎందుకంటే ఆ జడ్జీలు ఆమె నియమించినవారే! ఆమె తర్వాత వచ్చి బినైనో ఏక్వినో (2010-16) అమెరికాకు సన్నిహితుడు.

ఆ ప్రాంతంలో చైనా ఆధిపత్యాన్ని నిరోధించడానికి అమెరికా మార్కోస్ హయాంలో ఫిలిప్పీన్స్‌లో మిలటరీ స్థావరాలు ఏర్పరచుకుంది. మార్కోస్ తర్వాత వచ్చిన అధికారంలోకి వచ్చిన కోరజాన్ ఆక్వినో ఆ స్థావరాల నుంచి 1992లో అమెరికాను సాగనంపింది. ఆమె కుమారుడైన బినైనో అధ్యక్షుడయ్యాక మళ్లీ అమెరికావాళ్లను పిలుచుకుని వచ్చి వాటిని అప్పగించాడు. అంతేకాదు, 2015లో ఎన్‌హాన్స్‌డ్ డిఫెన్స్ కోఆపరేషన్ ఎగ్రిమెంట్ (ఇడిసిఎ) అనే ఒప్పందం చేసుకున్నాడు. దాని ప్రకారం అమెరికాకు తన స్థావరాలలోనే కాదు యితర మిలటరీ, నేవల్, ఎయిర్‌ఫోర్స్ బేస్‌లలో కూడా ప్రవేశించే అధికారం కట్టపెట్టాడు. ఈ క్రమంలో చైనాతో వైరం పెంచుకున్నాడు. సౌత్ సీ ప్రాంతంలో తన ఆధిక్యత వుండాలని కోరుకునే చైనాకు ముకుతాడు వేయడానికి అమెరికా ఆక్వినోను మచ్చిక చేసుకుని తన మిలటరీ బేస్‌లను పటిష్టం చేసుకుంది. అతని తర్వాత వచ్చేవాళ్లు కూడా అదే విధానాన్ని కొనసాగించాలని సకల ప్రయత్నాలు చేసింది. వారికి ఆప్తుడైన ఆక్వినో ఎన్నికల సమయంలో రోడ్రిగోకు ఓటేయవద్దని, వేస్తే మార్కోస్ పాలన తిరిగి వచ్చేస్తుందని ఓటర్లను భయపెట్టాడు. అతనితో పోటీ పడిన రోక్సాస్‌కు మద్దతిచ్చాడు. ప్రతిపక్షాలన్నీ ఏకమై రోడ్రిగోకు అధికారం దక్కకుండా చేయాలని పిలుపు నిచ్చాడు. ఇంత చేసినా రోక్సాస్‌కు ద్వితీయ స్థానమే దక్కింది.

అమెరికాకు రోడ్రిగో అంటే ఎందుకు పడదు అంటే దానికి చరిత్ర వుంది. 1980లలో దక్షిణ ఫిలిప్పీన్స్‌లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ద ఫిలిప్పీన్స్ (సిపిపి), తన సాయుధదళం న్యూ పీపుల్స్ ఆర్మీ (ఎన్‌పిఏ) ద్వారా ప్రభుత్వంపై తిరుగుబాటు చేసింది. ఆ పార్టీని స్థాపించిన జోస్ సిసాన్ రోడ్రిగోకు మనీలా యూనివర్శిటీలో ప్రొఫెసర్. ఆయనంటే రోడ్రిగోకు గౌరవం వుంది. తిరుగుబాటు కారణంగా 30 వేల మంది హతులయ్యారు. జోస్ నెదర్లాండ్స్‌లో తలదాచుకున్నాడు. రోడ్రిగో దావో నగరానికి మేయరయ్యాక శాంతిభద్రతలు పరిరక్షించడానికి పూనుకుని, అరాచక శక్తులను అణచివేయడానికి చట్టానికి అతీతంగా కూడా వ్యవహరించాడు. డెత్ స్క్వాడ్స్‌ను తయారుచేసి, వీధుల్లో వదిలాడు. మానవహక్కుల సంఘాలు ఎంత గగ్గోలు పెట్టినా పట్టించుకోలేదు. ఫిలిప్పీన్స్‌లో కల్లా అత్యంత నేరపూరితమైన నగరంగా పేరు బడిన ఆ వూరు రోడ్రిగో కారణంగా ప్రపంచంలోనే అత్యంత సురక్షిత నగరాల్లో ఒకదానిగా మారింది. మహిళా బాధితుల కోసం క్రైసిస్ సెంటరు నెలకొల్పి వారి అభిమానాన్ని చూరగొన్నాడు.

ఇది వారి వరకు బాగానే వుందేమో కానీ అమెరికాకు మాత్రం బాగా లేదు. ఎందుకంటే వారి ప్లాన్లు వాళ్లకున్నాయి. ఫిలిప్పీన్స్‌లో కల్లోలాలు సృష్టించి, ప్రజల దృష్టిలో రక్షకుడిగా నటిస్తూ తన సైనిక దళాలను అక్కడ దింపాలని వారి పథకం. దానికి గాను వారు ఎంచుకున్న వ్యక్తి అబూ సయ్యఫ్. అఫ్గనిస్తాన్‌లో రష్యా దళాలను తరిమికొట్టడానికి తాలిబన్లతో బాటు ఫిలిప్పీన్స్ ముస్లిములు కొందరిని సయ్యఫ్ నేతృత్వంలో మిల్ఫ్ (మోరో ఇస్లామిక్ లిబరేషన్ ఫ్రంట్) పేర టెర్రరిస్టు దళంగా తయారుచేశారు. (రాజకీయావసరాల కోసం అమెరికా తయారుచేసిన అనేక భూతాల్లాగానే యిప్పుడు మిల్ఫ్ కూడా పెనుభూతమై ఐసిస్‌తో లింకులు పెట్టుకుని మానవాళికి ముప్పుగా పరిణమించింది) ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీళ్లకు ఆయుధాలు సరఫరా చేయడమే కాకుండా కొన్ని అరాచక కార్యకలాపాలు, విధ్వంసచర్యలు వారి పేర తామే నిర్వహించారు. దీన్ని ఫాల్స్ ఫ్లాగ్ టెర్రర్ (తెలుగులో మారు జండా ఉగ్రవాదం అనవచ్చేమో) అంటారు. అంటే సినిమాల్లో రాబిన్ హుడ్ వంటి హీరోను అప్రతిష్ఠపాలు చేయడానికి విలన్లే అకృత్యాలు చేసి పట్టుబడిన తమ అనుయాయుల చేత 'మేం కొండవీటి దొంగ మనుషులం' అని చెప్పిస్తారు చూడండి, అలాటిదన్నమాట. ఇక్కడ లక్ష్యం ఏమిటంటే కొండవీటి దొంగను పట్టుకోవడం కాదు, అతని దుర్మార్గాలు అరికడతామంటూ తాము వచ్చి సాయుధదళాలతో తిష్ట వేయడం.

దురదృష్టవశాత్తూ దీనికి అప్పటి ఫిలిప్పీన్స్ ప్రభుత్వం, సైన్యం మద్దతు కూడా వుంది. అప్పటి అధ్యక్షురాలు అరోయో (అవినీతిపరుడైన పూర్వాధ్యక్షుడు ఎస్ట్రాడాకు క్షమాభిక్ష ప్రసాదించి, తనూ అవినీతి పాలన సాగించి, అరెస్టయి, తను నియమించిన జడ్జిల కారణంగా కేసుల్లోంచి విముక్తురాలైన మహిళ) అమెరికాకు సహకరించి తన సైనిక విభాగమైన ఎఎఫ్‌పి (ఆర్మ్‌డ్ ఫోర్స్ ఆఫ్ ఫిలిప్పైన్స్) ద్వారా సంధానం చేసింది. పథకంలో భాగంగా అమెరికా 2002లో మైకేల్ టెర్రెన్స్ మెయిరింగ్ అనే సిఐఏ ఏజంటును మారణాయుధాలతో, బాంబులతో ఫిలిప్పీన్స్‌లో దింపింది. అతను ఆపరేట్ చేద్దామనుకున్న ప్రాంతాలు దావో నగరానికి దగ్గరగా వుండడంతో అక్కడి ఎవర్‌గ్రీన్ హోటల్లో దిగాడు. దావో నగరానికి మేయరుగా వున్న రోడ్రిగో తమ కుట్రలో భాగం పంచుకోడన్న అనుమానంతో అమెరికా అతనికి ఏమీ చెప్పలేదు. హోటల్లోకి పెద్ద పెట్టెతో వచ్చిన మైకేల్ హోటల్ సిబ్బందిని దాన్ని ముట్టుకోనిచ్చేవాడు కాదు. తెచ్చిన పేలుడు సామగ్రిని, మిల్ఫ్‌తో బాటు కమ్యూనిస్టు సేన అయిన ఎన్‌పిఏకు కూడా అందించాడట. ఇక్కడ సిద్ధాంతాలతో పని లేదు. ప్రభుత్వాన్ని బలహీనపరిచే ఏ శక్తి అయినా తమకు ఆత్మీయులే.

అక్కడక్కడ పేలుళ్లు జరుగుతున్నాయి. ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయి. ఇలా కొటన్ని వారాలు పోయాక మే 16 న హోటల్ గదిలోనే బాంబు పేలి మైకేల్ గాయపడ్డాడు. హోటల్ యాజమాన్యం పోలీసులను పిలిచారు. బాంబుల పెట్టెతో పాటు, కొన్ని డాక్యుమెంట్లు కనబడ్డాయి. మైకేల్‌ను మోరో నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫీసరుగా పేర్కొంటూ ఐడెంటిటీ కార్డు కూడా కనబడింది.

అతన్ని మకాటీ మెడికల్ సెంటరుకు తరలించారు. ఈ లోపునే ఎఎఫ్‌పి ద్వారా అమెరికాకు ఉప్పందింది. అంతే, అమెరికా మనీలాలోని అమెరికన్ ఎంబసీ ద్వారా ప్రత్యేక జెట్ విమానాన్ని చార్టర్ చేయించి యిద్దరు ఎఫ్‌బిఐ ఏజంట్లను పంపింది. వాళ్లు తమ ఐడెంటిటీ కార్డు చూపిస్తూ ఆసుపత్రిలోని వైద్యులను, పోలీసులను హడలగొట్టి మైకేల్‌ను తీసుకుని ఆ విమానంలో మనీలాకు తీసుకుని వచ్చారు. అక్కణ్నుంచి అమెరికాకు తీసుకుని వెళ్లిపోయారు. భోపాల్ గ్యాస్ కేసులో ఆండర్సన్ విషయంలో మన ప్రభుత్వం వ్యవహరించినట్లుగానే ఆనాటి ఫిలిప్పీన్ ప్రభుత్వం ఎక్కడికక్కడ ఆదేశాలిస్తూ యీ తరలింపు సాధ్యపడేట్లు చేసింది.

దీన్ని రోడ్రిగో చాలా సీరియస్‌గా తీసుకున్నాడు. అమెరికాను నిందిస్తూ ప్రకటనలు గుప్పించాడు. గత్యంతరం లేక ఫిలిప్పీన్స్ మైకేల్‌ను అప్పగించమని అమెరికాను అడగవలసి వచ్చింది. ఆ పేరుతో ఎవరూ లేరంది అమెరికా. ఎందుకంటే ఈలోగా అతను తన యింటిపేరు వాన్ ద మీర్ అని మార్చేసుకున్నాడు. హ్యూస్టన్ టీవీ స్టేషన్ రిపోర్టరు ఒకతను అతని ఆనుపానులు కూపీ లాగి, ఫిలిప్పీన్స్‌కు తెలియపరిచాడు. కొత్త పేరుతో డిమాండ్ రాగానే అయితే అమెరికా 'మీరు అతని ఫోటోను మాకు పంపలేదు' అనే సాకుతో ఆ కోరిక తిరస్కరించింది. ఫిలిప్పీన్ ప్రభుత్వం కూడా కుమ్మక్కయింది కాబట్టి అమెరికా చెప్పినది ఒప్పేసుకుని వూరుకుంది. ఈ లోగా అమెరికా మైకేల్ గురించి రకరకాల కథనాలను మీడియాలో ప్రవేశపెట్టింది. అతను నిధుల వేటగాడని, నాజీలు ఫిలిప్పైన్స్‌లో దాచిన బంగారం వెతకడానికి వచ్చాడని, క్రీస్తు పునరుజ్జీవనాన్ని నమ్మే మతసంస్థ సభ్యుడని, తనంతట తానే బాంబులు సప్లయి చేశాడని, అమెరికాతో ప్రమేయం లేదని.. యిలా!

మైకేల్ పంచిపెట్టిన తుపాకులు, బాంబులను అతను వెళ్లిపోయిన తర్వాత ఏడాది దాకా ఉగ్రవాదులు వాడారు. దావో ఎయిర్‌పోర్టులో, సాసా రేవులో అవి పేలాయి. చాలామంది చచ్చిపోయారు, మరింతమంది గాయపడ్డారు. దాని తర్వాత కూడా మిల్ఫ్‌ను అదుపు చేయాలనే పేరుతో అమెరికా సిఐఏ, ఎఫ్‌బిఐ ఏజంట్లను రోడ్రిగోతో చెప్పకుండా దావో నగరానికి పంపిస్తూనే వుంది. దొంగతనంగా ముద్రించిన అమెరికన్ డాలర్లను చలామణీలో పెట్టింది. ఆ తర్వాత యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ అంటూ 6 వేల మంది సైన్యాన్ని దింపింది. తన నగరంలో అమెరికా సృష్టించిన విధ్వంసాన్ని రోడ్రిగో యిప్పటికీ క్షమించలేకున్నాడు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామంటూ ఫిలిప్పీన్స్ ప్రభుత్వంతో కలిసి అమెరికా ఏర్పరచిన సైనిక కార్యకలాపాల వలన శాంతి ప్రయత్నాలకు విఘాతం కలుగుతోందని, క్రైస్తవులకు, ముస్లిములకు మధ్య వైషమ్యాలు పెరుగుతున్నాయని రోడ్రిగో వాదన.

అందుకే యిప్పుడు మిల్ఫ్‌తో, ఎన్‌పిఏతో చర్చలు జరిపి శాంతి నెలకొల్పడానికి ప్రయత్నిస్తానంటున్నాడు. అంతేకాదు, చైనాతో శత్రుత్వం మాని, వారి భాగస్వామ్యం కోరుతున్నాడు. మీరు ఆఫ్రికాలో కట్టినట్లే మా వద్దా రైల్వే మార్గం కట్టండి అంటున్నాడు. మా వద్ద ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెంచడానికి చైనా కంపెనీలను ఆహ్వానిస్తానంటున్నాడు. సౌత్ చైనా సీపై చైనాకు అధికారాలు లేవని ఇంటర్నేషనల్ ట్రైబ్యునల్ యిచ్చిన తీర్పును మన్నించనంటున్నాడు. చైనా కూడా అదే చెపుతోంది 'మేం సంబంధిత దేశాలతో కూర్చుని చర్చించుకుని ఒప్పందాలకు వస్తాం. మధ్యలో యీ ట్రైబ్యునల్ పెత్తనం ఏమిటి?' అని. ఆ ప్రాంతంలో చైనాతో కలిసి ఆయిలు, నేచురల్ గ్యాస్ నిక్షేపాలను వెలికితీసే ప్రతిపాదన చేస్తున్న రోడ్రిగో నిజంగా స్నేహహస్తం అందిస్తే అందుకోవడానికి చైనా సిద్ధంగా వుంది. దీన్ని అమెరికా మద్దతుదారులు అంగీకరించటం లేదు. ఒకప్పుడు రైట్ వింగ్ సైనిక తిరుగుబాటు చేసి విఫలమైన సెనేటర్ ఆంటోనియో "కమ్యూనిస్టు చైనాతో నీ స్నేహాన్ని సైన్యం అనుమానంగా చూస్తోంది." అని బహిరంగంగా ప్రకటించాడు. "కమ్యూనిస్టు పార్టీతో కలిసి యితను సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు" అని కొందరు ఆర్మీ ఆఫీసర్లు, రైటిస్టు రాజకీయనాయకులు ఆరోపిస్తున్నారు. తమ సైనిక స్థావరాలు వున్న యింత కీలకమైన దేశాన్ని అమెరికా వదులుకోవడానికి సిద్ధంగా వుండదు కాబట్టి రోడ్రిగోకు ఎసరు పెడుతుందేమో చూడాలి. – ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)

ఆస్కారు బహుమతులు – ఇప్పటివరకు ఇండియా 48 చిత్రాలను (40 (?) హిందీ, 8 తమిళం, 3 మరాఠీ, 2 బెంగాలీ, 2 మలయాళం, 1 తెలుగు, 1 గుజరాతీ) ఆస్కారు నామినేషన్‌కు పంపింది. కానీ మూడంటే మూడు (మదర్ ఇండియా (1957), సలాం బాంబే (1988), లగాన్ (2001)) **నామినేషన్‌కు అర్హత సంపాదించుకున్నాయి.**

సెప్టెంబరు 24-26 ఎమ్బీయస్ : స్విస్ ఛాలెంజ్

ప్రత్యేక హోదా తర్వాత బ్రహ్మపదార్థం స్థాయిని సంతరించుకున్న పదం – స్విస్ ఛాలెంజ్! చంద్రబాబుగారి ధర్మమాని అందరూ దాని గురించే మాట్లాడుతున్నారు. అది అద్భుతమైన విధానమని ఆయన అంటే కాదు, అధ్వాన్నమైనదని కొందరంటున్నారు. పద్ధతిలో స్వతహాగానే కొన్ని లోపాలుంటే బాబు తమ వంతుగా మరిన్ని చేర్చారని కూడా ఆరోపణలున్నాయి. సింగపూరు కన్సార్షియం అమరావతి ప్రతిపాదనపై హైకోర్టు స్టే యివ్వడంతో యీ అనుమానాలు మరింత బలపడ్డాయి. కోర్టులు ఏం చెప్పాయన్నది తర్వాతి సంగతి. ఒక జడ్జి చెప్పినది ఫుల్ బెంచ్ కొట్టేస్తుంది. ఫుల్ బెంచ్ కొట్టేసినది సుప్రీం కోర్టు కొట్టేస్తుంది. మధ్యలో మనకంటూ ఒక అవగాహన వుండాలి కదా, ఎవరైనా ముఖ్యమైన విషయాలతో అర్థమయ్యేలా క్లుప్తంగా రాస్తే బాగుండును అని ఎదురుచూస్తూ వచ్చాను. అలాటిదేదీ తారసిల్లకపోవడంతో నేనే మొదలుపెట్టాను. సమాచార సేకరణలో, అవగాహనలో లోపాలు వుంటే (ఉంటాయనే నా అనుమానం, విషయం క్లిష్టంగా వుంది) ఎత్తి చూపప్రార్థన. సరిగ్గా తెలుసుకోకుండా, అర్థం కాకుండా ఎందుకు

రాస్తున్నట్లు అంటే పరీక్ష రాస్తేనే కదా తన కెంత తెలుసో, తెలియదో విద్యార్థికి గ్రహింపుకి వచ్చేది!

స్విస్ ఛాలెంజ్‌కు ఆ పేరు ఎందుకు వచ్చిందో నిర్ధారణగా ఎవరూ చెప్పటం లేదు. స్విస్ అనగానే తట్టేది ఆ దేశపు తటస్థ విధానం. ప్రపంచయుద్ధాలలో ఆ దేశం ఎటూ మొగ్గకుండా వుంది. అదే విధంగా వేర్వేరు కాంట్రాక్టర్లలో ఎవరి పట్ల వలపక్షం చూపకుండా ప్రభుత్వం తటస్థంగా వ్యవహరిస్తుంది కాబట్టి 'స్విస్' అన్నారని ఒక వ్యాఖ్యానం. (అంటే తక్కిన విధానాల్లో పక్షపాతం చూపిస్తుందా? అనే ప్రశ్న వస్తుంది మరి) ఏది ఏమైనా అది ప్రభుత్వం కంట్రాక్టర్లకు పని అప్పచెప్పే ఒక పద్ధతి. చాలాకాలంగా అమల్లో వున్న విధానం – ఎల్‌సిఎమ్ (లీస్ట్ కాస్ట్ మెథడ్) ప్రభుత్వం ఫలానా పని, ఫలానా విధంగా చేయాలి అని వివరాలన్నీ ప్రకటించి, దీన్ని ఎంత తక్కువలో చేసి చూపిస్తారో చెప్పండి అంటూ కాంట్రాక్టర్లను పిలుస్తుంది. ఈ రేటైతే చేయగలం అంటూ కాంట్రాక్టర్లు ప్రతిపాదనలు (టెండర్లు) పంపుతారు. అందరి కంటె తక్కువ రేటు 'కోట్' చేసిన (రేటుకి సిద్ధపడిన) టెండర్‌ను 'ఎల్1' (లోయస్ట్ 1) అంటారు. వాళ్లకు పని అప్పచెపుతారు. ఇది పూర్తిగా రహస్యప్రక్రియ. ఒక కాంట్రాక్టరు ఎంత రేటు చెప్పాడో, మరో కాంట్రాక్టరుకి తెలియదు. అన్నీ కలిపి బహిరంగంగా ఒకే రోజు తెరుస్తారు.

ఇది వినడానికి బాగానే వుంటుంది కానీ దీనిలో ఒక చిక్కు వుంది. కాంట్రాక్టర్లందరూ కలిసి కూడబలుక్కుని కూటమిగా (కార్టెల్ అంటారు) ఏర్పడి, 'యింతకంటె తక్కువ టెండరు యివ్వవద్దు' అని తీర్మానించుకుని వంతుల వారీగా టెండర్లు దక్కించుకోవచ్చు. ఒక్కోసారి కాంట్రాక్టరు ప్రభుత్వంలో తనకున్న పలుకుబడితోనో, పోటీదారుల ఆఫీసుల్లో తన మనుష్యులను నియమించో యితరులు ఎంత రేటు కోట్ చేస్తున్నారో తెలుసుకుని దాని కంటె తక్కువ టెండర్ వేసి పని దక్కించుకోవడం జరుగుతుంది. ఒక్కోచోట కాంట్రాక్టరుకు స్థానబలిమి ఎక్కువై తను కోట్ చేస్తున్న రేటు కంటె తక్కువ రేటుకి వేరే ఎవరూ టెండరు యివ్వకూడదని శాసించడమూ జరుగుతుంది. కొందరు తక్కువ రేటు కోట్ చేసి, పని దక్కించుకుని తర్వాత ఏదో వంక చెప్పి – ప్రభుత్వం అనుమతులు రావడం లేటయ్యాయనో, దిగుమతులు సకాలానికి రాలేదనో, కోర్టు ఆదేశాల వలన పనిలో జాప్యం జరిగిందనో యిలాటివి – రేటు పెంచమని ప్రతిపాదిస్తారు. ప్రభుత్వం వారితో కుమ్మక్కయి రేటు పెంచేస్తుంది. చాలాసార్లు నాణ్యతలో రాజీ పడతారు, లంచాలు తీసుకున్న ప్రభుత్వాధికారులు, నాయకులు చూసీ చూడనట్లు వదిలేస్తారు. ఇలా యీ పద్ధతిలో కూడా చిక్కులున్నాయి. అందువలన క్యూసిబియస్ (క్వాలిటీ అండ్ కాస్ట్–బేస్‌డ్ సెలక్షన్) అనే పద్ధతి వచ్చింది. ఇంత తక్కువ రేటుకి కిట్టుబాటు అవడం లేదనడం వలన 'వయబిలిటీ గ్యాప్', 'రివర్స్ ఇ–ఆక్షన్', 'హైబ్రిడ్ ఏన్యుయిటీ' వంటి మార్గాలూ వచ్చాయి.

పూర్తి గవర్నమెంటు పని అయినా, పిపిపి (పబ్లిక్–ప్రైవేట్–పార్ట్‌నర్‌షిప్) అయినా, పై పద్ధతులన్నిటిలో తొలిదశలో ప్రభుత్వాధికారులకు పని విపరీతంగా వుంటుంది. అంటే ఏ పని చేపట్టాలి, ఎలా చేపట్టాలి, ఎంత ఖర్చు పెట్టాలి, ఎంత ఆదాయం వస్తుంది, ఎన్నాళ్లలో వస్తుంది వంటి కసరత్తు అంతా ప్రభుత్వాధికారులే చేసి 'ఇదిగో యింతలో, యిన్నాళ్లల్లో, ఫలానా చోట, ఫలానా విధంగా పని చేయాలి' అని మొత్తం డిజైనంతా తయారుచేసి కాంట్రాక్టర్ల ముందు పెట్టాలి. ప్రభుత్వాధికారులకు అంత సామర్థ్యం వుండాలి, తీరిక వుండాలి. ఉంటాయి కాబట్టే యిన్ని పనులు చేపడుతున్నారు. వాటికి ప్రత్యేకమైన శాఖలుంటాయి, నిపుణులుంటారు. అవసరమైతే కన్సల్టెంట్లను పిలుస్తారు.

అయితే వీళ్లకు ఏ పథకం చేపడితే బాగుంటుందనే విషయంలో కొత్త తరహా (యిన్నోవేటివ్‌గా) ఆలోచనలు రాకపోవచ్చు. నాయకుల రాజకీయ అవసరాల కోసమో, అధికారుల ఆలోచనా పరిమితులకు లోబడో వాళ్లు పథకాలు రచిస్తూ వుండవచ్చు. కానీ కావలసినన్ని పథకాలు తయారవుతున్నాయా అనేది ప్రశ్న. ఆర్థిక వ్యవస్థ చురుగ్గా వుండాలంటే ప్రయివేటు రంగం ఏడాదికి రూ. 5 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టాలిట. ప్రాజెక్టు రెండేళ్లు పడుతుందనుకుంటే రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడి అవసరమయ్యే పథకాలుండాలి. ఒక్కో పథకానికి రమారమి వెయ్యి కోట్లు ఖర్చవుతుందని అనుకుంటే వెయ్యి ప్రాజెక్టులుండాలి. ప్రభుత్వాధికారులు ఏడాదికి వెయ్యి పథకాలు తయారుచేయాలి. ఇవి కాక ప్రభుత్వరంగంలో తయారుచేయాల్సినవి ఎలాగూ వుంటాయి. ఇన్ని వాళ్లు చేయలేరు అని గ్రహించినవాళ్లకు స్విస్ ఛాలెంజ్ విధానం స్ఫురించింది. ప్రభుత్వాధికారులు తాపీగా చేస్తారు, ప్రయివేటు పెట్టుబడిదారులు చకచకా చేస్తారు కాబట్టి దీనివలన టైము కలిసి వస్తుంది అనుకున్నారు.

ఉదాహరణకి 'ఆంధ్రలో యిదివరలో జలరవాణా విరివిగా సాగేది. పోనుపోను కాలువలను నిర్లక్ష్యం చేసి రోడ్డు రవాణానే ప్రోత్సహించారు. దాని కారణంగా రోడ్ల అరుగుదల, నిర్వహణావ్యయం, ఇంధనం ఎక్కువగా ఖర్చవడం, పర్యావరణంలో వేడి పెరగడం వంటి అనేక అనర్థాలు జరుగుతున్నాయి. ఆంధ్రలోని కాలువల్లో పూడిక తీసివేసి, కొత్తకాలువలు అనుసంధానించి, వాటిలోకి నీరు మళ్లించి, చౌకగా జలరవాణా జరిగేట్లా చేస్తాం' అనే ప్రతిపాదనతో ఎవరైనా ముందుకు వచ్చారనుకోండి. అతన్ని ఒరిజినల్ ప్రాజెక్టు ప్రపోజర్ (ఒపిపి) అంటారు. ఏ కాలువను వుపయోగించుకోవాలి, దేన్ని కొత్తగా తవ్వాలి, దానికి నీళ్లు ఎక్కణ్ణుంచి వస్తాయి, ప్రమాదాలు జరగకుండా సరుకులు వేగంగా వెళ్లేట్లుగా ఎటువంటి బోట్లు, యింజన్లు పెట్టాలి, వీటికంతా అయ్యే ఖర్చెంత.. యిలాటి అంశాలన్నీ అతనే ఖర్చుపెట్టి అధ్యయనం చేసుకుంటాడు. ఇంత ఖర్చుతో నేను పూర్తి చేస్తాను అని రాసి యిస్తాడు. అది పట్టుకుని సంబంధిత ప్రభుత్వ కార్పోరేషన్ వద్దకు వస్తాడు. వాళ్లు దాన్ని పరిశీలించి, యిది జరిగే పనా, జరగని పనా అన్నది తేలుస్తారు. అంటే ప్రభుత్వాధికారులకు నూతనమార్గంలో ఆలోచించే పని తప్పింది, దాని గురించి లోతుగా స్టడీ చేసి ప్రాజెక్టు రిపోర్టు పనీ తప్పింది. చేతికి వచ్చిన రిపోర్టును స్టడీ చేసి సాధ్యాసాధ్యాలను పరీక్షిస్తే చాలు. ఇక్కణ్ణుంచి మరో శాఖకు కూడా వెళ్లి ఆర్థికపరమైన

అంశాలు కూడా నిర్ధారించుకున్న తర్వాత ప్రభుత్వం దృష్టికి వస్తుంది. 'ఈ ప్రాజెక్టును నేను యింతకు చేయడానికి సిద్ధం, ఇంత తక్కువకు మరెవరూ చేయలేరు' అని ఒపిపి ఛాలెంజ్ విసురుతాడన్నమాట. దాన్నే స్విస్ ఛాలెంజ్ అంటారు. ఇక్కడిదాకా ప్రభుత్వం స్పందించదు.

ఆంధ్ర సీడ్ క్యాపిటల్ నిర్మాణ విషయంలో యీ వరుస పాటింపబడలేదు. 'పాపం మీ రాష్ట్రానికి రాజధాని లేదుట కదా, ఓటి కట్టుకుంటే మంచిది కదా, కట్టిపెట్టనా?' అంటూ ఒపిపి ఐన సింగపూరు కన్సార్షియం వచ్చి చెప్పలేదు. అదేమీ వాళ్ల కొత్త ఐడియా కాదు. నిజానికి ఒపిపిని ఇన్నోవేటర్ అని కూడా అంటారు. స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో ఇతని ఛాలెంజ్ స్వీకరించి, యితని కంటె తక్కువ రేటు కోట్ చేసిన పోటీ కాంట్రాక్టర్లు చాలామంది వస్తే అప్పుడు ప్రభుత్వం యితని యిన్నోవేటివ్ ఐడియా పేటెంట్‌కు గాను అతనికి కొంత డబ్బు చెల్లించి సొంతం చేసుకుని వాళ్లకు పని అప్పచెబుతుంది. అంత కొత్తగా, ఎవరికీ తట్టనంత పద్ధతిలో వుండాలన్న మాట ప్రతిపాదన. రాజధాని నిర్మాణం ఎవరికీ తట్టని సరికొత్త ఆలోచనా? విభజన ప్రకటన వెలువడగానే చంద్రబాబుగారు 'ఆంధ్ర రాజధాని కట్టుకోవడానికి నాలుగైదు లక్షల కోట్లు కావాలి' అంటూ పాట మొదలుపెట్టారు. తెలుగుజాతి యిలా చీలిపోతున్నందుకు అందరూ నిర్ఘాంతపోతున్న సమయంలో కూడా రాజధాని, దానికయ్యే ఖర్చు అంటూ ఆలోచించగలిగిన దీర్ఘదర్శి ఆయన. మామూలుగా రాజధాని అనగానే చండీగఢ్, భువనేశ్వర్, గాంధీనగర్, నయా రాయపూర్.. యిలాటివి తడతాయి. వాటికి లక్షల కోట్లు ఎందుకు? ఎవరూ అడగనూ లేదు, ఎవరూ యివ్వనూ లేదు. కానీ బాబుగారి వూహలో రాజధాని ప్రభుత్వాఫీసుల సముదాయంతో వుండే పాలనాకేంద్రం మాత్రమే కాదు, వాణిజ్యకేంద్రం, విజ్ఞానకేంద్రం, విలాసకేంద్రం, సాంస్కృతిక కేంద్రం, సాహిత్యకేంద్రం, క్రీడా కేంద్రం, యాత్రాకేంద్రం.. యిలా ఎన్ని కేంద్రాలకే కేంద్రం. అందుకే నాలుగైదు లక్షల కోట్ల బజెట్.

ఈ ఆలోచన చేసేనాటికి ఆయన ఆంధ్రకు ముఖ్యమంత్రి కూడా కాదు. తను కాకుండా మరొకరు వచ్చినా సరే, లక్షల కోట్లు కావాల్సిందే అనుకుని తన ప్లాను వెల్లడించిన నూత్న ఆలోచనాపరుడాయన. రాజధాని ఇన్నోవేటర్ అంటూ ఎవరినైనా పేర్కొనాలంటే బాబు పేరే చెప్పాలి. ప్రతిపక్షంలో వుండగా తీరిక ఎక్కువ కాబట్టి ఎన్ని ఆలోచనలైనా వస్తాయి. కానీ బాబు అధికారంలోకి వచ్చాక కూడా ఆ ఆలోచన వదిలిపెట్టలేదు సరి కదా, ఎన్నో మెరుగులు దిద్దారు. తన స్వప్నాన్ని ఆంధ్రప్రజల ముందు ఆవిష్కరించారు. వారేనా, తను వెళ్లిన ప్రతీ రాష్ట్రంలో, ప్రతీ దేశంలో దాని గురించే ప్రచారం చేశారు. దీని నిర్మాణంలో పాలు పంచుకోకపోతే భవిష్యత్తులో మిమ్మల్ని మీరు క్షమించుకోలేరుసుమా అని సుతారంగా హెచ్చరించారు. రియాల్టీ రంగంలో హేమాహేమీలే తలదించుకునేట్లా రంగురంగుల ప్రకటనలు వేయించారు. పోటీలు పెట్టి డిజైన్లు తయారుచేయించారు, మార్పించారు.

చంద్రబాబు మంచి టీము లీడరు. తనకున్న ఆలోచనలను, ఉత్సాహాన్ని సహచరుల్లో కూడా రగిలించారు. సింగపూరువాళ్లకు అప్పగించాలని ముందే అనుకున్నారు కాబట్టి, మంత్రులను అక్కడకు పంపించి దాన్ని చూడమన్నారు. 'సార్, యిక్కడ మొత్తం దేశమంతా కలిపి హైదరాబాదంత నగరం. మన రాష్ట్రంలో ఒక్క నగరం కూడా లేదు. అన్నీ పెద్దా చిన్నా పట్టణాలూ, పల్లెలే కదా. ఈ మోడలు మనకెందుకు పనికి వస్తుంది?' అని అడుగుదామన్న ఆలోచన కూడా రానంత యిదిగా ఊదరగొట్టేశారు. అందర్నీ ముందే మెంటల్‌గా సింగపూరు కన్సార్షియం అంటే ఓహో అనేట్లా చేశారు. ఇలాటి పరిస్థితుల్లో ఒపిపి అని చెప్పుకుంటున్న సింగపూరు కన్సార్షియం ఒరిజినాలిటీ ఏముంది? ఇన్నోవేషన్ ఏముంది?

స్విస్ ఛాలెంజ్ నిర్వచనంలో 'అన్‌సొలిసిటెడ్ బిడ్' అన్నారు. అంటే మనం అడక్కుండా వాళ్లంతట వాళ్లే పట్టుకుని వచ్చే ప్రతిపాదన అన్నమాట. ఇక్కడ అది అన్వయిస్తుందా? బాబు సింగపూరు వాళ్లను పిలక పట్టుకుని లాక్కుని వచ్చారు. వచ్చేముందు యిక్కడివాళ్లంతా సన్నాసులు అని మనందరి మెదళ్లల్లో ఎస్టాబ్లిష్ చేయవచ్చు. భారతీయ కంపెనీలు పరదేశాలలో అనేక చోట్ల అద్భుతమైన ప్రాజెక్టులు చేయవచ్చు. కానీ బాబు దృష్టిలో హైటెక్ సిటీ (టిడిపి ఆఫీసు కూడానా?) కట్టిన ఎల్‌అండ్‌టి వంటి ఒకటి రెండు సంస్థలు తప్ప తక్కినవన్నీ పనికి మాలినవి, వాటికి మురికివాడల్లాటి ఊళ్లు కట్టడం తప్ప మరేమీ చేతకానివి. ఆ ముక్క నిర్మొగమాటంగా పైకి చెప్పేశారు కూడా. ఇంకో అంశంలో కూడా యీ ప్రతిపాదనలో లోపం కనబడింది. మామూలు పద్ధతి ప్రకారం తన యిన్వేస్టిగేషన్‌తో ప్రపోజల్ పట్టుకుని వచ్చిన కన్సార్షియం తన ప్రతిపాదనలను సిఆర్‌డిఏకు సమర్పించాలి. వాళ్లు ఓకే చేశాక, అక్కణ్నుంచి అది చీఫ్ సెక్రటరీ నేతృత్వంలోని మౌలిక సదుపాయాల సంస్థకు వెళ్లాలి. ఆ తర్వాత ప్రభుత్వానికి చేరాలి. కానీ ప్రస్తుత సందర్భంలో పరిస్థితి రివర్సులో వెళ్లింది. ముందుగా ప్రభుత్వమే దీన్ని డీల్ చేసిందని జీవో ద్వారా తెలుస్తోంది. ఒకసారి పై వాళ్లు నిర్ణయం తీసుకున్నాక కిందిస్థాయి వ్యవస్థలు ఆ నిర్ణయానికి విరుద్ధంగా వెళ్లలేవు కదా! ఈ ముక్క న్యాయమూర్తే అన్నారు. వాళ్ల కంటె ముందు ఆంధ్ర చీఫ్ సెక్రటరీతో సహా అనేకమంది ఉన్నతాధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారట కానీ బాబు లెక్కచేయలేదు.

స్విస్ ఛాలెంజ్ కొత్తది కాబట్టి దాని పద్ధతి ఎలా వుంటుందో తెలియక చేసిన పొరపాట్లు కావివి. ఇప్పటికే దాన్ని చిలీ, అర్జెంటీనా, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్, ఇండోనేసియా, శ్రీలంక, తైవాన్‌లలో (వీటిల్లో చాలాభాగం సింగపూరులాగానే వాయువ్య ఆసియాలో వున్నాయి గమనించండి) ఆ పద్ధతి ప్రయత్నించి చూశారు. కొన్ని చోట్ల పనిచేసింది, కొన్ని చోట్ల చేయలేదు. భారతదేశంలో గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలలో పిపిపి బిడ్స్ విషయంలో ఉపయోగించి చూశారు. ప్లానింగు కమిషన్ 'దీన్ని అలవాటుగా చేసుకోకండి, మరీ అవసరమైతేనే వాడండి' అని చెప్పింది. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ దీనిలో గోల్‌మాల్ జరగడానికి చాలా అవకాశం వుంది అని అనుమానదృక్కులతోనే చూస్తుంది. ఠాణేలో యిళు

కట్టడానికి మహారాష్ట్ర హౌసింగ్ డెవలప్‌మెంట్ అథారిటీ, మెగాఫిల్మ్ సిటీ కట్టడానికి జయపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ యీ పద్ధతిని ఎంచుకున్నాయి.

ఏడాది క్రితం ఇండియన్ రైల్వేస్ స్విస్ ఛాలెంజ్ తరహాలో 400 రైల్వే స్టేషన్లను రీడెవలప్ చేయడానికి నిశ్చయించుకుని ప్రకటించింది. ఇప్పటిదాకా పురోగతి ఏమిటా అని చూడబోతే మూడు, నాలుగు స్టేషన్ల గురించి మాత్రమే వెబ్‌సైట్‌లో కనబడుతోంది. పని జరుగుతున్నవాటిలో కూడా స్విస్ ఛాలెంజ్ విసిరిన ఛాలెంజర్ ఎవరో తెలియలేదు. అసలా పద్ధతి విడిచిపెట్టి సంప్రదాయ పద్ధతుల్లో టెండర్లు పిలిచారేమో కూడా తెలియదు. కేంద్రంలోని రోడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ హైవేస్ మంత్రిత్వ శాఖ 18637 కిమీల పొడుగున 16 గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేస్ పిపిపిలో కట్టించబోయి, దానికి రెస్పాన్సు సరిగ్గా రాకపోవడంతో పోనీ యీ పద్ధతిలో కట్టిద్దామనుకుంది. అయితే ఫైనాన్స్ సెక్రటరీ విజయ్ కేల్కర్ ఆధ్వర్యంలోని కమిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెవలప్‌మెంట్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కై యీ పద్ధతి అవలంబించవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. దాంతో ప్రభుత్వం యిరకాటంలో పడింది. (ఆంధ్ర రాజధాని నిర్మాణం కూడా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేదా డెవలప్‌మెంట్‌లోకే వస్తుందంటే ఆ హెచ్చరికలు ఆంధ్రకూ వర్తిస్తాయి) ఏది ఏమైనా ఇండియాలో యిది యింకా స్థిరపడలేదని అర్థమవుతోంది. స్విస్ ఛాలెంజ్ పద్ధతి న్యాయబద్ధమే అని 2009లో సుప్రీం కోర్టు చెపుతూనే చాలా సేఫ్‌గార్డ్స్ తీసుకోవాలని నొక్కి చెప్పింది. వాటిల్లో లోపం వుందని తేలితే మాత్రం బిడ్ కాన్సిల్ అయిపోయే ప్రమాదం వుంది.

సరే, ఒపిపి తన ప్రతిపాదనను సవ్యమైన మార్గంలోనే ప్రభుత్వానికి పంపాడనుకోండి. అప్పుడు ప్రభుత్వం దాన్ని సకల వివరాలతో ప్రజల ముందు పెడుతుంది. ఇదిగో దీనిలో ఖర్చు యింత, ఆదాయం యింత, తనకు వచ్చినదానిలో యితను ప్రభుత్వానికి యింత వాటా యిస్తానంటున్నాడు. మీ సంగతేమిటి? అని బహిరంగంగా అందర్నీ అడుగుతుంది. అంకెలు యిప్పటికే తెలుసు కాబట్టి, అంతకంటె తక్కువకు యిస్తామని అనగలిగినవాడే ముందుకు వస్తాడు. రాకపోతే ఒపిపికే ప్రాజెక్టు దక్కుతుంది. వచ్చాడనుకోండి, అప్పుడు వాడిది ఎల్1, వాడికే కాంట్రాక్టు యిచ్చేస్తున్నాం అనదు ప్రభుత్వం. 'ఇదిగో వాడు నీ కంటె తక్కువకు చేస్తాడట, నువ్వు ఆ ధరకు చేయగలవా, ఆలోచించుకుని చెప్పు' అని కౌంటర్–ప్రపోజల్ చేసే అవకాశం ఒపిపికి యిస్తుంది. ఇదంతా దేనికంటె ప్రభుత్వానికి కూడా తట్టని ఐడియాను పుట్టించి, పెంచి పోషించినందున్నమాట.

ఆంధ్ర విషయంలో జరిగినదేమింటే ప్రభుత్వం తనకు ఒపిపినుంచి వచ్చే ఆదాయవివరాలను దాచేసింది. కన్సార్షియం తను ప్రతిపాదించిన ఆదాయ వివరాలను సీల్డ్ కవర్లో పెట్టి యిచ్చిందట. అది ప్రభుత్వమే విప్పి చూడలేదు కానీ 'వాళ్లతో సరితూగే ప్రతిపాదన మీరు చేయగలరా?' అని బిడ్డర్లను అడిగింది. వాళ్లింత యిస్తారని చెపితే, అంతకంటె రూపాయి ఎక్కువ యిస్తామనో, లేదనో చెప్పగలరు వీళ్లు. ఎంత యిస్తారో చెప్పకపోతే అది స్విస్ ఛాలెంజ్ ఎలా అవుతుంది? సంప్రదాయక సీల్డ్ కవర్ల టెండర్ల విధానమవుతుంది. ఈ గందరగోళాన్ని కోర్టే అర్థం చేసుకోలేక పోయింది. 'ఆదాయ వివరాలు బహిర్గతం చేయకపోతే ఎలా?' అని అడిగింది. అంతకంటె ముందు మరో సందేహం వచ్చింది కోర్టుకి – 'అవునూ, వాళ్లు ఎంత యిస్తారో సీల్డు కవర్లోనే వుందంటున్నారు. అది మీ ప్రభుత్వానికి లాభదాయకమో, నష్టదాయకమో మీకెలా తెలుసు?' అని అడిగింది. నిజమే కదా, సింగపూరు 'ఏమీ యివ్వం' అని వాళ్ల భాషలో రాసిన ఓ కాగితం పెట్టిందనుకోండి. అదే ఫైనల్ అయిపోతుంది కదా! కోర్టు వాళ్లు అడిగిన యీ ప్రశ్నకు ప్రభుత్వం తరఫున హాజరైన లాయరు ముకల్ రోహతగీ సమాధానం చెప్పలేకపోయారు. ఆయన నిజానికి కేంద్ర ప్రభుత్వానికి అటార్నీ జనరల్. తమ అడ్డగోలు విధానాన్ని సమర్థించడానికి చిన్నవాళ్లయితే సరిపోరని రాష్ట్రప్రభుత్వం ఆయన్ను లాక్కునొచ్చింది.

అంత పెద్దవాడైనా ఆయన వాదనలు కూడా తిక్కతిక్కగా వున్నాయి. అసలు యీ కేసు వేయడానికి పిటిషనర్లకు అర్హత లేదన్నాడు. 'ఎల్‌అండ్‌టీ వంటి పెద్ద సంస్థే ఏమీ అనలేదు కానీ రోడ్డు మీద వెళ్లే అనామకుల్లాటి యీ పిటిషనర్లెవరు అభ్యంతర పెట్టడానికి..' అని వాదించాడు. ఈయనకి బాబు స్వయంగా బ్రీఫింగు యిచ్చినట్టున్నారు. తమకు తోచినట్లు ఏదో చేసేయడం, యిది నియమాలకు విరుద్ధంగా వుందంటూ కోర్టుకి వెళ్లినవారిని ఉన్మాదులనడం బాబుకి అలవాటైంది. అందరూ మన్నించే ఎబికె ప్రసాద్ వంటి సీనియర్ పాత్రికేయుడిపై ఉన్మాది అంటూ నోరుపారేసుకున్నారు బాబు. ఇప్పుడు రోహతగి! పిటిషనర్ వాదన సమంజసమా కాదా అని మాట్లాడాలి తప్ప అతడు అనామకుడైతే మీకేం, కాకపోతే మీకేం? ఎల్ అండ్ టి అభ్యంతర పెట్టలేదంటే దానికేం మొహమాటాలున్నాయో, దీని విషయంలో వూరుకో, నీకు యింకోటి యిప్పిస్తా అని ఆశపెట్టారేమో! అసలు అవన్నీ అనవసరం. రూలు ప్రకారం ఆదాయవివరాలు యివ్వాలి, యివ్వలేదు, తప్పు.. దట్సాల్!

న్యాయమూర్తికి వచ్చిన మరో సందేహం ఏమిటంటే – ఒపిపికి 5 నెలలు గడువిచ్చారు. తక్కిన బిడ్డర్లకు కౌంటరు ప్రపోజల్‌కై యివ్వాల్సిన 60 రోజుల గడువు బదులు 45 రోజులే యిచ్చారేం? అని. దానికి సమాధానం యివ్వకపోగా 'స్టే యిస్తే జాతి ప్రయోజనాలకు విరుద్ధం' అంటూ రోహతగి దబాయింపు ఒకటి. ఆలస్యం చేస్తే సింగపూరు కన్సార్షియం వెనక్కి వెళిపోతుందన్న బెదిరింపు ఒకటి. వెళితే వెళ్లనీయండి, వీడు కాకపోతే మరొకడు. అసలు మొదట్లో సింగపూరు ప్రభుత్వమే ఆంధ్ర రాజధాని కడుతుందని బాబు డప్పేశారు. అప్పుడు నేను సింగపూరు పత్రికలు, వెబ్‌సైట్లు తిరగేసి, అదేమీ కాదని వాదించాను. అటుతిరిగి యిటుతిరిగి ఫైనల్‌గా అది మూడు ప్రయివేటు సంస్థలు ఏర్పరచిన కన్సార్షియంగా తేలింది. దాని కథ, అది పొందుదామని చూస్తున్న ప్రయోజనాల గురించి మరోసారి చెప్పుకోవచ్చు. ప్రస్తుతానికి మాత్రం గ్రహించవలసినది – ఆంధ్రప్రభుత్వం రూల్సును పట్టించుకోకుండా స్విస్ ఛాలెంజ్ పేరుతో ఆ కన్సార్షియంకు కాంట్రాక్టు కట్టబెట్టబోయింది. బిడ్డు మాట ఎలా వున్నా ప్రభుత్వ నోటిఫికేషన్‌నే ఛాలెంజ్ చేశారు

కొందరు బిల్డర్లు. హైకోర్టు స్టే యిచ్చింది. ప్రభుత్వాన్ని కౌంటరు దాఖలా చేయమంది. అక్టోబరు 31 న తదుపరి విచారణ అంది. ఈ స్టేను ఆంధ్రప్రభుత్వం ఛాలెంజ్ చేస్తోంది. ఇన్ని ఛాలెంజ్‌లు చూస్తూ వుంటే యీ బిడ్‌లో స్విస్ ఛాలెంజ్ కంటె ఆంధ్రా ఛాలెంజ్‌లే ఎక్కువగా కనబడుతున్నాయి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 27-28 వీక్లీకై ఎమ్బీయస్ : ఆరెస్సెస్-బిజెపి పేగుబంధం

ఆరెస్సెస్‌లో క్రమశిక్షణ ఎక్కువ. దాని సిద్ధాంతాలను మనసా, వాచా, కర్మణా నమ్మిన దాని కార్యకర్తలే ఆ సంస్థలో కొనసాగగలరు. ఆరెస్సెస్‌లో కాని, కమ్యూనిస్టుల్లో వాదోపవాదాలు తక్కువ. అధినాయకత్వం చెప్పినది తల వంచుకుని వింటారు. అలా వంచకుండా స్వతంత్రంగా ఆలోచించేవారిని, సందేహాలు వెలిబుచ్చేవారినీ సంస్థలో వుంచరు. కమ్యూనిస్టుల్లో ఆ కట్టుబాటు చెదిరిపోయి చాలాకాలమైంది. గోవా ఆరెస్సెస్ సంఘచాలక్ సుభాష్ వెళింగ్‌కర్‌ను 300 మంది అనుచరులతో సహా సంస్థ నుంచి బహిష్కరించడంతో ఆరెస్సెస్‌లో కూడా ముసలం ప్రారంభమైందన్న సంకేతం వెలువడింది. ఇంతకీ వెళింగ్‌కర్ చేసిన తప్పేమిటి? అవినీతికి పాల్పడ్డాడా, పాకిస్తాన్‌ను ప్రశంసించాడా అన్న సందేహం రావచ్చు. అదేమీ లేదు, బిజెపివారు గతంలో చేసిన వాగ్దానానికి కట్టుబడి వుండమని వెంటపడ్డాడు. 1990లో గోవాను మహారాష్ట్ర గోమంతక్ పార్టీ పాలించే రోజుల్లో కొంకణి, మరాఠీ మీడియం స్కూళ్లకు మాత్రమే ప్రత్యేక సాయం చేస్తానని ప్రకటించింది. ఆ సాయం కోసం 136 ఇంగ్లీషు మీడియం స్కూళ్లు (వాటిలో చాలాభాగం చర్చిలు నడిపేవే) రాత్రికి రాత్రి కొంకణి మీడియంలోకి మారిపోయాయి. రెండు దశాబ్దాలు అలా గడిచిపోయాయి. కానీ 2011 జూన్‌లో కాంగ్రెసు ముఖ్యమంత్రి దిగంబర్ కామత్ క్రైస్తవులను సంతృప్తి పరచడానికి 'ఇంగ్లీషు మీడియం స్కూళ్లకు కూడా సాయం అందిస్తాం' అని ప్రకటించాడు. అంతే మళ్లీ రాత్రికి రాత్రి అవన్నీ కొంకణిని వదిలిపెట్టి ఇంగ్లీషు మీడియం స్కూళ్లగా మారిపోయాయి.

దీన్ని ప్రతిఘటిస్తూ ఆరెస్సెస్ గోవా ఆరెస్సెస్ అధినేత సుభాష్ వెళింగ్‌కర్ 'భారతీయ భాషా సురక్షా మంచ్' (బిబిఎస్ఎమ్) అనే సంస్థ ఏర్పాటు చేసి ఉద్యమం మొదలుపెట్టాడు. బిజెపి నాయకుడు మనోహర్ పారీకర్ దానికి మద్దతు యిచ్చాడు. కోర్టులో పిటిషన్ కూడా వేశాడు. తాము గెలిస్తే యీ విధానాన్ని తిరగతోడుతామని బిజెపి ఎన్నికల మానిఫెస్టోలో పెట్టి 2012లో అధికారంలోకి వచ్చింది. మనోహర్ ముఖ్యమంత్రి అయ్యాడు కానీ పాలసీని మార్చలేదు. ఎందుకంటే గోవాలో కాథలిక్ ఓటర్ల సంఖ్య గణనీయంగా వుంది, పైగా 2012 ఎన్నికలలో కాథలిక్కుల ఓట్లు బిజెపికి పడ్డాయి. అతని ఉపముఖ్యమంత్రి కూడా కాథలిక్కే. సుభాష్‌కు అలాటి మొహమాటాలు లేవు కాబట్టి ఉద్యమం కొనసాగించాడు. మనోహర్ సుభాష్‌ను పిలిచి కోర్టులో పిటిషన్ ఉపసంహరించుకోండి, ప్రభుత్వం దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకోబోతోంది అని చెప్పాడు. సుభాష్ విత్‌డ్రా చేసుకున్నాడు. అలా రెండేళ్లు మాటలతో కాలక్షేపం చేసి చివరకు తను కేంద్రమంత్రిగా వెళ్లబోతూ ఆ స్కూళ్లకిచ్చే గ్రాంట్లను కొనసాగిస్తూ ఆర్డరు పాస్ చేసి మనోహర్ వెళ్లిపోయాడు. అతని వారసుడు లక్ష్మీకాంత్ పర్శేకర్‌ను 'మీరైనా ఆ గ్రాంట్ ఆపించండి' అని అడిగాడు. అతనూ మాట్లాడలేదు. దాంతో సుభాష్ మే 21 న 3 వేల మందితో సభ నిర్వహించాడు. ఇంగ్లీషు మీడియం కారణంగా భారతీయ భాషలకు విఘాతం కలుగుతోందని, ఇంగ్లీషు స్థానంలో కొంకణి ప్రవేశపెట్టాలని వారి డిమాండు. ఇది ఆరెస్సెస్ భావజాలానికి సన్నిహితంగా వుండే వాదనే. అయినా బిజెపిపై ఒత్తిడి తేలేదు.

బిజెపికి రాజకీయ అవసరాలే ముఖ్యమై పోయాయి. సుభాష్‌కు ఉద్యమం ముఖ్యం. ఇద్దరిలో ఎవరినో ఒకరినే ఎంచుకోవాలసిన అగత్యం పడింది ఆరెస్సెస్‌కు. వాజపేయి హయాంలో కంటె మోదీ హయాంలో ఆరెస్సెస్-బిజెపి సంబంధాలు మెరుగ్గా వున్నాయి. అనేక విద్యాసంస్థలలో, సాంస్కృతిక సంస్థలలో బిజెపి ఆరెస్సెస్ వారికే పదవుల నిచ్చింది. కానీ ఆరెస్సెస్‌కు తృప్తి లేదు. బిజెపి తగినంతగా చేయడం లేదని ఫిర్యాదు చేస్తోంది. కానీ బిజెపి అధికారంలో వుంది కాబట్టి ప్రతిపక్షాలు, మీడియా చేసే విమర్శలు తట్టుకోవలసిన అవసరం దాని కుంది. హద్దు దాటి వెళ్లడానికి బెదురుతోంది. గోరక్షకుల విషయంలో కూడా మోదీ కాస్త తబ్బిబ్బు పడడం జరిగింది. వారిని విమర్శిస్తే ఆరెస్సెస్‌కు కోపం వస్తుందని కాస్త జంకినా, కానీ ఊనా ఘటన తర్వాత దళిత ఓట్లను దృష్టిలో పెట్టుకుని మోదీ 'గోరక్షకుల పేర పనిచేసే వారిలో 80% మంది బోగస్ అని, కావాలని గొడవలు సృష్టించేవారని' అనవలసి వచ్చింది. దీనికి విశ్వహిందూ పరిషత్ చీఫ్ ప్రవీణ్ తొగాడియా తీవ్రంగా స్పందించి మోదీతో 'తమరే గతంలో గోరక్షకులను కీర్తించారు' అని గుర్తు చేసి ఆరెస్సెస్‌కు ఫిర్యాదు చేశాడు. ఆరెస్సెస్‌కు ఏం చేయాలో బోధపడక చివరకు నకిలీ గోరక్షకుల మీద దృష్టి పెట్టాలని అంటూనే 80% మంది నకిలీ అనడం సబబు కాదంది.

ఏది ఏమైనా బిజెపికి రాజకీయంగా యిబ్బందులు కలిగించాలని యీ దశలో ఆరెస్సెస్ అనుకోవటం లేదు. అందుకనే సుభాష్‌పై చర్య తీసుకుంది. తన ఉద్యమానికి ఆరెస్సెస్, బిజెపి మద్దతు యివ్వకుండా అడ్డు తగలడంతో కినిసిన సుభాష్ కొంకణి భాషారక్షణకై బిజెపికి వ్యతిరేకంగా కొత్త పార్టీ పెడతానని ప్రకటించాడు. అదే అదనుగా "అతను రాజకీయ పరమైన చర్యలకు పాల్పడ్డాడు. బిజెపి అధ్యక్షుడు అమిత్ షాకు వ్యతిరేకంగా నల్లజండాల ప్రదర్శన నిర్వహించాడు. ఆరెస్సెస్ క్రమశిక్షణను ఉల్లంఘించాడు. కొత్త పార్టీ పెట్టదలచుకుంటే ఆరెస్సెస్ పదవి వదిలేయాల్సింది. అతని భాషా ఉద్యమాన్ని సమర్థిస్తాం కానీ అతని చేష్టలను కాదు. అందుకే అతన్ని సంస్థ నుంచి పంపించివేశాం." అంటూ ఆరెస్సెస్ ప్రచార్ ప్రముఖ్ మన్‌మోహన్ వైద్యా ప్రకటించారు. ఈ ఉదంతం చెప్పే

పాఠం ఏమిటంటే – ఏ క్రైస్తవ ఓట్ల కోసమైతే కాంగ్రెసు 2011లో రూలు మార్చిందో, అదే ఓట్ల కోసం బిజెపి యథాతథ పరిస్థితి కొనసాగిస్తోంది. ప్రతిపక్షంలో వుండగా ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట. తమకు రాజకీయాలతో సంబంధం లేదని ఆరెస్సెస్ చెప్పినా బిజెపి రాజకీయ ప్రయోజనాలు కాపాడడమే దాని లక్ష్యం. ఒక రాష్ట్ర సంఘచాలక్ స్థాయి దాకా వచ్చినా అది గ్రహించలేని సుభాష్ అమాయకుడు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016) ఫోటో – సుభాష్ వెళింగ్‌కర్**

ఎమ్బీయస్ : అప్పుడెక్కడున్నారు మీ ఫ్రెంచ్‌వారు?

పారిస్ విమానాశ్రయంలో కస్టమ్స్ డెస్క్‌లో 83 ఏళ్ల ముసలాయనను ఆపి పాస్‌పోర్టు చూపించమని అడిగారు. ఆయన ఎక్కడ పెట్టాడో మర్చిపోయి బ్యాగ్ వెతుక్కుంటున్నాడు. కస్టమ్స్‌లోని ఫ్రెంచ్ అధికారి పొగరుబోతు. "మీ వయసు చూడబోతే 80 దాటినట్లున్నాయి. ఇన్నేళ్లల్లో ఫ్రాన్సు చూడడానికి వచ్చే వుంటారు (పారిస్‌కు టూరిస్టులు అత్యధిక సంఖ్యలో వస్తారు)" అన్నాడు చికాగ్గా.

పెద్దాయన చిరునవ్వు నవ్వి "ఇంతకు ముందు కూడా వచ్చాను." అని జవాబిచ్చి బ్యాగ్ వెతసాగాడు.

"మరి యిక్కడ ఎయిర్‌పోర్టులో పాస్‌పోర్టు చూపించమని అడుగుతారని, దాన్ని సిద్ధంగా పెట్టుకోవాలని తెలియదా? ఏళ్లు రాగానే సరిపోదు." అని దాదాపు అరిచినంత, కరిచినంత పనిచేశాడు ఆ అధికారి.

ఆ ముసలాయన తొణకలేదు, చిరునవ్వు చెదరనీయకుండా "కితంసారి నేను ఫ్రాన్సు వచ్చినపుడు పాస్‌పోర్టు చూపించాల్సిన అవసరమేమీ పడలేదు మరి." అన్నాడు.

అతని ప్రశాంతత అధికారిని మరింత చిర్రెక్కించింది. "ఇంపాజిబుల్, ఇదిగో ముసలాయనా, చూడబోతే అమెరికన్‌లా వున్నావు. మీ అమెరికన్లు మా ఫ్రాన్సు గడ్డమీద కాలు మోపాలంటే పాస్‌పోర్టు చూపించి తీరాలి. అబద్ధాలు మాని, యిప్పటికైనా తెలుసుకుంటే మంచిది." అని తర్జని చూపిస్తూ బెదిరించాడు.

ముసలాయన కాస్సేపు నిశ్శబ్దంగా వున్నాడు. తర్వాత ఆ ఫ్రెంచ్ అధికారిని ఎగాదిగా చూసి మొదలుపెట్టాడు – "రెండవ ప్రపంచయుద్ధ సమయంలో మీ దేశం జర్మనీ ఆక్రమణలో వుంది. మిత్రదేశాలు జర్మనీకి వ్యతిరేకంగా పోరాడుతూ, వారిని అనేక దేశాల నుంచి తరిమికొడుతున్నాయి. అమెరికా సైన్యాధిపతిగా మీ దేశాన్ని దాస్యం నుంచి విముక్తి చేయడానికి 1944లో నేను నార్మండీలోని ఒమాహా బీచ్‌లో దిగాను. అప్పుడు వెతికి పట్టుకుందామని పాస్‌పోర్టు చూపిద్దామన్నా ఒక్క ఫ్రెంచ్‌వాడూ కనబడలేదు. ఎక్కడ దాక్కున్నారో ఏమో.."

మొదటి ప్రపంచయుద్ధంలో పెద్ద సైనికశక్తిగా వున్న ఫ్రాన్సు రెండవ ప్రపంచయుద్ధం నాటికి బలహీనపడి జర్మనీకి లొంగిపోయింది. జర్మన్ సైన్యాలకు వ్యతిరేకంగా కొందరు ఫ్రెంచ్‌వారు స్థానికంగా సహాయనిరాకరణ, విద్రోహచర్యలు (రెసిస్టెన్స్) చేసేవారు తప్ప దేశపరంగా జర్మన్లను ఎదుర్కోలేక పోయారు. అమెరికా, రష్యా, ఇంగ్లండ్ వంటి మిత్రదళాల సైన్యాలే ఫ్రాన్సుకు స్వేచ్ఛ ప్రసాదించాయి. ఆనాటి రోజులను ముసలాయన గుర్తు చేయడంతో ఆ ఫ్రెంచ్ అధికారి మొహాన్న కత్తివాటుకి నెత్తురు చుక్క లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016) ఫోటో – 1944 జూన్ 6 న ఒమాహా బీచ్‌లో యుఎస్ ఫస్ట్ ఇన్‌ఫాంట్రీ డివిజన్ ప్రవేశిస్తున్న చిత్రం**

ఎమ్బీయస్ : ట్రంప్ దృష్టిలో చారిటీ

క్లింటన్ ఫౌండేషన్ గురించి యిప్పటికే పేపర్లలో వచ్చేసింది. హిల్లరీ పదవిలో వుండగా ఆమెరికా సాయం పొందాలనుకున్న దేశాధినేతలు ఆ ఫౌండేషన్‌కు విరాళాలు యిచ్చేవారని అందరికీ తెలిసిపోయింది. ఇక దాని గురించి ట్రంప్ రెచ్చిపోతూ వుండగానే "వాషింగ్టన్ పోస్ట్" పత్రిక ట్రంప్ ఫౌండేషన్ నిర్వాకాల గురించి బయటపెట్టింది. క్లింటన్ ఫౌండేషన్‌తో పోలిస్తే దీని సైజు 1% మాత్రమే. అది కొన్నయినా మంచి పనులు చేసిందని చెప్తున్నారు కానీ యిప్పటిదాకా బయటకు వచ్చిన వివరాల ప్రకారం ట్రంప్ ఫౌండేషన్ అతని వ్యక్తిగత, వ్యాపార ప్రయోజనాల కోసమే పనిచేసింది. ఉదాహరణకి 2007లో ట్రంప్ ఆరడగుల చిత్రపటం తయారు చేశారు. దాన్ని అతని భార్య ఫౌండేషన్ తాలూకు 20 వేల డాలర్ల డబ్బు పెట్టి కొని, అతనికే బహూకరించింది. అతని గోల్ఫ్ క్లబ్బుల్లో ఒకదాని బెడ్‌రూములో దాన్ని తగిలించారు. ట్రంప్‌కు ఫ్లారిడాలోని పామ్ బీచ్‌లో మార్–ఎ–లాగో క్లబ్బుంది. అక్కడ 2007లో 80 అడుగుల పెద్ద స్తంభాన్ని నిలబెట్టాడు. సిటీ నియమాల ప్రకారం 42 అడుగుల ఎత్తుకు మించి ఏదీ పెట్టకూడదు. అందువలన రోజుకి 1250 డాలర్ల ఫైన్ చొప్పున మొత్తం 120000 డాలర్ల జరిమానా వేశారు. అది అన్యాయమంటూ ట్రంప్ సిటీ పాలక వ్యవస్థ మీద కేసు పడేశాడు. ఆ తర్వాత ఏం జరిగిందో, ఎలా రాజీ కుదిరిందో తెలియదు కానీ ఆ నగరంలోని సిటిజన్స్ యునైటెడ్ అనే సంస్థకు ట్రంప్ లక్ష డాలర్ల విరాళం యిచ్చేశాడు, సిటీ పాలక వ్యవస్థ జరిమానా మాఫీ చేసేసింది. ఈ లక్ష డాలర్ల విరాళం ట్రంప్ తన క్లబ్బు ఖజానాలోంచి యివ్వలేదు, తన ఫౌండేషన్ నిధుల్లోంచి యిచ్చి పెద్ద దాతగా పోజు కొట్టాడు. దీనిలో మరో తిరకాసు కూడా వుంది. ఆ నగరంలో అనేక ధార్మిక సంస్థలుండవచ్చు, దీనికే ఎందుకు యిచ్చాడంటే యిది ఒక రైటిస్టు సంస్థ. రాజకీయ పార్టీలకు వ్యాపారస్తులు యిచ్చే విరాళాలు బహిర్గతం చేయనక్కరలేదని వాదించే ఆర్గనైజేషన్. దానికి అధిపతిగా వున్న

డేవిడ్ బాసీ అనే అతను ట్రంప్‌కు ఆప్తుడు. ప్రస్తుతం అతని డిప్యూటీ కాంపెయిన్ మేనేజర్!

ట్రంప్ యూనివర్శిటీ వ్యవహారాలపై 2013లో ఫ్లారిడా ఎటార్నీ జనరల్ విచారణ జరుపుతూన్న సమయంలో ఆమె ఎన్నికల ప్రచారానికై ట్రంప్ ఫౌండేషన్ 25 వేల విరాళం యిచ్చింది. ట్రంప్ యూనివర్శిటీ యిచ్చే డిగ్రీల్లాగే ట్రంప్ ఫౌండేషన్ విరాళాలూ బోగస్‌గా వున్నట్లున్నాయి అంటోంది హిల్లరీ తరఫున అధికార ప్రతినిధి క్రిస్టీనా రేనాల్డ్స్. ట్రంప్ ఫౌండేషన్ యిచ్చిన విరాళాలలో 2,58,000 డాలర్ల దానం యిలాటిదే అని సందేహించిన పాత్రికేయులు కూపీ లాగుతున్నారు. ఇవన్నీ బయటకు వస్తే తన యిమేజి భంగం అని భయపడిన ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా వున్న తన సంస్థల్లోని ఉద్యోగులెవరూ సమాచారం యివ్వకూడదని శాసించాడు. అంతేకాదు, బయటపెట్టం అని ఉద్యోగుల చేత లిఖితపూర్వకంగా హామీలు తీసుకుంటున్నాడు.ఇంతకీ ట్రంప్ ఫౌండేషన్ విషయంలో గొప్ప తమాషా ఏమిటంటే దానిలో చాలాభాగం యితరులు యిచ్చిన విరాళాలట, 2009 నుంచి ట్రంప్ ఒక్క సెంటు కూడా యివ్వలేదట. మరి అలా యిచ్చిన పుణ్యాత్ములెవరో ట్రంప్ వెల్లడిస్తే బయటకు వస్తాయి. ముందు అతను తన ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్స్ బయటపెడితే యింకా చాలాచాలా సంగతులు తెలుస్తాయి. గైడ్‌స్టార్ అనే సంస్థ క్లింటన్ ఫౌండేషన్ ఆదాయవ్యయాల్లో పారదర్శకత వుందనీ, ట్రంప్ ఫౌండేషన్ 2012 –2014 మధ్య యిచ్చిన 32 లక్షల డాలర్ల గురించి వివరాలు చెప్పటం లేదని, వారిలో పారదర్శకత లేదని అంటోంది. చూడబోతే హిల్లరీలో రాజకీయంగా నిజాయితీ లేదని, ట్రంప్‌లో ఆర్థికంగా నిజాయితీ లేదని అనిపిస్తోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016) ఫోటో – ఈ ఎన్నికలలో ఓట్ల కోసం ఫౌండేషన్ నిధులు వాడుతున్న ట్రంప్**

సెప్టెంబరు 29, 30 ఎమ్బీయస్ : జపాన్ ప్రధాని యుద్ధోన్మాదం–చక్రవర్తి శాంతిమంత్రం

రెండవ ప్రపంచయుద్ధం (1939–45)లో పశ్చిమాన జర్మనీ, ఇటలీ తూర్పున జపాన్ కలిసి అక్షరాజ్యకూటమిగా ఏర్పడి యితరదేశాలను ఆక్రమించాయి. ఇంగ్లండు, అమెరికా, రష్యాలు మిత్రదేశాల కూటమిగా ఏర్పడి వారిని ఎదిరించాయి. ఇటలీ ముందుగా ఓడిపోయింది, తర్వాత జర్మనీ. అయినా జపాన్ లొంగలేదు, అప్పటి చక్రవర్తి హిరోహిటో (1926–89) సామ్రాజ్యవాద యుద్ధోన్మాది కావడం చేత, ప్రపంచయుద్ధం సందర్భంగా తూర్పున అనేక దేశాలను ఆక్రమించి, వాటిని వదులుకోవడానికి యిచ్చగించని కారణంగా యుద్ధాన్ని విరమించలేదు. అప్పుడు అమెరికా అతి దారుణంగా హిరోషిమాలో అణుబాంబు పడేసి అత్యంత అమానుషంగా ప్రవర్తించింది. యూరోప్‌లో ప్రయోగించని బాంబును యిక్కడ ప్రయోగించడానికి కారణం, అమెరికాకు జపాన్‌పై పగ. ఎందుకంటే రెండవ ప్రపంచయుద్ధంలో అమెరికా ప్రవేశించాలా వద్దా అని ఆలోచిస్తున్న సమయంలో జపాన్ హఠాత్తుగా యుద్ధరంగంలోకి దిగి, పసిఫిక్ సముద్రం మీదుగా అమెరికా చేరి ఏ విధమైన హెచ్చరికలు చేయకుండా పె(ర)ల్ హార్బరుపై బాంబులు వేసి సర్వనాశనం చేసింది. దాంతో అమెరికా క్రుద్ధురాలై మిత్రరాజ్య కూటమిలో చేరి, యుద్ధఫలితాలను తారుమారు చేసింది. ఆ పగతో జపాన్‌పై ఆటంబాంబు వేసింది. వేసిన తర్వాతైనా జపాన్ చక్రవర్తి లొంగలేదు, మొండిగా కూర్చున్నాడు. అప్పుడు నాగసాకిలో మరో బాంబు వేశారు. అప్పుడు యిక లాభం లేదని చేతులు ఎత్తేశాడు. యుద్ధం అంతమైంది.

జపాన్‌లో చక్రవర్తిని దైవస్వరూపుడిగా చూస్తారు ప్రజలు. ఆయనను అవమానిస్తే భరించలేరు. అందుకే ఆయనతో అమెరికా చాలా జాగ్రత్తగా వ్యవహరించింది. ముస్సోలినీ పారిపోబోతూంటే అతని ప్రజలే అతన్ని చంపివేశారు. హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మిత్రదేశాలు వారి అనుచరులను పట్టుకుని యూరోపులో పాల్పడిన యుద్ధనేరాలకు న్యూరెంబర్గులో విచారణ జరిపి, అనేకమందికి శిక్షలు వేశారు. కానీ హిరోహిటో సజీవంగా దొరికినా అతన్ని క్షమాపణ చెప్పమని అడగలేదు. తాము ఆక్రమించిన దేశాలలో జపాన్ సైనికులు చాలా హీనంగా, అమానుషంగా, నేరపూరితంగా ప్రవర్తించారు. అయినా అమెరికా జపాన్ మిలటరీ అధికారుల్లో చాలామందిని శిక్షించకుండా వదిలేసింది. ఎందుకని అడిగితే అమెరికన్ మిలటరీ అడ్వయిజరు జనరల్ డగ్లస్ మెక్‌ఆర్థర్ "జపనీయులు జర్మన్లలా పరిణతి చెందిన జాతి కాదు, చక్రవర్తి ఆదేశాలు గుడ్డిగా పాటించడమే తప్ప ఆ నేరాలు వాళ్లు సొంతంగా చేసినవి కావు." అన్నాడు. జర్మనీ మళ్లీ యుద్ధానికి పాల్పడకుండా నడుం విరచడానికి దాన్ని రెండు ముక్కలు చేసి, ఒక ముక్కను కమ్యూనిస్టు బ్లాక్‌కు అప్పగించారు. జపాన్ విషయంలో దాని మానాన దాన్ని వదిలిపెట్టకూడదనుకున్నారు. ఏడేళ్లపాటు అక్కడే తిష్ట వేశారు. కొత్త రాజ్యాంగం రాసిచ్చి దాన్ని అవలంబించమన్నారు. ఆ 'పాసిఫిక్' రాజ్యాంగం ప్రకారం జపాన్ శాంతినే నమ్ముకోవాలి. సైన్యాన్ని పెట్టుకోవడానికి వీల్లేదు. అన్నీ కోల్పోయిన జపాన్ చక్రవర్తి, ప్రజలు కిక్కురుమనలేదు. ప్రజలు యుద్ధంతో విసిగిపోయారు. ఈ శాంతిపూర్వకమైన కొత్త రాజ్యాంగాన్ని మనసారా ఆహ్వానించారు. చక్రవర్తి గత్యంతరం లేక వూరుకున్నాడు. ఆక్రమించిన దేశాలలో తన సైన్యం చేసిన అత్యాచారాలకు ఎన్నడూ క్షమాపణ చెప్పలేదు.

ఆయన కుమారుడు అకిహిటో ఆయనకు భిన్నమైనవాడు. 1989లో తండ్రి మరణం తర్వాత చక్రవర్తి అయ్యాడు. యుద్ధనేరాలకు పశ్చాత్తాపపడ్డాడు. శాంతియుతమైన రాజ్యాంగమే జపాన్‌కు శ్రీరామరక్ష అని నమ్మాడు. చక్రవర్తిగా తన అధికారాలు నామమాత్రంగా వుంచుకుని, ప్రజలకు సన్నిహితం కావడానికి ప్రయత్నించాడు. యుద్ధాలు చేయనక్కరలేని, సైన్యాన్ని పెద్దగా పోషించవలసిన అవసరం లేని, ఆయుధాలు పెద్దగా కొనే అగత్యం లేని పరిస్థితుల్లో ప్రభుత్వం యితర అవసరాలకు తన నిధులు వెచ్చించడంతో, ప్రజలు పట్టుదలగా క్రృషి చేయడంతో గత 70 ఏళ్లల్లో జపాన్ ఎంతో పైకి వచ్చింది. తమ స్థితిగతులు బాగుపడడం వలన ప్రజలు

శాంతియుత వాతావరణాన్నే కోరుకుంటూ వచ్చారు.

ఇన్నాళ్లూ వున్న యీ పరిస్థితిని ప్రస్తుత ప్రధాని షింజో ఏబే మార్చాలని చూస్తున్నాడు. 62 ఏళ్ల షింజో లిబరల్ డెమోక్రాటిక్ పార్టీ (ఎల్‌డిపి)కి అధ్యక్షుడు. 2006 సెప్టెంబరులో పార్లమెంటు స్పెషన్ సెషన్‌లో జపాన్‌కు ప్రధానిగా ఎంపికయ్యాడు. కానీ అనారోగ్య కారణాలతో ఏడాది తర్వాత రాజీనామా చేశాడు. ఆ తర్వాత 2012 వరకు ఐదుగురు ప్రధానులు మారారు. 2012 సాధారణ ఎన్నికలలో ఎల్‌డిపి 480 సీట్లకు 294 గెలిచి షింజో మళ్లీ ప్రధాని అయ్యాడు. తన పేర 'ఎబెనామిక్స్' అనే ఆర్థిక విధానాలను అమలు చేశాడు, కానీ అవి ఫలించలేదు. దాంతో 2014లో రాజీనామా చేసి మళ్లీ నిలబడ్డాడు. 475 సీట్లలో 291 సీట్లు గెలిచి మూడోసారి ప్రధాని అయ్యాడు. తన భాగస్వామ్య పక్షమైన కోమిటోతో కలిసి పార్లమెంటు దిగువసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించాడు. 2018 వరకు అతను ప్రధానిగా వుండవచ్చు. 2016 జులై మూడోవారంలో పార్లమెంటు ఎగువ సభకు జరిగిన ఎన్నికలలో యిద్దరూ కలిసి అక్కడా మూడింట రెండు వంతుల మెజారిటీ తెచ్చుకోవడంతో షింజోకు ఎదురు లేకుండా వుంది.

ఆ ఎన్నికల సమయంలో 'దేశ ఆర్థికవ్యవస్థకు మళ్లీ జీవం పోస్తాను' అనే వాగ్దానం తప్ప రాజ్యాంగం మార్పుల గురించి మాట్లాడని షింజో గెలవగానే యిప్పుడు కొత్త పల్లవి ఎత్తుకున్నాడు. అతని విధానాలతో ఆర్థికంగా 4% ఎదుగుదల కలిగింది, స్టాక్ మార్కెట్ పుంజుకుంది. కానీ మాంద్యం నుండి బయట పడడానికి అది సరిపోలేదు. అతను చూస్తూండగానే చైనా జపాన్‌ను దాటుకుని వెళ్లిపోయింది. దేశ ఆర్థిక వ్యవస్థలో చురుకుదనం రావడానికి సేల్స్ టాక్స్‌ను 4% నుంచి 8% పెంచుతానని, ప్రస్తుతం 36% వున్న కార్పోరేట్ టాక్స్‌ను తగ్గిస్తానని అంటున్నాడు. చైనా ప్లాను చేసిన ఒన్ బెల్ట్, ఒన్ రోడ్ (ఒబిఒఆర్)లో జపాన్, ఇండియా తప్ప ఆ ప్రాంతంలోని దేశాలన్నీ సంతకాలు చేశాయి. దానికి ప్రతిగా ఒబామా చొరవతో ఏర్పడుతున్న ట్రాన్స్-పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్ (టిపిపి)లో జపాన్‌ను చేర్చాలని షింజో ఆలోచన. ఇప్పటివరకు దానిలో 11 దేశాలు మాత్రం సంతకాలు పెట్టడానికి సుముఖంగా వున్నాయి.

ఆర్థికపరంగా అనుకున్నంత విజయం సాధించలేకపోవడంతో షింజో ప్రజల దృష్టిని మళ్లించడానికి కాబోలు జపాన్‌ను సైన్యమార్గం పట్టించడానికి చూస్తున్నాడు. ఇకపై శాంతియుత రాజ్యాంగానికి కట్టుబడి వుండనక్కరలేదని వాదన మొదలుపెట్టాడు. ఇరుగుపొరుగు దేశాలతో ఏదైనా వివాదం వస్తే దాన్ని సైన్యశక్తి వుపయోగించుకోకుండా పరిష్కరించుకోవాలని రాజ్యాంగంలో రాసిన వాక్యాలను తొలగించాలని అతని పట్టుదల. జపాన్ పార్లమెంటులో కొందరు రైటిస్టు జాతీయవాద సభ్యులు నిప్పన్ కైగీ పేర ఒక కూటమిగా ఏర్పడ్డారు. యూరోప్ వలసవాదుల బారి నుంచి ఆసియాను రక్షించడానికే జపాన్ అవతరించిందని, యుద్ధనేరాలకు జపాన్ క్షమాపణ చెప్పనక్కరలేదని, చరిత్రను వక్రీకరించి జపాన్‌ను దుష్టశక్తిగా చూపిస్తున్నారని, రెండో ప్రపంచ యుద్ధంలో 3 లక్షల మంది చైనీయులను ఊచకోత కోసిన నాంజిగ్ సంఘటన జరగలేదని, జపాన్ చరిత్రను తిరగరాసి మళ్లీ ప్రబల శక్తిగా ఎదిగేందుకు అందరూ కలిసి రావాలనేది వారి ఉద్యమం. 'నిప్పన్ కైగీ'కి నాయకురాలైన తొనోమీ ఇనాదాను షింజో ఏరికోరి డిఫెన్సు మంత్రిగా నియమించాడు. యాసుకునీ అనే చోట జపాన్ యుద్ధవీరులకై కట్టిన స్మారక చిహ్నాన్ని షింజో, అతని సహచరులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించడం దక్షిణ కొరియా, చైనా ప్రజలను మండించి, పాతగాయాలను మళ్లీ రేపింది.

జపాన్‌కు బొత్తిగా సైన్యం లేదని కాదు. కానీ ఆ పేర కాకుండా 'ఆత్మరక్షణ దళం' పేర వుంటుంది. ఆసియాలో వున్న యితరదేశ సైన్యాలతో పోలిస్తే అత్యుత్తమ ఆయుధసంపత్తి, శిక్షణ కలిగివున్నారు. గత దశాబ్దకాలంగా అమెరికా తరఫున యితర దేశాలలో 'శాంతిదళం' (పీస్ కీపింగ్ ఫోర్స్) పేర యుద్ధాలలో పాల్గొంటోంది. ఇప్పుడు షింజో తన సైన్యానికి నేషనల్ డిఫెన్స్ ఫోర్స్ అని పేరు పెట్టబోతున్నాడు. అందుకే సైన్యానికి కేటాయించిన బజెట్‌ను 50 బిలియన్ డాలర్లకు పెంచాలని, ఉత్తర కొరియా అణుపరీక్షలు నిర్వహించిన సందర్భంగా తాము కూడా అణ్వాయుధాలు, మిస్సయిల్స్, సబ్‌మెరైన్లు, ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు సమకూర్చుకోవాలనేందుకు అనుమతించాలని కోరుతున్నాడు. ఫుకిషిమా న్యూక్లియార్ రియాక్టర్ విస్ఫోటం తర్వాత మూసేసిన న్యూక్లియార్ రియాక్టర్లను పునఃప్రారంభించాలన్న షింజో ఆలోచన చైనా, కొరియాలకు భయం కొల్పుతోంది. అమెరికా అడ్డు చెప్పకుండా, అది జపాన్‌లో మరిన్ని మిలటరీ బేస్‌లు ఏర్పాటు చేసుకునేట్లా వీలు కల్పించాడు షింజో. ఆసియాలో నిరంతరం పెరుగుతున్న చైనా ప్రభావాన్ని అడ్డుకోవడానికి అమెరికాకు జపాన్‌లో ఎన్ని సైనిక స్థావరాలుంటే అంత మంచిది. వాటి కోసం అమెరికా షింజోను ప్రోత్సహిస్తోంది. వారి తోడ్పాటుతో రాజ్యాంగం మార్చేద్దామని షింజో ప్లాను.

కానీ యివేమీ చక్రవర్తికి రుచించటం లేదు. చక్రవర్తులు సాధారణంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించరు. జపాన్ లొంగిపోయి 70 ఏళ్లయిన సందర్భంగా ఆగస్టు 8న ఆయన టీవీ ద్వారా ప్రసంగిస్తూ ప్రస్తుత రాజ్యాంగాన్ని మార్చడానికి తాను వ్యతిరేకినని స్పష్టంగా తెలిపాడు. యుద్ధబీభత్సాన్ని ఎవరూ మర్చిపోకూడదని, అలాటి పరిస్థితులు మళ్లీ రాకూడదనీ హితబోధ చేశాడు. చక్రవర్తికి పదేళ్లగా కాన్సర్ వుంది. గద్దె దిగిపోతానంటున్నాడు. ఈయన దిగిపోతే యువరాజుగా వున్న నరుహిటో చక్రవర్తి అవుతాడు. అతనేనా తన మాట వింటాడన్న ఆశ షింజోకు లేదు. ఎందుకంటే నరుహిటో యీ విషయంలో తండ్రి కంటె పట్టుదల వున్నవాడు. 2015 ఫిబ్రవరిలో తన పుట్టినరోజు నాడు ప్రసంగిస్తూ 'యుద్ధసమయంలో జరిగిన ఘోరాలను, నాశనాన్ని పెద్దలు పిన్నలకు వివరించి, శాంతి విలువను బోధించి, వారిలో యుద్ధోన్మాదం తలెత్తకుండా చూడాల'ని చెప్పాడు. అతను వస్తే తనకు మరీ యిబ్బందని షింజో

ముసలాయననే కొనసాగమని కోరుతున్నాడు. ఎందుకంటే రాజ్యాంగం మార్పు పట్ల ప్రజలు అటూయిటూగా వున్నారు. తామెంతో గౌరవించే చక్రవర్తికి కూడా యిష్టం లేదని తెలిశాక ప్రతిఘటించేవారి బలం పెరుగుతుంది. అప్పుడు షింజే నిస్సహాయ స్థితిలో పడతాడు. చివరకు యివన్నీ ఎటు దారి తీస్తాయో తెలియదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016) (ఫోటో – 1. జపాన్ ప్రధాని షింజో ఏబే, 2. చక్రవర్తి అకిహిటో**

సెప్టెంబరు 31,32 వీక్లీకై న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 97 ఎమ్బీయస్ : అమెరికా కాలేజీల సంక్షోభం

38 అమెరికా రాష్ట్రాలలో 130 క్యాంపస్‌లు, 45 వేల మంది విద్యార్థులు వున్న ఐటిటి టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ చెయిన్ ఆఫ్ కాలేజెస్ సెప్టెంబరు 6 న తమ క్యాంపస్‌లన్నీ మూసివేస్తున్నామని ప్రకటించి, సెప్టెంబరు 16 న దివాలాకు దరఖాస్తు చేయడం అమెరికన్ విద్యారంగంలోని అస్తవ్యస్త పరిస్థితిని ఎత్తిచూపుతోంది. 2008లో లేమాన్ బ్రదర్స్ పతనం క్రమేపీ ఆర్థికసంక్షోభానికి దారి తీసినట్లే, యీ మూసివేత విద్యారంగం కూలిపోవడానికి దారి తీయవచ్చని పరిశీలకులు భయపడుతున్నారు. ఈ గొలుసు కాలేజీలు లాభాపేక్షతో (ఫర్–ప్రాఫిట్) నడిచే కాలేజీల కాటగిరీకి చెందుతాయి.

అమెరికాలో రకరకాల కాలేజీలున్నాయి. కమ్యూనిటీ కాలేజీలు (సాధారణంగా వీటిని జూనియర్ కాలేజీలంటారు) సెకండరీ ఎడ్యుకేషన్ తర్వాత రెండు సంవత్సరాల (కొన్ని 4 సంఎఎల కోర్సులు కూడా వుంటాయి) సాంకేతిక లేదా ఉన్నతవిద్య గరపడానికి ప్రభుత్వం నెలకొల్పిన స్టేట్ కాలేజీలు, స్టేట్ యూనివర్శిటీలు ఉన్నత విద్య గరపి డిగ్రీ లిస్తాయి కానీ యివి అసోసియేట్ డిగ్రీలిస్తాయి. ఒకలా చెప్పాలంటే మనం జూనియర్ కాలేజీల్లో యింటర్మీడియట్ చదివినట్లు, అమెరికాలో కమ్యూనిటీ కాలేజీల్లో ప్రి–డిగ్రీ కోర్సు చేస్తారన్నమాట. ఇవన్నీ ప్రభుత్వరంగానికి చెందినవి. ప్రయివేటు రంగంలో వ్యాపారస్తుల చేత నడపబడేవి ఫర్ ప్రాఫిట్ (లాభాపేక్ష) కాలేజీలు. ప్రభుత్వరంగంలోని కాలేజీలు చాలా సబ్జక్ట్‌లలో డిగ్రీలిస్తాయి. సైజులో కూడా పెద్దవి. ప్రయివేటు కాలేజీలు చిన్నవి, అవి కొన్ని అంశాలలోనే డిగ్రీలిస్తాయి. 2003 వరకు పబ్లిక్ కాలేజీలు రాష్ట్రప్రభుతాలిచ్చే నిధులతో కొంత, విద్యార్థుల చేత కట్టించుకునే ట్యూషన్ ఫీజుల చేత కొంత నడుస్తూ వచ్చాయి. అయితే 2003 తర్వాత నుంచి ప్రభుత్వ నిధులు తగ్గడంతో ట్యూషన్ ఫీజు పెంచుకుంటూ పోయారు. ఇటీవల జరిగిన ఒక అధ్యయనం ప్రకారం కాలేజీ నిర్వహణకు ప్రభుత్వాని కంటె విద్యార్థులిచ్చేదే ఎక్కువగా వుంది. ప్రభుత్వ కళాశాలలే యింతలేసి ఫీజులు పుచ్చుకుంటూ వుంటే యిక ప్రయివేటు వాటి మాట చెప్పేదేముంది!

ప్రయివేటు కాలేజీలు గత కొన్ని దశాబ్దాలుగా వర్ధిల్లుతూ వచ్చాయి. ఇవి లాభాపేక్షతో పని చేస్తాయి కాబట్టి సమర్థవంతంగా నిర్వహించబడతాయని వూహిస్తారు కానీ ఆచరణలో మన దగ్గర నడిచే కార్పోరేట్ కాలేజీల్లాగే అవి మార్కెటింగుకై ఎక్కువ ఖర్చుపెడుతున్నాయి. 2009లో యీ కాలేజీలు తమ బజెట్లలో 17% చదువులపై ఖఱ్చుపెట్టగా 42% మార్కెటింగుకు, పెట్టుబడిదారులకు చెల్లింపులకు ఖర్చుపెట్టారు. ఫీనిక్స్ యూనివర్శిటీ నెలకొల్పిన అపోలో ఎడ్యుకేషన్ గ్రూపు యీ ఏడాది ఏపిల్ కంపెనీ కంటె ఎక్కువగా పబ్లిసిటీపై ఖర్చు పెట్టింది. ఇలా వాటి నిర్వహణ ఖర్చు పెరుగుతూ పోతోంది. దాన్ని విద్యార్థుల నుంచి అధిక ఫీజుల రూపేణా భర్తీ చేసుకుంటున్నారు. మన దగ్గర ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకం పెట్టిన తర్వాత పుట్టగొడుగుల్లా కాలేజీలు పుట్టుకుని వచ్చి చదువుపై ఆసక్తి లేనివారిని కూడా చేర్చుకుని వాళ్ల పేర ప్రభుత్వం నుంచి డబ్బులు లాగినట్లుగా, అక్కడా జరిగిందన్నమాట. ఇంతా చేసి విద్యలో నాణ్యతా లేదు. ఒకరితో మరొకరు పోటీ పడే క్రమంలో అక్రమాలకు పాల్పడడం, వాటి వలన క్రిమినల్ కేసులు, ఆంక్షలు ఎదుర్కోవడం జరిగాయి.

2010 నుంచి యీ లాభాపేక్ష కాలేజీలపై ప్రభుత్వ నిఘా పెరిగింది. స్కాలర్లు, అటార్నీ జనరల్, మీడియా వాటి గురించి వ్యతిరేకంగా మాట్లాడడం మొదలుపెట్టారు. 2016లో ట్రెజరీ డిపార్టుమెంటుకి చెందిన ఎకనమిస్టు నికొలస్ టర్నర్, జార్జి వాషింగ్టన్ యూనివర్శిటీలోని ఎకనమిస్టు స్టీఫెన్ సెలిని కలిసి చేసిన పరిశోధనలో యీ లాభాపేక్ష కాలేజీల్లో చదివిన కుర్రాళ్లు అసలు కాలేజీలకు వెళ్లకపోయినా, కమ్యూనిటీ కాలేజీల్లో చదివి అంతటితో ఆపేసినా బాగుండేదని తేల్చారు. వెటరన్ ఎఫయిర్స్ శాఖ వారు కూడా లాభాపేక్షతో నడిచే కాలేజీలపై వెటరన్స్ చాలా ఫిర్యాదులు చేశారని చెప్పింది. ముఖ్యంగా ఫీనిక్స్ యూనివర్శిటీ, ఐటిటి టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్, డెవ్రీ యూనివర్శిటీ, కొలరాడో టెక్నికల్ యూనివర్శిటీ విద్యాసంస్థలపై చాలా ఫిర్యాదులు వచ్చాయి.

ఇది నాణ్యత గురించిన అంశమైతే యీ కాలేజీల్లో చదివే విద్యార్థుల ఋణగ్రస్తత మరో అంశం. ఫీజులు చెల్లించలేని విద్యార్థులకు ఋణాలిచ్చి వారిని అప్పులపాలు చేస్తున్నాయి యీ కాలేజీలు. 2020 నాటికి అమెరికాలోని ఉద్యోగాల్లో 35% వాటికి డిగ్రీ కనీసావసరం అవుతుంది. 30% వాటికి అసోసియేట్ డిగ్రీ (మన ఇంటర్ లాటిది) అవసరం వుంటుంది. కానీ వాటిని సంపాదించాలంటే విద్యార్థులు తలమునిగేలా అప్పులు చేయవలసి వస్తోంది. ఉద్యోగం దొరికినా అప్పు తీర్చడానికి దశాబ్దాలు పట్టేట్టుందని వారు వాపోతున్నారు. 2000 సంఎఎరం నుంచి చదువుల నాణ్యత తగ్గుతూ, విద్యార్థుల అప్పులు పెరుగుతూ వస్తున్నాయి. ఈ స్టడీ లోన్స్ పెరుగుదలలో ప్రయివేటు కాలేజీల వాటా 75%! విద్యాఋణాలు యిప్పుడు 1.2 ట్రిలియన్ డాలర్లకు చేరాయి.

ఈ కాలేజీలు తమను తాము కాపాడుకునేందుకు రాజకీయనాయకుల అండ కోరి వారికి ఏదో ఒక పేర డబ్బులు ముట్టచెపుతున్నాయి. లారియట్ ఇంటర్నేషనల్ గ్రూపువారు తమ యూనివర్శిటీలకు గౌరవ ఛాన్సలర్‌గా, కన్సల్టెంట్‌గా వున్నందుకు బిల్ క్లింటన్‌కు 17.6

మిలియన్ డాలర్లు ముట్టచెప్పాయని పత్రికల్లో వచ్చింది. ఇక ట్రంప్ యూనివర్శిటీ గురించి చెప్పనే అక్కరలేదు. దానిపై విచారణ చేయాలని ఫ్లారిడా ఆదేశిస్తే ఎన్నికల ఖర్చు రూపేణా దాని అటార్నీ జనరల్‌కే లంచం యిచ్చాడట ట్రంప్. ప్రయివేటు కాలేజీల ఆగడాలు పెచ్చుమీరడంతో ఒబామా ప్రభుత్వం చర్యలు తీసుకోవలసి వచ్చింది.విద్యార్థులను మోసగించినందుకు ఐటిటిపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌ఛేంజ్ కమిషన్, కన్స్యూమర్ ఫైనాన్స్ ప్రొటెక్షన్ బ్యూరో కేసులు పెట్టాయి. అమెరికా విద్యారంగంలో ప్రైవేటు కాలేజీల పాత్ర పరిమితమైనదే. కానీ 2010-12 మధ్య ప్రభుత్వ ఎయిడ్, సబ్సిడీలలో 25% యివే తినేశాయి. విద్యాబుణాల బకాయిలలో 50% వాటికి యివే కారణం.

బుణాలు యీ స్థాయికి చేరినా, విద్యాప్రమాణాలు ఎంత ఘోరంగా పడిపోయాయంటే ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ వారు చేసిన సర్వే ప్రకారం అభివృద్ధి చెందిన దేశాలలో ఉన్నతవిద్య (హైస్కూలు తర్వాతది) వలన ప్రయోజనం పొందే దేశాలలో అమెరికాది కింద నుంచి మూడో స్థానం. ఖఱ్చు భరించలేక యువకులు పెద్దగా చదవలేకపోతున్నారు. నైపుణ్యం పెరగటం లేదు. నైపుణ్యం కావలసిన ఉద్యోగాలను విదేశాల నుంచి వచ్చినవారు ఎగరేసుకుని పోతున్నారు. ఫలితంగా వీరు నిరుద్యోగులుగా, చిరుద్యోగులుగా మిగులుతున్నారు. ఏదైనా సంస్థ తన సిబ్బందిని తగ్గించుకోవాలనుకుంటే మొదట తీసేసేది వీరినే. ఉద్యోగాలు లేనప్పుడు చదువు కోసం చేసిన అప్పులు తీర్చలేరు కదా, అందువలన ఆ విద్యాబుణాలు కొండల్లా పెరిగిపోతున్నాయి. ఈ కాలేజీలు ప్రభుత్వానికి పడిన బకాయిలూ ఆ స్థాయిలో పెరిగిపోయాయి.

ఈ పరిస్థితుల్లో ఐటిటిపై ప్రభుత్వం చర్య తీసుకుంది. ఆగస్టు నెలలో ప్రభుత్వ సహాయం కోరే విద్యార్థులను చేర్చుకోవద్దని ఐటిటిని ఆదేశించింది. అది కొత్తగా ఎవర్నీ చేర్చుకోవడం మానేసి, నెల తిరిగేసరికి యీ నెలలో మూతబడింది. బాన్‌క్రప్టసీ పిటిషన్ దాఖలు చేసింది. పిటి2010 నుంచి అది ప్రభుత్వం నుంచి పొందిన సాయం 5 బిలియన్ డాలర్లు. ప్రభుత్వ చర్యను కొన్ని పత్రికలు ఖండించాయి. ప్రయివేటు పెట్టుబడిదారులను సతాయిస్తోందని, వారి స్వేచ్ఛలను హరిస్తోందని ప్రచారం మొదలుపెట్టాయి. జరిగిందేమిటంటే - ఐటిటి అసోసియేట్ డిగ్రీలకు 45 నుంచి 53 వేల డాలర్లు వసూలు చేస్తోంది. అదే కనక ప్రభుత్వ కాలేజీలో అయితే హాస్టల్, మెస్, ట్యూషన్, ఫీజు కలిపి 10 వేలకు లోపే వుంటుంది. డిగ్రీ కైతే ఐటిటి 76 నుంచి 89 వేల డాలర్లు వసూలు చేస్తుంది. ప్రభుత్వ కాలేజీలైతే సరాసరిన 45 వేలకు లోపే! ఐటిటిలో చదివిన విద్యార్థులు తమకు బుణాలిచ్చి వడ్డీ (16.25% వరకు వుంటోందిట) పేర పీల్చి పిప్పి చేస్తోందని కాలేజీపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఉన్నత విద్య విషయంలో ఎక్రెడిటేషన్ (విద్యాలయాలకు గుర్తింపు) యిచ్చే అతి పెద్ద సంస్థ ఎక్రెడిటింగ్ కౌన్సిల్ ఫర్ ఇండిపెండెంట్ కాలేజెస్ అండ్ స్కూల్స్ (ఎసిఐసిఎస్), 20 మంది ఎటార్నీ జనరల్స్ కలిసి ఆ ఫిర్యాదులపై లోతుగా విచారణ జరిపారు. దానిలో తేలిందేమింటే - ట్యూషన్ ఫీజులు విపరీతంగా వున్నాయి. ఆ ఫీజులు చెల్లించడానికి ప్రైవేటు పార్టీల నుంచి ఏర్పాటు చేసిన బుణాలను తీసుకోమని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారు. బుణపత్రాలపై సంతకాలు చేసినప్పుడు షరతుల గురించి పూర్తి అవగాహన కల్పించటం లేదు. చివరకు బయటకు వచ్చిన తర్వాత యీ కాలేజీలకున్న చెడ్డపేరు కారణంగా ఆ డిగ్రీలకు ఎవరూ విలువ నివ్వటం లేదు, వీళ్లకు ఉద్యోగాలు రావడం కష్టమవుతోంది. పోనీ మధ్యలో ప్రభుత్వ కాలేజీలకు మారదామన్నా వీళ్లకు స్టాండర్డ్ తక్కువంటూ వాళ్లు తీసుకోవడం లేదు.

ఐటిటిలో డీన్‌గా పనిచేసిన ఒకామె విజిల్‌బ్లోయర్‌గా మారి అనేక విషయాలు బయటపెట్టింది. ఒక్క వాక్యం కూడా పూర్తిగా తప్పులు లేకుండా రాయలేని వాళ్లను కూడా ఐటిటి చేర్చుకుని ప్రభుత్వంనుంచి ఎయిడ్ పొందిందిట. సగటు విద్యార్థులను వెతికి పట్టుకుని తప్పుడు సమాచారంతో, అబద్ధపు హామీలతో ఒప్పించి, తమ కాలేజీలో చేర్చిన ఏజంట్లకు కమిషన్లు యిచ్చిందట. ఒకసారి చేరాక విద్యార్థులకు సరైన విభాగాల్లో తర్ఫీదు యివ్వకపోవడంతో వాళ్లు అర్ధాంతరంగా చదువులు ముగించుకున్నారట. మీకు లాప్‌టాప్‌లు వుచితంగా యిస్తామని చెప్పారట కానీ అసలు విషయమేమిటంటే టెక్స్‌ట్ బుక్స్‌కై 800 డాలర్లు వసూలు చేసి పుస్తకాలకు బదులు లాప్‌టాప్ చేతిలో పెట్టారట. విద్యార్థులనే కాదు, తమ కాలేజీలో పెట్టుబడి పెట్టినవారికి కూడా కాలేజీ యాజమాన్యం తప్పుడు సమాచారం యిచ్చిందట. ఆదాయం తగ్గుతోందని వారికి చెప్పనేలేదట.

ఇలాటి అక్రమాలు బయటపడడంతో వీటికి ఎక్రెడిటేషన్ ఆపేస్తారని రెండేళ్లగా అనుకుంటున్నారు. 2014-16 మధ్య లాభాపేక్ష కాలేజీల సంఖ్య 5% తగ్గింది. విద్యార్థుల సంఖ్య 11% తగ్గింది. ఫీనిక్స్ యూనివర్శిటీలో చేరేవారి సంఖ్య 2010 - 15 మధ్య సగానికి పడిపోయింది. ఇప్పుడు ప్రభుత్వం మేల్కొని తీవ్రచర్యలు చేపట్టి కాలేజీలు తమ ఆర్థిక వనరులు పెంచుకోవాలని సూచించింది. తక్కిన లాభాపేక్ష కళాశాలలు కూడా ఐటిటి బాట పడితే విద్యారంగంలో సంక్షోభం తప్పదు. విద్యాబుణాలు ఆర్థికరంగంపై ప్రభావం చూపకమానవు. గతంలో గృహబుణాల విషయంలో యిలాటి పొరపాట్లే జరిగి, డొమినో ఎఫెక్టు (గొలుసుకట్టు ప్రభావం)తో మొత్తం ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. అయితే అప్పుడు గృహబుణాలను కట్టకట్టి, మళ్లీ వాటిని ముక్కలుముక్కలుగా చేసి (ఫ్యాక్టరైజేషన్) యితరులకు అమ్మేస్తూ వచ్చారు. చేతులు మారిన కొద్దీ బుణం పరిణామం పెరుగుతూ వచ్చింది. ఈనాటి విద్యాబుణాల విషయంలో అలాటిది జరగలేదు కాబట్టి, ఆ ప్రమాదం లేదని పరిశీలకులు అంటున్నారు. కానీ విద్యాబుణాలు ఆందోళనకర స్థాయికి వచ్చాయన్నది మాత్రం వాస్తవం. అందుకే అధ్యక్ష ఎన్నికలలో 'కాలేజీ వరకు ఉచిత విద్య' అనేది ఒక నినాదమైంది. ఆ అంశంపై రాబోయే అధ్యక్షుడి దృక్పథం ఎలా వుంటుందో మరి! ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)

ఎమ్బీయస్ : తగిన సాధనసంపత్తి

జనరల్ పీటర్ కాస్‌గ్రోవ్ ప్రస్తుతం ఆస్ట్రేలియా గవర్నరు జనరల్. 2000 నుండి 2002 వరకు ఆస్ట్రేలియన్ ఆర్మీకు చీఫ్‌గా వుండి, 2002 నుంచి 2005 వరకు డిఫెన్స్ ఫోర్స్‌కు చీఫ్‌గా వున్నారు. జనరల్ హోదాకు ఎదిగారు. ఆయన జనరల్‌గా వుండగా తన మిలటరీ హెడ్‌క్వార్టర్సుకి ఒక బాయ్ స్కౌట్ ట్రూపు వచ్చి కొన్నాళ్లు తర్ఫీదు పొందడానికి అనుమతించారు. అలా అనుమతించడాన్ని పొరపాటుగా చిత్రీకరించదలచింది ఎబిసి రేడియోకు చెందిన ఒక మహిళా జర్నలిస్టు. ఒక లైవ్ బ్రాడ్‌కాస్ట్‌లో ఆమె మైకు తీసుకుని జనరల్‌ను ఇంటర్వ్యూ చేయసాగింది.

''జనరల్, మీరు ఆ స్కౌటు కుర్రవాళ్లకు ఏం నేర్పబోతున్నారు?'' అని అడిగిందామె.

''కొండలెక్కడం, విలువిద్య, తుపాకీతో పేల్చడం వగైరా నేర్పిస్తాం.'' సమాధానమిచ్చాడు జనరల్.

''తక్కినవాటి మాట సరే కానీ తుపాకీని ఎలా పేల్చాలో నేర్పించడం బాధ్యతారాహిత్యం కాదంటారా?''

''అలా ఎందునుకుంటారు? మా సిబ్బంది పక్కనే వుంటాం. బాధ్యతతో వ్యవహరిస్తాం.'' అన్నాడు జనరల్ అమాయకంగా.

''అది కాదు, తుపాకీ వాడడమంటే ప్రమాదకరమైన పని కదా.''

''దాని గురించి భయపడవద్దు. తుపాకీ ముట్టుకునేముందు ఎలాటి క్రమశిక్షణతో వుండాలో పూర్తిగా నేర్పిస్తాం. ఎవరికీ ఏ అపాయం రాకుండా చూసుకుంటాం.'' ఓపిగ్గా చెప్పాడు జనరల్.

కానీ జనరల్‌ను యిరకాటంలో పెట్టడమే జర్నలిస్టు లక్ష్యం. ''వాళ్లకు ప్రస్తుతానికి ఏమవుతుందా అని కాదు, ఇవాళ మీరు నేర్పించిన యీ విద్యతో రాబోయే రోజుల్లో వాళ్లు ఎలా మారతారా అని నా భయం. ప్రమాదకరమైన హంతకులుగా మారే సాధనసంపత్తి వాళ్లకు మీరు సమకూరుస్తున్నారన్న మాట మీరు కాదనగలరా?'' అంటూ గొంతు పెంచింది.

జనరల్‌కి ఆమె ఉద్దేశం అర్థమైంది. ''చూడండి మేడమ్, ఒక వేశ్య కావడానికి తగిన సాధనసంపత్తి మీ దగ్గర వుంది. కానీ అలా మీరు అలా కాలేదు.. కదూ!?'' అన్నాడు.

దీనికి ఎలా బదులివ్వాలో తెలియక ఆ జర్నలిస్టు అవాక్కయిపోయిందని, యింటర్వ్యూలో 46 సెకన్ల విరామం వచ్చిందని కొందరంటారు. అబ్బే, యిదంతా కట్టుకథ, యిలా ఏమీ జరగలేదని మరి కొందరంటారు. – **ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 33-35 ఎమ్బీయస్ : అబద్ధపు తీగతో నిజాల డొంక కదిల్చిన ఉండవల్లి

రాష్ట్రవిభజన జరిగింది అనేది చారిత్రక సత్యం. ఎలా జరిగింది అనేదే చర్చనీయం. పంపకాలు సరిగ్గా జరగలేదన్నది ఒక కోణమైతే, లోకసభలో బిల్లు పాసు కావడంలోనే వైఫల్యం వుందనేది మరో కోణం. ఎన్నడూ లేనట్లుగా తలుపులు మూసేసి, టీవీలు ఆఫ్ చేసి, గందరగోళంలో బిల్లు పాస్ చేయడం వలన తెలంగాణ ఆవిర్భావ బిల్లు వివాదాస్పదమైంది. దానిపై ప్రభుత్వాన్ని, ప్రధాన ప్రతిపక్షాన్ని అందరూ తప్పుపట్టడంతో రాజ్యసభలో చర్చ జరగనిచ్చారు. అక్కడ బిజెపి పట్టుబట్టడంతో ఆంధ్రకు ప్రత్యేక హోదా, ఆర్థికలోటు భర్తీ వంటి హామీలు యివ్వడం జరిగింది. (వాటి అమలు ప్రస్తుతాంశం కాదు) లోకసభలో కూడా యిలాటి చర్చ జరగనిచ్చి వుంటే, యిరు రాష్ట్రాలకు మరిన్ని రక్షణలు లభించేవేమో! విభజన చట్టం లోపభూయిష్టం అని రెండు రాష్ట్రాలవారూ యిప్పుడు అందరూ అంటున్నారు. అడావుడిగా, అస్తవ్యస్తంగా బిల్లు పాస్ చేయడం వలన యిప్పటిదాకా రెండు తెలుగు రాష్ట్రాలు జుట్టూజుట్టూ పట్టుకుని కొట్టుకుంటూనే వున్నాయి. అలాటి బిల్లు ఎందుకు పాస్ చేయవలసి వచ్చింది? తక్కిన పార్టీల మాట వదిలేయండి, ప్రధాన పక్షాలైనా కాంగ్రెసు, బిజెపి బిల్లుకు మద్దతు తెలిపాయని అనుకుంటే వాటి సంఖ్య కూడినా సింపుల్ మెజారిటీ వచ్చేస్తుంది. మరి అలాటప్పుడు పార్లమెంటులో యింత అకటావికటంగా ప్రవర్తించడం దేనికి? దాన్ని బయటకు లాగడానికి ఉండవల్లి ప్రయత్నించారు. ''విభజన కథ'' అనే పుస్తకం (నేనింకా చదవలేదు) రాసి, తను సాక్షిగా వున్న అనేక విషయాలు రాశారు. వాటితో పాటు 'నేను ఊహించిన ఘట్టం' అంటూ ఒకటి రాశారు. ఈ భాగం కల్పనే అని ముందుగానే ప్రకటించారు.

ఇది కాస్త వింతగా వుంది. చరిత్రను గ్రంథస్తం చేస్తున్నాను అంటూ మధ్యలో కల్పన రాయడం దేనికి? పాత్రికేయులు అన్ని సందర్భాల్లో అన్ని చోట్లా వుండలేరు. జరిగినది ఎవరి ద్వారానో వింటారు. కానీ చెప్పినవారు తమ పేరు బయటపెట్టవద్దని షరతు విధిస్తారు. అందువలన 'అభిజ్ఞవర్గాల భోగట్టా' అనో, 'పేరు చెప్పడానికి యిష్టపడని వ్యక్తి' అనో, 'తెలిసిన సమాచారం ప్రకారం..' అనో రాస్తారు. ఇవేమీ లేకపోయినా చివరిలో ...ట చేరుస్తారు. ఈయన అటువంటి మార్గాలేవీ ఎంచుకోకుండా ఎకాయెకి కల్పన అని రాసేశాడు. ఆ పుస్తకం విడుదలకు ముందు దానిలో కొన్ని భాగాలు ఆంధ్రజ్యోతిలో వచ్చాయి. అది చదవనివారి కోసం దాని సారాంశాన్ని యిస్తున్నాను –

'....కమల్‌నాథ్ స్పీకరుతో మాట్లాడి బయటకు వచ్చి తెలంగాణ బిల్లు పాస్ కావడం కష్టం అనేశారు. వాళ్లు జైపాల్ రెడ్డిగారిని లాక్కుని వచ్చారు. ఆయన స్పీకరు చాంబర్‌లో కూర్చుని కమల్‌నాథ్, సుష్మా స్వరాజ్‌ల మధ్య సయోధ్య కుదిర్చారు. అనుమానాలు

నివృత్తి చేశారు. అయితే స్పీకరు సభలో గొడవ జరుగుతూండగా బిల్లు పాసయిందని ప్రకటించడం ఎలా?' అని సందేహించారు. అప్పుడు జైపాల్ 'రూల్ 367 (3) ప్రకారం డివిజను జరగకుండా బిల్లు ఆమోదించే అధికారం స్పీకరుకి వుంది.' అన్నారు. స్పీకరు మీరా కుమార్ 'డివిజన్ జరగకపోయినా హెడ్ కౌంట్ జరగాలి. సభలో గందరగోళం వుండగా నిలబడినవారి సంఖ్య లెక్కించడం ఎలా?' అని స్పీరు అభ్యంతర పెట్టారు. 'అధ్యక్ష స్థానంలో కూర్చుని ఏం చెప్పినా దానిని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు. అన్ని సవరణలూ అరగంటలో ఫినిష్! బిల్లు పాసయిందని ప్రకటించేయండి. అధికారపక్షం మాట్లాడదు, ప్రతిపక్షం ప్రశ్నించదు. ఏమిటి అభ్యంతరం?' అని జైపాల్ అన్నారు. 'నియమాల గురించి మాట్లాడే మీరు తెలంగాణ వద్దకు వచ్చేసరికి ఎలా మారిపోయారు?' అని సుష్మ, కమల్, మీరా ఆశ్చర్యపడ్డారు. 'మొత్తం ప్రక్రియ టీవీ ద్వారా ప్రపంచం చూస్తూండగా, సెక్రటేరియట్ స్టాఫ్ ప్రతీదీ రికార్డు చేస్తూండగా యిలా బుకాయించడం ఎలా సాధ్యం?' అన్నారామె. 'మీరు అధ్యక్ష స్థానంలో కూర్చోగానే టీవీ ప్రసారాలు ఆగిపోతాయి. టెక్నీషియన్లు రిపేరు చేసేలోగా బిల్లు పాసయిపోతుంది.' అని జైపాల్ హామీ యిచ్చారు."

2014 ఫిబ్రవరి 18 న గంఎఎ 2.01 నిఎఎలకు, సరిగ్గా విభజన బిల్లుపై చర్చ ప్రారంభమైన మరుక్షణం లోకసభలో అమర్చిన 3 ఆటోమెటిక్ కెమెరాలు ఒకేసారి హఠాత్తుగా ప్రసారం చేయడం మానేశాయి. తలుపులు మూసేశారు. 4.30 కు బిల్లు పాస్ అయిందంటూ సభ్యులు బయటకు వచ్చేశారు. ఆ మధ్య లోకసభలో ఏం జరిగిందో చెప్పాలంటూ స.హ.చట్టం కింద అడిగితే మూడు కెమెరాలు ఒకేసారి, హఠాత్తుగా ప్రసారం చేయడానికి వీల్లేకుండా ఆగిపోయాయని, సభ వాయిదా పడ్డాకనే రిపేరు చేయించి సరి చేశామని సమాధానం వచ్చింది. లోపల ఏం జరుగుతోందో లోకానికి తెలియకుండా వుండడానికే టీవీలు ఆపేశారని తెలుస్తోంది. బిల్లు ఓటింగుకి పెట్టారని తెలిసి దాన్ని వ్యతిరేకించే ఎంపీలు బయట వుంటే వాళ్లు లోపలకి రాకుండా తలుపులు మూసేసి వుంటారు. జైపాల్ సలహా మేరకే టీవీలాపేసి, తలుపులు మూసేశారని ఉండవల్లి అనగానే జైపాల్ చాలా ప్రశ్నలు ఎదుర్కోవచ్చింది. దాంతో ఆయన దాన్ని ఖండించారు. ఆంధ్రజ్యోతి టీవీ ఛానెల్‌లో రాధాకృష్ణ ఆదివారం సాయంత్రం 7 నుంచి 9.30 వరకు నిర్వహించిన కార్యక్రమంలో మొదట జైపాల్ చేత మాట్లాడించి, తర్వాత ఉండవల్లిని లైనులోకి తెచ్చి మాట్లాడించారు. కాస్సేపటికి పొన్నం ప్రభాకర్ వచ్చారు. తర్వాత కోదండరాం, వినోద్, జితేందర్ రెడ్డి మాట్లాడిన దాంట్లో బిల్లు గురించిన విశేషాలేమీ లేవు. ఉండవల్లి తెరపైకి వచ్చేవరకు జైపాల్ చాలా ధాటీగానే మాట్లాడారు. తను బిల్లు గురించి తెరవెనుక చాలా చేశానని, కానీ దాని గురించి బయటకు చెప్పుకోలేదని, అలా చెప్పుకునే స్వభావం తనది కాదని, ఉండవల్లి తక్కిన విషయాలన్నీ కరక్టుగానే రాసినా, స్పీకరు చాంబర్‌లో జరిగినట్లుగా రాసినది మాత్రం అబద్ధమని, ఉండవల్లి ఒక నాటకరచయితలా కట్టుకథ అల్లారని చెప్పారు.

ఉండవల్లి లైనులోకి వచ్చాక జైపాల్ స్థయిర్యం చెదిరింది. అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పడంలో తబ్బిబ్బు పడడం స్పష్టంగా గోచరించింది. పొన్నం కానీ, మరొకరు కానీ ఉండవల్లి లేవనెత్తిన ఏ అంశాన్నీ ఖండించలేక పోయారు. వీళ్లు ఏదైనా అడిగితే 'ఆ విషయం పుస్తకంలో రాశాను కదా' అంటున్నారు ఉండవల్లి. జరిగినదేమిటంటే ఉండవల్లి పుస్తకాన్ని రాధాకృష్ణతో సహా ఎవరూ చదవలేదు. జైపాల్ మాత్రం 'పూర్తిగా చదివానయ్యా, నీ పుణ్యమాని చాలాకాలానికి తెలుగు పుస్తకం చదివా' అంటున్నారు. 'మీ గురించి రాసినదే చదివారు సార్, మొత్తమంతా చదివితే యీ ప్రశ్న అడిగేవారు కారు' అంటారు ఉండవల్లి. మొదటగా ఉండవల్లి స్పష్టం చేసిన విషయాలు – 1) విభజన చారిత్రక సత్యం. దాన్ని ఎవరూ తిరగదోడలేరు. 2) పార్లమెంటులో జరిగినదాన్ని సమీక్షించే అధికారం సుప్రీం కోర్టుకి లేదు. మేం సుప్రీం కోర్టులో కేసు వేసినది ఆ అంశంపై కాదు. 3) బిల్లు సరిగ్గా పాస్ కాలేదు. సరైన విధానాలు పాటింపబడలేదు. ఈ విషయాన్ని నేను ఎస్టాబ్లిష్ చేయదలచుకున్నాను. పాతగాయాలు రేపడానికి కాదు, యిలాటిది భవిష్యత్తులో జరగకుండా జాగ్రత్తలు తీసుకుని దేశంలో పార్లమెంటరీ వ్యవస్థను బలోపేతం చేయడానికి! ఇక ఉండవల్లి లేవనెత్తిన సాంకేతిక అంశమేమిటంటే – రూలు 367(3) ప్రకారం బిల్లు పాసు కావడానికి జరగవలసిన హెడ్‌కౌంట్ జరగలేదు అని.

దాని గురించి చెప్పడానికి ముందు తలుపులు మూసేసి, టెలికాస్ట్ ఆపేయడంపై చర్చ జరిగింది. ఆ సలహా నేనిచ్చానని ఉండవల్లి రాసినది కల్పన మాత్రమే అంటారు జైపాల్. ఉండవల్లి నడిగితే "కల్పనే అని నేనే రాశాను కదా, అక్కడ ప్రస్తావించిన కట్టెకాడ్ అనే పేరుతో వూరే లేదు. ఇంకో విషయం ఏమిటంటే ఒకవేళ నేను రాసినది నిజమే అయినా అటువంటి దుర్మార్గపు సలహా తనే యిచ్చానని జైపాల్ ఒప్పుకోరనీ మీరు గ్రహించాలి. నిజానికి ఆయన స్పీకరు చాంబర్‌కు వెళ్లిన సంగతి నాకు తెలియనే తెలియదు. ఆ ఘట్టం లేకుండానే పుస్తకం రాసేశాక ఆయనంతట ఆయనే 2015లో ఓ మీటింగులో తను స్పీకరు చాంబర్‌కు వెళ్లి ఒప్పించానని చెప్పుకున్నారు. ఇక స్పీకరు పాత్ర గురించి చెప్పాలంటే దిగ్విజయ్ సింగ్ వరంగల్ ఎన్నికల సభలో మాట్లాడుతూ 'మీకు తెలంగాణ యిచ్చినది ఎవరనుకున్నారు, సోనియా, మీరా కుమార్.. ' అంటూ పేర్లు చెప్పారు. స్పీకరుది అంపైర్ పాత్ర. క్రికెట్‌లో విజయానికి కారకులుగా అంపైర్‌ని కూడా పేర్కొన్నారంటే అతను పక్షపాతం వహించినట్లు అర్థం వస్తుంది కదా (ఇక్కడ జైపాల్ కలగచేసుకుని 'అది ఎన్నికల ప్రసంగం, మరీ లోతుగా అర్థాలు తీయకూడదు' అన్నారు). మరి స్పీకరును పక్షపాతంతో వ్యవహరించేందుకు ఒప్పించే నేర్పు జైపాల్‌కు తప్ప వేరెవరికి లేదు కదా అనుకుని ఆ వూహ చేశాను." అన్నారు.

"లేదు, లేదు రూలు 367(3) గురించి స్పీకరుకి చెప్పాను తప్ప, టెలికాస్ట్ ఆపేయమని నేను చెప్పలేదు. ఇక తలుపులు మూయడమంటావా, బిల్లు పాస్ చేసేటప్పుడు తలుపులు మూయడం సహజమే కదా.." అన్నారు జైపాల్. "డివిజన్ చేసినప్పుడు తలుపులు మూస్తారు కానీ, యీ బిల్లు విషయంలో డివిజను చేయనప్పుడు తలుపులు మూసేయడం దేనికి?" అని ఉండవల్లి

అడిగినపుడు జైపాల్ సమాధానం చెప్పలేకపోయారు. ''టెలికాస్ట్ ఆపేయమని మీరు చెప్పకపోతే మరి ఎవరు చెప్పారు?'' అని ఉండవల్లి అడగలేదు. అడిగినా జైపాల్ ''అది స్పీకరును, ఆవిడ సిబ్బందిని అడగాలి' అని చెప్పి తప్పించుకుంటారు కాబట్టి! ''స్పీకరుకి ఏ రూలు ప్రకారం పార్లమెంటు నడపాలో సలహా లిచ్చే హేమాహేమీలైన సిబ్బంది వుంది, ఆవిడా అనుభవజ్ఞురాలు, కాంగ్రెసు నాయకుడు కమల్ నాథ్, బిజెపి నాయకురాలు సుష్మా స్వరాజ్ అందరూ పార్లమెంటు వ్యవహారాల్లో కాకలు తీరిన యోధులే. వారెవరికీ తట్టని 367(3) మీ ఒక్కరికే తట్టిందనుకుందాం. ఆ ముక్క చెప్పడానికి గంట పట్టిందా? గంటసేపు మీరక్కడ ఏం చేశారు?'' అని అడిగారు ఉండవల్లి.

''దానిలో 40 నిఎఎలు సుష్మ, కమల్‌ల మధ్య సయోధ్య కుదర్చడానికే సరిపోయింది.'' అన్నారు జైపాల్.

''ఇద్దరూ తెలంగాణ బిల్లుకు అనుకూలమే అంటున్నారు. రెండు పార్టీల బలాలు కలిపితే మెజారిటీ ఆటోమెటిక్‌గా వచ్చేసింది అంటున్నారు. అలాటప్పుడు సయోధ్య కుదర్చవలసిన అవసరం ఏమొచ్చింది?''

''బిల్లు ప్రవేశపెట్టాక బిజెపి మోసం చేస్తుందని కమల్ భయం. కాంగ్రెసుకు చిత్తశుద్ధి లేదని సుష్మ భయం. నేను యిద్దరికీ నచ్చచెప్పాను. సభ సజావుగా జరగనప్పుడు ఓటింగు ఎలా చేపట్టాలని స్పీకరు అడిగారు. 15 మందిని సస్పెండ్ చేసినా అంతేమంది వెల్‌లోకి వచ్చి నినాదాలు చేస్తున్నారు. డివిజన్ ఎలా చేపట్టాలి? అని స్పీకరు అడిగారు. అప్పుడు నేను 367(3) ప్రకారం డివిజన్ అక్కర లేకుండా హెడ్‌కౌంట్‌తో బిల్లు పాస్ చేయవచ్చని, గతంలో ఉదాహరణ ఒకటి వుందని మీరాకు చెప్పాను. సుష్మ, కమల్ లాగే మీరాకు కూడా నా మీద గౌరవం వుండడం చేత నా మాట మన్నించింది.'' అన్నారు జైపాల్.

367(3) గురించి ఉండవల్లి వివరణ ఏమిటంటే – మామూలుగా ఎవరైనా ఒక్క సభ్యుడు డివిజన్ కోసం అడిగినా డివిజన్ ప్రకారం ఓట్లు లెక్కించాలి. అయితే అతను ఫ్రివోలస్ రీజన్ (పనికిమాలిన కారణం)తో డివిజన్ అడుగుతున్నాడని స్పీకరుకి తోస్తే అప్పుడు అది తోసిరాజని హెడ్‌కౌంట్‌తో సరిపెట్టవచ్చు. 1956లో కాంగ్రెసుకు బ్రూటల్ మెజారిటీ వుండే రోజుల్లో, 14 మంది సభ్యులు మాత్రమే వున్న ఒక పార్టీ ఎంపీ ఏదో బిల్లుపై డివిజన్ అడిగితే 'ప్రతిపక్షాలన్నీ కలిపినా కాంగ్రెసుకున్న ఓట్ల కంటె చాలా తక్కువ కదా' అంటూ స్పీకరు హెడ్‌కౌంట్‌తో కానిచ్చేశారట. ఇప్పుడు ఆ అధికారంతో వ్యవహరించేందుకు మీరా కుమార్ నిర్ణయం తీసుకున్నారు. బాగానే వుంది. కానీ యీ బిల్లు విషయంలో సౌగతా రాయ్ డివిజన్ కోసం అడిగినప్పుడు దాన్ని ఏ విధంగా ఫ్రివోలస్ అంటారని ఉండవల్లి ప్రశ్న. ఆయన చెప్పేదాని ప్రకారం ఆ రోజు బిల్లు పాస్ అయ్యేటంత మెజారిటీ కాంగ్రెసు, బిజెపిలకు లేదు. పార్లమెంటు అటెండెన్సు రిజిస్టరు తీసుకుని ఎవరెవరు వచ్చారు, వారిలో ఎవరు బిల్లుకు అనుకూలం, ఎవరు ప్రతికూలం అని లెక్కలు వేస్తే బిల్లుకు చాలినంత మంది సమర్థకులు లేరని తేలుతుందని, పార్లమెంటు రికార్డుల్లోంచి ఆ వివరాలన్నీ తీసుకుని పుస్తకంలో రాశానని, కావాలంటే ఛాలెంజ్ చేయవచ్చనీ ఉండవల్లి అంటారు. ఆ విషయంపై జైపాల్ వద్ద కానీ, పొన్నం వద్ద కానీ సమాధానం లేదు. నేను రికార్డులు చూడలేదని జైపాల్ చెప్పుకున్నారు. పొన్నం అసలు ఆ మాటే ఎత్తకుండా ఉండవల్లిని ఆంధ్రలో కాంగ్రెసు బాగు చేసుకోమంటూ ఎత్తిపొడవసాగారు. తెలంగాణ బిల్లు కోసం ఏళ్ల తరబడి కృషి చేసిన వీళ్లిద్దరూ బిల్లుకు అనుకూలంగా ఎందరు ఓటేశారు, ఎవరు వేయలేదు, ఎవరు వచ్చారు, ఎవరు రాలేదు అనేది కూడా పట్టించుకోలేదంటే వింతగానే వుంది.

ఉండవల్లి వాదన ప్రకారం ఆ రోజు లోకసభకు 354 మంది ఎంపీలు వచ్చారు. వారిలో కొందరు బిల్లుకు వ్యతిరేకులు. బిల్లు పెట్టామని చెప్పుకుంటున్న కాంగ్రెసు నుంచి 29 మంది, సమర్థించామని చెప్పుకున్న బిజెపి నుంచి 34 మంది సభకు రాలేదు. ఆ రోజు బిల్లు పాస్ అయ్యే ఛాన్సే లేదు. ఇటువంటి సున్నితమైన బాలన్సు వున్నపుడు డివిజన్ కోరిన సౌగతా రాయ్ అభ్యర్థిన ఫ్రివోలస్ ఎలా అవుతుంది? స్పీకరు ఒప్పుకుని వుండాల్సింది. ఒప్పుకోకపోవడం ఆవిడ యిష్టం. అయితే కనీసం హెడ్‌కౌంట్ చేసి వుండాలి. అది కూడా జరగలేదు అని ఉండవల్లి వాదించారు.

'హెడ్ కౌంట్ జరిగింది. బిల్లును వ్యతిరేకించిన ఆడ్వాణీ కూడా పార్టీ క్రమశిక్షణ పాటిస్తూ బిల్లుకు సమర్థనగా లేచి నిల్చున్నారు' అంటారు జైపాల్. 'మీరూ మేమూ బిల్లుకు సమర్థన తెలిపాక హెడ్‌కౌంట్ అక్కరనే లేదు అన్నారు సుష్మ' అని పొన్నం మొదట్లో అనేశారు. తర్వాత నాలిక కరుచుకుని 'జరిగింది, జరిగింది, నేనే ప్రత్యేక సాక్షిని. నువ్వు పార్లమెంటు బయట వున్నావు. నీకేం తెలుసు?' అని ఉండవల్లిపై విరుచుకు పడ్డారు. 'పార్లమెంటు రికార్డును ఎడ్ వెర్బేటమ్ (చెప్పినది చెప్పినట్లుగా) పుస్తకంలో రాశాను, చూసుకోండి' అంటారు ఉండవల్లి. 'నువ్వేం రాస్తే నాకెందుకు? హెడ్‌కౌంట్ జరిగింది' అంటూ పొన్నం మొండివాదన మొదలెట్టారు. ఇక ఆయన్ని వదిలేయవచ్చు. జైపాల్ మెత్తమెత్తగానే 'రికార్డులో ఏం రాశారో కానీ, హెడ్‌కౌంట్ జరిగింది, జరిగింది' అని అనసాగారు.

'హెడ్‌కౌంట్ ఎలా సాధ్యపడింది? మేం 79 మంది అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాం. ప్రవేశపెట్టడానికి 50 మంది వుంటే చాలు. కావాలంటే లెక్క పెట్టుకోండి అన్నా స్పీకరు సభ డిజార్డరులో వుంది, యీ గలభాలో ఎలా లెక్కపెట్టుకోగలను అంటూ ఆవిడ అనేకసార్లు నిరాకరించారు. 79 మందిని లెక్కపెట్టలేనివారు, ఆ రోజు మాత్రం 236 మందిని లెక్కించడం ఎలా సాధ్యపడింది?' అని ఉండవల్లి అడిగారు. 'ఇలా' అని జైపాల్, పొన్నం చెప్పలేకపోయారు. 'జరిగింది, జరిగింది' అని చిలకలా పదేపదే వల్లించారు. జైపాల్ 'వ్యక్తిగతంగా బిల్లును వ్యతిరేకించిన ఆడ్వాణీ లేచి నిలబడ్డారు, అది చూశాను.' అని చేర్చారు.

ఆడ్వాణీ లేచి నిలబడి వుండవచ్చు. కానీ వందలాది మందిని ఎలా లెక్కించగలిగారు? అన్న ప్రశ్నకి వాళ్ల దగ్గర సమాధానమే లేదు. దీన్ని ప్రేక్షకుల మెదళ్లలో బాగా ఎక్కించగలిగారు ఉండవల్లి. ఆ తర్వాత 'హెడ్‌కౌంట్ జరిగిందని మీరంటున్నారు. కానీ

సవరణలు ప్రతిపాదించిన ఒవైసీ 'హెడ్‌కౌంట్ చేయండి, చేయండి' అని కోరిన సంగతి రికార్డయింది కదా. హెడ్‌కౌంట్ జరిగి వుంటే ఆయన ఎందుకు అడుగుతాడు?' అని యింకో ప్రశ్న లేవనెత్తారు. దానికి మళ్లీ సమాధానం లేదు. 'ఒవైసీ చెప్పినది నేను వినలేదు, అంతా గందరగోళంగా వుంది, ఏమీ వినబడలేదు' అన్నారు జైపాల్. 'అదే నేను చెప్పేదీ, అంత గందరగోళంలో హెడ్‌కౌంట్ ఎలా సాధ్యం?' అన్నారు ఉండవల్లి మళ్లీ. 'జరిగింది, జరిగింది' అన్నారు జైపాల్ మళ్లీ. కాస్త ఆగి 'ఒవైసీ ప్రతిపాదించినది సవరణలు కదా. ఒరిజినల్ బిల్లుకు మాత్రం హెడ్‌కౌంట్ జరిగింది.' అన్నారు.

అక్కడ యిక్కడ ఒక విషయం స్పష్టమైంది. బిల్లు ప్రతిపాదన జరిగినప్పుడు హెడ్‌కౌంట్ జరిగినట్లు నమోదు చేసినా, సవరణలప్పుడు హెడ్‌కౌంట్ కూడా జరగలేదు – అని. ఆ ముక్క జైపాల్ అన్నట్లుగా నేను వినలేదు కానీ ఆంధ్రజ్యోతి 26 09 16 సంచికలో యీ చర్చకు అక్షరరూపం యిస్తూ 'తెలంగాణ రుణం తీర్చుకున్నాం' అనే శీర్షిక కింద యిచ్చిన వార్త లో '...సవరణలకు ఓటింగ్ కాలేదు. కానీ బిల్లుకు ప్రారంభంలో ఓటింగ్ జరిగింది.' అని ఆయన అన్నట్లు రాశారు. ఉండవల్లి మాట్లాడుతూ 'నువ్వు హెడ్‌కౌంట్ చేయనక్కరలేదమ్మా, చేసినట్లు నటించు సరిపోతుంది అని మీరు మీరాకు సలహా యిచ్చారు. మొదట్లో అలా చేశారు, తర్వాత అదీ మానేశారు..' అని కూడా అన్నారు.

మొత్తానికి బిల్లు సవరణలపై – డివిజన్ కాదు, హెడ్‌కౌంట్ కాదు, ఏ విధమైన ఓటింగు – జరగలేదు అన్న విషయం ఎస్టాబ్లిష్ అయింది. అలాటప్పుడు ఆ సవరణలను బిల్లులో చేర్చవచ్చా, లేదా? చేరిస్తే రాజ్యాంగానికి విరుద్ధమా, బిల్లు సక్రమంగా పాస్ అయినట్లా కాదా అనే విషయం నాకు తెలియదు. ఉండవల్లి పుస్తకంలో వుందేమో కూడా తెలియదు.

ఏది ఏమైనా సవరణలపై ఓటింగు జరగలేదన్న విషయాన్ని ఉండవల్లి జైపాల్ చేత ఒప్పించారు. దీనికి ఉండవల్లి వాడిన అస్త్రం – కల్పన! పోలీసు యింటరాగేషన్‌లో చూడండి 'నువ్వు ఎడం చేత్తో కత్తితో పొడిచావని కళ్లతో చూసిన సాక్షులున్నారు' అని పోలీసు అంటే నేరస్తుడు 'అలా ఎలా చెప్తారండి, నేను కత్తే వాడలేదు, పైగా నాది కుడిచేతి వాటం..' అని దొరికిపోతాడు. అలా ఉండవల్లి 'బిల్లు విషయంలో హెడ్‌కౌంట్ కూడా జరగలేదు' అని మొదలుపెడితే జైపాల్ చర్చ ముగింపు వచ్చేసరికి '...ప్రారంభంలో జరిగింది కానీ సవరణలకు జరగలేదు' అని చెప్పేశారు. పోలీసు విషయంలో బుకాయింపు అయితే ఉండవల్లి విషయంలో 'నేను వూహించా, కల్పించా' అని చెప్పుకునే లక్ష్యం సాధించారు.

'గోల్‌మాల్ చేయవలసిన అవసరం ఏముంది మాకు? ప్రధాన పక్షాలైన కాంగ్రెసు, బిజెపిలు రెండూ ఒప్పుకున్నాక...' అని తెలంగాణ నాయకులు అనవచ్చు కానీ ఆ నాటి పరిస్థితి అలా లేదన్నమాట సుస్పష్టం. అంత మెజారిటీయే వుంటే అవేళే, అంత గందరగోళ పరిస్థితుల్లో ఎందుకు చేయవలసి వచ్చింది అని ఉండవల్లి కానీ, మరొకరు కానీ అడిగినప్పుడు సమాధానం రానే రాదు. పైగా రాజ్యసభలో చర్చ జరిగింది. సవరణలు ప్రతిపాదించారు. మళ్లీ లోకసభకు పంపి ఆ సవరణలను చట్టంలో చేర్చి మళ్లీ తెప్పించుకోవాల్సి వుంది. కానీ వెనక్కి లోకసభకు పంపితే యీ సారి బిల్లు వీగిపోతుందని భయపడ్డారు. అందుకే ప్రత్యేక హోదా వంటి అంశాలు ప్రధాని హామీతో సరిపెట్టేశారు. అవి చట్టంలో పెట్టి వుండాల్సింది అని యిప్పుడు సాగదీస్తున్నారు. అవన్నీ చేర్చి లోకసభకు తిప్పి పంపితే అది అక్కడే మురిగిపోయేది. ఇది కాదనలేని సత్యం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 37 ఎమ్బీయస్ : విదర్భకు వచ్చేసరికి...

రాష్ట్రవిభజనకు ఎందుకు ఒప్పుకున్నారని తెలుగువారెవరైనా బిజెపి నాయకులను అడగగానే వారు ఠక్కున యిచ్చే సమాధానం – 'చిన్న రాష్ట్రాలు మా సిద్ధాంతం' అని. 'మరి సూపర్ పెద్ద రాష్ట్రమైన యుపిని అలాగ వదిలేశారేం? అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు కదా, యుపిని ముక్కలు చేస్తామని ప్రచారంలోనైనా ప్రస్తావించటం లేదేం?' అని అడిగితే సమాధానం వుండదు. యుపిలో అధికారంలో లేరు సరే, మహారాష్ట్రలో వున్నారు కదా, ప్రత్యేక విదర్భ ఉద్యమం యీనాటిది కాదు కదా, అక్కడేం చేస్తున్నారు వీరు? ఆగస్టు నెల అసెంబ్లీ సమావేశాల్లో జరిగినది చూస్తే బిజెపి ద్వంద్వవైఖరి బయటపడుతుంది.

విదర్భ ఉద్యమం గురించి క్లుప్తంగా చెప్పాలంటే – ప్రస్తుత అమరావతి, యవత్‌మల్, వార్ధా, నాగపూరు, భండారా, గోండియా, చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాలు విదర్భ కింద వస్తాయి. అక్కడ అరణ్యాలు, ఖనిజాలు ఎక్కువ. మహారాష్ట్రలోని తక్కిన ప్రాంతాల కంటె హిందీ వాడకం ఎక్కువ. 1938లో సెంట్రల్ ప్రావిన్సెస్ అసెంబ్లీ విదర్భకు ప్రత్యేక రాష్ట్రం వుండాలని తీర్మానించింది. 1953లో నాగపూరు ఒప్పందం కింద విదర్భను అభివృద్ధి చేస్తామని, ప్రతీ ఏడూ అసెంబ్లీ ఒక సెషన్ నాగపూరులో పెడతామనీ మాట యిచ్చారు. 1960లో భాషాప్రయుక్త రాష్ట్ర ప్రాతిపదికన మహారాష్ట్రలో కలిపారు కానీ నాగపూరు ఒప్పందం అమలు కాలేదని, తమకు అన్యాయం జరుగుతోందని విదర్భ ఉద్యమాన్ని మాధవ్ ఆనే అనే కాంగ్రెసు నాయకుడు ప్రారంభించారు. విదర్భకు ప్రత్యేక రాష్ట్రం అనే నినాదంతో 1962లో ఆయన లోకసభకు ఎన్నికయ్యారు. అదే నినాదంతో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు జంబువంతరావు ధోతే 1971లో ఎన్నికయ్యారు. విదర్భకు ప్రత్యేక రాష్ట్రం యిస్తామని 1979లో బిజెపి వాగ్దానం చేసింది. తాజాగా 2014 ఎన్నికలలో ప్రత్యేక విదర్భ నినాదంతో ఎన్నికలలో పోటీ చేసింది.

విదర్భలో వెనుకబాటుతనం వుంటూనే వుంది, ఎన్నికల సమయంలో ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడతామని అంటూనే వుంటారు,

ఎన్నికలయ్యాక దాని గురించి పట్టించుకోరు. గతంలో కాంగ్రెసు అలాగే చేసింది, యిప్పుడు బిజెపి కూడా అదే చేస్తోంది. నేటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ విదర్భ ప్రాంతం వాడే. ప్రత్యేక ఉద్యమసారథే. కానీ ముఖ్యమంత్రి కాగానే కాంగ్రెసు ముఖ్యమంత్రుల్లాగే విభజనకు అడ్డుపడుతున్నాడు. ఈ ధోరణి గమనించిన శ్రీహరి అనే మహారాష్ట్ర అడ్వకేట్ జనరల్ మార్చి నెలలో తన పదవికి రాజీనామా చేశాడు. అతను మాధవ్ ఆనే మనుమడే. ఫడ్నవీస్‌కు సన్నిహితుడే. అతన్ని అడ్వకేట్ జనరల్ పదవికి ఒప్పించడానికి ఫడ్నవీస్‌కు నాలుగు నెలలు పట్టింది. పదవిలో వచ్చాక ప్రభుత్వ పనితీరు చూసి అతను నివ్వెరపోయాడు. వ్యవసాయం, నీటి వనరులు, పశుగ్రాసం వంటి విషయాలలో ప్రభుత్వాన్ని సమర్థించడం నా వల్ల కాలేదని చెప్పుకున్నాడు. తన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు చెప్పటం లేదని, చెప్పినా పొంతన లేని సమాధానాలు చెప్తున్నారని, తనకే నమ్మకం కుదరనప్పుడు కోర్టులో ప్రభుత్వం తరఫున వాదించడం తన తరం కాదని చెప్పాడు. దేశానికే ఆర్థిక రాజధాని అయిన ముంబయిని ఏ పార్టీ శాసిస్తే వారికి నిధుల కొరత వుండదనే భావంతో, ముంబయితో కూడిన విశాలమైన మహారాష్ట్రను పాలించాలని ప్రతీ పార్టీ అనుకుంటూ వచ్చిందని, బిజెపి దానికి మినహాయింపు కాదనీ అన్నాడు.

ఈ క్రమంలో మరాఠ్వాడా, విదర్భ కొన్ని ప్రాంతాలకు అభివృద్ధి ఫలాలు అందక వెనకబడి పోతున్నాయని, ఆంబేద్కర్ కూడా మహారాష్ట్రను నాలుగు చిన్న రాష్ట్రాలు చేయమన్నాడని గుర్తు చేస్తూ జాల్నాలో ఒక బహిరంగసభలో ప్రత్యేక విదర్భ లాగానే ప్రత్యేక మరాఠ్వాడా రాష్ట్రం ఏర్పడాలని పిలుపు నిచ్చాడు. మహారాష్ట్రను విడగొట్టడానికి సుతరామూ ఒప్పుకోని శివసేనకు యిది దుస్సహమై పోయింది. అప్పటికే వాళ్లకు శ్రీహరిపై చాలా ఫిర్యాదులున్నాయి. ప్రభుత్వాన్ని విమర్శించిన ప్రతివారిపై దేశద్రోహం కేసు పెట్టడం తప్పని, బీఫ్ కేసుల్లో నేరం జరిగిందని రుజువు చేయవలసినది ఆరోపించినవారు తప్ప, ఆరోపణ ఎదుర్కొంటున్నవారు కాదని అతను వాదించడం వాళ్లకు నచ్చలేదు. అతనికి వ్యతిరేకంగా సంపాదకీయాలు రాసి ఫడ్నవీస్‌కు ఫిర్యాదు చేసింది. బిజెపి ప్రభుత్వానికి కూడా అతనితో యిబ్బంది వుంది. మరాఠ్వాడాకు నాసిక్ నుంచి నీరు వదిలిపెట్టాలని, హిట్ అండ్ రన్ కేసులో కోర్టు సల్మాన్ ఖాన్‌ను వదిలివేయడాన్ని ప్రతిఘటించాలని సలహా యిచ్చి వాళ్లను యిరకాటంలో పెట్టాడు. అందువలన ఫడ్నవీస్ శ్రీహరిని రాజీనామా చేయమని కోరాడంటారు. అబ్బే కాదు, నేనే రాజీనామా చేశా అంటాడు శ్రీహరి.

అతన రాజీనామా చేయగానే యిచ్చిన యింటర్వ్యూలో చాలా విషయాలే ప్రస్తావించాడు. ''జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాంతాలపై ఖర్చు పెడతామని మాకు వాగ్దానం చేశారు. మహారాష్ట్ర జనాభాలో 22% విదర్భలో వుంది, అంటే బజెట్‌లో 22% మాకు రావాలి, కానీ ఒక్కసారి కూడా యివ్వలేదు. ఆర్టికల్ 371(2) ప్రకారం ప్రభుత్వ విద్యాసంస్థల్లో, ఉద్యోగాల్లో 22% రిజర్వేషన్ రావాలి. కానీ మాకు అవేమీ రాలేదు. గత మూడేళ్లలో ఉద్యోగాల్లో పుణేకు 52.5% వాటా వచ్చింది. మరి విదర్భకు – 2.5%! ప్రత్యేక తెలంగాణకు మద్దతు యిచ్చారు కదా ప్రత్యేక విదర్భ ఎందుకివ్వరు అని శరద్ పవార్‌ను, రాజనాథ్ సింగ్‌ను అడిగాను. మహారాష్ట్రను విభజించవలసిన అవసరం లేదు అని శరద్ అంటే, తెలంగాణలా చురుకైన ఉద్యమేమీ లేదు కదా అని రాజ్‌నాథ్ అన్నారు. అంటే మేం కూడా బంద్‌లు, ధర్నాలు, హింసాత్మక ఘటనలు, ఆత్మహత్యలు.. అన్నీ జరపాలా? అవన్నీ అవసరమని రాజ్యాంగం చెపుతోందా? అంత అనుమానం వుంటే ప్రజాభిప్రాయం సేకరించమనండి. 51% మంది ప్రత్యేక రాష్ట్రం కావాలని అడగకపోతే మర్నాడే ఉద్యమం విరమిస్తాం.'' అని సవాలు విసిరాడు.

శ్రీహరి రాజీనామా తర్వాత బిజెపి డిఫెన్సులో పడింది. అందువలన అది తమ అనుకూల మీడియాలో ప్రస్తుత పరిస్థితుల్లో బిజెపి చేయగలిగేదేమీ లేదంటూ వ్యాసాలు రాయించుకుంది. వాటి వాదన ప్రకారం 'అసెంబ్లీలో, కౌన్సిల్‌లో మూడింట రెండు వంతుల మెజారిటీ వుంటే తప్ప విభజన బిల్లు పాసు కాదు. 288 సభ్యులున్న అసెంబ్లీలో బిజెపికి 122 మంది సభ్యులే వున్నారు. తక్కిన వారిలో భాగస్వామి శివసేనకు 63, కాంగ్రెసుకు 41, ఎన్‌సిపికి 40, ఎంఎన్ఎస్‌కు 1, యితరులు 21 మంది సభ్యులున్నారు. వీరెవ్వరికీ విభజన యిష్టం లేదు. అందువలన బిజెపి ముందడుగు వేయలేకపోతోంది. విదర్భ అభివృద్ధి కోసం ఫడ్నవీస్ రెండు డజన్ల మెగా ప్రాజెక్టులు చేపట్టారు. విదర్భలో 60 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేందుకు కృషి చేస్తున్నారు..' యీ ధోరణిలో సాగింది. తెలంగాణ ఏర్పడడానికి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మెజారిటీ వుందా? అక్కడ బిల్లు పాస్ అయిందా? విభజన విషయంలో కేంద్రానికే సర్వాధికారాలు కట్టబెట్టారనే కదా, వాళ్లు చీల్చి పారేయగలిగారు. అసెంబ్లీ తీర్మానం కేవలం లాంఛనానికే తప్ప దాన్ని లెక్కలోకి తీసుకోనక్కరలేదని కదా బిజెపితో సహా అందరూ వాదించారు. ఇప్పుడు మహారాష్ట్రకు వచ్చేసరికి రూల్సు మారిపోయాయేం? ఇక అభివృద్ధి మాట గురించి చెప్పాలంటే ఉమ్మడి రాష్ట్రంలో ఏకైక ఒయాసిస్సు లాటి హైదరాబాదు పెట్టుకుని కూడా తెలంగాణ ప్రాంతం ప్రత్యేక రాష్ట్రం కోరలేదా?

విదర్భ విషయంలో బిజెపి ఆడుతున్న దోబూచులాటను బయటపెట్టడానికి ప్రతిపక్షాలు ప్రయత్నించాయి. గోండియా నుంచి బిజెపి తరఫున ఎంపీగా ఎన్నికైన నానా పటోలే జులై 29 న లోకసభలో విదర్భ ఏర్పాటుకై ప్రయివేటు బిల్లు ప్రవేశపెట్టాడు. వెంటనే ఎన్‌సిపి, కాంగ్రెసు మీ పార్టీ విధానమేమిటో క్లియర్‌గా చెప్పాలంటూ డిమాండ్ చేశాయి. అసెంబ్లీలో విదర్భ నుంచి వచ్చిన బిజెపి ఎమ్మెల్యేలు ప్రత్యేకరాష్ట్రం కోసం నినాదాలిస్తూండగా సమైక్యవాదులైన శివసేన మంత్రి దివాకర్ రౌతే వాళ్లతో యుద్ధానికి సిద్ధమయ్యాడు. మర్నాడు మహారాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రావ్‌సాహెబ్ దాన్వే 'విదర్భపై సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది (ఎక్కడో విన్నట్లుందా? ఈసారి అన్నది బిజెపి వారు) ఇక శివసేనతో బంధమంటారా, అది కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని

ఏర్పాటు చేసుకున్నదే' అన్నాడు. దీనిపై ప్రతిపక్ష నాయకుడు రాధాక కృష్ణ పాటిల్ '2014 లోకసభ ఎన్నికలలో మీరంతా మోదీ హవాపై గెలిచారు. ప్రత్యేక విదర్భ కోరుతున్న ఎంపీలు తమ స్థానాలకు రాజీనామా చేసి, ప్రత్యేక రాష్ట్ర నినాదంపై మళ్లీ పోటీ చేసి, గెలవాలి' అని డిమాండ్ చేశాడు.

అంతేకాదు, మహారాష్ట్రను సంయుక్తంగా వుంచాలా, చీల్చాలా? అన్న విషయంపై ఫడ్నవీస్ అసెంబ్లీలో, కౌన్సిల్‌లో ఒక తీర్మానం ప్రవేశపెట్టి దాన్ని ఏకగ్రీవంగా ఆమోదింపచేయాలని అడిగాడు. అలా చేస్తే విదర్భలో తమ పార్టీకి దెబ్బ అన్న భయంతో ఫడ్నవీస్ వెనకాడాడు. 'అయితే మేమే ఆ తీర్మానాన్ని పెడతాం, అనుమతి యివ్వండి' అని స్పీకరును కోరాయి ప్రతిపక్షాలు. అంతేకాదు, యీ దెబ్బతో బిజెపి–శివసేనల మధ్య చీలిక తేవడానికి కూడా చూశాయి. ఎందుకంటే శివసేన సమైక్యవాది. బిజెపితో చేతులు కలిపేముందు విదర్భ విషయాన్ని ప్రస్తుతానికి అటకెక్కించాలనే ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పుడు ఫడ్నవీస్ తటపటాయిస్తే, దాన్ని చూసి తాము వూరుకుంటే తమ పార్టీ బేస్ దెబ్బ తింటుంది. ఇది తెలిసి మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెసు నాయకుడు పృథ్వీరాజ్ చౌహాన్ ఆ సాయంత్రం ఉద్ధవ్ ఠాక్రేకు ఫోన్ చేసి 'ఏమిటి మీ సంగతి? మా సంయుక్త మహారాష్ట్ర తీర్మానానికి మద్దతిస్తారా? లేదా?' అని అడిగాడు. అదే సమయంలో ఫడ్నవీస్ ఫోన్ చేసి యిదంతా ప్రతిపక్షాల కుట్ర అని చెప్పాడు.

మర్నాడు శివసేన నాయకులు అసెంబ్లీలో ''ప్రతిపక్షాల తీర్మానానికి మేం మద్దతివ్వం. ఒంటిచేత్తో మహారాష్ట్రను ఏకతాటిపై వుంచగల సత్తా శివసేన కుంది. అధికారానికి, అఖండ మహారాష్ట్రకు మధ్య ఎంచుకోవలసి వస్తే మేం అధికారం వదిలేస్తాం' అని ప్రకటించాడు. ఈ లోగా ఫడ్నవీస్ కాంగ్రెసు, ఎన్‌సిపిలు గతంలో ఎలా ప్రవర్తించాయో ఏకరువు పెట్టాడు. చంద్రాపూర్ జిల్లాకు చెందిన విజయ్ వడెట్టివార్ అనే కాంగ్రెసు ఎమ్మెల్యే విదర్భ రాష్ట్రం గురించి తీర్మానం ప్రవేశపెటాడు. విదర్భకు చెందిన మరో అయిదుగురు కాంగ్రెసు ఎమ్మెల్యేలు ఆ వినతిపై సంతకాలు పెట్టారు. ఎన్‌సిపి లీడరు ప్రఫుల్ పటేల్ విదర్భ ఏర్పాటుకి మద్దతు ప్రకటించాడు. ఇప్పుడు మాత్రం సంయుక్త మహారాష్ట్ర అంటున్నారు. ఇవన్నీ చెప్పి విదర్భ ఏర్పాటు గురించిన ప్రతిపాదన ఏదీ మహారాష్ట్ర ప్రభుత్వం ముందు లేదని, ప్రతిపక్షాలు దీనిపై రాజకీయం చేస్తున్నాయని ఆసెంబ్లీలో ప్రకటించారు. గద్దె ఎక్కేవరకు ఉద్యమకారుడిగా వున్న ఫడ్నవీస్ యిప్పుడు వేరే రకమైన వాదనలకు దిగి, 'నేను అఖండ మహారాష్ట్రకు ముఖ్యమంత్రిగా పదవీస్వీకారం చేసినవాణ్ని.' అని చెప్పుకున్నాడు.

ఇదంతా చూస్తూంటే తెలంగాణ విషయంలో చాలా ఏళ్ల పాటు కాంగ్రెసు ఆడిన నాటకమే గుర్తుకు వస్తుంది. ఆ పార్టీ వారే విభజన కోరతారు, మళ్లీ ఆ పార్టీ నాయకత్వమే విభజన లేదంటుంది. అనేక విషయాల్లో కాంగ్రెసు లక్షణాలను పుణికి పుచ్చుకుంటున్న బిజెపి, యీ అంశంలో దాని బాటే పడుతోంది. చిన్న రాష్ట్రాల సిద్ధాంతానికి కట్టుబడ్డామని చెప్పుకునే బిజెపికి చిత్తశుద్ధి వుంటే ప్రస్తుతం కేంద్రంలో మెజారిటీలో వుంది కాబట్టి, తెలంగాణ యిచ్చినట్లే యిచ్చేయాలి. అలా యివ్వటం లేదంటేనే ఆ సిద్ధాంతానికి కట్టుబడి లేదని తెలుస్తోంది. ఇరుగు పొరుగు రాష్ట్రాల కంటె చిన్న రాష్ట్రాలుగా చేయడానికై తెలుగువారిని చీల్చడానికి మాత్రం ఆ సిద్ధాంతం ఎంచక్కా వల్లించారన్న విషయం మర్చిపోతే ఎలా? **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 36, 37 **ఎమ్బీయస్ : సిద్దూ ఆశలు**

పంజాబ్ నుంచి తనను దూరంగా వుంచడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ నవజోత్ సిద్దూ బిజెపినుంచి బయటకు వచ్చినపుడు అతను ఆప్‌లో చేరతాడని చాలామంది వూహించారు. కానీ సిద్దూ దాని గురించి సమాధానమేమీ చెప్పలేదు – అప్పటికి బేరసారాలు సాగుతున్నాయి కాబట్టి! తర్వాత అరవింద్‌తో చర్చలు జరిగినపుడు తనను ముఖ్యమంత్రిగా ప్రకటించమని సిద్దూ కోరినట్లు సమాచారం. ఢిల్లీ ముఖ్యమంత్రిగా తన ఏ నిర్ణయమూ తీసుకోనీయకుండా బిజెపి చేతులూ, కాళ్లూ కట్టేస్తోంది కాబట్టి పంజాబ్ సిఎంగా వెళ్లి తన తడాఖా చూపిద్దామని అనుకుంటున్న అరవింద్‌కు యిది రుచించే ప్రతిపాదన కాదు. ఎన్నికలకు ముందే తనను తాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపుకుంటే, బయటి వ్యక్తి, పైగా పంజాబ్‌తో నిరంతరం ఘర్షణ పడే హరియాణాకు చెందినవాడు అనే కారణం చేత ఓట్లు పడవని భయం. అందువలన ముఖ్యమంత్రి ఎవరో చెప్పకుండా ఎన్నికలకు వెళదామని అరవింద్ ఐడియా కావచ్చు. పైగా సిద్దూకి అమృతసర్ దాటితే అంత పలుకుబడి లేదని అతనికి అందిన భోగట్టా. పైగా మొన్నటిదాకా బిజెపితో వూరేగిన ఫిరాయింపుదారుకి బంగరు పళ్లెంలో పెట్టి ముఖ్యమంత్రి పదవి యివ్వడానికి అతను సిద్ధపడలేదు. దాంతో చర్చలు బెడిసికొట్టాయి. 'బిజెపి నన్ను పంజాబ్‌కు దూరంగా వుండమని అంది, ఆప్ నన్ను ఎన్నికలలో పోటీ చేయవద్దని అంది' అని ప్రకటించి, సిద్దూ పంజాబ్ సొంతంగా ఆవాజ్–ఎ–పంజాబ్ అనే వేదికను సెప్టెంబరు 8న ప్రకటించాడు. సంస్థ పెట్టగానే జనం విరగబడతారనుకున్నాడేమో, అదేమీ జరక్కపోయేసరికి వచ్చే 2017 ఎన్నికలలో పోటీ చేయనని ప్రకటించాడు. ఆ తర్వాత పర్గత్ సింగ్, సిమర్‌జీత్ సింగ్ భైన్స్, బల్వీందర్ సింగ్ బైన్స్ అనే ఎమ్మెల్యేలు అతనితో చేతులు కలిపారు. దాంతో ఎన్నికలలో పోటీ చేయాలనే కోరిక పుట్టింది.

ఇప్పటికే అకాలీ దళ్–బిజెపి కూటమి ఒక పక్క, కాంగ్రెస్ మరో పక్క, ఆప్ యింకో పక్క వున్నాయి. ఆవాజ్ పార్టీ కూడా చేరితే చతుర్ముఖ పోటీ అయి ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోయి అకాలీ దళ్–బిజెపి కూటమి సునాయాసంగా నెగ్గేస్తుందని అందరూ అనుకోసాగారు. అకాలీ దళ్– బిజెపి సంకీర్ణ ప్రభుత్వం యిమేజి బొత్తిగా బాగాలేదు. గత పదేళ్లగా అది అధికారంలో వుండి

అవినీతికి, అసమర్థతకు ఆలవాలమై పోయింది. 'గతంలో ముఖ్యమంత్రులందరూ 20% కమిషన్ తీసుకునేవారు. ఇప్పుడు వీళ్లకు అలాటి లెక్కలు లేవు. దొరికినంత వరకు తినివేయడమే! రాష్ట్రంలో జరిగే ప్రతి బిజినెస్‌లో, ప్రతి పరిశ్రమలో వాటాలడుగుతున్నారు. దానివలన పరిశ్రమలు రాకుండా పోయాయి. ఇటీవల పెద్ద ట్రాక్టర్ యూనిట్‌కు మధ్యవర్తి ద్వారా కబురంపారు 'మేం మీ కంపెనీలో 25% వాటా తీసుకుంటాం' అని. 'సరే, యిస్తా, క్యాష్ తెమ్మనండి' అన్నాడు ఆ కంపెనీ యజమాని. 'క్యాషా? డబ్బిచ్చి వాటాలు కొనుక్కోవడం మా యింటావంటా లేదు. నాల్గో వంతు షేర్లు ఊరికే మా పేర రాసేయాలంతే' అన్నారు వీళ్లు. 'అలా అయితే కంపెనీ మొత్తాన్ని వేరే రాష్ట్రానికి తరలించుకుని పోతాను.' అని బెదిరించాడతను. ఇదీ పరిస్థితి.' అంటున్నారు పాత్రికేయులు. 'వెళ్లకుండా వుండిపోయిన పరిశ్రమలు కూడా బాదల్‌లకు యివ్వాల్సిన లంచాల వలన వాటి ఉత్పాదనలకు రేట్లు పెంచాల్సి వస్తోంది. అమ్మకాలు తగ్గుతున్నాయి. మైనింగ్, లిక్కర్, ట్రాన్స్‌పోర్ట్, హోటళ్లు.. యిలా ఏ బిజినెస్ తీసుకున్నా వాటిలో వాటా అడుగుతున్నారు. ఇటీవలే రెండు పెద్ద ట్రాన్స్‌పోర్టు కంపెనీలను పూర్తిగా సొంతం చేసుకున్నారు. ఇవన్నీ చాలనట్లు డ్రగ్ మాఫియాను ఉపముఖ్యమంత్రి సుఖ్‌బీర్ బాదల్ బావమరిది బిక్రమ్ మజీతియాయే ప్రోత్సహిస్తున్నాడు. ఎందరో తలిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఒకసారి మాదకద్రవ్యాలకు అలవాటు పడి, కుటుంబసభ్యుల బోధన వలన బాగుపడి, తమకు యివి అమ్మినవారి సమాచారాన్ని బయటపెడదామని చూస్తున్నవారిని డ్రగ్ ట్రేడర్స్ వాళ్లకు హెచ్చు మోతాదులో డ్రగ్ యిచ్చేసి చంపేస్తున్నారు. మత్తుమందు సేవనం వలన చచ్చిపోయాడంటూ పోలీసులు కేసు మూసేస్తున్నారు.' అంటున్నారు పరిశీలకులు.

అయితే అకాలీ దళ్–బిజెపిలను గద్దె దింపే స్థాయి కాంగ్రెసు, ఆప్‌లకు వుందా లేదా అన్నదే పెద్ద ప్రశ్న. కాంగ్రెసు నాయకుడు అమరీందర్ సింగ్ గతంలో ముఖ్యమంత్రిగా చేశాడు, ఓడిపోయాడు. ఆప్ అయితే కొత్త పార్టీ. జనవరి నెలలో పంజాబ్‌కు అరవింద్ తొలిసారి వచ్చినపుడు ఓటర్లలో నూతనోత్సాహం కనబడింది. పంజాబ్‌లో ఆప్ గెలుపు తథ్యం అనేయసాగాయి కొన్ని పత్రికలు. అయితే క్రమేపీ అది వివాదాల వూబిలో దిగబడింది. మొత్తం 117 నియోజకవర్గాల్లో అందరి కంటె ముందుగా 32 వాటికి అభ్యర్థుల పేర్లను ఆప్ ప్రకటించగానే ముసలం పుట్టింది. టిక్కెట్లు దొరకనివాళ్లు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటంతా టిక్కెట్లు ప్రకటించిన నియోజకవర్గాలలోనే జరగడం, వాళ్లు స్టేట్ కన్వీనరు సూచా సింగ్ ఛోటేపూర్ మనుషులు కావడంతో ఆప్ నాయకత్వానికి అనుమానం వచ్చింది. సూచా సింగ్ పూర్వం అకాలీ దళ్‌లో వుండేవాడు. రాజకీయంగా కాకలు తీరిన యోధుడు. ఆప్‌లో చేరి, పంజాబ్‌లో పార్టీని నిర్మించాడు. ఎప్పుడైతే తన మాట చెల్లలేదో యిలా తిరగబడ్డాడని అరవింద్‌కు అర్థమై, అతనిపై స్టింగ్ ఆపరేషన్ జరిపించాడు. ఒక పార్టీ వర్కరు నుంచి రూ. 2 లక్షల తీసుకుంటూ అతను కెమెరాలకు చిక్కాడు. వెంటనే అతన్ని ఆగస్టు 27 న పార్టీలోంచి బహిష్కరించారు. అతని స్థానంలో గురుప్రీత్ సింగ్‌ను నియమించారు. అంతే, అమృత్‌సర్ –గురుదాస్‌పూర్ బెల్ట్‌లో వున్న ఆప్ క్యాడర్‌లో 80% మంది పార్టీ విడిచి వెళ్లిపోయారు. ఆగస్టు 30 న 13 మంది జోనల్ కోఆర్డినేటర్లలో (ఒక్కో పార్లమెంటు స్థానం ఒక్కో జోన్ అన్నమాట) 7గురు 'ఛోటేపూర్‌ను వెనక్కి తీసుకుని రండి. ఢిల్లీ నుంచి పంపుతున్న సంజయ్ సింగ్, దుర్గేశ్ పాఠక్‌లను పంజాబ్‌కు రాకుండా చేయండి' అని అల్టిమేటమ్ యిచ్చారు. అది ఫలించకపోవడంతో మూకుమ్మడిగా రాజీనామా చేశారు. అమృత్‌సర్ లోకసభ నియోజకవర్గం జోనల్ ఇన్‌చార్జ్ గురీందర్ సింగ్ బాజ్వా, 85 మంది ఆఫీసు బేరర్స్ సెప్టెంబరు 4 న రాజీనామా చేశారు.

దీని తర్వాత ఢిల్లీలోని ఆప్ ఎమ్మెల్యే పంజాబ్ ఆప్ నాయకుల శృంగార కార్యకలాపాల గురించి అరవింద్‌కు లేఖ రాసి, దాని కాపీలను విడుదల చేశాడు. దానికి ప్రతిగా ఢిల్లీ నుంచి పరిశీలకులు వచ్చిన టిక్కెట్లు అమ్ముకున్నారని, తన నుండి 50 లక్షలు డిమాండ్ చేశారని పవిత్ర సింగ్ అనే అతను ఫిర్యాదు చేశాడు. పరిశీలకుల్లో విజయ్ చౌహాన్, తను దిగిన గెస్ట్ హౌస్‌లో పనిమనిషితో లైంగిక సంబంధం పెట్టుకున్నాడని పంజాబ్ ఆప్ మాజీ నాయకులు ఆరోపించారు. పాఠక్‌తో సమావేశ పరచడానికి రూ. 5 లక్షలు అడిగాడని ఛోటేపూర్ సహచరుడు ఫిర్యాదు చేశాడు. గురీందర్ బాజ్వా 'నేను రెండున్నర నెలల క్రితం అమృతసర్‌లో రూ. 22.5 లక్షలు నిధులు సేకరించి ఎంకె హోటల్లో పాఠక్ మనిషి కపిల్‌కు యిచ్చాను. ఇలా డబ్బు తీసేసుకుంటూ ర్యాలీలకు, సమావేశాలకు డబ్బు కావాలని అడిగితే అది వేరే ఏర్పాటు చేసుకోండి అని చెప్తూ వచ్చారు ఢిల్లీవాళ్లు' అన్నాడు. కొత్త తరహా పార్టీగా ప్రజల ముందుకు వచ్చిన ఆప్ యిలా అన్ని రకాలుగా యిమేజి చెడగొట్టుకుంది. వీళ్లపై తీవ్రవాద ముద్ర కూడా వేయడానికి అకాలీ దళ్ చూస్తోంది. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ శిఖ్కులలో చాలా శక్తివంతమైన సంస్థ. దాని ఎన్నికలు నవంబరులో జరుగుతున్నాయి. 'దానిలో తీవ్రవాదులు కొందరు పోటీ చేద్దామని చూస్తున్నారు. మీరు అసెంబ్లీ ఎన్నికలలో మాకు సాయపడండి, కమిటీ ఎన్నికలలో మీకు మేం సాయపడతామంటూ ఆప్ వాళ్లతో బేరం కుదుర్చుకుంది' అని సుఖ్‌బీర్ సింగ్ ఆరోపించాడు. 'విదేశాల నుంచి ఆప్‌కు వచ్చే విరాళాలు పంపేవారిలో శిఖ్కు ఉగ్రవాద సంస్థలు కూడా వున్నాయేమో పరిశీలించండి' అని అతను రాజ్‌నాథ్ సింగ్‌ను కోరాడు.

రోజులు గడిచే కొద్దీ తన పార్టీకి పెద్దగా ప్రజాదరణ లేదని, ప్రతిపక్షాల్లో ఏదో ఒక దానితో ముడి వేసుకుంటే తప్ప మర్యాద దక్కేట్లు లేదని సిద్దూకి బోధపడింది. అందువలన ఆప్‌తో కానీ, కాంగ్రెసుతో కానీ పొత్తు పెట్టుకోవడానికి సిద్ధమని రెండు రోజుల క్రితం ప్రకటించాడు. అందరి లాగానే 'ఇది అవకాశవాద పొత్తు కాదు, కామన్ మినిమమ్ ఎజెండా కుదిరితేనే పెట్టుకుంటాం. పంజాబ్ ఓటర్లకు స్పష్టమైన ఛాయిస్ యివ్వడానికే యీ ప్రయత్నం' అన్నాడు. అంతకు కొద్ది రోజుల ముందు కాంగ్రెసుకి చెందిన రాజ్యసభ సభ్యుడు ప్రతాప్ సింగ్ బాజ్వా, కాంగ్రెసు సలహాదారు ప్రశాంత్ కిశోర్, రాజకీయాలతో సంబంధం లేని రాహుల్ గాంధీ సన్నిహితులిద్దరూ సిద్దూతో కలిసి మాట్లాడారట. భావసారూప్యత ప్రధానాంశమనుకుంటే వైరిపక్షాలైన ఆప్ కాంగ్రెసు యిద్దరితోనూ

సిద్ధమే అనడమేమిటి? 'ఒకర్ని చూపించి మరొకరితో గీచిగీచి బేరాలాడడానికే యిదంతా' అన్నారు ఆప్ నాయకులు. ఓ రోజాగి సిద్దూ 'కాంగ్రెసుతో పొత్తు పెట్టుకోవాలంటే ఒక షరతు వుంది. అమరీందర్ సింగ్ నాయకుడిగా వున్నంతకాలం కాంగ్రెసు జోలికి పోము. అతను బాదల్ కుటుంబీకులతో కలిసి రాష్ట్రాన్ని దోచుకున్నాడు. అతను లేని కాంగ్రెస్సే మాకు సమ్మతం." అన్నాడు సిద్దూ. బిజెపి నుంచి సిద్దూ బయటకు వచ్చినపుడు అమరీందర్ సింగ్ అతన్ని మెచ్చుకుని కాంగ్రెసులో చేరమని కోరాడు. కానీ సిద్దూకి మాత్రం అమరీందర్ అంటే అస్సలు పడనట్లుంది. అమరీందర్‌ను కాంగ్రెసు వాదులందరూ కెప్టెన్ అని పిలుస్తారు. కెప్టెన్ లేకుండా మా నౌక కదలదు అంటారు వాళ్లు. మరి సిద్దూ కోరిక నెరవేరుతుందా? ముఖ్యమంత్రి కాకపోయినా మామూలు మంత్రయినా అవుతాడా అని సందేహం వస్తున్న వేళ ఆప్ లోనుంచి బయటకు వచ్చేసిన సూచా సింగ్ ఛోటేపూర్ ఆవాజ్‌లో చేరతాడనే పుకారు వస్తోంది. అతను ఆప్‌ను శిఖ్కు వ్యతిరేకిగా వర్ణించాడు. ఆ ఢిల్లీవాళ్లు పంజాబ్‌ను అర్థం చేసుకోలేరన్నాడు. అతను తన అనుచరులందరితో ఆవాజ్ పార్టీలో చేరి, శిఖ్కు ప్రయోజనాలు కాపాడుతామంటూ చెప్పుకుంటే అకాలీ దళ్ నష్టపోవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

సెప్టెంబరు 39 **ఎమ్బీయస్ : వెల్స్ ఫార్గో – బ్యాంకులకు ఓ పాఠం**

ప్రతి కుటుంబానికి ఒక బ్యాంక్ ఖాతా వుండాలనే ఉద్దేశంతో మోదీ 2014 ఆగస్టు 15 న జన్‌ధన్ యోజనా మొదలుపెట్టారు. ఒక్క రూపాయి బాలన్సు కూడా పెట్టనక్కరలేకుండా ఖాతా తెరవవచ్చునగానే చాలామంది తెరిచారు. స్విస్ బ్యాంకుల నుంచి నల్లధనం తెచ్చి తలా కాస్తా పంచుతానన్న ప్రభుత్వం ఆ ఖాతాల్లో వేస్తుంది గామోసు, మిస్సయితే ఎలా అనుకున్నారు. అలాటిదేమీ జరగకపోవడంతో సగానికి సగం మంది ఆ ఖాతాలను పట్టించుకోవడం మానేశారు. ఇక అప్పణ్నుంచి ఫైనాన్సు శాఖ నుండి బ్యాంకు అధికారులపై ఒత్తిడి పెరగసాగింది – జనధన్ ఖాతాల్లో ఆపరేషన్స్ వుండాలి, జీరో బాలన్సు ఖాతాల శాతం తగ్గించాలి అని. దేశంలో అన్నిటి కంటె పెద్ద బ్యాంకు స్టేటు బ్యాంక్ ఆఫ్ ఇండియా కాబట్టి వారిపై ఒత్తిడి చాలా వచ్చిందేమో 2016 మార్చిలో ఆ బ్యాంకు చైర్మన్ ఓ ప్రకటన చేశారు – 'మా బ్యాంకులో జీరో బాలన్సు ఖాతాల శాతం 46%కి లోపే' అని. అది చాలదనుకున్న ప్రభుత్వం ఆ శాతాన్ని తగ్గించడం మీదనే ధ్యాస పెట్టింది. వెబ్‌సైట్‌లో ఆగస్టు 2016 నాటి అంకెలు యిచ్చారు. ప్రభుత్వ బ్యాంకుల్లో 25%, గ్రామీణ బ్యాంకుల్లో 21%, ప్రయివేటు బ్యాంకుల్లో 37% వుంది. రకరకాల ఒత్తిళ్లు తెచ్చి ప్రభుత్వ బ్యాంకుల చేత మంచి ప్రగతి సాధించేరే అనుకుంటూ వుంటే ఓ తెలుగు పేపర్లోనే వార్త చదివాను – బాలన్సుగా సున్న కనబడకుండా వుండాలని ఒత్తిడి రావడంతో బ్యాంకు అధికారులే వేలాది ఖాతాల్లో ఒక్కో రూపాయి చొప్పున వేసి, వాటిని జీరో బాలన్స్ వర్గీకరణ నుంచి తప్పించేశారని! కొందరు జేబుల్లోంచి వేసుకున్నారట, కొందరు బ్యాంకు ఎంటర్‌టైన్‌మెంట్ చార్జిల నుంచి, సాదరు ఖర్చుల ఖాతా నుంచి డబ్బు డ్రా చేసి యీ ఖాతాల్లో వేసేశారట. ఈ విషయాలన్నీ పై అధికారులకు తెలిసినా గప్‌చుప్‌గా వున్నారట – ప్రభుత్వానికి కావలసిన మంచి పిక్చర్ ఎలాగోలా యిచ్చేశాం కదా, అదే చాలు అని.

ఇక్కడి బ్యాంకు అధికారులు యిటువంటివి చేస్తారంటే నేనేమీ ఆశ్చర్యపడను. కానీ అమెరికాలో యింత కంటె ఘోరంగా చేశారని తెలిసి ఆశ్చర్యపడ్డాను. వెల్స్ ఫార్గో అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో హెడ్‌క్వార్టర్స్ గల పెద్ద అంతర్జాతీయ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ. మార్కెట్ కాపిటలైజేషన్ ప్రకారం ప్రపంచంలో రెండవ పెద్దది, ఎస్సెట్స్ ప్రకారం చూస్తే అమెరికాలో మూడో పెద్దది. అలాటి బ్యాంకు తన సిబ్బంది చేత తప్పుడు మార్గాలు అవలంబింప చేసిందని తెలుసుకుని అమెరికన్ సెనేటర్లే నిర్ఘాంతపోయారు. జరిగిందేమిటంటే వెల్స్ ఫార్గో తన సిబ్బందికి విపరీతమైన టార్గెట్లు పెట్టడంతో వాళ్లు ఆ లక్ష్యం చేరడానికి అడ్డుదోవలు తొక్కారు. అది తెలిసి కూడా కంపెనీ చూసీచూడనట్లు వూరుకుంది. కానీ కొందరు దాన్ని వెలికితీసి బయటపెట్టారు. ఇప్పుడు కంపెనీ సిఇఓ సెప్టెంబరు 20న సెనేట్ ముందుకు వచ్చి మొహం వేలాడేశాడు. సిబ్బందిదే తప్పు తప్ప కంపెనీ విధానం అది కాదని వాదిస్తున్నాడు. ఎవరూ నమ్మటం లేదనుకోండి.

ఇప్పటికే వున్న ఖాతాదారుకి మరొక కొత్త సేవ, లేదా ఉత్పాదన అంటగట్టడాన్ని క్రాస్ సెల్లింగ్ అంటారు. అంటే డ్రాఫ్టు తీసుకోవడానికి ఎవరైనా కస్టమరు బ్యాంకుకి వస్తే, అతన్ని బుజ్జగించి ఫిక్సెడ్ డిపాజిట్ వేయించడం లాటిదన్నమాట. వెల్స్ ఫార్గో యీ ఫార్ములాను బాగా నమ్ముకుంది. తమ ప్రగతికి క్రాస్ సెల్లింగే మూలకారణమంటూ గొప్పలు చెప్పుకుంటూ వచ్చింది. అందరూ ఓహోఓహో అనుకున్నారు. షేరు మార్కెట్‌లో ఆ కంపెనీ షేరు 30 డాలర్లు పెరిగింది. ఆ కంపెనీ సిఇఓ జాన్ స్టంఫ్ పేర వున్న వాటాల విలువ 200 మిలియన్ డాలర్లకు చేరింది. అయితే యీ రోజీ పిక్చర్ వెనక్కాల జరుగుతున్నది వేరే. కొత్త ఖాతాలు తెరుస్తారా లేదా అని ఉద్యోగులను ఊదరగొట్టేశారు. పనివేళలు అయిపోయినా ఆలస్యంగా కూర్చోండి, సెలవులు తీసుకోకండి, మీరు ఖాతాల సంఖ్య పెంచకపోతే మాత్రం ఉద్యోగం పీకేయడం ఖాయం అంటూ బెదిరించింది. దాంతో ఉద్యోగులు ఆ లక్ష్యాన్ని చేరడానికి ఖాతాదారులకు తెలియకుండానే వారి పేర కొత్త ఖాతాలు తెరిచేయడం, క్రెడిట్ కార్డులు జారీ చేసేయడం మొదలెట్టారు. ఇలా జరుగుతోందని 2008లోనే మేనేజ్‌మెంట్ దృష్టికి తెచ్చానని యేసేనియా గుయిట్రాన్ అనే విజిల్ బ్లోయర్ అంటోంది. ఆ మాట ఎలాగున్నా 2011 నాటికి యీ ధోరణి గురించి మేనేజ్‌మెంటుకి స్పష్టంగా తెలుసని యిన్వెస్టిగేటర్స్ కనిపెట్టారు. 2013లో దీని గురించి లాస్ ఏంజిలెస్‌లో

వెల్స్ ఫార్గోను సంజాయిషీ అడిగితే 'కస్టమరుకి తెలియకుండా, అతనికి అవసరం లేకుండా అతని పేర ఖాతాలు తెరిచే ప్రసక్తే లేదు' అని ఘంటాపథంగా చెప్పింది.

'అవన్నీ ఒట్టి కబుర్లే, కంపెనీ రెగ్యులేటర్ల ముందు తప్పు జరిగిందని ఒప్పుకున్నారు' అని లాస్ ఏంజిలెస్ టైమ్స్ 2013లోనే ఆర్టికల్ రాసింది. ఆ తర్వాత వెల్స్ ఫార్గో మేల్కొంది. తప్పంతా ఉద్యోగులపై నెట్టేసి అప్పుడప్పుడు కొంతమంది చొప్పున మొత్తం 5300 మందిని తీసేసింది. కానీ వాళ్ల చేత అలాటి పనులు చేయించిన టాప్ ఎక్జిక్యూటివ్‌లను మాత్రం సత్కరించింది. గత నెలలోనే కమ్యూనిటీ బ్యాంకింగ్ విభాగానికి యిన్‌చార్జిగా వున్న కారీ టోల్‌స్టీడ్‌కు రిటైరయ్యేటప్పుడు 124.60 మిలియన్ డాలర్ల విలువైన షేర్లు ముట్టచెప్పారు. ఇక ఫ్రాడ్ విషయానికి వస్తే 2011 నుంచి 2015 మధ్య ఖాతాదారులకు తెలియకుండా తెరిచిన బ్యాంకు ఎక్కవుంట్లు 15 లక్షలు, జారీ చేసిన క్రెడిట్ కార్డులు 5,65,000. వీటి కోసం ఖాతాదారు దృష్టికి తేకుండా అతని ఎక్కవుంటులో డెబిట్ చేసిన మొత్తం విలువ 26 లక్షల డాలర్లు. ఈ విషయం బయటపడడంతో యిప్పుడు 18.50 కోట్ల డాలర్ల పెనాల్టీ కడుతోంది. స్టంఫ్ స్వయంగా 41 మిలియన్ డాలర్ల జీతాన్ని వదులుకుంటానన్నాడు. సెనేటర్లు యివన్నీ విని ముక్కున వేలేసుకున్నారు. పెనాల్టీ కట్టావు సరే, బ్యాంకింగు వ్యవస్థపై నమ్మకాన్ని చెదరగొట్టావే, దాని కేమంటావ్? అని అడిగారు. డెమోక్రాట్లు యీ బ్యాంకును ఖండఖండాలు చేసి నిఘా పెంచితే మంచిదంటున్నారు. అది జరగకపోవచ్చు కానీ వెల్స్ ఫార్గో ఉదంతం మన బ్యాంకు మేనేజ్‌మెంట్‌లు కూడా ఒక పాఠంగా తీసుకోవాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2016)**

• • •